# annamayya adhyātma saṅkīrtanalu: sāhitya vaicitri (1-2 sampuṭālu)

A thesis submitted to the University of Hyderabad in partial fulfillment of the degree of

Doctor of Philosophy
In
Telugu

Researcher
**KAMKIPATI RAJA**
(16HTPH08)

Supervisor
**Dr. PAMMI PAVAN KUMAR**

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad – 500046
Telangana, India
JUNE - 2019

# అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు: సాహిత్య వైచిత్రి

## (ప్రథమ, ద్వితీయ సంపుటాలు)

పిహెచ్. డి. పట్టం కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం

**పరిశోధన**

**కంకిపాటి రాజా**

(16HTPH08)

**పర్యవేక్షకులు**

**డా. పమ్మి పవన్‌కుమార్**

**తెలుగు శాఖ**

**మానవీయ శాస్త్రాల విభాగం**

**హైదరాబాదు విశ్వవిద్యాలయం**

**హైదరాబాదు – 500 046**

**తెలంగాణ, భారతదేశం**

**జూన్ - 2019**

# DECLARATION

I, **KAMKIPATI RAJA** hereby declare that this dissertation entitled **annamayya adhyātma saṅkīrtanalu: sāhitya vaicitri (1-2 samputālu)** submitted by me under the guidance and supervision of Dr. Pammi Pavan Kumar is my bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that this dissertation can be deposited in Shodhganga/INFLIBNET.

**Signature of the Student**

**Date:** **Name: KAMKIPATI RAJA**

**Place:** **Reg. no: 16HTPH08**

# CERTIFICATE

Date: 28-06-2019

This is to certify the thesis entitled **''annamayya adhyātma saṅkīrtanalu: sāhitya vaicitri (1-2 samputālu)''** submitted by **Mr. KAMKIPATI RAJA,** bearing Regd. No. 16HTPH08 in partial fulfillment of the requirements for the award of Doctor of philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

Parts of this thesis have been: (NOT EXACT PARTS. Issues discussed in the following paper have been presented elaborately in the 2nd & 3rd chapters of the thesis.)

**1. ''annamayya adhyātma saṅkīrtanallō śaiva, vaiṣṇava vaiṣamya khaṇḍana-samskaraṇa''**(with Dr. P. Pavan kumar) (ISSN 2456-4702), UGC Approved List of Journals Serial Number 42500, International Conference Proceedings SIR C. R. REDDY COLLEGE, ELURU, Bhavaveena (Peer Review Research Journal). (Page 08-13).

**And**

**B. Presented in the following conferences:**

(Issues presented in the following papers have been discussed elaborately in the 3rd & 4th chapters of the thesis)

1. **"annamayya adhyatma sankeerthanallo sambhashanala vaichitri**" Annamayya adhyātma saṅkīrtanallō sambhāṣaṇala vaicitri" (with Dr. P. Pavan kumar) in 9th National conference of TeLF, The Central Institute of Indian Languages (CIIL), Mysore, March 07-08, 2018 in Dravidian University, Kuppam. A.P.
2. **"Annamayya adhyātma saṅkīrtanallō svaraṁ, nādaṁ - bhāṣā śāstra sambandhaṁ**" (With Dr. P. Pavan kumar) in 10th National conference of TeLF, The Central Institute of Indian Languages (CIIL), Mysore January, 2019 in Osmania University, Hyderabad, T.S.

Further, the student has passed the following courses towards fulfillment of course work requirement for Ph.D. Telugu (recommended by Doctoral committee) courses passed during Ph.D. programme.

| **Course code** | **Name** | **credits** | **pass/fail** |
|---|---|---|---|
| 1. HT - 801 | Research Methodology. | 4.00 | PASS |
| 2. HT - 802 | History of Telugu Research. | 4.00 | PASS |
| 3. HT - 803 | Studies in Literature and language. | 4.00 | PASS |
| 4. HT - 804 | Specialized Area and Broad Field. | 4.00 | PASS |

Dr. PAMMI PAVAN KUMAR
Research Supervisor

Prof. G. ARUNA KUMARI
Head, Telugu.

Prof. S. SARAT JYOTHSNA RANI
Dean, Humanities

# విషయ సూచిక


**కృతజ్ఞతలు**

**0. ప్రవేశిక** (i-viii)

0.1 పరిశోధనాంశ వివరణ i

0.2 పరిశోధనావశ్యకత ii

0.3 అన్నమయ్య సంకీర్తనలపై వెలువడిన పరిశోధనలు iii

0.4 క్షేత్ర పర్యటన / గ్రంథ సేకరణ iv

0.5 పరిశోధన పరిధి iv

0.6 పరిశోధన గ్రంథ రచన – ఆధార గ్రంథాలు v

0.7 పరిశోధన గ్రంథ రచనా పద్ధతి vi

0.8 పరిశోధన లక్ష్యం vii

0.9 పరిశోధనవల్ల కలిగే ప్రయోజనాలు vii

**అధ్యాయం -1: అన్నమయ్య జీవితం, రచనలు – ఇతర వాగ్గేయకారులు** (1-38)

1.0 పరిచయం 1

1.1 అన్నమయ్య వంశీయులు 2

1.2 తాళ్ళపాక అన్నమయ్య జననం 2

1.3 అన్నమయ్య బాల్యం 3

1.4 అన్నమయ్య విద్యాభ్యాసం 4

1.5 అన్నమయ్య తిరుమలకు వెళ్ళటం 4

1.6 అలమేలు మంగమ్మ అన్నమయ్యను ఊరడించడం 6

1.7 అన్నమయ్య తిరుమలను దర్శించడం 7

1.8 అన్నమయ్య స్వామిపై శతకాన్ని రచించడం 7

1.9 అన్నమయ్యకు ఘనవిష్ణువు పంచ సంస్కారాలు నిర్వహించడం 8

1.10 అన్నమయ్యకు వివాహం చేయడం 9

1.11 అన్నమయ్య అహోబిల క్షేత్రంలో విద్యనభ్యసించడం 9

1.12 అన్నమయ్య నరసింగరాయల స్నేహం 10

1.13 నరసింగరాయలు అన్నమయ్యను చెరసాలపాలు చేయడం 11
1.14 అన్నమాచార్యుని రచనలు 12
1.15 అన్నమయ్య మహిమలు 14
1.16 అన్నమయ్య దర్శించిన క్షేత్రాలు ; అనుభవాలు 15
1.17 ఇతర వాగ్గేయకారులు 16
1.18 అన్నమయ్య సంకీర్తనల వెలికితీతలో శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి కృషి 36
1.19 సంకీర్తనల ప్రచారంలో తిరుమల తిరుపతి దేవస్థానములవారి కృషి 37

**అధ్యాయం – 2: అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలలో కవితా సౌందర్యం (39–123)**

2.0 పరిచయం 39
2.1 అధ్యాత్మ సంకీర్తనలలోని అంశాలు 42
2.2 అన్నమయ్య బోధలు 55
2.3 అన్నమయ్య సంకీర్తనల్లోని పాత్ర చిత్రణ 90
2.4 అన్నమయ్య వర్ణనలు 105
2.5 అన్నమయ్య శైలి 119
2.6 ప్రబంధ శైలి, ప్రబంధ కవులకు మార్గదర్శకుడు 122

**అధ్యాయం – 3: అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో సంభాషణలు (124–227)**

3.0 అన్నమయ్య కీర్తనల పరిచయం 124
3.1 సంభాషణ: అర్థ వివరణలు 124
3.2 స్వామితో సంభాషణలు 127
3.3 బహిస్సంభాషణలు లేక సమాజంతో సంభాషణలు 159
3.4 అంతస్సంభాషణలు 188
3.5 అసలైన వైష్ణవుడు 198
3.6 జీవాత్మ, పరమాత్మ సంబంధం 207
3.7 యశోద, గోపికలు, ఇతరుల సంభాషణలు 210
3.8 సంసార సంకీర్తనల్లో సంభాషణలు 215

3.9 పూజా సంభాషణలు 220
3.10 ముగింపు 226

**అధ్యాయం – 4: అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో స్వర, లయ, అలంకార పోషణ(228-289)**
4.0 పరిచయం 228
4.1 గానం దాని ప్రాధాన్యం 229
4.2 నాదం 230
4.3 శ్రుతి 234
4.4 స్వరం 235
4.5 రాగాలు 239
4.6 తాళం 252
4.7 అన్నమయ్య సంకీర్తనల్లో అలంకారాలు 276

**అధ్యాయం – 5: అన్నమయ్య సంకీర్తనల్లో వాక్య విన్యాసం (290-319)**
5.0 పరిచయం 290
5.1 అన్నమయ్య భాష 290
5.2 విన్యాసం – అర్థ వివరణ 292
5.3 వాక్య నిర్వచనం 293
5.4 వాక్య భేదాలు 294

**6. ముగింపు (320-334)**
6.1 పరిశోధనలో గమనించిన అంశాల వివరాలు 320
6.2 పరిశోధన ఫలితాలు 330
**7. ఉపయుక్త గ్రంథసూచి (335-342)**
**8.అంతర్జాతీయ సదస్సు సంచికలో ముద్రితమైన పరిశోధన పత్ర నకలు (343-351)**
**9. జాతీయ సదస్సుల్లో సమర్పించిన పరిశోధన పత్రాల ధ్రువపత్రాల నకళ్ళు (352-353)**

★★★★★

# కృతజ్ఞతలు

నన్ను కని, పెంచి, చదువులో ప్రోత్సహిస్తూ, ఇంతవరకూ నా వెన్నంటి ఉన్న నా తల్లిదండ్రులు కంకిపాటి తిరుపతమ్మ, కాశయ్యలకు నమస్కరిస్తున్నాను. మీ కష్టం వృథా చేయను. నాకు ప్రేమ ఆప్యాయతలను, అమ్మ నాన్నల సారూప్యతను పంచుతున్న అక్క బావలు సుజాత, మాలకొండయ్యలకు కృతజ్ఞతలు.

సంగీత సాహిత్యాల మేలుకలయికగా ఉన్న నా పరిశోధనలో వెన్నంటి, నాకు కావాల్సినంత సమయాన్నిచ్చి, నాచేతనైనంత పని చేయిస్తూ, అప్పుడప్పుడూ మందలిస్తూ, బుజ్జగిస్తూ, ఎం.ఎ. నుండి నేటివరకూ నన్నూ, నా పెంకితనాన్ని భరిస్తున్న నా వెనుబలం, మా పర్యవేక్షకులు, నిరంతర పరిశోధకులు అయిన డా. పమ్మి పవన్ కుమార్‌గారికి మనఃపూర్వక నమస్సుమనస్సులు. మీరు నేర్పిస్తున్న సమయపాలన, కచ్చితత్త్వం, నిరంతర కృషిని నా జీవితానికి సోపానాలుగా భావిస్తున్నాను.

మా పరిశోధనలను నిశితంగా గమనిస్తూ, ఎంతో ఆదరంగా చూస్తున్న ప్రస్తుత తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య అరుణ కుమారిగారికీ, పిహెచ్.డి లో నాకు ప్రవేశాన్ని కల్పించిన ఆచార్య తుమ్మల రామకృష్ణగారికీ, ఆచార్య రేమిల్ల వేంకట రామకృష్ణ శాస్త్రిగారికి నమస్కరిస్తున్నాను. ఎం. ఎ. లో, పరిశోధనలో నాకు పాఠాలు చెప్పిన ఆచార్య శరత్ జ్యోత్స్నా రాణిగారికీ, ఆచార్య రాములుగారికీ, డా. భుజంగరెడ్డిగారికీ, డా. విజయలక్ష్మిగారికీ, ఆచార్య ఎన్. ఎస్. రాజుగారికీ, డా. విజయకుమారిగారికీ, ఆచార్య దార్ల వేంకటేశ్వరరావుగారికీ, ఆచార్య గోనానాయక్‌గారికీ, ఆచార్య ఎండ్లూరి సుధాకర్‌గారికీ, మొత్తం అధ్యాపక బృందానికి నా నమస్కారాలు.

సంగీతంలో నన్ను మంచి విద్యార్థిగా తీర్చి, నా పరిశోధనకు దారులు పరచిన మా కృష్ణమూర్తి మాష్టారుకు, మోహనకృష్ణ మాష్టారుకు నమస్కారాలు.

నడవాల్సిన దారిని సూచించిన మా అమ్మ భారతీ మేడంగారికీ, నాగరాజమ్మ మేడంగారికీ, శివమ్మ మేడంగారికీ, నాగభూషణం సార్‌కు, కొండలరావు మాష్టారుకు, రాసాని సార్‌కు, ఏడుకొండలు మాష్టారుకు నా నమస్కారాలు.

నా చేత అక్షరాభ్యాసం చేయించి, నాలాంటి వాళ్ళ అభ్యున్నతికి మరణం వరకూ శ్రమించిన కీర్తిశేషులు రొడ్డా కొండయ్య సార్‌కీ, నిష్కపటమైన మనస్సుకు మారుపేరైన మా రమణారెడ్డి సార్‌కు, ప్రభావతి టీచర్‌కు, నిస్వార్థ సేవతో మాచేత 'పెద్దమ్మా' అని నోరారా పిలిపించుకుంటున్న విశ్వభారతి పాఠశాల కరస్పాండెంట్ రాజమ్మగారికి నమస్కరిస్తున్నాను.

ఉన్నత పాఠశాల విద్యలో నా అభ్యున్నతికి కారణమైన అమూల్యా టీచర్‌కీ, ఏంజల్ కస్తూరీభాయి టీచర్‌కీ, తెలుగులో నాకు అభిరుచిని కలిగించిన కళావతి టీచర్‌కు, హనుమంతరావు మాష్టారుకు నమస్కరిస్తున్నాను.

కళాశాలలో చదువుకొనే తన స్నేహితులను చూసి, మా అమ్మ, నాన్నలను ఒప్పించి, బలవంతంగా నెల్లూరు విశ్వభారతీ అంధుల పాఠశాలలో చేర్పించి, తద్వారా నేను ఇంతవాణ్ణి కావడానికి తోడ్పడిన నా అన్న బ్రహ్మయ్యకు జీవితాంతం ఋణపడి ఉంటాను.

నా పరిశోధనలో సహాయపడుతూ, తప్పులు దిద్దుతూ, ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తున్న నా ధైర్యం ప్రియమైన మిత్రుడు డా. రవిచంద్ర అన్నకు కృతజ్ఞతలు.

నా పరిశోధనలో సలహాలిస్తూ, నన్ను నిరంతరం ప్రోత్సహిస్తున్న డా. చంద్రయ్య అన్నకు, డా. మంత్రి మల్లేశ్ అన్నకు ధన్యవాదాలు.

నాకు కావాల్సిన పుస్తకాలను అడిగినంతనే అందిస్తూ, నాపై వాత్సల్యాన్ని చూపిస్తున్న అక్క హరితకు, నా చెల్లి లావణ్యకు, తమ్ముళ్ళు రమేశ్‌కు, శివకు హృదయపూర్వక కృతజ్ఞతలు.

అడిగినంతనే నా పరిశోధనకు అవసరమైన పుస్తకాలను అర్థవంతంగా రికార్డు చేసి, పరిశోధన చక్కగా సాగేందుకు సహకరించిన స్నేహితుడు వంశీ కృష్ణ చైతన్యకు కృతజ్ఞతలు. పుస్తకాలను చదివిన మస్తాన్‌కు, ధనంజయరావుకు, హిందీ మస్తాన్‌కు, నాకు తోడ్పడుతున్న ఉమేష్‌కు, సురేష్‌కు, యోగీశ్వరరావుకు ధన్యవాదాలు.

నాకు చదవడానికి అవసరమైన పుస్తకాలను స్కాన్ చేసి, నా పనుల్లో సాయపడిన విజయ్ కుమార్ రెడ్డి అన్నకు, రాజేష్ అన్నకు, ఇ. సి. డి. ఎ. పి. కీ, రాజగోపాల్ సార్‌కు, అన్నవరం సార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

కుటుంబంలో నాకు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న నా తమ్ముళ్ళు మస్తాన్ రావు, మురళీ కృష్ణలకు, చెల్లి అనూషకు ధన్యవాదాలు. అమ్మ తరువాత మా ఇంటి బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్న నా మేనకోడలు రాణికి కృతజ్ఞతలు. చిన్న మేనకోడలు అనూషకు, మరదలు కీర్తి స్వప్నకు, మేనల్లుడు అక్షయ్ కుమార్‌కు, నాకు పెదనాన్న హోదా కట్టబెట్టిన కూతురు మృధ్వికకు ఆశీస్సులు.

నా ధైర్యమైన స్వాతి అక్కకు, జ్యోతి అక్కకు, వల్లీ సుబ్బలక్ష్మి అక్కకు, నా పునర్జన్మకు కారణమైన డాక్టర్ కిరణ్ కుమార్‌గారికి నమస్కారాలు.

ఎం. ఎ. లో తమ స్నేహ హస్తాన్ని అందించిన సంతోషరూపకు, ఝాన్సీ రాణికీ, వేంకటరమణకు, నాగుల్ మీరాకు, శ్రీధర్‌కు, గోపాల్‌కు, ప్రసాదరెడ్డికి ధన్యవాదాలు.

నాలాంటి వాళ్ళు కంప్యూటర్‌లో చదువుకొనే విధంగా ఎన్. వి. డి. ఎ., జాస్ సాఫ్ట్వేర్స్ రూపొందించిన వారికీ, నన్ను ఇంతకాలం భరించిన కేంద్రీయ విశ్వవిద్యాలయానికీ,

అడిగినంతనే పుస్తకాలు ఇచ్చిన విశ్వవిద్యాలయ లైబ్రరీ సిబ్బందికీ, నా కడుపు నింపిన హాస్టల్ సిబ్బందికీ కృతజ్ఞతలు. సమాచార సేకరణలో సహాయపడిన తెలుగు విశ్వవిద్యాలయం, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం గ్రంథాలయాలకూ, విశాలాంధ్ర వారికీ, Tirumala.org వెబ్సైట్‌వారికీ, eemata.com వారికీ, Andhra bharati వెబ్సైట్‌వారికీ, 3500 bhakti books వారికీ, free gurukul వారికీ, పుస్తకాలను డాక్యుమెంట్‌లోకి కన్వర్ట్ చేసుకొని చదవడానికి తోడ్పడిన ***Eye d PRO*** వారికీ, ***Envision*** వారికీ, పుస్తకాలను బ్రైలీ లిపిలో అందించిన ***Orbit Reader*** రూపకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు. నా పరిశోధన కాలానికి ఆర్థిక సహాయం అందించిన University Grand Commission (U. G. C.) వారికి కృతజ్ఞతలు.

పరిశోధన చక్కగా సాగాలని ప్రార్థించిన మా పాస్టర్‌లు శామ్యూల్ పీటర్‌గారికీ, దేవిడ్‌గారికీ, రమేష్‌గారికీ, నా స్నేహితుడు సుజయ్ కుమార్‌కూ, రాజేష్‌కూ, శివరామ్, నవీన్ అన్నకూ, నాకోసం ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ దేవుని పేరిట ధన్యవాదాలు తెలుపుతున్నాను.

**కంకిపాటి రాజా**

*********

# ప్రవేశిక

## 0.1. పరిశోధనాంశ వివరణ

తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి చెందిన వివిధ ప్రక్రియల్లో సంకీర్తనా సాహిత్యం చెప్పుకోదగినది. మొదటిగా వచన ప్రక్రియగా సంతరించుకున్న ఈ సాహిత్యం అనంతర కాలంలో సంకీర్తన, కృతి, పదం, కీర్తన, గీతం, ఇలా అనేక పోకడలకు గురైంది. తెలుగు సాహిత్యంలో ఆ మార్గంలో గణనీయమైన ప్రగతి సాధించినవారు తాళ్ళపాక అన్నమయ్య. పద్య సాహిత్యం అపారమైన గౌరవాన్ని గడించిన ఆ రోజుల్లో సంకీర్తనలకు పట్టం కట్టి, మాండలిక పదాలకు ఎనలేని గౌరవం తెచ్చి, సమాజంతో మమేకమై, ప్రజల్లో ఒకడిగా నిలిచి, సమాజాన్ని తన సంకీర్తనలతో అత్యంత ప్రభావితం చేసిన వాగ్గేయకారుడు అన్నమయ్య. ఆయన క్రీ. శ. 1408వ సంవత్సరంలో నేటి కడప జిల్లాలోని తాళ్ళపాక గ్రామంలో జన్మించారు. ఆయనే కాకుండా అన్నమయ్య వంశీయులు కూడా కవులే. తెలుగులో లభిస్తున్న సాహిత్య చరిత్రలైన (*తెలుగు సాహిత్య చరిత్ర* – శ్రీరామమూర్తి, కొర్లపాటి., *అన్నమయ్య చరిత్ర పీఠిక* – ప్రభాకరశాస్త్రి, వేటూరి., *సమగ్రాంధ్ర సాహిత్యం* – సదాశివ శంకరశాస్త్రి, భాగవతుల. తిరుమల శాసనాలు...) గ్రంథాలు, తిరుమలలో లభిస్తున్న శాసనాల ఆధారంగా అన్నమయ్య 32000 సంకీర్తనలు చేశారని తెలుస్తుంది. వాటిలో చాలావరకూ కనుమరుగైపోగా నేడు మనకు 14000 సంకీర్తనలు 29 సంపుటాలుగా తిరుమల తిరుపతి దేవస్థానముల వారిచే ముద్రింపబడి, అందుబాటులో ఉన్నాయి. ఆ సంపుటాలను *అధ్యాత్మ సంకీర్తనలు* (6 సంపుటాలు), *శృంగార సంకీర్తనలు* (23 సంపుటాలు) గా వింగడించడం జరిగింది. ఆ సంపుటాలలోంచి *అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు ప్రథమ, ద్వితీయ సంపుటాల*ను నా పరిశోధనకు మూల గ్రంథాలుగా గ్రహించి, పరిశోధన చేయడం జరిగింది.

తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలు ఆ కాలపు ప్రజల వాడుకభాషలో రచించబడ్డాయి. రోజుకు ఒక సంకీర్తన చొప్పున అన్నమయ్య చెప్పారని పండితులు పేర్కొంటున్నారు. అన్నమయ్య ఆశువుగా పాడుతూ నర్తించేవారని *అన్నమయ్య చరిత్రము*

అనే గ్రంథంవల్ల తెలుస్తుంది. అన్నమయ్య సంస్కృత, ఆంధ్ర భాషల్లో సంకీర్తనా రచన చేశారు. సంకీర్తనలకు అన్నమయ్యే ఆద్యుడు కావడంవల్ల ఈయన 'పదకవితా పితామహుడు', 'పంచాగమ సార్వభౌముడు', 'సంకీర్తనాచార్యుడి'గా తెలుగు సాహిత్యంలో ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు పొందారు.

అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లోని కవితా గుణాలను, సంగీతాంశాలను, సంభాషణలను, వాక్య నిర్మాణ పద్ధతులను సాహిత్య కోణంలోనూ, సంగీతశాస్త్ర కోణంలోనూ, భాషాశాస్త్ర కోణంలోనూ అధ్యయనం చేయదలచుకున్నాను. అందువల్ల '**అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు: సాహిత్య వైచిత్రి**' అనే అంశాన్ని గ్రహించి, పరిశోధన చేశాను.

## 0.2. పరిశోధనావశ్యకత

అన్నమయ్య సంకీర్తనల్లోని సాహిత్యంపై అనేక పరిశోధనలు జరిగాయి. కానీ సంగీత, భాషా శాస్త్రాల దృష్టితో అధ్యయనం జరగలేదు. అన్నమయ్య సరళమైన భాషను ఉపయోగించారు. సాహిత్య విభజన దృష్ట్యా ఆయన కాలం శ్రీనాథ, ప్రబంధ యుగాల మధ్య వారధి. పైగా సంగీత ప్రక్రియలకు అన్నమయ్య కాలంలోనే బీజం పడింది. కర్ణాటక సంగీత ఆద్యుడైన పురందరదాసు ఈ కాలంవాడే. అన్నమయ్య సంకీర్తనలకు రాగాలు, తాళాలు కూర్చింది పురందరదాసే కావచ్చు. అన్నమయ్య సంకీర్తనల్లో భావానికి తగిన భాష, భాషకు తగిన సంగీత కూర్పును మనం గమనించగలం. అంత ప్రాధాన్యత ఉన్న ఈ సంకీర్తనలపై భాష, సంగీత శాస్త్రాల దృష్టితో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. అన్నమయ్య సాహిత్యంలోని వివిధ రకాల చిత్రణలపై పరిశోధన చేయాలని అనిపించడంవల్ల నేను మా పర్యవేక్షకులతో చర్చించి, నా పరిశోధనాంశంగా '**అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు: సాహిత్య వైచిత్రి**' అనే అంశాన్ని ఎన్నుకున్నాను. అన్నమయ్య సంకీర్తనలను భాష, సంగీత, సాహిత్య మేళవింపుగా పేర్కొన్న ఈ పరిశోధన భావి పరిశోధకులకు, సంగీతజ్ఞులకు బాగా

ఉపకరిస్తుంది. ముఖ్యంగా ఈ సంకీర్తనలపై సంగీత, భాషాంశాల దృష్ట్యా పరిశోధనలు మెండుగా జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అన్నమయ్య మొత్తం సాహిత్యంపై పరిశోధన చేయడం ఒక జీవిత కాలపు పని. అందువల్ల నా పిహెచ్. డి. కాలపరిమితిని దృష్టిలో ఉంచుకొని, మా పర్యవేక్షకుల సూచనలు, సలహాలమేరకు *అధ్యాత్మ సంకీర్తనలు ప్రథమ, ద్వితీయ సంపుటాల*ను గ్రహించడం జరిగింది. ఈ అధ్యయనంలో సాహిత్యపరంగా కవితా సౌందర్యం, అలంకారాలు, సంగీత పరంగా స్వర, రాగ, తాళ విభజన, భాషాపరంగా సంభాషణలు, వాక్య విన్యాస రీతులు మొదలైన అంశాలను అధ్యయనం చేశాను.

## 0.3. అన్నమయ్య సంకీర్తనలపై వెలువడిన పరిశోధనలు

అన్నమయ్య సంకీర్తనలపై వివిధ విశ్వవిద్యాలయాలనుండి పరిశోధన గ్రంథాలు విరివిగా వెలువడ్డాయి. వాటిలో కొన్నింటిని కింద పొందుపరుస్తున్నాను.

1. కుసుమారెడ్డి, కె. 2007. *అన్నమాచార్యులు భారతీయ వాగ్గేయకారులు తులనాత్మక పరిశీలనం*. హైదరాబాదు: (ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన వ్యాసం)
2. ప్రసాద్, పి. ఎల్. ఎన్. 2007. *తాళ్ళపాక అన్నమాచార్య శృంగార సంకీర్తనల్లో రసవృత్తి – వాక్యలయ*. హైదరాబాదు: (హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసం)
3. లీలావతమ్మ, పొన్నా. 1986. *అన్నమయ్య సంకీర్తనల్లోని జానపద గేయ ఫణితులు*. తిరుపతి: (శ్రీ వేంకటేశ్వరా విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం)
4. శ్రీహరి, మల్లెల. 1983. *తాళ్ళపాక అన్నమయ్య బాలకృష్ణ సంకీర్తనలు – ఒక పరిశీలన*. తిరుపతి: (శ్రీ వేంకటేశ్వరా విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన వ్యాసం)

5. సీతామహాలక్ష్మి, ఎల్. వి. ఎస్. ఎస్. 1993. *శ్రీ తాళ్ళపాక అన్నమాచార్య సంకీర్తనల్లో సంవాద గేయాలు – పరిశీలన*. హైదరాబాదు: (శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన వ్యాసం)

ఇలా అనేకమైన పరిశోధనలు అన్నమయ్య సాహిత్యంపై వివిధ విశ్వవిద్యాలయాలనుండి విరివిగా వెలువడ్డాయి.

## 0.4. క్షేత్ర పర్యటన / గ్రంథ సేకరణ:

పరిశోధనా కాలపరిమితిని దృష్టిలో ఉంచుకొని, నేను, మా పర్యవేక్షకుల సలహా మేరకు అవసరమైన సమాచారాన్ని సేకరించడానికి కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని ఇందిరా గాంధీ మెమోరియల్ లైబ్రరీ, తెలుగు విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయం, శ్రీ వేంకటేశ్వరా విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయం, ద్రవిడ విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయం, హైదరాబాదు, తదితర ప్రాంతాల్లోని పుస్తక ప్రదర్శనలు, మొదలైన వాటిని సందర్శించి, కావాల్సిన గ్రంథాలను సేకరించుకున్నాను. అవే కాకుండా ఆన్‌లైన్ వెబ్‌సైట్ నుంచి కొన్ని గ్రంథాలను డౌన్‌లోడ్ చేసుకున్నాను. ముఖ్యంగా తిరుమల తిరుపతి దేవస్థానములవారు నిర్వహిస్తున్న Tirumala.org వెబ్సైట్ నుండి నాకు కావాల్సిన అనేక గ్రంథాలను, కొన్ని వ్యాసాలను దిగుమతి చేసుకున్నాను.

## 0.5. పరిశోధన పరిధి

అన్నమయ్య రచించిన 14000 సంకీర్తనలను తిరుమల తిరుపతి దేవస్థానములవారు ఉద్దండులైన పండితులచే పరిష్కరింపించి, 29 భాగాలుగా సంపుటీకరించి, ప్రచురించారు. నా పిహెచ్. డి. కాలపరిమితిని దృష్టిలో ఉంచుకొని, మా పర్యవేక్షకుల సలహామేరకు *అధ్యాత్మ సంకీర్తనలు ప్రథమ, ద్వితీయ సంపుటాల*ను గ్రహించాను. వీటిని శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు పరిష్కరించారు. తిరుమల తిరుపతి దేవస్థానములవారు 1998వ సంవత్సరంలో ముద్రించారు. ఈ రెండు సంపుటాల్లోని 1066 కీర్తనలను అధ్యయనం చేసి, పరిశోధన చేశాను.

## 0.6. పరిశోధన గ్రంథ రచన – ఆధార గ్రంథాలు

నా పరిశోధన గ్రంథాన్ని భాష, సంగీత, సాహిత్యాల దృష్టితో రాయడం జరిగింది. ఈ పరిశోధన గ్రంథాన్ని మొత్తం అయిదు అధ్యాయాలుగా వింగడించుకోడం జరిగింది. వాటిలో రెండు అధ్యాయాలను సాహిత్య దృష్టితోనూ, రెండు అధ్యాయాలను భాషా దృష్టితోనూ, ఒక అధ్యాయాన్ని సంగీత దృష్టితోనూ రాయడం జరిగింది.

అందుకు *అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు ప్రథమ ద్వితీయ సంపుటాల*తోబాటు కింద ఇచ్చిన గ్రంథాలు ప్రధాన ఆకరాలుగా ఉపకరించాయి.

1. ఆనందమూర్తి, వేటూరి. 1974. *తాళ్ళపాక కవుల కృతులు – వివిధ సాహితీ ప్రక్రియలు*. హైదరాబాదు: (మురళీ పవర్ ప్రెస్ కుత్బీగూడ వారి ప్రచురణలు)
2. పవన్ కుమార్, పమ్మి. 2004. *కట్టా వరదరాజు ద్విపద రామాయణం – భాషా పరిశీలన*. హైదరాబాదు: (హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం)
3. పార్థసారథి, ఎన్. సి., ద్వారకా పార్థసారథి, ఎన్. సి. 2013. *గానకళాబోధిని*. చెన్నై: (బాలసరస్వతీ బుక్ డిపో వారి ప్రచురణలు)
4. ప్రభాకరశాస్త్రి, వేటూరి. 2008. *అన్నమాచార్య చరిత్ర పీఠిక*. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములవారి ప్రచురణలు.
5. ప్రసాద్, పి. ఎల్. ఎన్. 2007. *అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో రసవృత్తి, వాక్యలయ*. హైదరాబాదు: (హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసం)
6. రామారావు, చేకూరి. 2018. *తెలుగు వాక్యం*. హైదరాబాదు. నిర్మలా గ్రాఫిక్స్.
7. శోభాదేవి, ఆర్. 2012. *అన్నమయ్య జీవితం – సాహిత్య ప్రస్థానం*. హైదరాబాదు: (తెలుగు అకాడమీ ప్రచురణ)
8. సంగమేశం, ముట్నూరి. 1981. *అన్నమాచార్య సాహితీ కౌముది*. తిరుపతి: (తిరుమల తిరుపతి దేవస్థానములవారి ప్రచురణలు)

9. సంగమేశం, ముట్నూరి. 1983. *అన్నమయ్య*. హైదరాబాదు: (యువభారతీ పబ్లికేషన్స్)

10. సీతామహాలక్ష్మి, ఎల్. వి. ఎస్. ఎస్. 1993. *శ్రీ తాళ్ళపాక అన్నమాచార్య సంకీర్తనల్లో సంవాద గేయాలు – పరిశీలన*. హైదరాబాదు: (శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన వ్యాసం)

వంటి గ్రంథాలను స్వీకరించాను. ఇవే కాకుండా సాహిత్య చరిత్రలనూ, ఇతర గ్రంథాలనూ గ్రహించాను. వీటన్నిటి పూర్తి వివరాలను ఉపయుక్త గ్రంథసూచిలో తెలియజేశాను.

## 0.7. పరిశోధన గ్రంథ రచనా పద్ధతి:

మా పర్యవేక్షకుల సూచన మేరకు అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు: సాహిత్య వైచిత్రి అనే నా పరిశోధనాంశాన్ని అయిదు అధ్యాయాలుగా విభజించడం జరిగింది. అవి:

**అధ్యాయం 1. అన్నమయ్య జీవితం, రచనలు – ఇతర వాగ్గేయకారులు**

**అధ్యాయం 2. అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో కవితా సౌందర్యం**

**అధ్యాయం 3. అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో సంభాషణలు**

**అధ్యాయం 4. అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో స్వర, లయ, అలంకార పోషణ**

**అధ్యాయం 5. అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో వాక్య విన్యాసం**

పైన పేర్కొన్న అధ్యాయాల్లో ఒకటి, రెండు, నాలుగు అధ్యాయాలను సాహిత్య, సంగీత కోణంలోను, మూడు, అయిదు అధ్యాయాలను భాషా కోణంలోను రాయడం జరిగింది. ఈ అధ్యాయాలను రాసే క్రమంలో కింద పేర్కొన్న నియమ నిబంధనలను పాటించడం జరిగింది.

1. అధ్యాయాల్లో ఇచ్చిన ఉదాహరణల తరువాత రచన సంక్షిప్త రూపాలను కుండలీకరణాల్లో ఇవ్వడం జరిగింది.

2. రచన సంక్షిప్త రూపం పక్కనే ఆ గ్రంథాన్ని ముద్రించిన సంవత్సరం, తరువాతి కోలన్ పక్కనే ఉన్న సంఖ్యను పేజీ నంబరుగా గుర్తించాలి. ఉదాహరణ (సంపుటం1.1998:1) అని

ఉంటే ఆ ఉదాహరణ అధ్యాత్మ సంకీర్తనలు ప్రథమ సంపుటంలోనిదని, ముద్రించిన సంవత్సరం 1998 అని, ఆ ఉదాహరణ ఒకటవ పుటలోనిదని గుర్తించాలి. అలాగే ఇతర గ్రంథాల విషయంలో ఆ రచయిత లేక కవి పేరు, ముద్రించబడిన సంవత్సరం, పుట సంఖ్య కుండలీకరణాల మధ్య ఇవ్వడం జరిగింది.

3. ఈ పరిశోధన గ్రంథంలో ఉపయుక్త గ్రంథాల వివరాలను (Bibliography and Citations)ను కూర్చడంలో APA (American Psychological Association) వారి పద్ధతిని అనుసరించాను.

## 0.8. పరిశోధన లక్ష్యం:

తెలుగు సాహిత్యంలో అన్నమయ్య సంకీర్తనలపై విస్తృతమైన పరిశోధన గ్రంథాలు వెలువడ్డాయి. సంగీతంలోని ఇతర ప్రక్రియలైన కీర్తనలు, కృతుల్లోని సాహిత్యంపై పరిశోధనలు జరిగాయి. అన్నమయ్య అనంతరం రామదాసు కీర్తనలపై, క్షేత్రయ్య పదాలపై, త్రిమూర్తులైన శ్యామశాస్త్రి, త్యాగరాజు, ముత్తుస్వామి కృతులపై చాలా తక్కువగా పరిశోధనలు వెలువడ్డాయి. కానీ సంగీతశాస్త్రాన్ని సాహిత్య, భాషాశాస్త్రాలతో మేళవించి పరిశోధనలు జరగలేదు. ప్రాచీన పద్య సాహిత్యానికి సంగీతశాస్త్ర ప్రక్రియలైన సంకీర్తన, కీర్తన, పదం, కృతి మొదలైన ప్రక్రియలు ఎంతమాత్రం తీసిపోవు. ఆ అవసరాన్ని గుర్తించి నేను '**అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు: సాహిత్య వైచిత్రి**' అనే అంశాన్ని గ్రహించి పరిశోధించడం జరిగింది.

## 0.9. పరిశోధనవల్ల కలిగే ప్రయోజనాలు:

1. అన్నమయ్య సంకీర్తనలు ప్రాచీన కావ్యాల జాబితాకు చెందినప్పటికీ ప్రజల వాడుక భాష ప్రధానమైనది. కాబట్టి కావ్య భాషకు, ఆధునిక భాషకు ఇవి వారధి అని గ్రహించాలి.
2. సాహిత్యంతోబాటు సంగీత, భాషా శాస్త్రాల దృష్టితో అధ్యయనం చేయదలచుకున్న వారికి ఈ గ్రంథం చాలా ఉపకారి అవుతుంది.

3. తెలుగులో సంగీతంపై వెలువడిన అతితక్కువ పరిశోధనల్లో ఇది కూడా చేరుతుంది.
4. అన్నమయ్య సాహిత్యంలోని భాష, సంగీతాంశాలను తెలుసుకోవాలని ప్రయత్నించే భావి పరిశోధకులకు ఈ గ్రంథం సహకరిస్తుంది.
5. అన్నమయ్య సంభాషణలలోని వైచిత్రిని గురించి తెలుసుకోగోరిన వారికి ఈ గ్రంథం సహాయపడుతుంది.
6. ప్రాచీన, ఆధునిక తెలుగులో వాక్య విన్యాస పద్ధతులను గురించి అధ్యయనం చేసే పరిశోధకులకు ఈ గ్రంథం పనికివస్తుంది.
7. సంగీత సాహిత్యాల కొనసాగింపుగా వచ్చిన అనేక గ్రంథాల కోవలోకి ఈ గ్రంథం చేరుతుంది.
8. వాగ్గేయకారుల భాషలోని భిన్న ధోరణులను వెలికి తీయడానికి, కావ్యభాషకు, వాగ్గేయకారుల భాషకు భేదాలు తెలుసుకోవడానికి ఈ గ్రంథం ఉపయోగపడుతుంది.
9. సంగీతశాస్త్రంలోని సంకీర్తన, కీర్తన, పదం, కృతి, గీతం మొదలైన ప్రక్రియలను తెలుసుకోవడానికి, వాటిలో ఉపయోగించే తాళ జాతులను అధ్యయనం చేయడానికి ఈ గ్రంథం సహకరిస్తుంది.
10. సాహిత్య, సంగీతాల పరంగా సమాజాన్ని, ఇతర వాగ్గేయకారుల్ని, అన్నమయ్య అనంతరం వచ్చిన ప్రబంధ కవుల్ని అన్నమయ్య సంకీర్తనలు ఏ విధంగా ప్రభావితం చేశాయో అధ్యయనం చేయడానికి ఈ గ్రంథం ఉపకరిస్తుంది.

★★★★★

# అధ్యాయం - 1

# అన్నమయ్య జీవితం, రచనలు - ఇతర వాగ్గేయకారులు

## 1.0. పరిచయం

తెలుగులో పదసాహిత్యం పద్య సాహిత్యం కంటే ముందే పుట్టింది. ఈ సాహిత్యానికి ప్రజలే వాహికలుగా పని చేశారు. రానురానూ పద్య సాహిత్యం గౌరవాదరాభిమానాలు పొందింది. నన్నయ కాలం నుండి పద్య సాహిత్యం బాగా వృద్ధి చెందింది. 12వ శతాబ్దంలో *సింహగిరి నరహరి వచనాల*ను రాసిన కృష్ణమాచార్యులు తెలుగులో మొదటి పదకర్తగా పేరొందారు. ఇంచుమించు రెండు శతాబ్దాల తరువాత తెలుగులో పదసాహిత్యంలో విస్తృతమైన మార్పు వచ్చింది. దానికి కారణం పదసాహిత్య పితామహులు అన్నమాచార్యులు.

అన్నమయ్య అనగానే మనకు ఆయన చేసిన అపూర్వమైన సంకీర్తనలు గుర్తుకు వస్తాయి. అన్నమాచార్యుల జీవిత విశేషాలతోబాటు ఇతర వాగ్గేయకారుల జీవిత విశేషాలు, రచనలు మొదలైన వివరాలు ఈ అధ్యాయంలో చర్చించబడ్డాయి.

పదకవితా పితామహుడైన అన్నమయ్య జీవిత చరిత్రను ఆయన మనుమడు, పెదతిరుమలాచార్యుని నాలుగవ కుమారుడైన చినతిరువేంగళనాథుడు (చిన్నన్న) ద్విపద కావ్యంగా రచించారు. ఆ గ్రంథానికి వేటూరి ప్రభాకరశాస్త్రి పీఠిక రచించారు. అన్నమయ్య సంకీర్తనలు ఉన్న రాగిరేకుల వల్ల అన్నమయ్య జనన సమాచారం తెలుస్తోంది. అంతేగానీ శాసనస్థమైన ఆధారాలు లేవు. అన్నమయ్య చరిత్ర కర్త అయిన చిన్నన్న అవతరణికలో ఇలా చెప్పారు.

"వనజాక్ష నేడు మావంటివాఱలకు కరతలామలకంబు గావించుగనుక

అరయగ తాళ్ళపాకన్నమాచార్య పరమోపకారమెప్పటికీ

డెందమున నొరయాచుకొని ఆడుటది మెప్పు" (*సీతామహాలక్ష్మి, ఎల్. వి. ఎస్. ఎస్.1993:3.*) అని అన్నమాచార్యుని ఖ్యాతిని పొగిడారు. ఈ శ్లోకంలో శ్రీ వేంకటేశ్వరుని

పాదపద్మాలకు మమ్మల్ని దూరం చేయవద్దని, గ్రంథ రచనలో నా ప్రయత్నానికి ఆటంకం రానియ్యవద్దని ఆ దేవదేవుని ప్రార్థించారు.

## 1.1. అన్నమయ్య వంశీయులు

తాళ్ళపాక వంశీయులు అశ్వలాయన సూత్రులు, భరద్వాజ గోత్రులు. అన్నమయ్యకు ముందుతరం వారు శివభక్తులని చెబుతారు. అన్నమయ్య పూర్వికులు కాశీ నుంచి తాళ్ళపాకకు వలస వచ్చినట్టు ఐతిహ్యం. పూర్వం నందుడు అనే రాజు కాశీ నుండి పండితులను తన రాజ్యానికి తీసుకువచ్చి, సకల సౌకర్యాలు కల్పించాడు. అందుకే వారికి 'నందవరైక బ్రాహ్మణులు' అని పేరు వచ్చింది. అలా తాళ్ళపాకకు చేరిన వీరు అక్కడ చెన్నకేశవుణ్ణి పూజించారు. తాళ్ళపాక వంశానికి మూలపురుషుడు నారాయణుడు. ఇతడు శివభక్తుడు. ఇతనికి నారాయణుడు, నారాయణునికి విఠ్ఠలుడు, విఠ్ఠలునికి నారాయణుడు జన్మించారు.

## 1.2. తాళ్ళపాక అన్నమయ్య జననం

తాళ్ళపాక చిన్నన్న శాలివాహనశకం 1468వ సంవత్సరంలో తిరుమలలో ఒక శాసనం వేయించారు. ఆ శాసనంలో ఇలా ఉంది.

"రాజీవనయను వరప్రసాదమున
తేజంబు మతియు యంతే విస్తరిల్ల
లక్కమాంబకు పుణ్య లావణ్యనిధికి
చక్కని గ్రహములుచ్చమున మూడలర
అనుపమ లగ్నంబునందు వైశాఖ
మున విశాఖనుజగంబున ఉల్లసిల్ల
జనియించె అన్నమాచార్యుండు" (*సంగమేశం, ముట్నూరి.1981:5.*)

ఈ శ్లోకం వల్ల ఒక తేజోవంతమైన బాలుడు మూడు గ్రహాలు ఉచ్ఛ స్థితిలో ఉన్నప్పుడు ఒక శుభలగ్నంలో క్రోధి నామ సంవత్సరంలో వైశాఖ శుద్ధ పూర్ణిమ నాడు విశాఖ నక్షత్రంలో జన్మించాడని తెలుస్తోంది. నారాయణసూరి అన్నమయ్యకు 'అన్నం బ్రహ్మేతీ యజునాత్' అనే వేదోక్తిని అనుసరించి 'అన్నమయ్య' అని నామకరణం చేశారు. ఆ పిల్లవాణ్ణి

తల్లైన లక్కమాంబ 'అన్నయ్య', 'అన్నయగురు', 'అన్నప్ప', 'అన్న', 'అన్నమాచార్య' అనే పేర్లతో పిలుస్తూ ముద్దు చేసేది.

అన్నమయ్య జనన విషయంలో కొందరు పండితులు భిన్నమైన అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు. కొందరు 1408-1503 గాను, మరి కొందరు 1424-1503 మధ్య కాలంగాను పేర్కొంటున్నారు. డా. ముట్నూరి సంగమేశంగారు 1978వ సంవత్సరం సెప్టెంబరు నెలలో వెలువడిన *సప్తగిరి మాసపత్రికలో* అన్నమయ్య కాలాన్ని గురించి విస్తృతమైన చర్చ చేశారు. ఆయన రాగిరేకులలో ఉన్న వివరాల ఆధారంగా '1408-1503' వాదాన్ని బలపరిచారు. సాధు బ్రాహ్మణ్యశాస్త్రులు అనే పండితుడు శాలివాహనశకం 1330 లో వైశాఖ మాసంలో విశాఖ నక్షత్రంలో శుక్లశుద్ధ బుధవారం రోజున క్రీశ. 1408 మేనెల 1వ తేదీగా నిర్ణయించారు. ఆయన చూపించిన ఆధారం ఇలా ఉంది.

"శుభమస్తు శ్రీయతే రామానుజాయనమః స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహనశక వరుషంబు 1346 అగు వేటి క్రోధి సంవత్సరమందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదునారేండ్లు తిరువేంగళనాథుడు ప్రత్యక్ష్యమయితేను అది మొదలుగాను శాలివాహనశక వరుషంబు 1494 అగు నేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ నిరుధానకు తిరువేంగళనాథుని మీదన్ అంకితముగను తాళ్ళపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన శృంగార సంకీర్తనలు" (*సంగమేశం, ముట్నూరి.1981:3*) ఈ వాదాన్ని వేటూరి ఆనందమూర్తిగారు, ప్రభాకరశాస్త్రిగారు మొదలైన పండితులందరూ బలపరిచారు. అన్నమయ్య 1503 వ సంవత్సరంలో ద్వాదశి రోజు పరమపదించినట్లుగా ఆయన వంశీయులు రాసిన

"దినము ద్వాదశి నేడు తీర్థదివసము నీకు జనకుండ అన్నమాచార్య విచ్చేయవే." (*ప్రభాకరశాస్త్రి, వేటూరి.2008:122.*) అనే సంకీర్తనవల్ల తెలుస్తోంది.

## 1.3. అన్నమయ్య బాల్యం

అన్నమయ్య బాల్యాన్ని గూర్చి ఆసక్తికరమైన విషయాలు అనేకం ఉన్నాయి. ఈ ఉపవిభాగంలో వాటిని సంక్షిప్తంగా పేర్కొనటం జరుగుతున్నది. అన్నమయ్య జ్ఞానంలో

దినదిన ప్రవర్థమానమయ్యారు. తల్లి అయిన లక్కమాంబ నూనె పెట్టడానికి, ఉగ్గు తాగించడానికి ఎంత ప్రయత్నించినా వినేవారు కాదు. ఆమె 'తిరుమలప్పని ప్రసాదాన్ని తీసుకో' అనగానే అలా చేసేవారు. తిరుమలప్పని పేరుతో జోల పాడనిదే నిద్రకు ఉపక్రమించేవారు కాదు. కొండలరాయనికి మొక్కమనగానే రెండు చేతులు జోడించేవారు. సాధారణంగా తల్లిదండ్రులను అనుకరించడానికి, అనుసరించడానికి పిల్లలు ప్రయత్నిస్తారు. అన్నమయ్య తల్లిదండ్రులకు ఆ వేంకటేశ్వరునిపై భక్తి ప్రపత్తులు ఉండడంచేత అన్నమయ్య కూడా వారినే అనుసరించారు. అన్నమయ్య భగవదంశతో జన్మించడంవల్ల ఆయనకు దేవునిపై చిన్ననాటినుండే అపారమైన భక్తి అలవడింది.

## 1.4. అన్నమయ్య విద్యాభ్యాసం

అన్నమయ్య అయిదు సంవత్సరాల వయస్సులో 'ఉపవీత సంస్కారం' పొందారు. అతని శాస్త్రాధ్యయనం ఇంటిదగ్గరే సాగింది. అన్నమయ్య గురువులెవరో చిన్నన్న తెలియజేయలేదు. ఎవరి జీవితంలోనైనా విద్య నేర్పిన గురువు చాలా బలీయమైన పాత్ర పోషిస్తారు. అన్నమయ్యకు సమస్తవిద్యలు ఆ వేంకటేశ్వరుని దయవల్ల అబ్బాయని చెప్పడం చిన్నన్న ఉద్దేశం.

"ఆడిన మాటెల్ల అమృతకావ్యముగ
పాడిన పాటెల్ల పరమగానముగ
తన కవిత్వమునకు తన గానమునకు
కనుగొని సకల లోకములు గీర్తింప
వేంకటపతిమీద వింతవింతలుగ
సంకీర్తనంబులు సవరించునిచ్చు." (*శ్రీరంగాచారి, అంగలూరి.1995:4.*)

దానికి కారణం ఆ తిరుమలేశుడేనని అన్నమయ్య నమ్మారు. క్రమంగా పెరుగుతున్న ఆయన వయస్సుతోబాటు ఆ వేంకటేశ్వరునిపై భక్తి కూడా పెరగసాగింది. తన తల్లిదండ్రులకు, బంధువులకు విధేయుడై ఉండేవారు. స్నేహితులతో సఖ్యంగా మెలిగేవారు.

## 1.5. అన్నమయ్య తిరుమలకు వెళ్ళటం

చిన్న నాటినుండి అన్నమయ్య భగవంతుని ధ్యానంలోనే ఉండేవారు. ఎప్పుడూ పరధ్యానంగా ఉన్న అన్నమయ్యను చూసి తల్లిదండ్రులు, బంధువులు భయపడేవారు.

అందుకే ఏదో ఒక పనిని పురమాయించడంవల్ల అతనిని దారిలో పెట్టవచ్చని వారు భావించారు. అందులో భాగంగా వారు ప్రతి పనిని అన్నమయ్యచేత చేయించేవారు.

ఒకరోజు పశువులకు గడ్డి కోసుకురమ్మని పొలానికి పంపించారు. అన్నమయ్య అక్కడ పచ్చని గడ్డిని చూసి, ఆ భగవంతుని సృష్టికి చాలా సంతోషించి, తన మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నారు. అన్నమయ్య వంగి పిడికెడు గడ్డి కోశారు. మళ్ళీ ఆ గడ్డిని కోయబోగా తన చేతిలోని కొడవలి జారి చిటికెనవేలు తెగింది. రక్తం కారుతున్న చేతిని చూసి ఆ బాధ తట్టుకోలేక 'హరి హరీ, శ్రీహరి' అంటూ తన జీవితాన్ని శ్రీహరి వైపుకి తిప్పారు. ఆ దేవుడే అన్నిటికి మూలమైనవాడు అని పెద్దలు చెప్పిన మాటలను గుర్తు చేసుకున్నారు. ఇంత తెలిసి ఇలా చేయడం కూడదని అన్నమయ్య బాధపడ్డారు. ఈ చుట్టాలు, తల్లిదండ్రులు అశాశ్వతాలు. భగవంతుడొక్కడే దిక్కు అని మనస్సులో భావించారు.

ఇవన్నీ మనస్సులో తిరుగుతున్న సమయంలోనే సనకాదులు అనే భక్తుల బృందం తిరుమలకు వెళ్ళడం చూశారు. 'వారు మంచి రాగంతో, దండెలతో, శ్రుతితో, తాళాలతో నాట్యం చేస్తూ గోవింద నామాన్ని స్మరిస్తూ వెళుతున్నారు. వారందరూ నెమలి పింఛాలతో అలంకరింపబడిన జింకచర్మంతో చేసిన రంగురంగుల టోపీలు పెట్టుకున్నారు. ఆకులతో నేసిన బట్టలు కట్టుకున్నారు. విల్లు, ఒంటినిండా నామాలు, శంఖచక్రాల ముద్రలు ధరించారు' అని *అన్నమయ్య చరిత్రము*లో పేర్కొనబడింది. ఆ భక్తుల బృందంతో కలిసి అన్నమయ్య తిరుపతి సమీపంలోని గొల్లపల్లె అనే గ్రామంలో కొలువైన గంగమ్మను దర్శించారు. ఆమె ఆశీర్వాదంతో అక్కడనుండి అలిపిరి చేరుకున్నారు. తల్లేరుగుండును దర్శించారు. కర్పూర వాసనలతో విలసిల్లే కర్పూర కాలువను చూశారు. ఆ కొండల్లో కొలువుదీరిన దేవతా మాహాత్మ్యాలను తలుస్తూ, ఆ ప్రకృతి అందాలను చూసుకుంటూ నడిచారు. అక్కడి చెట్లన్నీ అన్నమయ్య కంటికి వనదేవతల్లా భాసిల్లాయి. ఆ ప్రకృతి సౌందర్యానికి అన్నమయ్య ముగ్ధుడయ్యారు. ఆకలివల్ల, చాలా దూరం నడిచిన కారణంగా కలిగిన అలసటవల్ల అన్నమయ్య ఒక వెదురు పొదలో రాతిమీద అలసిపోయి నిద్రించారు.

## 1.6. అలమేలు మంగమ్మ అన్నమయ్యను ఊరడించడం

అన్నమయ్య ఆకలిని అలమేలు మంగమ్మ గ్రహించింది. ఆమె అందమైన కొప్పుతో పెద్ద ముత్తైదువ రూపంలో అన్నమయ్యకు ఊరట కలగజేసింది. ఆమె అన్నమయ్యను పిలిచి 'చిన్నవాడా ఇక్కడ ఇలా పడి ఉన్నావేంటి?' అని అడిగింది. ఆ పిల్లవాడు చాలా దూరం నడవడంవల్ల నీరసం వచ్చింది. ఆకలితో కళ్ళు కనబడడంలేదని చెప్పాడు. తనకు ఆ వేంకటేశ్వరుని దర్శించే ఉపాయం చెప్పమని ఆ తల్లిని కోరాడు. అతని భక్తిని, ఆసక్తిని చూసి ఆమె...

"కమలా మహాదేవి శిశువును కనుగొని
తన కృపామృతధార తనివినొందించి
బాలకా ఆహీ మహాపర్వతేంద్రంబు
లాలిత సకల సాలగ్రామమయము
ఘనులకునిది చెప్పు కాళ్ళనెక్కంగ
జనదునీ చెప్పులు సడలించివైచి
కనుగొనూ కన్నులా కనవచ్చుననినా"

(*సీతామహాలక్ష్మి, ఎల్. వి. ఎస్. ఎస్. 1993:13.*)

'ఇది సాలగ్రామంతో నిండిన పర్వతం. మునులు, వనదేవతలు నివసించే ఈ తిరుపర్వతాన్ని చెప్పుకాళ్ళతో ఎక్కరాదు. నీ చెప్పులు తీసి చూడు. ఆ స్వామిని తప్పక చూడగలవ'ని ఆశీర్వదించింది. తేనె, పాలు కలిపిన ప్రసాదాన్ని ఆ పిల్లవాడికి ప్రేమతో తినిపించి ఆకలి తీర్చింది.

అన్నమయ్య తేరుకొని చూసేలోపే ఆమె అంతర్థానమైంది. తన చెప్పులు తీసి చూడగానే అన్నమయ్యకు అక్కడ హరి రూపం దశావతారాలలో దర్శనమిచ్చింది. తన ఆకలి తీర్చిన అమ్మను వెదికారు కానీ ఆమె కనబడలేదు. కలో! వైష్ణవ మాయో! తెలియని అయోమయంలో పడిపోయారు. ఇదంతా ఆ అమ్మ అలమేలు మంగమ్మ తన మీద చూపించిన ప్రేమేనని అన్నమయ్య గ్రహించారు. ఆ ప్రసాద మహిమవల్ల అత్యంత మనోహరంగా ఆ తల్లిపై ఆశువుగా వేంకటేశ్వర శతకాన్ని చెప్పారు. అక్కడనుండి తిరుమలకు అన్నమయ్య చేరుకున్నారు.

## 1.7. అన్నమయ్య తిరుమలను దర్శించడం

అన్నమయ్య తిరుమలలో అనేకరకాల పూలతో అలంకరింపబడిన స్వామి రూపాన్ని చూశారు. తిరుమలలోని కోనేటిలో స్నానం చేశారు. ముందుగా ఆదివరాహ స్వామిని దర్శించుకున్న తరువాత పెద్ద గోపురానికి నమస్కరించారు. చింత చెట్టుకు ప్రదక్షిణలు చేశారు. గరుడ స్తంభానికి భక్తితో మొక్కారు. సంపెంగ మానులతో చుట్టబడి అత్యంత అందంగా ఉన్న ప్రాకారానికి నమస్కరించారు. ఇలా తిరుమలలోని అందాలను తనివితీరా అన్నమయ్య ఆస్వాదించారు.

ఆ తరువాత పచ్చకర్పూర వాసనతో నిండిన దేవాలయాన్ని దర్శించారు. ప్రధాన దేవాలయంలో ప్రవేశించి, ఆ వేంకటేశ్వరునికి భక్తితో నమస్కరించారు. అక్కడ కొలువైన నరసింహుణ్ణి, జనార్ధనుణ్ణి ప్రార్థించారు. దీనంతటికీ కారణమైన అమ్మకు మనస్సులో కృతజ్ఞతలు చెప్పుకున్నారు. ఆ సమీపంలో ఉన్న యాగశాలను దర్శించారు. బంగారు పూతగల గరుడ, శేష వాహనాలను చూశారు. భక్తులు కానుకలు వేసే హుండీని చూసి ఆశ్చర్యపోయారు. అక్కడ బంగారం, ఇతర కానుకలతో నిండిన స్వామి భాండాగారాన్ని చూశారు. తాను తెచ్చిన కానుకను హుండీలో వేశారు.

ఆ ఆలయంలో శంఖచక్రాలతో, ఇద్దరు దేవేరులతో కూడి అనేక ఆభరణాలతో అలంకరింపబడిన దివ్యమంగళ విగ్రహాన్ని దర్శించి, మురిసిపోయారు. ఆ స్వామి ఎదుట మధురంగా ఆడుతూ, పాడుతూ, కీర్తిస్తున్న అన్నమయ్యను చూసి అక్కడివారు తీర్థప్రసాదాలిచ్చారు. పూజారులు శఠగోపం పెట్టి దీవించారు. వారు అనుమతించగా ఆ రాత్రి నాలుగు కాళ్ళ మండపంలో సేదతీరారు.

## 1.8. అన్నమయ్య స్వామిపై శతకాన్ని రచించడం

అన్నమయ్య తిరుమలలో కోనేటిలో స్నానం చేసి ఆ తడిబట్టలు ఆరేలోగా స్వామి మహిమలను కీర్తిస్తూ ఒక శతకాన్ని చెప్పారు. ఆ శతకంలో స్వామివారి నామాలను కీర్తించారు. అన్నమయ్య మళ్ళీ ఆలయ దర్శనార్థం వెళ్ళారు. అక్కడ బంగారు ఎంకిళ్ళు మూసి ఉన్నాయి. గుడి మూసి ఉండడం చూసి మళ్ళీ అదే శతకాన్ని పఠించారు. వెంటనే గుడి

తలుపులకు ఉన్న తాళాలు అప్రయత్నంగా ఊడిపడి, తలుపులు తెరుచుకున్నాయి. అది చూసిన అర్చకులు ఆశ్చర్యాన్ని ప్రకటించారు. 'భళి భళి' అని మెచ్చుకున్నారు. ఆ బాలుని గర్భగుడిలోకి వారు తీసుకెళ్ళారు. సీతా లక్ష్మణ ఆంజనేయ సుగ్రీవ అంగదాదులతో కొలువై, అనేక ఆభరణాలతో శంఖచక్రాలు ధరించిన స్వామికి అన్నమయ్య ప్రేమపూర్వకంగా నమస్కరించారు. ఆ శతకాన్ని ఆనందంతో అన్నమయ్య పఠించగానే స్వామి మెడలోని ముత్యాలహారం స్వామి పాదాలపై పడింది. అప్పుడు పూజారులు అన్నమయ్యను సమీపించి 'ఈ బాలుడు నిజంగా ఆ వేంకటేశ్వరుని వరప్రసాదమే. కాకపోతే ఇంత అద్భుతమైన కావ్యాన్ని ఎలా చెప్పగలడు?' అని ఆశ్చర్యపోయి అన్నమయ్యను ఆదరించారు. చందనం, తీర్థప్రసాదాలిచ్చారు. అన్నమయ్య దేవదేవుని తలచుకుంటూ ఆ ప్రసాదాలను కోనేటి తీరంలో భుజించారు.

## 1.9. అన్నమయ్యకు ఘనవిష్ణువు పంచ సంస్కారాలు నిర్వహించడం

తిరుమలలో ఘనవిష్ణువు అనే యోగి ఉండేవారు. ఆయన విష్ణుభక్తుడు. ఆయనకు ఒకరోజు వేంకటేశ్వరుడు స్వప్నంలో సాక్షాత్కరించి 'నీవు రేపు ఒక చిన్నవాడికి విష్ణు దీక్ష ఇవ్వాలి. అతని పేరు అన్నమయ్య. అతడు నల్లని రూపంతో, ముద్దుగా ఉంటాడు. మద్దికాయలు ధరించి పట్టుకుచ్చులు తన భుజంపై వేసుకొని రేపు ఉదయాన్నే నీకు తారసపడతాడు. నీవు ఆలస్యం చేయకుండా అతనికి నా ముద్రలు ఇవ్వ'మని చెప్పారు. ఆ యతి సూర్యోదయం కాగానే నిత్య కర్మలు ముగించుకొని, స్వామి ఇచ్చిన ముద్రలు, శంఖచక్రాలు పట్టుకొని ఆ బాలునికోసం వెదికారు.

యజ్ఞశాల ఎదురుగా స్వామి చెప్పిన ఆనవాళ్ళతో నిలబడి, హరినామ స్మరణ చేస్తున్న బాలుని చూసి, నీ పేరు ఏమని అడిగారు. ఆ బాలుడు 'అన్నమయ్య' అని చెప్పి మునికి సాష్టాంగ నమస్కారాలు చేశారు. ఆ ముని అన్నమయ్యకు వేద శాస్త్రానుసారంగా విష్ణు దీక్షను, పంచ సంస్కారాలను ఇచ్చారు. అన్నమయ్య ఆ ముని ఆనతిమేరకు ఆయనతో కలిసి భుజించారు. ఆ యోగి తనకు కలిగిన స్వామి దర్శనాన్ని అన్నమయ్యకు వివరించారు. సకలజీవుల్లో స్వామినే చూడాలని, 'సర్వం విష్ణుమయం' అనే సూక్తిలోని అంతరార్థాన్ని అన్నమయ్యకు బోధించారు.

అన్నమయ్య తిరుమలలో ఉన్నారనే విషయాన్ని అతని తల్లిదండ్రులు తిరుమలను సందర్శించిన యాత్రికుల ద్వారా తెలుసుకున్నారు. అన్నమయ్య తల్లి తిరుమలకు వచ్చి, ఇంటికి రమ్మని అన్నమయ్యను ప్రాధేయపడింది. ఇంటికి వెళ్ళాలో! వద్దో! అనే సందిగ్ధంలో అన్నమయ్య ఉండగా కలలో స్వామి "జనని వాక్యముద్రోయ జనదు కుమారా" (*శ్రీరంగాచారి, అంగలూరి. 1995:7.*) అని పలికిన మాటలకు బద్ధుడై, గురువు అనుమతితో అన్నమయ్య తల్లితో కలిసి తాళ్ళపాకకు వెళ్ళారు. స్థలం మారినప్పటికీ అన్నమయ్య గోవింద నామ స్మరణాన్ని, భగవద్ధ్యానాన్ని ఎన్నడూ మానలేదు.

## 1.10. అన్నమయ్యకు వివాహం చేయడం

అన్నమయ్యకు యుక్త వయస్సు రాగానే పెళ్ళి చేయాలని అతని తల్లిదండ్రులు నిశ్చయించారు. ఆ విషయమై తమ బంధువుల ఇంటికి వెళ్ళి, పిల్లనిమ్మని అడిగారు. వారు నిరాకరించి, ఎప్పుడూ 'గోవిందా' అని తిరిగే దాసరికి సంసారం పట్ల ఆసక్తి ఉండదని అవమానించారు. సాక్షాత్తూ ఆ శ్రీనివాసుడే వారికి కలలో కనబడి వివాహం కుదిర్చాడని ఒక ఐతిహ్యం ప్రచారంలో ఉంది. ఆ తరువాత వారు తమ తప్పులను తెలుసుకొని, అన్నమయ్యకు అక్కలమ్మ, తిరుమలమ్మ అనే ఇద్దరు కన్నెపిల్లలతో వివాహం జరిపించారు. గ్రంథకర్తలు కొందరు సాక్షాత్తూ స్వామివారే అన్నమయ్య పెళ్ళి పల్లకీని మోశారని రాశారు.

అన్నమయ్య సంసార జీవితంలో ఉన్నప్పటికీ హరినామ సంకీర్తనలు చేయడం మాత్రం మానలేదు. భారత, రామాయణ, పురాణేతిహాసాది గ్రంథాలలోని మర్మాలను, వేద శాస్త్ర రహస్యాలను తన కీర్తనలలో పొందుపరచి, నాట్యం చేస్తూ పాడేవారు. ఆ మధురగానాన్ని విన్న ప్రజలు 'తుంబురుడో, నారదుడో' అన్నమయ్య రూపంలో వచ్చి మనల్ని తరింపజేస్తున్నాడనుకొని పరవశులయ్యేవారు.

## 1.11. అన్నమయ్య అహోబిల క్షేత్రంలో విద్యనభ్యసించడం

గురువైన ఘనవిష్ణువు అనుమతితో అహోబలంలో శఠగోపయతి సమక్షంలో రామానుజుల విశిష్టాద్వైత సిద్ధాంత గ్రంథాలను, *నాలాయిర* ప్రబంధాన్ని అన్నమయ్య పఠించారు. అనేక శాస్త్ర రహస్యాలను, లక్ష్మీదేవి తత్త్వాన్ని శఠగోపయతి ద్వారా

తెలుసుకున్నారు. లక్ష్మీదేవి తత్త్వం వైష్ణవులకు అత్యంత ముఖ్యమైంది. ఈ లోకంలో సాధారణంగా పిల్లలకు తండ్రికంటే తల్లి దగ్గరే ఎక్కువ చనువు ఉంటుంది. అందుకని తమకు కావాల్సిన వాటిని తల్లి దగ్గర ఏకరువు పెడతారు. అమ్మ ఆ విషయాలను తన భర్త సంతోషంగా ఉన్నప్పుడు విన్నవించి సాధిస్తుంది. అలాగే వైష్ణవులు కూడా సరాసరి దేవుని దగ్గర కాకుండా లక్ష్మీదేవి దగ్గర ఆ కోర్కెలను విన్నవించుకుంటారు. ఇదే లక్ష్మీదేవి తత్త్వం. ఈ తత్త్వంపై వైష్ణవమంతా ఆధారపడి ఉంటుంది. ఈ తత్త్వాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి సంకీర్తనల రచనలో అన్నమయ్య పరిణతి సాధించారు.

## 1.12. అన్నమయ్య, నరసింగరాయల స్నేహం

టంగుటూరి అధిపతి సాళువ నరసింగరాయలు అన్నమయ్య ఖ్యాతిని గురించి విన్నాడు. అతడు విష్ణు భక్తుడు కావడంచేత తన పరివారంతో, విలువైన కానుకలతో తాళ్ళపాక చేరి అన్నమయ్యను తన ఊరికి వచ్చి గురువుగా ఉండాల్సిందిగా విన్నవించుకున్నాడు. అందుకు అన్నమయ్య అంగీకరించి, రాజు ఏర్పాటు చేసిన పల్లకిలో టంగుటూరికి వెళ్ళారు. అక్కడ కేశవమూర్తి ఆలయాన్ని దర్శించి, తనకు ఏర్పాటు చేసిన నివాసానికి వెళ్ళారు. నరసింగరాయలు అన్నమయ్యను గురువుగా, స్నేహితునిగా భావించాడు. సకల సౌకర్యాలు కల్పించి అన్నమయ్యకు అనేక భోగభాగ్యాలు కలగజేశాడు. ఆయనతో అంతరంగ విషయాలు ముచ్చటిస్తూ ఉండేవాడు. యుద్ధ సమయంలో అన్నమయ్య అనుమతి తీసుకొని వెళ్ళేవాడు. నరసింగరాయలు అనేక విజయాలు సాధించి తన రాజధానిని టంగుటూరు నుండి పెనుగొండకు మార్చాడు. అన్నమయ్యను తనతోటి తీసుకెళ్ళి సంకీర్తనలు పాడించుకొనేవాడు. ఆ పాటలు విని నరసింగరాయలు కాళిదాసాది కవులలో కూడా ఇంత మంచి భావాలను చూడలేదని అన్నమయ్యను పరిపరివిధాలుగా మెచ్చుకొని సత్కరించి గౌరవించాడు. అన్నమయ్యకు పచ్చల కడియాలు, బంగారు కచ్చడాలు, వింజామరల జోడు ఇంకా అనేక ఆభరణాలను కానుకలుగా ఇచ్చాడు. అన్నమయ్యకు ఒక నివాసాన్ని ఏర్పరచాడు. ఆ విధంగా నరసింగరాయలు ప్రతి రోజు అన్నమయ్య చేత సంకీర్తనలను పాడించుకొని వినేవాడు.

## 1.13. నరసింగరాయలు అన్నమయ్యను చెరసాలపాలు చేయడం

ఒకరోజు రాజు తన సామంతులతో, మంత్రులతో కొలువుదీరాడు. అన్నమయ్యను పిలిపించుకొని సంకీర్తన పాడమని కోరాడు. అప్పుడు అన్నమయ్య...

"యేముకో చిగురుటధరమున యడనడ కస్తూరి నిండెను

భామిని విభునకు రాసిన పత్రిక కాదుకదా!" (*సీతామహాలక్ష్మి, ఎల్. వి. ఎస్. ఎస్.1993. :29.*) అనే శృంగార రసాత్మకమైన కీర్తనను ఆలపించారు. రాజు చాలా సంతోషించాడు. అతడు అన్నమయ్య మనస్సు ఎరిగి కూడా తన మీద అలాంటి సంకీర్తన ఒకదాన్ని చెప్పమని కోరాడు. ఆ మాట వినగానే అన్నమయ్య తన రెండు చెవులు మూసుకొని 'హరి హరీ' అంటూ "నరహరి కీర్తన నానిన జిహ్వా ఒరుల నుతింపగ నోపదు జిహ్వా" (*సంపుటం2.141:97*) 'నారాయణుని కీర్తించే నా నాలుక నరులను కీర్తించదు.' అని చెప్పారు. రాజు అందుకు కోపపడి 'సకల సంపదలు కలుగజేసిన నా మీద నీకు అంత చులకన భావనా?' అని తన పరివారం, అక్కడి మంత్రులు చెప్పే మాటలను లక్ష్యం చేయకుండా అన్నమయ్య చేతులకు సంకెళ్ళను తగిలించి చెరసాలలో వేయించాడు. భటులు రాజుకు భయపడి కాపలా కాశారు. అయితే, అన్నమయ్య ఇదంతా భగవదేచ్ఛగా భావించారు.

'నన్ను కాపాడుకోవడం నీ బాధ్యత కాదా!' అని ఆ దేవదేవుని ఆ సందర్భంలో ఆక్షేపించారు. ఇక్కడ నరసింగరాయలు అన్నమయ్య మీద నిర్లక్ష్యం అనే నేరారోపణ చేయగా, అన్నమయ్య ఆ వేంకటేశ్వరుణ్ణి నాపై నీకింత నిర్లక్ష్యమేమిటి? అని నిలదీశారు. "సంకెల బెట్టిన వేళ చంప బిలిచిన వేళ అంకిలిగా అప్పులవారాగిన వేళ వెంకటేశు నామమే విడిపించ గతిగాక మంకుబుద్ధి పొరలిన మరి లేదు తెరగు" (*సంపుటం1.159:107*) అని పాడారు. అలా ఆయన సంకీర్తనలు పాడాగానే ఆశ్చర్యకరంగా తన చేతికి ఉన్న సంకెళ్ళు ఊడిపోయాయి.

ఇది మోసమేమోనని రాజు మళ్ళీ అన్నమయ్యకు సంకెళ్ళు వేయించాడు. మళ్ళీ అన్నమయ్య అవే సంకీర్తనలు చెప్పగానే వాటంతట అవి విడిపోయాయి. అప్పుడు నరసింగరాయలు అన్నమయ్య పాదాలపై పడి "అపరాధినపరాధినన్నమాచార్యా కృపజూడు నను నీవు కృపన శరణ్యా" (*సీతామహాలక్ష్మి, ఎల్. వి. ఎస్. ఎస్.1993:32.*) అంటూ 'నీవు

క్షమిస్తే శ్రీనివాసుడు క్షమిస్తాడు. నీవు కోపిస్తే ఆయన కోపపడతాడు. నా తప్పులను దయతో క్షమించ'మని అర్థించాడు. సతీసమేతంగా అన్నమయ్యను పూజించాడు. అప్పుడు అన్నమయ్య ఇదంతా ఆ శ్రీనివాసుని కటాక్షంగా భావించి రాయలుతో పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదు. ఇకనుంచి భక్తుల పట్ల అనుచితంగా ప్రవర్తించవద్దు. ఆ శ్రీనివాసుడే నిన్ను రక్షిస్తాడని చెప్పి రాజునుండి శెలవు తీసుకున్నారు.

నరసింగరాయల రాజ్యాన్ని వీడినప్పటినుండి అన్నమాచార్యులు ఆయా ప్రదేశాలలోని పుణ్యక్షేత్రాలు, గ్రామాలు తిరిగి, తన సంకీర్తనల ద్వారా వైష్ణవాన్ని, రామానుజుల తత్త్వాన్ని ప్రచారం చేశారు. 'సకల దేవతలు నిన్ను కొనియాడుతుండగా నిన్ను పొగడడానికి నేను ఎంతవాడను!' అని ఆ వేంకటేశ్వరుని వినయంతో ప్రార్థించారు. తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవాలలో స్వామిని సేవించసాగారు.

## 1.14. అన్నమాచార్యుని రచనలు

తెలుగులో పదకవితా పితామహుడిగా పేరు పొందిన అన్నమయ్య దాదాపు *32000 సంకీర్తనల*ను రచించారు. తన 16వ ఏటనే స్వామి ఆజ్ఞమేరకు రోజుకి ఒక్క సంకీర్తన చొప్పున చెప్పేవారు. మొత్తంగా అన్నమయ్య '32000 పరమతంత్రములు' అని పేర్కొనదగిన సంకీర్తనలు రచించారు. అది అతిశయోక్తిగా కొందరు విమర్శకులు భావిస్తున్నారు. చినతిరుమలాచార్యులు కొన్ని సంకీర్తనలు యోగమార్గంలోను, కొన్ని శృంగారాత్మకంగా, కొన్ని వైరాగ్య రీతిలో రాయబడ్డాయని అన్నమయ్య సంకీర్తనలను లక్షణాత్మకంగా వింగడించి వివరించారు. ప్రస్తుతం మనకు 14000 సంకీర్తనలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఆ సంకీర్తనలను తిరుమల తిరుపతి దేవస్థానములవారు సంపుటీకరించి ప్రజలకు అందుబాటులో ఉంచారు.

అన్నమయ్య తదనంతరం తన వంశీయులైన చినతిరుమలయ్య, పెదతిరుమలయ్య ఆ సంకీర్తనలను విజయనగర రాజుల సహకారంతో రాగి రేకులపై చెక్కించి, తిరుమల భాండాగారంలో భద్రపరిచారు. 32000 సంకీర్తనలను రచించడంవల్ల అన్నమయ్య 'పంచాగమ సార్వభౌముడు', 'హరికీర్తనాచార్యుడు', 'పదకవితా పితామహుడు' అనే

బిరుదులు పొందారు. ఈ సంకీర్తనలను వేటూరి ఆనందమూర్తిగారు 'వైష్ణవ తత్త్వము ముల్లెగట్టిన ముత్యాల మాటలు'గా వర్ణించారు. కాలక్రమంలో ఆ రేకులలో చాలావరకూ పామరుల చేతుల్లో పడ్డాయని, వారు ఆ రాగిని కరిగించి గృహోపకరణాలుగా చేసుకున్నారని, అందువల్ల చాలా సంకీర్తనలు కాలగర్భంలో కలిసిపోయాయని పరిశోధకులు తేల్చారు. తక్కిన సంకీర్తనలైనా మనకు లభించడానికి వేటూరి ప్రభాకరశాస్త్రి చేసిన కృషియే కారణం.

ఈ సంకీర్తనలేగాక అన్నమయ్య ఇతర కావ్యాలు రాసినట్లుగా మనకు ఆధారాలు ఉన్నాయి. ప్రప్రథమంగా అమ్మ దర్శనం జరిగినప్పుడు అలమేలుమంగమ్మపై *వేంకటేశ్వర శతకాన్ని* చెప్పారు. *శృంగారమంజరి* అనే ద్విపద కావ్యాన్ని సాళువ నరసింగరాయల రాజ్యాన్ని వీడిన తరువాత రచించారు.

> "శృంగారమంజరిజేసి శేషాద్రి
> శృంగారవాసునకు నర్పించి యిచ్చుటయు
> నాఁడుచుఁబతకమాకన్నల జోల
> పాడగ నాఁడెల్లబసిబిడ్డనైతి
> నాకృష్ణమాచార్యనధ్యాత్మవినుతి
> రాకఁగొన్నాళ్ళు విరక్తుండనైతి
> జగతి నీ శృంగారసంకీర్తనముల
> కగపడి ప్రాయఁపువాఁడనయితి
> నని వెంకటేశ్వరుడన్నమాచార్యు
> గనుఁగొని వాకృచ్చి గారవించుటయు" (*ప్రభాకరశాస్త్రి, వేటూరి. 2008:58*)

పై పద్యం అన్నమయ్య *శృంగారమంజరి* అనే పద్య కావ్యాన్ని రచించి, వేంకటేశ్వరాంకితం చేసినట్లుగా తెలియజేస్తుంది. ఈ పద్యంలో అన్నమయ్య కృష్ణమాచార్యులను స్మరించారు. అన్నమాచార్యులు సంస్కృతంలో *సంకీర్తనా లక్షణసారం* అనే గ్రంథాన్ని రచించారు. నేడు అది అలభ్యం. కానీ చినతిరుమలయ్య ఆ గ్రంథాన్ని తెలుగులో పద్య రూపంలో అనువదించారు. అది మనకు అందుబాటులో ఉంది. అన్నమయ్య దాదాపుగా ద్వాదశ శతకాలను రచించారు. కానీ నేడు ఒక్క శతకం లభిస్తోంది. అన్నమయ్య రచించిన *ద్విపద రామాయణం*, *వేంకటాద్రి మాహాత్మ్యం* అనే కావ్యాలు అలభ్యాలు.

తాళ్ళపాక వంశంలో అందరూ కవులు, గాయకులు. అన్నమయ్య భార్య తిమ్మక్క *సుభద్రా కళ్యాణం* అనే కావ్యాన్ని రచించి తొలి తెలుగు కవయిత్రిగా పేరు పొందింది. *అన్నమయ్య చరిత్రము* అనే గ్రంథాన్ని చిన్నన్న ద్విపదలో రచించారు. దాన్ని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పరిష్కరించి ఒక పీఠికను రాశారు. అది లభిస్తోంది. అన్నమయ్య వంశీయులు సంకీర్తనా రచన చేసినప్పటికీ తత్సంబంధిత ఆధారాలు మనకు లభించడంలేదు. వారు కూడా ఆ సంకీర్తనలకు సంబంధించిన వివరాలను పొందుపరచలేదు.

## 1.15. అన్నమాచార్యుని మహిమలు

అన్నమాచార్యుని మహిమలకు సంబంధించిన కొన్ని కథలు తిరుపతి పరిసర ప్రాంతాలలో ప్రచారంలో ఉన్నాయి.

"కరము జీడిపులుసుగలిగిన మామిడి కరముసోకినయంతనే
సరవి జక్కెరవలె జవిగలిగించువాని చనవరి సుతుఁడితడే"

(*ప్రభాకరశాస్త్రి, వేటూరి. 2008:62.*)

వేంకటాద్రికి సమీపంలో ఉన్న మర్లుంకు అనే అగ్రహారంలో అన్నమయ్య ఒక జీడి మామిడి చెట్టునుండి కొన్ని ఫలాలను కోసి, స్వామికి సమర్పించి, ఆయన తిన్నారు. ఆ కాయలు చాలా పుల్లగా ఉండడం చూసి అన్నమయ్య వేంకటేశ్వరుని తీపి మామిళ్ళు దయచేయమని ప్రార్థించారు. ఆ వెనువెంటనే ఆ చెట్టు తియ్యని మామిళ్ళను ఇచ్చిందట.

అన్నమయ్య మహిమలను గురించి విన్న ఒక బ్రాహ్మణుడు తన కూతురి వివాహంకోసం ధనం సమకూరేటట్లుగా దీవించమని అన్నమయ్యను కోరాడు. అన్నమయ్య దీవించారు. కానీ ఆ బ్రాహ్మణుడు ఎవరి దగ్గరకు వెళ్ళినా అతనికి మొండిచేయ్యి ఎదురైంది. అతడు మళ్ళీ అన్నమయ్యను వేడుకోగా అన్నమయ్య అతనిని దీవించి పంపించారు. ఆ బ్రాహ్మణుడు వీధి వెంట వెళుతుండగా ఒక మహారాజు అతనిని ఆదరంతో పిలిచి అడిగినంత ధనాన్ని ఇచ్చాడు. ఆ సమాచారాన్ని విన్న ప్రజలు అన్నమయ్య పాదరక్షలను వారి తలలమీద పెట్టుకొని ఆపదలను తీర్చుకున్నారట.

## 1.16. అన్నమయ్య దర్శించిన క్షేత్రాలు ; అనుభవాలు

అన్నమయ్య దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి పొందిన క్షేత్రాలను దర్శించారు. డా. ముట్నూరి సంగమేశంగారు తన *అన్నమయ్య* అనే లఘు గ్రంథంలో శ్రీరంగం నుండి శ్రీ జగన్నాథం వరకూ అన్నమయ్య పర్యటించారని చెప్పారు. ఏ ఆలయాన్ని దర్శించినా ఆ దేవతా స్వరూపాలలో ఆయనకు వేంకటేశ్వరుడే కనిపిస్తాడు. అందుకే ఆయన కీర్తనలలో 'వేంకటరాముడు', 'వేంకట నరసింహుడు', 'వేంకట కృష్ణుడు', 'రాధా వేంకట కృష్ణుడు', 'రాధా వేంకటరమణుడు' అనే ముద్రలు కనిపిస్తాయి. అన్నమయ్య అహోబిలంలో రామానుజుల విశిష్టాద్వైత తత్త్వాన్ని అభ్యసించారు. తాళ్ళపాకకు సమీపంలో ఉన్న ఒంటిమిట్ట రఘునాథ ఆలయాన్ని దర్శించి అక్కడ రాముడు, హనుమంతుల మీద ఎన్నో కీర్తనలు చెప్పారు. అన్నమయ్య సందర్శించిన తిరుమల, తిరుపతి పరిసరాలలో కొలువైన పుణ్యక్షేత్రాలను గురించి కింది ఉపవిభాగాల్లో గమనించవచ్చు.

### 1.16.1. తాళ్ళపాక గంగమ్మ

తిరుమలకు వెళ్ళే మార్గంలో అన్నమయ్య మొట్టమొదట గంగమ్మ అనే గ్రామ దేవతను దర్శించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ఈమె 'తాళ్ళపాక గంగమ్మ'గా పిలువబడుతోంది. తిరుపతికి వచ్చే యాత్రికులు ఆమెను దర్శించుకొని పోవడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి సంవత్సరం తిరుపతి పరిసర ప్రాంతాలలో గంగమ్మ జాతర చేస్తారు.

### 1.16.2. తల్లేరు గుండు

తిరుమలకు కాలి నడకన వెళ్ళే యాత్రికులు మొట్టమొదటిగా కొండ కింద ఉన్న తల్లేరు గుండును దర్శిస్తారు. దీనిని తలయేరుగుండు అని కూడా అంటారు. ఆ గుండుకు తమ తలలను, మోకాళ్ళను ఆనించి నొప్పులు రాకుండా చూడమని ప్రార్థిస్తారు. దీనిని అన్నమయ్య దర్శించారు.

### 1.16.3. శ్రీవారి పాదాలు

తిరుమలనంబి ఉదయాన్నే స్వామిని సేవించి తలయేరు గుండు దగ్గర ఉన్న మండపానికి వచ్చారు. రామానుజులు గోవిందరాజ సన్నిధి నుండి మండపానికి వచ్చి

తిరుమలనంబి దగ్గర రామాయణ రహస్యాలను తెలుసుకొనేవారు. ఒకనాడు తిరుమలనంబి స్వామికి మధ్యాహ్నపు కైంకర్యం జరగడంలేదని దిగులుపడ్డారు. స్వామి కలలో అతనికి కనిపించి 'నీకు ఆ బాధ తీరిపోతుంద'ని అభయమిచ్చాడు. మరునాడు రామానుజులకు నంబి ఉపదేశించిన తరువాత మధ్యాహ్నం దివ్య కుసుమం, తులసి, కస్తూరి, సుగంధాలతో స్వామి పాదాలు ప్రత్యక్ష్యమయ్యాయి. అలా శ్రీవారి పాదాల ప్రతిష్ఠ జరిగింది. అన్నమయ్య ఆ పాదాలను దర్శించి ఉప్పొంగిపోయారు.

## 1.16.4. కురువనంబి కథా శిల్పాలు

కురువనంబి తిరుమలకు సమీపంలో కుండలు చేసేవారు. ఆయన స్వామిని తిరుమలకు వచ్చి పూజించడానికి తీరేది కాదు. స్వామి విశ్వాంతర్యామి అని భావించి మట్టితో ఒక విగ్రహాన్ని చేసి, ప్రతిష్ఠించి పూజించేవారు. తొండమాన్ చక్రవర్తి తిరుమలలో బంగారుపూలతో స్వామిని పూజించేవారు. ఒకరోజు స్వామి పాదాలపై మట్టిపూలు ఉండడాన్ని గమనించి వేగుల ద్వారా దానికి గల కారణాలను తెలుసుకున్నారు. రాజు తన గర్వాన్ని వదిలి నంబి దగ్గర స్వామి మహిమలను గురించి తెలుసుకున్నారు. ఆ ప్రదేశాన్ని అన్నమయ్య దర్శించారు.

## 1.16.5. మోకాళ్ళ పర్వతం

కర్పూర కాలువ దాటాక మోకాళ్ళ పర్వతం ఉంటుంది. ఒక్కొక్క మెట్టు మోకాలంత ఎత్తులో ఉంటుంది కాబట్టి దీనికి ఆ పేరు వచ్చింది. అన్నమయ్య అక్కడకు రాగానే ముందుకు వెళ్ళలేక నీరసించి బండమీద పడిపోయారు. అలమేలుమంగమ్మచే ఊరడించబడి ఆ స్వామిని దర్శించారు.

## 1.17. ఇతర వాగ్గేయకారులు

అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా తెలుగు భాషకు ఎంతో సేవ చేశారు. ఆయన పదాలు పాడుకోవడానికి సులభంగా ఉండడంవల్ల ఆ పదాలు రానివారు, వాటి గురించి తెలియని వారు తెలుగునాట ఉండరు. సంస్కృతంలో ప్రసిద్ధ పదకర్త జయదేవుని మార్గాన్ని అనుసరించి అన్నమయ్య తెలుగులో సంకీర్తనలను చేశారు. అన్నమయ్య తదనంతరం వచ్చిన

కొందరు వాగ్గేయకారులు  ఈ మార్గాన్ని అనుసరించారు. వారిని గురించి క్లుప్తంగా వివరించే ప్రయత్నం ఈ కింది ఉపవిభాగాలలో చేయబడ్డది.

## 1.17.1. జయదేవుడు

జయదేవుడు అన్నమయ్యకు రచనలో మార్గదర్శకుడు. గొప్ప ప్రతిభాశాలి. సంస్కృత వాగ్గేయకారులలో జయదేవుడు అగ్రగణ్యుడు. తన *గీతగోవిందం* అనే కావ్యంలో సంగీత, సాహిత్యాలను నాట్యానికి అనుగుణంగా రచించిన వాగ్గేయకారుడు. జయదేవుడు అనగానే మనకు *అష్టపదులు, రాధా మాధవ ప్రణయం* గుర్తుకు వస్తాయి. 1116–1190 వరకూ గౌడ దేశాన్ని పాలించిన లక్ష్మణసేన మహారాజు ఆస్థానంలోని పంచరత్నకవులలో ఒకడు. ఈయన జన్మ విషయంలో కొన్ని వాదాలున్నాయి. ఆచార్య బాలాంత్రపు రజనీకాంతరావుగారు 1090–1153 మధ్య కాలం అని అభిప్రాయపడగా ఎ. బి. కీట్ పండితుడు దాన్ని వ్యతిరేకిస్తూ సంస్కృత కావ్యాల చరిత్రల ఆధారంగా లక్ష్మణసేనుడు 12వ శతాబ్దానికి చెందిన వాడు గనుక జయదేవుడు కూడా 12వ శతాబ్దివారని అన్నారు. డా. వైద్యుల కృష్ణారావుగారు 1160 ప్రాంతంలో జయదేవుడు *గీతగోవిందం* కావ్యాన్ని రచించారు. గనుక అతని జన్మకాలం 1120 ప్రాంతం కావచ్చునని ఊహించారు. జయదేవుని జన్మ స్థలం ఇందుబిల్వం. కొన్ని శ్లోకాల్లో ఈ ప్రాంతం పేరు కేందు బిల్వం, కిందుబిల్వం, బిందుబిల్వం అని చెప్పబడింది. ఈ బిందుబిల్వం జగన్నాథ క్షేత్ర సమీపంలో ఉంది. కొందరు ఇది వంగ దేశంలోనిదిగా పేర్కొంటున్నారు. అక్కడ ప్రతి సంవత్సరం జయదేవుని జన్మదినం జరుపుకుంటారట. జయదేవుడు ఓఢ్ర దేశంలో పుట్టి, వంగదేశంలో ప్రసిద్ధుడయ్యారని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. కానీ అతడు వంగదేశీయుడిగా డా. వైద్యుల కృష్ణారావుగారు నిశ్చయించారు. తల్లిదండ్రులు రమాదేవి, భోజదేవుడు. భార్య పద్మావతి అని *గీతగోవిందం* కావ్యం ద్వారా తెలుస్తోంది. జయదేవుడు గానం చేస్తూండగా పద్మావతి నాట్యం చేస్తూ ఉండేదట. *గీతగోవిందం*లో 12 సర్గలు, 24 అష్టపదులు ఉన్నాయి. కథా గమనానికి తగినట్లుగా శ్లోకాలున్నాయి. రాధా కృష్ణులు ఇందులో నాయికా నాయకులు. కానీ అష్టపదులను విడివిడిగా చూస్తే అచ్చం అన్నమయ్య కీర్తనలలాగానే ఉంటాయి. *చంద్రాలోకం*, *రీతి రమణి*, *కారికానందం*, *తత్త్వ చింతామణి* అనే గ్రంథాలను జయదేవుడే రాశాడని ప్రతీతి ఉంది. కానీ *శృంగార మాధవం* రచయిత, *ప్రసన్న రాఘవం* నాటక కర్త

వేర్వేరు జయదేవ నామధారులని, *గీత గోవింద* కర్త కాదని పండితులు అభిప్రాయపడుతున్నారు. కొందరు జయదేవుడే తదనంతర జన్మలో అన్నమాచార్యునిగా జన్మించారనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## 1.17.1.1. అన్నమయ్య జయదేవుల మధ్య సాదృశ్యాలు

1. జయదేవుడు పాడగా పద్మావతి ఆడింది. అలాగే అన్నమాచార్యులు పాడి, ఆడి తరించారు.
2. వీరిరువురు ఒకే కాలంలో సంగీత సాహిత్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన వాగ్గేయకారులు.
3. ఇరువురూ భక్తి శృంగార రసాలను గ్రహించి రచనలు చేసి భగవదైక్యం పొందేందుకు కృషి చేసినవారే.
4. ఇరువురు శృంగారరసంలోని మధురభక్తిని ఆపాదించారు.
5. నాయికా నాయకుల విరహాన్ని, ఐక్యాన్ని, వారి ప్రణయ తాపాన్ని, అలౌకిక శృంగార పద్ధతిలో వివరించారు.
6. దర్శన, స్పర్శన, ఆలింగనాది శృంగారాలను, సురతి, సంభోగ శృంగారాన్ని ఆస్వాదయోగ్య రీతిలో వర్ణించారు.
7. శృంగారరస వర్ణనలో హాస్యాన్ని కూడా చక్కగా జోడించారు.
8. జయదేవుని భక్తి స్తుత్యాత్మకంగా ఉంటుంది. శరణాగత భక్తిలో సర్వం భగవంతునికి అర్పించుకోవడం అన్నమయ్య భక్తిలో దాగి ఉన్న గుణం.
9. ఇద్దరూ నవవిధ భక్తి మార్గాలను అనుసరించి రచనలు చేశారు.
10. ఈ ఇరువురూ దశావతార వర్ణన అత్యంత మనోజ్ఞంగా చేశారు.
11. ఇద్దరూ జీవాత్మ, పరమాత్మ ఐక్యాన్ని చక్కగా వర్ణించారు.
12. ఇద్దరూ నాయికగా, దూతికగా, చెలికత్తెగా, ఇంకా అనేక విధాలుగా తమను తాము చిత్రించుకున్నారు.
13. ఇద్దరూ తమ పదాలను సంగీత, నాట్య శాస్త్రాల మేళవింపుగా మలిచారు.
14. వైష్ణవ మత ప్రచారానికి ఇద్దరి పదాలు ఉపకరించాయి.

15. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణార్థం విష్ణువు అవతరించిన సందర్భాలను ఇద్దరూ తమ పదాలలో పొందుపరిచి తమ భక్తిని చాటుకున్నారు.
16. ఈ వర్ణనల్లో జయదేవుడు శ్రీ కృష్ణావతారంతోబాటు బలరామావతారాన్ని వర్ణించారు. అలాకాకుండా అన్నమయ్య కృష్ణావతారాన్ని, బలరామావతారాన్ని ప్రత్యేకంగా వర్ణించారు. గౌతమబుద్ధుడిని ఏకాదశ అవతారాల్లో ఒకరిగా గ్రహించారు.

## 1.17.2. కృష్ణమాచార్యులు

కీర్తనలను రచించకుండా ఒక లయతో కూడుకున్న వచనాలను రాసి ప్రఖ్యాతి పొందిన వారు సింహగిరి నరహరి వచనకర్త కృష్ణమాచార్యులు. "ఓమ్ నమో నారాయణా, సింహగిరి నరహరి నమో నమో దయానిధి" (*రాధాకృష్ణ, బూసురపల్లి.2016:15.*) అనే మకుటంతో వచనాలను రచించారు. వీటిని 'తాళగంధి గద్య ప్రబంధాలు'గా పండితులు పేర్కొంటున్నారు. కృష్ణమాచార్యులు తన వచనాలలో ఎన్నో నీతి, భక్తి మార్గాలకు సంబంధించిన విశేషాలను పొందుపరిచారు. కృష్ణమాచార్యులు రెండవ ప్రతాపరుద్ర మహారాజుకు సమకాలీనుడు. వీరి స్వగ్రామం మహబూబ్‌నగర్ జిల్లా సంతూరి. దీనినే 'సంతానపురం' అని అంటున్నారు. పుట్టుకతోనే ఇతడు అంధుడు. కృష్ణకువ్వర్ అనే ఉత్తర భారతదేశానికి సంబంధించిన వారు చేరదీసి పెంచారు. ఒకరోజు నరసింహస్వామి పాలు తెచ్చి ఇవ్వగా అవి తాగిన కృష్ణమాచార్యులు ఆ చేతులతో తన కళ్ళు తుడుచుకోగా అంధత్వం పోయిందని చెబుతారు. ప్రతాపరుద్రుడు ఈయనను కనిగిరి సీమలో 50 గ్రామాలకు అధిపతిని చేసినట్లు, తద్వారా కనిగిరిలో ఎక్కువకాలం నివసించినట్లు తెలుస్తోంది. ఈ వచనాలలో రామ నామాలతోబాటు నృసింహ నామాలు, తులసీ మాహాత్మ్యం కూడా రచించారు. తరువాతి కాలంలో వచన రచనకు ఉపక్రమించిన పెదతిరుమలాచార్యులు తదితర రచయితలకు కృష్ణమాచార్యులే మార్గదర్శకులు. అన్నమయ్యకు సంస్కృతంలో జయదేవుడు, తెలుగులో కృష్ణమాచార్యులు మార్గదర్శకులు.

## 1.17.3. పురందరదాసు

కర్ణాటక సంగీతంలో ఆద్యుడుగా పరిగణించదగినవారు పురందరదాసు. నాదోపాసకుడైన త్యాగరాజు పురందరదాసును

"దురిత వ్రాతము వెల్లను పరిమార్చిడి
హరిగుణములబాడుచునెప్పుడున్
పరవశుడై వెలయు
పురందరదాసు మహిమలను దలచెద మదిలోన" (*గంగప్ప, ఎస్.1994:94.*)

అని తన *ప్రహ్లాద భక్తి విజయం*లో స్తుతించారు. అంతేగాక పురందరదాసును గురువైన వ్యాసరాయలు 'దాసరందరే పురందరదాసరయ్యా' దాసు అంటే పురందరదాసేనయ్యా అని పొగిడారట. పురందరదాసు తల్లిదండ్రులు కమలాంబ, వరదప్ప నాయకుడు. అతని అసలుపేరు శ్రీనివాస నాయకుడు. అతని స్వగ్రామం పురందరగడం. పురందరదాసు కాలం 1484–1564 అని పండితులు అభిప్రాయపడుతున్నారు. పురందరదాసు అన్నమయ్యను దర్శించిన సందర్భంలో అన్నమయ్య పురందరదాసును విట్ఠలుడుగా సంభావించారని *అన్నమాచార్యుని చరిత్రము*లో చిన్నన్న పేర్కొనడాన్నిబట్టి పురందరదాసు జననం 1470–1564 సంవత్సరాల మధ్యకాలంగా ఆచార్య ఎస్. గంగప్పగారు పేర్కొన్నారు.

యుక్త వయస్సు రాగానే వరదప్ప నాయకుడు శ్రీనివాస నాయకుడికి ఉపనయనం చేయించాడు. వరదప్ప నాయకుడు వజ్రాలను పరీక్షించే వ్యాపారంలో నేర్పరి కావడం వల్ల ఆ విద్యను శ్రీనివాసనాయకుడికి నేర్పించాడు. 18 ఏళ్ళ వయస్సులో శ్రీనివాసనాయకునికి సంప్రదాయ కుటుంబంలో జన్మించిన సరస్వతీబాయితో వివాహం అయింది. తండ్రి మరణానంతరం ఆస్తిపాస్తులతోబాటు వజ్రాల వ్యాపారం కూడా శ్రీనివాసనాయకుని సొంతమైంది. కొద్ది కాలంలోనే వజ్రాల వ్యాపారంలో కోట్లు గడించి 'నవకోటి నారాయణ' అనే బిరుదును సంపాదించాడు.

ఇహలోక భోగాలపట్ల విముఖుడై శ్రీనివాసనాయకుడు తన ఆస్తిపాస్తులన్నింటిని పేదలకు పంచిపెట్టి, పేదరికాన్ని కోరి ఆచరించారు. తంబుర, తులసిమాల ధరించి దాసుగా మారిపోయారు. విజయనగరంలోని వ్యాసరాయలు అతనికి దీక్ష ఇచ్చారు. అప్పటినుండి శ్రీనివాస నాయకుడు పురందరదాసుగా, పురందర విట్ఠలుడుగా ప్రసిద్ధి చెందారు. 'పురందర విట్ఠలా' అనే ముద్రతో కృతిరచన చేశారు. ఆ కృతులలో ఉపనిషత్ సారమంతా ఇమిడి

ఉండడం వల్ల ఆ పదాలకు 'పురందరోపనిషత్తులు' అని పేరు వచ్చింది. ఆ పదాలు చాలా వరకూ కన్నడ భాషలో రచించబడ్డాయి. వేంకటేశ ముద్రతో అనేక పదాలను ఆయన రాశారు. ఒకనాడు శ్రీకృష్ణ దేవరాయలు పురందరదాసుకు కొంత ధనాన్ని, బంగారాన్ని కానుకలుగా ఇవ్వగా అవన్నీ పేదలకు పంచారు. రాయలు సరిపోలేదేమోనని ఇంకా ఇవ్వబోగా 'నీ భాగ్యము గొప్పదా? నా భాగ్యము గొప్పదా? తేల్చుకుందా'మని విట్ఠలునిపై తన భక్తి ప్రపత్తులను తెలియజేశారు.

పురందరదాసు రచించిన పదాలను చదువుతుంటే ఆ సాహిత్యంలోని సహజత్వం, భక్తిభావం తేటతెల్లమవుతుంది. ఈయన తన కృతులలో ఎన్నో సాదృశ్యాలను చెప్పారు. 'జాలియ మరవంతే', 'కెరయనీరను కెరుగజళ్ళి', 'దంతగళ్ళు సకలిదవు', 'కలియుగదోళు', 'విషయద విచారబిడు' లాంటి ఎన్నో కృతులలో నీతి, వైరాగ్య భక్తి మార్గాలను ప్రబోధించారు.

పురందరదాసు కర్ణాటక సంగీతంలో అనేక రాగాలలో కృతిరచన చేసి, ఇతర వాగ్గేయకారులకు మార్గదర్శకులయ్యారు. తద్వారా తరువాత వచ్చిన వాగ్గేయకారులందరూ పురందరదాసుకి ఋణపడి ఉన్నారు. వారి కృతిరచనలో పురందరదాసును అనుసరించారు. అలా కర్ణాటక సంగీతానికి వెలలేని సేవ చేశారు పురందరదాసు.

### 1.17.3.1. అన్నమయ్య పురందరదాసుల సమాగమం

తాళ్ళపాక చిన్నన్న తన *అన్నమాచార్య చరిత్రము* అనే గ్రంథంలో ఈ విధంగా పేర్కొన్నారు.

> "గద్య పద్యముల డెబ్బదిరెండుమంది
> యాద్యులచే కొనియాడించుకున్న రసికుండు శ్రీ పండురంగ విట్ఠలుడు
> కొసరెడు భక్తి చేకూరజేసేత
> న్నెనయసంధ్యలకు నిలియజేకొనుచుదనరు
> పురందర సాహోయివయుండు పరమభాగవతుడై పఱగుచునందు
> నందవర కులాగ్రగనియైన వైష్ణవోత్తముడు

సవరించు మురవైరి సంకీర్తనములు
కువలయంబున చేరుకొన్నమాత్రమున తలచిన
భూత భేతాళ పిసాచములు పారిపోవనిమ్మల
శుభంబెసగ విని కని తనలోన వెఱగందికొనుచు చన
తాళ్ళపాక శాసనుడన్నమయ్య వెన్నునిగానె భావించి
కీర్తించి సన్నుతిచేయనాచార్యవర్యుండు నీతని
విట్ఠలునిగా నయనంబుదలచి ప్రతిలేని గతుల సంభావించెనపుడు”

(*గంగప్ప, ఎస్. 1994:101-102.*)

కానీ విద్యారత్న ఆర్. ఎస్. పంచముఖిగారు అన్నమయ్య పురందరదాసులు కలవలేదని చెప్పారు. ఒక భక్తుడు ఇంకొకరిని దేవుడిగా తలచడం అసాధ్యమని, పైగా పురందరుని గురువైన వ్యాసరాయలు 1500 తరువాత విద్యా నగరానికి వచ్చారని చెప్పారు. కానీ వేటూరి ఆనందమూర్తి ఆయన వాదాన్ని కొట్టివేశారు. దానికి ఆయన చూపించిన కారణాలు ఏమంటే వ్యాసరాయలు తిరుపతిలో శ్రీనివాసాలయంలో 12 సంవత్సరాలు అర్చకత్వం చేశారు. 1486-1500 మధ్యకాలంలో అనేకసార్లు విజయనగరానికి వెళ్ళి వస్తూ ఉండేవారు. ఈ మధ్యలో పురందరదాసుకి విద్యానగరంలో దీక్ష ఇచ్చి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. దీనికి ఆధారంగా కన్నడంలో రచించబడ్డ *వ్యాసయోగ చరిత్రము* అనే గ్రంథాన్ని చూపించారు. వ్యాసరాయల శిష్యుడైన సోమనాథుని కృతమైన ఆ గ్రంథాన్ని అనుసరించే 1470 నుంచి వ్యాసరాయలు విజయనగరంలో ఆధ్యాత్మికాధిపత్యం జరిపినట్లు డా. ఎం. వి. కృష్ణారావు నిరూపించారు.

అన్నమయ్య, పురందరదాసుల భక్తి, భావాలు కొన్ని కీర్తనలలో కలిసిపోతాయి.

అన్నమయ్య “శరణు శరణు సురేంద్ర సన్నుత
శరణు శ్రీసతి వల్లభా” అంటే పురందరదాసు
“శరణు శరణు సురేంద్రవందిత
శరణు శ్రీపతి సేవితా
శరణు పార్వతీ తనయా
మూరితి సిద్ది వినాయకా” (*గంగప్ప, ఎస్.1994:116.*) అన్నారు.

అలాంటిదే అహోబిల నరసింహునిపై ఇంకో పదం చెప్పారు.

"శరణు శరణు సురేంద్ర వందిత శంఖచక్ర గదాధరా

శరణు సర్వేశ్వరనె అహోబల గిరియ నరసింహమూర్తిగె" (*పురందరదాసు పదగళు:71.*) అంతేగాక పురందరదాసు అనేకమైన క్షేత్రాలను దర్శించి, ఆయా దేవతలపై పదాలు రచించి పాడారు. మధ్వుడైన పురందరదాసు ఇతర దేవతారాధన చేయడం గుర్తించదగిన విషయం. పురందరదాసు పదాలు ప్రస్తుతం కేవలం అయిదారు వందలు మాత్రమే దొరుకుతున్నాయి. కర్ణాటక సంగీతానికి పునాదులుగా భావించి విద్యార్థులు అభ్యసించే సరళీ, జంట, ధాటి స్వరాలను, అలంకారాలను, పిల్లారి గీతాలను ఈయన రచించారు. పురందరదాసును 'కర్ణాటక సంగీత పితామహు'నిగా సంగీత పండితలోకం కీర్తిస్తోంది. ఈయన 'ఉగా, భోగా'లను (తాత్త్విక, వచన) రచించారు. ఈ ఉగ, భోగాలమీద బసవేశ్వరుని వచన ప్రభావం ఉందని సాహిత్య విమర్శకుల అభిప్రాయం. ఈ పదాలన్నింటినీ *పురందరదాసు పదగళు* అనే గ్రంథంగా వెలువరించారు.

## 1.17.4. క్షేత్రయ్య

తెలుగు వాగ్గేయకారుల్లో క్షేత్రయ్య పదకర్తగా ప్రసిద్ధుడు. ఆయన జన్మ స్థలం కూచిపూడి, ఘంటసాల గ్రామాల సమీపంలోని మువ్వ గ్రామం. క్షేత్రయ్య కాలం 1595-1660. కానీ ఆయన చివరి దశ గురించి ఇతమిద్ధంగా తెలియడంలేదు. అతడు మువ్వ గ్రామంలో వెలసిన గోపాలునిపై 'మువ్వగోపాలా' అనే మకుటంతో పదాలు చెప్పారు. చిన్నతనంలో అల్లరిచిల్లరిగా తిరుగుతున్న వరదయ్యకు ఒక యోగి గోపాల మంత్రోపదేశం ఇచ్చారు. క్షేత్రయ్య శృంగార దేవత అనుగ్రహం పొంది, 'మువ్వ గోపాలా' అనే మకుటంతో శృంగార పదాలు చెప్పారు. 'శ్రీపతి సుతుబారికినేనోపలేక' అనేది అతడి మొట్టమొదటి పదంగా పండితులు పేర్కొంటున్నారు. విజయనగర రాజ్య పతనానంతరం తంజావూరికి క్షేత్రయ్య వెళ్ళారు. అక్కడ నాయకరాజుల ప్రాపు పొందారు. ఇంకా ఆయన అనేక క్షేత్రాలు తిరిగి, ఆ క్షేత్ర మహిమలను తన పదాలలో పొందుపరిచారు. అనేక క్షేత్రాల సందర్శనంవల్లనే ఆయన 'క్షేత్రయ్య', 'క్షేత్రజ్ఞ' అనే పేర్లతో సాహిత్య లోకంలో స్థిరపడ్డారు. 'వేడుకతో నడుచుకున్న విఠరాయడే' అనే పదంవల్ల ఆయన దర్శించిన రాజ్యాలు తెలుస్తున్నాయి. క్షేత్రయ్య మధుర తిరుమలేంద్రుడు, విజయరాఘవ నాయకుడు, గోలకొండ పాదుషా, తుపాకుల కృష్ణ భూపతి, రఘునాథ రాయలును ఆశ్రయించారు.

తిరుమలేశునిచేత సత్కారం పొందారు. గోలకొండ ఆస్థానంలో తులసిమూర్తిని ఓడించి, నవాబుచేత సత్కరింపబడ్డారు.

క్షేత్రయ్య అనేక దేవాలయాలను సందర్శించారు. కంచి వరదునిపై 17 పదాలు, తిరుపతి వేంకటేశ్వరునిపై అయిదు, చిదంబరం జిల్లా గోవిందునిపై, తిరువళ్ళూరు వీర రాఘవునిపై, చబంది లింగనిపై మూడేసి పదాలు చెప్పినట్లుగా తెలుస్తోంది. చలువరాయడు, వేదపురి నిలయుడు, సత్తెపురి వాసుదేవునిపై రెండు పదాలు చెప్పారు. ఈ పదాలలో పల్లవి, అనుపల్లవి, చరణం ఉండేట్లుగా క్షేత్రయ్య రచించారు. ఈ పదాలలో తనను తాను భగవంతుని ప్రియురాలుగా ఎంచుకొని, తన విరహాన్నంతా ఆ మువ్వ గోపాలునిపై వ్యక్తపరిచారు. తద్వారా అలౌకిక శృంగారానికి పెద్ద పీట వేశారు.

క్షేత్రయ్య మువ్వ గ్రామ సమీపానగల కూచిపూడి గ్రామంలో నాట్యం నేర్చుకున్నారు. ఆ సమయంలో దేవదాసి అయిన మోహనాంగిని ప్రేమించారు. ఆ ప్రేమ విఫలమవడంచేత తన మోహావేశాన్ని భగవంతునిపై మళ్ళించారు. ఆ తరువాత తన మేనమామ కూతురు రుక్మిణిని వివాహం చేసుకున్నారు. మోహనాంగితో తన అనురాగం విఫలం కావడంచేత తన అంతరాంతరాలలోని శృంగారాన్నంతటిని ఆ భగవంతునిపై మళ్ళించారు. అందుకు మోహనాంగి, తన భార్య అయిన రుక్మిణి సహకరించారు. అందువల్ల క్షేత్రయ్య పదాలన్నీ సంయోగ శృంగారభరితాలుగా విలసిల్లాయి. మధుర భక్తికి క్షేత్రయ్య పదాలు నిలువెత్తు నిదర్శనాలు. ఆయన పదాలన్నీ ఆత్మాశ్రయంగా ఉండి, తన విరహాన్ని, వేదనను భగవంతునికి వ్యక్తం చేస్తూ ఉంటాయి.

"నిన్ను చూడగలిగేనిన్నాళ్ళకి
నిన్నుజూచి నాలుగైదు నెలలయ్యే మువ్వగోపాలా
నిన్న రేయి కలలోనా కన్నులు కట్టినట్లుండ
వెన్నుడా దిగ్గున లేచి వెదకి కానక
కన్నీరుచే పైటతడిసి కఱగి చింతనొందితి
నన్ను తలచిదోలేదో నా నోముఫలము నిన్ను"

(*శేషాద్రి, కోమాండూరి. 2006:113*)

అంటూ భగవంతునికి తాను దూరంగా ఉండరాదని తన బాధను వెళ్ళబోసుకున్నారు. విరహోత్కంఠిత అయిన మరొక నాయిక "తలపు వాని మీదాయె తలవాకిలి ఇల్లాయె" అని తనకు భగవంతునిపై ఉన్న అనురాగాన్ని సున్నితమైన భావాలతో అలతి అలతి పదాలతో వ్యక్తం చేశారు. తెలుగులో సామెతలను, పలుకుబడులను వాడడంలో కూడా క్షేత్రయ్య సిద్ధహస్తుడు. 'బాగాయె నీ వగలెల్లా.' అలాగే 'అంగడిబెట్టకుము', 'అడుగులకు మడుగులొత్తిన', 'అదురు బెదురు లేక అపురూప దర్శనంబాయె' మొదలైన తెలుగు పలుకుబడులను క్షేత్రయ్య చక్కగా ప్రయోగించారు. 'యీనిన పులివంటె కోపమెందుపోయెను', 'కలిమి లేములనగ కావడి కుండలు', 'తలవ్రాలెవరికి తప్పించవశయె', 'మేకవన్నె పులివంటి చెలులే' మొదలైన సామెతలను కూడా వాడారు క్షేత్రయ్య. అన్నమయ్యకు భక్తి కేంద్ర బిందువు దానికి అవరోధంగా ఉన్న శృంగారాన్ని జయించడం ఆయనకు ముఖ్యం. క్షేత్రయ్యకు శృంగారం కేంద్రబిందువు దాన్ని భక్తితో జయించడం ఈయనకు ముఖ్యమైంది. అందుకే క్షేత్రయ్య పదాలలో ప్రియుడు రాకపోతే కలత చెందే విరహోత్కంఠిత కనిపిస్తుంది. అన్నమయ్య 'యేముకో చిగురుటధరమున యడనడ కస్తూరి నిండెను' అనే కీర్తనలను పరిశీలిస్తే "క్షేత్రయ్య పాటలో కనిపించినవి అద్భుతమైన చిత్రాలైతే అన్నమయ్య పాటలో కనిపించినవి ఆశ్చర్యకరమైన భావ చిత్రాలు" (*శేషాద్రి, కోమాండూరి.2006:115*) అని అభిప్రాయపడ్డారు.

క్షేత్రయ్య పదాలు కైశికీ రీతిలో సంగీతాత్మకంగా ఉంటాయి. ఆ పదాలను గురించి ముందుగా పేర్కొన్నవారు సుబ్బరామ దీక్షితులు. ఈయన క్షేత్రయ్య పదాలను విలోమ కాలంలో పాడాలని చెప్పారు. కానీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు వీరి మాటలతో ఏకీభవించలేదు. ఆయన ఎక్కువగా రాగ, తాళాదులను సాగదీసి పాడడానికి ప్రాధాన్యం ఇచ్చారు. కానీ మరీ అంతలా సాగదీసి పాడితే సాహిత్యం దెబ్బ తింటుంది. నాట్యం చేసేవారికి ఒక్కొక్క స్వరంలో ఒక్కొక్క ముద్ర గోచరిస్తుంది. కనుక వారికి సరిపోతుంది. కానీ పాడేవారి తీరు వేరుగా ఉంటుంది. సాహిత్య రచనే వారికి పరమ ప్రామాణికం. కనుక సుబ్బరామ దీక్షితుల వాదననే ఎస్. గంగప్పగారు, మంచాల జగన్నాధరావుగారు సమర్థించారు. క్షేత్రయ్య పదాలను గురించి బాలాంత్రపు రజనీకాంతరావుగారు "కరుణరసంలో బాహ్యామాత్రమైన దుఃఖము, ఉపశమించుకోగల దుఃఖము, దుర్భరమైన

దుఃఖము, హృదయవిదారకమై బావురుమనే విలాపంతోకూడిన దుఃఖము ఈ వివిధ దుఃఖావస్థలుగల పదాలకు ముఖారి, ఘంట, నాద, నామక్రియ, పున్నాగవరాళి, కాంభోజి రాగాలను వాడుకున్నాడు.” (శేషాద్రి, కోమాండూరి.2006:115 అని చెప్పారు. ఇవే కాకుండా ప్రస్తారానికి పూర్తి అవకాశం లేని ‘కర్ణాటక కాపీ’, ‘సైంధవి’, ‘ఆహిరి’, ‘ఘంటా’, ‘నవరోజు’ వంటి రాగాలను కూడా సూక్ష్మ ప్రయోగాలలో ఉపయోగించారు. ఈ విధంగా కర్ణాటక సంగీతానికి క్షేత్రయ్య తన పదాలతో సొబగులను చేకూర్చారు. ఆచార్య శ్రీ గోపాల కృష్ణమూర్తిగారు అన్నమయ్య పదకవితా పితామహుడు కాగా క్షేత్రయ్య పదసంగీత పితామహుడని కొనియాడారు.

## 1.17.5. శ్యామశాస్త్రి

సంగీత మూర్తి త్రయంలో శ్యామశాస్త్రి మొదటివాడు. ఆయన తిరువారూర్‌లో జన్మించారు. ఈ సంగీత త్రిమూర్తులు తిరువారూర్ పరిసర ప్రాంతాలలో పుట్టడం ఒక విశేషమైతే వారి జననాలను గురించి వారి వారి తల్లిదండ్రులకు ముందుగానే ఏదో ఒకరకంగా తెలియడం మరింత విశేషం. తిరువారూర్‌లో ప్రతి రెండో శనివారం వేంకటేశ్వరుని భక్తుడు ఒకడు పూనకం వచ్చి వారికి కలగబోయే విశేషాలను గురించి తెలియజేసేవాడు. ఒకనాడు అతడు శ్యామశాస్త్రి తల్లిని చూసి ‘నీకు పుట్టే బిడ్డ వల్ల అపారమైన కీర్తి ప్రతిష్ఠలు వస్తా’యని చెప్పాడు. ఆ మాటలను విన్న శ్యామశాస్త్రి తల్లి సంతోషించింది. కొన్నాళ్ళకు శ్యామశాస్త్రి పుట్టారు. ఆయనకు తల్లిదండ్రులు ముందు పెట్టిన పేరు శ్యామకృష్ణ. శ్యామశాస్త్రికి సంగీత సాహిత్యాలలో మంచి పట్టు ఉంది. కృతిరచనలో సంస్కృత తెలుగు భాషలను ఉపయోగించడంలో ఆయన మంచి పటుత్వాన్ని చూపించారు. అతని మేనమామకు సంగీతంలో ప్రవేశం ఉండడంచేత శ్యామశాస్త్రి 18వ ఏడు వచ్చేంతవరకూ తన మేనమామ దగ్గర సంగీతాభ్యాసం చేశారు. శ్యామశాస్త్రి కుటుంబంలో సంగీతంలో ప్రవేశం ఉన్నవారు ఒక్కరూ లేకపోవడంవల్ల ఆయనకు కుటుంబంనుంచి ప్రోత్సాహం అంతగా లభించలేదు. అయితే, తంజావూరికి వచ్చిన తరువాత సంగీతస్వామి అనే సంగీత విద్వాంసుడి అండ శ్యామశాస్త్రికి లభించింది. ఆయన సంగీతశాస్త్ర మర్మాలను శ్యామశాస్త్రికి తెలియజేశారు. శ్యామశాస్త్రి ఏకసంథాగ్రాహి కావడంవల్ల సంగీతస్వామి చెప్పినవన్నీ అలాగే నేర్చుకున్నారు. శ్యామశాస్త్రి సంస్కృతం, తమిళం, తెలుగు భాషలలో కృతిరచన చేశారు.

దాదాపు 300 ప్రసిద్ధ కృతులను రాశారు. వాటిలో తెలుగు కృతులే ఎక్కువగా కనిపించడం తెలుగువారు చేసుకున్న అదృష్టం.

శ్యామశాస్త్రి 'జననీనుత జనపరిపాలిని' అనే తన మొదటి కృతిని సావేరీ రాగంలో వెలువరించారు. శ్యామశాస్త్రి బంగారు కామాక్షమ్మవారి ఉపాసకులు కావడంతో ఆయన కృతులలో ఎక్కువభాగం అమ్మవారిపైనే చెప్పారు. ఆయన రచించిన నవరత్నాలలో ప్రస్తుతం 7 కృతులు మాత్రమే లభిస్తున్నాయి. వాటిలో ముఖ్యమైనవి :-

1. సరోజదళనేత్రి (శంకరాభరణం ఆదితాళం)
2. దేవీ మీననేత్రి (శంకరాభరణం ఆది తాళం)
3. మరి వేరేగతి (ఆనందభైరవి చాపుతాళం.)
4. నను బ్రోవు లలితో (లలిత రాగం మిశ్రలఘు తాళం)
5. మాయమ్మ (ఆహిరి రాగం ఆదితాళం)
6. దేవీ నీదు పద సారస (కాంభోజి రాగం, ఆదితాళం.)
7. మీనలోచనా (ధన్యాసి రాగం చాపు తాళం)

శ్యామశాస్త్రి కృతులు అంతగా ప్రచారం కాలేదు. దానికి కారణాలు అనేకం ఉన్నాయి. ఆయనకు మిగిలిన వాగ్గేయకారులలాగా శిష్య గణం లేదు. ఆయన క్షేత్ర పర్యటనలు ఎక్కువగా చేయలేదు. శ్యామశాస్త్రి రచించిన కృతులు ఎంతో సవాలుతో కూడుకున్నవిగా సంగీతజ్ఞులు భావిస్తున్నారు. శ్యామశాస్త్రి కృతిరచన, స్వరాల అల్లిక, తాళనియమాలు చాలా కష్టంగా ఉంటాయి. అందుకే ఆ కృతులు పాడుతుంటే గాయకులకు ఏదో తెలియని కష్టం అనిపిస్తుంది. సామాన్య రాగాలైన 'తోడి', 'ధన్యాసి', 'కళ్యాణి', 'భైరవి', 'ఆనందభైరవి', 'శంకరాభరణ' రాగాలలోనేగాక 'కల్గడ', 'చింతామణి', 'మాంజీ' రాగాలలో కూడా ఆయన కృతులను రచించారు. ఆయన ప్రదర్శించిన ప్రతిభ అనన్య సామాన్యమైనది. ఆయన 300 కృతులతోబాటు వర్ణాలు, జతులు రచించారు. అవి...

1. రావే హిమగిరి కుమారి (తోడిరాగం ఆదితాళం)
2. కామాక్షి అనుదినము (భైరవి రాగం చాపు తాళం)
3. కామాక్షీ నీదు పదయుగమే (యదుకుల కాంభోజి రాగం, త్రిపుట తాళం)

ఇవి శ్యామశాస్త్రికి సంగీతశాస్త్రంలోనే నిరుపమానమైన ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. ఈ మూడు స్వరజతులు రత్నత్రయంగా సంగీతలోకంలో వెలుగుతున్నాయి. ఆయన ఆనందభైరవి రాగంలో ఎక్కువగా కృతిరచన చేయడంవల్ల 'శ్యామశాస్త్రిగారి సొత్తు ఆనందభైరవి రాగం' అని విజ్ఞులు అభిప్రాయపడుతున్నారు.

శ్యామశాస్త్రి తన సహధర్మచారిణి మరణించిన ఆరో రోజు అనగా ఫిబ్రవరి 6, 1827వ సంవత్సరంలో వ్యయనామ సంవత్సరం, మకరమాసం, శుక్లదశమి రోజున సిద్ధి పొందారు.

## 1.17.6. రామదాసు

తెలుగు వాగ్గేయకారుల్లో రామదాసుది ఒక ప్రత్యేకమైన స్థానం. అన్నమయ్య తరువాత భజన సంప్రదాయాన్ని విస్తృతం చేసినవారు రామదాసు. భద్రుని తపఫలితంగా భద్రగిరిగా మారిన భద్రాచలంలో ఆలయ నిర్మాణం గావించి చిరస్మరణీయుడైన భక్తాగ్రేసరుడు రామదాసు. రామదాసు అసలు పేరు గోపన్న తల్లిదండ్రులు కమలాంబ, లింగమంత్రి. వారి ఇంటిపేరు కంచర్ల. కంచర్ల గోపన్న జన్మ స్థానం భద్రాచలానికి దగ్గరలో ఉన్న నేలకొండపల్లి. గోపన్న 1620-80 సంవత్సరాల మధ్య కాలంలో జీవించారు. గోపన్న భార్య కమలమ్మ. వారు చిన్నప్పటినుండి రామభక్తులు. ఆ ఊరికి చెందిన గోపన్న మేనమామలైన అక్కన్న, మాదన్నలు గోపన్నను చూడడానికి ఆ ఊరికి వచ్చారు. అక్కన్న గోల్కొండ నవాబైన తానీషా రాజు దగ్గర మంత్రిగా పనిచేశారు. మాదన్న సర్వ సైన్యాధ్యక్షునిగా ఉద్యోగం నిర్వహించాడు. వారి సహాయంతో 'ఉస్నాబాద్' అని పిలువబడే భద్రాచల ప్రాంతానికి తహసిల్దార్‌గా గోపన్న నియమింపబడ్డారు. భద్రాచల అభివృద్ధికోసం పంపించే నిధులు, ప్రజల దగ్గర సేకరించిన నిధులు కలిపి మొత్తం ఆరు లక్షల రూపాయలతో భద్రాచలంలో రామాలయాన్ని నిర్మించారు. ఆ ఆలయంలో నిత్య పూజలు నిర్వహించారు. ఈ కాలంలో ఉత్తర భారతదేశానికి చెందిన ప్రముఖ గురువు కబీర్ కంచర్ల గోపన్నను దర్శించారని, గోపన్న రామునికి చేసే సేవను చూసి ఆయన పేరు మార్చి 'రామదాసు'గా నామకరణం చేశారని ఒక ఐతిహ్యం ఉంది. అప్పటినుంచి గోపన్న రామదాసుగా ప్రసిద్ధి పొందారు.

రామదాసు ఎన్నో కీర్తనలను రాశారు. సామాన్య ప్రజలకు అర్థమయ్యే భాషలో ఆ కీర్తనలు ఉండడం విశేషం. వాటిలో 'పాహి రామప్రభో', 'అదిగో భద్రాద్రి', 'అంతా రామమయం' లాంటి దాదాపు 200 కీర్తనలు మనకు దొరుకుతున్నాయి. రామదాసు భజన సంప్రదాయాన్ని అనుసరించి కీర్తనలు రచించారు. ఆయన పాటలు సుదీర్ఘమైన వచనాలతో కూడి, భజనకు అనుకూలంగా ఉంటాయి. 'పాహి రామప్రభో' అనే కీర్తనను తీసుకుంటే మొత్తం 22 చరణాలు ఉంటాయి. ఇలా దాదాపుగా 200 కీర్తనలు రాయగా నేడు 125 మాత్రమే దొరుకుతున్నాయి.

## 1.17.7. త్యాగరాజు

సంగీత మూర్తి త్రయంలో త్యాగరాజు రెండో వారు. ఆయన కృతిరచనలతో తెలుగు భాషలో సంగీతం పరిపుష్టమైంది. త్యాగరాజు 1767 సంవత్సరంలో తిరువారూర్‌లో సనాతన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు సీతమ్మ, రామబ్రహ్మం. అన్న జపేశుడు. భార్య కమలమ్మ. కూతురు సీతామహాలక్ష్మి. తిరువారూర్‌లో త్యాగరాజేశ్వరుడు ప్రధాన దైవం. త్యాగరాజు జన్మించడానికి ముందు ఆయన తండ్రి రామబ్రహ్మానికి స్వప్నంలో పంచనదీశ్వరుడు ప్రత్యక్ష్యమై 'నీకు సంగీత సాహిత్య కళా కోవిదుడు జన్మిస్తా'డని చెప్పారు. ఇక్కడ అమ్మవారు 'కమలాంబ', (తామర పువ్వు) 'నీలోత్పలాంబ' (నల్ల కలువ) అనే రెండు పేర్లతో ప్రసిద్ధి చెందారు.

త్యాగరాజేశ్వరుని అనుగ్రహం వల్ల పుట్టిన బిడ్డ కనుక ఆయనకు తల్లిదండ్రులు త్యాగరాజు అనే పేరు పెట్టారు. చిన్నతనంలోనే త్యాగరాజు తల్లి సీతమ్మ దగ్గర పురందరదాసు కీర్తనలు, రామదాసు కీర్తనలు, జయదేవ అష్టపదులు నేర్చుకున్నారు. గోడ మీద త్యాగరాజు 'నమో నమో రాఘవాయ' అనే కీర్తనను రచించారు. తండ్రి రామబ్రహ్మం అది చూసి సంతోషించి, త్యాగరాజు ఆసక్తిని గమనించి తంజావూరు ఆస్థానంలో సంగీత విద్వాంసుడైన శొంఠి వేంకటరమణయ్యగారి దగ్గర సంగీతాభ్యాసం చేయించాడు. త్యాగరాజు ఆయన దగ్గర ఆరు పున్నములలో సంగీతాన్ని పూర్తి చేయడం చూసి గురువే విస్తు పోయారు. నా దగ్గర సంగీతం ఇంతేనని, నారదుణ్ణి జపించడం వల్ల ఫలితాన్ని పొందగలవని త్యాగరాజును

గురువు ఆశీర్వదించారు. నారదుడు యతివేషంలో త్యాగరాజుకు సంగీత రహస్యాలతో కూడిన *స్వరార్ణవం* అనే గ్రంథాన్ని బహూకరించారని చెబుతారు. అప్పుడు త్యాగరాజు 'శ్రీనారదనాథ సరసీరుహ భృంగ శుభాంగా' అనే కృతిని భైరవి రాగంలో రచించి పాడారు. 'నారద గురురాయా' అనే కృతిని రచించారు. అప్పటినుంచి త్యాగరాజు సంగీత సాహిత్యాల ప్రస్థానం అప్రతిహతంగా సాగింది.

త్యాగరాజు పేదరికంలో గడిపారు. భిక్షాటన చేసి తనను నమ్ముకున్న కుటుంబాన్ని, తన దగ్గర విద్యను అభ్యసించే శిష్యులను పోషించారు. తన శిష్యులకు కేవలం సంగీతం మాత్రమే కాకుండా యోగ, జ్యోతిష శాస్త్రాలను నేర్పారు. త్యాగరాజు ప్రతిభను గురించి తెలుసుకున్న తంజావూరు మహారాజు తానే స్వయంగా పల్లకిని పంపించాడు. అపారమైన ధనరాశులను, 10 ఎకరాల భూమిని త్యాగరాజుకు కానుకలుగా పంపించాడు. తన అన్న జపేశుడు త్యాగరాజుకు నచ్చజెప్పి రాజాస్థానానికి పంపించాలని చూశాడు. కానీ త్యాగరాజు దాన్ని సున్నితంగా తిరస్కరించి, 'నిధి చాల సుఖమా! రాముని సన్నిధి సేవ సుఖమా! నిజము దెల్పవోమనసా' అని తనను తాను ఆత్మ పరీక్ష చేసుకున్నారు. రాజు తానే స్వయంగా త్యాగరాజు ఇంటికి మారువేషంలో వచ్చి, త్యాగరాజు పాండిత్యాన్ని తెలుసుకొని తనను క్షమించమని కోరాడు.

త్యాగరాజు సంగీత సాహిత్యాలలో గొప్ప ప్రతిభను కనబరిచారు. ఆయన 'సామజవరగమనా', 'నగుమోము', 'శ్రీరామ పాదమా', 'బంటురీతి కొలువియ్యవయ్య రామా', 'రఘువీర రణధీర' వంటి కృతులు దాదాపుగా 2400 రచించారు. నేడు 600 కృతులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అవేగాకుండా ఆయన వివిధ క్షేత్రాలను దర్శించి, ఆయా దేవతలపై రచించిన కృతులు సంగీత పండిత లోకంచేత ప్రశంసించబడుతున్నాయి. ఆ కృతులు ఆయా దేవతల పేర్లతో పంచరత్నాలుగా పిలువబడుతున్నాయి. వాటిలో 'ఘనరాగ పంచరత్న కృతులు' త్యాగరాజుకు ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి. ఈ అయిదు కృతులు ఆది తాళంలోనే రాయబడ్డాయి. అవి...

1. ఎందరో మహానుభావులు (శ్రీరాగం ఆదితాళం)
2. సాధించెనే ఓ మనసా (ఆరభి రాగం ఆదితాళం)

3. జగదానందకారకా (నాటరాగం ఆదితాళం)

4. కనకన రుచిరా (వరాళి రాగం ఆదితాళం)

5. దుడుకు గల నన్నే దొరకొడుకు బ్రోచురా (గౌళ రాగం ఆదితాళం)

ఇవేగాక 'తిరువయ్యారు పంచరత్నాలు', సుందరేశ్వరునిపై 'కొవ్వూరు పంచరత్నాలు', 'తిరువొట్టియార్ పంచరత్నాల'ను రచించారు.

త్యాగరాజు సంగీతంలోనేగాక సాహిత్యంలో కూడా తనదైన ముద్ర వేశారు. సంగీత, సాహిత్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఆయనది కవిత్వంలో కూడా అందెవేసిన చెయ్యి. ఆయన రచనలు...

1. నౌకా విజయం

2. ప్రహ్లాద భక్తి విజయం.

త్యాగరాజు రచించిన కృతులను ఆరు విధాలుగా విడదీయవచ్చు.

1. వేదాంత బోధకాలు

2. నీతి బోధకాలు

3. నమస్కృతులు

4. సంగీత ప్రశంసాత్మకాలు

5. మానస బోధకాలు

6. విన్నపాలు.

త్యాగరాజు ఆర్జవ శక్తితో కృతిరచన గావించారు. 'ఆర్జవత్' అంటే ఋజుత్వం. అంటే మనస్సులో అనుకున్నదాన్ని త్రికరణ శుద్ధిగా ఆచరించడం. తన కృతుల్లో సంగీత, రాగ, భావాదులకే కాకుండా భాషకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. భాషలోని అక్షరాలను, సంగీతంలోని స్వరాలను విడదీయలేనంతగా కృతులు అల్లడం త్యాగరాజు ప్రత్యేకత. లక్ష్య లక్షణ సమన్విత కృతికర్త త్యాగరాజు. తేలికైన పదాలతో, సులభమైన స్వరాలను ఏర్చి, కూర్చి అద్భుతంగా కృతిరచన చేశారు. ఆయన కృతుల్లో పదాడంబరత, స్వరాల సాగదీత కనిపించకుండా చాలా జాగ్రత్త పడ్డారు. త్రికరణశుద్ధిగా కృతిరచన చేయడంలో అన్నమయ్యను త్యాగరాజు అనుసరించారు. త్యాగరాజు తన 80వ ఏట 1847 సంవత్సరంలో పరమపదించారు. సంగీతలోకం త్యాగయ్య, క్షేత్రయ్య, అన్నమయ్యలను వాగ్గేయకార త్రయంగా గుర్తిస్తోంది.

## 1.17.8. ముత్తుస్వామి దీక్షితులు

ముత్తుస్వామి దీక్షితులు సంగీత మూర్తి త్రయంలో మూడో వారు. ఈయన కాలం 1776–1835. ఈయన దాదాపుగా 500 కృతులను చెప్పారు. ఆ కృతుల్లో చాలా భాగం నేడు సంగీత పండితులు గానం చేస్తున్నారు. ముత్తుస్వామి దీక్షితార్ తల్లిదండ్రులు రామస్వామి దీక్షితార్, సుబ్బలక్ష్మి అమ్మాళ్. వీరి స్వగ్రామం మద్రాసుకు 90 మైళ్ళ దూరంలో ఉన్న విరించిపురం. రామస్వామి దీక్షితులు, సుబ్బలక్ష్మి అమ్మాళ్‌కు మొదటి సంతానం ముత్తుస్వామి దీక్షితులు.

ముత్తుస్వామి దీక్షితుల తల్లిదండ్రులైన రామస్వామి దీక్షితులు, సుబ్బలక్ష్మి అమ్మాళ్‌కు చాలా కాలం సంతానం కలగలేదు. అప్పుడు వారు బాలాంజికా దేవిని 40 రోజులు భక్తి శ్రద్ధలతో సేవించారు. ఆ తల్లి ఒకరోజు వారికి కలలో కనబడి ఒక ముత్యాల హారాన్ని బహూకరించింది. కనుక వారు తమకు కీర్తి తెచ్చే కుమారుణ్ణి దేవి ఇస్తుందని నమ్మారు. వారు విశ్వసించినట్లుగానే 1776 మార్చి 24 న మన్మథ నామ సంవత్సరం ఫాల్గుణ మాసం, కృతికా నక్షత్రంలో ముత్తుస్వామి జన్మించారు. త్యాగరాజు, శ్యామశాస్త్రిలాగా ఈయన జననం కూడా తిరువారూర్‌లో జరగడం విశేషం. ఈయనకు సుబ్రహ్మణ్య స్వామికి మరో పేరైన ముత్తు కుమార స్వామి అని పేరు పెట్టారు. కాలక్రమంలో అది 'ముద్దు కుమార స్వామి', 'ముద్దుస్వామి', 'ముత్తుస్వామి'గా మారింది.

ముత్తుస్వామి తండ్రి రామస్వామి దీక్షితార్ రాసిన వర్ణాలు నేటికి కర్ణాటక సంగీతాభ్యాసకులు అభ్యసిస్తున్నారు. హంసధ్వని రాగం ఆయన కనిపెట్టిందే. ముత్తుస్వామి కూడా ఆయన దగ్గరే శిష్యరికం చేసి, సంగీతశాస్త్ర మర్మాలను, సాహిత్య రచనలో పాటించాల్సిన మెళకువలను నేర్చుకున్నారు. శ్యామశాస్త్రి కృతిరచనలో నారికేళ పాకాన్ని పాటించగా త్యాగరాజు ఖదళీపాకాన్ని అనుసరించారు. ముత్తుస్వామి ద్రాక్షా పాకాన్ని పాటించారు. ముత్తుస్వామి తన తండ్రి, తమ్ముళ్ళతో కలిసి మద్రాసులోని జార్జి కోటను పలుమార్లు దర్శించడంవల్ల పాశ్చాత్య సంగీత పోకడలను ఈయన కృతుల్లో మనం చూడగలం. ముత్తుస్వామి అన్న బాలస్వామి ఇంగ్లీషువారి సంగీత పరికరమైన వయొలిన్‌ను

కర్ణాటక సంగీతానికి అనుకూలంగా మార్చి, గాయకులకు దాని ప్రతిభను తెలియజేశారు. నేడు సంగీతజ్ఞులు తమ కచేరీలలో వయోలిన్‌ను ప్రముఖ వాయిద్యంగా ఉపయోగించుకుంటున్నారు.

ముత్తుస్వామి దీక్షితార్‌ను చిదంబరనాథయోగి అనే శ్రీవిద్యోపాసకులు కాశీకి తీసుకువెళ్ళారు. ముత్తుస్వామి చిదంబరనాథయోగితో కలిసి ఆరు సంవత్సరాలు నివాసమున్నారు. అక్కడ ఉన్న అన్నపూర్ణేశ్వరి, విశాలాక్షి అమ్మవారిపై అనేక కృతులను చెప్పారు. అక్కడ హిందుస్థానీ సంప్రదాయ సంగీతాన్ని కూడా అభ్యసించారు. కాబట్టి ఆయన కృతుల్లో హిందుస్థానీ బాణీలు చోటు చేసుకున్నాయి. ముత్తుస్వామి మణిప్రవాళ శైలిలో కృతిరచన చేశారు. ఈ శైలిలో కృతిరచన దీక్షితుల నుంచి మొదలైంది. ముత్తుస్వామి ఒకనాడు గంగలో స్నానం చేస్తుండగా ఆయనకు ఒక వీణ దొరికింది. గంగా ప్రసాదంగా భావించిన ముత్తుస్వామి వీణా వాదనలో శిక్షణ తీసుకొని ప్రవీణుడయ్యారు. కాశీలో చిదంబరనాథయోగి మరణించగా ఆయనకు అంత్యక్రియలు చేసి తమిళనాడుకు చేరుకున్నారు.

ముత్తుస్వామి తిరుత్తణిలో సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో భజన చేస్తున్నప్పటినుండీ ఆశు రచన ప్రారంభమైంది. అక్కడ గానం చేసిన 8 కీర్తనలలో తెలుగులో అష్ట విభక్తులు కనిపిస్తాయి. ఈ విధానం తెలుగులో 'ఉదాహరణ వాఙ్మయం'లో తప్ప మిగిలిన భాషల్లో లేదు. ఆ రోజునుండి ముత్తుస్వామి 'గురుగుహ' అనే ముద్రతో కృతులు చెప్పారు.

ముత్తుస్వామికి చిన్నప్పుడే ఇద్దరు అమ్మాయిలతో వివాహం జరిపించారు. అయినప్పటికి ఆయన అన్నమయ్యలాగా మనస్సన్యాసం తీసుకున్నారు. ఆయన బహు క్షేత్రాలను దర్శించారు. తిరుమల దర్శనం సందర్భంగా "శేషాచల నాయకం భజామి వేంకటాచలపతే నిను నమ్మితి" (*రాధాకృష్ణ, బూసురపల్లి.2016:65.*) అనే కృతి చెప్పారు. ఆ గానంతో తన తమ్ముడు చిన్నస్వామి అంధత్వం తొలగిపోయింది. శ్రీకాళహస్తి చేరి శివునిపై కీర్తనలు పాడారు. అలాగే చిదంబరం చేరి కామాక్షి, ఏకాంబరేశ్వరులపై, వరదరాజ స్వామిపై కృతులు పాడారు. ఉపనిషాన్తో బ్రహ్మేంద్ర సరస్వతి ఆలయాన్ని దర్శించి శ్రీరామునిపై కీర్తనలు చెప్పారు. ఇంకా ఈయన తిరువణ్ణామలై, చిదంబరం, వైదీశ్వరన్

కోయిలల్, మయూరం, తిరువారూర్, స్వామిమలై, మన్నారుగుడి, నాగపట్టణం, తిరుచ్చీ రామపల్లి, శ్రీరంగం, కివాలూరు, కులిక్కరై, తంజావూరు, మధురై, రామేశ్వరం, తిరుచందారు, శబరిమలై మొదలైన ఎన్నో పుణ్యక్షేత్రాలను దర్శించారు. ఆ క్షేత్రాలలో కొలువై ఉన్న ఆయా దేవతలపై కృతులు చెప్పారు. త్యాగరాజస్వామిపై, నీలోత్పలాంబపై, అష్ట విభక్తులు వచ్చేటట్లు కీర్తనలు రాశారు. శ్యామశాస్త్రి, త్యాగరాజుల లాగా తిరువారూర్ కమలాంబికపై 'నవావరణ కృతులు' రాశారు. అలాగే 'గణేశ', 'శివ మీనాక్షి కృతులు' రచించారు.

దీక్షితులు తాను నేర్చుకున్న జ్యోతిష, ఖగోళ, వైద్య, తాళ, రాగ పరిజ్ఞానాన్ని రంగరించి 'నాగగ్రహ' కీర్తనలు చెప్పారు. 'కుముదక్రియ', 'చమరం', 'చతురంగిణి', 'సుమద్యుతి', 'కుసుమాకరం', 'హంసావతి', 'వేగవాహిని', 'రూపావతి' వంటి రాగాలలో ఆయన మాత్రమే ఎక్కువగా కృతులు చెప్పారు. 'నవరోజు', 'యమన్', 'ద్విజావంతి' వంటి హిందుస్థానీ రాగాలలో కృతులు చెప్పి, దక్షిణాదిన వాటికి స్థానం కల్పించారు. కమలమ్మ అనే శిష్యురాలి కోరికపై తెలుగులో నాట్యానికి తగిన విధంగా "రూపముజూచి' అనే పదాన్ని తోడిరాగంలోను, "నీ సాటి దైవమెందులేదు" (*రాధాకృష్ణ, బూసురపల్లి.2016:66.*) అనే దరువును శ్రీరంజని రాగంలో రాశారు. ఈ కీర్తనలు విన్న పొణ్ణయ్య, వడివేలు, చిన్నయ్య, శివానందం అనే తంజావూరు నాట్య కళాకారులు ముత్తుస్వామికి శిష్యులయ్యారు. ఆయన గురుకులంలో 100 కు పైగా శిష్యగణం ఉండేవారు.

ముత్తుస్వామి సంస్కృతం, తమిళం, తెలుగు భాషలలో కృతిరచన చేశారు. అయితే, త్రిమూర్తులలో మిగిలిన ఇద్దరికంటే ముత్తుస్వామి సంస్కృతంలో ఎక్కువగా కృతులు రచించారు. ఆయన కృతులు చాలా సరళంగా, సహజసుందరంగా ఉండి సంగీతజ్ఞుల నోళ్ళలో నానుతూ ఉన్నాయి. దానికి కారణం ఆయన శిష్యులు ఆ కృతులను విరివిగా ప్రచారం చేయడమే. త్యాగరాజుకంటే ముత్తుస్వామికే శిష్యగణం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. నేటికీ 'వాతాపి గణపతిం భజేహం', 'శ్రీ సరస్వతే నమోస్తుతే', 'మహాగణపతిం మనసా స్మరామి' వంటి కృతులను ప్రథమంగా సంగీతజ్ఞులు తమ కచేరీలలో పాడుకుంటున్నారు.

ముత్తుస్వామి 1835 లో తన శిష్యుల చేత తనకు ఇష్టమైన మీనాక్షిపై కృతిని పాడించుకొని జీవసమాధి అయ్యారు. తెలుగేతరుడైన ముత్తుస్వామి తెలుగు భాషలో కృతిరచన చేసి, సంగీత సాహిత్యాలలో మరువలేని సేవ చేశారు.

## 1.17.9. సారంగపాణి

క్షేత్రజ్ఞుని తరువాత పదాలలో అంత పేరు ప్రఖ్యాతులు పొందిన వారు సారంగపాణి. ఇతడు కూవన సామయ్య, గోవింద సామయ్య అనే అన్నదమ్ముల సాన్నిహిత్యంలో సంగీతంలో ప్రవీణుడయ్యారు. సారంగపాణి పదకర్తగా ఎంతో ప్రసిద్ధి పొందారు. ఆయన తన పదాలలో శృంగారానికి ప్రాధాన్యత ఇవ్వకుండా అనేక భక్తి, వైరాగ్యభరితమైన పదాలు రచించారు. తద్వారా సంఘోద్ధరణకు పాటుపడ్డారు. ఇతర వాగ్గేయకారులకు మార్గదర్శకులయ్యారు. ఈయన తంజావూరు రాజైన షహాజీ కొలువులో విద్యాధికారిగా పని చేసి ఆ పదవిని విడిచిపెట్టారు. తన చివరి దశలో ఎన్నో కష్టాలను అనుభవించారు. సారంగపాణి తన పదాలను నాలుగు విభాగాలుగా విభజించారు. అవి...

1. శృంగార పదాలు 2. దేశీయపదాలు 3. జాతీయ పదాలు 4. వైరాగ్య నీతియుక్త పదాలు. సారంగపాణి మొత్తం 200 పదాలను రచించారు. వాటిని 42 రాగాలకు పరిమితం చేసి, ఏడు తాళాలకు నిబద్ధం చేశారు.

సారంగపాణి పదాలను ఆయన మనుమడు గరిమెళ్ళ వెంకటసుబ్బయ్య 1867 లో 'విద్యావిలాస ముద్రాక్షరశాల'లో ప్రకటించారు. ఆ తరువాత నేదునూరి గంగాధరం పార్వతీశ్వరశాస్త్రి పీఠికతో 1963 లో వెలువరించారు. శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు తన *ఆంధ్ర వాగ్గేయకారులు* అనే గ్రంథంలో మరికొన్ని వివరాలను పొందుపరిచారు. సారంగపాణి పదాలు పాడడానికి అత్యంత క్లిష్టమైనవిగా పండితులు భావించారు. కనుక ఆ పదాలలో కొన్ని మాత్రమే మనకు లభ్యమవుతున్నాయి.

సారంగపాణి పదాలలో ఎక్కువ భాగం 'పంతువురాళి' రాగంలో కూర్చబడ్డాయి. ఆ తరువాత 'భైరవి', 'గౌరీపంతు', 'మోహన', 'ఆనందభైరవి', 'సావేరి', 'ధన్యాసి' రాగాలలో

అమరాయి. ఈయన 'అపురూపా' అనే కొత్త రాగాన్ని కనుగొన్నారు. ఆ రాగంలో "వలచితిని, అట్లాగే కావలే" (*శేషాద్రి, కోమాండూరి.2006:185.*) అనే పదాలు చాలా అందంగా ఒదిగిపోయాయని పండితులు మెచ్చుకున్నారు. అయితే, ఆ రాగ లక్షణం దాదాపుగా చాలామందికి తెలియదు. అలా కొన్ని పదాలు మరుగున పడ్డాయి. 'అసావేరీ', 'అఠాణా', 'ఆనందభైరవి', 'ఆహిరి', 'ఆరభి', 'కానడ', 'కళ్యాణి', 'కర్ణాటక సారంగ', 'కాపీ', 'కాంభోజి', 'గేయిపంతు', 'గౌరీ', 'ఘంటాతోడి', 'ధన్యాసి', 'విజావంతి', 'నవరోజు', 'నాటకురంజి', 'నీలాంబరి', 'పరజు', 'పంతువురాళి', 'పున్నాగ వరాళి', 'బిలహరి', 'బేగడ', 'మధ్యమావతి', 'ముఖారి', 'యెదుకుల కాంభోజి', 'రేగుప్తి', 'శంకరాభరణం', 'సురటి', 'సౌరాష్ట్ర', 'హుసేనీ', 'శ్రీరాగం' మొదలైన అనేక రాగాలలో సారంగపాణి పదరచన చేశారు. అత్యధిక పదాలను ఆదితాళంలోనే పొందుపరిచారు. రామదాసు 'శ్రీరామ నామాం మరువాం మరువాం' అంటే సారంగపాణి 'వేణుగోపాలుని పేరు విడువము' అన్నారు. సారంగపాణి రచించిన పదాలను భిక్షకులు కూడా పాడుకొనేవారట.

ఇలా తెలుగు సాహిత్యానికి, సంగీత లోకానికి వాగ్గేయకారులు ఎంతో సేవ చేశారు. నరహరి కాలంలో 'వచనం'గా రూపుదిద్దుకున్న పాట అన్నమయ్య కాలంలో 'సంకీర్తన'గా పరిఢవిల్లి, త్రిమూర్తుల కాలంలో 'కృతి'గా రూపాంతరం చెంది, క్షేత్రయ్య కాలంలో 'పదం'గా అందరి మనస్సులలో చోటు ఏర్పరచుకొని, రామదాసు కాలంలో 'కీర్తన'గా పరివర్తన చెందింది.

## 1.18. అన్నమయ్య సంకీర్తనల వెలికితీతలో శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి కృషి

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తిరుపతిలో ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తున్న రోజుల్లో తిరుమలలో మూసి ఉన్న ఒక పెద్ద గదిని గమనించారు. అక్కడ భాండాగారం ఉండేదని తన పూర్వీకులవల్ల విని, తిరుమల తిరుపతి దేవస్థానముల వారి అనుమతి తీసుకొని ఎంతో శ్రమకోర్చి అపూర్వమైన రేకులను బయటకి తెచ్చారు. ఆ రేకు మీద ఆయనకు అద్భుతమైన సంకీర్తనలు కనిపించాయి. గదంతా ఆ రేకులతో నిండి ఉండడం గమనించిన శాస్త్రిగారి శిష్యులు వాటన్నింటినీ అధిక శ్రమకోర్చి బయటకు తీశారు. వాటిని ప్రప్రథమంగా శాస్త్రిగారు

తిరుమలవారి అనుమతితో పరిష్కరించారు. అలా మనకు సుమారు 14000 సంకీర్తనలు లభ్యమవుతున్నాయి.

## 1.19. సంకీర్తనల ప్రచారంలో తిరుమల తిరుపతి దేవస్థానములవారి కృషి

ప్రభాకరశాస్త్రిగారితో ప్రారంభమైన సంకీర్తనల పరిష్కరణ నేటికీ కొనసాగుతూనే ఉంది. "యోగమార్గంబుననొక కొన్ని" శ్లోకాన్ని ఆధారం చేసుకొని కొద్ది మార్పులతో తిరుమల తిరుపతి వారు అన్నమయ్య సంకీర్తనలను

1 అధ్యాత్మ సంకీర్తనలు (6 భాగాలు)

2 శృంగార సంకీర్తనలు (23 భాగాలు)

మొత్తం 29 సంపుటాలుగా విభజించి ముద్రింపజేశారు. ఆ సంకీర్తనలను గౌరిపెద్ది రామసుబ్బశర్మ, రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ, ముట్నూరి సంగమేశం, మేడసాని మోహన్, కామిసెట్టి శ్రీనివాసులు మొదలైన ఉద్దండుల సహకారంతో పరిష్కరింపజేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. రాగి రేకులను తిరుమల భాండాగారంలో భద్రపరచారు. పరిష్కరించిన సంకీర్తనలను ప్రసిద్ధ గాయకులచేత పాడిస్తున్నారు. ఆ కీర్తనలను గ్రామ గ్రామాల్లో ప్రచారం చేయడానికి తిరుమలవారు కృషి చేస్తున్నారు. 1970 నుండి నేటి వరకూ 1400 సంకీర్తనలను శ్రవణీకరించారు. డా. శోభారాజు, కీర్తిశేషులు ఎం. ఎస్. సుబ్బులక్ష్మి, కీర్తిశేషులు డా. మంగళంపల్లి బాలమురళీ కృష్ణ, గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్, మేడసాని మోహన్, ఎస్. జానకి, పి. సుశీలా, కొండవీటి జ్యోతిర్మయి మొదలైన ప్రసిద్ధ గాయకులను ఆస్థాన గాయకులుగా నియమించుకొని, వారిచేత పాడించి, విస్తృతమైన ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్‌గారు ఆస్థాన గాయకులుగా ఉన్నారు. 1970 నుండి నేటి వరకూ శ్రవణీకరించిన సంకీర్తనలను 115 శ్రవణ సంపుటాలుగా విడుదల చేశారు. ప్రతి సంవత్సరం యువగాయకులతో అన్నమయ్య లక్షగళార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. లలిత కళలకు గరుడ పురస్కారాలను ఇస్తున్నారు. అందులో అన్నమయ్య సంకీర్తనలను కూడా భాగం చేశారు. శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్‌ద్వారా 'అన్నమయ్య పాటకు పట్టాభిషేకం' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సంగీతజ్ఞులు అన్నమయ్య సంకీర్తనలను పరిష్కరించి, రాగ, తాళబద్ధంగా ఆలపించి ఉత్తమ సంగీతాన్ని

వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారు. tirumala.org అనే వెబ్‌సైట్‌లో అన్నమయ్యకు సంబంధించిన వివిధ విలువైన పుస్తకాలను, పరిశోధనలను ఉంచుతూ ప్రపంచవ్యాప్తంగా వాటికి ప్రచారం కల్పిస్తున్నారు. తిరుమల విశేషాలను సప్తగిరి మాసపత్రిక ద్వారా ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు.

★★★★★

# అధ్యాయం - ౨

# అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలలో కవితా సౌందర్యం

## 2.0. పరిచయం

అన్నమయ్య రచించిన సంకీర్తనలలో కవితా గుణాలు మెండుగా ఉన్నాయి. సరళమైన మాటలతో, సరసమైన భావాలతో, కవితా పుష్టిని కలిగి ఉన్నాయి. అన్నమయ్యకు పూర్వపు కవులు, అన్నమయ్య తదనంతరపు పండితులు చాలావరకూ రాజాశ్రయాలలో ఉన్నవారే. రాజులను పొగిడి, వారిచేత భరణాలను పొంది, వాటిపై ఆధారపడి జీవించినవారే. ఇక వాగ్గేయకారుల విషయానికి వస్తే మొట్టమొదటిగా రాజాశ్రయాన్ని పొందినవాడు, దాన్ని తిరస్కరించినవాడు కూడా అన్నమాచార్యులే. ఆ కీర్తనల్లో మాటలు ఎంత సులభమో భావం అంత గాంభీర్యం.

విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారకుడు, ప్రవక్త అయిన అన్నమయ్య కొన్ని కీర్తనలలో శైవసంప్రదాయాన్ని తృణీకరించారని గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు *అధ్యాత్మ సంకీర్తనలు రెండవ సంపుటానికి* రాసిన అవతారికలో తెలియజేశారు. కానీ అది భక్తిలో ఒక భాగంగా గుర్తించాలి. అదే విధంగా తురుష్కుల దాడులను, సామ్రాజ్యవాదుల దాడుల ఫలితంగా చెలరేగిన అలజడులను తన కీర్తనల్లో తీవ్రంగా నిరసించారు. సామాజికంగా ప్రజలకు చేరవేయాల్సిన నీతిని అందించారు. తనకుతానుగా ఆత్మ పరీక్ష చేసుకుంటూ ఆధ్యాత్మిక మార్గాన్ని నిత్యం అన్వేషించారు. కాబట్టి పండితులు అన్నమయ్యను విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారకుడిగా, ప్రవక్తగా, ఆధ్యాత్మికవేత్తగా, సిసలైన వాగ్గేయకారుడిగా కొనియాడారు.

అన్నమాచార్యుల సంకీర్తనా తత్త్వాన్ని ఆయన మనుమడైన తాళ్ళపాక చినతిరుమలాచార్యులు ఇలా తెలియజేశారు.

"వేదంబులు పౌరాణిక
వాదంబులు వరకవిత్వవాణీ వీణా
నాదంబులు కృతసుజనా
హ్లాదంబులు తాళ్ళపాక యన్నయపదముల్" (*సంకీర్తనా లక్షణసారము 6వ పద్యం*)

ఈ పద్యంలో చినతిరుమలయ్య అన్నమయ్య సంకీర్తనల్లోని నిడివిని, కవితా గుణాలను తెలియజేశారు. అన్నమయ్య కీర్తనలను వేదాలుగా, పురాణవాదాలుగా, కవిత్వంతో నిండిన సరస్వతి చేతిలోని వీణానాదాలుగా, సుజనులకు ఆహ్లాదాన్ని కలిగించే కృతులుగా పేర్కొన్నారు. పై పద్యంలో మొట్టమొదటిసారిగా చినతిరుమలయ్య అన్నమయ్య సంకీర్తనలను కృతులుగా, పదాలుగా విశ్లేషించారు.

"లక్షణములు పదకవితా

రక్షణములు వివిధ కుకవిరాజీ మదస

మ్మోక్షణములు వేంకటపతి

వీక్షణములు తాళ్ళపాక విభుసత్కవితల్" *(సంకీర్తనా లక్షణ సారము 7వ పద్యం)*

పై పద్యంలో సంకీర్తనల లక్షణాలు ఏ విధంగా ఉంటాయో చినతిరుమలాచార్యులు వివరించారు. పదకవితా రక్షణాలుగా, సత్కవులకు మోక్షాన్ని ఇచ్చేవిగా, ఆ వేంకటపతి చూపులుగా పేర్కొనబడ్డాయి.

ఇంకా ఈ కీర్తనలు ఎలా పరిఢవిల్లుతున్నాయో ఈ కింది పద్యం ద్వారా తెలియజేశారు.

"శ్రుతులై శాస్త్రములై పురాణకథలై సుజ్ఞానసారంబులై

యతిలోకాగమవీథులై వివిధ మంత్రార్థంబులై నీతులై

కృతులై వేంకటశైల వల్లభ రతిక్రీడా రహస్యంబులై

నుతులై తాళులపాక యన్నయార్య వచోనూత్న క్రియల్ చెన్నగున్"

*(సంకీర్తనా లక్షణసారము 12వ పద్యం)*

పై పద్యంలో అన్నమాచార్య కీర్తనలను మంత్రాలుగా, శాస్త్రాలుగా, జ్ఞానాన్ని బోధించేవిగా, పురాణ సారాన్ని కలిగి ఉన్నవిగా, యతులు సంచరించే పుణ్య స్థలాలుగా, వేదశాస్త్రాలలోని మంత్రాలకు అర్థం చెప్పేవిగా, ముఖ్యంగా ఆ వేంకటేశ్వరుని రతి క్రీడా రహస్యాలను తెలియజేసేవిగా చినతిరుమలయ్య వర్ణించారు.

కింది ద్విపదలో అన్నమయ్య సంకీర్తనలు ప్రవర్తిల్లిన మార్గాలను చిన్నన్న ఇలా వర్ణించారు.

"యోగమార్గంబున నొకకొన్ని బుధులు

రాగిల్ల శృంగార రసరీతిఁ గొన్ని

వైరాగ్య రచనతో వాసింపఁ గొన్ని
సారసనేత్రుపై సంకీర్తనములు
సరసత్వమునఁ దాళసముఖముల్ గాఁగ
పరమతంత్రములు ముప్పదిరెండువేలు,
ప్రవిముల ద్విపద ప్రబంధరూపమున
నవముగా రామాయణము, దివ్యభాష
నా వేంకటాద్రిమాహాత్మ్య మంతయును
గావించి, రుచుల శృంగారమంజరియు
శతకముల్ పదిరెండు సకలభాషలను
ప్రతిలేని నానాప్రబంధముల్ చేసి,"

(శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము. 2001:48-49)

పై ద్విపదలో అన్నమయ్య రచించిన గ్రంథాలను గురించి చిన్నన్న తెలిపారు. అలాగే, యోగమార్గంలో కొన్ని కీర్తనలను, శృంగారాత్మకంగా కొన్నింటిని, వైరాగ్యరీతిలో కొన్నింటిని మొత్తం 32000 సంకీర్తనలను అన్నమయ్య తాళబద్ధంగా చెప్పినట్లు చినతిరుమలయ్య తెలియజేశారు.

"పదములు శృంగార వధూ
మృదుమధుర మనోజ్ఞ వాక్యమిశ్రములైనన్
విదితార్థ గ్రామ్యోక్తులు
పదిలముగ బొంకమెఱిఁగిపలుకఁగజెల్లున్"

(సంకీర్తనా లక్షణ సారము 56వ పద్యం.)

ఈ పద్యంలో అన్నమయ్య కీర్తనలు మృదుమధురంగా వివిధ గ్రామ్య పదాలను ఆవిష్కరించాయని చిన్నన్న తెలియజేశారు. ఈ విధంగా అన్నమాచార్యుల విరాట్ స్వరూపాన్ని ఆయన మనుమలైన చిన్నన్న, చినతిరుమలయ్య వారి గ్రంథాల్లో ఆవిష్కరించారు.

పై పద్యాలవల్ల అన్నమయ్య సంకీర్తనా రచన చేసిన ఉద్దేశం, కవిగా, వాగ్గేయకారుడిగా సమాజాన్ని అర్థం చేసుకున్న విధానం, సంకీర్తనలలో పొందుపరిచిన

అంశాలు మనకు అర్థమవుతాయి. అంతేకాకుండా అన్నమయ్య ఊహించిన సమాజపు పోకడలు నేటికీ స్ఫురణకు వస్తాయి. కాబట్టి 'ఋషి కాలేనివాడు కవి కాలేడు' అనే నిర్వచనం అన్నమయ్యకు అక్షరాలా నప్పుతుంది. 'ఒక్క సంకీర్తనే చాలు ఒద్దికై మము రక్షింపగా తక్కినవి నీ భండారానా దాచి ఉండనీయ్.' అన్నారు అన్నమయ్య. అంత శక్తిమంతంగా తత్త్వాలతోబాటు ఆ సంకీర్తనలలోని కవితా గుణాలు దాగి ఉన్నాయి.

ఈ అధ్యాయంలో అధ్యాత్మ సంకీర్తనలు రెండు సంపుటాలలోని కవితా గుణాలను, సౌందర్యాన్ని లోతుగా పరిశీలించడం జరిగింది.

## 2.1. అధ్యాత్మ సంకీర్తనలలోని అంశాలు

అన్నమయ్య రెండు సంపుటాలలోని అధ్యాత్మ సంకీర్తనలలో అనేకమైన సామాజిక అంశాలను, ఉత్సవాంశాలను పేర్కొన్నారు. అంతేగాక అన్నమయ్య తిరుమల పరిసరాలు, వేంకటేశుని పూజా కార్యక్రమాలు, సంసారంపై నిరసన, అనేక ప్రసిద్ధ క్షేత్రాలకు సంబంధించిన విశేషాలు, ఆ దేవుళ్ళ ప్రాశస్త్యం మొదలైన ఎన్నో అంశాలను నిక్షిప్తం చేశారు. అయితే, ఏ దేవుణ్ణి స్తుతించినా ఆయన దృష్టిలో వేంకటేశ్వరుడే సాక్షాత్కరించేవారు. కాబట్టి అన్నమయ్య కీర్తనల్లో దేవుళ్ళ మధ్య అభేదం మనకు కనిపిస్తుంది. ఆ కీర్తనల్లో తాత్త్వికత, పారమార్థికత, భక్తి తత్పరత తొణికిసలాడతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే భక్తునికి, భగవంతునికి తేడా లేదని నిరూపించిన వారిలో అగ్రస్థానంలో నిలిచారని ఆయన కీర్తనలలో అన్నమయ్య పొందిన తాదాత్మ్యాన్నిబట్టి, పారవశ్యాన్నిబట్టి సుస్పష్టమవుతుంది. అయితే, అన్నమయ్య కేవలం భక్తికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వలేదు.

ఆయన కీర్తనల్లో ఆ వేంకటేశ్వరునిపై భక్తి ఎంత ఉందో? సమాజంపై నిబద్ధత కూడా అంతే ఉంది. ఒకానొక సందర్భంలో 'నీ భక్తులను రక్షించాల్సిన బాధ్యత నీకు లేదా?' 'ఈ లోకంలో కర్మబంధాలను మాకు కట్టింది నీవు కాదా?' 'ఈ లోకంలో మనుషుల ప్రవర్తనలకు, వారి చేష్టలకు నీవు కారణం కాదా?' అని ఆ వేంకటేశ్వరుడినే నిలదీశారు. అన్నమయ్య సిసలైన భక్తాగ్రేసరులకు ఎంతమాత్రం తీసిపోరు. ఆ కీర్తనలు వైష్ణవానికి ప్రచారంగా భావించినప్పటికీ ఇతర ఆచారాల దూషణ మనకు ఆయన కవిత్వంలో అంతగా కనబడదు. అంత మృదుమధురశైలిలో అన్నమయ్య సంకీర్తనలు ఉన్నాయి కాబట్టే నేటికీ

వాటిని వింటున్నా, చదువుతున్నా నిత్య నూత్నమైన భావన కలుగుతుంది. ఆ సంకీర్తనలకు అన్నమయ్య ఉపయోగించిన సంగీతం మరింత శోభను కలిగించింది. అన్నమయ్య చెప్పదలచుకున్న భావాలు సూటిగా, గాఢంగా, సుస్పష్టంగా చెప్పారు.

ఆ అంశాలను ఒక్కొక్కటిగా కింద పరిశీలిస్తున్నాను.

## 2.1.1. సంసారంపై నిరసన

అన్నమయ్య ఆధ్యాత్మికవాది అయినా కుటుంబానికి, ప్రజలకు దూరంగా ఉండలేదు. ఆయన నెరపిన గృహస్థాశ్రమం చెప్పుకోదగ్గది. మనిషి జీవితాన్ని పండితులు బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం అనే నాలుగు ఆశ్రమాలుగా విభజించారు. వాటిలో ముఖ్యమైంది గృహస్థాశ్రమం. అంటే పెళ్ళి చేసుకొని ఒక ధర్మానికి కట్టుబడి ఉండడం. ఆ దశనే ఒక ఇంటివాడు కావడం అని తెలుగు ప్రజలు వ్యవహరిస్తూ ఉంటారు. అలా జీవించే జీవితాన్ని సంసారజీవనం అంటారు. అన్నమయ్య ఆ సంసారదశను సమర్థంగా నిర్వహించారు. ఆ దశలోని లోటుపాట్లను కీర్తనాబద్ధం చేశారు. ఆ సమస్యలను తన సంకీర్తనలద్వారా భగవంతునికి చెప్పుకున్నారు. అన్నమయ్య సంసారాన్ని నిరసించిన సందర్భాలు చాలా ఎక్కువగా ఈ సంకీర్తనలలో కనిపిస్తాయి. చాలా సందర్భాలలో తన అజ్ఞానాన్ని తిట్టుకున్నారు. ‘ఇతని ప్రసాదమే ఇన్నియును గతి ఇతనిదే కన కాదనరాదు.’ అని తన మనస్సుకు నచ్చజెప్పుకున్నారు. అయితే, అధ్యాత్మ సంకీర్తనలు ఒకటి, రెండు సంపుటాలను పరిష్కరించిన గౌరిపెద్దివారు “వేదాంతులకు సహజమైన సంసారనింద ఈతని అధ్యాత్మ కీర్తనలలో విశిష్టమైన స్థానమునాక్రమించి యున్నది.” (*సంపుటం 2. 21.*) అని పేర్కొన్నారు. ఆ మాటకు నిదర్శనంగా కవికర్ణ రసాయనంలోని “యతివిరుడుగాకపోవుటెట్లస్మదీయ/కావ్య శృంగార వర్ణనా కర్ణనమున/యతి విరుడుగాక పోరాదు నస్మదీయ/ కావ్య వైరాగ్య వర్ణనాకర్ణనమున” (*కవికర్ణరసాయనము పీఠిక:22*) అనే పద్యాన్ని ఉదాహరించారు. ఈ లోకంలో మనిషి పడే అన్ని పాట్లకు సంసారం కారణమవుతుందని అన్నమయ్య తెలియజేశారు. అందుకే ‘సముద్రాన్నైనా ఈదవచ్చుగాని సంసారాన్ని ఈదడం కష్టం’ అనే నానుడి వచ్చింది. భక్త రామదాసుగారైతే ‘నా తరమా భవసాగరమీదను నళినదళేక్షణ రామా!’ అన్నారు. అలాంటి సంసారసాగరంపై అన్నమయ్య తనదైన శైలిలో స్పందించారు. ‘ఈ లోకమే మాయాజనితం. అందులో కుటుంబం, భార్య,

తల్లిదండ్రులు, పిల్లలు మొదలైన బంధాలతో దేవుడు మనిషిని కట్టిపడేస్తాడు. వారిలో ఒక్కొక్కరిని తన దగ్గరకు తీసుకొని మనిషిని దుఃఖాక్రాంతుణ్ణి చేస్తాడు.' అంటూ ఈ చక్రభ్రమణాన్ని గురించి అన్నమయ్య తనదైన శైలిలో నిరసన తెలియజేశారు.

**భైరవి రాగం.**

**పల్లవి:**

"సడిబెట్టె గటగటా సంసారము చూడ
జడధిలోపల ఈత సంసారము

**చరణం:**

సందిగట్టిన తాడు సంసారము చూడ
సంది కంతలతోడ సంసారము
చందురుని జీవనము సంసారము చూడ
చందమేవలనుండు సంసారము." (*సంపుటం1.201:132.*)

ఈ సంకీర్తనలో అన్నమయ్య సంసారాన్ని సముద్రంలో ఈతగా వర్ణించారు. చంద్రుడు పున్నమిరోజున నిండువెన్నెలను కురిపిస్తూ అమావాస్యనాటికి కరిగిపోయి చాలా తక్కువ కాంతితో కనిపించిన చందంగా సంసారజీవనం ఉంటుంది. చలువరాయిని పోలి ఉంటుంది. రాగి ఆభరణంపై పోసిన బంగారు పూతలా ఉంటుంది. ఈ సంసారం ఇరువురు భార్యా భర్తల మధ్య కట్టిన తాడు అని అన్నమయ్య చమత్కరించారు. ఈ కీర్తన మొదటిలోనే 'సడిబెట్టె కటకటా సంసారము' అని చెప్పబడింది. 'సడి' అంటే సందడి అని అర్థం. అది గొడవ కావచ్చు, సంతోషం కావచ్చు. ఏదైనా ఉపద్రవానికి గుర్తు కావచ్చు. సంసారంలో ఎన్నో లోటుపాట్లు, సర్దుబాట్లు ఉంటాయి. కామోద్రిక్తులైన మానవులకు సంసారం అనే ముడి పడేంతవరకూ బాగానే ఉంటుంది. ఒక్కసారి దానిలో దిగితేగాని ఆ లోతు మనకు అర్థం కాదు అని అన్నమయ్య మానవులపై ఛలోక్తులు విసురుతూ హెచ్చరించారు.

**శ్రీరాగం**

**పల్లవి:**

"ఇదివో సంసారమెంతసుఖమోగాని
తుదిలేని దుఃఖమను తొడవు బెడయించె

**చరణం:**

పంచేంద్రియంబులను పాతకులు దనుదెచ్చి

కొంచపు సుఖంబునకు గూర్పగాను

మించి కామంబగు మేటితనయుండు

జనియించి దురిత ధనమెల్ల గడియించె.” (సంపుటం1.308:206)

ఈ సంసారం అమితమైన దుఃఖాన్ని కలిగిస్తుంది. అది ఒక క్రమపద్ధతిలో జరుగుతుంది. పంచేంద్రియాలు అనేవి శరీరాన్ని సుఖానికి మరుపుతాయి. అందువల్ల కామం అనే కొడుకు జన్మించి పాపం అనే ధనాన్ని ఆర్జిస్తాడు. ప్రాయం మాయ అనే సుఖానికి అలవాటు చేస్తుంది. అందువల్ల మోహం అనే తనయుడు జన్మించి, వాడి గుణాలచేత నరకం అనే పురానికి తీసుకుపోతాడు. కానీ శ్రీవేంకటేశ్వరుడు అనే స్నేహితుడు మానవాళి మనస్సుల్లో కొలువై ఉండి, విరక్తి అనే మగువను జన్మింపజేస్తాడు. అందువల్ల మోక్షసంపదలు ఆర్జించడం సాధ్యమైందని అన్నమయ్య తెలియజెప్పారు.

ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమంటే మొదటి రెండు చరణాల్లో ప్రాయంవల్ల, సుఖంవల్ల ఇద్దరు కొడుకులు పుట్టి, నరకానికి దారులు వేసుకున్నారు. వేంకటేశ్వరునివల్ల పుట్టిన విరక్తి అనే కూతురు మనల్ని పుణ్యలోకాలకు తీసుకుపోతుందని అన్నమయ్య విశదీకరించారు. సాధారణంగా కొడుకులు పున్నామనరకం నుండి తప్పిస్తారని నాటినుండి నేటివరకూ మనుషులు భావిస్తున్నారు. నాటి సమాజంలో స్త్రీ ఒక భోగవస్తువుగా భావించబడింది. అన్నమయ్య ఆ విధానాన్ని నిరసించారు. సమాజంలో స్త్రీల పాత్రను ప్రశంసించారు. స్త్రీలకంటే స్వామిపై వ్యామోహం మేలని చెప్పారు. ఆ నాటికే అన్నమయ్య సమాజంలో వస్తున్న మార్పులను గమనించారు. స్త్రీ పురుషులమధ్య సమభావాన్ని అప్పుడే ప్రస్తావించారు. ప్రజల్లోని మూఢవిశ్వాసాలను తొలగించడానికి ప్రయత్నించారు. ఆయనను అనుసరించిన ప్రబంధకవుల్లో ఒకరైన ధూర్జటి ‘కొడుకులు పుట్టరటన్చు నేడ్తురవివేకుల్’ అన్నారు. 17వ శతాబ్దానికి చెందిన ధర్మపురి నరసింహ శతకకర్త అయిన లక్ష్మీనృసింహకవి తదితరులు అన్నమయ్య మార్గాన్ని అనుసరించారు. అన్నమయ్య ఈ లోక పోకడలకు ఎంత గురైనప్పటికి మోక్షసాధనమే పరమలక్ష్యంగా జీవించారు. సంసార బంధాన్ని మనుషులకు కట్టినందుకు ఒకానొక సందర్భంలో అన్నమయ్య ఆ దేవుణ్ణే నిలదీశార

**ధన్యాసి రాగం**

**పల్లవి:**

"సామాన్యమా పూర్వ సంగ్రహంబగు ఫలము

నేమమున బెనగొనియె నేడు నీవనక

**చరణం:**

జగతిఁబ్రాణులకెల్ల సంసారబంధంబు

తగులబంధించు దురితంపుగర్మమున

మగుడ మారకుమారు మగువ నీ ఉరముపై

తెగికట్టిరెవ్వరో దేవుండవనక." (*సంపుటం1.200:133*)

ఈ కీర్తనలో 'సంసారంవల్ల కలిగిన బాధలు నీకు కూడా తప్పలేదు. అలాంటిది మానవమాత్రులం మేమెలా తప్పించుకుంటాం? మనుషులను సంసారం అనే బంధంతో కట్టడానికి నీవు మన్మథుణ్ణి చేశావు. తత్ఫలితంగా నీ ఉరం మీద లక్ష్మి కొలువైంది. మనుషులను సంసార సాగరంలో ముంచి తేల్చే నిన్ను సముద్రంలో పాముపై పండుకోబెట్టారు. ఒక్కచోట ఉండనియ్యకుండా ఏదో ఒక సమస్యలో మమ్మల్ని ఇరికిస్తావు కనుక నీకు భార్యతో విభేదం వచ్చింది. కాబట్టే నీకు కూడా కొండలు, గుట్టలు గతి అయ్యాయి.' అని అన్నమయ్య ఆ దేవునితో పరాచకాలాడారు. ఈ మాట అనగలగడానికి స్వామితో ఉన్న చనువే కారణమని అనేక సంకీర్తనల్లో అన్నమయ్య చెప్పుకున్నారు. ఆయన భక్తుడే కాదు. అంతకు మించి ధైర్యవంతుడు కూడా. దేవుని నానారకాల భావించిన భక్తులకు మాత్రమే సాధ్యమయ్యే మాట అది. మనుషులకు ఇన్ని బంధాలుంటేనే ఎదుటివారి మాట వినడంలేదు. దేవుని కార్యాలు చేయడంలేదు. అన్నీ సక్రమంగా ఉంటే వాడి గర్వానికి హద్దు కూడా ఉండదని అన్నమయ్య భావం. అయినా వాటన్నింటికి నీవే కారణం కదా! అని అన్నమయ్య ఆ దేవునితో తన సాన్నిహిత్యాన్ని చాటుకున్నారు.

**మలహరి రాగం**

**పల్లవి:**

"కొన మొదలేదో గురికానరొరులు

మునుకొను సంసార మోహాంధమందు

**చరణం:**

తలచును బ్రహ్మాండతతులకునవ్వల

తలచేటి జీవుడు తానణువు

అలరినయాసల అనలును గొనలును

వెలసె సంసార వృక్షములోన."" (*సంపుటం2.117:79*)

మానవులు సంసారం అనే మోహాంధకారంలో పడి దేవుని ఎలా నిర్లక్ష్యం చేస్తున్నారో ఈ కీర్తనలో అన్నమయ్య వివరించారు. సంసారపుటాశల్లో పడి, మనిషి ఇంకేవీ పట్టించుకోవడంలేదు. తాను ఈ లోకానికి వచ్చిన కారణాన్ని మరచిపోయి, సంసారసాగరంలో కొట్టుకుపోతున్నాడని ఈ కీర్తనలో సవిస్తరంగా వివరించారు. కాబట్టి మనిషి ఆ భగవంతునిపై గురి పెట్టలేక వ్యర్థుడవుతున్నాడని ఆయన విచారం వ్యక్తం చేశారు. సంసారం అనే మహావృక్షం చాలా బలవత్తమంగా ఉంటుంది. ఈ లోక పోకడలకు మనుషుల్ని నిరంతరం గురి చేస్తూనే ఉంటుంది. ఈ సంసార బాధలనుండి తప్పించేవాడు ఆ వేంకటేశ్వరుడేనని చాలా సంకీర్తనల్లో చెప్పారు. అన్నమయ్య ఆ భగవంతునిపై ప్రతి విషయంలో ఆధారపడ్డారు. "అకర్మమునెరగను, సుకర్మమునెరగను, ప్రకటసంసారముపై పాటు మానను." (*సంపుటం2.2:2.*) ఈ లోకంలో సుకర్మలు, అకర్మలు నాకు తెలియదని ఆ దేవునిముందు నిర్భయంగా ఒప్పుకున్నారు. కనుక

ఆ వేంకటేశ్వరునికే సర్వం అర్పించుకున్నారు. ఈ లోకంలో జరిగే పనులన్ని నీ ఆధీనంలోనివేనని, అన్నీ నీవు ఇచ్చినవేనని కింది కీర్తనలో తెలియజేశారు.

**శంకరాభరణ రాగం.**

**పల్లవి:**

"ఇతని ప్రసాదమే ఇన్నియును

గతి యితనిదే కన కాదనరాదు.

**చరణం:**

కాయములోనొక ఘనసంసారము

ప్రాయంబులలో ప్రబలీనీ

ఆయమందుకొను హరితానేయై

దాయక పాయక తగిలున్నాడు." (*సంపుటం2.492:341.*)

ఈ కీర్తనలో ఘనసంసారం, కలలో సంసారం, కోర్కులలో సంసారం అనే మూడు రకాలైన సంసారాలను అన్నమయ్య పేర్కొన్నారు. అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తూ ఆ వేంకటేశ్వరుడే మానవాళికి ధ్రువమయ్యాడని చెప్పారు. ఇలా అన్నమయ్య ప్రతి సమస్యను ఆ దేవుడిముందు పెట్టారు. సంసారంలోని లొసుగులను, మోహావేశాలను, వాటివల్ల కలిగే ఆశలను సునిశితంగా పేర్కొన్నారు. ఆ సంసార కర్మలనుండి తప్పించే దేవుని గొప్పదనాన్ని తెలియజేశారు. అన్నమయ్యకు సంసారం ఆ భగవన్నామ స్మరణకు అడ్డురాలేదు. కానీ సంకీర్తనల్లో మాత్రం సంసారం భగవంతుని స్మరణకు అడ్డుగా పేర్కొన్నారు. ఇలా సంసారంపై తన నిరసనను తెలియజేసిన అన్నమయ్య ఇద్దరు భార్యలతో సంసారసాగరాన్ని బాగానే ఈదుకురాగలిగారు.

## 2.1.2. పూజలు, ఉత్సవ విశేషాలు

అన్నమయ్య సంకీర్తనల్లో శ్రీవేంకటేశ్వరుని కైంకర్యాలు, ఉత్సవ విశేషాలు వివరించబడ్డాయి. తిరుమలలో వివిధ సందర్భాలలో జరిగే ప్రత్యేకమైన పూజలు ఈ కీర్తనల్లో పేర్కొనబడ్డాయి. అత్యంత ప్రసిద్ధిగాంచిన తిరుమల బ్రహ్మోత్సవాలు అన్నమయ్య కాలంనాటికే జరిగినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అన్నమయ్య ఆ విశేషాలన్నింటిని కీర్తనాబద్ధం చేసి ఆ ఉత్సవాలకు మరింత ప్రాచుర్యం కల్పించారు. స్వామికి నిత్యం జరిగే కైంకర్యాలకు సంబంధించిన కీర్తనలు ఉన్నాయి. అన్నమయ్య నరసింగరాయలు కొలువునుంచి తిరుమలకు వచ్చిన తరువాత బ్రహ్మోత్సవాలను ఏర్పాటు చేశారని మనకు శాసనస్థమైన ఆధారాలున్నాయి. నేటికీ బ్రహ్మోత్సవాలను మనదేశం నుంచి మాత్రమే కాకుండా ఇతరదేశాలవారు కూడా వచ్చి, తిలకించి, ఆస్వాదిస్తున్నారంటే అదంతా అన్నమయ్య చలవేనని ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. బ్రహ్మోత్సవాలలో శ్రీవేంకటేశ్వరుని తిరుమల వీథుల్లో వివిధ అర్చక మూర్తుల రూపంలో ఊరేగిస్తారు. ఆ వర్ణనలన్నీ అన్నమయ్య కీర్తనల్లో చూడవచ్చు. ఆ ఉత్సవాల సందర్భంగా భక్తులు వేంకటేశ్వరుని కన్నులారా దర్శించుకొని కైవల్య ప్రాప్తి పొందుతున్నారు. రథం మీద ఊరేగే శ్రీదేవుని వైభోగాన్ని, భక్తుల కోలాహలాన్ని ఈ కీర్తనల్లో మనం చూడవచ్చు. ఆ కీర్తనలను కింద విశ్లేషించడం జరిగింది.

## సాలంగనాట రాగం

**పల్లవి:**

"ఇదివో వీథివీథుల నీతని తేరు
ఎదుట శ్రీవేంకటాద్రుని తేరు

**చరణం:**

చట్టువడ దోలె నాడు సముద్రాలపై దేరు
గొట్టగా దోలెను పౌంట్రుపునిపై దేరు
జట్టిగొని తోలె జరాసంధునిపై దేరు
కొట్టి తోలె హంసడి భక్తులపై తేరు" (*సంపుటం2.109:74.*)

ఈ కీర్తనలో విష్ణుమూర్తి కృష్ణావతారంలో చేసిన యుద్ధాలగురించి పేర్కొనబడింది. జరాసంధుడు, పౌంట్రుపుడు, హంసడిభకుడు మొదలైనవారిపై ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా యుద్ధం చేయడానికి అనుసరించిన విధానాన్ని అన్నమయ్య మొదటిచరణంలో పేర్కొన్నారు. రెండో చరణంలో కులపర్వతాలు, కౌరవసేన, మధుర మొదలైన సమూహాలపై చేసిన యుద్ధాన్ని గురించి చెప్పబడింది. శిశుపాలుని సంహరణం, రుక్మిణి కళ్యాణ ఘట్టం మొదలైన సందర్భాలలో చేసిన యుద్ధాలను గురించి మూడో చరణంలో చెప్పారు. హంసడిభకుని ఈ కీర్తనలో భక్తుడిగా అన్నమయ్య సంబోధించారు. ఎవరెవరికి శ్రీకృష్ణుడు మోక్షప్రాప్తి కలిగించాడో? ఎవరెవరిపై యుద్ధంలో గెలిచాడో? అన్నమయ్య కూలంకషంగా వివరించారు. శ్రీకృష్ణుని మంచి సారథిగా వర్ణించారు. అలాంటి తేరు తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడు అలమేలుమంగ సమేతుడై అధిరోహించగా కన్నులపండుగగా కదులుతోందని అన్నమయ్య వివరించారు. నిత్యకళ్యాణం పచ్చతోరణంలా మెరిసిపోయే వేంకటేశ్వరుడు బ్రహ్మోత్సవాల సందర్భంలో అత్యంత వైభవంగా తిరుమలలో ఊరేగుతున్నాడని అన్నమయ్య చెప్పారు. ఆ సమయంలో ప్రజలకు చూడడానికి రెండు కళ్ళు చాలవు. ఆ అనుభూతి అనుభవించాల్సిందే తప్పా మాటలతో చెప్పడానికి అలవికాదు, చేతలతో చూపించడానికి చేతకాదు. ఆయా సందర్భాలలోని ఒక్కొక్క సంఘటనను, శ్రీదేవుని మాయా విశేషాలను ఈ కీర్తనల్లో పేర్కొనడం జరిగింది. ఇలా బ్రహ్మోత్సవాలను అన్నమయ్య సంకీర్తనాబద్ధం చేశారు.

## లలిత రాగం

**పల్లవి:**

"షోడశ కళానిధికి షోడశోపచారములు
జాడతోడనిచ్చలును సమర్పయామి

**చరణం:**

అలరు విశ్వాత్మకునకు ఆవాహనమిదే సర్వ
నిలయునకు ఆసనము నెమ్మిమిదే
అలగంగాజనకునకు అర్ఘ్య పాద్యాచమనాలు
జలధిశాయికి నిమజ్జనమిదే." (*సంపుటం2.132:90.*)

ఈ కీర్తనలో అన్నమయ్య ఆ వేంకటేశ్వరుని మహిమను పొగిడారు. పదహారు కళలకు నిలయమైనవాడికే షోడశోపచారాలు సమర్పించారు. విశ్వాత్మకుడైన ఆ దేవుణ్ణే అన్నమయ్య తాను పూజించే విగ్రహంలోకి ఆవాహనం గావించి ఆసనం వేశారు. గంగాజనకుడైన స్వామికే అర్ఘ్యపాద్యాలిచ్చారు. జలధిశాయికే స్నానం చేయించారు. తరువాత వస్త్రాలంకారాలు భూషణాదులను అలంకరించారు. భూమిని మోసేవాడికే పుష్పాలు, గంధాలు, ఇంకా నానారకాలైన సుగంధద్రవ్యాలతో ధూపం వేశారు. లోకానికి వెలుగునిచ్చేవాడి ముందే దీపం పెట్టారు. దేవతలకు అమృతాన్ని అందించిన స్వామికే నైవేద్యం పెట్టారు. చంద్రునివంటి చల్లని చూపులుగలవానికే కర్పూర తాంబూలమిచ్చారు. అపారమైన భక్తితో అనేక దండాలు పెట్టి సేవించారు. ఇలా అన్నమయ్య ఆ దేవుని మహిమలు, గొప్పదనాన్ని ఒకవైపు తెలియజేస్తూనే ఇంకొకవైపు 'ఈ పూజలన్నీ చేస్తున్నాను. నా అజ్ఞానంవల్ల అపచారం జరిగితే క్షమించ' మని ఆ దేవదేవుణ్ణి వేడుకున్నారు. ఈ కీర్తనలో ప్రతి రోజూ స్వామికి జరిగేటువంటి నైవేద్య, పూజా విశేషాలను గురించి అన్నమయ్య చెప్పారు. ఆ పూజలన్ని తిరుమలలో నేటికీ అమలవుతున్నాయి. ఈ కీర్తనలో మొత్తం 16 రకాలుగా అన్నమయ్య చేసిన ఉపచారాలను మనం చూడగలం.

## శ్రీరాగం

**పల్లవి:**

"ఇందిర వడ్డించనింపుగను
చిందక యిట్లే భుజించవో స్వామీ

**చరణం:**

అక్కాశపాశాలు నప్పాలు వడలు

పెక్కైన సైదంపు పేణులును

చక్కెర రాశులు సద్యోఘృతములు

కిక్కిరియనారగించవో స్వామి.” (సంపుటం1.22:15.)

అన్నమయ్య ఈ కీర్తనలో నానారకాల పిండివంటలను మొదటి చరణంలోను, రెండో చరణంలో మిరియాల తాలింపు, నోరూరించే పచ్చళ్ళు, మూడో చరణంలో పిండివంటలతోపాటు పాలు, పెరుగులు, దివ్యమైన అన్నాలు అన్నీ లక్ష్మీదేవిచేత వడ్డింపజేశారు. వాస్తవానికి ఈ కీర్తనలో పేర్కొన్నన్ని వంటలు మనం మన జీవితంలో ఎప్పుడూ చూసి ఉండం. అక్కాశపాశాలు, పేణులు లాంటి పదార్థాల పేర్లు ఇప్పుడు చాలామట్టుకు లేవు. ఈ పదార్థాలన్నీ కడుపునిండా ఆరగించమనడానికి ‘కిక్కిరియ’ (మహా ఇరుకుగా) అనే అచ్చమైన తెలుగుమాటను అన్నమయ్య వాడారు. అన్ని పదార్థాలను వెండి కంచంలో అన్నమయ్య సమర్పించారు. కానీ నేడు ఆ కంచం బంగారుమయమైంది. ఆ కంచంలో స్వామికి వివిధ రకాలైన నేతివంటకాలను వడ్డిస్తున్నారు. తిరుమలలో స్వామికి పెట్టే ప్రసాదాల్లో లడ్డు ప్రాశస్త్యం మనందరికీ తెలుసు. లడ్డు మాత్రమే కాకుండా అక్కడ తీపి వడలు, కలకండ తదితరాలను ప్రసాదాలుగా పెడుతున్నారు. అన్నమయ్య ఈ కీర్తనలో చక్కెరను రాశిపోసి స్వామికి సమర్పించారు.

**మాళవిగౌళ రాగం.**

**పల్లవి:**

“నిత్యపూజలివివో నేరిచిననోహో

ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి

**చరణం:**

తనువే గుడియట తలయే శిఖరమట

పెను హృదయమె హరి పీఠమటా

కనుగొను చూపులే ఘనదీపములట

తనలోపలి అంతర్యామికిని.” (*సంపుటం2.82:55.*)

మన శరీరమే ఆలయం. తలే శిఖరం. విశాలమైన హృదయమే ఆ హరికి పీఠం. పవిత్రమైన చూపులే ఘనదీపాలు. మాటే మంత్రం. నాలుకే పిడిఘంట. అనేకరకాల రుచులు ఆ హరికి నైవేద్యాలు. గమనమైన చేష్టలు ఆ హరికి అవయవ సాదృశ్యాలు. దేవునిపైని కోరికగల భక్తుడే దాసుడు. అమరిన ఊర్పులే ఆయనకు విసనకర్రలు అని అన్నమయ్య ఈ కీర్తనలో భావించారు. మనస్సు, వాక్కు, శరీరాలను ఆ స్వామికి అర్పించి పూజించారు. తాను చెప్పేది ముందుగా ఆచరించి ఇతరులకు చెప్పేవారు కనుక మనోవాక్కాయ కర్మలతో పూజించిన నాడే ఆ స్వామి సాక్షాత్కారం మానవులకు లభిస్తుందని అన్నమయ్య ప్రబోధించారు.

తిరుమల ఉత్సవాల గురించి మాత్రమే కాకుండా ఇతర దేవతలకు జరిగే ఉత్సవాలను, కైంకర్యాలను అన్నమయ్య తన కీర్తనల్లో నిక్షిప్తం చేశారు. ఆ కీర్తనల్లో ఆయా దేవతల మాహాత్మ్యాలను, ఊరేగింపులను, పూజా కార్యక్రమాలను విశ్లేషించారు. అహోబల నరసింహునిపై చేసిన అలాంటి సంకీర్తనను కింద విశ్లేషిస్తున్నాను.

**నాట రాగం**

**పల్లవి:**

"దేవశిఖామణి దివిజులువొగడ
వేవేలవతులు వెలసీవాడే

**చరణం:**

వీథుల వీథుల వెసదురగముపై
బేదిల బల్లెము బిరబిరదిప్పుచు
మోదముతోలుత మోహనమూరితి
ఏవే చూచిన నేడీవాహము" (*సంపుటం2.93:63.*)

ఈ కీర్తనలో అహోబల నరసింహునికి జరిగే కైంకర్యాలను, ఊరేగింపులను గురించి తెలియజేశారు. ఇక్కడ కూడా నరసింహమూర్తిని ఉగ్రనారసింహుడిగానే చూపించారు. 'రథం మీద ఊరేగుతున్న నరసింహస్వామి చేతిలో బల్లెం గిరగిరా తిప్పుతున్నాడు. కన్నులను తిప్పుతూ, చెవులకు ఇంపును కలిగిస్తూ, ఎక్కడ చూసినా తానే అయి ఉండి, అందరిని సమ్మోహితులను చేస్తున్నాడు. గుర్రం మీద కూర్చొని, నేర్పుతో దాన్ని అదుపు చేస్తున్నాడు.

అందరిపై బాణాలను వేసి, వారిని తనవైపుకు తిప్పుకుంటున్నా'డని అన్నమయ్య ఆ నరసింహుని మాయా మహిమలను విశదీకరించారు. ఈ కీర్తనలో మనస్సును గుఱ్ఱంతో పోల్చి చెప్పారు. స్వామి చేష్టలను వివరించారు. అందరిపై మాయ అనే బాణాలు వేస్తూ, అందరిని సమ్మోహితుల్ని గావించుకుంటున్నాడని అన్నమయ్య అహోబల నరసింహుడు చూపిన ప్రతిభా కౌశలాలను వివరించారు. ఈ కీర్తన అహోబలంలో చేసే ఉత్సవాలను, కైంకర్యాలను గురించి వివరిస్తుంది.

## 2.1.3. పారమార్థికాంశాలు

అన్నమయ్య ఇహపరాలను గురించి తన కీర్తనల్లో పేర్కొన్నారు. ఆ సంకీర్తనల్లో ఎన్నో పారమార్థిక అంశాలు పేర్కొనబడ్డాయి. ఆ అంశాలు శ్రీవేంకటగిరిని చేరుకోవడానికి మార్గాలుగా ఉపకరిస్తాయి. ఎవరైనా ఈ లోకాన్ని వదిలి వెళ్ళాక ఆ లోకాన్ని చేరుకోవడానికి కొంత పుణ్యం చేసి ఉండాలి. అలా చేయకపోతే జీవునికి ఆ పరమును చేరుకోవడం దాదాపు అసాధ్యం. ఆ అంశాలన్నింటిని అన్నమయ్య తన సంకీర్తనల్లో కూలంకషంగా తెలియజేశారు. ఆ కీర్తనలను కింద విశ్లేషిస్తున్నాను.

**పాడి రాగం**

**పల్లవి:**

"అదివో చూడరో అందరు మొక్కరో
గుదికొని బ్రహ్మము కోనేటి దరిని

**చరణం:**

రవిమండలమున రంజిల్లుతేజము
దివి చంద్రునిలో తేజము
భువి అనలంబున పొడమిన తేజము
వివిధంబులైన విశ్వతేజము" (*సంపుటం2.487:337.*)

ఈ కీర్తనలో విశ్వమంతా వ్యాపించి ఉన్న విశ్వాంతరాత్ముని గురించి చెప్పబడింది. ఆకాశంలోని సూర్యమండలంలో, చంద్రునిలో, భూమి మీద, భూ అంతర్భాగంలో, అగ్నిలో ఇలా విశ్వమంతా నిత్యం వెలుగుతూ, అందరిని వెలిగిస్తూ ఆ విశ్వతేజం ప్రకాశిస్తోందని మొదటి చరణంలో అన్నమయ్య పేర్కొన్నారు. సముద్ర మథనం సందర్భంలో, వైకుంఠంలో

దేవతలను పోషించినవాడు, యోగులందరికి పోషణకర్త, ఈ జగాలన్నింటినీ పోషించేవాడు ఆ శ్రీదేవుడే. ఆయనే యాగఫలం, తపఃఫలం, తలపుల్లో దానఫలం. ఆ వేంకటేశ్వరుని కలిగి ఉండడమే నిజమైన ఫలం అని రెండు, మూడు చరణాల్లో చెప్పారు. అంతటి పుణ్యఫలాలను మానవాళికి కలగజేసే ఆ దేవుణ్ణి భక్తితో మొక్కాలని, అప్పుడే మనకు స్వర్గసుఖాలు, మోక్షప్రాప్తి కలుగుతాయని అన్నమయ్య అన్నారు.

**గౌళ రాగం**

**పల్లవి:**

"ఊరకే దొరకునా ఉన్నతోన్నత సుఖము
సారంబు దెలిసీకా జయము చేకొనుట

**చరణం:**

తలపులోపలి చింత దాచినప్పుడు కదా
అలరి దైవంబు ప్రత్యక్ష్యమౌట
కలుషంబు దుర్మదము గడచినప్పుడు కదా
తలకొన్న మోక్షంబు తనకు చేపడుట" (*సంపుటం2.103:70.*)

ఈ కీర్తనలో భగవంతుడు అనుగ్రహించే సుఖం అంత సులభంగా రాదని అన్నమయ్య చెప్పారు. 'మనస్సులోపలి ఆలోచనలన్నీ ఆ భగవదర్పితం అయినప్పుడే ఆయన ప్రత్యక్ష్యమవుతాడు. కలుషాలు, దుర్మదాలు మానవులలోనుంచి పోయినప్పుడే మోక్షప్రాప్తి కలుగుతుంది. కర్మలకు సంబంధించిన పాపాలు కడిగినట్లుగా పోతేనే నిర్మలమైన జ్ఞానం సిద్ధిస్తుంది. రహస్యమేమిటంటే మనస్సు ఆ శ్రీహరివైపు మరలిస్తే, ఆయన ప్రేమను పొందగలిగితే ఆ మనిషి జన్మ అత్యున్నతమైందిగా పరిగణించబడుతుంది. తన ఆత్మలో శాంతస్వభావాన్ని అలవరచుకుంటే తాను నేర్చుకున్న విద్యలన్నీ సార్థకమైనట్లే. శ్రీవేంకటేశ్వరుని దాస్యాన్ని ఎవరైతే ఇష్టపడతారో వారికి మోక్షప్రాప్తి కలుగుతుంది. ఒక్కటే దారి. అదే శ్రీహరి సేవ' అని ఈ కీర్తనలో అన్నమయ్య తెలియజెప్పారు. అన్ని క్రియలను ఆ భగవంతునికి అర్పిస్తే అదే మానవాళికి నిజమైన మోక్షం అని ప్రబోధించారు. ఈ కీర్తనల్లో మోక్షానికి చేరుకోవడానికి అన్నమయ్య అనేక మార్గాలను చూపించారు.

**మాళవిగౌళ రాగం**

**పల్లవి:**

"కలియుగమెటులైన కలదుగా నీ కరుణ

జలజాక్ష హరిహరి సర్వేశ్వరా

**చరణం:**

పాపమెంత కలిగినా పరిహరించె యెందుకు

నాపాల గలదుగా నీనామము

కోపమెంత కలిగినా కొచ్చి శాంతమిచ్చుటకు

చేపట్టి కలవుగా నా చిత్తములో నీవు" (*సంపుటం2.419:290.*)

ఈ కీర్తనలో అన్నమయ్య భక్తిపరంగా కొంత ధైర్యాన్ని ప్రదర్శించారు. అందుకే కలియుగంలో ఆ వేంకటేశ్వరుని కరుణను కోరుకున్నారు. 'ఎంత పాపం చేసినా నాపాలిట ఉన్న నీ నామమే పరిహరించింది. నేను కోపంగా ఉన్నప్పుడు కొంచెం శాంతం ఇవ్వడానికి నా మనస్సులో నీవు తిష్ఠ వేసుకొని కూర్చున్నావు. ఈ భూమిపై ఇంద్రియాలు నన్ను ఎంత తరిమినా నీ శరణాగతి నన్ను సరిగ్గా రక్షించింది. ఈ లోకంలో కర్మబంధాలు అనే తాళ్ళు ఊడిపోజేయడానికి నీ భక్తి నిరతం నా వెంట ఉంటుంది. నాకు హితమైన ఇహపరాలు, నాకిష్టమైనవన్నీ ఇవ్వడానికి నీ సంకీర్తన ఉంది. నా తపస్సు ఫలింపజేయడానికి మా అమ్మ కమలాదేవి ఉంద'ని అన్నమయ్య ఆ భగవంతునితో తన విశ్వాసాన్ని ప్రకటించారు. ఈ కీర్తన నిత్యమైన మార్గాన్ని అన్వేషించేందుకు దారి చూపింది. ఇష్టమైనవి ఇహపరాలు కావాలని అన్నమయ్య కోరుకున్నారు. అందుకే కలియుగంలో శ్రీవేంకటేశ్వరుని కృపాకటాక్షాలు పొందడంలో విజయం సాధించారు.

## 2.2. అన్నమయ్య బోధలు

అన్నమయ్య తన కీర్తనలను సాధారణమైన భాషలో రచించారు. ఈ కీర్తనలన్నీ ఏదో ఒకరూపంలో వేదాంత తత్త్వాన్ని బోధిస్తున్నాయి. ఈ కీర్తనలను చదివితే ఆయన బోధించిన అంశాలు మనకు సూటిగా, స్పష్టంగా అర్థమవుతాయి. అన్నమయ్య సంకీర్తనల్లో సామాజిక బోధ, స్వకీయ బోధ, రాజులపై నిరసన, పాప పుణ్యాల విశ్లేషణ, దేవునితో వాదులాట, నిరసనలు, వేడుకోలు, నొచ్చుకోలు, అలకలు, దేవుని మాయ, లోకానుభవాలు

మనకు కనిపిస్తాయి. అధ్యాత్మ సంకీర్తనల్లో ఎక్కువభాగం తత్త్వాలకు సంబంధించిన కీర్తనలు కనబడతాయి. సమాజంలో అన్నమయ్య సమకాలీన కవులు ఈ లోకగతంగా ధన, వస్తు, కనకాది భోగాలను అనుభవిస్తూ కాలాన్ని వ్యర్థం చేశారు. వారిని అన్నమయ్య నిరసించారు. అందుకే వారు అన్నమయ్య సంకీర్తనల్లో సాహిత్యం లేదని, భాష కూడా అంత గాంభీర్యంగా లేదని ఆ సాహిత్యాన్నే పక్కన పెట్టారు. కానీ అయిదువందల పైచిలుకు సంవత్సరాలవుతున్నా అన్నమయ్య పాటకు పట్టాభిషేకం జరుగుతోందేగాని తృణీకారానికి గురి కాలేదు. అన్నమయ్య సంకీర్తనల్లో సామాజిక చిత్రణ, జీవనవిధానాలు కనిపిస్తున్నాయి. సమాజంతో గాఢమైన అనుబంధాన్ని కలిగి ఉన్నాయి. అలాంటి సంకీర్తనలను ఒక్కొక్కటిగా కింద విశ్లేషించడం జరిగింది.

## 2.2.1. సామాజిక బోధ

అన్నమయ్య తన సంకీర్తనల్లో సమాజానికి ప్రాధాన్యం ఇచ్చారు. సమాజం బాగుంటే దేవుని కైంకర్యాలు ఎక్కువగా జరుగుతాయని ఆయన ఉద్దేశం. మనతో నివసించేవారు బాగుంటేనే మనం బాగుంటాం అన్నది అన్నమయ్య అనుసరించిన సిద్ధాంతం. అన్ని మతగ్రంథాలు 'నీ పొరుగువారి పట్ల ప్రేమభావాన్ని కలిగి ఉండాల'ని బోధిస్తున్నాయి. అన్నమయ్య కాలం నాటి సమాజంలో అనేక భేదాలున్నాయని కొన్ని కీర్తనలవల్ల మనకు తెలుస్తోంది. దేవుళ్ళ మధ్య అనేక భేదాలు కొనసాగాయి. అలాగే మనుషులమధ్య కూడా అంతకు మించిన భేదాలను అన్నమయ్య గమనించారు. మతం ప్రాతిపదికన కొట్టుకొనేవారి సంఖ్య చాలా ఎక్కువైంది. శైవుల మధ్య, వైష్ణవుల మధ్య పూజావిధానాల్లో కాలగమనంలో ఎన్నో చెప్పుకోదగ్గ పరిణామాలు వచ్చాయి. ప్రజలమధ్య పెరిగే మతద్వేషాలను, వైషమ్యాలను అన్నమయ్య గమనించారు. అన్నమయ్య వైష్ణవాన్ని పాటించినప్పటికీ ఈ రెండు ధోరణుల మధ్య సయోధ్య కుదర్చాల్సిన అగత్యం ఏర్పడింది. అందుకే ఆ భేదాలను పోగొట్టడానికి అన్నమయ్య ప్రయత్నించారు. దేవుడొక్కడే. ఆయన సర్వాంతర్యామి. ఆయనకు మనం అనేక నామాలు తగిలించి పూజిస్తున్నాం అనే భావనను అన్నమయ్య బలపరిచారు.

**భౌళి రాగం**

**పల్లవి:**

"తందనానా ఆహీ తందనానా పురే

తందనానా భళా తందనానా

తందనానా భళా తందనానా

బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే

పరబ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే

**చరణం:**

కందువగు హీనాధికములిందు లేవు.

అందరికి శ్రీహరే అంతరాత్మ

ఇందులో జంతుకులమంతా ఒకటే

అందరికి శ్రీహరే అంతరాత్మ." (*సంపుటం2.374:259.*)

ఈ కీర్తనలో అన్నమయ్య పరబ్రహ్మ తత్త్వాన్ని ఆవిష్కరించారు. మనుషుల మధ్య కుల, మత, జాతి భేదాలను ఖండించారు. ఈ లోకంలో ప్రతి ప్రాణికి కలిగే కష్టసుఖాలు, కామ మోహాలు, దుఃఖాలు ఒకటే. జీవులకు కలిగే ఆకలి ఒకటే. సువాసనలు, దుర్వాసనలు వెదజల్లే వాయువు ఒకటే. బ్రాహ్మణుడు, చండాలుడు, రాజు, బంటు నిద్ర ఒక్కటే. మానవ పశుపక్షాదులకు కలిగే కామసుఖం ఒకటే. ఇన్ని మరచి మనుషుల మధ్య భేదాలు ఎందుకు? అని సూటిగా ప్రశ్నించారు. ఈ కీర్తనలో కులాన్ని నిరసించారని కొందరు పండితులు అన్నమయ్యను మెచ్చుకున్నారు. కానీ కులం ఒక్కటి మాత్రమే కాదు. అన్నిరకాలైన భేదాలను, వివక్షలను అన్నమయ్య నిరసించారు. ఇప్పుడున్న కుల, మత, జాతి విద్వేషాలు అప్పుడూ ఉన్నాయి. కానీ ఇప్పుడు మనం వాటిని భూతద్దంలో పెట్టి చూస్తున్నాం. దానికి కారణం పెరిగిన టెక్నాలజి, మీడియా కావచ్చు. అయితే, రాజాశ్రయాలను పొంది, వారిని పొగడడానికి అలవాటు పడ్డ కవిపుంగవులలాగా కాకుండా అన్నమయ్య ఇలా ఆలోచించడానికి బహుశా సమాజంలోనే ఉంటూ, నిత్యం దాని పోకడలను గమనిస్తూ, జీవితం గడుపుతూ ఉండడం కారణం కావచ్చు. ఏ ఒక్క భేదానికి అన్నమయ్య పరిమితం కాకుండా ఈ లోకంలో మానవుల, పక్షుల, జంతుజాలాలమధ్య తలెత్తే భేదాలన్నింటిని గురించి కూలంకషంగా ఈ కీర్తనలో చర్చించి నిరసించినట్లు మనం అర్థం చేసుకోవాలి. అంతా ఆ భగవత్ స్వరూపమే కనుక పాప పుణ్యాల ప్రశంస చేసేవాడు, న్యాయాన్యాయాలను నిర్వహించి తేల్చేవాడు కూడా ఆ భగవంతుడేనని అన్నమయ్య గాఢంగా నమ్మారు. కాబట్టి

జగతినంతటిని కాపాడే ఆ వేంకటేశ్వరుని శరణు వేడాలని సమాజానికి హితవు పలికారు. ఈ భావం తన సమకాలీన కవుల్లో మనం చూడలేం.

**పాడి రాగం**

**పల్లవి:**

"వేదంబెవ్వని వెదకెడినీ

ఆ దేవునిగొనియాడుడి

**చరణం:**

అలరిన చైతన్యాత్మకుడెవ్వడు

కలడెవ్వడెచట గలడననిన

తలతురెవ్వనిని దనువియోగదశ

ఇలనాతని భజియించుడి." (*సంపుటం1.5:4.*)

'వేదాలు ఏ దేవుణ్ణి గూర్చి చెప్తున్నాయో? త్రైలోక్యాధిపతి ఎవరో? దేహ వియోగదశ సమయంలో మనం ఎవడిని గురించి తలచుకుంటామో? ఈ లోకాలన్నింటిని ఎవడు రక్షిస్తున్నాడో? మన పితృపాదులు ఎవడిని వేడుకొని మోక్షం పొందారో వాణ్ణి కీర్తించి, భజించా'లని అన్నమయ్య అభిప్రాయపడ్డారు. ఈ కీర్తన పోతన భాగవతంలో గజేంద్రుడు చెప్పిన 'ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై', 'కలడందురు దీనులయెడ' అనే పద్యాలను పోలి ఉంది. ఆ కథలో గజేంద్రుడు మొసలితో పోరాడి, అలసిపోయి, విష్ణుమూర్తిపై ఆధారపడి 'నీవే తప్పనితఃపరంబెరుగ మన్నింపన్ దగున్ దీనునిన్' అని శరణువేడి ముక్తి పొందుతాడు. అలాంటి సూచన అన్నమయ్య సమాజానికి చేశారు. అన్నమయ్య ఇలాంటి కీర్తనలలో పోతనను అనుసరించారు. అందుకే ప్రజలకు శరణాగతి భక్తి అలవడడానికి ఈ కీర్తనలో పైసూచనలు చేశారు.

**సామంతరాగం**

**పల్లవి:**

"వలచి పైకొనగరాదు వలదని తొలగరాదు

కలికి మరుడునేసినాజ్ఞ తొలగరాదురా

**చరణం:**

అంగడికెత్తినట్టి దివ్వెలంగన ముఖాంబుజములు

ముంగిటి పసిడి కుంభములును ముద్దుల కుచయుగంబులు
ఎంగిలిసేసినట్టి తేనెలితవులైన మెరుగుమోపులు
లింగములేని దేహములు లెక్కలేని ప్రియములు.” (*సంపుటం1.1:1.*)

ఈ కీర్తన శృంగార కీర్తనలాగా అనిపిస్తుంది. సర్వం ఆ శ్రీహరి ఆజ్ఞతోనే నడుస్తుంది. ఆయన లేకుండా ఏమి లేదని అన్నమయ్య ఉద్దేశం. ఈ కీర్తనలో ఎన్నో లోక సత్యాలు దాగి ఉన్నాయి. మరీ ముఖ్యంగా కొందరు కష్టాల్లో ఉన్నప్పుడు దేవునికి అవి చేస్తాం, ఇవి చేస్తాం అని మొక్కుకుంటారు. వారి కష్టాలు తీరగానే ఆ మొక్కుల గురించి మరచిపోతారు. అలాంటి వారి ప్రస్తావన ఈ కీర్తనలో చేయబడింది. ఈ కీర్తనలో ఎన్నో సామెతలను, నుడికారాలను నిక్షిప్తం చేసి అన్నమయ్య రచించారు. అందుకే శ్రీవేంకటపతిని దర్శించడం, భజించడం, సంకీర్తనాగానం చేయడం అన్ని కార్యాలకన్నా ప్రధానమైన కార్యం అని అన్నమయ్య తెలియజేశారు.

**శుద్ధవసంతం**

**పల్లవి:**

“ఇందిరనామమిందరికి
కుందనపు ముద్ద ఓ గోవిందా

**చరణం:**

అచ్యుతనామము అనంతనామము
యిచ్చిన సంపదలిందరికి
నచ్చిన సిరులు నాలుక తుదలు
కొచ్చి కొచ్చీనోగోవిందా.” (*సంపుటం1.8:6.*)

ఈ కీర్తనలో అన్నమయ్య లక్ష్మీదేవి నామాన్ని తలచినవారికి సంపదలకు కొదవలేదని చెప్పారు. అమ్మవారి నామాన్ని అపరంజితోను, మేలిమి బంగారు ముద్దతోను పోల్చారు. వైకుంఠమూర్తి అయిన శ్రీవేంకటేశ్వరుని నామాన్ని భజించడంవల్ల అన్ని సంపదలు కలుగుతాయి. ఎందుకంటే భక్తులకు ఆయనే ఒక నిధి, కొంగుబంగారం అని అన్నమయ్య సమాజానికి తెలియజేశారు.

## గుండక్రియ రాగం

**పల్లవి:**

"యే పురాణముల నెంత వెదకినా
శ్రీపతి దాసులు చెడరెన్నడునూ

**చరణం:**

హరివిరహితములు అవి కొన్నాళ్ళకు
విరసంబులు మరి విఫలములు
నరహరి కొలిచిటు నమ్మిన రవములు
నిరతములెన్నడు నెలవులు చెడవు." (*సంపుటం2.88:59.*)

ఈ కీర్తనలో పోతన భాగవతంలోని ప్రహ్లాదుడు హిరణ్యకశపునితో చెప్పిన 'కమలాక్షునర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ' అనే పద్యం గుర్తుకు వస్తుంది. దానిలో ఉన్నంత గాఢత, తిరుగుబాటు తత్త్వం, ఇతర మతాల నిరసన ఈ కీర్తనలో లేవు కానీ అంతకు మించిన ప్రత్యేకమైన అర్థాన్ని ఈ కీర్తన కలిగి ఉంది. హరికి వేరుగా నివసించే మానవుడు ఏమి చేయలేడు. ఆ మార్గాలు కూడా దుర్మార్గాలై ఉంటాయి. అని ఈ కీర్తనలో అనేక అంశాలను అన్నమయ్య ప్రస్తావించారు.

## సామంత రాగం

**పల్లవి:**

"హరీ నీ ప్రతాపమునకడ్డమేది లోకమున
సరివేరీ నీకు మరీ సర్వేశ్వరా

**చరణం:**

నీవు నీళ్ళు నమిలితే నిండెను వేదములు
ఈవల తలెత్తితేనె ఇంద్రపదవులు మించే
మోవ మూతిగిరిపితే మూడులోకాలు నిలిచే
మోవిబార నవ్వితేనె ముగిసిరసురులు." (*సంపుటం2.153:105.*)

ఈ కీర్తనలో అన్నమయ్య ఆ దేవుని మహిమలను గురించి చెప్పారు. ఆ శ్రీహరి నీళ్ళు నమిలితేనే జ్ఞానరూపమైన వేదాలు పూర్తయ్యాయి. ఆకాశంవైపు తలెత్తి చూస్తే ఇంద్రుని సింహాసనంకన్నా మించిపోయారు. రాక్షసులతో యుద్ధం చేయకుండా మనసారా నవ్వితే

వాళ్ళందరికీ పుణ్యలోకాలు ప్రాప్తించాయి. గోటితో గీరితే ఆ నీళ్ళు కొండలంతటా ప్రవహించాయి. మారుకొంటేనే ఆ నీళ్ళు మడుగుల రూపంలో నిలిచాయి. కాలు తగలగానే శిల అహల్య అయింది. గోపాలకులను ఇంద్రుని బారినుండి కాపాడడానికి కొండను కోరగా అది గొడుగైంది. ఇలా అన్నమయ్య ఆ హరి మహిమలను వివరించారు. ఈ కీర్తనలో శ్రీ వేంకటేశ్వరుని గొప్పతనాన్ని పురాణేతిహాస శాస్త్రగతంగా నిరూపించారు. అలాగే తనను ఆశ్రయించినవారికి వేరే దేవుణ్ణి ఆశ్రయించాల్సిన అవసరం లేదనే సత్యాన్ని అన్నమయ్య ఈ కీర్తనలో నిక్షిప్తం చేశారు. 'నీకు సాటి ఎవరున్నారు?' అనే మాటకు 'సరి వేరీ?' అని 'ఏరీ?' అనే ప్రశ్నకు ఆ రోజుల్లో 'వేరీ?' రూపం ఉంది. ఆ రూపం ఈ కీర్తనలో ప్రయోగించబడింది.

## గుజ్జరి రాగం

**పల్లవి:**

"త్రికరణశుద్ధిగ చేసిన పనులకు
దేవుడు మెచ్చును లోకము మెచ్చును
ఒకటికోటి గుణితంబగు
మార్గములుండగ ప్రయాసబడనేల

**చరణం:**

తన మనసే పరిపూర్ణమైన గోదావరి గంగా కావేరి
కనకబిందు యమునాదయాది ముఖ్యక్షేత్రంబుల సంతతమున్
దినకర సోమగ్రహణకాలముల తీర్థాచరణలు చేసిన ఫలములు
తనుతానే సిద్ధించును వూరకే దవ్వులు తిరుగగ మరియేలా?"

(*సంపుటం2.233:158.*)

ఈ కీర్తనలో అన్నమయ్య త్రికరణశుద్ధిగా ఆచరించిన పనులను దేవుడు మెచ్చుకుంటాడు. ఆ తరువాతే లోకం మెచ్చుకుంటుంది అన్నారేగాని లోకం తరువాత దేవుడు మెచ్చుకుంటాడని చెప్పలేదు. దేవుణ్ణి వెదకడానికి ఒకటికి కోటికోట్ల మార్గాలున్నాయని చెప్పడానికి అన్నమయ్య "ఒకటికోటి గుణితంబగు మార్గములుండగ" 'ఒకటి సంఖ్యను కోటితో కూడి, గుణిస్తే వచ్చే మార్గాలు ఉండగా వృథా ప్రయాసపడడం ఎందుకు?' అన్నారు. మనస్సు పవిత్రంగా ఉంచుకుంటే గంగా, గోదావరి, కావేరి, యమునాది ప్రముఖమైన నదులలో పుణ్యస్నానం ఆచరించి, ఆ నదుల ఒడ్డున వెలసిన

పుణ్యక్షేత్రాలను సూర్య చంద్రుల గ్రహణ కాలంలో దర్శించినంత పుణ్యం కలుగుతుందని అన్నమయ్య చెప్పారు. 'ఆ హరి అనే రెండు అక్షరాల పేరును తెలిపే ముఖ్యమైన వేదాలు, పురాణాలు క్రమంగా చదివితే పుణ్యం కలుగుతుంది. యోగం, తపస్సు ఇంకా బహుసాధనల సారం, ఇతర మతాల్లోని శ్రేష్ఠమైన విశేషాంశాలన్నీ ఇక్కడే ఉండగా వేరే విషయాలను గురించి అన్వేషణ ఎందుకు? మొదట శ్రీవేంకటేశ్వరునికి మనస్సులో చెయ్యెత్తి నమస్కరిస్తే చాలు. షోడశ దానయాగాలు, పంచమహాయజ్ఞాలు చేసిన పుణ్యం పరిపూర్ణంగా కలుగుతుంది. ఆయనే మన మనస్సులోని క్లేశాలను పోగొడుతుంటే మాటిమాటికి వేరే ఆలోచనలు ఎందుకు?' అని అన్నమయ్య సమాజాన్ని సూటిగా ప్రశ్నించారు.

**ఆహిరి రాగం**

**పల్లవి:**

"యేటికి దలకెదరిందరును

గాటపు సిరులివి కానరో ప్రజలు

**చరణం:**

ఎండలబొర్లక యేచిన చలిలో

నుండక చరిలోనుడుకక

అండనున్న హరినాత్మదలచిన

పండిన పసిడే బ్రతుకరో ప్రజలు" (*సంపుటం1.102:69.*)

ఈ కీర్తనలో అన్నమయ్య ప్రజలను సూటిగా హెచ్చరిస్తున్నారు. 'ఈ తుచ్ఛమైన సిరులగురించి ఎందుకు తలుస్తారో? అర్థం కాదు. ఎండలో పొర్లకుండా, చలిలో ఉండకుండా మంటల్లో ఉడకకుండా ఆ హరిని తలచి ప్రజలు బ్రతకాల'ని అన్నమయ్య సూచించారు. ఈ కీర్తనలో మనకు వచ్చే ఆలోచనలను ఎండ, వాన, చలి, మంట మొదలైన ప్రాకృతిక అంశాలతో అన్నమయ్య పోల్చారు. రెండో చరణంలో తపస్సు చేసే మునులను గురించి చెప్పబడింది. 'అడవుల్లో ఉంటూ, ఆకులు అలమలు తింటూ, తాము కరిగిపోతూ ఉండడంకంటే లక్ష్మీపతికి దాసులై ఉండి అత్యున్నత పదవులు పొందడం మేల'ని అన్నమయ్య తెలియజేశారు. మూడో చరణంలో ఆయా పుణ్యక్షేత్రాల సందర్శనం చేసి, పుణ్యాన్ని పొందాలనుకొనే వారిగురించి తెలియజేశారు. కాళ్ళు పొక్కులై పుండ్లు పడేట్లుగా దిక్కుదిక్కుకు తిరగడంకంటే తిరుమలలోని శ్రీవేంకటేశ్వరుని చూస్తూ ఏకమనస్కులై

ఉండాలని అన్నమయ్య తెలియజేశారు. ఈ కీర్తన ద్వారా 'సమాజమే దేవాలయం' అనే సూత్రాన్ని ప్రతిపాదించారు. ఎక్కడెక్కడికో వెళ్ళి, కష్టాలను కొనితెచ్చుకోవడంకంటే ఏకమనస్కులై శ్రీవేంకటేశ్వరుని సేవించడం ఉత్తమం అని సమాజానికి హితవు చెప్పారు. ఇలా సమాజానికి ఎప్పటికప్పుడు ఆ దేవుని ఉనికిని, గొప్పదనాన్ని తెలియజేస్తూ అన్నమయ్య భగవంతుని సేవలో సమాజ హితంకోసం పాటుపడ్డారు. అందుకే అన్నమయ్య అడవులలోకన్నా సమాజంలో ఉంటూ, వారి బాధలను గురించి ఎప్పటికప్పుడు ఆలోచిస్తూ, ఆ దేవునికి ప్రజల కష్టాలను విన్నవించేవారని ఈ కీర్తనలవల్ల తెలుస్తోంది. ఆ దేవునిలో ఉండడానికి, ఆ దేవుణ్ణి సేవించడానికి సమాజం అడ్డు కాదని నిరూపించిన మొట్టమొదటి వాగ్గేయకారుడు అన్నమయ్య. ఈ కీర్తనలలో సమాజ ఔన్నత్యాన్ని తెలియజేస్తూ సమాజం ఆ దేవునిపై భక్తి ప్రపత్తులు కలిగి ఉండాల్సిన తీరును తెలియజేశారు.

## 2.2.2. అన్నమయ్య తత్త్వబోధ

అన్నమయ్య సంకీర్తనలలో తత్త్వకీర్తనల ప్రాధాన్యం చెప్పుకోదగింది. తత్త్వం అంటే తర్కించడం. ఆ దేవుని గురించిన తర్కం ఈ కీర్తనల్లో ప్రధానం. మనిషి ఇలా ఉంటే బాగుంటుంది అని చెప్పడం జరుగుతుందే గాని మానవ జీవితాన్ని కచ్చితంగా నిర్దేశించడం మాత్రం జరగదు. ఈ కీర్తనల్లో మిన్ను విరిగి మీద పడ్డా దానికి కారణం ఆ దేవుడే గాని ఇతరాలు కారణం కావు అని తలచబడింది. అందుకే ఎక్కువగా ఆ దేవుని మీద ఆధారపడడం మనం చూడగలం. ఈ రోజుల్లో తత్త్వం చాలా సాధారణమైంది. ఏదైనా మంచి జరిగితే అది తన కృషిగా మానవుడు భావిస్తున్నాడు. అదే చెడు జరిగితే దేవునిపై నెట్టివేయడం అలవరచుకున్నాడు. ఆ కోణాలకు కొంత వ్యతిరేకంగా అన్నమయ్య తన సంకీర్తనలను తీర్చిదిద్దారు. ఈ తత్త్వకీర్తనలనే వేదాంత కీర్తనలు అంటారు. లోకంలో జరిగే ప్రతి అంశాన్ని తత్త్వగతంగా చూడడం, దానికి వేదాంతాన్ని ఆపాదించడం అన్ని సందర్భాలలో సాధ్యంకాదు. అన్నమాచార్యులు ప్రతి విషయాన్ని తత్త్వగతంగా చెప్పారు. ఆ శ్రీవేంకటేశ్వరునిలో ఉన్న వారు ఏమి చేయాలో? ఏమి చేయకూడదో? చెప్పారు. అన్నమయ్యది వీలు చిక్కినప్పుడల్లా వేదాంతం మాట్లాడే లక్షణం కాదని మనకు ఈ కీర్తనలను చదువుతుంటే అర్థమవుతుంది. ఏదైనా చెప్పాలంటే ముందుగా దాన్ని ఆచరణలో పెట్టి, ఆ తరువాత ప్రజలకు ప్రబోధించేవారని మనం అంతకు ముందే తెలుసుకున్నాం. అన్నమయ్య

చేసిన సూచనలు మనల్ని ఆలోచింపజేస్తాయి. భక్తిలో పటిష్ఠతను అవి తెలియజేస్తాయి. భక్తుడుగా అన్నమయ్య తనను తానే పరీక్షించుకున్నారు, నిరూపించుకున్నారు. తాత్త్వికమైన ఈ కీర్తనలను చదువుతుంటే మనకు తెలియకుండానే అన్నమయ్య సృష్టించిన అలౌకిక ప్రపంచంలోకి వెళ్ళిపోతాం. ఆ ప్రపంచంలో ఈతిబాధలు, చీకూచింతలు, కష్టసుఖాలు ఉండవు. నిత్యం ఆ భగవన్నామ స్మరణతో మనస్సంతా హాయిగా ఉంటుంది. అంత గొప్పగా అన్నమయ్య సంకీర్తనారచన గావించారు. అలాంటి కీర్తనలను కింద విశ్లేషించడం జరిగింది.

**భౌళి రాగం**

**పల్లవి:**

"యెవ్వరిఁగాదన్న నిది నిన్నుఁగాదంట

యెవ్వరిఁగొలిచిన నిది నీ కొలువు

**చరణం:**

అవయవములలో నదిగాదిదిగా

దవిమేలివి మేలననేల

భువియుఁభాతాళము

దివియు నందలిజంతు నివహమింతయును నీ దేహమేకాన."

*(సంపుటం1.9:6.)*

ఈ కీర్తనలో సర్వ దేవతల సమానత్వాన్ని అన్నమయ్య ప్రకటించారు. 'ఎవ్వరిని కొలిస్తేనేమి! అది ఆ వేంకటేశ్వరునికే దక్కుతుంది. ఎలాగంటే శరీరంలోని అవయవాలలో మేలైనదాన్ని మనం ఎంచలేం. అన్ని అవయవాలు సక్రమంగా పని చేస్తేనే శరీరం బాగుంటుంది. ఏ ఒక్కటి లోపించినా శరీరానికి బాధ, నష్టం కలుగుతుంది. అలాగే దేవుడొక్కడే. ఆయనను మనం అనేకరకాలుగా ఆరాధిస్తున్నా'మని అన్నమయ్య చెప్పారు. సాటి మనిషిని కూడా దైవం లాగా చూడాలని ఈ కీర్తనలో చెప్పారు. ఎవరినైనా తృణీకరిస్తే అది ఆ భగవంతుణ్ణి తృణీకరించడంలాంటిది. ఎవరినైనా ఆదరిస్తే అది ఆ భగవంతునికే చెందుతుంది. ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్నాడు కాబట్టి శ్రీవేంకటేశ్వరునికి సర్వాంతర్యామి అనే పేరు వచ్చింది. అందుకే 'విష్ణుడొక్కడే విశ్వాంతరాత్ముడు' అన్నారు. ఈ కీర్తనలో అంతటా ఆ అంతర్యామి తత్త్వాన్ని అన్నమయ్య ప్రకటించారు.

**భౌళి రాగం**

**పల్లవి:**

"యెంతమాత్రమున ఎవ్వరు తలచిన
అంతమాత్రమే నీవు
అంతరాంతరములెంచి చూడ
పిండంతే నిప్పటి అన్నట్లు

**చరణం:**

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మంబనుచు
తలతురు మిము శైవులు తగిన భక్తులును శివుడనుచు
అలరిపొగడుదురు కాపాలకులాదిభైరవుండనుచు

**చరణం:**

సరినెన్నుదురు శాక్తేయులు శక్తి రూపు నీవనుచు
దరిశనములు మిము నానావిధులనుతలపుల కొలదుల భజింతురు
సిరుల మిమునే అల్పబుద్ధి తలచినవారికి అల్పంబగుదువు
గరిమల మిమునే ఘనమని దలచిన ఘనబుద్ధులకు ఘనుడవు
నీవలన కొరతేలేదు మరి నీరుకొలది తామెరవు
ఆవల భాగీరథి దరి బావుల ఆ జలమే ఊరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మముచేకొని ఉన్న దైవమని
ఈవలనే నీశరణనెదను ఇదియే పరతత్త్వము నాకు."
(సంపుటం2382:265.)

ఈ కీర్తనలో అంతర్యామి తత్త్వాన్ని, వైష్ణవ తత్త్వాన్ని గురించి అన్నమయ్య నొక్కి వక్కాణించారు. ఇందులో మొదటి చరణం చిన్నదిగా, రెండవ చరణం పెద్దదిగా ఉంది. దాని అర్థవిస్తృతి కూడా అంతే పెద్దది. మనుషులమధ్య భేదాలను పోగొట్టేందుకు అన్నమయ్య చేసిన మరో మంచి ప్రయత్నం ఈ కీర్తన. 'యద్భావం తద్భవతే' ఎవ్వరెలా భావిస్తే వారికి అలా కనిపించడం ఆ పరమాత్మ తత్త్వమని అన్నమయ్య ఈ కీర్తనలో మనకు తెలియజేశారు. చాలా గాఢమైన భావాన్ని ఈ కీర్తనలో అమర్చారు. ఎంత పిండికి అంత నిప్పట్టు (అరిసె)

వచ్చినట్లు ఆ దేవుడు కూడా ఎలా భావించి తన్మయత్వాన్ని పొందితే అలా దర్శనమిస్తాడని ఈయన ప్రయోగాత్మకంగా వివరించారు. ఇతరులలో కూడా ఆ భగవంతుడే ఉన్నాడు. వారిని చూసి నవ్వితే అదే నవ్వు మనకు సమాధానంగా వస్తుంది. కోపానికి కోపమే ప్రతిగా కనబడుతుంది. కాబట్టి ఎవ్వరెలా భావిస్తే అలా కనబడతారని అన్నమయ్య ఉద్బోధించారు. ఈ కీర్తనలో స్వామితో గాఢమైన అనుబంధాన్ని కలిగి ఉండాలని, సగం అటూ, సగం ఇటూ ఉండే తత్త్వం ఇక్కడ పనికిరాదని అన్నమయ్య భావించారు. అందుకే జనులు ఆ వేంకటేశ్వరునిపై అపారమైన భక్తి ప్రపత్తులు కలిగి ఉండాలని మనసారా వాంఛించారు.

**హిందోళ వసంతం**

**పల్లవి:**

"మూడే మాటలు మూడుమూళ్ళు తొమ్మిది
వేడుకొని చదువరో వేదాంత రహస్యము

**చరణం:**

జీవస్వరూపము చింతించి అంతటాను
దేవుని వైభవము తెలిసి
భావించి ప్రకృతిసంపద యిదే ఎరుగుటే
వేవేలు విధముల వేదాంత రహస్యము." (*సంపుటం2.230:156.*)

ఈ కీర్తనలో అన్నమయ్య వేదాంతాన్ని అతితక్కువ మాటల్లో, సులభంగా చెప్పడంలో విజయులయ్యారు. ఈ వేదాంత రహస్యాలను ఆ భగవంతుని వేడుకొని చదవాలని అన్నమయ్య చెప్పారు. ఈ ప్రకృతిలో మనం క్షుణ్ణంగా గమనించినట్లైతే ఆ భగవత్ స్వరూపం వేలకొలదిగా ఉంది. అంటే మొట్టమొదటిగా ప్రకృతినే అన్నమయ్య దేవుడుగా భావించారు. ఈ కీర్తన రెండో చరణంలో ఏ పని చేస్తున్నా తనలోని జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ ఉండాలని అన్నమయ్య చెప్పారు. తనలోని జ్ఞానాన్ని తప్పకుండా తలపోసుకుంటూ, ఏ పనిలో ఉన్నా వైరాగ్యంపట్ల సుముఖత వ్యక్తం చేయడమే నిజమైన వేదాంత రహస్యం అని చెప్పారు. ఆ వేంకటేశ్వరుని మీద భక్తి కలిగి, సదాచారాలను, విశ్వాసాలను ఆచరించి, ఈ లోకంలో ఆ భగవదైక్యాన్ని కోరుకోవడమే నిజమైన వేదాంతం అని అన్నమయ్య చెప్పారు. ఈ కీర్తనలోని పల్లవి "మూడే మాటలు మూడు మూళ్ళు తొమ్మిది" అనే వాక్యంతో మొదలవుతుంది. నేటికీ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు

పిల్లలచేత ఎక్కాలు చెప్పిస్తూ ఉంటారు. ‘మూడొకట్ల మూడూ మూడు రెళ్ళు ఆరు, మూడు మూళ్ళు తొమ్మిది’ అని పిల్లలు చాలా పెద్దగా, శ్రావ్యంగా, లయబద్ధంగా చెప్తూ ఉంటారు. మనం నేడు అది గమనించవచ్చు. ఈ విధానాన్ని అన్నమయ్య అనుసరించారు. ఆ కాలంలో బహుశా వేద పురాణాది శాస్త్రాలతోబాటు గణితశాస్త్రాన్ని బోధించేటప్పుడు వారి గురువులు అలాగే చెప్పించి ఉండవచ్చు. అంటే మన పూర్వ కాలంనుండి విద్యా విధానంలో బాహ్య పఠనం (బిగ్గరగా నేర్చుకోవడం) ఒకభాగమైపోయిందని దీని ద్వారా తెలుస్తోంది.

**దేశాక్షి రాగం**

**పల్లవి:**

“హీనదశలఁబొంది యిట్ల మందుటకంటే
నానావిధులను నున్ననాఁడే మేలు

**చరణం:**

అరుదయిన క్రిమికీటకాదులందుఁబుట్టి
పరిభవములనెల్లఁబడితిఁగాని
యిరవైనంచిత నాఁడెంతయులేదు యీ
నరజన్మముకంటే నాడెమేలు.” (*సంపుటం1.3:3.*)

అన్నమయ్య ఈ కీర్తనలో ఈ మానవ జన్మవల్ల అత్యంత హీనమైన పరిస్థితులను అనుభవించాలని అన్నారు. దీనికంటే క్రిమికీటకాలలాగా పుట్టడం మేలని చెప్పారు. ‘క్రిమికీటకాలలో పుట్టి అవమానాలపాలు అయ్యాను గానీ స్థిరమైన ఆలోచన లేకపోయినప్పటికీ మానవజన్మ కంటే అప్పుడే మేల’ని అన్నమయ్య తలంచారు. హేయమైన జంతుజన్మ ఎత్తి అనేక బాధలను, వేదనలను అనుభవించినా కలిమి లేములను గురించి ఆలోచిస్తూ తిరగడంకంటే అప్పుడే మేలు. ‘పాపం అనే నరకకూపంలో పడ్డాను. ఆ వేంకటేశ్వరుని అనుగ్రహం లభించింది కాబట్టి ఇప్పుడు మేలు జరిగిం’దని అన్నమయ్య తన పూర్వ జన్మలను గురించి ఊహించుకున్నారు. ఈ కీర్తనలో అన్నమయ్య మనిషిగా పుట్టడానికి ముందు ఒక జీవి ఎన్ని జన్మలెత్తాలో? ఆయా జన్మలలో వారు ఎన్ని బాధలు అనుభవించాలో? వివరించారు. అయితే, మానవజన్మలో ఉన్నంత ఉత్కృష్టత ఇంకొక జన్మలో రావడం అసాధ్యం అని అన్నమయ్య భావన. ఎందుకంటే ఎన్ని జన్మలెత్తినా దేవుణ్ణి

ప్రత్యేకంగా ఆరాధించలేం. అది ఒక్క మానవ జన్మకే సాధ్యం. సాక్షాత్తుగా ఆ దేవుడే మనిషి జన్మ ఎత్తిన కారణంగా దీని ఉత్కృష్టతను అన్నమయ్య గ్రహించారు. దశావతారాలు ఎత్తిన దేవుడు మానవాళికి మార్గనిర్దేశనం చేశాడు గానీ మిగిలిన పక్షులకు, జంతుజాలానికి క్రిమికీటకాదులకు చేయలేదు. కాబట్టి మానవులకు ఆ దైవానుగ్రహం సూటిగా అందుతుందని అన్నమయ్య భావించారు.

**గుండక్రియ రాగం**

**పల్లవి:**

"మానుషముగాదు మఱి దైవికముగాని
రానున్నా అది రాకుమన్నాఁబోదు

**చరణం:**

అనుభవమునకుఁబ్రాప్తమయినది
తనకుఁదానే వచ్చి తగిలికాని పోదు

**చరణం:**

తిరువేంకటాగిరిదేవుని
కరుణచేతఁగాని కలుషమింతయుఁబోదు." (*సంపుటం1.6:4.*)

ఈ కీర్తనలో అన్నమయ్య పల్లవిలో మానుషముగాదు అన్నారు. ఈ సృష్టిలో మంచి అయినా చెడు అయినా ఆ దేవుని అనుమతి లేకుండా ఏమీ జరగదు. వచ్చిన ఇబ్బంది ఏమిటంటే దాని కాలం తీరగానే ఉండమన్నా ఉండదు. కొన్ని సమస్యలు మనకు పాఠం నేర్పడానికి మన జీవితంలోకి దేవుడే స్వయంగా పంపిస్తాడు. మనం వాటన్నిటిని తట్టుకొని ధైర్యంగా నిలబడడానికి తగిన శక్తి కూడా ఆయనే ఇస్తాడు. అది ఆయన లీల. దాన్ని ప్రతి ఒక్క భక్తుడు గ్రహించాలని అన్నమయ్య భావం. తిరుమలేశుని పేరే వేంకటేశ్వరుడు. కాబట్టి ఆయన కరుణ లేకుండా పాపకర్మలు మనల్ని విడిచిపోవని అన్నమయ్య గాఢంగా నమ్మారు.

**శుద్ధ వసంతం**

**పల్లవి:**

"సదా సకలము సంపదలే
తుదదెలియగవలె దొలగగవలయు

**చరణం:**

అహర్నిశములునాపదలే సహించిననవి సౌఖ్యములే

ఇహముననవి ఇందరికిని మహిమదెలియవలె మానగవలెను.”

(*సంపుటం1.7:5.*)

ఈ కీర్తనలో చిరాయువునిచ్చే సంపదలేవో అన్నమయ్య తెలిపారు. 'మనుషులకు కష్టసుఖాలు ఆ భగవంతుడు సమానంగా ఇచ్చాడు. ఏదైనా నిరంతరం ఉండదు. ఇదొక చక్రభ్రమణం. ఈ భ్రమణంలో మనిషి కొట్టుకుపోకూడదు. అలాగే మోక్షానికి వెళ్ళేందుకు కావలసిన అవకాశాలన్ని స్వామి సమానంగా ఇచ్చాడు. కాబట్టి స్వర్గ దారులకోసం అన్వేషిస్తూ మానవులు నిత్యం ఆ వేంకటేశ్వరుని నామాన్ని ఆరాధించా'లని అన్నమయ్య ఈ కీర్తనలో తెలియజేశారు.

**గుండక్రియ రాగం**

**పల్లవి:**

“తెలియ చీకటికి దీపమెత్తక పెద్ద

వెలుగులోపలికి వెలుగేల

**చరణం:**

అరయనాపన్నునికభయమీవలెగాక

ఇరవైన సుఖీగాగలనేల

వరతబోయెడివాని వడిదీయవలెగాక

దరివాని దివియంగ దానేల?” (*సంపుటం1.18:12.*)

ఈ కీర్తనలో అన్నమయ్య అజ్ఞానం అనే చీకటికి గురువు అనే దైవపు వెలుతురు అవసరం అని చెప్పారు. 'అజ్ఞానం అనే చీకట్లో ఉన్నవారికి జ్ఞానం అనే దీపం అవసరం కాని వెలుగులో ఉన్నవారికి ఆ దీపం అవసరం లేదు. అలాగే హద్దులు లేకుండా పాపకర్మాలు చేసేవారికి బోధ అవసరం కానీ పుణ్యాత్మునికి అవసరంలేదు. ఆ వేంకటేశ్వరుని కృప లేకుంటే పాపకర్మాలనుండి మనం బయటపడలే'మని అన్నమయ్య ఈ కీర్తనలో బోధించారు. ఈ కీర్తన చివరి పాదాలు 'ఏల?' అనే ప్రశ్నార్థకంతో ముగుస్తాయి. మానవులకు మోక్షమార్గాన్ని చేరడానికి కావలసిన తిరుమంత్రాన్ని పఠించాలని అన్నమయ్య నొక్కి వక్కాణించారు. పై కీర్తనలన్ని అన్నమయ్య చెప్పిన తత్త్వాలలోని అంశాలకు సంబంధించినవి.

ఈ కీర్తనల్లో అన్నమయ్య ఎన్నో సత్యాలను, వేదాంత రహస్యాలను, నిగూఢార్థాలను తెలియజేశారు.

## 2.2.3. స్వకీయ బోధ

తనకు తానుగా బోధించుకోవడాన్ని స్వకీయ బోధ అంటారు. అన్నమయ్య తనకు తానుగా ఎన్నో సంకీర్తనలలో బోధించుకున్నారు. మనస్సు కోతిలాంటిది. ఎన్ని ఆశలను తీర్చుకున్నా ఇంకా ఏదో కావాలంటుంది. అది దాని సహజలక్షణం. దాన్ని అదుపులో పెట్టుకోవడం చాలా కష్టం. మహామహా మునులకు సైతం సాధ్యం కాలేదు. కానీ ఆ వేంకటేశ్వరుని నమ్మిన వారి మనస్సులు పరిపూర్ణంగా ఉంటాయని అన్నమయ్య తెలియజేశారు. ఇక్కడ అన్నమయ్య తనకు తానుగా బోధించుకున్నప్పటికీ ఆ బోధలన్నీ మానవాళికోసం చేసినవే. అన్నమయ్య ఆ దేవుని దగ్గర తగ్గించుకున్న విధానం కీర్తనలలో మనకు కనబడుతుంది. అలాంటి కొన్ని కీర్తనలను కింద విశ్లేషిస్తున్నాను.

**ముఖారి రాగం**

**పల్లవి:**

"చిత్తములో నిన్ను జింతించనేరక
మత్తుడనై పులుమానిసినైతి

**చరణం:**

అరుతలింగముగట్టి అది నమ్మజాలక
పరువతమేగిన బత్తుడనైతి
సరుస మేకపిల్ల జంకబెట్టుక నోట
నరయు గొల్లనిరీతి నజ్ఞానినైతి." (*సంపుటం1.19:13.*)

ఈ కీర్తనలో 'మనస్సులో నిన్ను చింతించకుండా మత్తుణ్ణి, అల్పుణ్ణి అయ్యాను. గొల్లవాడు తన మేకపిల్లను చంకలోనే పెట్టుకొని కనబడలేదని ఊరంతా వెదికినట్లు అర్థలింగాన్ని ధరించి, నమ్మక పుణ్యంకోసం పర్వతాలను అధిరోహించే వ్యర్థభక్తుడనయ్యాను. కొంగుకు ముడుపులు కట్టుకొని మూలమూలల్లో నిన్ను వెదుకుతూ నీమీద మనస్సు లగ్నం చేయకుండా వ్యర్థుడనయ్యాను. దూరదృష్టి లేకుండా మందబుద్ధుడయ్యాను. అలాంటి నన్ను శ్రీవేంకటేశ్వరుడవైన నీవు ఎడబాయక రక్షించుకున్నావు.' అని అన్నమయ్య చెప్పుకున్నారు.

ఈ కీర్తనలో శైవ వైష్ణవుల మధ్య పెరిగిపోతున్న అంతరాలను నిరసించారు. 'అరుతలింగముగట్టి' అని శైవులను, 'ముదుపుకొంగునగట్టి' అని వైష్ణవులను ప్రస్తావించారు. ఎవరైనా కావచ్చు. లోపల ఉండే పరమాత్మను తమకు తామే వెదకాలి గానీ పుణ్యంకోసం తీర్థయాత్రలు చేసినంతమాత్రాన పాపం పుణ్యమైపోదు, దోషి నిర్దోషి కాదు అని అన్నమయ్య చాలా తీవ్రంగా ఇరువురికి ఒక హెచ్చరిక చేశారు. మనిషిని మనిషిగా చూడడం, సాటివారిని ప్రేమించడం ప్రధానం. మతవైషమ్యాలతో మనుషులు ఉండకూడదు. అది ఆ దేవుని దృష్టిలో చాలా పాపం. ఒకరిపట్ల ఒకరికి వివక్ష పనికిరాదు. అలాగే తీర్థయాత్రలకన్నా దైవభక్తి ముఖ్యమని అన్నమయ్య తెలియజేశారు.

**లలిత రాగం**

**పల్లవి:**

"అని ఆనతిచ్చె కృష్ణుడర్జునునితో
విని ఆతని భజించు వివేకమా
భూమిలోన చొచ్చె సర్వ భూతప్రాణులనెల్ల
దీమసాన మోచేటి దేవుడ నేను
కామించి సస్యములు కలిగించి చంద్రుడనై
తేమల పండించేటి దేవుడ నేను." (*సంపుటం2.427:295.*)

ఈ కీర్తనలో భగవద్గీతనంతా పొందుపరిచారు అన్నమయ్య. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు యుద్ధోన్ముఖులై ఉన్న తన సోదరులను, తాతను, గురువులను, బంధుమిత్రులను చూసి ఈ యుద్ధాన్ని కొనసాగించడం నావల్ల కాదని కృష్ణునితో అంటాడు. అప్పుడు సాక్షాత్తూ విష్ణుమూర్తి అయిన కృష్ణుడు చెప్పిన గీతా సారాన్ని అన్నమయ్య కీర్తనగా మలిచారు. అన్నింటికీ ఆ దేవుడే ఆధారం కాబట్టి ఇతర చింతలు వద్దని తన మనస్సుకు నచ్చజెప్పుకుంటూ ఈ కీర్తనను రచించారు. అత్యంత గూఢార్థాన్ని అన్నమయ్య ఈ కీర్తనలో చెప్పారు. 'ఈ భూమి మీద పుట్టే ప్రతి ప్రాణిని ఆ దేవుడే సర్వకాలాలలో మోస్తూ ఉంటాడు. పంటలు పండడానికి ఆయనే కారణం. జీవులలో నిత్యం మండుతూ ఉండే అగ్ని ఆ దేవుడే. జీవించేది ఆయనే. ఈ లోకాన్ని విడిచాక తమ బంధువులకు మరుపు కలిగించేది కూడా ఆయనే. వేదాలకు ఆద్యుడైన ఆ దేవుడు తిరుమలలో శ్రీదేవితో కూడి ఉన్నాడు. అలాంటి ఆ శ్రీ వేంకటేశ్వరుని నిత్యం తలచుకొని భజించ'మని అన్నమయ్య తన ఆత్మకు చెప్పుకున్నారు.

## 2.2.4. వేడుకోలు

భక్తులకు ఆత్మ పరిశీలన చాలా ముఖ్యమైంది. అప్పుడే వారు చేసే పొరపాట్లు తెలుస్తాయి. మరీ ముఖ్యంగా దేవుణ్ణి ఆరాధించడానికి మనసా వాచా కర్మణా పవిత్రమైన జీవితం గడపాలి. అందుకే ఆత్మ పరిశీలన చాలా అవసరం. కాబట్టి నిజమైన భక్తులు తమలో తాము పవిత్రంగా ఉండడానికి ఆ దేవుణ్ణి నిరంతరం శరణు వేడుకుంటారు. అందులో భాగంగా తాము చేసిన తప్పులను సైతం ఏకరువు పెడతారు. అలాంటి భక్తులలో అన్నమయ్య ఒకరు. ఆయన ఎప్పటికప్పుడు తనను తాను పరిశీలించుకుంటూ ఉండేవారు. తప్పు చేశానని, పాపం చేశానని ఇంకా వివిధ రకాలుగా అన్నమయ్య చేసుకున్న నిందారోపణలు మనం ఇలాంటి సంకీర్తనల్లో గమనించగలం. ప్రతి దానికి ఆ దేవదేవునిపై ఆధారపడడం గోచరిస్తుంది.

అన్నమయ్య అధ్యాత్మ కీర్తనలలో దేవుణ్ణి వేడుకోవడం చాలా ముఖ్యమైన విషయం. అన్నింటిలో ఆ దేవుని కరుణకోసం ఎదురు చూడడం, ఆయన అనుగ్రహాన్ని పొందిన తరువాత  ఆ ఆనందానుభూతులను తన సంకీర్తనల్లో నిక్షిప్తం చేయడం మనకు కనిపిస్తుంది. భగవంతుని కరుణ పొందిన భక్తుని ఆనందపారవశ్యాలు అంతా ఇంతా కావు. తాము కోరుకున్నది సాక్షాత్తూ భగవంతుడే ఇస్తే ఏ భక్తులకైనా ఇంకా ఏమి కావాలి! అలాంటి అనుభవాలెన్నో మనకు అన్నమయ్య సంకీర్తనల్లో గోచరిస్తాయి. అలాంటి కీర్తనలను కింద విశ్లేషిస్తున్నాను.

**శుద్ధ వసంతరాగం**

**పల్లవి:**

“పురుషోత్తముడవీవు పురుషాధముడ నేను
ధరలోన నాయందు మంచితనమేది!

**చరణం:**

అనంతాపరాధములు అటునేముసేసేవి
అనంతమైన దయ అది నీది
నినునెరుగకుండేటి నీచగుణము నాది
ననునెడయకుండేటి గుణము నీది.” (*సంపుటం2.53:36.*)

ఈ కీర్తన పూర్తిగా అన్నమయ్య భక్తి పారవశ్యంలో నిండినప్పుడు రచించారని తెలుస్తోంది. సహజంగా భక్తులు దేవుని దగ్గర మొరపెట్టుకొనేటప్పుడు తమ తప్పులన్ని, లోపాలన్ని గుర్తు చేసుకుంటూ ఆ క్షణంలో దేవుని వేడుకుంటారు. కనీసం ఆ సమయంలోనైనా సరైన భక్తి మార్గాన్ని అనుసరించాలని కోరుకుంటారు. కానీ లోకపు పోకడలననుసరించి కొన్ని సందర్భాలలో చేయలేకపోవచ్చు. ఇంద్రియాలను జయించడం కష్టం. ఒకవేళ జయిస్తే తానే భగవంతుడవుతాడు. అంతకన్నా ముందుగా ఇంద్రియాలను జయించడానికి ఆ దేవుడే మార్గం సుగమం చేశాడు కాబట్టి మానవాళికి ముఖ్యంగా భక్తులకి ఇంద్రియాలు త్వరగానే లోబడతాయి. 'నాలో మంచితనం ఏమి లేదు' అంటే అన్నమయ్య మంచివాడు కాదని కాదు. ఉన్న ఆ కొద్ది మంచితనమైనా నీవల్లనే నాకు లభించిందని ఆ దేవునికి కృతజ్ఞతలు చెప్పడం. అదే ఈ కీర్తనలో అన్నమయ్య చేశారు.

**ఆహిరి రాగం**

**పల్లవి:**

"విడువరాదెంతైన వెర్రివాడనైనా నీకు
కడవారు నవ్వకుండా కాచుకో నన్నును

**చరణం:**

జ్ఞానము నేనెరగ అజ్ఞానము నేనెరగ
మానను విషయములు మరిగి ఎంతైనా
నీ నామమునొడిగి నీ దాసుడననుకొందు
దీనికే వహించుకోని దిద్దుకో నన్నును." (*సంపుటం2.2:2.*)

ఈ కీర్తనలో అన్నమయ్య చాలా విషయాలు చెప్పారు. నీ భక్తులను నవ్వులపాలు చేయవద్దని ఆ వేంకటేశ్వరుని వేడుకున్నారు. 'జ్ఞానం, అజ్ఞానం ఎరగను. ముందు వెనక విచారణ లేదు. అకర్మం సుకర్మం తెలియదు. ఇలాంటి మందబుద్ధినైన నాకు నీ ముద్ర ధరింపజేసి నీ కీర్తనలను రచించే భాగ్యం దయచేశావు. ఈ జన్మకు ఇలాగే ఉండనిమ్మ'ని ఆ దేవదేవుని కోరుకున్నారు. ఈ కీర్తనలో కూడా తప్పుచేసినప్పుడు గోముగా నన్ను దండించమని అన్నమయ్య ప్రాధేయపడ్డారు. తాము ఎందుకు జన్మించామో తెలుసుకొని అలా తమ నడవడిని ఈ లోకంలో దిద్దుకుంటే మనుషులు మహాత్ములు, యోగులవుతారు. అలాంటివారిలో అన్నమయ్య అగ్రగణ్యుడు. కాబట్టే ఆయన క్రమం తప్పకుండా రోజుకి ఒక

సంకీర్తన చొప్పున 32000 సంకీర్తనలను రాయగలిగారు. ప్రజలు తాము ఈ లోకంలోకి ఎందుకు వచ్చామో తెలుసుకున్న నాడు తమ పనులు సులభమవుతాయని అన్నమయ్య భావం. ఇలాంటి కీర్తనల్లో అన్నమయ్య తనకు తానే బోధ చేసుకున్నారు. ఎందుకంటే సాటి మనుషులకు చెప్పడంకంటే తనకు తానే బోధించుకోవడంలోనే అన్నమయ్య పారమార్థిక సత్యాలను తెలుసుకోవచ్చని నమ్మారు. అందుకే దేవుణ్ణి నీ దారిలో నడిపించమని మనసా వాచా కోరుకున్నారు.

**గుండక్రియ రాగం**

**పల్లవి:**

"దాచుకో నీ పాదాలకు తగ నే జేసిన పూజలివి

పూచీ నీ కీరితిరూప పుష్పములు ఇవి అయ్యా

**చరణం:**

ఒక్క సంకీర్తనే చాలు ఒద్దికై మము రక్షింపగ

తక్కినవి ఈ భండారానా దాచి ఉండనియ్

వెక్కసమగు నీ నామము వెల సులభము ఫలమధికము

దిక్కై నన్నేలితివి ఇకనవి తీరని నాధనమయ్యా." (*సంపుటం2.330:226.*)

ఈ కీర్తనలో ఎన్నో సత్యాలను అన్నమయ్య మనకు బోధించారు. 'కేవలం ఒక్క సంకీర్తనైనా పాడుకుంటే చాలు అదే మమ్మల్ని రక్షిస్తుంది. మిగిలినవి నీ తిరుమల భండారంలో దాచుకో' అని అన్నారు. అంటే అన్నమయ్య కాలంనాటికే తిరుమల భాండాగారం ఏర్పాటు చేయబడిందని మనం గ్రహించాలి. ఇదంతా నా గొప్పతనమేమీ కాదు నీవే అంతా అన్నారు అన్నమయ్య. 'నా నోటినుండి నీ సంకీర్తనలను పాడించి ఆ పుణ్యాన్ని నాకు ఆపాదింపజేశావు. అందుకు నేను నీకు ఏమి ఇవ్వగలను?' అని అన్నమయ్య ఆ వేంకటేశ్వరునికి కృతజ్ఞతాంజలులు ఘటించారు. 'ఈ నీ కీర్తనలలలో నాకు సంబంధించిన ఏ విషయాలను చెప్పలేదు. నేను పాడేవాణ్ణి. నిన్ను ప్రకటించేవాణ్ణి. నావల్ల ఏమైనా దోషాలుంటే మన్నించి, నీ కరుణను అనుగ్రహించ'మని అన్నమయ్య భగవంతుణ్ణి వినయంతో వేడుకున్నారు. ఈ కీర్తనలో అన్నమయ్య తనకు తానే వాగ్గేయకారుడిగా పరిచయం చేసుకోవడం ఒక విశేషం. అందరికీ అన్ని అబ్బవు. అన్నమయ్యకు అబ్బిన

తిరువేంకటేశ్వర మంత్రాన్ని తన కీర్తనల్లో ప్రస్ఫుటింపజేశారు. ఇలా ఈ కీర్తనల్లో తనకు తానే ఆ శ్రీదేవుని సమక్షంలో దిద్దుకున్నారు. ఎప్పటికప్పుడు భక్తిలో పరిపక్వం చెందారు.

## 2.2.5. లోకానుభవాలు

అన్నమయ్య సంకీర్తనల్లో లోకానుభవాలకు చాలా ప్రాధాన్యం ఉంది. ఈ లోకం మనకు కొన్ని విలువైన, విచిత్రమైన పాఠాలు నేర్పుతుంది. మానవుడు నిరంతరం ఆ పాఠాల వల్ల కొంత అనుభవాన్ని పొందుతాడు. అలా అన్నమయ్య పొందిన అనుభవాలను సంకీర్తనాబద్ధం చేశారు. ఈ కీర్తనల్లో మనిషి ఇతరులతో ఎలా మెలగాలి? ఎలా సాన్నిహిత్యం కలిగి ఉండాలి? ఎలా తన మనుగడకు ఇతరులనుండి ముప్పు వాటిల్లకుండా చూసుకోవాలి? ఎలా ఆ దేవుణ్ణి ధ్యానించాలి? ఇత్యాది విషయాలన్ని మనం గమనించవచ్చు. ఈ కీర్తనల్లో ఎక్కువభాగం సామెతలు, నుడికారాలు ఉండడం పరిపాటి. అయితే, అన్నమయ్య ఏ పదాన్ని కూడా వ్యర్థంగా ప్రయోగించలేదు. అన్ని సందర్భాలలో సాభిప్రాయమైన భావానుగుణమైన పదాలనే ప్రయోగించి పదాలల్లారు. అలాంటి కీర్తనలను కింద విశ్లేషిస్తున్నాను.

**వరాళి రాగం**

**పల్లవి:**

"ఎవ్వారు లేరు హితవు చెప్పగ వట్టి
నవ్వులబడి నేము నొగిలేమయ్యా

**చరణం:**

అడవిబడినవాడు వెడలజోటులేక
తొడరి కంపల కింద దూరినట్లు
నడుమ దురిత కాననములతరిబడి
వెడలలేకనేము విసిగేమయ్యా." (*సంపుటం1.15:10.)*

ఈ కీర్తనలో అన్నమయ్య ఈ లోకంలో నీకన్నా మంచి చెప్పేవాడు లేడు. నీవేగాని లేకపోతే మా బ్రతుకులు నవ్వులపాలు అయిపోతాయని ఆ దేవునితో విన్నవించుకున్నారు. 'అడవిలో దారితప్పినవాడు కంపలకింద దూరినట్లు మేము కూడా పాపాల కంపలనుండి బయటకు రాలేక విసుక్కుంటాం. రోగాలపాల పడినప్పుడు మధురమైన పదార్థాలను

తినబోయి పుల్లనివి తీసుకున్నట్లు మా బ్రతుకులు ఉంటాయి. తనవాళ్ళను విడిచిపెట్టి చెడ్డ సావాసాలు చేసి చెడిపోయినట్లు మనస్సులో ఉన్న దేవుణ్ణి తలుచుకోవడం మాని ఇతర చింతల పాలబడి తిరుగుతుంటాం. కానీ ఈ లోకపు పోకడలనుంచి రక్షించే దేవుడవు నీవే'నని అన్నమయ్య ఆ వేంకటాద్రినాథుని వేడుకున్నారు.

**శ్రీరాగం**

**పల్లవి:**

"నీవే కానింక నేనన్యమెరుగ ఏ

త్రోవచూపి నాకు దోడయ్యేదవయ్యా

**చరణం:**

అపరాధత కొట్లైనవి ఒక్క

నెపమున నను గావనేరవా

అపరిమిత దురితాలైనవి ఏ

ఉపమచేత నన్నునుద్ధరించెదవయ్యా." (*సంపుటం1.17:11.*)

ఈ కీర్తనలో అన్నమయ్య శరణాగతి తత్త్వాన్ని అనుసరించారు. మొదటి రెండు చరణాల్లో తన తప్పులను ఆ దేవుని ముందు ఏకరువు పెట్టారు. మూడో చరణంలో ఆ వేంకటేశ్వరుని శరణు వేడారు. 'నీవు తప్పా ఇంకో విషయం నేనెరుగను. నాకు త్రోవ చూపాల్సింది నీవే, నా తోడుగా నడవాల్సింది నీవే. లెక్కలేనన్ని పాపాలు, కోట్లకొలది అపరాధాలు చేశాను. నీ మతంచేత నేను ఒక్కింత గర్వపడ్డాను. ఓ వేంకటేశ్వరా నీ కరుణచేత నన్ను ఆదరించాల్సింది, మోక్షాన్ని అనుగ్రహించాల్సింది నీవే' అని ఆ తిరుమలనాథుని వేడుకున్నారు. ఇలా ఈ సంకీర్తనల్లో లోకానుభవాలన్నింటినీ వివరించారు.

### 2.2.6. దేవునితో వాదులాట – నిరసనలు

అన్నమాచార్యులు దేవుణ్ణి సకలరక్షకుడుగా, అన్నింటికీ మూలకర్తగా భావించారు. అందుకే ఈ లోకంలో ఏది ప్రాప్తించినా దానికి కారణం నీవేనని ఆ దేవునితో వాదాలాడారు. ఇక్కడ అన్నమయ్య దేవునిపై వాదులాటకు దిగారని అర్థం కాదు. అన్నింటికి తానే కారణం కనుక 'ఆ సమస్యల సుడిగుండాలనుంచి మమ్మల్ని సులువుగా బయటపడేసేవాడివి కూడా నీవేన'ని ఆ దేవుణ్ణి శరణాగతి చేసుకోవడం అని మనం గ్రహించాలి. అన్ని కార్యాలకు

మూలమైనవాడు అందరినీ భరించేవాడు ఆ భగవంతుడొక్కడే. ఆయనను శరణాగతి చేసుకుంటే కలిగే లాభాలు అన్ని ఇన్ని కావు. ఆ సత్యాన్ని అన్నమాచార్యులు గ్రహించారు.

**దేశాక్షి రాగం**

**పల్లవి:**

"నిన్ను దలచి నీపేరు దలచి
నన్ను కరుణించితే నెన్నికగాక

**చరణం:**

అధికుని గాచుట యేమరుదు నన్ను
నధముని గాచుట యరుదుగాక
నీకు మధురమవుటేమరుదు
చేదు మధురమవుటే మహిలోనరుదుగాక." (*సంపుటం1.27:18.*)

ఈ కీర్తనలో అన్నమయ్య ఆ దేవునితో తన సాన్నిహిత్యాన్ని, చనువును చాటుకున్నారు. కాస్త వ్యంగ్యంగా తన తప్పులను ఆయనముందు ఏకరువు పెడుతూనే ఆ దేవుని రక్షణ కోరారు. 'నిన్ను నిత్యం స్మరించే నన్ను కాపాడు. అయినా నావంటి అల్పుణ్ణి కాపాడాలి గానీ అధికుణ్ణి కాపాడితే ప్రయోజనమేమిటి? ఈ సృష్టిలో చేదు తీపైతే వింత. గొప్పవాళ్ళను కాకుండా ఘనపాపినైన నన్ను కాపాడు.' అని అన్నమయ్య వేంకటేశ్వరునికి సూచన చేశారు. అందుకే తెలుగులో 'రోగికే గాని ఆరోగ్యవంతుడికి వైద్యుడు అవసరంలేదు' అనే సామెత వచ్చింది. అదే తత్త్వాన్ని అన్నమయ్య అలవరచుకున్నారు.

## 2.2.7. పాప పుణ్యాల విశ్లేషణ

పాప పుణ్యాలు మనిషి జీవితంలో ఒక భాగం. నిత్యం పడుతూ లేస్తూ ఉండే మానవుడు పాపాలు చేస్తాడు, పుణ్యం గడిస్తాడు. ఇది పాపం, ఇది పుణ్యం అని ఇతరుల విషయాలలో తీర్పు చెప్తూ ఉంటాడు. అలాంటి మనిషి తన విషయంలో మాత్రం దాన్ని బేరీజు వేసుకోడు. కానీ భక్తులు తమ విషయంలో పాపానికి చోటిస్తున్నామేమో! అని తమను తాము ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూ ఉంటారు. ఇహాలకు సంబంధించిన విషయాలకు భక్తులైనవారు అంత ప్రాధాన్యం ఇవ్వరు. వారి ధ్యాస, కోరికలు భగవంతునిపై ఉంటాయి. కాబట్టి వారి పాప పుణ్యాల విశ్లేషణ అంతా పరానికి సంబంధించింది. అందులో

అన్నమయ్యను మనం ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఆయన ఉద్దేశంలో శ్రీవేంకటేశ్వరుని శరణు వేడకపోవడమే పాపం. ఆయన సంరక్షణలో బ్రతకలేకపోవడమే మహాపాపం. ఆయన కరుణకు పాత్రమవడమే పుణ్యం. ఆ స్వామి కృపా కటాక్షాలకు పాత్రమై ఉంటే చాలు. అన్ని సుఖాలు వాటంతట అవే వస్తాయి. శ్రీ వేంకటనాథుడే అన్ని సంపదలకు మూలం. కాబట్టి 'హరిని కీర్తించే నా నాలుక మనుషులను కీర్తించదు' అని నరసింగరాయలుచే శిక్షకు కూడా గురయ్యారు. ఆ అనుభవాలన్నింటిని రంగరించి చాలా సంకీర్తనల్లో పాప పుణ్యాల విశ్లేషణ చేశారు. ఆ కీర్తనలను కింద విశ్లేషించడం జరిగింది.

**ముకారి రాగం**

**పల్లవి:**

"అనుమానపు బ్రదుకది రోత
తనమనసెనయని కూటమి మరి రోత

**చరణం:**

అపకీర్తులబడి ఆడికె లోనయి
అపవాదియౌట అది రోత
ఉపమ గెలిచెనేనని ఒరు జెరుచుటలు
విపరీతపు గుణవిధమొకరోత" (*సంపుటం1.26:17.*)

ఈ కీర్తనలో పాపాన్ని 'రోత' అనే మాటతో సంభావించారు. అన్ని విధాల కార్యాలను గురించి పేర్కొని వాటిలో పాపకార్యాలేవో? అన్నమయ్య తెలియజేశారు. అనుమానంతో బ్రతకడం, తన మనస్సుకు సరిపోని కార్యాలు రోతను పుట్టిస్తాయని పల్లవిలో తెలిపారు. అపకీర్తులపాలై వాటిని విడువలేక తన మార్గమే సరైనదని వాదించేవాడి బ్రతుకు రోత కలిగిస్తుంది. తన ఉపాయం ఫలించిందని తొడలు చరిచే విపరీత గుణం రోత కలిగిస్తుంది. తన సంగతులన్ని తెలిసినవారి ముందర తన గొప్పలు చెప్పుకోవడాన్ని, స్త్రీల ముందర అతివేషాలు వేయడాన్ని అన్నమయ్య రోతగా పరిగణించారు. ఈ భూమిలో ఆ హరే గతి అని మనస్సులో తలచకుండా ఆయనను విరళంగా కొలవకపోవడాన్ని రోతగా పేర్కొన్నారు. పనికిమాలిన మనుషులు కొందరు వేసే విచిత్రమైన వేషాలను గురించి ప్రత్యేకంగా చెప్పారు. ఈ కీర్తనలోని మొదటి చరణంలో 'అపవాది' అనే పదాన్ని అన్నమయ్య వాడారు. బైబిల్ గ్రంథంలో 'సాతాను/సైతాను' అనే పదానికి పర్యాయపదంగా అపవాది పదాన్ని వాడారు.

ఈ పదానికి 'దేవుని వ్యతిరేకి' అనే అర్థాన్ని చెప్పుకుంటున్నారు. ఈ కీర్తనలో అన్నమయ్య లోకంలో జరిగే అనేక దుష్కార్యాలను ఏకరువు పెట్టారు. 'తెలియ చీకటికి' అనే సంకీర్తనలో "మితిలేని పాపకర్మికి దావలెగాక హితవెరుగు పుణ్యునికేల" హద్దులు లేకుండా పాపకర్మాలు చేసేవాడికి వాటినుండి తప్పించేవారు కావాలి. అన్ని హితాలు తెలిసిన పుణ్యునికి అక్కరలేదని అన్నమయ్య చెప్పారు. ఈ లోకంలో పాపాలను తొలగించే వేంకటేశ్వరుని వేడుకోవడమే పరమపథానికి సోపానమని అన్నమయ్య గాఢంగా నమ్మి, ఆచరించి మనందరికీ హితవు చెప్పారు.

**పాడి రాగం**

**పల్లవి:**

"పాపపుణ్యముల రూపము దేహమిది దీని
దీపనంబణగింప దెరువెందులేదు

**చరణం:**

అతిశయంబైన దేహాభిమానము దీర
గతిగాని పుణ్యసంగతిబొందరాదు
మతిరోని దేహాభిమానంబు విడుచుటకు
రతిపరాన్ముఖుడుగాక నవణంబులేదు" (*సంపుటం1.28:19.*)

మొదటి కీర్తనలో మనుషుల పనికిమాలిన చేష్టలను గురించి చెప్పగా, ఈ కీర్తనలో శరీర ఇచ్ఛలను గురించి, దాని ఉద్దీపనాలగురించి అన్నమయ్య సవిస్తరంగా విశ్లేషించారు. ఈ దేహం పాప పుణ్యాల రూపంలోనే చేయబడింది. దీని ఇచ్ఛలను, ఉద్దీపనాలను అణచేందుకు మార్గం లేదని అన్నమయ్య చెప్పారు. తన అందాన్ని, శరీర సౌష్ఠవాన్ని చూసి గర్వించేవాడు పుణ్యలోకాలకు పోలేడు. అంతటి దేహాభిమానాన్ని విడిచిపెట్టేందుకు అనురాగ రహితుడు కావడానికి మించిన భూషణం లేదు అని మొదటి చరణంలో చెప్పారు. ఈ లోకంలో సాటిలేని మమకారం అనే సముద్రాన్ని దాటడంవలన నిజమైన సౌఖ్యాన్ని పొందగలం. అంతకుమించి శ్రీవేంకటేశ్వరుణ్ణి కొలవడంవల్ల బ్రహ్మానందం కలుగుతుందని రెండో చరణంలో అన్నమయ్య చెప్పారు. మొదటి చరణంలో ఇహలోక పాపభోగాలను గురించి, రెండో చరణంలో పుణ్యులు మోక్షం పొందే విధానాన్ని గురించి చెప్పారు. ఈ ప్రపంచ పోకడలకు కొట్టుకుపోకుండా ఆ శ్రీహరిని భజిస్తే పుణ్యం కలుగుతుందని తెలిపారు.

**సామంతరాగం**

**పల్లవి:**

"పరమపాతకుడ భవ బంధుడ శ్రీ
హరి నిను దలచ నేనర్హుడనా

**చరణం:**

అపవిత్రుడ నేనమంగళుడ గడు
నపగత పుణ్యుడ నలుసుడను
కపటకలుష పరిహరహృదయుడ నే
నపవర్గమునకు అర్హుడనా?" (*సంపుటం1.33:22.*)

ఈ కీర్తనలో అన్నమయ్య తనకు తానే పాపం చేసినట్లు నిందించుకున్నారు. అందుకే పల్లవిలోనే 'పరమపాతకుడ' 'నాలాంటి పాపాలు చేసేవారు ఈ భూమ్మీద లేర'నే అర్థం వచ్చేలా తనకు తాను నిందించుకున్నారు. 'అపవిత్రుణ్ణి, అమంగళుణ్ణి. ఎప్పుడూ నా మనస్సు కపటం, కలుషంతో నిండి ఉంటుంది. అలాంటిది నీ భక్తుల మార్గానికి ఎలా అర్హుణ్ణి కాగలను?' అని తనను తాను అంతరంగ పరీక్ష చేసుకున్నారు. 'దుష్టుణ్ణి, దూషితుణ్ణి, అవివేకిని, అధముడినైన నాకు మోక్షగతులకు అర్హత ఉందా? ఈ అనంతంలోని మోహపూరితమైన భయాతరుణ్ణి, అలాంటి నేను నిన్ను కీర్తించడమా! దానికి గొప్పవారు, ఘనులు, గురువులు ఉన్నారు కదా!' అన్నారు. ఈ కీర్తనలో అన్నమయ్య తనను తాను చాలా విధాలుగా నిందించుకోడం మనం చూడగలం. భక్తులే కానీ మనుషులు కాబట్టి ఏదో ఒక చోట ఏదో విధంగా తప్పులు చేస్తారు. అందుకే అన్నమయ్య మొట్టమొదటిగా తనను తాను పరీక్షించుకున్నారు. ఆచరణ రూపంగా మనకు అందించారు.

## 2.2.8. అలకలు

తల్లిదండ్రుల దగ్గర పిల్లలు అలగడం మనం సాధారణంగా చూస్తూ ఉంటాం. చిన్నపిల్లలు ఆడుకొనే బొమ్మలకోసమో! లేక ఆకర్షణీయమైన వస్తువులకోసమో! ఇలా వారికి కావలసిన వస్తువులు పట్టు పట్టి మరీ తల్లిదండ్రులనుంచి తీసుకుంటారు. పెద్దవారు కూడా తమకు కావలసినవి లభించకపోతే గోలచేస్తారు. అలుగుతారు. మారాం చేస్తారు. అలాగే భక్తులు కూడా దేవునికి తమ కార్యాలు విన్నవించుకొని అవి జరగకపోతే ఆ దేవునిపై

అలుగుతారు. పూర్వం అలకలు తీర్చుకోవడానికి కోపగృహం ఉండేది. ఇది ముఖ్యంగా భార్యాభర్తల అలకలు తీర్చుకోవడానికి, వారికి ఉపశమనం కలగడానికి, వారిమధ్య సయోధ్య కుదరడానికి ఎంతో ఉపకరించేది. సత్యభామ కృష్ణునిపై అలిగినట్లు *పారిజాతాపహరణం* అనే కావ్యంలో ఉంది. ఈ అలకలకు భక్తులు అతీతులు కారు. కొన్ని సందర్భాల్లో దేవుని మీద భక్తులు అలుగుతారు, నిష్ఠురాలాడుతారు, తిడతారు, ఆక్షేపిస్తారు. అందులో ఎలాంటి సందేహాలకు తావులేదు. వారు అలిగినా, తిట్టినా, పొగిడినా ఆ దేవుని కరుణించమని చివరకు శరణాగతి తత్త్వాన్ని ఆశ్రయిస్తారు. భగవంతుని తండ్రిగా భావించిన అన్నమయ్య దీనికి ఏమాత్రం మినహాయింపు కాదు. నాకు తెలిసినంతవరకూ వాగ్గేయకారుల్లో మొట్టమొదటిగా దేవునిపై అలిగింది అన్నమయ్యే. ప్రబంధ కవుల కోప గృహాలకు, అలకపాన్పులకు పునాది వేసింది అన్నమయ్యే. ఆ అలకలు నిక్షిప్తమై ఉన్న కీర్తనలను కింద విశ్లేషిస్తున్నాను.

**సామంత రాగం**

**పల్లవి:**

"ఏనిన్ను దూరక నెవ్వరి దూరుదు నీ
వాని నన్నొకయింత వదలక ననునేలవలదా

**చరణం:**

అపరాధిగనుక నన్నరసి కావుమని
అపరిమిత ఉభయమొంది నీకు శరణంటిగాక
నెపములేక నన్ను నీకు గావగనేలా
అపవర్గ దయాంబుధి తిరువేంకటాధిపా." (*సంపుటం 1.35:23.*)

ఈ కీర్తనలో అన్నమయ్య దేవునిపై అలక ప్రదర్శించారు. అన్నమయ్య కోపం ఈ కీర్తనలో ప్రస్ఫుటమవుతుంది. ఆ కోపంకూడా ప్రేమతో కూడుకున్నదే. ఆ క్షణంలో బిడ్డలు అనగా భక్తులు తమకేం కావాలో ఆ భగవంతుణ్ణి అడిగి పొందుతారు. అవి తీరకపోతే వారి బాధ చెప్పతరంకాదు. అందుకే 'నిన్ను కాకుండా నేను ఎవరిని నిందించాలి?' అని ఆ భగవంతుణ్ణి అన్నమయ్య ప్రశ్నించారు. ఒకటో చరణంలో 'ఘనమైన పాపిని కాబట్టి నిన్ను కావమంటున్నాను. నా ఆత్మ నీలో విహరించాలని కోరుకుంటున్నాను. కానీ నన్ను కాపాడడానికి నీకు నామీద చులకన భావం ఏర్పడింది' అని అన్నమయ్య వాపోయారు.

‘గొప్పవాడివి అయి ఉండి నన్ను ఆదరించకపోతే నేను ఇంక ఎవరిని నిందించాలి? నన్ను వదలకుండా కాపాడాల్సిన బాధ్యత నీదే’ అని ఆ వేంకటేశ్వరుని కోరుకున్నారు. మానవుల జీవితాలలో ఎన్నో అనుకోని సంఘటనలను దేవుడే అనుమతిస్తూ ఉంటాడు. వాటన్నింటిని తట్టుకొనే క్రమంలో ఒక్కొక్కసారి అలగడం, ఒక్కోసారి కోపగించుకోవడం, ఒక్కోసారి ఆ దేవుణ్ణి శరణు వేడుకోవడం మొదలైన చిత్రవిచిత్రాలు జరుగుతూ ఉంటాయి. వాటన్నింటిని అన్నమయ్య తన కీర్తనల్లో పూసగుచ్చినట్లు విశ్లేషించారు. ‘తలపోతబాపె’ అనే సంకీర్తనలో “పాపములుబాతె ప్రాణులకును మతిబాపరానియాస దమ్ముబాధించగా” అని చెప్పారు. పాపాలవల్ల విపరీతమైన ఆశలు మనుషుల మనస్సుల్లో చిగురిస్తాయి. వాటిని తీర్చుకొనేందుకు నానారకాల దారులు తొక్కుతున్నారు. చివరకు ఆశలు తీరక ఆ లంపటాలలోబడి కొట్టుకుంటున్నారు. అందుకే రాజులను ధనవంతులను సేవిస్తున్నారు. దానివల్ల కలిగే సుఖం తాత్కాలికమైంది. కానీ పరమాత్ముడు ఇచ్చే దివ్యసుఖం పరిపూర్ణమైంది, శాశ్వతమైంది. కాబట్టి మనుషులు దానికోసం ప్రయత్నించాలని అన్నమయ్య చెప్పారు.

**ధన్యాసి రాగం**

**పల్లవి:**

“పుట్టుగులమ్మీ భువిగొనరో
జట్టికి హింసలే మీ ధనము

**చరణం:**

ఆపదలంగడినమ్మీ గొనరో
పాపాత్ములు పైబడక
కైపుల పుణ్యలగని కోపించే
చూపులు మీకివి సులభపు ధనము

**చరణం:**

కడుగుంభీ పాతకంబులు గొనరో
బడిబడినమ్మీ బాలిండ్ల
తొడరు బరస్త్రీ ద్రోహపు ధనములే
తడవుట మీకివి దాచిన ధనము

**చరణం:**

లంపుల చండాలత్వము గొనరో
గంపలనమ్మీ గలియుగము
రంపపు వేంకటరమణుని కథ విన
నింపగువారికినిదే ధనము" (*సంపుటం1.42:28.*)

ఈ కీర్తనలో అన్నమయ్య ఈ లోకంలో మనుషులు పాపం అనే ధనాన్ని ఎలా సంపాదించుకుంటున్నారో వివరించారు. ఈ భూమిని స్వతంత్రించుకోవడానికి మానవుడు తన పుట్టుకను అమ్ముకుంటున్నాడు. ఒక సమూహంగా మారి వేరే సమూహంతో యుద్ధాలు చేస్తున్నాడు. కొందరు స్త్రీ వ్యామోహంచేత ఇతరులను చంపుతున్నారు. కొందరు నానారకాల చండాలమైన కార్యాలు చేస్తున్నారు. దీనిని అన్నమయ్య "గంపలనమ్మీ గలియుగము" అని విశ్లేషించారు. ఈ కీర్తనలో 'వేం' అనే పదానికి పర్యాయంగా 'రంపపు' అని ఆ తరువాత వేంకటరమణుని కథ అన్నారు. వేంకటేశ్వరుని కథామృతాన్ని ఎవరైతే వింటారో? వారికి ఇహపరాలలో కలిగే అన్ని సౌఖ్యాలతోబాటు పరలోకంలో కలిగే ధనం లభిస్తుందని అన్నమయ్య చెప్పారు. ఇతరుల ధనంకోసం ఆశపడడాన్ని కూడా అన్నమయ్య వ్యతిరేకించారు.

**గుండక్రియ రాగం**

**పల్లవి:**

"కొనుట వెగ్గలము దాదినుట యల్పము మీదు
గనుట వినుట లేక దాకడచన్న భయము

**చరణం:**

ఆపద వడ్డికినిచ్చి అనుభవింపబోయిన
యేపుననెవ్వరికి నిందేమిగలదు
పాపపు పైరు విత్తిన పంటలోన
చూపింపగనిందు రుచి ఏమిగలదు?" (*సంపుటం1.49:32.*)

పాపం అనే పంటను విత్తేవాడు దాన్ని అనుభవించాలి. ఆపద వడ్డీకి ఇచ్చి, తరువాత బాధపడితే ప్రయోజనం ఏమిటి? మనం ఏమి ఇస్తే అదే మనకు వస్తుంది. అయినా ఆ తిరువేంకటేశ్వరుడే ఇన్నిటికి మూలమైనవాడు. కాబట్టి ఆయనే ఆ భారాన్ని భరిస్తాడని

అన్నమయ్య చెప్పారు. అన్ని కీర్తనల్లో భక్తికి పెద్ద పీట వేశారు. అందుకే ఈ కీర్తనలు అంతగా ప్రజాదరణ పొందాయి. కేవలం కొన్ని కీర్తనల్లో మాత్రమే పాపాలు, పుణ్యాలు విశ్లేషించి వాటి రూపాన్ని తెలియజేశారు. చాలావరకూ కీర్తనల్లో ఆ పాప పుణ్యాలను తనమీదే ఆపాదించుకున్నారు. అయితే, ఈ కీర్తనలన్నింటిలో అన్నమయ్య ఒకే భావం వచ్చేట్లుగా కాకుండా ఒక్కొక్క కీర్తనలో ఒక్కొక్క భావాన్ని చెప్పి, ఆ కీర్తనల ఉద్దేశాన్ని మాత్రం ఒక్కటిగా చూపించారు.

## 2.2.9. రాజులపై నిరసన

తాళ్ళపాక అన్నమయ్య రాజాశ్రయాలను, తద్వారా వచ్చే సుఖసంపదలను, వారివల్ల కలిగిన కష్టనష్టాలనన్నింటిని భరించారు. అలా అన్నింటినీ పొందిన మొట్టమొదటి వాగ్గేయకారులు అన్నమయ్యే. అయితే, అందరి కవుల్లాగా రాజులను అతిశయోక్తులతో పొగడలేదు. తనకు అనేక సంపదలను కలిగించిన నరసింగరాయలు ఒకానొక సందర్భంలో 'నా మీద అలాంటి శృంగార కీర్తన ఒకటి చెప్పు'మని కోరగా అన్నమయ్య ధైర్యంగా 'నరుల నుతింపగ నోపదు జిహ్వ' అని రాజాగ్రహానికి గురి అయ్యారు. అప్పుడు 'సంకెలపడు వేళ చంపెడువేళ' అంటూ ఏ స్థితిలో ఉన్నా దైవనామస్మరణ మాత్రం మానకూడదని తనకు తానే హితవు చెప్పుకున్నారు. రాజాశ్రయాలవల్ల స్వయంగా తానే దుఃఖం పొందినవాడు కాబట్టే ఆ రోజుల్లోనే అంత తీవ్రస్థాయిలో తన స్వరాన్ని లోకానికి వినిపించారు. రాజాశ్రయాలను నిరసిస్తూ కొన్ని కీర్తనలను రాశారు. నేను ఎన్నుకున్న సంపుటాలలో అలాంటి కీర్తనలు దొరికాయి. అవే కాకుండా విదేశీ దండయాత్రలను, దౌర్జన్యాలను తన కీర్తనల్లో అన్నమయ్య ఖండించారు. ఈ సంపుటాలలో వాటి ప్రసక్తి లేదు. నాకు దొరికినవాటిని కింద విశ్లేషిస్తున్నాను.

**ఆహిరి రాగం**

**పల్లవి:**

"మనుజుడై పుట్టి మనుజుని సేవించి
అనుదినము దుఃఖమందనేల

**చరణం:**

జుట్టెడు కడుపుకై చొరని చోట్లు జొచ్చి

పట్టెడు కూటికై బతిమాలి
పుట్టినచోటికే పొరలి మనసువెట్టి
వట్టి లంపటము వదలనేరదు గాన." (*సంపుటం1.198:131.*)

ఈ కీర్తనలో మనుషులు వేరే మనుషులకు సేవ చేయడాన్ని అన్నమయ్య నిరసించారు. అలా చేయడంవల్ల ప్రతిరోజు దుఃఖమే కలుగుతుంది గానీ శాంతి సమాధానాలు కలుగవని అభిప్రాయపడ్డారు. ఈ కీర్తనలో మొదటి చరణంలో 'జుట్టెడు కడుపుకై చొరని చోట్ల జొచ్చి'?' అన్నారు. చిన్ని పొట్టకోసం తిరగరాని చోట్ల తిరిగి పట్టెడు అన్నంకోసం వేరే వారిని బ్రతిమాలుతారు. పుట్టినచోటే తిరిగి మనస్సు ఉంచి ఈ లంపటాలను వదలడానికి మనుషులు ఇష్టపడరని అన్నమయ్య తెలియజేశారు. రెండో చరణంలో అంతర్యామి అయిన వేంకటేశ్వరుడు అందరిలో పుట్టి పెరిగి, అన్ని రూపాల్లో తానే ఉన్నాడు. అందుకే ఆయనను మనుషులు సేవించి అత్యున్నత పదవులు పొందాలని సూచించారు. ఈ కీర్తనలో రాజైనా, సామాన్య పౌరుడైనా ఆ దేవునికి విధేయుడై ఉండాలని అన్నమయ్య ప్రబోధించారు. అందరిలోని పరమాత్మను దర్శించి ఈ కీర్తనను అద్భుతంగా రచించారు. కనుక రాజులను, ధనవంతులను సేవించడంవల్ల దుఃఖం తప్ప కలిగే ప్రయోజనం ఏమీ లేదు. కేవలం దైవనామ స్మరణ మాత్రమే మనకు అత్యంత గౌరవాదరాలను తెచ్చిపెడుతుంది. పరమపథానికి మనల్ని సంసిద్ధుల్ని చేస్తుందని అన్నమయ్య పేర్కొన్నారు.

**దేశాల రాగం**

**పల్లవి:**

"పరుల సేవలు చేసి బ్రతికిరటా
సిరివరు దాసులై సిరులందుటరుదా

**చరణం:**

కోరికొకనరుని కొలిచినవారలు
భీరులై సలిగాల తిరిగేరటా
కూరిమి బ్రహ్మండ కోట్లేలెడి వాని
వారలిన్నిటా జనవరులౌటరుదా?" (*సంపుటం393:261.*)

ఈ కీర్తనలో 'సిరిసంపదలకు ఆలవాలమైన ఆ సిరివల్లభుడే మన పక్షాన ఉండగా పరులను, రాజులను సేవించి బ్రతకాల్సిన అవసరం ఏమిటి?' అని అన్నమయ్య తన తోటికవులను, భక్తులను ప్రశ్నించారు. రాజులను, నరులను కొలిచేవారు భీరాలు పలుకుతూ తిరుగుతూ ఉంటారు. ఈ బ్రహ్మాండాన్ని కూర్మితో పాలించే దేవునికి మనమందరం దగ్గర కావాలని అన్నమయ్య చెప్పారు. తుమ్మెదబారిన పడ్డ కీటకాలు తుమ్మెదలైనట్లుగా శ్రీకాంతుని పదసేవ చేసేవారు అధికులుగా ఉంటారని రెండో చరణంలో తెలియజేశారు. ఆయా దేశపు రాజులు ఇచ్చే సంపదలు వారివారి దేశాల్లోనే చెలామణిలో ఉన్నట్లుగా ధరణీపతియైన శ్రీవేంకటేశుని ముద్ర భక్తికి పరాకాష్ఠగా చెలామణి అవుతుంది కాబట్టి అలాంటి ముద్ర ధరించడం కూడా ఘనమేనని అన్నమయ్య మూడో చరణంలో తెలియజేశారు. ఈ కీర్తనలలో రాజులను అంతగా నిరసించినట్లు నాకు అనిపించడంలేదు. కానీ రాజసేవకంటే భగవత్ సేవ ముఖ్యమని అన్నమయ్య ఉద్ఘాటించారు. సాళువ నరసింగరాయలు అన్నమయ్యను బంధించిన సందర్భంలో "ఫాలనేత్రానల ప్రబలవిద్యుల్లతా కేళీవిహార లక్ష్మీనారసింహా" అనే సంస్కృత కీర్తనను చెప్పారు. అంతేగాక 'నీ భక్తులను రక్షించుకోవలసిన బాధ్యత నీకు లేదా?' అని ఆ దేవుణ్ణే నిలదీశారు. తద్వారా ప్రజలకు తన మనోఫలకంపై ఉన్న వేంకటేశ్వర స్వామిని సాక్షాత్కరింపజేశారు.

'వైష్ణవులుగాని వారలెవ్వరు లేరు' అనే కీర్తనలోని రెండో చరణంలో "అతిచంచలంబైన ఆతుమ గలిగించి కతమున బహుచిత్తగతులై ఇతరులగొలిచిన యొక యనాథపతి తిరువేంకటపతి చేకొనుగాక" (సంపుటం1.36:24) అని రాజులను, పరులను కొలవడంకన్నా దేవుణ్ణి కొలిచినవారు ఎంతమాత్రం చెడిపోరని, వారు ఎప్పుడూ అత్యున్నతమైన స్థితిలో ఉంటారని అన్నమయ్య చెప్పారు.

**లలిత రాగం**

**పల్లవి:**

"తలకరో లోకులు తడవకురో మమ్ము

కలిగినదిదె మా కాపురము

**చరణం:**

నరహరి కీర్తన నానిన జిహ్వా

ఒరులనుతింపగ ఓపదు జిహ్వ
మురహరి పదముల మొక్కిన శిరము
పరులవందనకు పరగదు శిరము

**చరణం:**

శ్రీపతినే పూజించిన కరములు
చూపి యాచనకు చొరవు కరములు
యేపున హరికడకు యేగిన కాళ్ళు
పాపుల ఇండ్లకు పారవు కాళ్ళు

**చరణం:**

శ్రీవేంకటపతి చింతించు మనసు
దావతినితరము తలచదు మనసు
దేవుడు అతని ఆధీనపు తనువు
కేవల ఇతరాధీనముకాదు.” (*సంపుటం2.141:97.*)

ఈ కీర్తనలో అన్నమయ్య ‘లోకులు మమ్మల్ని తలచుకుంటారెందుకు? మాకున్నది భగవంతుడే. నరహరిని కీర్తించే నా నాలుక నరులను కీర్తించడానికి ఒప్పుకోదు. ఈ తల మురారి పాదాలకు మొక్కుతుంది గాని ఇతరుల మన్ననలకు వంచదు. శ్రీపతిని పూజించడానికి ఉన్న ఈ చేతులు ఇతరులదగ్గర యాచించడానికి ఇష్టపడవు. నిత్యం ఆ హరిని సేవించడానికి నడిచివెళ్ళే ఈ కాళ్ళు పాపాత్ముల ఇళ్ళకు మాత్రం పోవు. ఆ వేంకటేశ్వరుని గురించి నిత్యం చింతించే నా మనస్సు తుచ్ఛమైన విందులు వినోదాలగురించి ఎన్నడు తలచదు. ఆ దేవుని ఆధీనంలో ఉండే ఈ తనువు ఇతరుల ఆధీనంలో మాత్రం ఉండదు.’ అని బాహాటంగా చెప్పారు. ఈ కీర్తనలో మనం అప్పుడే పరిపక్వమవుతున్న అన్నమాచార్యుని భక్తిని గమనించగలం. అప్పటిదాకా నరసింగరాయలు ప్రాపు గడించి అష్టైశ్వర్యాలతో తులతూగిన అన్నమయ్య ‘నా మీద ఒక కీర్తన పాడ’మని నరసింగరాయలు అడగగానే ఒక్కదెబ్బకి మారిపోయారు. అంతవరకూ అందరి మన్ననలు పొందిన అన్నమయ్య ఇతరుల మన్ననలు అనవసరమని తలచారు. ఇది ఒక్కింత విడ్డూరంగా ఉంది. అయినప్పటికీ ఆ కాలంలో తన సమకాలీన కవులకు, అన్నమయ్యకు ఉన్న ప్రధానమైన భేదం ఇదే. అంత తెగువ చూపించిన వాగ్గేయకారుడు కూడా అన్నమయ్యే కావడం విశేషం. ఏదైనా

ఒక కష్టాన్ని దేవుడు కావాలనే తన భక్తుల జీవితంలోకి అనుమతింపజేస్తాడు. అలాగే ఆ కష్టంనుంచి ఆయనే గట్టెక్కిస్తాడు. అయితే, మనం చేయాల్సిందల్లా ఒక్కటే. ఆయనను సంపూర్ణంగా నమ్మి, పూర్తి విధేయత చూపించడం. అదే మనకు అన్నమయ్య జీవితం నేర్పిస్తోన్న పాఠం. ఇంతకు ముందు కీర్తనల్లో రాజులపై నిరసన అంతగా కనబడలేదు. కానీ ఈ కీర్తనలో మాత్రం ప్రత్యేకంగా రాజులను, ఇతర పాపాత్ములను దూషించలేదు కానీ వారి పనులను దుయ్యబట్టారు. వారిపట్ల మనం వహించాల్సిన జాగ్రత్తలను వెల్లడించారు. 'అన్ని సంపదలకు మూలమైన ఆ హరిని కీర్తించే నా నాలుక ఇతరాలైన విందు వినోదాలకోసం ఆశపడదు' అని బాహాటంగా రాజుముందే ధైర్యంగా చెప్పగలిగారు. ఆ నాటినుంచి అన్నమయ్య జీవితంలో జరిగిన పరిణామాలు తారాస్థాయిని అందుకున్నాయి. అక్కడనుండి వచ్చి తిరుమలలో అన్నమయ్య బ్రహ్మోత్సవాలు ప్రారంభించారని తిరుమలలోని శాసనంవల్ల తెలుస్తోంది.

**నాటరాగం**

**పల్లవి:**

లంకెలూడుటే లాభము ఈ

కింకరులను నలగెడికంటెను

**చరణం:**

జంపులజంపక సరుగన బాసేటి

లంపటమేపో లాభము

కంపమోపుతో గనలి శరీరపు

కొంపలోన వేగుటకంటెను

**చరణం:**

ఈవల నావల నేచేటి యాసల

లావుదిగుటెపో లాభము

యేవగింతలకు నిరవగు నరకపు

కోవులబడి మునుగుటకంటెను

**చరణం:**

తివిరి వేంకటాధిపు దాసుల కృప

లవలేశమెపో లాభము

చవులము నోరికి సకలముదిని తిని

భవకూపంబుల బడుటకంటెను." (*సంపుటం1.1998:131.*)

ఈ కీర్తనలో అన్నమయ్య చేసిన నిందలు చాలా ఉన్నాయి. 'ఈ కింకరులను సేవించడంకంటే ఈ లోకపు సంబంధాలు తెగిపోవడమే మేలు. ఈ లోకపు ఆశలు మనిషిని చావనివ్వవు, బ్రతకనివ్వవు. ముళ్ళకంప మోపుతో కొంపలోకి పోవడంకంటే ఇలా చచ్చీ చావని బ్రతుకే మేలు. ఏవగింతలకు, అసహ్యాలకు, అసభ్యాలకు ఆలవాలమైన ఈ లోకపు నరకంలో మునగడంకంటే ఇటువైపు అటువైపు కలిగించే ఆశల్లో బ్రతకడమే మేలు. నోరుంది కదా అని అన్ని శిష్టాన్నాలు తిని, పాపకూపాల్లో పడడంకంటే శ్రీవేంకటేశ్వరుని దాసుల కృప కొంచమైనా ఉండడం మేలు' అని అన్నమయ్య చెప్పారు. ఈ కీర్తనలో రాజులను, పరిపాలకులను యమకింకరులుగా అన్నమయ్య అభివర్ణించారు. మొదటి రెండు చరణాల్లో ఈ లోకపు పోకడలను తెలియజేసి, మూడో చరణంలో ఆ వేంకటేశ్వరుని దాసుల కృప ఉన్నా చాలని జనులకు ప్రబోధించారు. అనగా వీళ్ళను ఆదరించడానికి సాక్షాత్తూ ఆ దేవుడే రానవసరంలేదు. కేవలం ఆయన దాసులతో సాన్నిహిత్యం కలిగి ఉన్నా, ఆ దాసుల కటాక్షానికి పాత్రులైనా మానవ జన్మ తరిస్తుందని అన్నమాచార్యుల ఉద్దేశం. ఈ కీర్తనలో రాజులపై నిరసనభావం ఎక్కువగా కనిపిస్తుంది. రాజాశ్రయాలను యమలోకపు నరకసౌఖ్యంగా అన్నమయ్య భావించారు. అందుకే ఈ లంపటాలన్నింటినీ వదిలించుకోవడం శాశ్వతమైన సౌఖ్యానికి మార్గం. కానీ వీటిని అంత తేలికగా వదిలించుకోవడం కష్టమైన పని అని అన్నమాచార్యుల భావం.

ఇలా అన్నమయ్య బోధలు ప్రజల్లో చైతన్యాన్ని కలిగించాయి. ఈ బోధలన్నీ సంకీర్తనాబద్ధాలుగా ఉన్నాయి. ఆయన బోధించింది ప్రజలకే కాబట్టి అందరికి అర్థమయ్యే భాషలోనే ఇన్ని సంకీర్తనలు రాయబడ్డాయి. ఆ బోధల్లో వేంకటేశ్వరునిపై భక్తి నిక్షిప్తమై ఉంది. ఆయన సంకీర్తనల్లో పేర్కొన్న అంశాలను కనీసం చేరుకోవడం మరే ఇతర వాగ్గేయకారునికి సాధ్యం కాలేదు. అన్ని అంశాలు ప్రస్తావించినప్పటికీ వాటిలో ఒక ప్రత్యేకత ఉండేట్లుగా చూసుకున్నారు. అన్ని అంశాలు ఒకే లక్ష్యాన్ని, ఉద్దేశాన్ని, అన్ని కీర్తనలు ఒకే అంశాన్ని ప్రబోధించడం అన్నమయ్య కీర్తనల్లో ఒక విభిన్నాంశం. అన్నమయ్య ఇలా చేయండి

అని ప్రజలకు ఎన్నడూ చెప్పలేదు. తాను ఆచరించేదే చెప్పారు. అనవసరపు పోకడలకు అన్నమయ్య పోలేదు. అన్ని సందర్భాలలో తగువిధంగా మెలిగినట్లు ఆయన సంకీర్తనలు చదవడం ద్వారా మనం అర్థం చేసుకోగలం. ఈ కీర్తనలలో ఒక సామాన్యపు వాగ్గేయకారుని ఆవేదన దాగి ఉంది. ఆ వేదనను ప్రజలు ఒంటపట్టించుకున్నారు. కనుకనే అన్నమయ్య కీర్తనలకు ప్రజలే వాహికలుగా మారినట్లు చరిత్ర మనకు చెబుతోంది. ఎన్నో కీర్తనలు ప్రజల నోళ్ళలో నానుతున్నాయి. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఈ సంకీర్తనలను గుర్తించడానికి ప్రధానకారణం ఆయన పూర్వం ఆ సంకీర్తనలను వారి ఇంటిలోనివారు పాడగా వినడమే.

## 2.3. అన్నమయ్య సంకీర్తనల్లోని పాత్ర చిత్రణ

అన్నమయ్య అధ్యాత్మ కీర్తనల్లో పాత్రలకు చాలా ప్రాధాన్యం ఉంది. ఆయన కీర్తనల్లో వేంకటేశ్వరుడు, అలమేలు మంగమ్మ, రాముడు, సీత, లక్ష్మణుడు, నరసింహుడు, హనుమంతుడు, సుగ్రీవుడు, వశిష్టాది మహామునులు ఎందరో జీవాన్ని పోసుకున్నారు. ఈ కీర్తనల్లో భారత, రామాయణ, భాగవత, వేద, పురాణాది శాస్త్రాలలోని అంశాలు నిక్షిప్తమై ఉన్నాయి. ముఖ్యంగా ఆ వేంకటేశ్వరుడే అన్నమయ్య సంకీర్తనల్లోని పాత్ర. ఆ స్వామే ఈ కీర్తనలకు జీవం, భావం, భాగ్యం, ప్రాణం, ప్రణవం. ఆయనే లేకపోతే ఇన్ని కీర్తనలు మనకు లభించేవి కావు. ఏ కీర్తనైనా ఆ వేంకటేశ్వరునికే అన్నమయ్య సమర్పించారు. ఆ తిరుమలేశుని భావచిత్రాన్ని అన్నమయ్య తన ముందు ఆవిష్కరింపజేసుకొని చేసిన సంకీర్తనా సృష్టి అనన్య సామాన్యమైంది. అన్నమయ్యకు కష్టం వచ్చినా, సంతోషం కలిగినా, దుఃఖబాధితుడైనా, విచారపడినా వెంటనే ఆ శ్రీనివాసుడిని సంకీర్తనారూపంలో ప్రార్థించేవారు. అంత గాఢానుబంధాన్ని ఆ కోనేటిరాయుడితో అన్నమయ్య కలిగి ఉన్నారని ఆయన చేసిన సంకీర్తనా సృష్టివల్ల మనం గ్రహించగలం. ఆ తరువాత అహోబల నరసింహుడు, హనుమంతుడు, సీతా రాములు ఎక్కువగా కనిపిస్తారు. ఏ కీర్తనలోనైనా అన్నమయ్య భక్తి పారవశ్యాన్ని మనం చూడగలం. అధ్యాత్మ సంకీర్తనల్లో పురుషులకు ఉన్నంత ప్రాధాన్యం స్త్రీ పాత్రలకు ఉన్నట్లుగా కానరాలేదు. ఎక్కువ కీర్తనలు వేంకటేశుని వేడుకుంటున్నట్లుగా ఉన్నాయి. వేంకటేశ్వర ముద్ర కలిగిన ఈ కీర్తనలలోని మిగిలిన పాత్రలకు నిడివి తక్కువే, గానీ గాఢత చాలా ఎక్కువ. ఆయా సందర్భాల్లో అవి

అన్నమయ్యను ఎంతగానో ప్రభావితం చేశాయి. ఆయా సంకీర్తనల్లో అన్నమయ్య విశ్లేషించిన పాత్రలను కింద విశ్లేషిస్తున్నాను.

## 2.3.1. శ్రీవేంకటేశ్వరుడు

అన్నమయ్య సంకీర్తనలకు మూలం, ఆ పాటలకు ప్రాణం శ్రీవేంకటేశ్వరుడు. ఆయనను పురాణపురుషుడు, విష్ణుమూర్తి, రఘురాముడు, వేంకటరాముడు, నరసింహుడు, వేంకటనరసింహుడు, రామకృష్ణుడు, వేంకటరామకృష్ణుడు మొదలగు రీతుల్లో తీర్చారు. కృతయుగంలో నుంచి కలియుగందాకా అన్నమయ్య ఆ వేంకటేశ్వరుని మహిమలను ఒక్కొక్కదాన్ని విపులీకరించి విశ్లేషించారు. అందుకు అన్నమయ్య ఎన్నుకున్న భాష పేర్కొనదగింది. ఒక్కొక్క భంగిమలో ఒక్కొక్క కీర్తనను రచించారు. అనేక అంశాలను ఆ కీర్తనల్లో నిక్షిప్తం చేశారు. శ్రీవేంకటేశ్వరుడు అన్నమయ్య పాలి నిధానం. అన్నమయ్యకు సాటిలేని దైవం. అన్నిటికి మించి ఆదరణకర్త. కోరికలు తీర్చే కోనేటిరాయడు. ఎక్కువగా అధ్యాత్మ సంకీర్తనలలో ఆయనను అన్నమయ్య శరణు వేడుకున్నట్లుగా, ఇతరులకు ఆయన మహిమలు తెలియజేసినట్లుగా ఉంటాయి. కొన్ని సందర్భాల్లో తనకు తానే ఏదో ఒక పొరపాటు చేసినట్లుగా భావించి ఆ సందర్భానికి తగ్గట్టుగ శరణు వేడుకుంటారు. కొన్ని సందర్భాల్లో ఆయనమీదే అలుగుతారు. ఇలా అనేక విధాలుగా ఆ వేంకటేశ్వరుని అన్నమయ్య ఆరాధించారు. 'వేం' అంటే పాపాలను 'కట' అంటే నశింపజేసేవాడు కావునా ఆయన వేంకటేశ్వరుడయ్యారు. శృంగార సంకీర్తనల్లో ఆయా వనితలతో వారకాంతలతో ఉన్న వేంకటేశ్వరుని వర్ణించగా, అధ్యాత్మ సంకీర్తనల్లో మాత్రం స్త్రీలను తలచడమే పాపంగా అన్నమయ్య భావించారు. ఈ కీర్తనల్లో ఎక్కువభాగం వివిధ శాస్త్రాలలోని అంశాలతోబాటు ఆయా సందర్భాలలో ఆ శ్రీదేవుడు తన భక్తులను కాచుకున్న విధానం వర్ణించబడింది. వాటిని ఉదాహరణలతో చెప్పి 'అలా నన్ను కూడా కావవచ్చు కదా!' అని అన్నమయ్య ఆ దేవుడి దగ్గర గారాలు పోయారు. ఈ కీర్తనల్లో వేంకటేశుని నామం ముద్రగా కనిపిస్తుంది. ఆయనను అలమేలుమంగ పతిగా పేర్కొన్న కీర్తనలు చాలా తక్కువ. అమ్మవారి పాత్రకు ప్రాధాన్యం కూడా తక్కువే.

## శంకరాభరణ రాగం

**పల్లవి:**

"ఆదిమ పూరుషు డచ్యుతుడనంతుడమలుడు
ఆ దేవుడీతడేపో హరివేంకటవిభుడు

**చరణం:**

ఏకార్ణవమై ఉదకములేచిన బ్రహ్మాండములో
బైకొనియుండగ నొకవటపత్రములోపలను
చేకొని పవళించెను శిశువై వడిదేలాడిన
శ్రీకాంతుడీతడెపో శ్రీవేంకటవిభుడు

**చరణం:**

అరుదుగ బలిమదమణపగ నాకసమంటిన రూపము
సరుగన భూమింతయు నొకచరణంబున గొలచి
పరగిన పాదాంగుటమున బ్రహ్మాండమునగిలించిన
పరమాత్ముడీతడెపో పతివేంకటవిభుడు

**చరణం:**

క్షీరపయోనిధి లోపల శేషుడు పర్యంకముగా
ధారుణియును సిరియును బాదములొత్తగను
చేరువదను బ్రహ్మాదులు సేవింపగ జెలువందెడి
నారాయణుడీతడే ఉన్నత వేంకటవిభుడు." (*సంపుటం1.80:55.*)

ఈ కీర్తనలో ఆ దేవుని ఉనికిని అన్నమయ్య చెప్పారు. పల్లవిలో 'ఆదిమ పూరుషుడు' అని చెప్పారు. ఇక్కడ 'ఆది' అనే మాటకు అర్థం అపరిమితమైంది. జీవులలో మొదటి జీవుడు, దేవుళ్ళకే ఆదిదేవుడు, కాలాతీతమైనవాడు, చ్యుతి (నాశనం) లేనివాడు, స్థిరమైనవాడు, ఆత్మ, పాపరహితుడు, పవిత్రుడు అలాంటివాడే ఈ శ్రీవేంకటేశ్వరుడు అని పల్లవిలోనే ఆయన ఉనికిని అన్నమయ్య తెలియజేశారు. మొదటి చరణంలో జలప్రళయంలోనుండి వటపత్రంతో ఈ లోకాలను ఉద్ధరించడానికి వచ్చిన స్వామిగా చెప్పబడింది. రెండో చరణంలో ఒకపాదంతో భూమిని, ఒకపాదంతో బ్రహ్మాండాన్ని ఆక్రమించి మూడో అడుగుతో బలి చక్రవర్తికి జన్మ విముక్తి కలిగించిన పుణ్యపురుషుడిగా

వివరించబడింది. మూడో చరణంలో క్షీరసాగరంలో శ్రీదేవి, భూదేవి పాదాలు ఒత్తుతుండగా, బ్రహ్మాదులు కొలుస్తుండగా వారికి ఉన్నత సుఖాలనిస్తూ, వారిసేవలో తరిస్తూ ఉండే నారాయణుడిగా పేర్కొనబడింది. ఈ కీర్తనలో అన్ని మహిమలకు ఆలవాలమైన శ్రీవేంకటేశ్వరుడిని అన్నమయ్య మనకు సాక్షాత్కరింపజేశారు. అన్ని పూజలకు, వ్రతాలకు యోగ్యుడైనవాడు, అన్ని పనుల మీద అధికారాన్ని చెలాయించే వాడు, అందరికీ పుణ్యలోక ప్రాప్తి దయచేసే శ్రీ తిరుమలదేవుడిగా వేంకటేశ్వరుని పాత్రను తీర్చారు. అలాంటి దేవుణ్ణి మనం నిత్యం ఆరాధించాలని, అంతకు మించి ఈ లోకంలో మనం కోరుకోవాల్సింది ఏమీ లేదని ఈ కీర్తనలో అన్నమయ్య తెలియజేశారు.

**పాడి రాగం**

**పల్లవి:**

"అంతయు నీవే హరిపుండరీకాక్షా!

చెంత నాకు నీవే శ్రీరఘురామా!

**చరణం:**

కులమును నీవే గోవిందుడా నా

కలిమియు నీవే కరుణానిధీ!

తలపును నీవే ధరణీధరా నా

నెరవులు నీవే నీరజనాభా!" (*సంపుటం1.388:258.*)

ఈ కీర్తనలో అన్నమయ్య ఆ వేంకటేశ్వరునిలోని అంతర్యామి తత్త్వాన్ని సునిశితంగా విశ్లేషించారు. పల్లవి 'అంతయు నీవే హరి పుండరీకాక్ష' అని మొదలవుతుంది. 'ఈ విశ్వమంతటా వ్యాపించి ఉన్నవాడివి, నాకు తోడై ఉండేవాడివి నీవే. నా కులం, కలిమి, ఆలోచన, ఉనికి అంతా నీవే. తనువు, మనికి, వినికిడి, నా వెనకా ముందు అంతా నీవే. పుట్టుక, చావు నీవే. ఓ వెంకటేశ్వరా! నాకు చివరికి నీ పాదాలే గతి.' అని అన్నమాచార్యులు తన మనోగతాన్ని ఆ దేవుని ముందు ఆవిష్కరించారు. ఈ కీర్తనలో ఆ వేంకటేశ్వరుని స్తుతించేందుకు గోవిందుడు, కరుణానిధి, ధరణీధరుడు, నీరజనాభుడు, దామోదరుడు, మధుసూదనుడు, విట్ఠలుడు, విష్ణువు, పురుషోత్తముడు, నారాయణుడు, వేంకటేశ్వరుడు మొదలైన విశేషణాలు వాడారు. విష్ణు సహస్రనామాలలో ఆ పేర్లన్ని ఉన్నాయి. ఒక్కొక్క నామానికి ఒక్కొక్కరీతిలో కాపాడాల్సిన విధానాన్ని ఆ వేంకటేశ్వరునికి అన్నమయ్య

అప్పజెప్పారు. తనను తాను అప్పగించుకుంటూనే ఆ తిరుమలేశుని జగద్రక్షకత్వాన్ని గుర్తు చేశారు. ఈ కీర్తనలో ఆ వేంకటేశ్వరుని పాత్రను ఆయనలోని అంతర్యామి తత్త్వానికి ప్రతీకగా తీర్చారు. అన్నింటికీ ఆయనమీదే ఆధారపడదగ్గ పాత్రగా వేంకటేశ్వరుని పాత్రను చిత్రీకరించారు.

## 2.3.2. రాముడు

అన్నమయ్య తన సంకీర్తనల్లో రామాయణానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. *రామాయణం*లో రాముడు ముఖ్యమైన పాత్ర. వాల్మీకి మహర్షి రాముణ్ణి ఆదర్శవంతంగా తీర్చిదిద్దారు. తండ్రి మాటకు లోబడిన కొడుకుగా, రాక్షసులను అంతంచేసిన యుద్ధవీరుడిగా, మంచి అన్నగా, భర్తగా, గురువుకి తగిన శిష్యుడిగా ఇలా మనిషి జీవితంలో ఎన్ని కోణాలున్నాయో? అన్నింటినీ స్పృశించేలా రాముని పాత్రను తీర్చారు. అలాంటి రాముణ్ణి అన్నమయ్య తనదైన శైలిలో కీర్తిస్తూ సంకీర్తనాబద్ధం చేశారు. అలాంటి సంకీర్తనను కింద విశ్లేషిస్తున్నాను.

**భౌళి రాగం**

**పల్లవి:**
"శ్రీవేంకటేశ్వరుడు చేరి విజయముబొంది
దేవతలు చూడ దశదిక్కులకు గనుచు
**చరణం:**
ఆదిపమ్ము వేసినట్టే అల్ల నరకాసురుడై
మేరమీరి రావణుని మీదనేసెను
సారపు జలధిమీద జలములింకగసేసె
దారి తప్పకుండ నిడుదాళ్ళు దెగనేసె
**చరణం:**
పగదీర మింటిమీది భానునిమీది కాసె
మిగులమెరసి మాయా మృగమునేసె
జగములో రాక్షసుల సంహారముగనేసె
దుగిలి రక్తగుండాల్‌నిండజేసె

**చరణం:**

ఖరదూషణాదుల ఖడిగండలుగజేసె

సారుస కుంభకర్ణుని జావనేసె

అరిది శ్రీవేంకటేశుడలమేలుమంగ గూడి

గరుడనిమీద నెక్కి కంటువారునేసె." (*సంపుటం2.106:72.*)

ఈ కీర్తనలో రాముని వనవాసం నుండి రామరావణ యుద్ధం, అయోధ్యకు సీతారాముల ప్రయాణం వరకూ చెప్పబడింది. రాముని మహిమాన్వితునిగా అన్నమయ్య కీర్తించారు. పల్లవిలో నరకాసురుని చంపిన కృష్ణుని చూపించి ఆ తరువాత రామాయణాన్ని ఈ కీర్తనలో పొందుపరిచారు. రాముని సమరాంగణ వీరుడిగా అన్నమయ్య కీర్తించారు. రాముని చేతిలో హతులైన ప్రముఖులైన రావణుడు, కుంభకర్ణుడు, మారీచుడు మొదలైన రాక్షసులను ఈ కీర్తనలో గుర్తు చేసుకున్నారు. రాముడు ఆజ్ఞాపించగానే సముద్రుడు నీటిని ఆరేలా చేసి లంకకు దారి ఇచ్చాడు. రామునికి ఎదురు లేదని ఈ కీర్తనలో నిరూపించారు. రాముడు తన జీవితంలో సంహరించిన రాక్షసుల సంఖ్య లెక్కకు మించినదని అన్నమయ్య తెలియజేశారు. భూభారాన్ని తగ్గించడానికి వచ్చిన విష్ణు అంశగా రాముని కీర్తించారు. ఈ కీర్తనలో రాముని పాత్రను అన్నమయ్య మహత్తరంగా తీర్చారు.

## 2.3.3. హనుమంతుడు

హనుమంతుడు అన్నమయ్య సంకీర్తనల్లో కనిపించే ఒక ప్రధానమైన పాత్ర. ఈ పాత్రను సమయానుకూలంగా కార్యాన్ని సిద్ధింపజేసే బంటుగా, తెలివైన ధీశాలిగా, అతిబలవంతుడిగా, కార్యార్థిగా, సీతారాముల మధ్య అనుబంధాన్ని కలిగించే వారధిగా అన్నమయ్య సృష్టించారు. హనుమంతుని మహిమలను నోరారా కీర్తించారు. అతిపరాక్రమవంతుడిగా, యుద్ధోన్ముఖునిగా ఎన్నో కీర్తనల్లో కీర్తించారు. అందుకే హనుమంతుడి పాత్ర అంత విశిష్టమైంది. దానికి ప్రధానమైన కారణం ఏమిటంటే *రామాయణం*లో హనుమంతుడు ఒక ముఖ్య భూమికను పోషించారు. హనుమంతుడే లేకపోతే రామాయణం అరకొరగా మిగిలిపోయేదేమో! అందుకే ఆ పాత్రను వాల్మీకి మహర్షి అత్యంత ప్రధానమైన పాత్రగా తీర్చిదిద్దారు. సుందరకాండ మొత్తం హనుమంతుని కార్యాలు, చేష్టలను గురించి చెబుతోంది. రాముని భక్తులలో అంత విశిష్టమైన వాడు మొత్తం

*రామాయణం*లోనే మనకు కనిపించదు. అందుకే అన్నమయ్య ఆ పాత్రను అత్యంత మనోహరంగా తీర్చిదిద్దారు. అలాంటి కీర్తనలను కింద విశ్లేషిస్తున్నాను.

**గౌళ రాగం**

**పల్లవి:**

"నేలమిన్ను ఒక్కటయినా నీ బంటు ఒక్క
వేలనే అక్షుని తెగవేసెగా నీ బంటు

**చరణం:**

ఉంగరమెగరవేసీ ఉదధిలో పడకుండా
నింగికి చేయిచాచె నీ బంటు
చెంగున జలధి దాటి జంబుమాలి నీలమీద
కుంగదొక్కి పదముల కుమ్మెగా నీ బంటు

**చరణం:**

వెట్టగా రావణు రొమ్ము విరుగ చేతనే గ్రుద్దే
నిట్టతాడువంటివాడు నీ బంటు
దిట్టయై మందులకొండ తేజమున నదురేయి
పట్టపగలుగా దెచ్చే బాపురే నీ బంటు

**చరణం:**

అలరనన్నియుజేసి అజునిపట్టానకు
నిలుచున్నాడదిగో నీ బంటు
బలువేంకటేశా ఈ పవననందనుడు
కలిగి లోకములెల్లా కాచెగా నీ బంటు" (*సంపుటం1.69:47.*)

ఈ కీర్తనలో *రామాయణం*లోని సుందర కాండనంతా అన్నమయ్య ప్రస్ఫుటింపజేశారు. హనుమంతుడు కొన్నిసార్లు అతిబలవంతుడిలా, కొన్ని సార్లు కోతిలా ప్రవర్తించాడు. అత్యధికమైన సంతోషం వచ్చిందంటే మనిషే కోతిలా ప్రవర్తిస్తాడు. ఆ విధాన్ని అన్నమయ్య ఈ కీర్తనలో పొందుపరిచారు. 'హనుమంతుడు మంటిని మింటిని ఒక్కటిగా చేసి సీతమ్మవారిని అన్వేషించడానికి బయలుదేరాడు. దారిలో తనకెదురైన అక్షుడు అనే రాక్షసుని ఒక్క వేటుతో చంపాడు. సముద్రాన్ని దాటే సందర్భంలో రాముడు తనకిచ్చిన

ఉంగరాన్ని పైకి ఎగురవేసి పట్టుకున్నాడు. సముద్రాన్ని దాటాక జంబుమాలి పర్వతాన్ని కాళ్ళతో కుమ్మి కుంగిపోయేలా చేశాడు. లంకలో రావణుని రొమ్ము పగిలేలా చేతితోనే గుద్దాడు. రామరావణ యుద్ధ ఘట్టంలో లక్ష్మణుడు మూర్ఛపోయి, రాముడు ఏడుస్తున్నప్పుడు హిమాలయాలనుంచి సంజీవని పర్వతాన్ని తెచ్చి, లక్ష్మణుని బ్రతికేలా చేసి, రాముడికి ఉపశమనం కలిగించాడు. ఇన్ని పనులు చేసి అజుడు పట్టాభిషేకాన్ని కళ్ళారా చూశాడు. చిరంజీవత్వాన్ని పొంది లోకాలన్నింటినీ కాస్తున్నా'డని అన్నమయ్య ఈ కీర్తనలో హనుమంతుని పాత్రను అత్యున్నతంగా తీర్చిదిద్దారు. ఈ కీర్తన చదువుతుంటే ఆ సన్నివేశాలు మన కళ్ళకు కనబడినట్లే ఉంటాయి. ఈ కీర్తనలో చెప్పిన వీరగాథలు మనిషి జీవితంపై చాలా ప్రభావాన్ని చూపుతాయి. అంత అద్భుతంగా అన్నమయ్య హనుమంతుని పాత్రను చిత్రీకరించారు.

**శంకరాభరణ రాగం**

**పల్లవి:**

"మతంగ పర్వతమాడ మాల్యవంతమునీడ
అతిశయిల్లిన పెద్ద హనుమంతుడితడా

**చరణం:**

ఈతడా రామునిబంటు ఈతడా వాయుసుతుడు
ఆతత బలాఢ్యుడందురాతడీతడా
సీతను వెదకి వచ్చి చెప్పినయాతడీతడా
ఘాతల లంకలోని రాక్షసవైరి ఈతడా

**చరణం:**

అంజనాసుతుడితడా అక్షమర్దనుండితడా
సంజీవని కొండదెచ్చె సారెమీతడా
భంజించె కాలనేమిని పంతముననితడా
రంజిత ప్రతాప కపిరాజసఖుండితడా

**చరణం:**

చిరజీవి ఇతడా జితేంద్రియుడితడా
సురలకుపకారపు చుట్టమీతడా

నిరతి శ్రీవేంకటాద్రిని విజనగరములో

అరిది వరములిచ్చీనందరికి నితడా" (*సంపుటం2.220:149.*)

'మతంగ పర్వతం మీద మాల్యవంతం అనే చోటులో హనుమంతుడు ఉన్నాడు. వాయుసుతుడు, రామునిబంటు, అతిబలాఢ్యుడు, లంకలోని రాక్షసులను సంహరించి, సీత జాడ రామునికి తెలియజేశాడు. అంజనీ సుతుడు, అక్షుణ్ణి చంపినవాడు, సంజీవని కొండను తెచ్చి రామునికి సాయపడిన వాడు. కాలాన్ని భంజించినవాడు, ప్రతాపవంతుడు, సుగ్రీవుడికి స్నేహితుడు. చిరంజీవి, జితేంద్రియుడు, దేవతలకు ఉపకారం చేసే చుట్టం లాంటివాడు. అలాంటి హనుమంతుడు తిరుమలలో శ్రీవేంకటేశ్వరునితోబాటు కొలువై అందరికీ వరాలిస్తున్నా'దని అన్నమయ్య ఈ కీర్తనలో తెలియజేశారు. ఈ కీర్తనలో హనుమంతునికి ఉన్నటువంటి అన్ని విశేషణాలను వాడారు. హనుమంతుణ్ణి స్తోత్రం చేశారు. ఈ కీర్తన చదువుతుంటే నాకు *హనుమాన్ చాలీసా* చదివినట్లు అనిపిస్తుంది. అందులో హనుమంతుని గుణాలను, శౌర్యప్రతాపాలను, తెలివితేటలను, సమయస్ఫూర్తిని రచయిత అయిన తులసీదాస్ కొనియాడారు. ఆ కోవకు చెందిన మరొక అద్భుతమైన కీర్తన ఇది. ఈ కీర్తనలో హనుమంతుని పాత్రను అత్యంత అద్భుతంగా తీర్చారు. ఈ కీర్తనలో అన్నమయ్య కేవలం రామునికి బంటు అని వదిలివేయకుండా భక్తుడు భగవంతునికంటే గొప్పవాడు అని నిరూపించారు. హనుమంతుని భక్తిప్రపత్తులను, స్వామిభక్తిని, నానావిధాలుగా కొనియాడారు అన్నమయ్య.

**సాలంగనాట రాగం**

**పల్లవి:**

"అదెవచ్చె నిదె వచ్చె నచ్యుతు సేనాపతి

పదిదిక్కులకు నిట్టె పారరో అసురులు

**చరణం:**

గరుడధ్వజంబదే ఘనశంఖరవమదే

సరుసనే విష్ణుదేవు చక్రమదే

మురవైరి పంపులవే ముందరి సేనలవే

పరచి గగ్గొలకారై పారరో దానవులు

**చరణం:**

తెల్లనిగొడుగులవే దేవదుందుభులునవే

ఎల్లదేవతల రథాలింతటానవే

కెల్లురేగినిక్కి హరికీర్తిభుజములవే

పల్లపు పాతాళాన బడరో దనుజులు

**చరణం:**

వెండిపైడిగుదెలవే వింజామరములవే

మెండగు కైవారాలు మించినవవే

దండి శ్రీవేంకటపతి దాడిముట్టెనదే ఇదే

బండుబండై జజ్జరించి పారరో దైతేయులు." (*సంపుటం2. 79:53.*)

ఈ కీర్తనలో హనుమంతుని అమితపరాక్రమాలను, శూరత్వాన్ని పూసగుచ్చినట్లు అన్నమయ్య తెలియజేశారు. హనుమంతుడు రామరావణ సంగ్రామ సమయంలో అక్కడ, ఇక్కడ అంతటా తానై కనిపించాడు. ఆయనకు విష్ణుచక్రం తోడుగా ఉంది. కాబట్టి రాక్షసగణం పది దిక్కులకు పారిపోయారు. గరుడధ్వజం దగ్గర శంఖారావం చేశారు. విష్ణుచక్రం ధాటికి, రామసేనాని ధాటికి కుప్పలు తెప్పలుగా ఉన్న రావణాసురుని సేనలు నిలబడలేకపోయాయి. చెల్లాచెదురై గగ్గోలు పెడుతూ పారిపోయారు. అన్నమయ్య ఈ కీర్తనలో రాక్షసులను నీటిబుడగలతో పోల్చారు. దేవతల రథాలు, విష్ణుమూర్తి భుజకీర్తులు దేవదుందుభులు అన్ని కొలువై ఉన్నాయి. కాబట్టి పాతాళానికి రాక్షసులందరూ వరుసకట్టారని అన్నమయ్య వివరించారు. అనేక సేనాగణాల స్తోత్రాల మధ్య శ్రీహరి ధరించిన భుజకీర్తులు అత్యంత కాంతిని కలుగజేస్తున్నాయి. రాముడు చేసే ఆ యుద్ధ తీవ్రతను తట్టుకోలేక చెల్లాచెదురుగా రాక్షసగణం పారిపోయిందని అన్నమయ్య ఈ కీర్తనలో వివరించారు. ఇది యుద్ధ వర్ణనకు సంబంధించిన కీర్తన. అంత భయానకంగా యుద్ధం జరుగుతున్నట్టుగా చెప్పిన ఈ కీర్తనలో రామచంద్రుని అందాన్ని గురించి వర్ణించడం అన్నమయ్యకే చెల్లింది. మిగిలిన హనుమంతాది సేనలను ప్రతాపవంతంగానే చూపించారు. వానరసేనను సమర్థవంతంగా నడిపించిన హనుమంతుని కీర్తిని అన్నమయ్య ఈ కీర్తనలో తెలియజేశారు. సమయానుకూలంగా తెలివితో హనుమంతుడు వర్తించిన విధానాన్ని వివరణాత్మకంగా చెప్పారు. పై రెండు కీర్తనలలో హనుమంతుని శక్తిసామర్థ్యాలగురించి

చెప్పగా ఈ కీర్తనలో మాత్రం సేనానిగా హనుమంతుని ధైర్యసాహసాలను గురించి కూలంకషంగా చర్చించారు. ఇలా అన్నమయ్య హనుమంతుని పాత్రను అత్యంత సుందరంగా, అద్భుతంగా తీర్చిదిద్దారు.

## 2.3.4. అహోబిల నరసింహుడు

శ్రీ అహోబల నరసింహస్వామి అన్నమయ్య ఆరాధించిన మరో ప్రధాన దైవం. ఆయనలో వేంకటేశ్వరుని చూసుకున్నారు. కనుకనే 'వేంకటనారసింహుడు' అని తన సంకీర్తనల్లో ముద్రగా గ్రహించారు. అహోబల క్షేత్రంలో ఆదివాన్ శఠగోపయతి అనే గురువు దగ్గర ఆళ్వార్ల దివ్య ప్రబంధాలను, విశిష్టాద్వైత సిద్ధాంత గ్రంథాలను అభ్యసించారు. అన్నమయ్య పరిపూర్ణ విష్ణు భక్తుడుగా మారింది అక్కడే. తిరుమల తరువాత అన్నమయ్య అహోబల క్షేత్రంలోనే ఎక్కువ కాలం గడిపినట్లు మనకు ఆధారాలున్నాయి. అందుకే అహోబల నరసింహునిపై అనేక సంకీర్తనలు రచించారు. ఈ సంకీర్తనల్లో నరసింహుని శౌర్య ప్రతాపాలు కీర్తించారు. వేంకటేశ్వరుని తరువాత అహోబల నరసింహుని పైనే ఎక్కువ సంకీర్తనలను రచించారు. ఆ కీర్తనలను కింద విశ్లేషిస్తున్నాను.

**సాలంగనాట రాగం**

**పల్లవి:**

"విరిగిరి దానవీరులివే

అరిగిరి దేవతలాడెరదే

**చరణం:**

పరువుకంభమదే పగిలె పగిలెనదే

హరినరసింహంబాయెనదే

గరుడధ్వజమదే ఘనచక్రంబదే

మెలచేటి శంఖపు మ్రోతలవే" (*సంపుటం2.91:61.*)

ఈ కీర్తనలో నరసింహుడు హిరణ్యకశపుని సంహరించే సందర్భంలో ఎలా ఉన్నాడు? అనే అంశాన్ని అన్నమయ్య మన కళ్ళకు కట్టారు. నరసింహుని రూపం చూసి రాక్షసుల గుండెలు బద్దలయ్యాయి. వారు నశించారు. అక్కడ ఏమి జరుగుతుందో చూడాలని దేవతలు ఆసక్తిగా వచ్చారు. స్తంభం పగలగానే గరుడధ్వజంతో, ఘనచక్రంతో ఒక స్వరూపం

ప్రత్యక్ష్యమైంది. హిరణ్యకశపుని కోరిక మేరకు అసురసంధ్యాసమయంలో, గడపలో, సగం మనిషి, సగం సింహరూపంలో హిరణ్యకశపుని తొడపై పండుకోబెట్టుకొని, వెయ్యి చేతులతో అతని పొట్ట చీల్చి, పేగులు మెడలో వేసుకున్న నరసింహుని రూపం అత్యంత భయానకంగా అన్నమయ్య వర్ణించారు. ఆయనను శాంతింపజేయడానికి ప్రహ్లాదుడు, నారదుడు, ఇతరదేవతలు చాలా కష్టపడ్డారు. ఉగ్రనరసింహ రూపం మనకు అన్నమయ్య ఈ కీర్తనలో సాక్షాత్కరింపజేశారు. ఈ కీర్తనలో నరసింహుని పాత్ర అత్యంత భీకరంగా వర్ణించబడింది.

**నాట రాగం**

**పల్లవి:**

"అహోబలేశ్వరుదరికుల దమనుడు
మహామహిమాను మలసీవాడే

**చరణం:**

కదులగన్నులును కరాళవదనము
గుదిగొను భయదపు గోరులను
అదురు మీసములు అదరగ నవ్వుచు
కుదుటతోడ గొలువున్నాడువాడే" (*సంపుటం2.111:75.*)

ఈ సంకీర్తనలో నరసింహుని ఆకారాన్ని తెలియజేశారు. ఆ రూపం రాక్షసులకు స్వర్గలోక ప్రాప్తి కల్పించేదిగా ఉంది. కదిలే కన్నులు తీక్షణమైన చూపులు, విశాలమైన ముఖవర్చస్సు, పొడవాటి గోళ్ళతో ఉన్నాడు. ఆయన నవ్వుతుంటే కళ్ళు అదురుతున్నాయి. వెడల్పాటి భుజాలతో, అమిత పరాక్రమంతో ఒప్పుతున్నాడు. దేవతలందరూ పొగుడుతుండగా శంఖచక్రాలతో ఇందిరను తొడపై కూర్చోబెట్టుకొని కొలువై ఉన్నాడు. ఈ కీర్తనలో అమిత భయానకంగా నరసింహుని రూపం ఉందని అన్నమయ్య తెలియజేశారు. అంత భయానకంగా ఉండి కూడా శ్రీలక్ష్మిని తొడపై కూర్చోబెట్టుకొని కొలువై ఉన్నాడని నరసింహుని శృంగార రూపాన్ని కూడా ఈ కీర్తనలో ఆవిష్కరింపజేయడం ఒక విశేషం.

**సాలంగనాట రాగం**

**పల్లవి:**

"సిరిదొడపైనిడి శ్రీనరసింహుడు
ఇరువుగ వరములనిచ్చీనీవాడే

**చరణం:**

ఘనమగు కోరలు కరాళవదనము

చణకుచు గొడసితి జిహ్వయును

యెరుపు ఘటమరలు నిటలోచనము

నొరగగ గొలువై యున్నాడువాడే" (*సంపుటం2.112:76.*)

ఈ కీర్తనలో పై కీర్తనలలాగే నరసింహుని ఉగ్రరూపాన్ని మొదటి చరణంలో వర్ణించారు. కానీ రెండో చరణానికి వచ్చేటప్పటికి ఆ భయానక తీవ్రత కాస్త తగ్గి, అభయవరద హస్తాన్ని కలిగి, యోగముద్రలో ఉన్న నరసింహుని మనం చూడవచ్చు. మూడో చరణంలో పాముపై పడుకొని విశ్రాంతి తీసుకుంటున్న నరసింహుని అన్నమయ్య వర్ణించారు. ఈ కీర్తనలో నరసింహుడు ఉగ్రనారసింహుడు, యోగనారసింహుడు, శృంగార నారసింహుడు, శేషతల్పంపై నారసింహునిగా నానా భంగిమల్లో భక్తులకు దర్శనమిస్తున్నట్లుగా అన్నమయ్య వర్ణించారు.

**నాట రాగం**

**పల్లవి:**

ఘోరవిదారణా నారసింహా నీ

వీరూపముతో ఎట్లుండితివో

**చరణం:**

ఉడికెడి కోపపు టూర్పుల కొండలు

పొడిపొడియై నభమునకెగయా

బెడుదపు రవమున పిడుగులొదొరుగగ

యడనెడనీవపుడెట్లుండితివో" (*సంపుటం1.68:46.*)

ఈ కీర్తనలో అన్నమయ్య నరసింహుని భయంకర రూపాన్ని వర్ణిస్తూనే ఈ రూపంతో ఎట్లా ఉన్నావో! అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. మొదటి చరణంలో ఉడికేటువంటి కోపంతో, కొండలను పిండి చేసే తీక్షణతతో, కళ్ళలో పిడుగులు రాల్చే నీవప్పుడు ఎట్లా ఉన్నావో! అని వర్ణించారు. రెండో చరణంలో కళ్ళలో కాలనిప్పులు కక్కుతూ భయంకరమైన ఫాలనేత్రాలతో ఈ బ్రహ్మాండకోటికి ఏలికగా నీవు ఎట్లా ఉన్నావో! అని ఆశ్చర్యాన్ని ప్రకటించారు. మూడో చరణంలో గుటకలు మింగుతూ, పళ్ళు కొరుకుతూ, పెదాలు, దవడలు వణికేంత

భయంకరమైన కోపాగ్నితో నీవు ఎలా ఉన్నావో! అని తన సంభ్రమాలను ప్రకటించారు. నాలుగో చరణంలో మెరిసే గోళ్ళతో, పెద్దపెద్ద వేళ్ళతో, నీళ్ళు నములుతూ ఎలా ఉన్నావో! అని తన విస్మయాన్ని ప్రకటించారు. అయిదో చరణంలో హిరణ్యకశపుని భయంకరంగా చంపి రక్తం తాగి ఇంత భయంకరంగా నీవు ఎలా ఉన్నావో అని వివిధ రూపాలలో అన్నమయ్య శ్రీనరసింహస్వామిని ఆవిష్కరింపజేశారు. ఈ కీర్తనలో అత్యుగ్ర నారసింహుని అన్నమయ్య దర్శింపజేశారు. చక్కని తెలుగు మాటలతో లోతైన భావంతో ఈ కీర్తనను అద్భుతంగా రచించారు.

**శంకరాభరణ రాగం**

**పల్లవి:**

"మలసీ చూడరో మగసింహము
అలవి మీరిన మాయల సింహము

**చరణం:**

అదివో చూడరో ఆదిమపురుషుని
పెదయౌభళముమీది పెనుసింహము
వెదకి బ్రహ్మాదులు వేదాంతతతులు
కదిసి కానగలేని ఘనసింహము" (*సంపుటం1.13:9.*)

ఈ కీర్తన పల్లవిలోనే 'మలసి' అని ఉంది. అనగా 'విజృంభించి' అని అర్థం. అనగా దేవుని చూడడానికి తీక్షణమైన కోరిక, తపన ఉండాలని అన్నమయ్య భావించారు. బహుశా అందుకేనేమో తిరుమలలో రద్దీ వల్ల రోజుకి ఒకరిద్దరి మధ్య దేవుని దర్శన విషయంలో తగాదాలు జరుగుతూ ఉంటాయి. ఈ కీర్తనలో నరసింహుని శౌర్య ప్రతాపాల గురించి కాకుండా భక్తులకు ఆయన కొంగుబంగారమనే కోణంలో అన్నమయ్య చెప్పారు. 'నరసింహుడు చెప్పశక్యం కాని మాయలను ప్రదర్శిస్తున్నాడు. ఇతడే ఆదిపురుషుడు. పెద్ద సింహం. బ్రహ్మ, వేదవేద్యులు కూడా కోరినంతనే చూడలేనంత గొప్పసింహం' అని ఈ కీర్తనలో అన్నమయ్య నరసింహుని పాత్రావైశిష్ట్యాన్ని తెలియజేశారు. ఆ పాత్ర గొప్పదనాన్ని తెలియజేయడానికి 'పెదయౌభళము మీది పెను సింహము', 'చిచ్చరకంటితోడి జిగిసింహము', 'అంకపు దనుజ సంహారసింహము' మొదలైన విశేషణాలను వాడి వాటిమీద ఈ కీర్తనంతా నడిపించారు. సాధారణంగా మనకు ఉగ్రనారసింహుడు మాత్రమే

దర్శనమిస్తాడు. అన్నమయ్య మాత్రం నరసింహునిలోని అన్ని కోణాలను ఆవిష్కరింపజేశారు. అది ఆయన కవిత్వం యొక్క గొప్పదనం. ఈ పాత్రను తీర్చే విషయంలో అన్నమయ్య చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఒకపక్క భయానకంగా వర్ణిస్తూనే, ఇంకోపక్క నరసింహునిలోని శాంతమూర్తిని, శృంగార మూర్తిని దర్శించదమనేది అన్నమయ్యకే చెల్లింది.

**ఆహిరి రాగం**

**పల్లవి:**

"నవనారసింహా నమోనమో

భవనాసి తీరా అహోబల నారసింహా

**చరణం:**

సతతప్రతాపరౌద్ర జ్వాలా నరసింహా

వితతవీరసింహా విదారణా

అతిశయ కరుణ యోగానంద నరసింహా

మతిశాంతపు కానుగు మాని నారసింహా" (*సంపుటం1.455:304.*)

ఈ కీర్తనలో ప్రతాప, రౌద్ర, జ్వాలా నరసింహా, వీరనరసింహా, యోగనరసింహా, బీభత్స మట్య మళ్ళ నరసింహా, భార్గోటి నరసింహా, శృంగార నరసింహా, వరాహనరసింహా, వైభవనరసింహా, పదివేలురూపముల బహునారసింహా... మొదలైన స్తోత్రాంశాలు ఉన్నాయి. నరసింహుడు దర్శనమిచ్చిన అన్ని సందర్భాలు ఈ కీర్తనలో పొందుపరిచారు. అంతేకాకుండా ఆ సందర్భాలలో నరసింహుని హావభావాలను ఈ కీర్తన తెలియజేస్తుంది.

**సామంత రాగం**

**పల్లవి:**

"నగధర నందగోప నరసింహా

నగజవరద శ్రీ నారసింహా

**చరణం:**

నరసింహా పరంజ్యోతి నరసింహా

వీర నరసింహా లక్ష్మీ నారసింహా

నరసఖ బహుముఖ నారసింహా వో

నరకాంతతా జేజే నారసింహా" (*సంపుటం1.261:173.*)

ఈ సంస్కృత కీర్తనలో కూడా నరసింహుని విశిష్టతను తెలియజేయడానికి అన్నమయ్య అధికంగా విశేషణాలను, ఆయనకు ఉన్న ఇతర పేర్లను వాడుకున్నారు. పుండరీకనరసింహా, సురాసుర నరసింహా, నమకచమకహిత నారసింహా, నవనీతచోర, వేంకటనారసింహా మొదలైన ఎక్కువ విశేషణాలను వాడారు. ఈ కీర్తనలో నరసింహ స్తోత్రం కనిపిస్తుంది. విష్ణుమూర్తి ధరించిన కొన్ని అవతారాలను ఈ కీర్తనలో అన్నమయ్య పేర్కొన్నారు. వేదాలు, పురాణాలు, భాగవతం మొదలైన ప్రసిద్ధ వాఙ్మయానికి సంబంధించిన విశేషాలు ఇందులో ఉన్నాయి. ఈ కీర్తనలో నరసింహుణ్ణి అన్నమయ్య ఆదిమపురుషుడిగా, పురాణపురుషుడిగా, కృష్ణుడిగా ఇలా నానారకాల పాత్రలకు ప్రతిరూపంగా చెప్పారు.

పై రెండు కీర్తనలలో నరసింహ స్తోత్రం చేశారు. ఆయన గొప్పదనాన్ని అణువణువు ఉట్టిపడేలా అన్నమయ్య సంకీర్తనా రచన గావించారు. అయితే, ఈ కీర్తనలన్నీ ఒకేరకంగా అనిపించినా, ఒక్కొక్క కీర్తనలో ఏదో ఒక విశేషాన్ని వాడి ఆ నరసింహుని గొప్పతనాన్ని చాటేందుకు అన్నమయ్య కంకణం కట్టుకున్నారు. నరసింహుని పాత్ర చిత్రణలో విజయం సాధించారు. అద్భుతంగా ఈ పాత్రను తీర్చారు. అయితే, చాలా తక్కువ సందర్భాలలో మాత్రమే నరసింహుని సతీమణిని గురించి ప్రస్తావించారాయన. ఒకవేళ ప్రస్తావించాల్సి వచ్చినా 'సిరితొడపైనిడి', 'లక్ష్మీనారసింహా' అని పేర్కొన్నారేగానీ ఆమెకు అంత ప్రాధాన్యం ఇవ్వలేదు. కానీ ఆమె స్వామిలో అర్థభాగం కదా! ప్రత్యేకంగా ప్రస్తావన ఎందుకులే! అని బహుశా అన్నమయ్య భావించి ఉండవచ్చు.

ఇలా అన్నమయ్య ఈ సంకీర్తనల్లో పాత్రలను అద్భుతంగా చిత్రించారు. ఒక్కొక్క పాత్రను గురించి రచించిన సంకీర్తనలు అనేకాలు. చెప్పిన విషయమే మళ్ళీ మళ్ళీ చెప్పినట్లు ఉంటుంది కానీ ఈ కీర్తనల్లో ఏదో ఒక విశేషాన్ని పొదిగి, అద్భుతంగా తీర్చారు.

## 2.4. అన్నమయ్య వర్ణనలు

అన్నమయ్య చేసిన వర్ణనలకు సాహిత్యంలో చాలా ప్రాధాన్యత ఉంది. ఈ వర్ణనలు పాత్రల పరంగా కాకుండా పరిసరాల పరంగా ఉన్నాయి. ఊరికే దొరికింది కదా అని మాటిమాటికి కొందరు కవులు వర్ణనలతో తమ కవిత్వాన్ని నింపుతారు. అలా కాకుండా

అన్నమయ్య ఆ సందర్భ గాఢతనుబట్టి, చెప్పాల్సిన విషయాన్ని సూటిగా చెప్పేందుకు వర్ణనలను చేశారు. అనవసరపు కల్పనల జోలికి, వర్ణనల జోలికి ఆయన వెళ్ళలేదు. ప్రస్తుతం మనకు లభిస్తోన్న 14358 సంకీర్తనల్లో ఒకే వర్ణానికి చెందిన కొన్ని కీర్తనలు ఉన్నాయి. వాటిలో అదే విషయాన్ని చెప్పినట్లుగా అనిపించినా ఏదో ఒక కొత్త అనుభూతి కలుగుతుంది. అది అన్నమయ్య వర్ణనల ప్రత్యేకత. కాబట్టి అన్నమయ్య చేసిన వర్ణనలు తెలుగు సాహిత్యంలో మకుటాయమానంగా నిలిచిపోయాయి.

అన్నమయ్య చేసిన వర్ణనలను ప్రధానంగా 1 తిరుపతి, తిరుమల పరిసరాల వర్ణనలు, 2 ప్రాకృతిక వర్ణనలు, 3. యుద్ధ వర్ణనలు, 4. దశావతార వర్ణనలుగా విభజించవచ్చు. ఈ వర్ణనల్లో ప్రాకృతిక వర్ణనలకు చాలా ప్రాధాన్యం ఉంది. అన్నమయ్య సంకీర్తనల్లో ఎక్కువభాగం తిరుపతి, తిరుమల పరిసరాల వర్ణనలే కనిపిస్తున్నాయి. వాటన్నింటిని ఒక్కొక్కటిగా కింద చర్చించడం జరిగింది.

## 2.4.1. తిరుపతి, తిరుమల పరిసరాల వర్ణనలు

అన్నమయ్య రచించిన సంకీర్తనా సాహిత్యం మొత్తం వేంకటేశ్వరుని ప్రతిబింబిస్తుందని ఇంతకు ముందే ప్రస్తావించాను. ఆ కీర్తనల్లో ఏ ఒక్క దాన్ని పట్టి చూసినా తిరుమల పరిసరాల గుభాళింపు మనకు తెలుస్తుంది. తిరుమల ఏడు కొండలతో విరాజిల్లుతోంది. అవి: వృషభాద్రి, అంజనాద్రి, నీలాద్రి, గరుడాద్రి, శేషాద్రి, నారాయణాద్రి, వేంకటాద్రి. ఈ కొండల వైభవాన్ని గురించి అన్నమయ్య తన సంకీర్తనల్లో వర్ణించారు. తిరుపతిలోని పాపనాశనం, తిరుమలలోని అనేక తీర్థాలు, కోనేళ్ళు వర్ణించబడ్డాయి. నేను ఎన్నుకున్న సంపుటాలలో ఆ వర్ణనలకు సంబంధించిన కీర్తనలు చాలా తక్కువగా దొరికాయి. అన్నమయ్య రచించిన ఇతర సంపుటాల్లో తిరుమల పరిసరాలకు సంబంధించిన కీర్తనలు ఉన్నాయి. నాకు మాత్రం చాలా స్వల్పంగా ఈ కీర్తనలు దొరికాయి. వాటిని కింద విశ్లేషిస్తున్నాను.

**ముఖారి రాగం**

**పల్లవి:**

“బ్రహ్మకడిగిన పాదము

బ్రహ్మముదానె నీ పాదము

**చరణం:**

చెలగి వసుధ గొలిచిన నీ పాదము

బలితలమోపిన పాదము

తలకక గగనము తన్నిన పాదము

బలరిపుగాచిన పాదము" (*సంపుటం1.193:128.*)

తిరుమలలో శ్రీవారి పాదాలకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ కీర్తనలోని పల్లవిలో 'బ్రహ్మము తానే నీ పాదము' అన్నారు. అంటే అవి కేవలం శ్రీవారి పాదాలు మాత్రమే కాదు. సాక్షాత్తూ సృష్టికర్తైన బ్రహ్మదేవుడు అర్చించే పాదాలు అని అన్నమయ్య అర్థం చెప్పారు. పూర్వం తిరుమలనంబి అభీష్టం మేరకు తిరుమలకు వెళ్ళే దారిలో తన భక్తునికోసం ప్రతిష్ఠితమైన ఈ పాదాలు అత్యంత వైభవాన్ని సంతరించుకున్నాయి. ఈ పాదం గొప్పదనాన్ని అన్నమయ్య ఈ సంకీర్తనలో వర్ణించారు.

బలి చక్రవర్తిని మోక్షానికి పంపేందుకు ఒక పాదంతో భూమిని, ఇంకో పాదంతో ఆకాశాన్ని కప్పి, మూడో అడుగు బలి తలపై పెట్టాడు. ఈ సందర్భాన్ని అన్నమయ్య వర్ణించేందుకు 'తలకక గగనము తన్నిన పాదము బలితలమోపిన పాదము' అన్నారు. అహల్య పాపం కడిగింది, పాము గర్వాన్ని అణచింది ఈ పాదమే. ఇలాంటి పాదం అలమేలుమంగ పిసికేందుకు ఇంపైంది. యోగీశ్వరులకు, మునులందరికి మోక్షాన్ని కలిగించి పరమపథానికి చేరేందుకు మార్గం సుగమం చేసిందని అన్నమయ్య పరిపరివిధాలుగా తిరుమల శ్రీవారి పాదాల గొప్పదనాన్ని సహజసిద్ధంగా వర్ణించారు.

**గుండ క్రియ రాగం**

**పల్లవి:**

"దేవునికి దేవికిని తెప్పల కోనేటమ్మా

వేవేల మొక్కులు లోకపావని నీకమ్మా

**చరణం:**

ధర్మార్థ కామ మోక్షతతులు నీ శోభనాలు

అర్మిలి నాలుగు వేదాలదే నీదరులు

నిర్మలపు నీ జలము నిండుసప్తసాగరాలు

కూర్మము నీ లోతు ఓ కోనేరమ్మా

**చరణం:**

తగిన గంగాది తీర్థములు నీ కడళ్ళు

జగతి దేవతలు నీ జలజంతులు

గగనపు పుణ్యలోకాలు నీ దరిమేడలు

మొగినీ చుట్టూ మాకులు మునులోయమ్మా

**చరణం:**

వైకుంఠనగరము వాకిలి నీ ఆకారము

చేకొను పుణ్యములే నీ జీవభావము

యేకడను శ్రీవేంకటేశుడే నీ వునికి

దీకొని నీ తీర్థమాడితిమే కావవమ్మా" (*సంపుటం2.415:287.*)

ఈ కీర్తనలో అన్నమాచార్యులు తిరుమలలోని కోనేటి వైభవాన్ని తెలియజేశారు. పల్లవిలోనే 'దేవునికి దేవికిని తెప్పల కోనేటమ్మా' అని ఉంది. ఎత్తుగడలోనే శ్రీవేంకటేశ్వరుడు అలమేలు మంగమ్మలను సాక్షాత్కరింపజేశారు. ఈ కోనేరు తిరుమలకు కొంత దూరంలో ఉంది. ప్రతి ఏటా చక్రస్నానం ఇక్కడే ఆచరిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామిని ముందు అమ్మవారితో కలిపి తీర్థమాడించిన తరువాత భక్తులకు స్నానమాచరించడానికి అనుమతిని ఇస్తారు. ఈ సమయంలో హరిచక్రాన్ని కోనేటిలో ముంచుతారు. అందువల్ల చాలా మహిమలు సంప్రాప్తిస్తాయని భక్తులు నమ్ముతారు. ఈ కోనేటిని గురించి అన్నమయ్య ప్రత్యేకంగా పేర్కొన్నారు.

'లోకాల పాపాలను పరిహరించి, దేవదేవేరులకు స్నానాన్ని ఆచరించేందుకు కొలువై ఉన్న కోనేరమ్మా నీకు వేల మొక్కులు. నీలో మునగడంవల్ల ధర్మార్థ కామాలనుండి విడుదల కలుగుతుంది. నాలుగు వేదాలను దరులుగా కలిగి ఉన్నావు. పవిత్రమైన నీలోని నీళ్ళు సప్తసాగరాలను మించాయి. అందుకే కూర్మావతారియై స్వామి నిన్ను ఎల్లప్పుడూ కాపాడుతుంటాడు. గంగ, మిగిలిన పవిత్రమైన నదులు నీకు కడళ్ళు. ఈ జగతిలోని దేవతలందరూ నీ జలచరాలు. నీ చుట్టూ ఆకాశంలోని దేవతల స్థానాలు ఉన్నాయి. మునులు నీ చుట్టూ చెట్లై, సంజీవినులై కొలువున్నారు. నీ ఆకారం వైకుంఠ నగరవాకిలిని తలపిస్తుంది.

మనుషులను, దేవతలను సమభావంతో పుణ్యులుగా తీర్చిదిద్దడమే నీ జీవభావం. అందుకే శ్రీవేంకటేశ్వరుడే నీ ఉనికిని గుర్తించాడు. అందుకే మేము నీలో తీర్థమాడుతున్నాం. మమ్మల్ని కాపాడవమ్మా.' అని అన్నమయ్య ఈ కోనేటిని వేడుకున్నారు.

ఈ కీర్తనలో మొదటి చరణంలో తిరుమల కోనేటిని ఇహలోక సంబంధమైన ధర్మార్థ కామాలను పోగొట్టి, శుభాలు చేకూర్చేదిగా పేర్కొన్నారు. అలాగే పవిత్రనదులకు ధీటుగా నిలబడుతుందని చెప్పారు. రెండో చరణంలో నదులలోని పవిత్రమైన తీర్థాలను ప్రస్తావిస్తూ అలాంటి తీర్థాలకు ఈ తిరుమల కోనేరు ఎంతమాత్రం తీసిపోదని వివరించారు. మూడో చరణంలో వైకుంఠ నగరపు వాకిలిని తలపిస్తున్న ఈ కోనేరు మోక్షానికి దారిగా అభివర్ణించబడింది. ఈ కోనేటిలోతు కూర్మాన్ని తలపిస్తోంది. గంగా యమున లాంటి పవిత్ర పుణ్యతీర్థాలు ఈ కోనేటికి సముద్రాలుగా, దేవతలను జలచరాలుగా, స్వర్గలోకాలు ఈ కోనేటికి దరిమేడలుగా, తిరుమల పరిసరాలలో దొరికే మందులు మునులుగా వర్ణించారు. ఈ కోనేటి ఆకారాన్ని వైకుంఠ నగరపు వాకిలిగా అన్నమాచార్యులు వర్ణించారు.

ఈ కోనేటివర్ణనలో అనేక అంశాలను అన్నమయ్య ప్రస్తావించారు. ఈ కోనేటిని, దాని సొబగులను వర్ణిస్తూ తిరుమల నుండి వైకుంఠం దాకా, ఇహంనుండి పరందాకా అన్ని విషయాలను కూలంకషంగా అద్భుతంగా అన్నమయ్య వర్ణించారు. ఈ కీర్తనలో ప్రకృతిని, ప్రకృతి దేవతలను, మునులను, నదులను, సముద్రాలను, పుణ్య తీర్థాలను చాలా అద్భుతంగా వర్ణించారు. 'త్రికరణశుద్ధిగా చేసిన పనులకు' అనే సంకీర్తనలో చెప్పినట్లుగా అన్ని తీర్థాలను తిరగడంకంటే శ్రీవేంకటేశ్వరుని సేవించడం మేలు అనే భావాన్ని ఇక్కడ మరోమారు ప్రస్తావించారు.

తిరుమలలో బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగే చక్రస్నానాన్ని అత్యద్భుతంగా వర్ణించారు. ఈ కీర్తనలో అన్నమయ్య ప్రకృతిని కూడా ఆరాధించినట్లు మనం గమనించగలం. అంతే కాకుండా ఈ వర్ణనలు చేస్తూనే సహజత్వం ఎక్కడా తగ్గకుండా అత్యద్భుతంగా అన్నమయ్య ఈ కీర్తనను రచించడం చెప్పుకోదగ్గ అంశం.

## 2.4.2. ప్రాకృతిక వర్ణనలు

అన్నమయ్య తిరుమల ప్రకృతిని సుందరంగా వర్ణించారు. తిరుమల ప్రకృతి శోభాయమానంగా ఉండి, పర్యాటకులకు కనువిందు చేస్తోంది. నేటికీ తిరుమల పుణ్యక్షేత్రం మిగిలిన పుణ్యక్షేత్రాలకంటే వృద్ధి సాధించేందుకు ప్రకృతి సౌందర్యం చాలా ముఖ్యమైన భూమికను పోషిస్తోంది. అలాంటి ప్రాకృతిక వర్ణనలు ఉన్న కీర్తనలను కింద విశ్లేషించడం జరిగింది.

**మలహరి రాగం**

**పల్లవి:**

"అదె చూడు తిరువేంకటాద్రి
నాలుగు యుగములందు వెలుగొంది ప్రభమీరగాను

**చరణం:**

తగనూట యిరువై ఎనిమిది తిరుపతులగల
స్థానికులును చక్రవర్తి పీఠకములును
అగణితంబయిన దేశాంతృల మఠంబులును
అధికమయి చెలువొందగాను

**చరణం:**

మిగులనున్నతములగు మేడలును మాడుగులు
మితిలేని దివ్యతాపసులున్న గృహములును
ఒగినొరగు బెరుమాళ్ళ ఉనికిపట్టై వెలయు
దిగువ తిరుపతి గడవగాను

**చరణం:**

పొదలి అరయోజనము పొడవునను బొలుపొంది
పదినెండు యోజనంబుల పరపుననుబరగి
చెదరకేవంక చూచిన మహాభూజములు సింహ శార్దూలములును
కదిసి సురవరులు కిన్నరలు కింపురుషులును
గరుడ గంధర్వ యక్షులును విద్యాధరులు
విదితమై విహరించు విశ్రాంత దేశముల వేడుకలు దైవారగాను

**చరణం:**

ఎక్కువలకెక్కువై యెసగివెలసిన పెద్ద

యెక్కుడతిశయముగా నెక్కినంతటిమీద

అక్కజంబైన పల్లవరాయనిమఠము అలయేట్ల పేడగడవన్

చక్కనేగుచునవ్వ చెరిగడచి హరిదలచి

మ్రొక్కుచును మోకాళ్ళ ముడువు గడచిన మీద

అక్కడక్కడ వేంకటాద్రీశు సంపదలు అంతంత గానరాగాను.

**చరణం:**

ప్రాకటంబైన పాపవినాశనములోని భరితమగు దురితములు పగిళి పారుచునుండ

ఆకాశగంగ తోయములు సోకిన భవములంతంత వీడి పారగను

ఈకడను కోనేట యతులు పాశుపతుల్ మునులెన్న నగ్గలమై ఉన్న వైష్ణవులలో

ఏకమై తిరువేంకటాద్రీశుడాదరిని యే ప్రొద్దు విహరించగాను."

(*సంపుటం1.229:151.*)

ఈ కీర్తనలో నాలుగు యుగాలలోను ప్రభావవంతంగా వెలిగిపోతున్న తిరువేంకటాద్రిని గురించి అన్నమయ్య వర్ణించారు. సాధారణంగా 108 తిరుపతులు ఈ భూమి మీద ఉన్నాయని అందరి మాట. కానీ ఆచార్య శ్రీ రవ్వా శ్రీహరిగారు *అన్నమయ్య పదకోశం* అనే నిఘంటువులో 104 తిరుపతులు మాత్రమే ఉన్నాయని, మిగిలినవి పునరావృతం చెందే పేర్లు మాత్రమేనని పేర్కొన్నారు. కానీ పై కీర్తనలో అన్నమయ్య 124 తిరుపతులను పేర్కొన్నారు. ఆ తిరుపతుల పేర్లు మాత్రం ఇవ్వలేదు. కానీ ప్రస్తుతం 104 తిరుపతులు మాత్రమే ఉన్నాయి.

ఈ తిరుపతులతోబాటు స్థానికులైన పాలకులు, చక్రవర్తులు, పెద్దపెద్ద పీఠాలు, దేశాంతృల మఠాలు, అధికంగా కీర్తించబడే అనేకాలైనవి, మేడలు, తాపస గృహాలు శ్రీవేంకటేశ్వరుడి అనుజ్ఞతో దిగువ తిరుపతిలో కొలువై ఉన్నాయని అన్నమయ్య మొదటి చరణంలో వర్ణించారు. రెండో చరణంలో తిరుమల వైశాల్యం, వ్యాసార్థం, తిరుమల

పరిసరాలను గురించి వర్ణించారు. దాదాపు అరయోజనం పొడవుతో, 11 యోజనాల విస్తీర్ణంలో తిరుమల క్షేత్రం వ్యాపించి ఉంది. ఏ వంక పరికించి చూసినా మహా వృక్షాలతో, ఏనుగులతో, సింహాలతో విలసిల్లుతోంది. సురశ్రేష్ఠులు, కిన్నరలు కింపురుషులు, గంధర్వులు, విద్యాధికులు విహరిస్తూ సేదతీరడానికి ఇక్కడకి వస్తూంటారని అన్నమయ్య చెప్పారు.

మూడో చరణంలో ఈ క్షేత్రానికి ఎందుకు అంత వైభవం వచ్చిందో? వర్ణించారు. ఒకానొక సందర్భంలో వేంకటేశ్వరుడు కొలువుండడానికి విచ్చేయడంవల్ల ఈ క్షేత్రం మరింత మహిమాన్వితమైంది. ఇక్కడే పల్లవ రాజులు అలయేట్ల పేదగడవన్ అనే మఠాలు నిర్మించారు. ఈ క్షేత్రంలోని ఏడు కొండల్లో శ్రీవేంకటేశ్వరుని సంపద అక్కడక్కడా కనిపిస్తుందని అన్నమయ్య తెలిపారు. నాలుగో చరణంలో పరిమళంతో గుభాళించే పూలతోటలు, వరసగా పేర్చినట్లు ఉన్న వనాలు వర్ణించబడ్డాయి. అత్యధికంగా పూలతో, పళ్ళతో భాసిల్లుతున్న మహావృక్షాల నీడలో కాస్త సేపు గడిపితే చాలని అన్నమయ్య తన పారవశ్యాన్ని ఈ కీర్తనలో పొందుపరిచారు.

ఈ కీర్తనలో బాగా పండాయి అని చెప్పడానికి 'కిక్కిరిసి పండాయి' అనే విశేషణాన్ని వాడారు. తద్వారా ఈ వర్ణనకు చాలా పుష్టి కలిగింది. ఇంకా తిరుమల నగరాన్ని బంగారు గోపురాల నగరంగా, ఎక్కడ చూసినా అంతా బంగారుమయంగా వర్ణించారు. చివరి చరణంలో పాపనాశనం జనుల పాపాలను నాశనం చేస్తుంటే పాతాళగంగ కష్టాలను బాపుతున్నదని అన్నమయ్య వర్ణించారు. కోనేటి స్థానాన్ని ఈ కీర్తనలో ప్రత్యేకంగా వర్ణించారు. ఈ కోనేటిలో యతులు, పశుపతులు, మునులతోబాటు ఇతర వైష్ణవులతో కలిసి తిరువేంకటాద్రీశుడు ఎప్పుడు కావాలంటే అప్పుడు విహరిస్తూ ఉంటారని అన్నమయ్య కోనేటి గొప్పదనాన్ని చాటిచెప్పారు.

ఈ కీర్తనలో కూడా తిరుమల వర్ణన మన కళ్ళకు కట్టారు అన్నమయ్య. భూమి మీద ఉన్న 124 తిరుపతులలో ఎంతో విశిష్టమైన, శ్రేష్ఠమైన తిరుమల తిరుపతులను గురించి, ఇక్కడ కొలువై ఉన్న దేవతా మూర్తులను గురించి అన్నమయ్య విస్తృతంగా వర్ణించారు. ఇలా

అన్నమయ్య తిరుమల తిరుపతి పరిసరాలలోని అందచందాలను, వేంకటేశ్వరుని సంపదలను, తిరుమల ప్రకృతిని చాలా బాగా వర్ణించారు.

### శ్రీరాగం

**పల్లవి:**

"అదివో అల్లదివో హరివాసము

పదివేలు శేషుల పడగలమయము

**చరణం:**

అదె వేంకటాచలమఖిలోన్నతము

అదివో బ్రహ్మాదులకపురూపము

అదివో నిత్యనివాసమఖిలమునులకు

అదే చూడుడదే మ్రొక్కుడానందమయము" (*సంపుటం1.23:15.*)

ఈ కీర్తనలో అన్నమయ్య తిరుమల ఏడు కొండలలో కొలువై ఉన్న మునులు, వేంకటేశ్వరుని సంపదలు, ఇంకా ఎన్నో విశేషాంశాలు చెప్పారు. తిరుమలను దర్శిస్తే భక్తులు పొందే ఆనందం అంతా ఇంతా అని చెప్పలేం. సాధారణంగా ఏదైనా ఒకదాన్ని గురించి వర్ణించాలంటే ఆ వర్ణన ఆరోహణ క్రమంలో ఉండడం సహజం. కానీ ఈ కీర్తనలో అన్నమయ్య అవరోహణ క్రమంలో చేశారు.

మొదటి చరణంలో వేంకటాద్రి కొండను వర్ణించారు. దీన్ని అన్నమయ్య వేంకటాచలం అన్నారు. ఈ కొండ ఎత్తైంది అనడానికి 'అఖిలోన్నతము' అన్నారు. బ్రహ్మాదులు ఈ కొండను ప్రత్యేకంగా దర్శిస్తారు అని చెప్పేందుకు 'అపురూపము' అనే మాటను వాడారు. ఈ అపురూపం అనే మాటకు *శబ్దరత్నాకరంలో* 'అపూర్వము' అనే అర్థం ఇవ్వబడింది. అనగా ఏదైనా అరుదుగా లభించే వస్తువును గురించి చెప్పే సందర్భాన్ని ఈ నిఘంటువులో ప్రస్తావించారు. రెండో చరణంలో శేషాచలం దేవతలందరికి నివాసం అనేందుకు 'నిజమైన వాసం' అన్నారు. ఈ తిరుమల శిఖరాలన్ని విశిష్టమైనవి అనేందుకు 'బంగారుశిఖరాల బహుబ్రహ్మమయము' అన్నారు. ఈ శిఖరాలను సాక్షాత్తూ బ్రహ్మదేవుడే బంగారంతో తయారు చేశాడని వర్ణించారు.

మూడో చరణంలో తిరుమల కొండలు ఎవరు ఎలా భావిస్తే అలా భాసిల్లుతాయని చెప్పేందుకు 'భావింప సకల సంపదరూపమదివో పావనములకెల్ల పావనమయము' అన్నారు. ఈ సంపదలను ఇహలోకానికి సంబంధించినవిగా కాకుండా మోక్షానికి వెళ్ళేందుకు సరైన దారులుగా అన్నమయ్య పేర్కొన్నారు. ఈ తిరుమల కొండలు పవిత్రమైన వాటికే పవిత్రమైనవని భావించారు. వేంకటనగం అనేది కైవల్యానికి పథంగా అన్నమయ్య వర్ణించారు. ఇంకా ఈ కీర్తనలో దేవతల, మునుల నివాస స్థలాలను, తిరుమలలో ఆయా దేవతల స్థానాలను, తిరుమల క్షేత్ర వైభవాన్ని చెప్పారు. ఆ వేంకటేశ్వరుని నామం కంటే వేరే ధనమేమి అక్కరలేదని అలాంటి నామాన్ని స్మరించాలని సమాజానికి హితవు చెప్పారు. సకలసంపదలు ఇక్కడే ఉన్నాయి. మోక్షానికి మించిన సంపద మరి లేదని ఈ కీర్తనలో అన్నమయ్య చెప్పారు. ఈ కీర్తన తెలుగువారి నోళ్ళలో నానుడుబడ్డ కీర్తన. అన్నమయ్య చలనచిత్రం వల్ల ఈ కీర్తనతోబాటు మరికొన్ని సంకీర్తనలు ప్రాచుర్యాన్ని పొందాయి. ఈ కీర్తన పల్లవి నిజానికి 'అదివో అల్లదివో హరివాసము' అని ఉంది. కానీ సంగీతజ్ఞుల సౌలభ్యంకోసం ఆ తదనంతరం 'శ్రీ' అనే పదాంశం వచ్చి చేరింది. దానివల్ల ఈ కీర్తనకు అర్థపుష్టి కలిగింది.

## 2.4.3. యుద్ధ వర్ణనలు

అన్నమాచార్యులు తన సంకీర్తనల్లో హరి, నరసింహుడు, రాముడు, హనుమంతుడు తదితరులు యుద్ధ భూమిలో తమ శౌర్య ప్రతాపాలను చూపించిన విధానాన్ని అత్యద్భుతంగా వర్ణించారు. రాక్షసులతో, మానవులతో ఆయా సందర్భాలలో వారు చేసిన యుద్ధాన్ని అత్యంత మనోహరంగా వర్ణించారు. యుద్ధం అనగానే మనకు రామాయణ, భారత, భాగవతాది పురాణ గ్రంథాలలోని ఆయా సన్నివేశాలు కళ్ళముందు మెదులుతాయి. చెడుపై మంచి ఎలా విజయం సాధించిందో? అన్నమయ్య రచించిన సంకీర్తనలను చదివితే మనకు బోధపడుతుంది. ఈ వర్ణనలు ఆయా సందర్భాల్లో ఎవరు ఎలా యుద్ధంలో తమ శత్రువులను దునుమాడారు? అనే విషయాలను సుస్పష్టంగా తెలియజేస్తాయి. అలాంటి కీర్తనల్లోని వర్ణనలను కింద విశ్లేషిస్తున్నాను.

**నాటరాగం**

**పల్లవి:**

"ఇటుగరుడని నీవెక్కినను

పటపట దిక్కులు బగ్గన పగిలే

**చరణం:**

ఎగసిన గరుడను యేపున థాయని

జిగిదొలక చబుకు చేసినను

నిగమాంతంబులు నిగమ సంఘములు

గగనము జగములు గడగడ వడకే" (*సంపుటం1.92:63.*)

ఈ కీర్తనలో ఆ శ్రీహరి యుద్ధ సన్నద్ధుడై, గరుడవాహనంపైకి ఎక్కి వెళ్ళే సందర్భాన్ని అన్నమయ్య వర్ణించారు. 'హరి గరుడుడి మీద ఎక్కగానే దిక్కులన్ని పిక్కటిల్లాయి. గగనానికి ఎగిరిన గరుడుడిని 'థాయ్' అని శబ్దం చేసి, ఒక్క చరుపు చరవగానే నిగమాలు, నిగమసంఘాలు, ఆకాశం గడగడ వణికాయి. తొందరగా యుద్ధభూమికి చేరుకోవాలనే తాపత్రయంలో హరి కోపించి గరుడుణ్ణి వేగంగా తోలగానే అఖిలలోకాలు చలించాయి. రెట్టించిన ఉత్సాహంతో గరుడుడిని హరి అధిరోహించినప్పుడు ఆ మహిమకే రాక్షస సమితి గుండెలు ఝల్లుమన్నాయి. ఆ మహిమా ప్రభావానికి వారు సముద్రంలో మునిగిపోయారు.' అని అన్నమయ్య వర్ణించారు.

ఈ కీర్తనలో హరి యుద్ధానికి వస్తుంటే జరిగిన బీభత్సాన్ని అన్నమయ్య మన కళ్ళకు కట్టారు. సాధారణంగా యుద్ధానికి వెళ్ళడానికి ఉపక్రమించినప్పుడు వారు చేసే వింత ధ్వనులు ప్రత్యేకతను సంతరించుకుంటాయి. అప్పుడే వారిలోని శౌర్య ప్రతాపాలు బయట పడతాయి. ఈ కీర్తనలో గరుడుడిని ఎక్కి 'థాయ్' అని చరిచినట్లు అన్నమయ్య చెప్పారు. 'తొందరగా' అనే మాటకు బదులు 'బిరుసు' అనే మాటను వాడారు. అలాగే 'పల్లించిన', 'కెల్లున' మొదలైన మాటలను వాడడం ద్వారా ఈ వర్ణనలకు సహజత్వాన్ని చేకూర్చారు.

**సాలంగనాట రాగం**

**పల్లవి:**

"రాముడీతడు లోకాభిరాముడీతడు

కామించిన విభీషణు కాచినవాడీతడు

**చరణం:**

శ్రీదైవారినయట్టి సీతారాముడీతడు

కోదండ దీక్షాగురుడీతడు

మోదమున అబ్ధియమ్మ మొనకు తెచ్చెనీతడు

పాదుకొని సుగ్రీవు పగతీర్చెనీతడు" (*సంపుటం1.476:318.*)

ఈ కీర్తనలో అన్నమయ్య రాముని శౌర్య ప్రతాపాలను గురించి వర్ణించారు. లంకకు వెళ్ళే సందర్భంలో సముద్రుణ్ణి దారికి తెచ్చుకోవడానికి తన కోదండాన్ని సముద్రంపై ప్రయోగించబోగా సముద్రుడు భయపడి, శరణుజొచ్చాడు. కోదండం అనగానే రాముని బాణపరంపర గుర్తుకు వస్తుండడం సహజం. 'కోదండ ధారి' అనడానికి అన్నమయ్య 'కోదండ దీక్షాగురుడీతడు' అని ప్రస్తావించారు. అనగా రాక్షస సంహారాన్ని రాముడు ఒక దీక్షగా గ్రహించాడనే అర్థం వచ్చే విధంగా అన్నమయ్య ఈ వర్ణన చేశారు. వాలిని చంపాడు అని చెప్పడానికి 'పాదుకొని సుగ్రీవు పగతీర్చెనీతడు' అని చెప్పారు. ఇచ్చిన మాట, చేసిన దానం వెనక్కి తీసుకోని వీరుడు రాముడే అనే విధంగా అన్నమయ్య ఈ వర్ణన చేశారు.

రెండో చరణంలో రామరావణ యుద్ధాన్ని వర్ణిస్తూ 'ఘోర రావణునితలగుండు గండడీతడు వీరాధివీరుడైన విష్ణుడీతడు' అని వర్ణించారు. రావణునితో తలపడే 'గండరగండడు' అనే అర్థం వచ్చేట్లుగా అన్నమయ్య ఈ వర్ణన చేశారు. ఇక్కడ 'ఘోరరావణుడు' అని రావణుని శౌర్యం, రాముని ప్రతాపం వర్ణించబడ్డాయి. రాక్షసులందరిని పరిమారుస్తాడని చెప్పడానికి వీరాధివీరుడు అని ఒక్కమాటలో వర్ణించారు.

హనుమంతుడు తలచుకుంటే భూమ్యాకాశాలను ఏకం చేయగలడు అనే అర్థం వచ్చేట్లుగా "నేలమిన్ను ఒక్కటైన నీబంటు" (సంపుటం:47.) అని సంకీర్తనను చెప్పారు. ఎవరిమీదైనా కోపం వస్తే 'ఒక్కవేటుకు చంపుతా' అనే మాట వింటుంటాం. అలాగే "ఒక్కవేలనే అక్షుని తెగవేసెగా" అని హనుమంతుని వైభవాన్ని అన్నమయ్య ఇనుమడింపజేశారు.

రెండో చరణంలో రావణుని రొమ్ము పగలగుద్దాడని చెప్పేందుకు "వెట్టగా రావణు రొమ్ము విరుగ చేతనే గ్రుద్దే నిట్టతాడువంటివాడు నీబంటు" అని చెప్పారు. ఇక్కడ నిట్టతాడు అనే వర్ణనను చేశారు అన్నమాచార్యులు. పూర్వం కట్టుకున్న పూరిళ్ళకు నిట్టాడు అనే

గుంజను వాడేవారు. ఆ గుంజకు ఒక తాడు కట్టి, ఇల్లు మరింత గట్టిగా ఉండడంకోసం ఆ తాటిని ఇంటికి, గుంజకు ముడిపెట్టేవారు. గుంజను నిట్టాడు అనేవారు కాబట్టి దానికి కట్టిన తాడును నిట్టతాడు అన్నారు. ఆ పదాన్ని ప్రయోగించి హనుమంతుని వీర్య ప్రతాపాలను వర్ణించడంలో అన్నమయ్య విజయం సాధించారు.

**పాడి రాగం**

**పల్లవి:**

"చక్రమా హరిచక్రమా

వక్రమైన దనుజుల వక్కలించవో

**చరణం:**

చుట్టి చుట్టి పాతాళముజొచ్చి హిరణ్యాక్షుని

చుట్టలు చీరిన ఓ చక్రమా

పట్టిన శ్రీహరి చేతబాయక ఈ జగములు

ఒట్టుకొని కావగదవో ఓ చక్రమా" (*సంపుటం1.185. :123.*)

ఈ కీర్తనలో విష్ణుమూర్తి ఆయుధమైన సుదర్శనచక్ర ప్రతాపాన్ని వర్ణించారు. పల్లవిలోనే "వక్రమైన దనుజుల వక్కలించవో" అన్నారు. హిరణ్యకశపుని ఒకవిధంగా చంపితే, హిరణ్యాక్షుణ్ణి చంపడానికి ఇంకో పద్ధతి అనుసరించాల్సివచ్చింది. విష్ణు చక్రం బారినుండి తప్పించుకొనేందుకు హిరణ్యాక్షుడు పాతాళలోకంలో దాక్కున్నాడు. అయినా సుదర్శన చక్రం వాణ్ణి ఖండఖండాలుగా చీల్చింది.

'తిప్పించి' అనే మాటను పిల్లలు ఆడుకొనే సందర్భంలో వింటూ ఉంటాం. ఏ క్రీడాకారుణ్ణైనా ఓడించాలంటే వాడిని అలసిపోయేట్లుగా చేయడం కొన్ని క్రీడల్లో మనం గమనిస్తూనే ఉంటాం. అలాగే సుదర్శనం హిరణ్యాక్షుడితో ఆడుకుంది. ఈ లోకాలన్ని తిప్పి, అలసిపోయేలా చేసింది. ఆ తరువాత అతిదారుణంగా చీల్చి చంపింది. దాన్ని వర్ణించేందుకు "చుట్టలు చీరిన ఓ చక్రమా" అని ప్రయోగించారు అన్నమయ్య. ఈ సుదర్శనం శ్రీహరి చేతుల్లో నిత్యం ఉంటూ, ఈ జగాలన్నింటిని కాపాడుతుందని ఈ కీర్తనలో అన్నమయ్య వర్ణించారు. ఈ చక్రం రాక్షస కిరీటాల మణులన్నింటికంటే ప్రకాశవంతమైంది. వారి

గర్వాన్ని అణచి, ధర్మస్థాపనలో విష్ణువుకు సహాయకారిగా నిలిచిందని అన్నమయ్య వర్ణించారు.

## 2.4.4. దశావతార వర్ణన

అన్నమయ్య తన సంకీర్తనల్లో దశావతారాలను వర్ణించారు. ఈ దశావతారాలకు సంబంధించిన కీర్తనను కింద ఇస్తున్నాను.

**సామంత రాగం**

**పల్లవి:**

తానే కాకెవ్వరు మాకు దాతయు దైవము
తనలోనబెట్టుకొని మాకు లోనైనవాడు

**చరణం:**

చదివించి కూడువెట్టి జారకుండనిల్లుగట్టి
బెదురులేని బుద్ధి పిన్ననాడే చెప్పి
ఎదిరినడిగి ద్రవ్యమిదిగొమ్మనుచునిచ్చి
పదిలమై తమ్ముబాలించువాడు

**చరణం:**

మోహవియోగమ్ము మోహానురాగమ్ము
దేహవిభాగమ్ము దెలిపిన కలికి
ఐహికమున వేంకటాధీశుడై సర్వదేహరక్షకుడై దిరుగుచున్నాడు"

(*సంపుటం1.194:128.*)

ఈ కీర్తనలో దశావతారాలను గురించి ప్రస్తావించారు. బౌద్ధ మతస్థాపకుడైన గౌతమబుద్ధుడిని కూడా భగవంతుని అవతారాలలో ఒకడిగా అన్నమయ్య పరిగణించారు. రెండో చరణంలో "మోహవియోగమ్ము మోహానురాగమ్ము" అంటూ 'కోరికలను, మోహాన్ని జయించాలని బోధించాడు' అన్నారు. ఈ మాటలు బుద్ధావతారాన్ని ప్రతిబింబిస్తున్నాయి. బలరాముడు, కల్కి ఇలా పది అవతారాలను మాత్రమే కాకుండా పదకొండో అవతారంగా బుద్ధుణ్ణి అన్నమయ్య పేర్కొన్నారు. ఆచార్య ఎస్. గంగప్పగారు జయదేవుడు, అన్నమయ్యలు

చేసిన దశావతార వర్ణనలను గురించి విశ్లేషిస్తూ అన్నమయ్యకంటే జయదేవుడే అత్యంత మనోహరంగా దశావతార వర్ణనలు చేసినట్లుగా తెలిపారు.

## 2.5. అన్నమయ్య శైలి

శైలి అనగా రాసేవిధానం అని అర్థం. రీతులులాగా శైలిని పండితులెవ్వరు నిర్వచించే ప్రయత్నం చేయలేదు. అన్నమయ్య శైలి మృదుమధురంగా ఉంటుంది. ఆయన రచన చేసే విధానం చాలా కొత్తగా ఉంటుంది. అన్నమయ్య సంస్కృతాంధ్ర భాషల్లో పండితుడు కావడంవల్ల ఆ భాషల్లోని పదాడంబరతను, గాంభీర్యతలను బాగా వంటబట్టించుకున్నారు. ఎక్కడో మారుమూలల్లోని తెలుగుపదాలను వెలికి తీసి, కొన్ని సంస్కృత పదాలకు కొత్త పదబంధాలను సృష్టించి అన్నమయ్య ప్రదర్శించిన పదాడంబరత అంతా ఇంతా కాదు. అందుకే పండితులు ఆయనను తిక్కనతో పోల్చారు.

అన్నమయ్య ప్రజలకు అర్థమయ్యే భాషలో చాలా సంకీర్తనలను రచించారు. కొన్ని కీర్తనల్లోని పదాలు చూసినట్లైతే ఎక్కడా మనం కనుగొనలేం. కొన్ని కీర్తనలు సంస్కృత, తెలుగు పదాలతో అత్యంత కఠినంగా ఉంటాయి. కొన్ని సందర్భాలలో సంస్కృత భూయిష్ఠమైన పదబంధాలను యథేచ్ఛగా వాడుకున్నారు. తద్వారా ఆ సందర్భానికి, సన్నివేశానికి పుష్టి చేకూర్చారు. అందుకే అన్నమయ్య 'పదకవితా పితామహుడి'గా సాహిత్యలోకంలో గౌరవాదరాలను గడించారు. సాధారణంగా శైలి ఫలానా కవిలాగా ఉంది అనుకోవడమేగాని శైలిలో ఎన్ని రకాలున్నాయనే విషయాన్ని పండితులెవ్వరు విశ్లేషించలేదు. అయితే, అందరికీ అర్థమయ్యే భాషలో కీర్తనలను రచించడం అన్నమయ్య లక్ష్యంగా పెట్టుకున్నారు కాబట్టి నేటికీ ఆయన రచించిన కీర్తనలకు అమితమైన ప్రాచుర్యం లభిస్తుంది. అన్నమయ్య ప్రజలకు అర్థమవడానికి ఈ కింది కీర్తనల్లో అనుసరించిన విధానాన్ని చెప్పడానికి ప్రయత్నిస్తాను. అన్నమయ్య శైలిని అర్థం చేసుకొనేందుకు ఈ కీర్తనలు ఉపయోగపడతాయి.

**పాడి రాగం**

**పల్లవి:**

"బాలులతో వీథులలో బారాడువాడు

కోలలెత్తుకు ఉట్లుగొట్టీ జుండీ

**చరణం:**

నారికడపు వక్కలు నానిన సనగలు

చారపప్పుదేనెలు చక్కెరలును

పేరిన నేతులు నానబియ్యాలు నుట్లునవే

చేరి యశోదబిడ్డకు జెప్పేరు సుండీ

**చరణం:**

చక్కిలాలు నడుకులు పనిగెపప్పులును

చక్కిన మెత్తని తూటచెరుకులును

పెక్కువగానుట్లలో బిందెలనుంచినవవే

చక్కని యశోదబిడ్డకు జాటేరు సుండీ

**చరణం:**

నువ్వులు జితిబెల్లాలు నున్నని చిమ్మిలులు

నువ్వుపిడియును జిన్ని నురుగులును

ఎవ్వారు వేంకటపతికెరగించినారగించి

కివ్వకివ్వ నవ్వ వణకించీజుండీ" (*సంపుటం1.258:171.*)

ఈ కీర్తనలో కృష్ణుని బాల్య చేష్టలను గురించి చెప్పబడింది. అన్నమయ్య ప్రజలకు అర్థమయ్యే భాషలో తన సహజశైలిలో ఈ కీర్తనను రచించారు. కృష్ణునికి పెట్టే ప్రసాదాలను గురించి ప్రజలకు సొంతం అర్థం అయ్యేట్లుగా ఈ కీర్తనను రచించారు. వక్కలు, నానబెట్టిన శనగలు, తేనె పప్పు, చక్కెరలు, పేరబెట్టిన నేతులు, నానబెట్టిన బియ్యం, చక్కిలాలు, అటుకులు, పనిగెపప్పులు, మెత్తని తూటచెరుకులు, నువ్వులు, బెల్లం, నువ్వుపిండి, నురుగులు ఇవన్నీ ఆ వేంకటేశ్వరునికోసం ఎదురు చూస్తున్నాయని అన్నమయ్య చాలా తేలిక మాటలలో వివరించారు. ఇలాంటిదే ఇంకో కీర్తన కింద ఇస్తున్నాను.

**సామంత రాగం**

**పల్లవి:**

"మాయపుదనుజుల మదవైరి కపి

రాయడు వీడివో రాముని బంటు

**చరణం:**

పెట్టిన జగయు పెంపు మిగుల మొల

గట్టియు కాసియు గర్వమున

నిట్టనిలిచి పోనినచేత నడిమి

దిట్ట వీడివో దేవుని బంటు

**చరణం:**

నవ్వుచు లంకానగరపుదనుజుల

కొవ్వణచిన కపికుంజరుడు

మువ్వురు వేల్పుల మొదలిభూతియగు

రవ్వగు సీతారమణునిబంటు

**చరణం:**

పంకజు సంభవు పట్టముగట్టను

పుంకించిన తన ఒడయనిచే

పొంకపు కలశాపుర హనుమంతుడు

వేంకటరమణుని వేడుక బంటు" (*సంపుటం1.281:186.*)

ఈ సంకీర్తన కూడా తేలికైన భాషలోనే రచించబడింది. అయినప్పటికీ కొంచెం కఠినమైన పదాలతో హనుమంతుని శౌర్య ప్రతాపాలను అన్నమయ్య విశ్లేషించారు. ఈ కీర్తన రెండో చరణంలో 'కొవ్వణచిన' అనే మాటను సహజంగా గర్వం అణిగేట్లుగా, పొగరు అణిగేట్లుగా అనే అర్థాల్లో వాడుతున్నారు. అలాగే ఇంతకుముందు కీర్తనలో నవ్వడాన్ని గురించి ప్రస్తావిస్తూ 'కిలకిల' అనడానికి బదులు 'కివ్వకివ్వ' అన్నారు.

## శ్రీరాగం

**పల్లవి:**

"ఫాలనేత్రానల ప్రబలవిద్యుల్లతా

కేళీవిహార లక్ష్మీనారసింహా

**చరణం:**

ప్రళయమారుత ఘోర భస్త్రికాంపుత్కార

లలిత నిశ్వాస డోలారచనయా

కులశైల కుంభినీ కుముదహిత రవిగగన

చలనవిధి నిపుణ నిశ్చల నారసింహా” (*సంపుటం1.284:188.*)

ఈ కీర్తనలో ఫాలంలో ఉన్న నేత్రం అగ్నిజ్వాలగా ప్రకాశిస్తున్న లక్ష్మీనరసింహుని శౌర్యప్రతాపాలను విశ్లేషించారు. నరసింహుడు శత్రుసంహారిగా, భయంకరాకారిగా ఎలా కదులుతున్నాడో? ఎలాంటి భావాలు ఆయన ముఖకవళికల్లో ప్రస్ఫుటిస్తున్నాయో? ఎలాంటి శౌర్యప్రతాపాలతో భాసిల్లుతున్నాడో? ఎంత తీవ్రతను ప్రదర్శిస్తున్నాడో? అన్నమయ్య కన్నులకు కట్టినట్లు వివరించారు. ‘ఫాలనేత్రానలం’ అంటే శివుని మూడవ కంటినుండి వచ్చే అగ్ని. ఈ కీర్తనలో శివ కేశవులమధ్య అభేదాన్ని చెప్పారు. ఇలా నరసింహ స్వామి రూపాన్ని అత్యంత భయానకంగా అన్నమయ్య వర్ణించారు.

కానీ పై మూడు కీర్తనల్లో సందర్భాలు వేరు. మొదటిది పూజా సమయాల్లో విష్ణుమూర్తికి పెట్టే ప్రసాదాలను గురించి తెలియజేయగా, రెండో కీర్తన హనుమంతుని శౌర్యప్రతాపాలను వివరించింది. ఈపై కీర్తన మాత్రం నరసింహుని కోపోద్రేకాలను తెలియజేసింది. ఇలా సమయం, సందర్భం, సన్నివేశాలనుబట్టి అన్నమయ్య తన సంకీర్తనలకు మెరుగులు పెట్టారు. కాబట్టి సందర్భానుగుణంగా అన్నమయ్య శైలి మారుతుందనడానికి ఉదాహరణలుగా పై కీర్తనలను పేర్కొనడం జరిగింది.

## 2.6. ప్రబంధ శైలి – ప్రబంధ కవులకు మార్గదర్శకుడు

అన్నమయ్య చేసిన వర్ణనలు, ప్రస్తావించిన అంశాలు అన్ని కూడా ప్రబంధ కవుల వర్ణనలకు మార్గాన్ని సుగమం చేశాయి. కానీ ప్రబంధ కవులు ఎవ్వరు కూడా అన్నమయ్యను తమకు మార్గదర్శకుడిగా పేర్కొనలేదు. అల్లసాని పెద్దనాది మహాకవులు చేసిన అష్టాదశ వర్ణనలకు అన్నమయ్య సంకీర్తనలు మార్గదర్శకాలయ్యాయని ఈ కీర్తనలనుబట్టి మనం గ్రహించవచ్చు.

తెనాలి రామకృష్ణుడు ‘చిన్నన్న ద్విపదకెరగును’ అనే పద్యంలో తాళ్ళపాక కవులందరిని ప్రస్తావించారు. కానీ అన్నమయ్యను ప్రస్తావించలేదు. దానికి కారణం అంతకు ముందు అన్నమయ్యను గురించి ఇంకెవరైనా గొప్పగా చెప్పి ఉండవచ్చు. ఆ గ్రంథం

కాలగర్భంలో కలిసిపోయి ఉండవచ్చు. కానీ అన్నమయ్య చేసిన వర్ణనలు ప్రబంధాలకు మార్గాన్ని సుగమం చేశాయి.

ఇలా అన్నమయ్య ఎందరో కవులకు, రచయితలకు మార్గదర్శకులయ్యారు. అయితే, అన్నమయ్య తదనంతర కవులు ఆయనను వారి గ్రంథాల్లో స్మరించలేదు. వారి మెచ్చుకోలుకు అన్నమయ్య నోచుకోకపోవడం శోచనీయం. ఈ భూమిమీద మనుషులు దైవారాధన చేస్తున్నంత వరకూ అన్నమయ్య చేసిన సంకీర్తనలను గుర్తుంచుకుంటారు. ఇదే అన్నమయ్య కవితాశక్తికి ప్రబల నిదర్శనం.

★★★★★

# అధ్యాయం-3

# అన్నమయ్య సంకీర్తనల్లో సంభాషణలు

## 3.0. పరిచయం

తెలుగు సాహిత్యంలో అన్నమయ్య కీర్తనలు అత్యంత ప్రజాదరణను పొందాయి. ఆ కీర్తనలలోని భావం, భాష మనోహరంగా ఉంటూ, అర్థం రీత్యా అత్యంత గాంభీర్యాన్ని కలిగి ఉన్నాయి. ఈ సంకీర్తనల్లోని భాష, భావం అటు సాధారణ పాఠకులనుంచి పండితుల వరకూ అందరికీ ఆనందాన్ని కలిగిస్తాయి. అన్నమయ్య కీర్తనల స్వరూప స్వభావాలను ఆయన మనుమడైన చినతిరుమలయ్య ఇలా తెలియజేశారు.

"శ్రుతులై శాస్త్రములై పురాణకథలై సుజ్ఞానసారంబులై
యతిలోకాగమవీథులై వివిధ మంత్రార్థంబులై నీతులై
కృతులై వేంకటశైల వల్లభ రతిక్రీడా రహస్యంబులై
నుతులై తాళులపాక యన్నయార్య వచోనూత్న క్రియల్ చెన్నగున్"

(*సంకీర్తనా లక్షణసారము 12వ పద్యం.*)

పై పద్యంలో అన్నమాచార్య కీర్తనలను మంత్రాలుగా, శాస్త్రాలుగా, వేదాల జ్ఞానాన్ని బోధించేవిగా, పురాణ సారాన్ని కలిగి ఉన్నవిగా, యతులు సంచరించే పుణ్య స్థలాలుగా, వేద మంత్రాలకు అర్థం చెప్పేవిగా, ముఖ్యంగా ఆ వేంకటేశ్వరుని రతి క్రీడా రహస్యాలను వర్ణన చేసేవిగా చినతిరుమలయ్య అభివర్ణించారు.

## 3.1. సంభాషణ: అర్థ వివరణలు

'భాష్యతీతి భాష' అని సంస్కృత వైయాకరుణులు భాషను నిర్వచించారు. 'భాషణ' అనే పదానికి 'సం' అనే ఉపసర్గ చేరి సంభాషణ అయింది. క్రీస్తు పూర్వం 428 – 347 మధ్య కాలంలో ప్లేటో, అరిస్టాటిల్ వంటి పండితులు 'dialog' అనే మాటను సంభాషణ అనే అర్థంలో వాడారు. తదనంతర కవులు, నాటకకర్తలు తమ రచనల్లో ఒకరితో ఇంకొకరు జరిపే భాషణను సంభాషణగా స్వీకరించారు.

బహుజనపల్లి సీతారామాచార్యులు శబ్దరత్నాకరంలో 'సంభాషణము' అనే పదానికి "చక్కగా మాట్లాడడం" (*సీతారామాచార్యులు, బహుజనపల్లి.1912:151.*) అని అర్థం చెప్పారు. జి. ఎన్. రెడ్డిగారు తన పర్యాయ పద నిఘంటువులో ఉపసంభాషణము, గోష్ఠి, చాటుకము, జల్పము, పరిభాషణము, పురుటము, సంఘావము, సంగీతి, సంజల్పము, సంప్రదవనము అనే పర్యాయపదాలను ఇచ్చారు. బ్రౌణ్య నిఘంటువులో సి. పి. బ్రౌన్ converse అనే పదానికి సంభాషము, సంభాషణము, సమలాపము, సల్లాపనము, సల్లాపము అనే అర్థాలను పేర్కొన్నారు. శంకరనారాయణగారు తన ఆంగ్ల తెలుగు నిఘంటువులో converse అనే పదానికి discourse, talk, conference అనే అర్థాలను ఇచ్చారు.

కొందరు కవులు, వాగ్గేయకారులు, ఈ అర్థాన్ని మరింత విస్తృతం చేశారు. 'సంభాషణ' అనే మాటకు సరస సల్లాపాలు, అంతరంగంలో తనకు తానుగా మాట్లాడుకోవడం, ప్రార్థించడం, దేవునికి తన గోడు వినిపించడం, తిట్టడం, పొగడడం, మెచ్చుకోవడం, మొఱ్ఱ పెట్టడం లాంటి అర్థాలనిచ్చారు. భగవంతుడిని భక్తుడు తన మనసులో ఆవిష్కరింపజేసుకొని విచారం, సంతోషం, దుఃఖం మొదలైన భావాలను వ్యక్తపరుస్తాడు లేదా నివేదిస్తాడు. గుడిలో దేవునికి దండం పెడుతూ తమ కోరికలను నివేదించుకోడం, చర్చిలలో ప్రార్థనలు, మసీదుల్లో చేసే నమాజులు. ఇలా అనేక మతాల్లో ఉన్న ఆరాధనలన్నీ సంభాషణలే. కొన్ని సంభాషణలు పరస్పరం సాగేవి. మరికొన్ని ఊహాత్మకాలు. మరికొన్ని బహిరంగాలు. ఇంకొన్ని ఆంతరంగికాలు లేదా ఆంతరికాలు.

భక్తుడు దేవునితో ఆత్మగతంగా సంభాషిస్తాడు. భగవంతుడు నేరుగా తన భక్తులతో సంభాషించిన సందర్భాలను పురాణేతిహాసాదిగ్రంథాల్లో మనం గమనించగలం. ఈ సంభాషణలను ఆలంబనగా చేసుకొని కవులు వివిధ భాషల్లో అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించారు. అన్నమయ్య నేరుగా దేవునితో సంభాషించారా? దేవుడు ఆయనకు నిజంగానే ప్రత్యక్ష్యమయ్యాడా? అన్న కొందరి వాదాలకు, వారి ప్రశ్నలకు సమాధానం చెప్పడం చాలా కష్టం. అలాంటి వారికి పరిష్కారం కూడా దొరకదు. ఒకవేళ ఎవరైనా చెప్పినా నమ్మడానికి వీల్లేదు. ఇక్కడ అన్నమయ్య ద్యోతకమయ్యే తన సంకీర్తనల్లో దేవునితో మాట్లాడడాన్ని

మాత్రమే పరిగణించాలి. ఆయన సాహిత్యంలోని సంభాషణలను మాత్రమే ఈ అధ్యాయంలో తీసుకోడం జరిగింది. 'ఆడిన మాటెల్ల అమృతకావ్యంగా, పాడిన పాటెల్ల పరమగానంగా సాగింద' ని అన్నమయ్యను గురించి చిన్నన్న కారణాల్లో ఇది కూడా ఒకటి. ఈ సంభాషణలకు సాహిత్యంలో గౌరవప్రదమైన స్థానం లభించింది. అన్నమయ్య ఎవరితో సంభాషించారు? ఎలా సంభాషించారు? ఎందుకు సంభాషించారు? ఎప్పుడు సంభాషించారు? ఎవరి గురించి సంభాషించారు? మొదలైన ప్రశ్నలన్నిటికీ సమాధానాలు దొరుకుతాయి. సంకీర్తనలను జాగ్రత్తగా పరిశీలిస్తే, అన్నమయ్య స్వామితో, సమాజంతో, చెట్టుతో, పుట్టతో, లోకంలోని ప్రాణులతో. అందరితోనూ సంభాషించారు. ఆ కోణంలో చూస్తే ప్రపంచ భాషల్లోని సాహిత్యమంతా సంభాషణమయమే! ఉదా- ఒక రచయిత చెట్టును గురించి రాస్తూ 'ఈ చెట్టు పూలతో, పళ్ళతో, ఆకులతో కళకళలాడుతోంది' అని ఒక పెద్ద వ్యాసం రాశాడనుకుందాం. ఆ వ్యాసాన్ని చదివే వ్యక్తితో అతడు సంభాషిస్తున్నట్లే కదా! అలాగే అన్నమయ్య సాహిత్యాన్ని చదివే వాళ్ళతో, పాడేవాళ్ళతో, ఆ సంకీర్తనలను వినే వాళ్ళతో ఆయన సంభాషిస్తోన్నట్లే. ఆ సంకీర్తనల్లో భగవంతుడే ఆలంబన కావడంవల్ల ఆయన కూడా భగవంతునితో సంభాషిస్తున్నట్లే మనం స్వీకరించాలి. కనుక సాహిత్యమంటేనే సంభాషణామయం అని గ్రహించాలి. అన్నమయ్య సంకీర్తనలు మూడు, అంతకన్నా పెక్కు చరణాలను కలిగి ఉన్నాయి. సాధారణంగా ఎక్కువ శాతం కీర్తనలు మూడు చరణాలను కలిగి ఉన్నాయి. ఒక్కొక్క కీర్తన 10 గ్రంథాల శక్తిని, విస్తృతిని కలిగి ఉందని "ఒక కీర్తన పది గ్రంథములయినపుడు ముప్పదివేల కీర్తన లెన్ని గ్రంథములగునో యోచింపుడ"ని (*రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు:158.*) రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సంకీర్తనల్లో మొదటి చరణంలో ఉపదేశం, రెండవ చరణంలో దైన్యం, మూడవ చరణంలో అభయం ముఖ్యమైన అంశాలు. అన్నమయ్య సంకీర్తనలు వేంకటేశ ముద్రితాలు. అతికొద్ది కీర్తనలు నిర్ముద్రగా రచించబడ్డాయి. ఇలాంటి సంకీర్తనల్లో సంభాషణలను గురించి అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఈ సంభాషణలను కింది విధంగా వింగడించవచ్చు.

స్వామితో సంభాషణ, అంతస్సంభాషణ, పూజా సంబంధిత సంభాషణలు, బహిస్సంభాషణలు, యశోద, గోపికలు, ఇతరుల సంభాషణలు, జీవాత్మ పరమాత్మ

సంబంధం, నిజమైన వైష్ణవుడు, సంసారసంబంధ సంభాషణలుగా విభజించవచ్చు. ఆ సంభాషణలను కింద పరిశీలిద్దాం.

## 3.2. స్వామితో సంభాషణలు

ఈ సంభాషణలను మళ్ళీ 1. అంతర్యామి తత్త్వం (అన్ని నీవే.), 2. పశ్చాత్తాపం, 3. నిందాత్మకం (స్వయంనింద, దైవనింద.) 4. సేవ, 5. ప్రతాపం, 6. అవతారాలుగా వింగడించవచ్చు.

### 3.2.1. అంతర్యామి

ఈ కీర్తనల్లో అన్నమయ్య లోకంలోని అన్ని జీవుల్లో కొలువైన స్వామిని ఆరాధించారు. ఈ ఆరాధన స్వామితో ప్రత్యక్ష్యంగా నెరపడం మనం గమనించాలి. ఈ సృష్టిలో అత్యంత సులభమైంది, విలువైనది ఏదైనా ఉందంటే అది దేవునికి ప్రార్థన చేయడం లేక పూజచేయడం. ఈ కీర్తనల్లో ప్రార్థన ముఖ్యమైన విషయం.

**భౌళి రాగం**

**పల్లవి**

"ఎవ్వరిగాదన్ననిది నిన్నుగాదంట
ఎవ్వరిగొలిచిన నిది నీ కొలువు

**చరణం:**

అవయవములలో నదిగాదిదిగా
దవిమేలివి మేలననేల
భువియు బాతాళము దివియునందలి
జంతు నివహమింతయును నీ దేహమే కాన." (*సంపుటం1.9:6.*)

'ఏ దేవుని ఆరాధించినా అది నీకే చెల్లుతుంది. శరీరావయవాలలో ఒకటి మేలైనదిగా, మరొకటి తక్కువగా ఎంచి చూడడం సాధ్యం కాదు. భూమిలో, పాతాళాది లోకాలలోని సర్వ ప్రాణకోటిలో, సర్వావయవాలలో నీవే ఉన్నావు. మేము ఎలా భావిస్తే అలా దర్శనమిస్తావు. కాబట్టి ప్రాణుల పట్ల భేదభావం చూపరా'దని అన్నమయ్య స్వామితో సంభాషించారు. ఈ కీర్తనలో సర్వాంతర్యామి మనకు గోచరమవుతాడు. ఆయనే ఈ సృష్టిలో ఉన్నవాడు, సృష్టికి ఆధారమైనవాడు. కనుక అన్ని ప్రాణుల్లో కొలువైన స్వామిని అన్నమయ్య మనకు దర్శింపజేశారు.

## సామంతం

**పల్లవి**

"ఏది చూచినా నీవే ఇన్నియును మరి నీవే
వేదవిరహితులకు వెరతుమటుగాన

**చరణం:**

ఇరువుకొని రూపమ్ములిన్నిటానుగలనిన్ను
బరికింపవలెగాని భజియించరాదు
గరిమచెడి సత్సమాగంబు విడచిన నీ
స్మరణ విజ్ఞాన వాసనగాదుగాన." (*సంపుటం1.60:40.*)

ఈ కీర్తనలోని పల్లవి 'ఏది చూచినా నీవే' అని మొదలవుతుంది. అందులో కొంత వ్యంగ్యం కూడా ధ్వనిస్తోంది. 'వేదవిరహితులకు వెరతుమటుగాన' 'వేదాలను వ్యతిరేకించేవారికి భయపడాలి మరి!' అనే వ్యంగ్య ధోరణిని అన్నమయ్య కనబరిచారు. 'ఇన్ని రూపాల్లో ఒదిగి ఉన్న నిన్ను పరిశీలించి చూడనవసరం లేదు. నీ సహవాసం విడిచినవారు ఆ పనిలో నిమగ్నులయ్యారు. మాకు నీ భజనే పరమామృత'మని అన్నమయ్య తెలిపారు. 'సూర్య కిరణాలు ప్రపంచమంతా వ్యాపించి ఉన్నట్లుగా దేవతలందరిలో నీవే కొలువై ఉన్నావు. నీ ఉనికిని తెలుసుకొని సేవించా'లని అన్నమయ్య చెప్పారు. ఈ కీర్తనలో బాహ్యంగా వ్యతిరేకార్థం కనిపిస్తున్నట్లు ఉంటుంది కానీ మనుషులు తెలుసుకోవాల్సిన తత్త్వమంతా అన్నమయ్య పోతపోశారు. భగవంతుని తెలుసుకోవడాన్ని మించిన పని ఈ లోకంలో లేదని అన్నమయ్య రూఢిగా నమ్మి, ఆచరించారు.

## నాదరామక్రియ

**పల్లవి**

"ఈ సురలీ మునులీ చరాచరములు
ఈ సకలమంతయునిది ఎవ్వరు?

**చరణం:**

ఎన్నికనామములిటు నీవైయుండగా
ఇన్ని నామములవారిది ఎవ్వరు?
ఉన్నచోటనే నీవు ఉండుచుండగా మరి

ఇన్నిటానిది దిరుగువారెవ్వరు?" (*సంపుటం1.93:64.*)

ఈ కీర్తనలో భగవంతుడు అన్ని రూపాల్లో కొలువై ఉన్నాడనే భావం గోచరమవుతుంది. 'ఒకరూపై నీవు ఉండుచుండగ మరి తక్కినరూపములు తామెవ్వరు?' అని అన్నమయ్య పరమాత్మలోని అంతరార్థాన్ని, సృష్టిలోని ఏకాత్మవాదాన్ని సునిశితంగా వెల్లడించారు. ఎదుటివారిలో పరమాత్మను చూడగలిగిన వాడే నిజమైన మానవుడు అనేది ఈ కీర్తనలోని సారాంశం. ఈ కీర్తనలో అన్నమయ్య 'ఈ ప్రపంచంలో నీవు తప్ప ఇంకొకటి లేద'ని స్వామిని విశ్వాంతరాత్మగా పేర్కొన్నారు.

విశ్వాంతరాత్మను దర్శించిన అన్నమయ్య ఈ కింది కీర్తనలో మాత్రం 'నాకు అన్నీ నీవే' అంటూ ఆ స్వామిపై మనుషులు ఎలా ఆధారపడాలో నేర్పించారు.

**గుజ్జరి రాగం**

**పల్లవి**

"నాపాలి ఘననిధానమవు నీవే నన్ను
నీపాలనిడుకొంటి నీవే నీవే

**చరణం:**

ఒలిసి నన్నేలే దేవుడవు నీవే
ఎందుదొలగని నిజబంధుడవు నీవే
పలుసుఖమిచ్చే సంపదవు నీవే ఇట్టే
వెలయనిన్నియును నీవే నీవే." (*సంపుటం1.108:74.*)

ఈ కీర్తనలో అన్నమయ్య స్వామిని తనకు ఇంకా దగ్గరగా భావించారు. స్వామిని రాజుగా, బంధువుగా, సంపదగా, స్నేహితుడిగా, దేహంగా, మనస్సుగా తనలోని అన్ని కార్యాలకు మూలమైనవాడిగా భావించారు. అలా స్వామికి తనను తాను సంపూర్ణంగా సమర్పించుకున్నారు. అంతేకాకుండా ఈ కీర్తనలో అన్నమయ్య స్వామిని తనకు మాత్రమే సొంతమైనవాడిగా భావించారు.

"ఒప్పులై నొప్పులై ఉండుగాన" అనే సంకీర్తనలో కళ్ళతో చూసినవన్నీ నిజాలు కావు. కొన్ని తారుమారుగా కనబడవచ్చు. కాబట్టి "తేనై తీపై తిరువేంకటేశ నిన్ను కానవచ్చినది ఒక్కటేకా నిజము" (*సంపుటం1.149:102.*) అంటారు. అంటే మన దృష్టి స్వామిపై

నిలపాలని అన్నమయ్య భావించారు. అదే ఆయన జీవితాంతం ఆచరించి చూపారు. “నీవనగ నొకచోట నిలిచియుండుటలేదు” అనే కీర్తనలో ‘నీవు ఒక ప్రదేశంలోగానీ, ఒక నివాసంలోగానీ ఉండేవాడివి కావు. ఈ లోకంలో సకల ప్రదేశాల్లోను నీవే దర్శనమిస్తావు. తనలాగా ఇతరుల ఆత్మల్ని భావించేవారు, సకల జీవుల్లో అంతర్యామిని దర్శించేవారు నీకు ప్రియమైనవారు. తన తల్లిలా ఇతర స్త్రీలను భావించేవారు నీ సమానులే. సత్యాన్ని వ్రతంగా ఆచరించేవారు నీ స్వరూపులు. సుఖాలు, దుఃఖాలు ఒకేలా చూసేవారు నీకు ఇష్టమైనవారు.’ అంటూ అన్నమయ్య తన సంభాషణను సాగించారు. ఈ సంకీర్తనలో నీవే ఆది, అంతం “వేదోక్తమతియైన వేంకటాచలనాథ ఆదియును నంత్యంబు నంతయును నీవే.” (*సంపుటం1.232:154.*) అని సృష్టి స్థితి, లయకారకుడవు నీవేనని అంటూ స్వామి పరమాత్మ స్వరూపాన్ని, అంతర్యామి తత్త్వాన్ని తెలియజేశారు.

“ఇతరులకు నినునెరుగదరమా?” (*సంపుటం1.252:169.*) అంటూ సత్యవ్రతులు, మోహాన్ని జయించినవారు, స్త్రీల మోహాన్ని, సంసారాన్ని జయించినవారు, శూరులు, ధీరులు, భోగులు, మహాయోగులు, పరిపూర్ణమైన సుబుద్ధులు మాత్రమే నిన్ను ఎరుగగలరు కానీ సామాన్యులకు, అల్పులకు నీ ఎరుక గోచరం కాదని అన్నమయ్య స్వామి మనస్సును ఆవిష్కరించారు.

“అన్నిచోట్ల బరమాత్మ నీవు ఇన్నిరూపుల భ్రమయింతువుగా” అనే సంకీర్తనలో “పాలజలనిధినుండి బదరీవనాననుండి ఆలయమై గయలో బ్రయాగనుండి” (*సంపుటం1.278:186.*) అంటూ శివకేశవుల మధ్య అభేదాన్ని తెలియజేశారు. అలాగే బదరీ, గయ, ప్రయాగ, మధుర, అయోధ్య, పంచవటి సింహాద్రి, శ్రీరంగం మొదలైన అనేక పుణ్యక్షేత్రాలు ఈ కీర్తనలో పేర్కొనబడ్డాయి. ఆయా క్షేత్రాలనుండి వేలకొలది రూపాల్లో కొలువై ఆదరిస్తోన్న స్వామిని అన్నమయ్య దర్శించి, తరించారు. “మిక్కిలి పుణ్యులు హరి నీ దాసులే” అనే సంకీర్తనలో అన్ని రూపాల్లో స్వామి కొలువై ఉన్నాడని తెలియజేశారు.

**శుద్ధవసంతం**

**పల్లవి**

“ఇంతటి దైవమవు మాకు నిటునీవు గలుగగ
ఎంతవారమో భాగ్యమేమిచెప్పేదికను

**చరణం:**

ఎగువనొక దుర్గము మెక్కుక ఏలేవాడు

పగవారి గైకొనక బలువయ్యాని

అగపడి శ్రీవేంకటాద్రి మీద నున్న నిన్ను

దగనమ్మినట్టివాడ ధన్యుడ నేను.” (*సంపుటం1.504:338.*)

‘ధనవంతులు డబ్బు మదంతో విర్రవీగుతారు. రాజాశ్రయులు ఆ రాజునుబట్టి గర్వపడతారు. మంత్రోచ్చారకులైన గురువులు తామే సన్యాసులమని, ఇతరులను తక్కువగా భావిస్తారు. దుర్గాలను ఏలే రాజులు అధికార దర్పంతో అతిశయిస్తారు. అలాంటిది లోకాలను ఏలే నీవు నాకు సుముఖుడివి అయినందుకు నేను ఇంకెంత గర్వపడాలి?’ అంటూ నీవు అనుగ్రహించిన భాగ్యాన్ని వర్ణించడం నా తరంకాదని అన్నమయ్య వర్ణించారు. ఇలా ఈ కీర్తనల్లో అనేక రూపాల్లో ఉన్న స్వామిని అనేకవిధాలుగా ఆరాధించారు.

ఈ విధంగా ఈ కీర్తనల్లో అన్నమయ్య అంతర్యామి తత్త్వాన్ని మనకు చూపించారు. అంతా తానే, అన్నింటా తానేనని స్వామి ఉనికిని తెలియజేశారు. అలాంటి స్వామితో అన్నమయ్య సంభాషించారు. స్వామిని శరణు వేడుకొని, ఆశ్రయించాలని కీర్తనల్లో మనుషులకు ఉద్బోధ చేశారు.

## 3.2.2. పశ్చాత్తాపం

ఈ కీర్తనల్లో తనను తాను తగ్గించుకొని, స్వామికి సమర్పించుకోవడాన్ని చూడగలం. ‘నావల్ల జరిగిన పొరపాట్లకు నన్ను దయతో క్షమించ’మని స్వామిని వేడుకోవడం ఈ సంభాషణల్లో కనిపిస్తుంది. భక్తులు ఈ లోకంలో దేన్నైనా భరిస్తారు గానీ దేవుని నుండి ఎడబాటును మాత్రం అస్సలు భరించలేరు. అలాగే అన్నమయ్య కూడా స్వామిని తన సొంతం చేసుకున్నారు. తన ప్రాణనాథుడిగా భావించారు. అదే తన హక్కు అనుకున్నారు. అయినవారి మధ్య పొరపొచ్చాలు లేనట్టే స్వామితో పొరపొచ్చాలు లేకుండా చూసుకోవాలని ఈ సంభాషణల్లో తెలియజేశారు. అందుకే తనను తాను అధముడిగా, అల్పుడిగా ఎంచుకొని, ఈ లోకంలోని పాపాలన్నీ తనకు ఆపాదించుకొని, పరమాత్మ సాన్నిధ్యాన్ని పొందేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఆ వేదనలను కింది కీర్తనల్లో మనం చూడవచ్చు.

### వరాళి రాగం

**పల్లవి**

“ఎవ్వారు లేరు హితవు చెప్పగ వట్టి
నవ్వులబడినేము నొగిలేమయ్యా

**చరణం:**

అడవిబడినవాడు వెడలజోటులేక
తొడరి కంపలకింద దూరినట్లు
నడుమ దురిత కాననముల తరిబడి
వెడలలైక నేము విసిగేమయ్యా.” (*సంపుటం1.15:10.*)

ఈ కీర్తనలో అన్నమయ్య మంచేదో చెడు ఏదో చెప్పేవారు లేకపోతే జరిగే నష్టాలను, కలిగే దుష్పరిణామాలను స్వామితో వివరించారు. ఈ సంభాషణలో ‘నిన్ను చేరుకోవడానికి హితం చెప్పేందుకు నాకు ఎవ్వరూ లేరు. అందుకే ఈ లంపటాల్లో పడిపోతున్నా’మని తన బాధను, పశ్చాత్తాపాన్ని వెలిబుచ్చారు. అందుకు తనను తాను తగ్గించుకుంటూ అడవిలో దారి తప్పి ముళ్ళకంపలో చిక్కుకున్న మనిషితో, మాధుర్యాన్ని రుచి చూడబోయి చేదు తిన్న అజ్ఞానితో, తనవాళ్ళను విడిచి ఇతరులవెంట తిరిగే వెర్రివాడితో పోల్చుకున్నారు.

### శ్రీరాగం

**పల్లవి**

“నీవేకానింక నేనన్యమెరుగ
ఏ త్రోవజూపి నాకు దోడయ్యేదవయ్యా!

**చరణం:**

అపరాధత కోట్లైనవి ఒక్క
నెపమున ననుగావనేరవా
అపరిమిత దురితాలైనవి
ఏ ఉపమచేత నన్నునుద్ధరించెదవయ్యా!” (*సంపుటం1.17:11.*)

ఈ సంభాషణలో అన్నమయ్య పశ్చాత్తాపం తారాస్థాయికి చేరింది. దిక్కు నీవేనని ఆ దేవునితో తన గోడు చెప్పుకున్నారు. ‘కోట్లకొలది అపరాధాలు, అపరిమితంగా పాపాలు

చేసిన నన్ను ఏ కారణంతోనైనా కావ'మని అన్నమయ్య వేడుకున్నారు. గర్విష్ఠిగా, పాపిష్ఠిగా అన్నమయ్య తనను తాను సంబోధించుకుంటూ, 'నువ్వు కాకపోతే ఇంక నన్ను ఎవ్వరూ రక్షించలే'రని ఆ స్వామిని వేడుకున్నారు.

**గౌళరాగం**

**పల్లవి**

"ఎన్నిలేవు నాకిటువంటివి!

కన్నులెదుట నిన్ను గనుగొనలేనైతి.

**చరణం:**

అరయ నేజేసిన యపరాధములుజూచి

కరుణించి ఒకడైనా గాచునా?

కరచరణాదులు కలిగించిన నిన్ను

పరికించి నీ సేవాపరుడ గాలేనైతి." (*సంపుటం1.31:20.*)

ఈ కీర్తనలో అన్ని విధాలుగా మేలుచేసిన స్వామి కళ్ళముందే ఉంటే గుర్తించలేకపోయానని అన్నమయ్య బాధపడ్డారు. 'నీవు ఇచ్చిన కాళ్ళు చేతులతో అనేక అపరాధాలు చేశాను. మోక్షంకోసం కాకుండా ఇంకేదో కావాలని తిరిగాను. అలాంటి నన్ను కేవలం నువ్వు మాత్రమే కావగలవాడివి' అని స్వామికి తన స్థితిని విన్నవించుకున్నారు.

**వరాళి**

**పల్లవి**

"పరమపాతకుడ భవబంధుడ శ్రీ

హరి నిను దలచ నేనర్హుడనా?

**చరణం:**

అపవిత్రుడ నేనమంగళుడ గడు

నపగత పుణ్యుడ నలుసుడను

కపట కలుష పరికర హృదయుడ నే

నపవర్గమునకు నర్హుడనా?" (*సంపుటం1.33:21.*)

ఈ కీర్తనలో అన్నమయ్య తనను తాను అనేకవిధాలుగా నిందించుకున్నారు. ఈ లోకంలో ఎన్ని విధాలైన పాతకాలున్నాయో? అన్నింటినీ తనకు ఆపాదించుకున్నారు.

అలాంటి తనను కావమని, ఘనులకు మాత్రమే సాధ్యపడే మోక్షాన్ని తనకూ ఇవ్వమని ఆ స్వామిని పశ్చాత్తాపంతో వేడుకోవడం ఈ సంభాషణలో మనం గమనించగలం.

**ఆహిరి రాగం**

**పల్లవి**

"అతిదుష్టుడ నేనలఘుడను

ఇతరవివేకంబికనేది

**చరణం:**

ఎక్కడనెన్నిట ఏమిసేసితినో

నిక్కపుదప్పులు నేరములు

గక్కన నన్నిట కలిగిన నీవే

దిక్కుగాక మరి దిక్కేది?" (*సంపుటం1.78:54.*)

'ఎక్కడ ఏంపాపాలు చేశానో! మంచిగుణాలు నాకు లేవు. తెలిసీ తెలియక చేసిన పాపాలను క్షమించి, ఆదరించి నీ వివేకాన్ని నాకు దయచేయ'మని ఆ స్వామితో తన పశ్చాత్తాపాన్ని వెలిబుచ్చారు.

"తోలుబాపపుణ్యాలతోడ బుట్టితినట" అనే సంకీర్తనలో అన్నమయ్య 'ఈ లోక కర్మబంధాలను నీ శక్తితో గెలువలేనా!' అంటూ తనలోని ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేశారు. స్వామి దయ ఉంటే పాముపుట్టలో చెయ్యి పెట్టి, సురక్షితంగా బయటపడగలనని స్వామిపై తన నమ్మకాన్ని మరింత దృఢపరచుకున్నారు. ఇక్కడ 'పాముపుట్ట' అంటే లోక బంధాలు, మోహావేశాలని అన్నమయ్య అర్థం చెప్పారు. "తగువేంకటేశ నీ దయవాడినట ఈ వగలనిలనన్నిట గెలువగలేనా." (సంపుటం1.170:114.) అంటూ ఈ తుచ్ఛమైన కోరికలను నీ దయతో సంపూర్ణంగా జయిస్తానని అన్నమయ్య స్వామిపై ఉన్న అచంచలమైన విశ్వాసాన్ని ప్రకటించారు.

ఈ కింది కీర్తనలో అన్నమయ్య తనను తాను స్వామికి ప్రత్యక్ష్యపరచుకున్నారు.

**లలిత రాగం**

**పల్లవి**

"ఆశాబద్ధుడనై అలసి నిన్ను గడు

గాసిబెట్టినవాడాగాను

**చరణం:**

ఘనకర్మపరుడనై కర్మరూపునిజేయ

నినుదూరి భారము నీకుబెట్టినవాడాగాను

పనిలేని దుఃఖలంపటుడనై

దుఃఖముగనిపించకుమని కడువేడినవాడాగాను

**చరణం:**

శ్రీవేంకటగిరి దేవేశ

నాకిదిగావలెననువాడాగాను

కావలసినయవి గరిసినవి

గదిసిన నవినాకు గావమను మనుజుండగాను." (*సంపుటం1.175:118.*)

సాధారణంగా భగవంతుని అవి కావాలి. ఇవి కావాలి. అని కోరుకోటం కద్దు. ఎందుకంటే మనిషికి ఎన్ని ఉన్నా ఇంకా ఏవో కావాలన్న ఆశ మిగిలే ఉంటుంది. కానీ అన్నమయ్య లాంటి భక్తులు మోక్షాన్ని అపేక్షించి భగవత్ చింతనాపరులయ్యారు. అంతేగాని ఐహిక సుఖాలకోసం దేవుణ్ణి ఆశ్రయించలేదు. అలాంటివారి కోర్కెలు తక్షణం స్వామి తీరుస్తాడని వారి నమ్మకం. అందుకే అన్నమయ్య 'నాకు మోక్షాన్ని ఇవ్వు చాలు' అని స్వామికి మొఱ్ఱపెట్టుకున్నారు. ఆ స్వామితో నాకివి కావాలి, అవి కావాలి అని తనకు సంబంధించిన కోరికలు తీర్చమని విన్నవించుకోలేదు.

### శ్రీరాగం

**పల్లవి**

"కోరిక దీరుట ఎన్నడు గుణమును నవగుణమునుజెడి

ఊరక ఈమది నీపైనుండుట ఎన్నడొకో

**చరణం:**

చిత్తంబాకలిదీరదు చింత దలంపునబాయదు

ఎత్తిన పరితాపమునకు నేదీ మితిమేర

హత్తినపుణ్యముబాపము లప్పటి సుఖములకొరకే

వత్తికి నూనెకుగొలదై వడిగొనె దివసములు" (*సంపుటం1.176:118.*)

ఈ కీర్తనలో అన్నమయ్య తనకు ఎదురైన దైవికమైన ఇబ్బందులను స్వామితో చెప్పుకున్నారు. 'నా బుద్ధి చక్కపడి, నీపై మనస్సు ఎప్పుడు ఉంచుతానో!' అంటూ వాపోయారు. 'మనస్సుకు కోరికలనే ఆకలి తీరదు. ఆలోచనలకు అంతూపొంతూ లేదు. చావు, పుట్టుకలు సహజం. నిన్ను స్మరించాల్సిన కాలమంతా దినవారాలతరబడి వత్తిలో వేసిన నూనెలా తరిగిపోతోం'దని అన్నమయ్య ఆవేదన చెందారు. ఇలా బాధపడ్డ అన్నమయ్య "గడ్డపార మింగితే ఆకలి దీరీనా ఈ ఒడ్డిన భవముదన్ను ఒడకమ్ముగాక" (*సంపుటం1.177:119.*) అంటూ తనకుతానుగా సమాధానపడ్డారు. ఈ కీర్తనలో ఇంద్రియాలపైన మోహాన్ని పామును తలకింద పెట్టుకోవడంతో అన్నమయ్య పోల్చారు. "చెల్లుగాకిటు నీకే చింతింపగా" అనే కీర్తనలో "పొదలిన ఇంద్రియంబులు వెంటరాగా మదవికారమునే మరుగగానే వదలక వేంకటేశ్వర నన్నునిదే నీ పదపంకజముల చేర్పగనిదె వశమా" (*సంపుటం1.182:122.*) అంటూ వీటన్నింటినుండి నీవే రక్షించాలని ఆ స్వామిని వేడుకున్నారు. "ఏమీనెరగని నాకేడ పుణ్యము" అనే సంకీర్తనలో "చేతనము బోధచేయు చిత్తము నీదేకాన రాతిబొమ్మజుమ్మీ భారము నీదే దైవమా" (*సంపుటం1.286:191.*) 'నేను రాతిబొమ్మని, తేనె పూసిన మానెబొమ్మని, జంతువునైన నాకు నీవే పాలు పోసి పెంచా'వని అంటూ తనను తాను స్వామికి సమర్పించుకున్నారు.

**ముఖారి రాగం**

**పల్లవి**

"చెప్పినంతపని నేజేయగలవాడనింతే
అప్పటినపరాధమా ఆదరించవలదా

**చరణం:**

నీయాజ్ఞ దేహము నే మోచితినింతే
ఇయ్యెడ విజ్ఞానమేల ఇయ్యవయ్యా
వెయ్యవేలై వేగుదాకా వెట్టిసేసినలసితి
ఓయయ్య కొంతైనా ఊరడించవలదా

**చరణం:**

నీవు సేసే కర్మము నేజేయువాడనింతే

ఈవలనానందసుఖమియ్యవయ్యా
కోవరమై వెంటవెంట గొలచిన బంట్లకు
తావులగొంతవడైనా దప్పిదీర్చవలదా

**చరణం:**

మతిలో శ్రీవేంకటేశ మనికైనవాడనింతే
తతినాపాటుకు దయదలచవయ్యా
ఇతవై పనిసేసేటి ఇంటిపసురమునకు
వెతదీర బాలాచి వెద్దువెట్టగదా." (*సంపుటం1.412:276.*)

ఈ కీర్తనలో అన్నమయ్య తనను తాను సమర్పించుకుంటూనే ఎప్పుడో చేసిన అపరాధాలను మనస్సులో ఉంచుకోక మన్నించమని వేడుకున్నారు. అలాగే 'నీ ఆజ్ఞను పాటించేందుకు తగిన జ్ఞానం, అలసటకు కొంత ఊరడింపు, నీ కర్మ నేను చేస్తున్నందుకు పరమానందం ఇవ్వా'లని స్వామిని కోరుకున్నారు. కష్టించి పనిచేసే పెంపుడు పశువుతో అన్నమయ్య తనను తాను పోల్చుకొని స్వామితో ఈ సంభాషణలు చేయడం విశేషం. ఈ సంభాషణల్లో స్వామికి దగ్గర కావడానికి ఏమేమి అవసరమో అవన్నీ అన్నమయ్య చేసినట్లుగా మనం గమనించగలం. పశ్చాత్తాపం అంటే కేవలం నన్ను క్షమించమని స్వామిని కోరడమే కాదు. ఏమేమి ఇవ్వగలరో తెలుసుకొని వాటిని పొందుకోవడానికి చేసే ప్రయత్నమే పశ్చాత్తాపం. కుమారుడిలా కాకుండా తనను దాసుడిలా, ప్రవక్తలా మలచుకొని స్వామి కాసిన ఇంటి పశువులా అయినా తనను చూడమని అన్నమయ్య వేడుకున్నారు. ఈ విధంగా పశ్చాత్తాపానికి సంబంధించిన సంకీర్తనలను అత్యద్భుతంగా అన్నమయ్య తీర్చిదిద్దారు. 'నీవు కాకుండా ఇంకేమీ అవసరం లేద'ని స్వామికి తన అభిప్రాయాన్ని అన్నమయ్య ఈ కీర్తనల్లో ఖరాఖండిగా తెలియజేశారు.

### 3.2.3. నిందాత్మక సంభాషణలు

ఈ సంభాషణలను మళ్ళీ దైవనింద, స్వయం నింద, సామాజిక నిందగా వింగడించవచ్చు. అయితే, సామాజిక నిందను బహిర సంభాషణల్లో చర్చించడం జరుగుతుంది. అన్నమయ్య స్వామిని తన ఆరాధనకు ఆటపట్టుగా చేసుకొని, ఆయన మహిమల్ని కీర్తిస్తూ, నిందాత్మకంగా స్తుతించారు. అలాగే తనకు తానుగా అనేక లోపాలను

ఎత్తిచూపుకొంటూ, స్వయంనింద చేసుకున్నారు. ఆత్మగతంగా స్వామిని తన హృదయంలో ప్రతిష్ఠింపజేసుకున్నారు.

## 3.2.3.1. స్వయం నింద

ఈ సంకీర్తనల్లో అన్నమయ్య తనను తాను నిందించుకోవడం కనిపిస్తుంది. ఈ నిందలన్నీ పశ్చాత్తాపాన్ని పోలి ఉన్నాయి. కానీ కాస్త భేదాన్ని గమనించడంవల్ల వీటిని నేను ప్రత్యేక విభాగంగా పరిగణించాల్సివచ్చింది.

**ముఖారి రాగం**

**పల్లవి**

"చిత్తములో నిన్ను జింతించనేరక
మత్తుడనై పులుమానిశినైతి

**చరణం:**

అరుతలింగముగట్టి అది నమ్మజాలక
పరువతమేగిన బత్తుడనైతి
సరుస మేకపిల్ల జంకబెట్టుక నోట
నరయు గొల్లనిరీతి నజ్ఞానినైతి." (*సంపుటం1.19:13.*)

ఈ కీర్తనలో అన్నమయ్య మనస్సులో నిన్ను చింతించకుండా అల్పుణ్ణి అయ్యానని స్వయం నింద చేసుకున్నారు. ఈ కీర్తనలో తనను తాను శివభక్తుడిగా ఎంచుకొన్నారు. 'అరుతలింగముగట్టి అది నమ్మజాలక పరువతమేగిన బత్తుడనైతి' అని మనిషిలోని అపనమ్మకాలు తొలగాలని భావించారు. అర్థలింగాలు కట్టుకొని పర్వతాలు తిరగడాన్ని చంకలో మేకపిల్లను పెట్టుకొని, ఊరంతా వెదికిన అజ్ఞానితో పోల్చారు. కొంగు ముడుపులు కట్టేవారిని, తీర్థయాత్రలు చేసేవారిని ఈ కీర్తనలో విమర్శించారు. వారి భక్తిని ఖండించారు. ఈ సంభాషణ స్వామితో స్వయం నిందాత్మకంగానే అన్నమయ్య చేశారు.

**లలిత రాగం**

**పల్లవి**

"దైవమా పరదైవమా
మెదగింతలునాకు నెట్టుదెచ్చేవో

**చరణం:**

అధమాధమునిదెచ్చి అధికుని జేసేనంట
విధినిషేధముల వివరించునా
విధివిధానములు నిచ్చనిచ్చలు
బెక్కువిధములు నెటువలె వెదజల్లెదవో

**చరణం:**

అతికష్టుడగు నాకు నలవిగాని యీ
మతమెసగిన నేను మరిగేనా
ప్రతిలేని వేంకటపతి నీదు
నామామృతమిచ్చి నను నీవే మెరయింతుగాక." (*సంపుటం1.291:194.*)

ఈ కీర్తనలోని రెండవ చరణంలో పూర్తిగా స్వయంనింద కనిపిస్తూండగా మూడవ చరణంలో శరణాగతభక్తి కనిపిస్తుంది. తనను తాను అధముడిగా అన్నమయ్య ఎంచుకున్నారు. అలాంటి తనకు స్వామివల్ల కృపకలిగిందని అన్నమయ్య ఈ సంకీర్తన చివరి చరణంలో పేర్కొన్నారు. ఈ కీర్తనంతా అన్నమయ్య తాను తగ్గాలి, స్వామి హెచ్చాలి అనే ధోరణిలో కొనసాగించారు.

**భౌళి రాగం**

**పల్లవి**

"చిత్తమో కర్మమో జీవుడో దేవుడో
ఒత్తిన ఈ చేతలొకరివిగావు

**చరణం:**

పదిలమైన మోహపాశంబులు దెచ్చి
మెదలకుండగ నాకు మెడజుట్టి
ఎదిరివారు నవ్వ నింటింట దిరిగించి
తుదలేని యాసల దుఃఖాతురునిజేసే." (*సంపుటం1.309:206.*)

ఈ కీర్తనలో 'లేనిపోని ఆశలనే కర్మబంధాలు నా మెడకు చుట్టి నన్ను వ్యర్థుణ్ణి చేసి అనేకవిధాలుగా నాతో ఆడుకుంటున్నావు. అది చూసి అందరూ నవ్వుతున్నారు. కోట్లకొలది జన్మాలకు నేను లోనుకాకుండా నీ ముద్ర నాకిచ్చి నన్ను బ్రోవు'మని స్వామిని అన్నమయ్య

వేడుకున్నారు. 'నీ నామానికి నావల్ల ఏమైనా అపఖ్యాతి వస్తుందేమో'నని అన్నమయ్య భయపడ్డారు. అందుకని స్వామిని కాపాడమని వేడుకున్నారు. ఈ సంకీర్తన కూడా పశ్చాత్తాపాన్ని వ్యక్తపరుస్తున్నట్లుగా ఉంటుంది. కానీ ఈ లోకంలో జరిగే కార్యాలన్నింటికీ స్వామే ప్రధానకారణమని అన్నమయ్య చెప్తూ, 'నా కర్మబంధాలవల్ల మాత్రమే ఇలా జరుగుతుం'దని తనను తాను నిందించుకున్నారు.

**భౌళి రాగం**

**పల్లవి**

"వివేకమెరగని వెఱ్ఱులముగాకనేము
దివారాత్రము నిన్నే దృష్టించవలదా

**చరణం:**

వేలెడు దీపము నమ్మి వెడగుజీకటిబాసి
పోలిమినొక్క నరుడు పొదలగాను
ఆలించి శ్రీవేంకటేశుడాత్మలో వెలుగగగాను
మేలిమాతనిగొలిచి మరయంగవలదా"! (*సంపుటం1.429:287.*)

ఈ కీర్తనలో 'చేయాల్సిన పనులు చేయకుండా ఇతరాలవెంట తిరిగేవాళ్ళం మేము' అని అన్నమయ్య తనను తాను తప్పుపట్టుకున్నారు. చిన్న దీపం వెలుతురును ఇస్తుందని నమ్మినట్లే ఆ వేంకటేశ్వరుని నమ్మకుండా ఎందుకు తిరస్కరిస్తున్నానని అన్నమయ్య తనను తాను ప్రశ్నించుకున్నారు. దీపం చీకటిని పోగొట్టి, వెలుగు దారిని చూపించినట్లే స్వామి మనలోని అజ్ఞానాంధకారాలను పోగొట్టి, మోక్షాన్ని ప్రసాదిస్తాడని తనను తాను సాంత్వనపరచుకున్నారు. అయితే, ఈ కీర్తన పరోక్షంగా మనుషులకు బోధ చేస్తున్నట్టుగా ఉండడం విశేషం.

"హరి నీయనుమతో అది నా కర్మమో" అనే సంకీర్తనలో ఎంత ధనాన్ని సంపాదించినా, ఎన్ని చదువులు చదువుకున్నా మోక్షధనంవైపు మనస్సు మరలడంలేదు. ఉపవాసాలు మోక్షానికి చేరేందుకు మార్గాన్ని చూపించలేకపోతున్నాయి అంటూ "విడువదు జన్మము వివేకముననే జడిసి స్వతంత్రము జరిపినను యడయక శ్రీవేంకటేశ్వర నీవే బడిగాచితివిట బ్రదికితి నేను" (*సంపుటం1.433:290.*) అంటూ అన్నమయ్య తనకు

విముక్తి కలిగించిన స్వామికి కృతజ్ఞతలు చెప్పుకున్నారు. "అదినాయపరాధమిది నాయపరాధమదియు నిదియు నాయపరాధము" అనే సంకీర్తనలో "ఈడెరగక వేంకటేశుడ నినుగొనియాడుట యది నాయపరాధము యేడజూచిన నా ఎదురనుండగ నిన్నున్నాడనీడ వెదకుటయపరాధము" (*సంపుటం1.271:181.*) 'నాలోనే ఉన్న నిన్ను ఎక్కడెక్కడో వెదకడం మహాపరాధం' అని తన కర్మకు తానే బాధ్యత వహించారు. తనను తానే నిందించుకున్నారు.

ఇలా అన్నమయ్య స్వయంనింద గావించుకున్నారు. ఈ నిందాత్మకమైన కీర్తనల్లో మానవాళికి అవసరమైన ఎన్నో మంచి విషయాలను పొందుపరిచారు.

## 3.2.3.2. స్వామిపై నింద

ఈ సంభాషణల్లో పైకి నిందాత్మకంగా కొన్ని కీర్తనలు, పూర్తి నిందాత్మకంగా కొన్ని కీర్తనలు కనిపిస్తున్నాయి. ఈ సంకీర్తనల్లో అన్నమయ్య పరిపక్వమైన భక్తిని మనం గమనించగలం. స్వామిని తనకు సన్నిహితంగా చేసుకొని, పరాచకాలాడడం, ఆటపట్టించడం, చనువు తీసుకోవడం, అలగడం, అవసరమైతే ఫిర్యాదు చేయడం ఇందులో కనిపిస్తాయి. ఈ నిందలు చాలా సరదాగా, సుబోధకంగా ఉంటాయి. అలాంటి కీర్తనలను కింద చర్చిస్తున్నాను.

**దేశాక్షి రాగం**

**పల్లవి**

"నిన్నుదలచి నీపేరుదలచి
నన్ను కరుణించితే నెన్నికగాక

**చరణం:**

అధికుని గాచుటే మరుదు నన్ను
నధమునిగాచుట నరుదుగాక
నీకు మధురమవుటేమరుదు చేదు
మధురమవుటే మహిలోనరుదుగాక." (*సంపుటం1.27:18.*)

ఈ కీర్తనలో స్వామితో వ్యాజ్యం పెట్టుకున్నారు అన్నమయ్య. పల్లవిలోనే 'నన్ను కాపాడుకోవాలి గానీ ఘనులైనవారిని కాపాడితే నీ గొప్పదనం ఎక్కడ బయటపడుతుంది?'

అని స్వామిని ప్రశ్నించారు. ఎలాగంటే 'ఇనుము బంగారమైనట్లుగా, చేదు తీపైనట్లుగా నన్ను కాపాడుకోవడం, మోక్షాన్ని అనుగ్రహించడం నీ విధి' అని స్వామికి తన బాధ్యతను గుర్తు చేశారు.

**సామంతం**

**పల్లవి**

"ఏనిన్ను దూరక నెవ్వరి దూరుదు?

నీవాని నన్నొక ఇంత వదలక ననునేలవలదా?

**చరణం:**

అపరాధిగనుక నన్నరసి కావుమని

అపరిమిత ఉభయమంది నీకు శరణంటిగాక

నెపములేక నన్ను నీకు గావగనేలా?

అపవర్గ దయాంబుధి తిరువేంకటాధిపా" (*సంపుటం1.35:23.*)

ఈ కీర్తనలో అన్నమయ్య స్వామిపై అలిగి, నిష్ఠురాలాడారు. 'అపరాధిని కాబట్టే నిన్ను శరణువేడాను. కారణం లేకుండా నన్ను కాపాడతావా!' అని అన్నమయ్య స్వామిపై వ్యంగ్యాస్త్రాలు సంధించినట్లు పైకి కనిపిస్తుంది. కానీ 'ఇంత పాపినైన నన్ను నువ్వు తప్ప వేరెవ్వరూ రక్షించలే'రనే శరణాగత తత్త్వం ఈ సంభాషణలో అంతర్లీనంగా దాగి ఉన్నది. ఈ కీర్తన వ్యాజనిందాలంకారంలో రచించబడింది.

**వరాళి**

**పల్లవి**

"తలపు కామాతురత్వముమీద నలవడిన

నిలనెట్టివారైన నేలాగుగారు!

**చరణం:**

పోలి నిరువురు సతుల నాలింగనముసేయ

లోలుడటుగాన నాలుగు చేతులాయ

వేలసంఖ్యలు సతుల వేడుకిల రమియింప

బాలుపడెగాన రూపములు పెక్కాయ." (*సంపుటం1.105:72.)*

ఈ సంభాషణలో అమ్మవారి ఎడబాటువల్ల కలిగిన దుఃఖంలో స్వామి ఉండగా ఆయనను అన్నమయ్య ఆటపట్టించారు. లోకంలో మనుషుల బాధలన్నీ స్వామికి ఆపాదిస్తూ, దాని కర్మఫలం అనుభవించమని స్వామిని దెప్పిపొడుస్తూ, ఇవన్నీ ప్రాథమికంగా తెలియనివేమీ కాదని గుర్తు చేశారు. ఈ కీర్తనలోని సంభాషణలో అన్నమయ్య స్వామిపైనే చెణుకు (సెటైర్.) వేశారు. 'ఆలోచనలన్నీ కామతప్తమైతే ఈ భూమిమీద ఇలా కాక మరి ఇంకెలా అవుతుంది? ఇద్దరు భార్యలను కౌగలించుకోవాలి కనుకనే నాలుగు చేతులయ్యాయి. 16000 మంది గోపికలతో క్రీడించడానికి అనేక రూపాలు నీకు అవసరమయ్యాయి. భోగాలను అనుభవించేందుకు వేంకటేశ్వర అవతారంలో ఉన్నావు. సంసారానికి బద్ధుడు కాబట్టి సకలాంతరాత్ముడవయ్యావు.' ఇలా అన్నమయ్య సంభాషణ కొనసాగింది. ఇద్దరు సతులు ఒకరు సంపదకు, ఇంకొకరు భూమికి ప్రతీక. గోపికలను ఉద్ధరించేందుకు వారికి అనేక రూపాల్లో కనిపించాడు. ఈ సృష్టిలో ఎవరైనా ఆయన దివ్యమంగళ విగ్రహం చూసి మోహితులు కావాల్సిందే. అంటూ అన్నమయ్య స్వామి తత్త్వాన్ని, స్వరూపాన్ని, వివరించారు. ఒకవైపు మనుషులకు స్వామి పడిన కష్టాలను గుర్తు చేస్తూనే మరొకవైపు ఆయన ఘనతను తెలియజేయడం ఈ కీర్తనలోని సంభాషణలో విశేషం.

**ఆహిరి రాగం**

**పల్లవి**

"దిక్కిందరికినైన దేవుడు కడు
దెక్కలికాడైన దేవుడు

**చరణం:**

కొత్తపెండ్లికూతు గోరి చూడబోయి
ఎత్తి తేరిమీదనిడుకొని
నెత్తికన్ను మానినవాని పెండ్లికి
దెత్తిగొన్నయట్టి దేవుడు.

**చరణం:**

గొప్పైన పెద్ద కొండమీదనుండి
దెప్పరమ్ముగా దిగబడి
గప్పి రెండుదునకలు గూడినవాని

తిప్పుదీరులాడే దేవుడు.” (*సంపుటం1.111:76.*)

ఈ కీర్తనలో రుక్మిణి వివాహానికి హాజరై, ఆమె అనుమతితో రథం మీద ఎక్కించుకొని దొంగతనంగా తీసుకువచ్చిన కృష్ణుని, సోదె చెప్పే ఎరుకలసాని రూపంలో అలమేలుమంగకోసం వెళ్ళిన వేంకటేశ్వరుని ఎగతాళి చేశారు.

**సామంతం**

**పల్లవి**

“ఎన్నగలుగు భూతకోటికి నెల్ల జేసినట్టిచేత
నిన్ను జేసుకొనుటగాక నీకు దొలగవచ్చునా

**చరణం:**

గుట్టుచెరిచి లోకమెల్ల ఘోరసంసారమందు
కట్టివేసినట్టి పాపకర్మమేల తీరును
పట్టి తెచ్చి నిన్ను రోలగట్టివేసి లోకమెరగ
రట్టుసేసుగాక నిన్ను రాజనన్న విడుచునా?” (సంపుటం1.171:115.)

ఈ కీర్తనలో అన్నమయ్య నిందాత్మకంగా స్వామితో సంభాషించారు. ‘లోకాన్ని సంసారంతో కట్టినందుకు నిన్ను యశోద రోటికి కట్టివేసింది. గోపసతుల వెంట తిరిగే నిన్ను విభుడు అనవచ్చా? పరుల ఇళ్ళలో దొంగతనం చేశావు కనుక ఆ ఆశ నిన్ను వడ్డికాసులవాణ్ణి చేసిం’దని స్వామిని ఈ కీర్తనలో ఎగతాళి చేశారు. ‘పాపకర్మాలచేత మనుషులను కట్టివేశావు కనుక నీకు అవే కర్మాలు చుట్టుకున్నా’యని ఆ దేవునితో పరాచకాలాడారు. ‘చేసుకున్నవారికి చేసుకున్నంత’ అనే జాతియాన్ని స్వామికి అనువర్తింపజేశారు.

**ధన్యాసి**

**పల్లవి**

“సామాన్యమా పూర్వ సంగ్రహంబగు ఫలము
నేమమున బెనగొనియె నేడు నీవనక

**చరణం:**

జగతి బ్రాణులకెల్ల సంసారబంధంబు
తగులబంధించు దురితంపు గర్మమున
మగుడ మారుకుమారు మగువ నీ ఉరముపై

తెగికట్టిరెవ్వరో దేవుండవనక.” (*సంపుటం1.200:133.*)

ఈ కీర్తనలో కూడా పైకీర్తనలాగే కర్మఫలితాన్ని దేవునికి ఆపాదించి, అన్నమయ్య తనదైనశైలిలో సంభాషించారు. ఎవరు చేసిన కర్మలు వారే అనుభవించాలి. దేవుడైనా సరే. అన్న భావాన్ని అన్నమయ్య వ్యక్తం చేశారు. సంసార బంధాన్ని మానవాళికి తగిలించిన పాపానికి లక్ష్మీదేవితో కాపురం, జగడాలు తప్పలేదు. బ్రతుకుదెరువుకోసం మనుషులను కొండలు, గుట్టలు తిప్పిన నేరానికి ఆయన ఏడుకొండలు ఎక్కాల్సివచ్చిందని స్వామిని ఎగతాళి చేశారు. స్నేహితునిగా, బంధువుగా, తనకు దగ్గరైనవాడిగా భావించారు కాబట్టి ఈ సంభాషణలకు అత్యంత ప్రాచుర్యం లభించింది.

**ఆహిరి రాగం**

**పల్లవి**

“పెక్కు లంపటాల మనసు పేదవైతివి నీకు
నెక్కడా నెవ్వారు లేరు ఏమిసేతువయ్యా

**చరణం:**

కన్ను మూయబొద్దులేదు కాలుచాచ నిమ్ములేదు
మన్నుదవ్వి కిందనైన మనికి లేదు
మున్నిటివలెనే గోరు మోపనైన చోటులేదు
ఇన్నిటా నిట్లానైతి వేమిసేతువయ్యా!” (**సంపుటం1.125:86**.)

‘వైకుంఠంలో ఇన్ని పాట్లుపడి, తిరుమలకు విశ్రాంతికోసం వస్తే ఇక్కడ కూడా నీకు విశ్రాంతి లేదు. నిద్రపోవడానికి పొద్దు లేదు. కాలు చాచి కూర్చోవడానికి సమయం లేదు. గోరు మోపేందుకైనా భక్తులు నీకు ఖాళీ ఇవ్వడంలేదు.’ అంటూ తిరుమలేశునికి తీరిక లేదని వాపోయారు. తిరుమలలో కనీసం స్వామికి ఖాళీ దొరకనంతమంది భక్తులు వచ్చి దర్శించుకుంటారు. అందరినీ ఆదరించడంలో నిమగ్నమైన స్వామి కనీసం నిద్రపోవడం కూడా మరచిపోయారని అన్నమయ్య తన అసంతృప్తిని తెలియజేశారు. ఈ సంభాషణ కూడా ‘ఏమిసేతువయ్యా’ ‘పరిస్థితులు అలా మారినప్పుడు పాపం నువ్వేం చేస్తావులే!’ అంటూ ఆ స్వామితో వ్యంగ్యంగా సంభాషించారు.

### నారణి రాగం

**పల్లవి**

“వేసరితిమెట్ల నీవెంటదిరిగి
గాసిబెట్టక మమ్ము గావరాదా

**చరణం:**

కరపితివి పాపములె కడిగి నానావిధుల
నెరపితివి దుర్దశలె నేర్పుమెరసి
తెరగొసంగియును శ్రీతిరువేంకటేశ్వరుని
నెరిగియును నెరగలేమింక నే తెరువో.” (*సంపుటం1.231:154.*)

ఈ కీర్తన బాహ్యంగా స్వామిని నిందిస్తున్నట్టుగా ఉంటుంది. కానీ ఇక్కడ ‘నీ మార్గాన్ని మేము తెలుసుకోలేకపోతున్నా’మనే అన్నమయ్య ఆవేదన అంతరంగా దాగి ఉంది. పల్లవి ‘వేసరితిమిట్ల నీవెంటదిరిగి’ అని మొదలవుతుంది. అంటే స్వామి వెంట తిరిగి విసుగొచ్చిందని అర్థం కాదు. ఇంకా ‘నీ మాయలను, మార్గాన్ని, నీ తత్త్వాన్ని మేము తెలుసుకోలేకపోతున్నాం. అందువల్ల విసుగు కలిగిం’దని అన్నమయ్య తన ఆవేదనను వ్యక్తం చేయడం. ‘తెగని కోరికలు మాకు కట్టి, ఇల్లు అనే చక్రబంధంలో మమ్మల్ని ఇరికించావు. కర్మబంధాల్లో మమ్మల్ని కట్టి, ఆపదలపాలు చేశావు. ఈ దుర్దశలనుంచి మమ్మల్ని విడిపించేందుకు సమర్థుడవు నీవే’నని అన్నమయ్య స్వామిని నిందాత్మక రూపంలో వేడుకున్నారు.

“ఎట్టివారికినెల్ల నిట్టి కర్మములు” అనే సంకీర్తనలో ‘పాపాలను నసింపజేయడం అనే నేరంచేత నువ్వు పాముపై పండుకోవాల్సివచ్చింది. పూతనను చంపడంవల్ల లక్ష్మీదేవిని ఎదపై ఉంచుకోవాల్సివచ్చింది. శకటాసురుని చంపడంవల్ల అర్జునుడికి రథసారథ్యం వహించాల్సివచ్చింది. కొండను పైకెత్తి పట్టుకొని గోపాలకులను రక్షించడంవల్ల నీవు తిరుమల కొండపై కొలువుండాల్సివచ్చింది.’ అంటూ ‘నీవంటివాడికే ఇలా అయింది. ఇక మాకు ఏ దారి చూపగలవయ్యా! “మాయట్టివారికినింక నేది తోవయ్యా” (*సంపుటం1.277:185.*) అంటూ స్వామిని దెప్పిపొడిచారు. ఇక్కడ స్వామి గొప్పదనం తేటతెల్లమయ్యేట్లుగా అన్నమయ్య సంకీర్తనా రచన గావించారు. స్వామిపై వ్యంగ్యాస్త్రాలను

సంధించి, తన మహిమలే తెలియజేశారు. స్వామి చేష్టలను, మాహాత్మ్యాలను ఆయనకే గుర్తు చేసి, ఒక ఒరవడికి శ్రీకారం చుట్టారు.

**శంకరాభరణం**

**పల్లవి**

"శతాపరాధములు సహస్రదండనలేదు
గతి నీవనియుండగ కావకుండగరాదు

**చరణం:**

తలచి నీకు మొక్కగా దయచూడకుండరాదు
కొలిచి బంటుననగ కోపించరాదు
నిలిచి భయస్థుడనై నియ్యెదుట
దైన్యమే బలుకగ గావకుండ బాడిగాదు నీకు." (*సంపుటం1.501:336.*)

ఈ కీర్తనలో అన్నమయ్య తనను తాను పాపాత్ముడిగా ఎంచుకొని, నిందించుకున్నారు. ఆంతరంగికంగా పాపాత్ములైన మనుషులు స్వామిని ఆరాధించాల్సిన ఆవశ్యకతను అన్నమయ్య తెలియజేశారు. 'శిశుపాలుడికి వంద తప్పులు చేయడానికి అవకాశం కల్పించినట్లు ఇక్కడ అలా చేసేందుకు వీల్లేదు. వేయి అపరాధాలనైనా క్షమించాల్సిందే. మనస్సులో నిన్ను తలచుకొని మొక్కాను. కాబట్టి దయచూపకుండా ఉండకూడదు. నీ బంటు అంటే కోపపడకూడదు. నీ ఎదురుగా నిలిచి, భయంతో దైన్యాన్ని పలుకుతున్నాను కాబట్టి నన్ను కాపాడకపోవడం ధర్మంకాదు. శరణంటున్నాను కాబట్టి చంపకూడదు. ద్రోహినైనా నీ నామస్మరణంవల్ల నాకు ముక్తి ఇవ్వకుండా ఉండకూడదు. నీవే దిక్కని నమ్మాను. కాబట్టి విడిచిపెట్టకూడదు. తప్పులెన్నైనా చేస్తే చేశానుగాక. నీ దాసుణ్ణి నన్ను కాపాడుకో.' అని అన్నమయ్య తనలోని అపరాధాలను ఏకరువు పెడుతూనే స్వామికి తన కర్తవ్యాన్ని బోధించడం మనం గమనించవచ్చు. లోకాలన్నీ కాపాడుకోవడం స్వామి బాధ్యతేనని అన్నమయ్య భావన. చాలామంది ఋషులు, యోగులు కొన్ని సందర్భాల్లో భ్రష్టులై పోయారు. వారు మళ్ళీ స్వామిని స్మరించి, ఉత్తములుగా తీర్చిదిద్దబడ్డారు. 'వారిని ఉద్ధరించిన నీవే నన్ను ఉద్ధరించాలి. వారికంటే నేను ఎంతమాత్రం శ్రేష్ఠుణ్ణి కాద'ని అన్నమయ్య ముందుగానే స్వామిని వేడుకోటం ఈ సంకీర్తనలోని ప్రత్యేకత.

ఈ విధంగా అన్నమయ్య స్వామిని నిందించారు. స్వామి చేష్టలను గర్హించారు. ఆయన ఉనికిని తెలియజేశారు. కొన్ని కీర్తనల్లో స్వామికి ఉపదేశం చేశారు. కర్తవ్యబోధ చేశారు. కాపాడమని శరణు వేడారు. ఈ విధంగా తన సంభాషణలను కొనసాగించారు.

## 3.2.4. సేవా సంబంధ సంభాషణలు

ఈ విభాగంలో భగవంతుణ్ణి ఏ విధంగా సేవించాలి? ఆయన కృపాకటాక్షాలకు పాత్రమవడానికి ఏంచేయాలి? మోక్షాన్ని ఎలా పొందుకోవాలి? అందుకు అనుసరించాల్సిన మార్గాలేవి? స్వామిని ఎలా ప్రసన్నం చేసుకోవాలి? అనే ప్రశ్నలకు అన్నమయ్య సమాధానాలు తెలిపారు. ఈ సంభాషణలు చాలా ముఖ్యమైనవి.

**భూపాళం**

**పల్లవి**

"నీకథామృతము నిరతసేవననాకు
చేకొనుట సకల సంసేవనంబటుగాన

**చరణం:**

ఇదియె మంత్రరాజము నేప్రొద్దు
నిదియె వేదసంహిత పాఠము
ఇదియె బహుశాస్త్రమెల్ల జదువుట నాకు
నిదియె సంధ్య నాకిదియె జపమవుటగాన." (*సంపుటం1.54:36.*)

పై కీర్తనలో అన్నమయ్య ప్రతిపాదించిన అంశాలు చాలా విలువైనవి. లోకబాధలన్నింటికి విరుగుడు స్వామి మంత్రోచ్చారణ, నామస్మరణమేనని అన్నమయ్య కనిపెట్టారు. ఇదే మంత్రరాజం, ఇదే వేదపాఠం, ఇదే అన్ని శాస్త్రాలు చదవడంతో సమానం. జపం, సంధ్యావందనం, బ్రహ్మోపదేశం, దుఃఖనివారిణి, రోగనివారిణి. ఉపనిషత్తుల పద్ధతి ఇందులో ఇమిడి ఉంది. ఇదే దాన, తపఃఫలం. ఇలా వేంకటేశ నామౌచిత్యాన్ని తెలియజేశారు. ఆయన నామస్మరణం ద్వారా అన్ని ఫలాలు సిద్ధిస్తాయి అంటూ, ఆ నామాన్ని నిరతం సేవించాలని అన్నమయ్య మనకు బోధించారు.

స్వామిని సేవించుకోవడానికి ఎలాంటి పరిస్థితులు అనుకూలంగా ఉంటాయో? అన్నమయ్య కింది కీర్తన ద్వారా వివరించారు.

**లలిత రాగం**

**పల్లవి**

"అప్పుడువో నిను గొలువుట ప్రాణికి

గప్పినదియు గనుగొనగలనాడు

**చరణం:**

ఆపదలకు సంపదలకు నడ్డు చెప్పని నాడు

పాపములకు బుణ్యములకు బనిదొలగిననాడు

కోపములకు శాంతములకు గూటమి మానిననాడు

లోపల వెలుపల తన మతిలో దెలిసిననాడు." (*సంపుటం 1. 43:28.*)

ఈ కీర్తనలో ఈ లోకపు చీకూచింత లేకుండా ఆ భగవంతుని సేవించే రోజు ఎప్పుడు? ఎలా ఉంటుంది? అనే ప్రశ్నలకు సమాధానంగా ఆపదలను, సంపదలను ఆహ్వానించిన రోజు, పాప పుణ్యాలకు పనిలేనిరోజు, కోప శాంతాల మధ్య భేదం పోయిన రోజు, అన్నింటికంటే ముఖ్యమైంది తనలోని స్వామిని కనుగొనగలిగిన రోజు, తమ పర భేదాలు లేని రోజు, చైతన్యాత్ముడై వెలిగే రోజును చూపించారు.

'ఈ జన్మకు నిన్ను సేవించే భాగ్యం ఇంతే చాల'ని ఈ కింది కీర్తనలో అన్నమయ్య తన సంతృప్తిని భగవంతునితో వ్యక్తం చేశారు.

**సామంతం**

**పల్లవి**

"చాలదా మా జన్మము నీ

పాలింటివారమై బ్రదుకగగల్గె

**చరణం:**

కమలాసనాథులు గానని నీపై

మమకారముసేయ మార్గము గల్గె

అమరేంద్రాదుల కందరాని నీ

కొమరైన నామము కొనియాడగల్గె." (*సంపుటం1.110:76.*)

'బ్రహ్మాదులు చూడలేని నీపై మమకారం చూపేందుకు మార్గం దొరికింది. దేవతలకు సైతం సాధ్యం కాని రీతిలో నీ పవిత్ర నామాన్ని కొనియాడుతున్నాం. సనకాది మునులకు

అగమ్యగోచరమైన నీ నామాన్ని వర్ణించే భాగ్యం కలిగింది. అన్నింటికన్నా ముఖ్యమైంది నీ దర్శనం మాకు సులభంగా దొరికింది. ఇంతకన్నా మా భాగ్యం ఏముంటుంది!' అని మానవులకు కలిగిన అదృష్టాన్ని స్వామితో పంచుకుంటూ పొంగిపోయారు. ఆ అనుభూతులను మనతో కూడా పంచుకున్నారు.

**శుద్ధవసంతం**

**పల్లవి**

"ఎదుటినిధానమ వెటుచూచిన నీవదే
వేంకటగిరి యనంతుడా

**చరణం:**

సొగిసి భాద్రపద శుద్ధచతుర్దశి
తగువేడుకనిందరుగొలువ
పగటుసంపదలు బహుళమొసగుం
నీవగు వేంకటగిరియనంతుడా." (*సంపుటం1.244:164.*)

ఈ కీర్తనలో భాద్రపద శుద్ధ చతుర్దశినాడు తిరుమలేశునికి జరిగే సేవను అన్నమయ్య పేర్కొన్నారు. ఆ రోజు పద్మనాభ స్వామికి పెద్ద ఉత్సవం నిర్వహిస్తారు. అలాగే దేవతలందరి రూపమైన వేంకటేశ్వరునికి కూడా తిరుమలలో పెద్ద ఉత్సవం నిర్వహిస్తారు. ఆ ఉత్సవ విశేషాలను అన్నమయ్య ఈ కీర్తనలో తెలియజేశారు.వ స్వామిని సేవించి, సంపదలను, ముక్తిని పొందిన సుశీల, కౌండిన్యుల సేవాతత్పరతను, వారిని స్వామి ఆదరించిన తీరును ప్రశంసించారు. 'ఆ రీతిగా మమ్మల్ని ఉద్ధరించ'మని అన్నమయ్య స్వామికి విన్నవించుకున్నారు.

"ఏమిసేసినా నీ ఋణమెట్టువాసును" అనే సంకీర్తనలో "పలుజన్మములే నన్ను అరికట్టుకోగా తొలగదోసి నాకు దోడైతివి ఎలమి శ్రీవేంకటేశ ఇల శూరులైనవారు బలుభయమిందరికి బాపుచుందురు" (*సంపుటం1.475:318.*) అంటూ 'ఇన్ని బంధాలనుండి మమ్మల్ని రక్షించిన నీ ఋణాన్ని ఎలా తీర్చుకోవాలి?' అని స్వామి కృపను వేనోళ్ళ కొనియాడారు. "ఇంతటి దైవమవు మాకు నిట్టునీవుగలుగగ ఎంతవారమో భాగ్యమేమి చెప్పేదికను" (*సంపుటం1.504:338.*) అంటూ 'అంత గొప్ప దేవుడవైన నీవు

మాకు అనుగ్రహించిన భాగ్యానికి ఏంచెప్పాలి!' అంటూ అన్నమయ్య స్వామి మనుషులకు కలిగించిన అదృష్టానికి పొంగిపోయారు. ఇలా అన్నమయ్య స్వామిని పరిపరివిధాలుగా సేవించి, తరించారు. తన సేవా తత్పరతను ఈ కీర్తనల్లో తెలియజేశారు.

## 3.2.5. స్వామి శౌర్య ప్రతాపాలు

ఈ కీర్తనల్లో వివిధ అవతారాలలో స్వామి, తన భక్తులు చేసిన సాహసకార్యాలు వివరించబడ్డాయి. నరసింహుడు, హనుమంతుడు, విష్ణుమూర్తి ఈ కోవకు చెందినవారు. హిరణ్యకశపుని సంహార సమయంలో నరసింహుని రూపాన్ని అతిభయంకరాకారంగా వివరించారు అన్నమాచార్యులు. అలాగే రాముని శౌర్యం, సౌమ్యం, విష్ణుమూర్తి ప్రతాపం, హనుమంతుని శౌర్యం, ధైర్యం, తెలివితేటలు, శాస్త్రపారీణత మొదలైన అనేక అంశాలను ఈ కీర్తనల్లో తగురీతుల్లో ఉగ్గడించారు. అలాంటి కీర్తనలను కింద ఇస్తున్నాను.

**నాటరాగం**

**పల్లవి**

"ఘోరవిదారణా నారసింహా నీ
వీరూపముతో ఎట్లుండితివో!

**చరణం:**

ఉడికెడి కోపపు టూర్పుల గొండలు
పొడిపొడియై నభమునకెగయ
పెడిదపురవమున పిడుగులొడొరుగగ
యడనెడ నీవపుడెట్లుండితివో!

**చరణం:**

గుటగుట రవములు కుత్తిక గిలుపుచు
గిటగిట పండ్లు గీటుచును
తటతట పెదవులు దవడలు వడకగ
ఇటువలె నీవపుడెట్లుండితివో!" (*సంపుటం1.68:46.*)

ఈ కీర్తనలో పొడిపొడి, గుటగుట, గిటగిట, తటతట, పెదపెద లాంటి ధ్వన్యనుకరణ శబ్దాలను వాడి, అన్నమయ్య నరసింహ స్వామి భయంకర రూపాన్ని మన కళ్ళకు కట్టారు.

నఖశిఖ పర్యంతం స్వామి రూపాన్ని అతిభయంకరంగా వర్ణించారు. శబ్ద గాంభీర్యతను పాటించి, ఈ కీర్తనకు శోభను చేకూర్చారు.

**నాటరాగం**

**పల్లవి**

"ఇలయును నభమును నేకరూపమై

జలజల గోళ్ళు ఝుళిపించితివి

**చరణం:**

ఎడసిన నలముక హిరణ్యకశపుని

దొడకి పట్టి చేతుల బిగిసి

కెడపి తొడలపై గిరిగొన నదుముక

కడుపు చించి కహకహ నవ్వితివి." (*సంపుటం 1. 85:58.*)

ఈ కీర్తనలో హిరణ్యకశపుణ్ణి తన ఒంటికేసి అదుముకొని, గోళ్ళతో చీల్చి భయంకరంగా చంపాడని వర్ణించారు. స్వామి నవ్వును 'కహకహ నవ్వితివి' అని ఆ నవ్వులోని భయానక దృశ్యాన్ని మన కళ్ళకు కట్టారు. నరసింహుని ఆకారం, అరుపు, చూపు, కోప తీవ్రత, వికటాట్టహాసం మొదలైన అనేక అంశాలను చాలా భయం గొల్పే విధంగా వర్ణించారు. "నగుమొగముతోడి ఓ నరకేసరి" అనే సంకీర్తనలో "రవిచంద్రశిఖ నేత్ర రౌద్ర నరకేసరి" (*సంపుటం1.421:282.*) అంటూ ఆయన రౌద్ర రూపాన్ని తెలియజేశారు.

పై కీర్తనలన్నీ స్వామి రాక్షసులతో తలపడ్డ సందర్భాలను గురించి చెప్పాయి. అలాగే విష్ణువు యుద్ధానికి వచ్చే సందర్భాన్ని కింది కీర్తనలో మనోహరంగా వర్ణించారు అన్నమయ్య.

**నాట రాగం**

**పల్లవి**

"ఇటు గరుడని నీవెక్కినను

పటపట దిక్కులు బగ్గన బగిలే

**చరణం:**

ఎగసిన గరుడని ఏపున దాయని

జిగిదొలక చబుకు జేసినను

నిగమాంతంబులు నిగమసంఘములు

గగనము జగములు గడగడవడకే.” (*సంపుటం1.93:63.*)

విష్ణుమూర్తి యుద్ధానికి సిద్ధమై, గరుడవాహనారూఢుడై అతివేగంగా రాక్షస సంహారానికి వచ్చే సందర్భాన్ని మనోహరంగా వర్ణించారు. వేగంగా పొమ్మని గరుడునికి చెప్పేందుకు ‘తాయ్’ అని కొట్టాడట. ఆ వేగానికి గగనం, లోకాలన్నీ గడగడా వణికాయట. ఆ కోపానికి అఖిలలోకాలు తిరిగాయి. ఆయన గరుడునిపై ఆసీనుడవడం చూసిన రాక్షసుల గుండెలు ఝల్లుమన్నాయని అన్నమయ్య ఈ సంభాషణలో వివరించారు.

**సాళంగనాట**

**పల్లవి**

“పటుశిష్ట ప్రతిపాలకుడవనగా

ఘటననఖిలమున గాతువుగా

**చరణం:**

తుత్తుమురుగ దైత్యుల దనుజులనని

మొత్తి మోది చలమునజలగి

జొత్తుపాపలుగ సొరిది విరోధుల

నెత్తురు వడతువు నీవేకా.” (*సంపుటం1.207:138.*)

ఈ కీర్తనలో రాక్షస సంహారాన్ని సరళమైన తెలుగు పదాలతో మనోహరంగా వర్ణించారు. తుత్తు మురుగ, మొత్తి, మోది, రట్టడి వంటి పదాలను వాడారు. సుదర్శన చక్రం మెరుపును తళతళా మెరిసినట్లుగా వర్ణించారు. ఇలా ఈ సంభాషణల్లో స్వామి ప్రతాపాన్ని ఆయనకే గుర్తు చేసి, ఈ జగాలన్నింటినీ కాపాడమని వేడుకోవడం కనిపిస్తుంది.

**నాటరాగం**

**పల్లవి**

“నిక్కించీ గర్నములు మానిసి మొకము

నిక్కపుగరుణతో మానిసిమొకము

**చరణం:**

కరములు వెయ్యింటా గైకొని యాయుధములు

నిరతి జడిపించీ మానిసిమొకము

సురలను నసురుల జూచి జూచి మెచ్చి మెచ్చి

నెరపీని నవ్వులు మానిసి మొకము." (సంపుటం1.436:291.)

ఈ కీర్తనలో స్వామి రాక్షసులపై కరుణ చూపించి, చంపుతున్నట్లుగా పేర్కొనబడింది. దేవర్షులు, గంధర్వులు, దేవతలు కొందరు స్వామిచేత గానీ, ఇతరుల చేతగాని శపింపబడి, స్వామిని కరుణకోసం వేడుకొని, రాక్షసులుగా మారి, స్వామితో ఘోరమైన యుద్ధాలు చేసిన సందర్భాలను మనం పురణాది గ్రంథాల్లో చూడగలం. అందుకు స్వామి స్వయానా వారికి మోక్షాన్ని ఇచ్చేందుకు వారిని హతం చేశారు. ఆ సందర్భాలను అన్నమయ్య ఈ కీర్తనలో వివరించారు.

పై కీర్తనల్లో స్వామి ప్రతాపాన్ని తెలియజేయగా స్వామిభక్తికి నిలువెత్తు నిదర్శనమైన హనుమంతుని ప్రతాపాన్ని కింది కీర్తనల్లో అన్నమయ్య తెలియజేశారు. తన భక్తుని ప్రతాపానకి సాక్షాత్తూ స్వామే అబ్బురపడేవిధంగా హనుమంతుని శౌర్యప్రతాపాలను వర్ణించడం ఒక విశేషం.

**గౌళ రాగం**

**పల్లవి**

"నేలమిన్ను ఒక్కటైనా నీ బంటు ఒక్క

వేలనే అక్షుని తెగవేసెగా నీబంటు

**చరణం:**

ఉంగరమెగరవేసి ఒదధిలో పడకుండా

నింగికి చేయి చాచె నీ బంటు

చెంగున జలధి దాటి జంబుమాలి నీలామీదా

కుంగదొక్కి పదముల కుమ్మెగా నీ బంటు." (*సంపుటం1.69:47.*)

ఈ కీర్తనలో హనుమంతుని ప్రతాపాన్ని మాత్రమే కాకుండా కోతి చేష్టలనూ మనోహరంగా వర్ణించారు. ఉంగరాన్ని పైకెగరేసి పట్టుకోవడం, జంబుమాలి పర్వతాన్ని కుంగదొక్కడం లాంటివి ఉదాహరణలుగా చూపించారు. రావణుని సభలో హనుమంతుని ప్రతాపాన్ని 'వెట్టగా రావణు రొమ్ము విరుగ చేతనే గ్రుద్దే నిట్టతాడు వంటివాడు' అని వర్ణించారు. ఇక్కడ 'నిట్టతాడు' అనే విశేషమైన ప్రయోగాన్ని అన్నమయ్య చేశారు. పూరిళ్ళకు

నిట్టతాడు చాలా ముఖ్యం, ఆధారం. అలాగే రామాయణం కొనసాగడానికి హనుమంతుడు ముఖ్య భూమిక పోషించాడు కాబట్టి అన్నమయ్య అలాంటి విశేషణాన్ని వాడుతూ స్వామితో సంభాషించారు. ఒకటవ చరణంలో కోతి చేష్టలను, రెండవ చరణంలో ప్రతాపాన్ని, మూడవ చరణంలో హనుమంతుని ధైర్యాన్ని, శౌర్యాన్ని, సమయస్ఫూర్తిని పరిపరివిధాలుగా స్తుతిస్తూ స్వామితో అన్నమయ్య తన సంభాషణను చాలా సహజంగా కొనసాగించారు.

**లలిత రాగం**

**పల్లవి**

"నీవేకా చెప్పజూప నీవె నీవేకా
శ్రీవిభు ప్రతినిధివి సేనమొదలారి

**చరణం:**

దొరలైనయసురుల తుత్తుమురుసేసి
జగమెరవుగానేలితివేకరాజ్యమై
పరగు సూత్రవతీపతివై వేంకటవిభు
సిరుల పెన్నిధి నీవే సేనమొదలారి." (*సంపుటం1.255:171.*)

ఈ కీర్తనలో హనుమంతుడిని అన్నమయ్య ప్రస్తుతించారు. 'రామరావణయుద్ధంలో దేవతలు గెలిచేందుకు కారణం నీవే. రాక్షస సంహారం చేసి జగమంతా ఏకరాజ్యం కావడానికి పాటుపడ్డావు. మైరావణుని మాయలో పడకుండా రామలక్ష్మణులను రక్షించి, సీతమ్మ, ఊర్మిళ మంగళసూత్రాలను కాపాడిన నీవు రాముడికి నిజమైన సేవకుడవు, సేనమొదలారివి, సేనా నాయకుడివి.' అంటూ అన్నమయ్య హనుమంతుని ప్రతాప శౌర్యాలను ప్రస్తుతించారు. లోకాలన్నింటినీ శ్రీదేవుడు ఏలేందుకు సహాయపడ్డ హనుమంతుని ఔదార్యాన్ని, ధైర్యసాహసాలను, పాండిత్యాన్ని అన్నమయ్య ప్రశంసించారు.

**ఆహిరి రాగం**

**పల్లవి**

"ఎటువంటి రౌద్రమో ఎటువంటి కోపమో!
తటతట నిరువంక దాటీవీడే

**చరణం:**

బుసకొట్టుచును ఊరుపుల జమరించి

మసిగాగా బెదపెద మల్లుల దంచి
నెసగి శ్రీతిరువేంకటేశుడై మించి
ముసిముసినవ్వుల ముంచీవీడే." (*సంపుటం1.211:140.*)

'హనుమంతుడు చేతులతో కోపంగా తొడలు చరుస్తూ, పెదాలు కొరుకుతూ, రాక్షసుల ఎముకలు విరగ్గొట్టాడు. వారిపై ఏమాత్రం దయచూపకుండా, రాక్షస శ్రేష్ఠులందరినీ పొడిపొడిగా దంచాడు. లంకానగరాన్ని సర్వనాశనం చేసి, పూర్తిగా తగలబెట్టాడు.' అంటూ హనుమంతుని ప్రతాపాన్ని ఈ సంభాషణలో ప్రస్తుతించారు అన్నమయ్య. "మాయపుదనుజుల మదవైరి" అనే కీర్తనలో "నవ్వుచు లంకానగరపుదనుజుల కొవ్వణచిన కపికుంజరుడు" (*సంపుటం1.279:186.*) అంటూ రాముని బంటుగా తాను నిర్వహించిన కార్యాన్ని అలతి అలతి తెలుగు మాటలతో తెలియజేశారు. ఈ విధంగా సాక్షాత్తూ స్వామే అబ్బురపడేట్లుగా హనుమంతుని ప్రతాపాన్ని, శౌర్యాన్ని, ధైర్యాన్ని, పాండిత్యాన్ని, బుద్ధిని అన్నమయ్య పరిపరివిధాలుగా ప్రశంసించారు.

పై సంకీర్తనల్లో రాముని యుద్ధాన్ని నాట, సాలంగనాట రాగాలలోను, హనుమంతుని ప్రతాపాన్ని గౌళ, ఆహిరి, లలిత రాగాల్లోనూ వర్ణించారు. ఈ రాగాలు వీర్య ప్రతాపాలను ఇనుమడింపజేశాయి. భగవంతునికంటే భక్తుడే గొప్ప అని పై కీర్తనల్లో అన్నమయ్య నిరూపించారు.

### 3.2.6. అవతారాలు

అన్నమయ్య సంకీర్తనల్లో దశావతారాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. అన్నమయ్య తన సంకీర్తనల్లో గౌతమబుద్ధుని కూడా దశావతారాల్లో ఒకడిగా భావించి, మతసామరస్యాన్ని తెలియజేశారు. 'ఈ అవతారాలన్ని లోకకళ్యాణార్థం నీవెత్తినవే స్వామీ' అని సంభాషణ రూపంలో స్మరించుకోవడం ఈ సంకీర్తనల్లో మనం చూడగలం.

**శ్రీ రాగం**

**పల్లవి**

"ఏది చూచిననూ గడునిటువంటి చోద్యములే
మేదినికి గిందుపడి మిన్నందనేల?

**చరణం:**

కరిరాజును గాంచిన కరుణానిధివి నీవు

అరిది నరసింహు రూపైతివేల?

ఉరగేంద్ర శయనమున నుండి నీవును సదా

గరుడవాహనుడవై గమనించనేల?" (*సంపుటం1.140:129.*)

ఈ కీర్తనలో స్వామి అవతారాలలోని భేదాలను గుర్తు చేశారు. 'గజేంద్రుని కాపాడడానికి వచ్చినప్పటి కరుణ హిరణ్యకశపుని సంహారమప్పుడు ఎక్కడ? పాము మీద శయనించే నీకు గరుడ వాహనం ఎందుకు? సముద్రమథన సందర్భంలో ఆడవేషం వేసుకోవాల్సినంత దైన్యం ఎందుకు వచ్చింది? గోపాలకులను రక్షించే సందర్భంలో నీ శయ్య అయిన పాముపై నాట్యం చేశావెందుకు? దేవతలందరికీ తలమానికమైన నీవు ఇంద్రునికి తమ్ముడనిపించుకుంటున్నావేం? పాపాలను హరించే వేంకటేశ్వరుడవై ఉన్న నీవు కోట్లాది జీవుల్లాగా ఈ కష్టాలు ఎందుకు పడ్డావు?' అని స్వామితో ఆయన లీలల్ని, అందుకు తగిన కారణాలను ఆయనముందు ఏకరువు పెట్టారు.

**సామంత రాగం**

**పల్లవి**

"ఆదిదేవుడనగ మొదలనవతరించి జలధి సొచ్చి

వేదములను శాస్త్రములను వెదికి తెచ్చెనీతడు

చరణం:

వాలి దైత్యవరుల మోహవతులనెల్ల

మూలమూలద్రోసి ముసుగుపాలు సేసెనీతడు

వేలసంఖ్యలైన సతుల వేడుకలలరజేసి

ఒంటినాలిమగనిరీతిగూడి యనుభవించెనీతడు." (*సంపుటం1.324:216.*)

ఈ కీర్తనలో ఆయా అవతారాలకు సంబంధించిన విశేషాంశాలను అన్నమయ్య తెలియజేశారు. 'మత్స్యావతారంలో సముద్రంలోని వేదాలను, శాస్త్రాలను వెదికి తెచ్చి, ఈ జగానికి అందించాడు. రామావతారంలో చాలామంది రాక్షసులను చంపి, వారి భార్యలకు వైధవ్యం కల్పించాడు. కృష్ణావతారంలో గోపికలను ఉద్ధరించాడు. తన కడుపులోని లోకాలన్ని కదలకుండా శేషతల్పంపై పండుకున్నాడు. వామనావతారంలో నింగిని, నేలను

ఆక్రమించాడు. అంతటి స్వామి నేడు వేంకటేశావతరాంలో మనుషులకు మోక్షాన్ని కలిగిస్తున్నా'డని అన్నమయ్య చెప్పారు.

"సకలసందేహమై జరుగుచున్నదియొకటి" అనే సంకీర్తనలో దశావతారాలతోబాటు ఆ పరమాత్మ తత్త్వాన్ని ఆవిష్కరించారు. ముఖ్యంగా ఆ స్వామి అవతారాలకు కారణాలను అన్నమయ్య అనుమానం, నివృత్తి రూపంలో తెలియజేశారు. "వసుదేవు జఠరమను వననిధికి జంద్రుడై అసమానగతి బొడమినాడీతడు వసుధజంద్రుడు నీలవర్ణుడేటికినాయ కసరెత్తినను గందు గలయగొనుబోలు" (*సంపుటం1.332:321.*) అంటూ ప్రశ్న, సమాధాన రూపంలో అన్నమయ్య సంభాషణ గావించారు.

**వసంతరాగం**

**పల్లవి**

"తలపులోపలి తలపు దైవమితడు
పలుమారు బదియును బదియైన తలపు

**చరణం:**

సవతైన చదువులు సరుగదెచ్చిన తలపు
రవళి దరిగుబ్బిరిని రంజిల్లు తలపు
కవగూడగోరి భూకాంత ముంగిటితలపు
తివిరి దూషకు గోళ్ళ దెగటార్చు తలపు." (*సంపుటం1.356:238.*)

అంటూ రామ, బలరామ, నరసింహ, కృష్ణ, పరశురామ, బుద్ధ, మత్స్యావతారాలను ఈ కీర్తనలో పేర్కొన్నారు.

పై కీర్తనల్లో తన భక్తులకు సాక్షాత్తూ విష్ణుమూర్తి ఆయా అవతారాల్లో మోక్షాన్ని ఇచ్చిన సందర్భాలను అన్నమయ్య అత్యంత ప్రభావవంతంగా తెలియజేశారు. అలాగే ఈ కీర్తనల్లో స్వామి ఎత్తిన అవతారాల్లో ఆయా కార్యాల్లో ఎలా విజయం సాధించాడో? అన్నమయ్య వివరంగా తెలియజేశారు.

వీటన్నింటినీ పరిశీలిస్తే స్వామి ఒక సందర్భంలో ఉన్నట్లుగా వేరొక సందర్భంలో ఉండడు. మన ఆలోచనలకు అతీతంగా, కాలానుగుణంగా ఎప్పటికప్పుడు తనను తాను మార్చుకుంటూ ఉంటాడని మనం అర్థం చేసుకోవాలి. నాదబ్రహ్మ శ్రీ త్యాగరాజు కూడా సాధించెనే అనే కృతిలో "బోధించిన సన్మార్గవచనములు బొంకుజేసి తాబట్టిన పట్టు" (*రామశాస్త్రులు అండ్ సన్స్, వావిళ్ళ.1956:351.*) అన్నారు. అందుకే "ఏది చూచినను గడునిటువంటి చోద్యములే మేదినికి గిందువడి మిన్నందనేల?" (*సంపుటం1.140:96.*) అనే ఒక్కమాటతో స్వామి స్వరూపాన్ని అన్నమయ్య ఆవిష్కరించారు.

## 3.3. బహిస్సంభాషణలు లేక సమాజంతో సంభాషణలు

అన్నమయ్య చేసిన సంభాషణల్లో బహిరంగంగా సమాజంతో చేసిన సంభాషణలకు అత్యంత ప్రాధాన్యం ఉంది. సామాన్యులతో వారికి అర్థమయ్యే భాషలో సంకీర్తన చేసి, వారిచే మెప్పు పొందారు అన్నమయ్య. ఆయన ఉపయోగించిన పదాలు కొన్నింటికి నిఘంటువు అవసరపడదు, కొన్ని నిఘంటువుల్లో తేరి చూసినా దొరకవు. అంత సామాన్యమైన భాషను ఉపయోగించి, పండితుల, పామరుల మన్ననలు ఏకకాలంలో పొందారు. బహిస్సంభాషణ విభాగంలో తత్త్వ సంభాషణలు, ఉపదేశం, నామసంకీర్తనం, పాప పుణ్యాల విశ్లేషణ, పాదస్మరణం, తిరుమలవర్ణనలు, రాజుల, అధికారులపై నిరసన, స్త్రీలపై నిరసన అనే అంశాలపై అన్నమయ్య సంభాషించారు. ఈ సంభాషణలన్నీ ప్రత్యక్ష్యంగా ఇంకొకరితో సంభాషించినట్లు, నిర్దేశాత్మకంగా ఉన్నాయి. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

### 3.3.1. తత్త్వ సంభాషణలు

ఈ సంభాషణలు వేదాంతభరితంగా ఉన్నాయి. దేవునికంటే మరేమీ అవసరం లేదని అన్నమయ్య ప్రతిపాదించారు. ఇందులో మానవాళికి తత్త్వాన్ని గురించి వారికి అర్థమయ్యే వాడుక భాషలో తెలియజేశారు. అందుకే ఈ కీర్తనలకు ప్రజలే వాహికలుగా మారారు. అందరూ పాడుకొనేట్లుగా అన్నమయ్య కీర్తనలు ఉన్నాయి కాబట్టి ఏ వాగ్గేయకారుడికి లేనంత గౌరవం సమాజంలో ఆయనకు కలిగింది.

### శుద్ధ వసంత రాగం

**పల్లవి**

"సదా సకలము సంపదలే
తుది దెలియగవలె దొలగగవలయు

**చరణం:**

అహర్నిశములునాపదలే
సహించిననవి సౌఖ్యములే
ఇహముననవి ఇందరికిని
మహిమదెలియవలె మానగవలెను" (*సంపుటం 1. 7:5.*)

పై సంభాషణలో సాధించాల్సిన సంపదలను అన్నమయ్య ప్రస్తావించారు. అందుకే 'తుద దెలియగవలె' అనడంతో 'చివరికి నువ్వేమవుతావో తెలుసుకో' అనే సూచన చేశారు. ఈ లోకంలో బంధాలు, ఆపదలు, సుఖాలు, వాటివల్ల కలిగే దోషాలు అన్నీ సర్వసాధారణం. అన్నింటికంటే ముఖ్యమైంది మోక్షసంపద. అందుకు ఆలవాలమైంది శ్రీదేవుని స్మరణమేనని ఈ సంభాషణలో అన్నమయ్య తెలియజేశారు.

ఇహలోక చింతలన్నీ మానాలని ప్రజలకు చేసిన ఉద్బోధ కింది కీర్తనలో చూడవచ్చు.

### శంకరాభరణ రాగం

**పల్లవి**

"అన్నియుననతని కృత్యములే
ఎన్నియైన నౌనునతడేమి సేసినను

**చరణం:**

అనురేణు పరిపూర్ణుడవలి మోమైతేను
అణువవును కమలభవాండమునైన
ఫణిశయనుని  కృపా పరిపూర్ణమైతే
తృణమైన మేరువవౌ స్థిరముగానపుడే." (*సంపుటం 1. 20:14.*)

అన్నమయ్య స్వామి కృప ఉంటే చాలని సమాజంతో సంభాషించారు. ఈ లోకంలో సృష్టి అంతటికీ ఆయనే మూలం కనుక చింతించాల్సిన అవసరం లేదు. స్వామి సేవ

వెగటుగా భావించేవారు పదివేలు పుణ్యాలు చేసినా అవి పాపాలుగానే పరిగణించబడతాయని కచ్చితంగా చెప్పారు. 'వననిధి కురిసిన వానలివి' అనే సంకీర్తనలో "రచ్చల వేంకటరమణుని గొలువక చచ్చియు జావని జన్మములు" (*సంపుటం1.23:16.*) అని అన్నారు. ఈ లోకంలో అన్ని సంపదలను పొందుకొని, మోక్షాన్ని సంపాదించుకోకపోతే వారి జన్మ వృథా అని ఈ సంభాషణలోని పరమార్థం. ఈ తరువాతి కీర్తనలో తన వాదానికి అన్నమయ్య మరింత బలాన్ని చేకూర్చారు.

**గుండక్రియ రాగం**

**పల్లవి**

"ఎంతటివారలు నెవ్వరును హరి

జింతించక నిశ్చింతులుగారు

**చరణం:**

అతిజితేంద్రియులు ననశన వ్రతులు

నతుల తపోధనులగువారు

చతురానన గురుస్మరణము దొరకక

తతినోరక పుణ్యతములుగారు." (*సంపుటం 1. 32:21.*)

ఈ సంభాషణలో అన్నమయ్య స్వామి చింతనం లేకపోతే ప్రయోజనమేమీ లేదని తేల్చి చెప్పారు. ఇంద్రియనిగ్రహులు, వ్రతాలు చేసేవారు, తపోధనులు, పుణ్యులు, యాజకులు, మంచివారు, చెడ్డవారు ఎవరైనా కావచ్చు. స్వామి చింతన లేని వారి జీవితాలకు అర్థం, పరమార్థం ఉండదని ఖరాఖండిగా తేల్చిచెప్పారు.

భగవంతుని నమ్మినవారు భక్తిమార్గంలోనుంచి బయటకు రాలేరు. ఎందుకంటే వారికి భక్తి మాత్రమే పరమావధి అని అన్నమయ్య కింది కీర్తనలో తెలియజేశారు.

**శ్రీరాగం**

**పల్లవి**

"అదిగాక నిజమతంబదిగాక యాజకం

బదిగాక హృదయసుఖమదిగాక పరము

**చరణం:**

అమలమగు విజ్ఞానమను మహాధ్వరమునకు

నమరినది సంకల్పమను మహాపశువు
ప్రమదమను యూపగంబమున విశసింపించి
విమలేందు యాహుతులు వేల్పంగ వలదా (*సంపుటం 1. 40:26.*)

ఈ సంభాషణలో భక్తి గొప్పదనాన్ని అన్నమయ్య తెలియజేశారు. ఇహలోక చింతనను అజ్ఞానమనే మహాపశువు అన్నారు. ఆ పశువు నిరంతరం పరమాత్మ మార్గానికి ఆటంకం కలిగిస్తూ ఉంటుంది. వేంకటేశ్వరుని ధ్యానం మనుషులకు సోమపానం కావాలని, ఆయన కృపవల్ల కలిగే ఆనందంలో ఓలలాడాలని ఆకాంక్షించారు. ఇదే అభిప్రాయాన్ని చాలా సంకీర్తనల్లో ఇంకా బలంగా ప్రతిపాదించారు. "ఇతరములన్నియునేమిటికి" (సంపుటం1. 86:59-60.) అనే కీర్తనలో మనోచాంచల్యం ఉండకూడదని చెప్పారు.

**సామంతం**

**పల్లవి**

"ఎంతచేసిన తనకేది తుద
చింత శ్రీహరిపై జిక్కుటే చాలు

**చరణం:**

యడపక పుణ్యాలెన్ని చేసినా
గడమేకాకిక గడ ఏది
తడబడ హరియే దైవమనుచు మది
విడువక ఉండిన వెరపే చాలు." (*సంపుటం1.98:67.*)

ఈ కీర్తనలో అన్నమయ్య ఎన్ని పుణ్యాలు, తపస్సులు చేసినా అందరినీ ఏలేటువంటి స్వామిని విడిచిపెట్టకుండా ఉంటే ఉత్తమగతులను పొందుతామని తెలియజేశారు.

ఈ లోకపు స్నేహం తుచ్ఛమైందని, భగవంతునితో స్నేహం శాశ్వతమైందని అన్నమయ్య కింది కీర్తనలో తెలియజేశారు.

**భౌళి రాగం**

**పల్లవి**

"ఎట్టుచేసిన జేసే నేమిసేయగవచ్చు
చుట్టపు విరోధంబు సూనాస్త్ర చెలిమి

**చరణం:**

ఒడలి లోపలిరోగ మొనర బరితాపంబు

కడుపులోపలి పుండు కడలేనియాస

తడిపాత మెడగోత తలపు విషయాసక్తి

గుడిమీది తరువు అలకులము ప్రాణులకు.” (*సంపుటం1.104:71.*)

ఈ కీర్తనలో అన్నమయ్య ఎలాంటి స్నేహం చేయాలో ఉపమానబద్ధంగా సంభాషించారు. “ఇంటివేలుపు వేంకటేశుగొలువక పరులవెంట దిరుగుట ఓడవిడిచి ఒదరిడుట” అన్నారు. ఈ చేష్టలన్నింటికీ దేహమే కారణమంటూ “ఎక్కడి దురవస్థలేటి దేహములోన” (*సంపుటం1.106:73.*) అన్నారు. మలమూత్రాలతో నిండుకున్న దేహమని “కడలేని మలమూత్ర గర్హితమిది లోనుగడుగగరాదు ఎంతగడిగినబోదు” అంటూ ఈ శరీరాన్ని నిరసించారు అన్నమాచార్యులు. ఇలా అయితే మోక్షాన్ని పొందడం చాలా కష్టం అని చెప్పారు. ఈ కింది కీర్తనలో శరీరం ఇలా కావడానికి విధిని కారణంగా చూపించారు.

**ముఖారి రాగం**

**పల్లవి**

“ఎంత సేయగలేదు ఇటువంటి విధి

యభవునంతవాని భిక్షమడుగుకొనజేసె

**చరణం:**

కోరి చంద్రునిబట్టి గురుతల్పగునిజేసే

కూరిమలరగ నింద్రుగోడిజేసె

ఘోరకుడువగా త్రిశంకునినంత్యజుని జేసె

వీరుడగునలువట్టి విద్రూపునిగ జేసె.” (*సంపుటం1.134:92.*)

విధివల్ల ధర్మరాజు జూదమాడాడు. హరిశ్చంద్రుడు సతిని అమ్ముకున్నాడు. శూద్రకుడు గొర్రెలను దొంగతనం చేయాల్సివచ్చింది. దుర్యోధనుడు మడుగులో దాక్కొన్నాడు. వీరిలో శారీరక సుఖాలకోసం కొందరు సరదాగా కొందరు, మాటనెపంతో కొందరు ఇలా అయ్యారు. అయితే, వేంకటేశుదాసులు ఏమాత్రం చెక్కుచెదరకుండా నిలిచి ఉన్నారని అన్నమయ్య తెలిపారు. ధర్మరాజు జూదం ఆడే సందర్భంలో ‘నేను ద్వారకలో లేన’ని కృష్ణుడు అన్నాడు. ఇక్కడ ద్వారక అంటే ద్వారాలతో కూడుకున్నది అని అర్థం. అంటే

నీ మనస్సులో నేను లేనని ధర్మరాజుతో చెప్పాడు. ఇలాంటి విషయాలన్నింటినీ అన్నమయ్య ప్రస్తావిస్తూ ఈ సంభాషణలో శరీరాన్ని నిరసించారు. అందుకే ఈ కింది కీర్తనలో దేహంయొక్క స్వరూప స్వభావాలను అన్నమయ్య తెలియజేశారు.

**శ్రీరాగం**

**పల్లవి**

"దేహము తానస్థిరమట దేహి చిరంతనుడవునట
దేహపు మోహపు సేతలు దీరుట ఎన్నడొకో

**చరణం:**

సిగ్గుల దొలగని యాసల జిక్కికదా దుర్మానపు
సిగ్గుల ఎగ్గుల చేతను చిక్కువడిరి జనులు
సిగ్గులు దొలగుట ఎన్నడు చిత్తము లోనవుటెన్నడు
తగ్గుల మొగ్గల సేతలు తలగుటలెన్నడొకో." (*సంపుటం1.136:93.*)

మనస్సులో ఉన్న దైవాన్ని మరచి జనులు వ్యర్థమైనవాటికోసం తపిస్తున్నారని అన్నమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. అంతగా బాధపడ్డారు కాబట్టి సమాజాన్ని కాస్త ఎక్కువగా తూలనాడడం ఇలాంటి సంకీర్తనల్లో మనం గమనించగలం. అందుకే "అనయము శ్రీవేంకటపతి యాత్మదలచి సుఖింపుచు ఘనమగు పరమానందము కలుగుటలెన్నడొకో" (సంపుటం1.136:93) అంటూ జనహితాన్ని కాంక్షించారు.

"శ్రీవేంకటాద్రీశు జేరని పనులెల్ల నేవగింతలేకాక ఇందేమి కలదు?" (*సంపుటం1.150:102.*) అన్నారు. ఎన్ని ఉన్నా మనుషులకు ఆపదలు తప్పవు. కనుక తెలివితో ఉండాలని అన్నమయ్య ప్రబోధించారు. ఏదేమైనా స్వామికి తమ పనులన్నింటినీ అప్పజెప్పి నిశ్చింతగా ఆయన సన్నిధిలో ఉండడమే మానవాళికి శ్రేయస్కరమని ఆయన భావించారు. "మెరయు విషయములు తన మెడనున్న ఉరులుగా ఎరిగినది యదిగదా ఎరుక" (*సంపుటం1.181:121.*) అంటే ఆపదలకు ఆలవాలమైన మానవజీవితంలో అన్నింటిపై ఎరుక కలిగి ఉండాలని పై సంభాషణలోని భావం. "కూరిమి మారుతి వేంకటగిరిగురు శ్రీపాదములు చేరినవారికి భవములు చెందవెపుడునటుగాన"

(*సంపుటం1.194:130.*) అంటూ స్వామిని తలచడంవల్ల కలిగే ప్రయోజనాలను గురించి సమాజంతో సంభాషించారు.

"ఎందరివెంట నెట్లఁ దిరగవచ్చు" (*సంపుటం1.201:134.*) అనే సంకీర్తనలో స్వామి బాహ్యంగా చూసేవారికి రాయిలా కనిపిస్తాడు. కానీ రాళ్ళలో ఆ రాయి తలరాయి అని, "కొలదిమీరిన దేవకోట్లు దనలోన కలవానినొక్కనినే కొలుచుగాక" (*సంపుటం1.201:134.*) అంటూ కోట్లకొలది దేవతలు ఆ రాయిలో కొలువై ఉన్నారని వివరించారు. "వెన్నవట్టుక నేయి వెదకనేల?" (*సంపుటం1.202:134.*) అంటూ సమాజాన్ని ప్రశ్నించారు. దేవుడే దిక్కు అనుకోకుండా తమంతట తామే అనేకరకాల పనులకు పూనుకొంటూ భంగపడుతున్నారు. కాబట్టి "ఎట్టుసేసినను వేంకటేశుడే నేరుచుగాక కట్టగడవారెల్ల గరుణించేరా ఇట్టే ఏమడిగిననీతడే యొసగుగాక ఉట్టిపడి ఎవ్వరైననూరడించేరా?" (*సంపుటం1. 210:40.*) అని స్వామికాక మనల్ని ఆదరించేవారు ఎవరైనా ఉన్నారా? అంటూ సమాజాన్ని అడిగారు. ఈ లోకాశలన్నీ తెగేంతవరకూ ఆ స్వామి ఉనికి మనకు అర్థం కాదు. కానీ కర్మఫలాలను ఇక్కడ అనుభవించాల్సిందే. 'చేసుకున్నవారికి చేసుకున్నంత' అని అన్నమయ్య భావించారు. ఏం చేసినా ప్రాణం ఉన్నంతవరకే అంటూ ఈ కింది కీర్తనలో తెలియజేశారు.

**వరాళి రాగం**

**పల్లవి**

"తనవారనియాసదగిలి భ్రమయనేల
తనువుబ్రాణునికంటె తగులేది

**చరణం:**

తనువు బ్రాణుడు రెండు తగిలి గర్భమునందు
ఒనరనేకమై ఉదయించి
దినములు చెల్లిన తివిరి యా ప్రాణుడు
తనువు విడిచిపోయె దయలేక." (*సంపుటం1.222:148.*)

ఈ కీర్తనలో అన్నమయ్య చాలా లోతైన అర్థాన్ని అందరికీ అర్థమయ్యే మాటల్లో చెప్పారు. ఈ లోకంలో దేనికైనా గడువు (expiry date.) ఉంటుంది. దాని పరిధిమేరకు

దానికి కేటాయించబడిన పనులు అది సక్రమంగా నిర్వర్తిస్తుంది. అలాగే దేవుడు కూడా ప్రాణులను ఈ లోకంలో జీవింపజేయడం వెనక ఒక అద్భుతమైన కారణం ఉంది. ఒక్కొక్క జీవిని ఒక్కొక్క పనికోసం సృష్టిస్తాడు. కొందరు ఆ కారణాలను తెలుసుకొని ఆ బాటలో నడిస్తే, మరికొందరు అవేవీ పట్టకుండా విచ్చలవిడిగా తిరగడం కద్దు. ఈ దేహంలో ప్రాణం ఉన్నంతవరకే ఏది చేయడానికైనా అవకాశం ఉంటుంది. కానీ ఒక్కసారి ప్రాణం దేహాన్ని విడిచిన తరువాత ఎంత చింతించినా ప్రయోజనం శూన్యం. ఈ లోకంలో మనం చేసే పనులను మనలోపలి అంతరాత్మ ఎప్పుడూ గమనిస్తుంటాడు. ఆ పని మంచిది కాకపోతే గద్దిస్తాడు. దాన్నే మనం 'సిక్స్త్ సెన్స్' (Sixth Sense) అంటాం. కొన్ని సందర్భాల్లో మంచి చెడుల విచక్షణ మనకు తెలియకపోవచ్చు. అందుకే ఆ స్వామిపై ఆధారపడి, ప్రతి పనిని ఆయనకు అప్పజెప్పి నిర్వహించడం మంచిదని అన్నమయ్య ఈ సమాజానికి హితం చెప్పారు.

"అన్నలంటా తమ్ములంటా" అనే సంకీర్తనలో "తెగనీక అప్పులెల్లా దీసి తీసి వారు తగిలిన బెట్టలేక దాగిదాగి వెగటున బారిపోగా వెంటవెంట పెక్కువగల నప్పులుగొన్నవారువో వీరు" (*సంపుటం1.224:149.*) అంటూ పారిపోయేకొద్ది విడవకుండా వెంటబడతారని అన్నమయ్య తెలియజేశారు. ఈ లోకంలో అందరూ అప్పులవారేనని ఆయన భావం. వారినుండి తప్పించుకున్నవారు ఘనులని చాలా సంకీర్తనల్లో చెప్పారు. ఇహసుఖాల జోలికి పోయి, అయ్యో! అని బాధపడే వారిని బురదలో కావాలని కాలు పెట్టి, తరువాత కడుక్కొనే అజ్ఞానితో పోల్చారు. అందుకే కర్మబంధాలను జయించాలనుకొనేవాడికి ముందు వెనకలు, తరతమ భేదాలు ఉండకూడదని, అందరినీ సమానంగా చూసినవారే ఆయన భక్తులుగా ఎంచబడతారని చెప్పారు. ఆయన భక్తులెప్పుడూ తాత్సారంగా ఉండకూడదని, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలని, ఎప్పుడూ స్వామిపై ఎరుక కలిగి ఉండాలని అన్నమయ్య ప్రజలతో జరిపిన సంభాషణల్లో తెలియజేశారు.

ఈ విధంగా మనుషులు ఉండాల్సిన రీతులను అన్నమయ్య వారితోనే సంభాషించారు. ఈ సంభాషణల్లో ఉపదేశం, హితం గోచరిస్తాయి.

### 3.3.2. పాప పుణ్యాల విశ్లేషణ

ఈ సంకీర్తనల్లోని సంభాషణల్లో పాప పుణ్యాలను సునిశితంగా పరిశీలించి, విశ్లేషించి, ప్రజలకు తెలియజేశారు అన్నమయ్య. ఏది పాపం? ఏది పుణ్యం? ఏయే చేష్టలవల్ల ఎలాంటి ఫలితాలు ఉత్పన్నమవుతాయి? వాటినుండి మనం ఎలా విముక్తులవ్వాలి? అనే అనేకమైన ప్రశ్నలకు సంకీర్తనా రూపంలో సమాధానం ఇచ్చారు. అలాంటి కీర్తనలను కింద ఇస్తున్నాను.

**ముఖారి రాగం**

**పల్లవి**

"అనుమానపు బ్రదుకది రోత
తన మనసెనయని కూటమి మరి రోత

**చరణం:**

అపకీర్తులబడి ఆడికే లోనై
అపవాదియౌట అదిరోత
ఉపమ గెలిచెనేనని ఒరుజెరుచుటలు
విపరీతపు గుణవిధమొక రోత." (*సంపుటం1.26:17.*)

ఈ సంభాషణలో అన్నమయ్య పల్లవిలోనే అనుమానపు బ్రతుకును రోత అని అసహ్యించుకున్నారు. తనవారిముందు తన గొప్పలు చెప్పుకోవడం, స్త్రీల ముందర వదరడం రోతగా పరిగణించారు. హరిని గతి అనుకోకుండా ఉంటూ, స్వామిని కొలువని మనస్సును రోతగా ఆయన భావించారు.

ఈ కింది కీర్తనలో జీవులు తాము చేసిన పాప పుణ్యాల ఫలితాలను అనుభవించాల్సిందేనని అన్నమయ్య తెలియజేశారు.

**సామంతం**

**పల్లవి**

"ఏమిసేయవచ్చు గర్మమిచ్చినంతే కాని లేదు
తాముసేసినంతనట్టు తమకు పోరాదు

**చరణం:**

ఇట్టునట్టు మిట్టిపడ్డ ఇంచుకంతా లేదు
వీపు బట్టగట్ట మోచి పాటువడ్డా లేదు
తట్టువడ లోకమెల్ల దవ్వుకొనినా లేదు
తెట్టదెరువున నోరు దెరచినా లేదు.” (*సంపుటం1.55:36.*)

ఈ సంభాషణలో అన్నమయ్య ప్రజలతో బహిరంగంగా మాట్లాడారు. తాము చేసిన కర్మల ఫలితం తప్పనిసరిగా అనుభవించాలని ఉద్బోధించారు. ‘అటూ ఇటూ తిరిగినా, వీపు బట్టకట్టేలా కష్టపడి మోసినా, నోరు తెరచినా ఫలితం శూన్యం. మహావీరుడైనా, అడవులు తిరిగి తపస్సు చేసినా, ఏంచేసినా శ్రీవేంకటేశ్వరుని కొలవకపోతే జీవులకు సుఖసౌఖ్యాలు ఉండ’వని ఈ సంభాషణలో తెలియజేశారు.

“ఎంత చదివిన నేమి వినిన” అనే సంకీర్తనలో “ఇతర దూషణములు యడసినగాక అతికాముకుడుగాని యప్పుడుగాక మతిచంచలముగొంత మానినగాక గతియేల కలుగు దుర్గతులేలమాను” (సంపుటం1.62:40.) ఇతరులను గురించి తీర్పు తీర్చేవారికి మోక్షప్రాప్తి కలగదని అన్నమయ్య చెప్పారు. ఎదుటివారికి తీర్పు తీర్చే ముందు తమ ప్రవర్తనలను గురించి ప్రతి ఒక్కరూ యోచించాలని ఆయన హితవు చెప్పారు.

ఈ కింది కీర్తనలో మనుషుల పాట్లను గురించి అన్నమయ్య సంభాషించారు.

**ఆహిరి రాగం**

**పల్లవి**

“అక్కడనా పాట్లుబడి ఇక్కడనీపాటువడి
కుక్కనోరి కళాసమై కొల్లబోయె బ్రదుకు

**చరణం:**

ఎండచేత నీడచేత నెల్లవాడునిట్లానే
బందుబండై యందు గడపలగానక
ఉండగిలి నరకాలనుడకబోయెదమింక
వంటదిరిగిన కూరవలెనాయె బ్రదుకు.” (*సంపుటం1.90:62.*)

అంటూ కర్మబంధాలపై తన నిరసనను అన్నమయ్య తెలియజేశారు. ఈ లోకాశలవెంట పోయే వారి బ్రతుకు కుక్క ఎంగిలితో, రోట్లో నలిగిన పిండితో, రుచీపచీ లేని కూరతో పోల్చారు. కుక్క తిన్న ఆహారాన్ని కక్కి, మళ్ళీ దాన్నే తింటుంది. అలాగే మనిషి కూడా తెలిసి, తప్పులు చేస్తాడు. రోటిలో నలిగిన పిండికి రూపం లేనట్టే, చెడిపోయిన కూర అరుచిగా ఉన్నట్టే కుక్క ఎంగిలి లాంటి మనస్సుకు కూడా రూపం ఉండదని ఆయన ఘాటుగా తన అభిప్రాయాన్ని తెలియజేశారు. ఈ కింది కీర్తనలో ఆత్మ మాలిన్యాన్ని గురించి అన్నమయ్య తెలిపారు.

**ఆహిరి**

**పల్లవి**

"ఏలసమకొను సుకృతమెల్లవారికి
మహామాలిన్యమున ఆత్మ మాసినదిగాన

**చరణం:**

కలికాల దోషంబు కడవరానిదిగాన
తలపు దురితములకాధారంబుగాన
బలుపూర్వ కర్మములు పట్టరానివిగాన
మలమూత్ర జన్మంబు మదకరముగాన." (*సంపుటం1.145:99.*)

ఈ సంభాషణలో మనిషి జన్మమే పాపంతో కూడుకొని ఉంటుందని అన్నమయ్య గ్రహించారు. అందుకని "ఏల సమకొను సుకృతమెల్లవారికి?" అనే సందేహంతో ఈ కీర్తనను మొదలుపెట్టారు. చెడుగుణాలు, మమతానురాగాలు, ఆశలు, హృదయ చంచలత్వం అన్నీ కలిసి మనుషులకు ఆత్మ మాలిన్యాన్ని కలుగజేస్తున్నాయని ఈ కీర్తనలోని సంభాషణ సారాంశం. అందుకే 'కొండో నుయ్యో కుమతులాలా' అనే సంకీర్తనలో "పోకుమని యాపరాదు పొమ్మని చెప్పగరాదు మీకు మీకే చూచుకొండు మీరే కనుదు" (*సంపుటం1.160:108.*) అంటూ ఎవరికి వారే ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు చెప్పారు.

**ఆహిరి రాగం**

**పల్లవి**

"మోహము విడుచుటే మోక్షమది

దేహమెరుగుటే తెలివీనదే

**చరణం:**

ననిచిన తన జన్మము గర్మము

దన పనియునెరుగుటే పరమమది

దనకు విధి నిషేధములు

బుణ్యముల ఘనత ఎరుగుటే కలిమియది.” (*సంపుటం1.263:176)*

‘ఈ లోకంలోకి వచ్చిన కారణాన్ని తెలిసి, తన పని తాను సక్రమంగా చేసుకోవడమే పరమోత్తమం. విధి, దాని పాట్లు ఎరిగి బ్రతకడం కలిమికి మూలం. తల్లిదండ్రులను బాగా చూసుకోకపోవడం, ఆచారాలు ధర్మాలు పాటించకపోవడాన్ని మించిన పాపం లేదు. కామభోగాలను నమ్మి తిరగడాన్ని మించిన నరకం లేదు. ఆ వేంకటేశు దాసుల సొమ్ముగా ఉండడాన్ని మించిన సుకృతం లే’దని అన్నమయ్య చెప్పారు. ఈ కీర్తనలో సమాజ హితాన్ని కాంక్షిస్తూనే మోక్షసాధనకు మనం ఏమేం చేయాలనే అంశాలను విశ్లేషించారు. ఈ లోకపు గుణాలను విడిచిపెట్టినవాడే ధీరుడు అనే భావాన్ని అన్నమయ్య చాలా సంకీర్తనల్లో చెప్పారు. “ఏచిన పరితాపాజ్ఞుల నేమియునొవ్వక వెడలిన ధీచతురుండతడెవ్వడు ధీరుండెవ్వడొకో” (సంపుటం1.229:153.) అంటూ ఆయన సమాజానికి సవాలు విసిరారు. అందుకే స్వామిని శరణు వేడుకోవాలని ప్రబోధించారు.

**లలితరాగం**

**పల్లవి**

“ఈ దేహవికారమునకు నేదియు గడపల గానము

మోదమెరంగని మోహము ముందరగననీదు

**చరణం:**

సతతానంద వికాసము సంధించదు తామసునకు

గతకల్మషభావము దొరకదు వ్యసనికిని

జితకాముడు దానవుట సిద్ధించదు దుష్కర్మికి

అతులిత గంభీరగుణం బలవడదధమునకు.” (*సంపుటం1.268:178.*)

ఈ కీర్తనలో అన్నమయ్య అనేక విషయాలను గురించి సమాజంతో సంభాషించారు. ‘నిత్యసుఖం బలహీనులకు ఒనగూడదు. లోభి సత్యాన్ని గురించి ఆలోచించడు. క్రూరుడు

నరహత్యను గురించిన కర్మాన్ని మనస్సులో పెట్టుకోడు. భ్రష్టులను పాపం ఎన్నటికీ వదలదు. ఇహలోకవిచారులకు స్వామిపై చింతన కలుగదు.' అంటూ అన్నమయ్య ఈ దేహంవల్ల కలిగే మోహాలకు ప్రాయశ్చిత్తం లేదని తెలియజేశారు. ఈ కింది కీర్తనలో పాప, పుణ్య ఫలితాలను ఇంకా బాగా విశ్లేషించారు.

**సాళంగ రాగం**

**పల్లవి**

"తనకర్మమెంత చేతయునంతే
గొనకొన్న పనియంత కూలీనంతే

**చరణం:**

శ్రీవేంకటపతి చింతయంత నేడే
భావపరవశము పలుకూనంతే
దైవము కృపయంత తానూనంతే
ఏ వంక జయమెంత ఇరవూనంతే." (*సంపుటం1.213:142.*)

ఈ కీర్తనలో చేసుకున్న వారికి చేసుకున్నంత పుణ్య ఫలితం ఉంటుందని అన్నమయ్య తెలిపారు. ఎలాగంటే 'పిండి ఎంతో రొట్టె అంతే. పని ఎంతో జీతం అంతే. బరువెంతో తూకం అంతే. మదిలో హరిని ఎంత తలిచేవారికి అంత సుఖం, అంత సంతోషం కలుగుతాయి. అందుకే ఆ స్వామిపై మనస్సు లగ్నం చేసుకొని ఎరుక కలిగి బ్రతకా'లని ప్రజలకు ఉద్బోధించారు.

**గుజ్జరి రాగం**

**పల్లవి**

"ఎక్కడిపాపములెక్కడి పుణ్యము
లొక్కట గెలిచితిమోహోనేము

**చరణం:**

ధనతరద్వయాధికారగు దేహికి
మిణుకుల భవభయమేలేదు
చనవుల హరిలాంఛన కాయమునకు
వెనుకొను కర్మపు వెట్టియులేదు." (*సంపుటం1.408:273.*)

ఈ కీర్తనలో శ్రీవేంకటేశ్వరుణ్ణి సేవించేవారికి కర్మ, పాపం, మోహం, చింత లాంటి ఐహిక విచారాలు ఉండవని అన్నమయ్య బోధించారు. అందుకే 'పాప పుణ్యాల రొంపిని మేము జయించా'మని ధీమాను వ్యక్తం చేశారు. కాబట్టి జనులు కూడా మోక్షానికి అనువైన మార్గాన్ని అనుసరించి, తద్వారా భగవత్ సాక్షాత్కారాన్ని పొందాలని ప్రజలతో సంభాషించిన తీరును ఇలాంటి కీర్తనల్లో చూడగలం.

ఈ విధంగా అన్నమాచార్యులు పాప పుణ్యాలను విశ్లేషించారు. వాటితోబాటు అనేక సత్యాలను, హితాన్ని ఈ సంకీర్తనల్లో పేర్కొన్నారు.

## 3.3.3. పాదస్మరణ

ఈ కీర్తనల్లో పాదస్మరణ వైశిష్ట్యాన్ని గురించి ప్రజలతో సంభాషించారు. తిరుమలలో శ్రీవారి పాదాలకు ఒక విశిష్ట స్థానం ఉంది. నేటికి ప్రజలు శ్రీవారి పాదాలను దర్శించుకుంటున్నారు. అంత పవిత్రమైన స్వామి పాదాలను అనేకవిధాలుగా అన్నమయ్య వర్ణించారు.

**శ్రీరాగం**

**పల్లవి**

"ఈ పాదమేకదా ఇల ఎల్లగొలచినది.
ఈ పాదమేకదా ఇందిరా హస్తములకితవైనది

**చరణం:**

ఈ పాదమేకదా ఇందరును మొక్కెడిది
ఈ పాదమేకదా ఈ గగనగంగ పుట్టినది
ఈ పాదమేకదా ఎలమి పెంపొందినది
ఈ పాదమేకదా ఇన్నిటికినీ ఎక్కుడైనది." (*సంపుటం1.66:44.*)

ఈ కీర్తనలో లక్ష్మీదేవి చేతుల్లోని స్వామి పాదాలనుంచి మొదలుపెట్టి అనేక పురాణాంశాలను అన్నమయ్య ప్రస్తావించారు. 'అందరూ మొక్కేది, గజేంద్రుడు తలచింది, ఇంద్రాది దేవతలు వెదకింది ఈ పాదాలనే. ఈ పాదాలు గంగ పుట్టుకకు కారణభూతమయ్యాయి. అహల్యను శాపంనుండి విడిపించాయి. బలిచక్రవర్తికి మోక్షాన్ని

ఇచ్చాయి. అందుకే బ్రహ్మ భక్తితో ఈ పాదాలను కడిగా'డని అన్నమయ్య ప్రజలకు తెలిపారు. ఇంచుమించు ఇవే అంశాలను ఇంకొక కీర్తనలో తెలియజేశారు.

**ముఖారి రాగం**

**పల్లవి**

"బ్రహ్మ కడిగిన పాదము

బ్రహ్మము తానెని పాదము

**చరణం:**

చెలగి వసుధ గొలిచిన నీ పాదము

బలితల మోపిన పాదము

తలకక గగనము తన్నిన పాదము

బలరిపుగాచిన పాదము." (*సంపుటం1.191:128.*)

ఈ కీర్తనలో కాళీయమర్దనఘట్టం, అహల్యా శాప విమోచన ఘట్టాలను అర్థవంతంగా ప్రజలకు వివరించారు. పరమయోగులకు మోక్షాన్ని ఇచ్చే శ్రీ వేంకటేశ్వరుని పాదం తిరుమలలో భక్తుల దర్శనార్థమై కొలువై ఉందని అన్నమయ్య ప్రజలకు తెలియజెప్పారు. ఈ కీర్తనలో "ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము" అని చక్కనితెలుగులో ప్రజలకు అర్థమయ్యే భాషలో సంభాషించారు.

ఈ విధంగా స్వామివారి పాదాల విశిష్టతను, గొప్పదనాన్ని గురించి ప్రజలతో సంభాషించారు.

## 3.3.4. రాజులు, అధికారులపై నిరసన

ఈ కీర్తనల్లో రాజుల, అధికారుల అజమాయిషీని నిరసించారు. సర్వాధికారి శ్రీ వేంకటేశ్వరుడు కాబట్టి అందరూ ఆయన అధికారాలకు బద్ధులై ఉండాలనేది ఈ కీర్తనల్లోని సారాంశం. ఈ కింది కీర్తనలో అధికారులను నిరసిస్తూ ప్రజలతో సంభాషించారు.

**సామంతం**

**పల్లవి**

"మనుజుడై పుట్టి మనుజుని సేవించి

అనుదినములను దుఃఖమందనేలా

**చరణం:**

జుట్టెడు కడుపుకై చొరనిచోట్ల జొచ్చి

పట్టెడు కూటికై బతిమాలి

పుట్టిన చోటికే పొరలి మనసుబెట్టి

వట్టిలంపటము వదలనేరడుగాన.

**చరణం:**

అందరిలోబుట్టి అందరిలోబెరి

గందరి రూపములటుదానై

అందమైన శ్రీవెంకటాద్రీశు సేవించి

అందరాని పదమందెనటుగాన." (*సంపుటం1.96:131.)*

'మనుషులను ఆశ్రయించడంకంటే స్వామిని ఆశ్రయిస్తే మోక్షపథం దక్కుతుంది. అంతేగానీ పొట్ట కూటికోసం తిరగరానిచోట్లు తిరిగితే దుఃఖం తప్ప మరేమీ ప్రయోజనంకలగ'దని అన్నమయ్య ప్రజలకు ఉద్బోధించారు.

**నాటరాగం**

**పల్లవి**

"లంకెలూడుటే లాభము ఈ

కింకరులను నలగెడికంటెను

**చరణం:**

జంపులజంపక సరుగన బాసేటి

లంపటమేపో లాభము

కంప మోపుతో గనలి శరీరపు

కొంపలోన వేగుటకంటెను." (*సంపుటం1.97:131.*)

ఈ కీర్తనలో లంకె అనే పదానికి 'దురాశ' అనే అర్థాన్ని అన్నమయ్య వాడారు. ఆ రోజుల్లో లంకెబిందెలు సంపదను, కష్టాలను కూడా ఇస్తాయని ప్రజల్లో కొన్ని కథలు ప్రచారంలో ఉండేవి. ముఖ్యంగా లంకెబిందెల్లోని బంగారాన్ని కాపాడడం తలకు మించిన భారంగా ఆ నాటి ప్రజలు భావించేవారు. అలాంటి లంకెబంధాలనుండి విముక్తం కావాలని అన్నమయ్య ప్రబోధించారు. లంకెబిందెల్లాంటి సంపద రాజాశ్రయాలవల్ల కలుగుతుందని,

అలాంటి సంపదలవల్ల హాని కలగడం తప్ప మరే ప్రయోజనం లేదని అన్నమయ్య భావించారు. అందుకే ఆయన రాజులు, అధికారుల దాష్టీకాలను తెలియజేసేందుకు కాబోలు యమకింకరులు అనే అర్థంలో 'కింకరులు' అనే పదాన్ని వాడారు. ఈ లోకం ఏవగింతలతో కూడుకున్న నరక కూపమని, అడ్డమైన గడ్డి తిని పాపకూపాలలో పడడంకంటే వేంకటేశ్వరునిదాసుల కృప లవలేశమైనా ఉండడం లాభమని ఎంచారు. అందుకే రాజులతో, అధికారులతో చనువుగా ఉంటే కలిగే నష్టాలను "నరపతి చనువెంత నగవూనంతే." (*సంపుటం1.213: 142.)* అన్నారు. కాబట్టి రాజులు, అధికారులు వారికి నచ్చితే తలపై మోస్తారు. నచ్చకపోతే హింసలకు గురి చేస్తారని అన్నమయ్య తానే స్వయంగా అనుభవించి, తెలిపారు.

## 3.3.5. స్త్రీలపై నిరసన

అన్నమయ్య స్త్రీలపై కూడా నిరసన తెలియజేశారు. 'భార్యల రూపంలో వచ్చి, మేము స్వామిని చేరలేకపోవడానికి కారణమవుతున్నా'రని కింది కీర్తనలో తెలియజేశారు.

**సామంతం**

**పల్లవి**

"చక్కదనముల వాసతులాలా
ఇక్కువతెక్కువ మీరేమిసేసేరికను

**చరణం:**

పంచమహాపాతకాల బారి దోసి మా సిగ్గులు
లంచముగొంటిరిగా నెలతలాలా
వంచనతోడుత హరివారమైతిమిక మీ
ఇంచుక గుట్టుల మీరెందు చొచ్చేరికను" (*సంపుటం1.103:71.*)

'నరకాన్ని మాకు కానుకగా ఇచ్చి, మా నుండి పాపఫలితం అనే పన్ను కట్టించుకుంటున్నారు. పంచమహాపాతకాలనే మహా భయంకరమైన పాపాల్లో మమ్మల్ని తోసేస్తూ, మాకు సిగ్గు అనే లంచం ఇస్తున్నారు. మోక్షం అనే గుట్టును మానుండి దొంగిలించారు. అందుకే మేము వేంకటేశుదాసులమై, మీ మోసాల్ని, మోహాన్ని జయించేందుకు మార్గాన్ని

ఏర్పరచుకున్నా'మని అన్నమయ్య ఈ కీర్తనలో స్త్రీలను అసహ్యించుకున్నారు. ఈ కింది కీర్తనలో స్త్రీలపై వ్యామోహాన్ని అన్నమయ్య నిరసించారు.

**వరాళి రాగం**

**పల్లవి**

"ఎచ్చోటికేగిన ఎప్పుడూ తమలోని
మచ్చిక పెనుదెగులు మానకపోయె

**చరణం:**

అతివల మోహపుటధరామృతములు
ఇతవుగ నోరికందియ్యగను
అతిమోహమే ఘనమాయెగాని లోని
మతకరి పెనుదెవులు మానకపోయె." (*సంపుటం1.273:183.*)

పై కీర్తనలో 'అంతా మనిషికి ఆ దేవుడిచ్చిన పెద్ద తెగులు' అన్నారు అన్నమాచార్యులు. స్త్రీల స్తనాలను ఒత్తడం, అధరాల చుంబనం, మెత్తని పరుపులాంటి దేహంతో సంభోగం ఇవన్నీ లోపలి మోహానికి కారణాలు. ఈ మోహాన్ని మదపుటేనుగుతో పోల్చారు. మనస్సులోపలి కోరిక, మోసం అనే 'మతకరి'ని జయించాలని ప్రబోధించారు. ఇదంతా ఆ స్వామి కల్పించిన మాయ. ఆ మాయలోనుంచి బయటపడాలంటే స్వామి కృపాకటాక్షాలు మనపై ఉండాలని అన్నమయ్య బాహ్యంగానే ప్రజలకు ఉద్బోధించారు. ఒక డాక్టర్ తన లాభంకోసం ఒక రోగాన్ని సృష్టించి, మందు కూడా తానే ఇచ్చిన రీతిగా స్వామి ఈ మోహాశలను సృష్టించి, వాటినుండి విముక్తి కావడానికి తానే మార్గం చూపించారని అన్నమయ్య తెలియజేశారు. మంచి విలువ తెలియాలంటే చెడు ఉండాలి. చీకటి ఉన్నప్పుడే వెలుగు విలువ తెలుస్తుంది. కాబట్టి లోకపాశాలు ఉన్నప్పుడే మోక్షంవిలువ తెలుస్తుందని ప్రకటించారు. ఈ ప్రతిపాదన ఆత్మగతంగా హర్షనీయం. ఈ సంభాషణలవల్ల ఆ నాటి సమాజంలోని వారు స్త్రీలను ఒక భోగపు వస్తువుగానే చూశారని మనకు అర్థమవుతుంది. సాహిత్యం కూడా శృంగారాత్మకంగానే వెలువడిందని వేరే చెప్పనక్కరలేదు. ఇలాంటి సాహిత్యాన్ని ఆయన నిరసించారు కానీ స్త్రీలపై వ్యతిరేకత చూపలేదు. కనుకనే ఆయన సమాజంలోని లోటుపాట్లను చాలా తెగువతో ప్రతిఘటించారు. ఈ కింది కీర్తనలో అంతా స్వామి కల్పించిన మాయగా అన్నమయ్య పేర్కొన్నారు.

**ముఖారి రాగం**

**పల్లవి**

"ఇందిరాపతి మాయలు ఇంతులు సుండీ
మందలించి హరిగొల్చి మనుదురుగానీ

**చరణం:**

అతివల చూపులే ఆయాలు దాకీజుండీ
జితమైన పులకల జిల్లులౌ జుండీ
రతిపరవశములు రాగిన మూర్ఛలు సుండీ
మతిలో దప్పించుక మనుదురుగాని." (*సంపుటం1.494:331.*)

ఈ కీర్తనలో స్త్రీలను స్వామి మాయలుగా అన్నమయ్య పేర్కొన్నారు. స్త్రీల అందచందాలను చూసి, మోసపోవద్దని ఆయన భావం. 'స్త్రీల చూపులు, రతిసౌఖ్యం, ముఖం, స్తనాలు ఇవన్నీ తాత్కాలిక ఆనందాలను ఇస్తాయి. శృంగారం దైవ సృష్టి. అంతేగానీ దాని యావలో పడి అసలైన పనిని నిర్లక్ష్యం చేయకూడ'దని బోధించారు. ఈ కీర్తనలో స్త్రీలపట్ల జాగ్రత్తగా ఉండమని చెప్పారు. అంటే ఆయన స్త్రీలను వ్యతిరేకించలేదు. సంసారంవల్ల, స్త్రీలవల్ల కలిగే దుష్పరిణామాలను మాత్రమే వ్యతిరేకించారు. వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్య హితబోధ చేశారు.

ఇలా ఈ సంభాషణల్లో ఎన్నో సత్యాలను ప్రజలకు తెలియజేశారు.

## 3.3.6. ఉపదేశాత్మక సంభాషణలు

ఈ సంభాషణల్లో అన్నమయ్య ప్రజలకు మంచి మార్గాన్ని ఉపదేశించారు. మంచి చెడుల మధ్య భేదాలను సమాజానికి పూసగుచ్చినట్లు తెలియజేశారు. ఆ నాటి కవులు, వాగ్గేయకారులు రాజులను, అధికారులను ఆశ్రయించి, భరణాలు పొందారు. కానీ అన్నమయ్య ప్రజలతో ఉంటూ, ప్రజల నడవడిని సరిజేశారు. అందుకే ఆయన రాజకవిగా కాకుండా ప్రజాకవిగా గుర్తింపు పొందారు. ఈ ఉపదేశాత్మక సంకీర్తనల్లో స్వామిని ప్రసన్నం చేసుకోవడం, మోక్షపథాన్ని పొందడం గురించి ఉపదేశించారు. అలాంటి సంకీర్తనలను కింద ఇస్తున్నాను.

### సామంత రాగం

**పల్లవి**

"కొండలలో నెలకొన్న కోనేటి రాయడువాడు

కొండలంత వరముల గుప్పెడు వాడు

**చరణం:**

కుమ్మర దాసుడైన కురువరతినంబీ

ఇమ్మన్న వరములెల్ల నిచ్చిన వాడు

దొమ్ములు సేసినయట్టి తొండమాన్ జెక్కురవర్తి

రమ్మన్న చోటికి వచ్చీ నమ్మీనవాడు." (*సంపుటం1.151:103.*)

ఈ కీర్తనలో అన్నమయ్య కొన్ని సంఘటనలను గుర్తు చేశారు. స్వామిని నిరంతరం సేవించే కుమ్మరి అయిన నంబీ అనే భక్తుడు కుండలు చేయడంవల్ల ఆలస్యమై తిరుమలకు వెళ్ళేందుకు సమయంలేక మట్టిపూలతో సేవించాడు. తిరుమలలోని స్వామి పాదాలపై మట్టిపూలను చూసి తక్కిన భక్తులు ఆశ్చర్యపోయారు. తనపై దొమ్మి చేసిన తొండమాన్ చక్రవర్తిని స్వామి కరుణించాడు. అనంతాళ్వారు చేసిన పూజల్ని గైకొన్నాడు. నంబితో నిత్యం మాట్లాడాడు. కంచిలో నివసించే తిరుకచ్చినంబిని తిరుమలకు రప్పించి తరింపజేశాడు. అలాంటివాడైన స్వామి ఉండగా మనకు కొదవ లేదని, మనల్ని కాపాడతాడని ప్రజలకు భరోసా ఇచ్చారు. అలా కాకుండా ఇతరాలపై లగ్నం చేసేవారు కొందరుంటారు. వారికి ఎంత చెప్పినా, ఏమి చేసినా మార్పుకు మొగ్గు చూపరు. అలాంటివారిని మందలిస్తూ అన్నమయ్య విచారించాల్సిన అంశాలను గురించి కింది కీర్తనలో చెప్పారు.

### శ్రీరాగం

**పల్లవి**

"కూడువండుట గంజికొరకా తనకు

వేడుకలుగల సుఖము వెదకుటకుగాక

**చరణం:**

కుప్పనరచుట కసవుకొరకా తన తనువు

గొప్పయౌటిది మదము కొరకా

ఒప్పైన వేడుకలనొరసీ మనసు

నెప్పునకు రాదివియ నేరవలెగాక." (*సంపుటం1.115:79.)*

'అన్నం ఆకలి తీర్చుకోడానికే తప్ప గంజికోసం వండం. కళ్ళంలో కుప్ప నూర్చి వడ్లు తీస్తాం. నూర్చడం వడ్ల కోసమేగాని కసువు (గడ్డి) కోసం చేసేందుకు కాదు అలాగే మనిషి శరీరం మదం కోసం కాదు. మంచి కోసం కాబట్టి వడ్లను పొట్టుకోసం దంచం. అలాగే మనిషికి సుఖదుఃఖాల మధ్య తేడా తెలియాలి. మనస్సు అనే కొండ తవ్వి, లోపం అనే ఎలుకను పట్టుకోవాలి. ఆ కొండ ఎక్కి స్వామిని సేవించడానికి మార్గం వేసుకోవాలి.' అంటూ అనేక జీవిత సత్యాలను అన్నమయ్య తెలియజేశారు. ఈ కీర్తన రాసే నాటికే తిరుమలలో భక్తుల కోలాహలం పెరిగిందని, తిరుమల రహదారి ప్రజలకు అనుగుణంగా తయారు చేసేందుకు పాలకులు పూనుకున్నారని అర్థమవుతోంది.

**ముఖారి రాగం**

**పల్లవి**

"ఆకటివేళల నలపైన వేళల
తేకువ హరినామమే దిక్కు మరి లేదు

**చరణం:**

సంకెళబెట్టినవేళ చంపబిలిచినవేళ
అంకిలిగా నప్పులవారాగిన వేళ
వేంకటేశు నామమే విడిపించ గతిగాక
మంకుబుద్ధి బొరలిన మరి లేదు తెరగు." (సంపుటం1.158:107.)

ఈ కీర్తనలో మానవాళిని స్వామే ఆదరించాలి తప్ప వేరే దారి లేదు అని అన్నమయ్య చెప్పారు. కొరమాలి ఉన్నప్పుడు, కులం చెడినప్పుడు, ఇతరుల చెరలో చిక్కుకున్నప్పుడు, ఆపదలు అగచాట్లలో ఉన్నప్పుడు, పాపాలతో భయపడినప్పుడు, సంకెళ్ళు వేసి, చంపడానికి పిలిచినప్పుడు, అప్పులవారు దొమ్మీగా మీదపడ్డప్పుడు ఇలా ఏ సమస్య అయినా ఆయనే దిక్కు అని అన్నమయ్య తెలియజేశారు. ఈ కీర్తనలో 'మంకుబుద్ధి బొరలిన మరిలేదు తెరగు' అంటూ మనిషి మొండిగా ప్రవర్తించకుండా స్వామిని శరణువేడాలని సమాజానికి ఉపదేశించారు.

ఈ కీర్తనను నరసింగరాయలు అన్నమయ్యను సంకెళ్ళపాలు చేసినప్పుడు రచించారు. ఈ పైన పేర్కొన్న చరణం పాడగానే సంకెళ్ళు విడిపోయాయట. నరసింగరాయలు తన

తప్పుకు పశ్చాత్తాపం చెంది, అన్నమయ్య శిష్యుడిగా మారాడని ఒక ఐతిహ్యం. పాటకు అంత శక్తి ఉంది. సంగీతానికి రాళ్ళు కరిగుతాయనేది ఎంత నిజమో, అన్నమయ్య పాడగానే సంకెళ్ళు విడిపోయాయన్నది కూడా అంతే నిజం.

"చాలదా హరిసంకీర్తనంగల మేలిది దీననే మెరిసిరి ఘనులు" అనే సంకీర్తనలో మునులు ఆయనను పూజించి ఎలాంటి ఉచ్ఛదశకు చేరుకున్నారో వివరించారు. "ప్రతిలేని మహిమ బార్వతి మతిదలపుచు హరిమంత్రమె పేర్కొని సతతము హరులో సగమై నిలిచే" (*సంపుటం1.205:136.*) అంటూ పార్వతి కూడా హరినామాన్ని తలచడంవల్లే శివునిలో సగమై నిలిచిందని అన్నమయ్య శివ కేశవుల అభేదాన్ని చెప్పారు. ఆయనను మనస్సుతో సేవించి పూజిస్తే ఉన్నత పథాలు పొందుతారని "మనసులోనిపుడైన మరిగి కొలిచినవారు ఘనులవుటకిదియె నిక్కపు గురుతుకాదా!" (*సంపుటం1.404:271.*) అందుకు మనస్సే సాక్ష్యమని చెప్పారు.

మనిషి ఇతరుల్లో పరమాత్మను చూడాలని అన్నమయ్య ప్రబోధించారు. వేదశాస్త్రాలను చదువుతూ, ఆ శాస్త్రపు ఎరుక కలిగి ఉండాలని, వేదవేత్తలను సేవించి, సత్కర్మలను ఆచరించాలని "కాదనక పుణ్య సత్కర్మిగావలెనుండే" (*సంపుటం1.301:201.*) అన్నారు. ఈ లోకపు ఆశలపై గురి పెట్టినప్పటికీ ప్రయోజనం శూన్యం. ఇవన్నీ చేసుకుంటూ పోతే ఆ దేవునికి నీ సమయం ఎప్పుడిస్తావు? ఆ వైభవాన్ని కళ్ళారా, మనస్సారా ఎప్పుడు చూస్తావు? "శ్రీవేంకటేశునిజేరి తక్కిన సుఖమేవగించు కాలమెన్నడు? శ్రీవల్లభుని కృపదలచి జీవుడీ వైభవము గాన్చుటెన్నడు?" అని మానవాళిని ప్రశ్నించారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలని హితవు పలికారు. అన్నింటికీ కర్తైన స్వామిని ఆశ్రయిస్తే ఇవన్నీ సాధ్యపడతాయని "యెలమి నిందరికి గర్త ఇదివో శ్రీవేంకటాద్రి నిలయపు హరి ఇంతే నేడే కొలువరో" అని అన్నమయ్య తెలిపారు. ఆయనే ఆది అంతం అని "ఆద్యుడచలుడు మహాభూతమితడభేద్యు డసాధ్యుడు భీకరుడు" (*సంపుటం1.317:212.*) అని ఆ స్వామి రూపాన్ని ఆవిష్కరించారు. కింది కీర్తనలో స్వామి నామాన్ని ఒక ఔషధంలా భావించారు.

**భూపాళ రాగం**

**పల్లవి**

"అలరనుతించరో హరిని
యలయించి మిము భ్రమియించీనీ గాలము

**చరణం:**

కనరో వేంకటపతి గన్నులు గనియగ
వినరో ఈతని స్తుతి వీనుల నిండా
మనరో శ్రీహరి చేతి మన్ననలు మీరు
తన మీది మది బుద్ధి దాచీని గాలము." (*సంపుటం1.338:226.*)

ఈ కీర్తనలో హరినామాన్ని నుతించడం ద్వారా కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య చెప్పారు. ఎందుకంటే దేహం అశాశ్వతమైంది. కనుక స్వామిని గురించి ఆలోచించాలి. హరికథల్ని వింటూ ఉంటే శుభాలు కలుగుతాయి. కాబట్టి కాలాన్ని వృథా చేయకుండా ఆయననే చూడాలి, ఆయన కథలే వినాలి, ఆయనచేత మన్ననలు పొందాలి. అంటూ ప్రజలకు హితబోధ చేశారు.

**దేశాక్షి రాగం**

**పల్లవి**

"వేదవేద్యులు వెదకేటి మందు
ఆదినంత్యములేని ఆ మందు

**చరణం:**

కదిసిన జన్మ రోగముల నెల్లవారు
కదలలేక ఉండగాను
అదన శ్రీ తిరువేంకటాద్రి మీది మందు
అదివో మా గురుడిచ్చెనా మందు." (*సంపుటం1.2:1.*)

'రోగాలు తగ్గించుకుందుకు అడవి మూలికలు, కషాయాలు, రసాలు, తైలాలు అంటూ రకరకాలు కొంటారు. కానీ జన్మ రోగాలకు మందు ఆ స్వామే'నని అన్నమయ్య చెప్పారు.

## **శంకరాభరణం**

**పల్లవి**

"కొనరో కొనరో మీరు కూరిమి మందు
ఉనికి మనికికెల్ల నొక్కటే మందు

**చరణం:**

అజునకు బరమాయువై యొసగిన మందు
నిజమై లోకములెల్ల నిండిన మందు
త్రిజగములు నెరగ తిరువేంకటాద్రిపై
ధ్వజమెత్తి గోనేటి దరినున్న మందు." (*సంపుటం1.237:159.*)

'ధ్రువుడు, ప్రహ్లాదుడు, నారదుడు, జనకాది రాజులు, అజుడు మొదలైన వారు ఆ మందును సేవించి బ్రతికారు. వారిని అనుసరించి మనం కూడా మోక్షాన్ని సంపాదించుకోవా'లని అన్నమయ్య తెలియజేశారు.

## **దేశాక్షి రాగం**

**పల్లవి**

"సకల జీవులకెల్ల సంజీవి ఈ మందు
వెకలులై ఇందరు సేవించరో ఈ మందు

**చరణం:**

మూదులోకములొక్కట ముంచి పెరిగినది
పోడిమి నల్లని కాంతి బొదలినది
వేడుక కొమ్ములు నాలుగు పెనచి చెయ్యివారినది
నాడే శేషగిరిమీద నాటుకొన్న మందు." (*సంపుటం1.468:314.*)

'తిరుమలలో వెలసిన ఈ మందు మూడు లోకాల్లోని జలంలో మునిగి, పెరిగింది. శేషణ్ణి పడకగా చేసుకుంది. బ్రహ్మాది దేవతల్ని అవతరింపజేసింది. వేదశాస్త్రాలకు పటుత్వం అనే పరిమళం అద్దింది. ఆంజనేయుడికి నామస్మరణ రూపంలో ఉపయోగపడింది. శంఖచక్రాలతో అలరారే ఈ మందు తిరుమలగిరిలో వెలసింది. కాబట్టి జనులు దీన్ని సేవించి పుణ్యులు కావా'లని అన్నమయ్య ఈ కీర్తనలోని సంభాషణలో కోరుకున్నారు. పై కీర్తనల్లో స్వామిని మందుగా గ్రహించాలని చెప్పారు.

ఈ విధంగా అన్నమయ్య సమాజానికి ఉపదేశం ఇచ్చారు. ఇందులో స్వామిని ఏ విధంగా, ఏ రూపంలో కొలవాలి? ఆయన ఉనికి ఏంటి? మొదలైన అనేక ప్రశ్నలకు తన సంకీర్తనల ద్వారా సమాధానం ఇచ్చారు.

## 3.3.7. నామ సంకీర్తనౌచిత్యం

ఈ విభాగంలో అన్నమయ్య వేంకటేశ్వరుని నామ ప్రాధాన్యాన్ని తెలియజేశారు. భక్తులకు భగవంతుని నామోచ్చారణ చాలా ముఖ్యమైంది. కేవలం ఆ నామాన్ని స్మరించి, ఉత్తమ గతుల్ని పొందవచ్చని తెలియజేశారు. అలాంటి కీర్తనలను కింద ఇస్తున్నాను.

**శ్రీ రాగం**

**పల్లవి**

“చాలదా హరినామ సౌఖ్యామృతము దమకు
చాలదా హితవైన చవులొల్ల నొసగా

**చరణం:**

ఇదియొకటి హరినామ మింతైన చాలదా
చెదరకీ జన్మముల చెరలు విడిపించ
మదినొకటె హరినామ మంత్రమది చాలదా
పదివేలు నరకకూపముల వెడలించ.” *(సంపుటం1.52:34.)*

ఈ సంభాషణలో అన్నమయ్య హరినామమే సుఖమైన అమృతమని తెలిపారు. జన్మచరలనుండి విడిపించేందుకు, నరక కూపాలనుండి బయట పడవేసేందుకు, దారిద్ర్య దోషాలను చెరిపేందుకు, చీకటిని పారదోలేందుకు హరినామం దీపంలా, మంత్రంలా పనిచేస్తుందంటూ, వేంకటేశుని దాసుల కరుణ చాలని తెలియజేశారు.

సంకీర్తనం గొప్పదనాన్ని గురించి చెప్తూ “తగువేంకటేశు కీర్తనమొకటి చాలదా జగములో కల్ప భూజమువలెనుండ” అన్నారు. ఈ కింది కీర్తనలో సంకీర్తన గొప్పదనాన్ని గురించి అన్నమయ్య తెలియజేశారు.

## సామంత రాగం

**పల్లవి**

"చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు
జాలెల్ల నడగించు సంకీర్తనం

**చరణం:**

సామజము గాచ్చినది సంకీర్తనం
సామమునకెక్కుడీ సంకీర్తనం
సామీప్యమిందరికి సంకీర్తనం
సామాన్యమా విష్ణు సంకీర్తనం

**చరణం:**

సరవి సంపదలిచ్చు సంకీర్తనం
సరిలేనిదిదియెపో సంకీర్తనం
సరుస వేంకటవిభుని సంకీర్తనం
సరుగనను దలచుడీ సంకీర్తనం." (*సంపుటం1.343:229.*)

'సంకీర్తన అనేది సంతాపాలను పోగొట్టి, సంతోషాన్ని కలిగిస్తుంది. ఈ ప్రపంచంలోని జీవజాలాన్ని రక్షిస్తుంది. మంచి బుద్ధి కలిగిస్తుంది. సౌఖ్యాన్ని ఇస్తుంది. అందుకే నిత్యం బ్రహ్మాది దేవతలు, మహామునులు సంకీర్తనం చేస్తూ ఉంటారు. గజేంద్రుడు సంకీర్తనం చేసి, మకరం నుండి విముక్తుడయ్యాడు. సంకీర్తనం అనేది అందరికీ సమీపంలో ఉంటుంది. కానీ విష్ణు సంకీర్తనం చేయడం అంత సామాన్యం కాదు. ఇది సర్వ సంపదలను ఇస్తుంది. కాబట్టి జాగు చేయకుండా ఈ సంకీర్తనలను మానవాళి పాడుకొని హరి కృపకు పాత్రులు కావా'లని అన్నమయ్య సమాజంతో పలికారు.

## లలిత రాగం

**పల్లవి**

"సకల సంగ్రహము సకల సుకృతము
ఆకృత సుకృతమిదె హరినామం

**చరణం:**

సకల వేదశాస్త్రముల సారమిది

సకల మంత్ర రాజంబునిది

సకల పురాణ రసముల మధురమిది

అకుటిల పావనం హరినామం.” (*సంపుటం1.349:232.*)

హరినామ ఔచిత్యాన్ని అన్నమయ్య పై కీర్తనలో నుడివారు. ‘వేదాల సారం, మంత్ర రాజం, పురాణ రసాల మధురం, తత్త్వ శాస్త్రాల సంశయ ఖండనం, కర్మ నిశ్చయం, విధికి ప్రధాన రహస్యం వంటివి హరినామంతో అలవడతాయి. ఈ నామం మనస్సులోని ధనం. అందుకే దేవతలందరూ ఈ నామాన్ని కొలిచి, తరించి, అత్యున్నతమైన ఆనందాన్ని పొందుతా’రని చెప్పారు. ఈ నామం తప్ప వేరే వాటిని మనం ఆశ్రయించనవసరం లేదని అన్నమయ్య కింది కీర్తనలో చెప్పారు.

**ముఖారి రాగం**

**పల్లవి**

“వెడమంత్రమికనేల వేరు వెల్లంకులునేల

పుడమిధరుడు మాకు భువనౌషధము

**చరణం:**

గోవిందాయని యంటే గూడును సంపదలు

ఈవల మాధవయంటే ఇహము బరము జేరు

దేవ నారాయణ యంటే దేహము సుఖియై యుండు

శ్రీవేంకటేశుడే మాకు సిద్ధౌషధము.” (*సంపుటం1.461:309.*)

ఈ కీర్తనలో పుడమిధరుడు, హరి, అచ్యుతుడు, నరసింహుడు, పురుషోత్తముడు, వాసుదేవుడు, కృష్ణుడు, సతీశుడు, గోవిందుడు, మాధవుడు, నారాయణుడు, వేంకటేశుడు అనే 11 నామాలను అన్నమయ్య పేర్కొన్నారు. ఈ నామాలు మానవాళికి పరమ దివ్యౌషధాలని, ఇతరాలను తలచుకోనక్కర లేదని తన ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఇలా ఈ సంభాషణల్లో అన్నమయ్య నామ ఘనతను, సంకీర్తన ఔచిత్యాన్ని తెలియజేశారు.

## 3.3.8. తిరుమల వర్ణనలు

ఈ విభాగంలో తిరుమల, దాని పరిసర ప్రాంతాలకు సంబంధించిన పుణ్యక్షేత్రాలు, స్థలాలు, వనాలు మొదలైనవాటన్నింటినీ వర్ణించారు. ఈ వర్ణనలు తిరుమల వైభవాన్ని,

ప్రకృతి రామణీయకతను తెలియజేస్తున్నాయి. దేవదేవుడు కొలువుండే ఆ క్షేత్రం చుట్టుపట్ల ఎందరో మునులు, ఋషులు, దేవతలు సంచరిస్తున్నారని ఈ కీర్తనలలో అన్నమయ్య తెలియజేశారు. ఆ కీర్తనలను కింద ఇస్తున్నాను.

**ఆహిరి రాగం**

**పల్లవి**

"తోరణములే దోవెల్లా
మూరట బారట ముంచిన లతల

**చరణం:**

వింజామరులును విసనకర్రలును
గొంజెగొడుగులే కొండెల్లా
అంజనగిరిరాయడు వేంకటపతి
సంజీవని పరుషల కొదవగను." (*సంపుటం1.119:82.*)

'పచ్చని చెట్లనిండా పూలు, లతలు, పళ్ళతో తిరుమలంతా స్వామికి తోరణం కట్టినట్లుంది. దారిపొడవున మఠాలు, గోపురాలు, ఎత్తైన వెదురు చెట్లు తిరుమలకు శోభను కలిగిస్తున్నాయి. కోయిలలు, నెమళ్ళు, వరుసలు కట్టి పాడుతున్నాయి. తిరుమల కొండంతా వ్యాపించి ఉన్న పెద్దపెద్ద చెట్లు గొడుగుల్లా భాసిస్తున్నాయి. అన్నింటికంటే ముఖ్యమైంది ఇక్కడ సంజీవని అనే వెంకటేశ్వరౌషధం. అది అందరి ఊపిరుల్లో కలిసిపోతోం'దని అన్నమయ్య తిరుమలలోని ప్రకృతి సౌందర్యాన్ని, కొండల అందాలను, ప్రాణ వాయువును, అడవుల రామణీయకతను అత్యద్భుతంగా వర్ణించి, ప్రజలకు తెలియజెప్పారు.

పై కీర్తన తిరుమల ప్రాంత శోభను, ఘనతను తెలియజేయగా కింది కీర్తన తిరుపతి, దాని పరిసరాల్లో ఉండే తక్కిన క్షేత్రాల ప్రాధాన్యతను తెలియజేస్తుంది.

**మలహరి రాగం**

**పల్లవి**

"అదెచూడు తిరువేంకటాద్రి
నాలుగు యుగములందు వెలుగొందీ ప్రభమీరగాను

**చరణం:**

తగ నూట ఇరవైయ్యెనిమిది తిరుపతులుగల
స్థానికులును చక్రవర్తి పీఠకములును
అగణితంబైన దేశాంత్రుల మఠంబులును
నధికమై చెలువొందగాను

**చరణం:**

మిగుల నున్నతమైన మేడలును మాడుగులు
మితిలేని దివ్య తపసులున్న గృహములును
ఒగినొరగు బెరుమాళ్ళ ఉనికిపట్టై వెలయు
దిగువ తిరుపతి గడవగాను

**చరణం:**

ఎక్కువలకెక్కువై యొసగి వెలసిన పెద్ద
ఎక్కుడతిశయముగా నెక్కినంతటిమీద
అక్కజంబైన పల్లవరాయని మఠము
అలయేట్ల పేడగడవా
చక్కనేగుచు నవ్వ చెరిగడచి
హరిదలచి మ్రొక్కుచును ముడుగు గడచిన మీద
నక్కనక్కడ వేంకటాద్రీశు సంపదలు
అంతంత గానరాగాను

**చరణం:**

ఈకడను గోనేటయతులు బాశుపతుల్
మునులెన్న నగ్గలమై యున్న వైష్ణవులలో
ఏకమై తిరువేంకటాద్రీశుడాదరిని
యే ప్రొద్దు విహరించగాను." (*సంపుటం1.227:151.*)

ఎనిమిది చరణాల ఈ కీర్తనలో తిరుమల క్షేత్రానికి సంబంధించిన అనేక అంశాలను ఒక్కొక్కటిగా పేర్చి అన్నమయ్య వర్ణించారు. మొదటి చరణంలో 128 తిరుపతులు, చక్రవర్తి పీఠాలు మఠాలు ఉన్నాయి. రెండో చరణంలో తిరుపతి వర్ణన అద్భుతంగా చేశారు. ఎత్తైన మేడలు, విశాలమైన వీధులు, యోగులు నివాసమున్న ఇళ్ళు గోవిందరాజ స్వామి

ఆధ్వర్యంలో ఉన్నాయని చెప్పారు. మూడో చరణమంతా తిరుమలకు సంబంధించింది. తిరుమల 12 యోజనాల పొడవు ఉంది. చెట్లు, మహావృక్షాలు, సింహాలు, ఏనుగులు ఇలా అటవీ సంపదతో అలరారుతోందని అన్నమయ్య చెప్పారు. నాలుగో చరణంలో దేవతలు, కిన్నెరలు, కింపురుషులు, విద్యావేత్తలు, గంధర్వులు విశ్రాంతి కోసం తిరుమలలో విహరిస్తున్నారని చెప్పారు. అయిదో చరణంలో పల్లవరాజు మఠంతోబాటు అలయేట్ల పేడగడవా మోకాళ్ళపర్వతం మొదలైన చోట్ల స్వామి సంపదలు ఉన్నాయని చెప్పారు. ఆరో చరణంలో పూలతోటలు, ఒక వరుస క్రమంలో అమర్చబడిన వనాలు కిక్కిరిసి (నిండుగా) పండిన పళ్ళతో శృంగారాత్మకంగా ఉన్నాయి, అవి గోపురాలను అంటిపెట్టుకున్నాయని చెప్పారు. ఏడో చరణంలో భక్తుల పాపాలతో నిండి, పాపనాశం, ఆకాశగంగ ఎప్పుడూ పారుతూ ఉంటాయని చెప్పారు. చివరి చరణంలో ఇలాంటి వైభవోపేతమైన తిరుమల క్షేత్రంలో స్వామి ఎప్పుడంటే అప్పుడు విహరిస్తాడని చెప్పారు. ఈ కీర్తనలో ఎక్కువ అంశాలతోబాటు చరణాలు కూడా చాలా పెక్కుగా ఉన్నాయి. ఇలాంటి సంకీర్తనలు ప్రజల్లో తిరుమలకు సంబంధించిన విషయాలపై ఎక్కువ ఆసక్తి రేపుతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

## 3.4. అంతస్సంభాషణలు

ఈ సంభాషణల్లో అన్నమయ్య తనలో తాను మాట్లాడుకోవడం గమనించగలం. తన మనస్సుతో, శరీరంతో మాట్లాడుకుంటూ, తనను తాను స్వవిమర్శ చేసుకోవడం కనిపిస్తుంది. మనిషికి తన బుద్ధి ప్రధానమైన విమర్శకుడు. తప్పు చేస్తున్నప్పుడు, ఎవరితోనైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా పొరపాటుగా ప్రవర్తించే ఏ సందర్భంలోనైనా అది మనల్ని హెచ్చరిస్తూ ఉంటుంది. అన్నమయ్య కూడా ఆయా సందర్భాల్లో తనను తాను తప్పు పట్టుకున్నారు. స్వామిని తన పొరపాట్లు దిద్దమని వేడుకున్నారు. ఆయన సంకీర్తనాచార్యుడు గనుక ఆ అనుభవాలన్నింటినీ సంకీర్తనామయం చేశారు.

**దేశాక్షి రాగం**

**పల్లవి**

"హీనదశలబొంది ఇట్లమందుటకంటే
నానావిధులను నున్ననాడే మేలు

**చరణం:**

అరుదైన క్రిమికీటకాదులందు బుట్టి

వైభవములనెల్లబడితిగాని

ఇరవైన చింత నాడింతలేదు ఈ

నరజన్మముకంటే నాడే మేలు.” (*సంపుటం1.3:3.*)

ఈ కీర్తనలో మేలైనదేదో అన్నమయ్య తలుచుకున్నారు. ‘ఈ జన్మకంటే క్రిమికీటకాలలో, జంతువులలో పుట్టడం మేలు. ఈ నరకంనుండి తప్పించే వేంకటేశ్వరుని నామమే మేలు’ అని తలంచారు. మనిషి జన్మ వైభవాన్ని తెలియజేశారు. వచ్చే కష్టసుఖాలు రాకుండా పోవు. “అనుభవమునకు బ్రాప్తమైనది తనకుదానె వచ్చి తగిలిగాని పోదు” (*సంపుటం1.6:5.*) కానీ ఏది చేసినా ఈ జన్మలోనే చేయాలని తనలో తాను సంభాషించుకున్నారు. ఆ ప్రక్రియలో ఎన్నో ఎదురు దెబ్బలు తగలవచ్చు, ఆటంకాలు రావచ్చు. అంటూ ఈ కింది కీర్తనలో తనకు పూర్వం ఉన్న భక్తులను గుర్తుచేసుకున్నారు.

**మాళవిశ్రీ రాగం**

**పల్లవి**

“ఇందుకొరకె ఇందరును నిట్లయిరి

కిందుపడి మరికాని గెలుపెరగరాదు

**చరణం:**

అటమటపు వేడుకలనలయించి మరికదా

ఘటియించు బరము తటుకన దైవము

ఇటుసేయ నీశ్వరునకీసుగలదా లేదు

కుటిలమతిగని కాని గురి కానరాదు.” (*సంపుటం1.11:7.*)

మనుషులను కష్టపెట్టడం దేవునికి సరదా కాదు. కాని అగ్నిలో పడితే బంగారం మేలిమి అవుతున్నట్లే భక్తులు కూడా అప్పుడప్పుడు దెబ్బలు, ఎదురుదెబ్బలు తింటూ ఉంటే వారిలోని భక్తి మెరుగు పడుతుంది. అందుకు అన్నమయ్య ఎండలేకపోతే నీడ, ఓటమి లేకపోతే గెలుపు రుచి తెలియదని ఈ కీర్తనలో తనను తాను కష్టసుఖాలు అనుభవించేందుకు సంసిద్ధపరచుకున్నారు.

మోక్ష మార్గాన్ని చేరే ప్రక్రియలో మనిషి అనేకవిధాలైన అజ్ఞానాంధకారాలకు లోనవుతాడని కింది కీర్తన ద్వారా అన్నమయ్య తెలియజేశారు.

**భౌళి రాగం**

**పల్లవి**

"ఏడ సుజ్ఞానమేడ తెలివి నాకు
బూడిదలో హోమమై పోయెగాలము

**చరణం:**

ఇది మేలయ్యెడి నాకది మేలయ్యెడినని
కదిపిన యాపచే గడవలేక
ఎదురు చూచి చూచి ఎలయించి ఎలయించి
పొదచాటు మృగమై పోయెగాలము." (*సంపుటం1.48:31.*)

ఈ లోకంలో సిరిసంపదలను, సుఖసౌఖ్యాలను పొందాలని నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటాం. తీరా మోక్షాన్ని గురించి ఆలోచించడం మొదలయ్యేసరికి తగినంత సమయం ఉండదు. ఇది సర్వసాధారణం. ఈ సంభాషణలో అన్నమయ్య తన అజ్ఞానానికి ఆవేదన చెందారు. కాలం పొదచాటున మృగంలా, అగ్నిలో పడ్డ వెన్నలా, బూడిదలోని హోమంలా, పుక్కిటిపురాణమై పోయిందని వాపోయారు. భగవంతుని చేరేందుకు బుద్ధి సహకరించదని "ఎంతైన తొలగవైతేదైన నామతికి" (*సంపుటం1.76:52*) అనే సంకీర్తనలో తెలియజేశారు.

దేవుడొక్కడే కనుక ఆయననే స్మరించమని కింది కీర్తనలో తనకు తాను చెప్పుకున్నారు.

**నారణి రాగం**

**పల్లవి**

"ఏణనయనల చూపులెంత సొబగైయుండు
ప్రాణసంకటములగు పనులునట్లుండు

**చరణం:**

ఎడలేని పరితాపమేరీతి దానుండు
అడియాస కోరికలునటువలెనె ఉండు

కడలేని దుఃఖసంగతి ఎట్ల దానుండు

అడరు సంసారంబునట్లనే యుండు." (*సంపుటం1.99:68.*)

స్త్రీలు, ఇహలోక సంపదలు అన్ని సర్వసాధారణమే అంటూ "దేవుడొక్కడే యనెడి తెలివి దనకెట్లుండు శ్రీ వేంకటేశు కృపచేతలట్లుండు" (*సంపుటం1.99:68.*) అన్నారు. ఎన్ని కష్టాలు, సుఖాలు సంప్రాప్తించినా స్వామి నామ స్మరణను మానరాదని అన్నమయ్య నిశ్చయించుకున్నారు. ఎందుకంటే 'త్రిలోక పావని అయిన గంగను, బ్రహ్మను కన్నతండ్రి, తన ఎదపై లక్ష్మికి చోటిచ్చిన లక్ష్మీపతి, దేవతలకు సుఖాన్ని ఇచ్చేవాడు, అందరి దేవతలకు నమ్మిక అయినవాడు, ఆయనే నా భయాలను పోగొడతా'డని "భయవిభూతి నాథుడే నానాథుడు" (సంపుటం1.100:68.) అన్నమయ్య స్వామిని తన ప్రాణనాథుడిగా భావించారు. ఈ కింది కీర్తనలో మాయపై నిరసన తెలిపారు.

**సాళంగ రాగం**

**పల్లవి**

"పుట్టుమాలిన బరుబోకివి నన్ను

దిట్టేవదేమోసి దిమ్మరి మాయ

**చరణం:**

ఒల్లవటే జీవమోసి మాయా నీ

కల్లలన్నియు లోకమెరుగును

నల్లని విభుని మన్నన భక్తినంటా

జెల్లబో పాపపు చేదు మేయకువే." (*సంపుటం1.107:73.*)

ఈ కీర్తనలో అన్నమయ్య మాయను జయించడానికి మాయతోనే సంభాషించారు. 'నాచేత ఈ పనులన్నీ చేయిస్తూ, మత్తులో దిగబడజేస్తూ, మళ్ళీ నన్నే తిడతావు. నీ టెక్కులు నా దగ్గర చెల్లవు. పొరపాటున నీ మాట వింటే వెంటనే దోషంలో పడేస్తావు. విష్ణుభక్తి లేకుండా చేస్తావు. నీ గురించి నాకు తెలియదా! నాతో మాట్లాడడం అనవసరం. ఎంతో మందిని వనితలపై వ్యామోహుల్ని చేసి, నిద్ర పుచ్చావు. ఈ మోహంలో పడేసి మా శరీరాలను దంచుతావు. సద్భక్తుల్ని చూసి ఓర్చుకోలేవు. నీ కల్లలన్నీ నాకు తెలియదా! అయినా నా స్వామి ముందు నీ నాటకాలు చెల్లవు' అంటూ మాయపై నిరసన తెలియజేశారు.

ఈ కింది సంకీర్తనలో అన్నింటికీ ఆధారమైన దేవుని గురించి తెలిసుకోవాలని తనకు తాను చెప్పుకున్నారు.

**గుండక్రియ రాగం**

**పల్లవి**

"తానే తెలియవలె తలచి దేహి తన్ను
మానుపువారలు మరివేరీ

**చరణం:**

తిరువేంకటాచలాధిపుని గొలువుమని
వెరవు చెప్పెడివారువేరీ
పరివోని దురిత కూపముల బడకుమని
వెరవు చెప్పెడివారు వేరీ." (*సంపుటం1.128:88.*)

'మాయనుండి విడిపించే దేవుణ్ణి కొలవమని చెప్పేవారు ఎక్కడ? ఈ బంధాల్లోనుంచి విడిపించేవారు ఎవరు? కర్మ అనే ఇనుప సంకెళ్ళనుంచి, మోహంనుండి విడిపించేవారు ఎవరు? ఆ స్వామిని కొలవమని, ఈ పాపాల్లో పడవద్దని చెప్పేవారు ఎవరు?' అని అన్నమయ్య తనను తాను ప్రశ్నించుకున్నారు. ఈ లోకపు సుఖం నిందలు తెచ్చి పెడుతుంది. పంది బురదలో పడిపోయి, బయటకు రాలేనివిధంగా మనిషి కూడా తనంతట తానుగా బంధాలనుండి బయటపడలేడు. అన్నట్లు అందుకు కారణం ఈ మనస్సే. ఇది చేసినదానికి కర్మఫలం అనుభవించక తప్పదు. వీటన్నింటినుండి తనను విడిపించే స్వామిని గురించి తెలుసుకోవాలని తనకు తాను హితం చెప్పుకున్నారు. ఈ కింది కీర్తనలో తన జీవితంపై అన్నమయ్య నిరసన తెలియజేశారు.

**లలిత రాగం**

**పల్లవి**

"ఎఱుపోతుతో నెద్దు నేరుగట్టినయట్లు
ఎనసి ముందర సాగదేటి బ్రతుకు

**చరణం:**

కడలేని ఆశచే కరగి కరగి

చిత్తమెడమ వంకకు వచ్చెనేటి బ్రతుకు
పొడవైన మమతతో పొదలబొదల మాన
మిడుమ పాట్లబడె నేటి బ్రతుకు" (*సంపుటం1.156:106.*)

భగవంతుని సేవించకుండా అనవసరమైన పనులపై మక్కువ చూపుతున్నానంటూ తన బ్రతుకును అన్నమయ్య దున్నపోతుతో ఎద్దు జతకట్టడంతో పోల్చుకున్నారు. ఈ కీర్తనలో స్వయం నింద కనిపిస్తున్నా ఆయన నిరసన తెలియజేసింది వ్యర్థమైన పనుల్లో మునిగే వారి జీవితాలపైనే. అలాంటి వారి మనస్సు అంతులేని ఆశలతో కష్టపడుతున్నా, అపసవ్య దిశలోకి తీసుకోకుండా ప్రయాణిస్తుంది. మోహంలో, ఆశల్లో, "మొనసి యాశాపాశములు యురులబడుటుండె" (సంపుటం1.157:106.) అన్నట్లు మితి లేని ఆచారాలు అనే భ్రాంతిలో చిక్కుబడుతుంది. జ్ఞానాన్ని విడిచి, రోతలో పొర్లుతుంది. కానీ అసలైన సుఖం స్వామిలో ఉందని తెలుసుకోదు. ఎన్ని దెబ్బలు తగిలినా మనిషి ప్రవర్తన మారదు అని అన్నమయ్య తనను తాను స్వయం నింద చేసుకుంటూ మానవాళి బ్రతుకులపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

"వైరముగొని తను వదలని బంధపు భారంబెన్నడు వాయును" (*సంపుటం1.174:117.*) నా అంతట నేనుగా దీన్ని మానలేనని, ఈ బంధాలనుండి నువ్వే కాపాడాలని "ఇన్నిటా దిరువేంకటేశ నిర్మలునిగా నన్నుజేసి నీవు నాకు గలుగవయ్యా" అని స్వామిని వేడుకున్నారు. ఈ లోకంలోని పరిస్థితులన్నీ చింతామయమేనని అన్నమయ్య కింది కీర్తనలో తెలిపారు.

**భైరవి రాగం**

**పల్లవి**

"ఎంతపాప కర్మమాయ ఎంతవింత చింతలాయ
వింతవారితోడి పొందు వేసటాయ దైవమా

**చరణం:**

తల్లిదండ్రి దాత గురువు తానెయైన నాచారి
వల్లభుండు నాకు మేలువంటిదాయె జన్మము
కల్లగాదు వేంకటేశు ఘనుని పాదసేవ నాకు

మొల్లమాయె నా మనసు మోదమాయె దైవమా.” (*సంపుటం1.186:125.*)

ఏమీ లేకున్నా అన్నీ ఉన్నట్లుగా ఈ లోకం భ్రమలో మనిషిని పడేస్తుంది. దాన్ని అన్నమయ్య ‘నీళ్ళు లేని ఏటిలో ఈదడం’తో పోల్చారు. ఆ స్థలంలో పిచ్చి చెట్లు, ముళ్ళపొదలు తిష్ఠవేసుకొని, గమ్యంవైపు సాగనియ్యకుండా కాళ్ళకు అడ్డుపడుతూ గుచ్చుకుంటాయి. అదేవిధంగా మనిషిని మోక్షం వైపు ప్రయాణం చేయనీయకుండా లోకం అడ్డుపడుతుంది. ‘ఎవరు నన్ను వదిలినా, ఏది అడ్డుపడినా నాకు వేంకటేశ్వరుని పాదసేవా భాగ్యం దక్కింద’ని అన్నమయ్య ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కింది కీర్తనలో ఈ లోకంపై అసహ్యం చూపించారు.

**పాడి రాగం**

**పల్లవి**

“ఏటికినెవ్వరి పొందు ఇస్సిరో ఛీఛీ

నాటకములాల ఛీఛీ నమ్మితిగా మిమ్మును

**చరణం:**

సిరుల చీకటి ఛీఛీ సిలుగు సంపద ఛీఛీ

వరవిభవమ ఛీఛీ వాసిరో ఛీఛీ

కరుణించె దిరువేంకటపతినన్ను

విరసవర్తన ఛీఛీ వీడెగా మీ భారము.” (*సంపుటం1.195:130.*)

ఈ కీర్తనలో మనుషుల సహవాసం, యౌవనంవల్ల కలిగే మదం, చక్కదనం, రాజులవల్ల, అధికారంవల్ల ప్రాప్తించే గర్వం, ప్రేమ, ఆశ, నవ్వు, దేహం, ముచ్చట, మమత, మురిపెం, మత్సరం, తాలిమి, సిరిసంపదలు, విభవం, విరసమైన వర్తనం మొదలైన దుర్గుణాలను అన్నమయ్య ‘ఛీ ఛీ’ అని అసహ్యించుకున్నారు. అవన్నీ స్వామి కృపా కటాక్షాలవల్ల మాత్రమే పోతాయని మనుషులకు ఉపదేశించారు. అందుకే “పసలేని ఈ బ్రదుకు అసలు చొచ్చి చొచ్చి అలసినట్టాయె” (*సంపుటం1.203:135.*) అని ఈ లోకంలోని వాటితో విసిగి, అలసిపోయానని చెప్పుకొచ్చారు. ఇంత నిరసనకారుడైన అన్నమయ్య ఇద్దరు భార్యలతో సంసారం చేయడం, ఆశలన్నింటిపై అసహ్యాన్ని ప్రదర్శించడం ఒక్కింత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది, చిత్రంగా తోస్తుంది. కానీ ‘ఆయన సంసారం చేస్తున్నప్పటికీ ఆ

వాసనలు ఆయనకు అంటలే' దనే ఆరుద్రగారి అభిప్రాయం నిజమైందేనని ఈ కీర్తన వల్ల తెలుస్తోంది.

కింది కీర్తనలో ఈ లోక మాయలను విడిచిపెట్టేందుకు మార్గోపదేశం చేశారు.

**సామంత రాగం**

**పల్లవి**

"తొక్కని చోట్లు దొక్కెడి మనసు
ఎక్కడ గతిలేదింకనో తెరువు

**చరణం:**

వెరపును వెడమాయలబడి
కొరతయు దీరదు కొంతైన
తెరగొసగేటి శ్రీ తిరువేంకటపతి
నెరిగీ నెరగలేమికనో తెరువు." (*సంపుటం1.276:185.*)

ఈ కీర్తనలో కూడా అన్నమయ్య భగవంతుని మీద మనస్సు లగ్నం చేయకుండా వ్యర్థమైనవాటిపై శ్రద్ధ చూపించే మనస్సుపై అసహ్యాన్ని వ్యక్తం చేశారు. "శమము చాలనియట్టి జన్మంబదేమిటికి?" (*సంపుటం1.307:205.*) అంటూ తనను తాను ఆత్మ విమర్శ చేసుకున్నారు. "ఎండలోని నీడ ఈ మనస్సు" (*సంపుటం1.337:225.*) అంటూ తన మనస్సును నిందించుకున్నారు. మనిషి ఏదో ఒక కారణంవల్ల జన్మిస్తాడని ఆ కారణాన్ని తెలుసుకొని వర్తించాలని "కూరిమి శ్రీవేంకటేశు గొలిచితివిక నాకు కారణజన్మమవై కలిగిన దేహమా" (*సంపుటం1.416:279.*) అంటూ దాన్ని తెలుసుకున్నవాడే కారణజన్ముడు కాగలడని తెలియజేశారు. ఈ కింది కీర్తనలో అనేక శాస్త్రాలు చదివి, సత్యం ఏంటో కనుగొన్నానని అన్నమయ్య చెప్పారు.

**సామంతం**

**పల్లవి**

"కంటినిదేయర్థము ఘనశాస్త్రములు దవ్వి
నంటున నిందుకంటెను నాణెమెందూ లేదు

**చరణం:**

మేటి వైరాగ్యముకంటే మిక్కిలి లాభము లేదు

గాటపు విజ్ఞానముకంటే సుఖము లేదు
మీటైన గురువుకంటే మీద రక్షకుడు లేదు
బాట సంసారముకంటే పగ లేదు." (*సంపుటం1.443:297.*)

ఈ కీర్తనలో నాణ్యం (శ్రేష్ఠం) అనే పదాన్ని 'నాణెం' అని ప్రయోగించారు. 'వైరాగ్యం కంటే లాభం, జ్ఞానంకంటే సుఖం, గురువుకంటే రక్షకుడు, సంసారంకంటే పగ, ఇతరుల పట్ల కీడుకంటే పాపం, పరోపకారంకంటే పుణ్యం, శాంతంకంటే ధర్మం, హరిదాసుడవడాన్ని మించిన గతి ఈ లోకంలో లే'వని అన్నమయ్య ప్రకటించారు. వేంకటేశ్వరుని శరణువేడి నిర్మలమైన బుద్ధి కలిగి ఉండాలని ప్రబోధించారు. 'సుఖం, దుఃఖం అనేవి దైవాధీనాలు. ఇదంతా ఆయన మాయేననేది ఎవ్వరూ కాదనలేని సత్యం. పూర్వ జన్మలో ఏమేమి కర్మలు చేశామో తెలియదు. ఆ దేవుణ్ణి గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండడానికి మానవాళికి సాధ్యపడదు. అందుకే స్వామిని సేవించి, నిజమైన సుఖాన్ని పొందుతున్నా'నని అన్నమయ్య మనతో సంభాషిస్తున్నారు. మాధవుణ్ణి అన్నమయ్య "మాయాధవుడు" (*సంపుటం1.444:298.*) 'మాయకు కూడా భర్తే' అన్నారు. అన్నమయ్య ఈ కింది సంకీర్తనలో తన స్వానుభవాలను ప్రజలతో పంచుకున్నారు.

**కన్నడగౌళ రాగం**

**పల్లవి**

"బోధకులెవ్వరు లేక భోగినైతిని
శ్రీధరుడే మాకు దిక్కు చింతింపనికను

**చరణం:**

పట్ట దిగంబరినై పాలే యాహారముచేసి
తొట్టిన పంచేంద్రియముల తోవ విడిచి
పుట్టితి సన్యాసినై బుద్దెరిగీ నెరగక
అట్టె నడుమ సంసారినైతి నేను." (*సంపుటం1.465:312.*)

చిన్నతనంలో పాలు ఆహారం. సిగ్గు, ఎగ్గు ఏమీ తెలియక సన్యాసి రూపంలో పిల్లవాడు ఉంటాడు. ఎదిగిన తరువాత సంసారి అవుతాడు. అన్నమయ్య జీవితం ఇందుకు అతీతమైంది కాదని తానే చెప్పుకున్నారు. 'స్వామిని గురించి ధ్యానం చేసి, యోగినయ్యా'నని అన్నమయ్య చెప్పుకున్నారు. 'బ్రహ్మాండం మొత్తం నిండిన స్వామిని శరణు వేడుకొని

జీవన్ముక్తుణ్ణి అయ్యా'నని, "ఇలలో శ్రీవెంకటేశుడింతలో జీవుడనేటి బలువుని రాజుజేసె పాలించె నన్నును" (*సంపుటం1.488:327.*) మానవాళి ఈ మార్గాన్ని అనుసరించాలని ఆయన చెప్పారు. 'నాకు ఈ మార్గాన్ని గురించి ఎవ్వరూ బోధించకపోవడంవల్ల భోగిని అయ్యా'నని అన్నమయ్య తన స్వానుభవాలను మనకు తెలియజేశారు. ఈ కింది కీర్తనలో తన జీవుడికి అన్నమయ్య ఉపదేశం చేసుకున్నారు.

**రామక్రియ రాగం**

**పల్లవి**

"ఒక్కడే అంతర్యామి ఉపకారి చేపట్టు
తక్కినవిన్నియును తలపురేచెడినీ

**చరణం:**

ఎరుగుమీ జీవుడా ఇంద్రియాలు సొమ్ముగావు
గురియై మాయలలోన గూడించేవింతే
మరువకు జీవుడా మనసు చుట్టముగాదు
తెరగొప్ప ఆశలానే తిప్పెడిదింతే." (*సంపుటం1.500:335.*)

ఈ కీర్తనలో అన్నమయ్య తన మనస్సుకు ఎరుక కలిగించుకున్నారు. 'ఇంద్రియాలు మాయల్లో కూరుకుపోజేస్తాయి తప్ప అవి ధనం కాదు. మనస్సు ఊహల్లో తేలియాడేట్లుగా చేస్తుంది తప్ప అది చుట్టం కాదు. ఈ దేహాన్ని నీవు ఎప్పుడు విడుస్తావో తెలియదు. ఈ దేహం ఒక వన్నెలాంటిది. కాబట్టి దీన్ని నమ్మకు. ధనంవల్ల నీకు దుష్పరిణామాలే తప్ప లాభం లేదు. ఈ సంసారం అనేక బంధాల్లో నిన్ను పెనవేస్తుంది. దానివల్ల నీకు లాభం లేదు. వీటన్నింటికీ మూలం ఆ వేంకటేశ్వరుడు. కనుక నీవు ఆయనను ఆశ్రయించా'లని తనలోని జీవుడికి అభ్యర్థించుకున్నారు.

ఇలా అన్నమయ్య ఈ సంభాషణలను తనలో తానే చేసుకున్నారు. ఈ సంభాషల్లో కావాల్సినంత ఆధ్యాత్మిక జ్ఞానం, దైవభక్తి ఇమిడి ఉన్నాయి. వాస్తవానికి తనను తాను స్వవిమర్శ చేసుకోవడం అంత తేలికేమీ కాదు. దానికి చాలా ధైర్యం కావాలి. ఒకరి ముందర తన తప్పులు ఒప్పుకోవడానికే మనిషి భయపడతాడు. అలాంటిది అన్నమయ్య తన స్వానుభవాలను సంకీర్తనామయం చేశారు. కానీ ఇక్కడ స్వామిని ఆలంబనగా చేసుకొని,

ఆయనతో సంభాషించారు. అద్దంలో మన ప్రతిబింబం మనకు సహజంగానే కనిపిస్తుంది. అలానే తోస్తుంది. అన్నమయ్య భగవంతుణ్ణి అద్దంలా భావించి, తనలోనే చూసుకున్నారు. అంచేతనే ఆయనలోనుంచి ఉత్తమ సాహిత్యకారుడు బయటకి వచ్చారు.

## 3.5. అసలైన వైష్ణవుడు

అన్నమయ్య తన వివాహానంతరం ఘనవిష్ణువు అనుమతితో అహోబిలంలోని శఠగోపయతి దగ్గర వైష్ణవ తత్త్వాన్ని అభ్యసించారు. ఈ అభ్యాసం అన్నమయ్య సంకీర్తనలను ఇంకా పదునుదేల్చింది. అసలైన వైష్ణవుడు ఎవడు? అతడు ఏయే భావాలను, లక్షణాలను కలిగి ఉండాలి? ప్రజలను ఎలా వైష్ణవంలోకి ఆకర్షించి, నడిపించాలి? అనే అంశాలను గురించి ఈ కీర్తనల్లో అన్నమయ్య సంభాషించారు. విష్ణుభక్తులతో సహవాసం కలిగి ఉండాలనేది అన్నమయ్య ప్రతిపాదించిన మొట్టమొదటి లక్షణం. ఇందులో కొన్ని కీర్తనలు స్వామితో నేరుగా సంభాషిస్తున్నట్లుగా, కొన్ని సమాజానికి, ఇతరులకు హితబోధ చేస్తున్నట్లుగా ఉంటాయి. కొన్ని సంకీర్తనలు నిందాత్మకంగా, నిరసనగా ఉంటూ, శ్రీవైష్ణవాన్ని ప్రకటిస్తాయి. అలాంటి సంకీర్తనలను కింద చర్చించడం జరిగింది.
ఈ కింది కీర్తనలో కొన్ని లక్షణాలను ప్రతిపాదించారు.

**సామంత రాగం**

**పల్లవి**

"సహజ వైష్ణవాచార వర్తనుల
సహవాసమే మా సంధ్య

**చరణం:**

అతిశయమగు శ్రీహరి సంకీర్తన
సతతంబును మా సంధ్య
మతి రామానుజ మతమే మాకును
చెతురత మెరసిన సంధ్య." (*సంపుటం1.10:7.*)

ఈ కీర్తనలో 'సంధ్య' అనే మాటకు 'ప్రతిజ్ఞ' అనే అర్థాన్ని గ్రహించి, అద్భుతమైన సంభాషణ కొనసాగించారు. వైష్ణవులతో సహవాసం, శ్రీహరి సంకీర్తనం, స్వామి పాద స్మరణం, విష్ణు శ్రవణం, తిరుమంత్ర పఠనం, వేంకటేశునికి సంతర్పణం అనే లక్షణాలను

కలిగి ఉండాలి. ఆ పద్ధతులను పాటిస్తామనే ప్రతిజ్ఞ ప్రతి వైష్ణవుడు చేయాలి. రామానుజుల మతాన్ని తప్పకుండా అనుసరించాలని అన్నమయ్య వైష్ణవ మార్గానునాయులతో సంభాషించారు. ప్రాథమికంగా వైష్ణవులు కావాలనుకొనే వారికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు.

"మదమత్సరములేక మనసు పేదైపోవు అదరినయాసలవాడువో వైష్ణవుడు" (*సంపుటం1.59:39.*) అనే కీర్తనలో ఇతరులను నిందించకుండడం, స్త్రీలపై వ్యామోహం లేకుండడం, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు లేకుండడం, నిరంతరం వేంకటేశు కృపను పొందుతూ ప్రవర్తించడం అనే లక్షణాలను తెలియజేశారు.

**గుండక్రియ**

**పల్లవి**

"మరిగి వీరెపో మా దైవంబులు
తెరలిన హరిసంకీర్తనపరులు

**చరణం:**

కరముల శ్రీపతి కైంకర్యములే
మురియుచు జేతురు ముముక్షులు
ఇరవుగ శ్రీవేంకటేశ్వరు మతమే
సిరుల నమ్ముదురు శ్రీవైష్ణవులు." (*సంపుటం1.402:269.*)

ఈ కీర్తనలో విష్ణు కథలు వినడం, నిరంతరం ఆయననే చూడడం, ఆయన నామాన్ని పలకడం, నిరంతరం విష్ణువుని తలచడం, విష్ణువుని పూజించడం, ఆ స్వామి మతాన్ని సిరిసంపదలుగా భావించడం అనే లక్షణాలను తెలియజేశారు. ఈ లక్షణాలను కలిగి ఉండేవారికి శ్రీవైష్ణవం అనే సిద్ధాంతం తేనే అంత తియ్యగా ఉంటుందని "వలెననువారిదె వైష్ణవము ఇది వలపుదేనె వో వైష్ణవము" (*సంపుటం1.405:271.*) అన్నారు.

వైష్ణవ భక్తి అంత సులభంగా మనుషులకు సిద్ధించదని ఈ కింది కీర్తనలో అన్నమయ్య చెప్పారు.

**సామంతం**

**పల్లవి**

"సులభమా మనుజులకు హరిభక్తి

వలనొంది మరికదా వైష్ణవుడవుట

**చరణం:**

కొదలేనితపములు కోటానుగోటులు

ననదనాచరించియటమీద

పదిలమైన కర్మబంధములన్నియు

వదలించుకొనిగదా వైష్ణవుడవుట." (*సంపుటం1.144:98.*)

ఈ లోకబంధాలను తుచ్ఛంగా భావించాలని చెప్పారు. వైష్ణవుడు కావాలంటే ఎన్నో యాగాలు చేయాలి. ఎన్నో జన్మలెత్తి తద్వారా పరమపావనుడు కావాలి. ఎన్ని క్షేత్రాలు తిరిగినా గజేంద్రునికి మోక్షం ఇచ్చిన శ్రీ వేంకటేశ్వరుని కృపవల్లనే శ్రీవైష్ణవుడు కావచ్చునని అన్నమయ్య ఈ కీర్తనలో ఉద్బోధించారు. "అటువంటివాడువో హరిదాసుడు" అనే సంకీర్తనలో నిజమైన విష్ణుభక్తుడు ఆ వేంకటేశ్వరుని పాదాలచెంత చేరి, నిత్య సుఖాన్ని పొందుతాడని "పొంది పుణ్యమువచ్చిన పుడిబాపమువచ్చిన నందలి ఫలమొల్లనియాతడే సుఖీ విందుగా శ్రీవేంకటాద్రి దాసులజేరి అందరానిపదమందిన నాతడే సుఖి." (*సంపుటం1.484:324.*) అని తెలియజేశారు.

ఈ కింది కీర్తనలో శ్రీవైష్ణవులైనవారికి మూఢవిశ్వాసాలు ఉండరాదని తెలియజేశారు.

**భౌళి రాగం**

**పల్లవి**

"ఎండగాని నీడగాని ఏమైనాగానీ

కొండలరాయడే మా కులదైవము

**చరణం:**

తేలుగాని పాముగాని దేవపట్టణమైనగాని

గాలి గాని ధూళిగాని కాని ఏమైనా

కాలకూట విషమైన గక్కున మింగిన నాటి

నీలవర్ణుడే మా నిజదైవము.” (**సంపుటం1.214:143.**)

ఈ కీర్తనలో శివకేశవుల అభేదం చెప్పబడింది. నీలవర్ణుడు, ధూమకేతువు, వేంకటేశుడు అనిని ఇద్దరు దేవుళ్ళ పేర్లు ప్రస్తావించబడ్డాయి. తేలు, పాము, ఎండ, వాన, చీమ, దోమ ఏదేమైనా మా దేవుడు కొండలరాయడొక్కడేనని అన్నమయ్య శివ వైష్ణవ అభేదాన్ని ప్రజలకు ఉపదేశించారు.

**మాళవి రాగం**

**పల్లవి**

“నిత్యులు ముక్తులు నిర్మలచిత్తులు
నిగమాంతవిదులు వైష్ణవులు
సత్యము వీరల శరణని బ్రదుకరో
సాటికి వెనగక జడులాలా

**చరణం:**

సకలోపాయశూన్యులు సమ్యక్జ్ఞానపూర్ణులు
అకలంకులు శంఖచక్రలాంఛనులన్నిట బూజ్యులు వైష్ణవులు
ఒకటీగోరరు ఒరులగొలువరు ఒల్లరు బ్రహ్మాదిపట్టములు
అకటా వీరల సరియనబాపం బారుమతంబుల పూతకోకలన్

**చరణం:**

తప్పరు తమ పట్టిన వ్రతమెప్పుడు దైవమొక్కడే గతియనుచు
ఒప్పగు తమ పాతివ్రత్యముననుందురు సుఖమున వైష్ణవులు
కప్పిన శ్రీవేంకటపతి దాసులు కర్మవిదూరులు సాత్త్వికులు
చెప్పకుడితరుల సరిగా వీరికి సేవించగ నే ధన్యుడనైతి.” (*సంపుటం1.44:29.*)

ఈ కీర్తనలో వైష్ణవ భక్తులు ఎలా ఉంటారో అన్నమయ్య తెలియజేశారు. శ్రీవైష్ణవులను జ్ఞానులు, శంఖచక్ర ముద్ర ధారులు, అందరిచే పూజింపతగినవారు, కోరికలు లేనివారు, ఇతరులను కొలవనివారు, పదవులను ఆశించనివారు, పాతివ్రత్య ధర్మాన్ని ఆచరించేవారు, సాత్త్వికులు అంటూ అన్నమయ్య వైష్ణవులను స్తుతించారు. కాబట్టి సత్యపూర్ణులైన వైష్ణవులను లాభాపేక్ష లేకుండా పూజించాలని, వారిని సేవించడంవల్ల తాను ధన్యుడు అయ్యాడని

అన్నమయ్య చెప్పారు. వైష్ణవులతో ఇతర మతస్థులు సరిరారని, ఒట్టు పెట్టి చెప్పారు. ఈ కీర్తనలో అన్య మతస్థులను నిందించలేదు. కానీ వైష్ణవాన్ని మించింది ఈ లోకంలోనే లేదని అన్నమయ్య తనకు ఉన్న అవగాహన మేరకు చెప్పారు. ఈ కీర్తనలో కొంత వింత ధోరణిని అన్నమయ్య వ్యక్తం చేశారు. బహుశా ఈ కీర్తన రాసేనాటికి ఆయనలో పరిపక్వ భక్తిభావన, మతసమానత్వం, దేవతల అభేదభావం రాలేదు.

**భౌళి రాగం**

**పల్లవి**

"వెర్రివాడు వెర్రివాడు విష్ణుని దాస్యములేక

విర్రవీగే యహంకారి వెర్రివాడు

**చరణం:**

నాలుకపై శ్రీహరినామమిట్టే ఉండగాను

జోలితో మరచిన నీచుడే వెర్రివాడు

ఆలరి ఈ జగమెల్లా హరిరూపై ఉండగాను

వాలి తలపోయలేనివాడు వెర్రివాడు." (*సంపుటం1.413:277.*)

ఈ సంభాషణను పరిశీలిస్తే విష్ణువుని విడిచి ఇతరదేవతలను ఆరాధించేవాడు జడుడు "సారపు శ్రీవేంకటేశు శరణాగతి ఉండగా సారెగర్మములంటెడి జడుడు వెర్రివాడు" అంటూ అన్నమయ్య వేంకటేశ్వరుని మహిమ తెలిపారు. "మిక్కిలి పుణ్యులు హరి మీ దాసులే హరీ" అనే సంకీర్తనలో "పావనులై నిజభక్తి ప్రపన్నులయ్యినవారు శ్రీవేంకటేశ మిమ్ముజేరినవారే హరి వేవేలు దేవతలవెంటదగిలేటివాడు కావించి మిమ్మెరుగని కర్మియాతడే హరి" (*సంపుటం1.411:276.*) అని విష్ణుభక్తులకు, ఇతరులకు మధ్య భేదాన్ని అన్నమయ్య సుస్పష్టంగా చెప్పారు.

**రామక్రియ**

**పల్లవి**

"సులభమా ఇందరికి జూడ సులభముగాక

కలిగె మీ కృపనాకు గమలారమణా

**చరణం:**

సకలయజ్ఞఫలము సత్యము ఫలముగదా

ప్రకటించి విష్ణునామ పాఠకుడవుట
అకలంకమతితోడ నాజన్మశుద్ధుడైకదా
అకుటిలమగు నీ చక్రాంకితుడవుట." (*సంపుటం1.423:284.*)

ఈ కీర్తనలోని సంభాషణలో భక్తి పరిపక్వత కనిపిస్తుంది. పై కీర్తనల్లోని సంభాషణల్లో విష్ణుని ఆరాధించకపోతే వాడి జన్మ వృథా అన్న అన్నమయ్య ఈ కీర్తనలో తన పంథాను పూర్తిగా మార్చుకున్నారు. 'అన్నింటికంటే సులభంగా దొరికేది నీ సేవనమే' అని స్వామితో సంభాషించారు. ఈ సంభాషణలో అన్నమయ్య భక్తి ముదిరి పాకానపడింది.

**శ్రీరాగం**

**పల్లవి**

"ఇతరులకు నినునెరుగదరమా సతత సత్యవ్రతులు
సంపూర్ణ మోహవిరహితులెరుగుదురు నిను ఇందిరారమణా

**చరణం:**

నారీకటాక్షపటు నారాచ భయరహిత
శూరులెరుగుదురు నిను జూచేటిచూపు
ఘోరసంసారసంకుల పరిచ్ఛేదులగు
ధీరులెరుగుదురు నీ దివ్య విగ్రహము." (*సంపుటం1.250:167.*)

ఈ కీర్తనలో సామాన్య మానవులకు నిన్ను గురించి తెలుసుకోవడం సాధ్యం కాదని అన్నమయ్య తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆయన ఈ సంభాషణలో స్త్రీల చూపులకు పట్టుబడక సంసారాన్ని జయించినవారిని ధీరులుగా, శూరులుగా పేర్కొన్నారు. వేదాలు తెలిసి నిత్యం తపఃఫలాన్ని పొందే యోగులు, భాగవతోత్తములు సంపూర్ణంగా స్వామిపై ఎరుక కలిగి ఉంటారని ఆయన భావించారు. "నెరుగుదురిందరు" అనే సంకీర్తనలో బ్రహ్మ, నారదుడు, శివుడు, గుహుడు, కపిలుడు, మనువు, ప్రహ్లాదుడు, భీష్ముడు, జనకుడు, బలి, శుకుడు, గాలుడు హరే పరమాత్మ అని తెలుసుకున్నారని "ఇలనిందరుదెలిసిరిదే పరమమని కలవెల్లదెలిపే వేంకటరాయడు" (*సంపుటం1.253:169.*) అని అన్నమయ్య తెలియజేశారు. "కంటే సులభమిది కానకయుంటే దుర్లభము" అనే సంకీర్తనలో విష్ణుభక్తులు సాక్షాత్తూ ఆ వేంకటేశ్వరుని రూపాలు "తలప శ్రీవేంకటేశు దాసులే యాతని రూపు" (*సంపుటం1.479:321.*) గనుక వారిని సేవించడంకన్నా భాగ్యం మరొకటి లేదని

అన్నమయ్య తెలియజేశారు. ఇంతకు ముందు చెప్పిన కీర్తనల్లో విష్ణుభక్తులను సేవించమని ఆదేశంగా (order.) చెప్పిన అన్నమయ్య ఈ కీర్తనలో ఇతర ప్రాణుల్లో స్వామిని చూస్తూ, అలా చూడగలిగిన విష్ణుభక్తులను మాత్రమే సేవించమని పేర్కోనటం విశేషం. ఈ కింది కీర్తనలో ఆయన ఇంకా స్పష్టతనిచ్చారు.

**శంకరాభరణం**

**పల్లవి**

"నెరవాదిసాహసులు నిత్యశూరులు
దురిత విదూరులు ధృవాదులు

**చరణం:**

పరమశాంతములనే పట్టపేనుగులమీద
వరుసలనేగేరు వ్యాసాదులు
సిరుల శ్రీవేంకటేశు జేరి సుఖముబొందిరి
వెరసిదాస్యమున విభీషణాదులు." (*సంపుటం1.490:328.*)

అంటూ విష్ణుభక్తులు ఏంచేశారో అన్నమయ్య తెలియజేశారు. 'తపస్సువల్ల సనకాదిమునులు చక్కగా వైకుంఠానికి ఎక్కిపోయారు. విష్ణుకథల్ని మర్రి ఊడలుగా చేసుకొని సంసారం అనే సముద్రాన్ని భీష్ముడు దాటాడు. విరక్తి అనే కత్తులచేత భవపాశాలను శుకుడు, నారదాది మునులు తెగనరికారు. విష్ణుభక్తులు తమను భక్తులుగా కాకుండా దాసులుగా ఎంచుకుంటా'రని, వారు ఎంతసేపటికీ మోక్షంకోసమే తేరిపారజూస్తారని "కిక్కిరించిన యాసలగిందవేసి మోక్షము నిక్కినిక్కి చూచేవారే నీ దాసులు" (*సంపుటం1.493:330.*) కనుకనే వారు శూరులుగా కీర్తించబడుతున్నారని అన్నమయ్య ఈ సంభాషణలో వారిని గుర్తు చేసుకున్నారు. వారిని అనుసరించి మోక్షమార్గాన్ని పొందాలని తన ఆత్మలో భావించారు. అందుకే శ్రీవైష్ణవులు ఎవరికీ భయపడనవసరంలేదని కింది కీర్తనలో అన్నమయ్య సంభాషణాత్మకంగా తెలియజేశారు.

**శంకరాభరణం**

**పల్లవి**

"నీవేలికవుమాకు నీ దాసులము మేము
ఆవలనితరుల నేమడుగబొయ్యామా

**చరణం:**

అండనే కామధేనువా(శిత చింతామణివి

పండిన కల్పకమవు భక్తులకెల్లా

నిండిన శ్రీవేంకటేశ నీవు మమ్మునేలితివి

దండిగా నమ్మితే నీవు దయజూచుటరుదా"! (*సంపుటం1.455:305.*)

అంటూ అన్నమయ్య తన ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించారు. 'నీవు కామధేనువు, కల్పవృక్షానివి, చింతామణివి, అన్నిటికి మించి లక్ష్మీపతివి. నిన్ను మించిన సంపదలు మాకు లేవు. పైగా నీ భక్తులం. కనుక మా బాధ్యత నీవే వహించా'లని అన్నమయ్య తనలోని భక్తిభావాన్ని, ఆత్మ విశ్వాసాన్ని ప్రకటించారు. ఇలా విష్ణువును ఆచరించిన వారికి అన్నీ శుభాలే కలుగుతాయని ఈ సంభాషణలద్వారా ప్రబోధించారు.

ఈ జగమంతా విష్ణుమయం అని ఈ కింది కీర్తనలో తెలియజేశారు.

**ధన్యాసి రాగం**

**పల్లవి**

"వైష్ణవులుగానివార లెవ్వరులేరు

విష్ణుప్రభావమీ విశ్వమంతయుగాన

**చరణం:**

అంతయు విష్ణుమయంబట మరి దేవ

తాంతరములు గలవననేలా

భ్రాంతిబొంది ఈ భావము

భావించినంతనే పుణ్యులవుట దప్పదుగాన." (*సంపుటం1.36:24.*)

ఈ సంకీర్తనలో అంతా విష్ణుమయం అనే తత్త్వాన్ని చెప్పారు. విశ్వమంతా విష్ణువే వ్యాపించగా ఈ భేదాలు ఉండకూడదు. ఏ దేవతని తలచినా, కొలిచినా విష్ణుని తలచినట్లేనని అన్నమయ్య కరాఖండిగా చెప్పారు. అసలు మనుషులంతా విష్ణురూపులే. ఈ లోకంలో ఇంకొకరు లేరని అన్నమయ్య భావం. ఆయన కాలంనాటికి శైవ వైష్ణవుల మధ్య గొడవలు తారాస్థాయికి చేరాయని చరిత్రవల్ల తెలుస్తోంది. అన్నమయ్యకు పూర్వం ఆయన వంశీయులు శైవులు. వారు కాశీనుండి వచ్చారు. కానీ అన్నమయ్య కాలానికి పరిస్థితులు మారి, శ్రీవైష్ణవులయ్యారు. ఆ కాలంలో శివకేశవుల మధ్య భేదం లేదని అనేక కవులు సమాజాన్ని

సంస్కరించేందుకు నడుంకట్టారు. ఆ బాధ్యతను అన్నమయ్య తన భుజాలకెత్తుకున్నారు. అందుకే "అతిచంచలంబైన యాతుమగలిగించి కటమున బహుచిత్తగతుడై ఇతరులగొలిచిన యొక యనాథపతి తిరువేంకటపతి చేకొనుగాక" (*సంపుటం1.36:24.*) అంటూ శైవ వైష్ణవుల మధ్య జరిగిన అంతర్యుద్ధాన్ని ఆలంబనగా చేసుకొని, శివకేశవుల మధ్య అభేదాన్ని అన్నమయ్య ఈ సంభాషణలో తెలియజేశారు.

**పాడి రాగం**

**పల్లవి**

"ఎదుటనెవ్వరులేరు ఇంతా విష్ణుమయమే
వదలక హరిదాసవర్గమైనవారికి

**చరణం:**

చిత్తములో భావమెల్లా శ్రీవేంకటేశుడే
తక్కిన ప్రకృతియెల్లా నాతని మాయే
మొత్తిలి యీతనికంటే మరిలేదితరములు
తిత్తి దేహపు బ్రతుకు తెలిసేటివారికి." (*సంపుటం1.502:336.*)

ఈ కీర్తనలో 'భౌతికంగా విష్ణు ముద్రలు ధరించినవారికి ఈ జగమంతా సమానమే. ఈ ప్రకృతిలోని తీపంతా ఆయన ప్రసాదమే. ఈ పుణ్యక్షేత్రాలు, నదులు ఆయన రూపమే. ఈ భూమి అతని పాదరేణువు. కర్మలు ఆయన కైంకర్యాలు' అంటూ ఈ సంభాషణలో విశ్వమానవ సమానత్వాన్ని ధరించి శ్రీహరిదాసులు ఉండాలని సూచించారు. అంతా విష్ణుమయమే కాబట్టి మత సామరస్యాన్ని పాటించాలని అన్నమయ్య వైష్ణవులకు ఉదాహరణ పూర్వకంగా ఆదేశించారు. సమాజంపట్ల తమ బాధ్యతను నిర్వర్తించడం కూడా విష్ణుభక్తుల విధేనని ఈ సంభాషణలో విష్ణుభక్తులకు ఎరుకపరిచారు.

ఇలా విష్ణువుయొక్క మహిమల్ని తెలియజేస్తూనే ఆయనను నమ్ముకున్నవారు పాటించాల్సిన కట్టడలను తెలియజేశారు. మొదట్లో వీరావేశాన్ని చూపిన అన్నమయ్య రానురాను తన భక్త్యావేశాన్ని, శాంతికాముకత్వాన్ని ప్రదర్శించారు.

## 3.6. జీవాత్మ పరమాత్మ సంబంధం

ప్రతి జీవుడిలో ఆత్మ ఉంటుంది. అది పరమాత్మకు ప్రతిరూపం. మనిషిలోని తప్పొప్పులను విశ్లేషిస్తుంది. కానీ మనిషిలోని అహం అనే చీకటి దాని వెలుగును కమ్ముతుంది. అంచేత దాని ప్రతిపాదనలను, గద్దింపులను మనిషి గమనించలేడు. ఒకవేళ గమనించినా దాని ఆదేశాలను పెడచెవిన పెడతాడు. అది పరమాత్మకు ప్రతినిధిగా ఉంటుంది. ఈ కీర్తనల్లోని సంభాషణల్లో అన్నమయ్య జీవాత్మ, పరమాత్మల సంబంధాన్ని ప్రస్ఫుటీకరించారు.

**కాంబోధి రాగం**

**పల్లవి**

"దిబ్బలువెట్టుచు దేలినదిదివో
ఉబ్బునీటిపై నొకహంస

**చరణం:**

అనువున గమలవిహారమె నెలవై
ఒనరి ఉన్నదిదె ఒక హంస
మనియెడి జీవుల మానస సరసుల
ఉనికినున్నదిదె ఒక హంస." (*సంపుటం1.16:11.*)

ఈ కీర్తనలో దిబ్బ అనే మాటకు ఉన్నతమైన, పవిత్రమైన భూమి అనే అర్థాన్ని అన్నమయ్య నిక్షిప్తం చేశారు. మనుషుల మనస్సులే పవిత్రమైన భూములుగా, జీవాత్మను హంసగా వర్ణించారు. ఈ ఆత్మ అనే హంస మనలోని మంచి, చెడులను వేరు చేసి, భక్తిని ప్రసాదిస్తుంది. ఆ భక్తిబలంచేత తిరువేంకటగిరిపై కొలువై, ఒళ్ళు పెంచి ఉందని అన్నమయ్య తెలియజేశారు.

పరమాత్మను హంసతో పోల్చగా కింది కీర్తనలో జీవాత్మను చిలుకతో పోల్చి ఆత్మోపదేశం చేసుకున్నారు అన్నమయ్య.

**ఆహిరి రాగం**

**పల్లవి**

"జీవాతుమైయుండు చిలుకా
నీవావలికి పరమాత్ముడైయుండు చిలుకా

**చరణం:**

ఆతుమ పంజరములోన నయముననుండి

నా చేతనే పెరిగిన చిలుకా

జాతిగా గర్మపు సంకెళ్ళబడి

కాలజేత బేదైతివే చిలుకా.” (*సంపుటం1.50:32.*)

ఈ సంకీర్తనలో అన్నమయ్య మనలోని జీవుడు పడే కష్టాలను, వేదనలను గురించి తెలిపారు. ‘శరీరం అనే పంజరంలో ఉండి కర్మబంధాలు అనే సంకెళ్ళచేత పేదవయ్యావు. రేయింబవళ్ళు అనేకవిద్యలు నాచేతనే నేర్చుకున్నావు. అలాంటి నీవు పంచేంద్రియాలకు బెదిరిపోతూ, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలకు అతీతంగా ఉన్నావు. నీకు శ్రీవేంకటేశ్వరుని నామమే శరణ’మని అన్నమయ్య తనలోని ఆత్మకు ఉద్బోధించారు. మానవులకు మంచి చేసే నీవు తదుపరి జన్మలో ఎవరి దానివి అవుతావో! అనే సందేహాన్ని “ఎవ్వరెవ్వరివాడొ ఈ జీవుడు” (*సంపుటం1.60:40.*) అంటూ వ్యక్తం చేశారు.

ఈ కింది కీర్తనలో ఆత్మీయ విద్యను గురించి అన్నమయ్య తనలో తాను సంభాషించుకున్నారు.

**సామంత రాగం**

**పల్లవి**

“నాటికి నాడే నా చదువు

మాటలాడుచును మరి మరిచేటి చదువు

**చరణం:**

యనయనీతని ఎరుగుటకేపో

వెనకవారు చదివిన చదువు

మనసులనీతని మరచుటకేపో

పనివడి ఇప్పటి ప్రౌఢల చదువు.” (*సంపుటం1.91:63.*)

ఇప్పటి చదువు చదివినంతసేపు ఉండి తరువాత గుర్తుండదు. స్వామిని మరచిపోయేట్లుగా ఉంటుంది. కానీ అలౌకిక విద్య భగవంతుని సంపాదించుకోవడానికి మార్గం చూపిస్తుంది. అందుకే కృతయుగంలోని మునులు, బ్రహ్మ తదితరులందరూ ఈ

విద్యను నేర్చుకున్నారు. అలాంటి చదువు నేర్వాలని అన్నమయ్య తనకు తాను ఉద్బోధ చేసుకున్నారు. నేడు పాఠశాలలకు పిల్లల్ని పంపుతూ, మార్కులకోసం వెంపర్లాడే తల్లిదండ్రులతో సమాజం నిండి ఉంది. దానివల్ల విద్యార్థులు తమతోటివారిని సైతం పట్టించుకోనంతగా తీరికలేని చదువులు చదువుతున్నారు. అన్నమయ్య ఈ కాలంలోనే ఉంటే భగవంతుడు అనడానికి బదులుగా మనుషులు అనేవారేమో!

ఈ కింది కీర్తనలో జీవుడిని గురించి మరింతగా ఎరుకపరిచారు.

**భూపాళ రాగం**

**పల్లవి**

"ఏమో తెలిసెగాని ఈ జీవుడు
నేమంపు నెరవిద్య నేరడాయె

**చరణం:**

కపటాలే నేరిచెగానీ జీవుడు
ఎపుడైనా నిజసుఖమెరుగడాయె
కపురులే చవిగొనెగానీ జీవుడు
అపరిమితామృతమానడాయె." (*సంపుటం1.123:84.*)

ఈ కీర్తనలో జీవుడు పరమాత్మను చేరుకొనే విద్యను నేర్చుకోలేదని అన్నమయ్య తనలోని జీవుణ్ణి గూర్చి ఆందోళన చెందారు. 'కపటం, మోసం తప్ప నిజమైన సుఖం జీవుడు ఎరుగడు. ఈ లోక మురిపాల్లో పడ్డాడేగానీ అమితమైన అమృతం పొందే విధానం తెలియలేదు. కూటికోసం పాట్లు పడుతున్నాడు కానీ నిజమైన జీతాన్ని, జీవితాన్ని అందించే విద్యలు నేర్చుకోలేదు. మాయల్లో పడ్డాడు కానీ వేంకటేశ్వరుని సేవించే విద్యను పొందలేకపోతున్నా'డని ఆత్మీయమైన, అలౌకిక విద్యను జీవుడు నేర్చుకొనే విధంగా తనను తాను మార్చుకోవాలని ఈ కీర్తనలో ఉపదేశించుకున్నారు. కొన్ని సందర్భాల్లో మనల్ని మనం తిట్టుకుంటాం, నా బ్రతుకు ఇంతే అనుకుంటాం. ఎంత చేసినా గానీ నా జీవితం మారదు. ఇదింతే అనుకుంటాం. అదే విధానాన్ని అన్నమయ్య ఈ కీర్తనల్లో పాటించారు. "ఈ మేను తిరువేంకటేశు జేరకపోయి కామాంధుడై మిగుల గతిమాలె ప్రాణి" (*సంపుటం1.159:108.*) అంటూ స్వామిని సేవించాల్సిన ఆవశ్యకతను, ఆవిధమైన విద్యలు

నేర్చుకోకపోతే కలిగే దుష్పరిణామాలను తన జీవుడికి తెలియజేశారు. తద్వారా మనకు తెలియజేశారు.

## 3.7. యశోద, గోపికలు, ఇతరుల సంభాషణలు

ఈ సంభాషణల్లో బాలకృష్ణుని చేష్టలు, యశోదమ్మ మమకారం, గోపికల ఫిర్యాదులు, విష్ణు తత్త్వం కనిపిస్తాయి. ఈ సంభాషణల్లో స్వామిని అన్నమయ్య అసామాన్యుడైన బాలునిగా వర్ణించారు.

**ఏకతాళి, శ్రీరాగం**

**పల్లవి**

"విడుమనవో రోలు విడుమనవో వేగ
విడుమనవో తల్లి వెరచీనీ బాలుడు

**చరణం:**

ఎన్నడు గొల్లెతల ఇండ్లు వేమారు జొచ్చి
వెన్నలుబాలును వెరఘుడు
వన్నెల నీకోపమింత వద్దు నీకు నీయాన
కన్నుల నవ్వుల ముద్దుగారీనీ బాలుడు." (*సంపుటం1.57:38.*)

రోటికి కట్టబడిన కృష్ణుని అవస్థను చూసిన ఒక గోపిక కృష్ణుని విడిచిపెట్టమని యశోదతో చెప్పిన సందర్భం ఈ కీర్తనలో సహజసిద్ధంగా వర్ణించబడింది. 'గోపికల ఇళ్ళకు పోయి, పాలు పెరుగు తిని వచ్చాడు. అంతమాత్రంచేత రోటికి కడతావా? ఆ రోటితో మద్దిచెట్లను పెకలించే శక్తిగల ఈ బాలుడు నీ ప్రేమకు దాసుడై, నువ్వు కోపపడగానే ఏడుస్తూ చూస్తున్నాడు. ఇంత కోపం పనికిరాదమ్మా.' అని అన్నమయ్య తానే గోపికై, కృష్ణ తత్త్వాన్ని గురించి పలికారు.

ఈ కింది కీర్తనలో కృష్ణుని ఆగడాలను చూడవచ్చు.

**ఆహిరి రాగం**

**పల్లవి**

"అంటబారి పట్టుకోరె అమ్మలాలా ఇదే
వెంటబారనీదు నన్ను వెడమాయె తురుము

**చరణం:**

కాగెదు పెరుగు చాడె కవ్వముతో బొడిచి
లేగల దోలుకొని అలిగిపోయీనీ
రాగతనమున వాడె రాతిరినారగించదు
ఆగి నన్ను గూడడిగె నయ్యో ఇందాకను." (*సంపుటం1.122:84.*)

ఈ సంభాషణ సహజసిద్ధంగా సాగింది. ఈ కీర్తనలో గోపిక కోపాన్ని బహిరంగంగానూ, ఆమె విరహాన్ని అంతర్గతంగాను అన్నమయ్య తెలిపారు. అందుకే "వెట్టికి నాకొరకుగా వేంకటేశుడారగించే" అని ఆమెతో పలికించారు. ఇంతచేసినా వారు కృష్ణమాయలో ఓలలాడారని అన్నమయ్య తెలియజేశారు.

ఎట్టకేలకు కృష్ణుని దైవత్వాన్ని గోపికలు తెలుసుకున్నారు. ఆయన లేకపోతే బ్రతకడానికి కూడా ఇష్టపడనంత ఇష్టాన్ని పెంచుకున్నారు. తమను వదిలి వెళ్ళిన కృష్ణునికోసం గోపికల ఎదురుచూపులు ఈ కింది కీర్తనలోని సంభాషణలో చూపించబడ్డాయి.

**పాడి రాగం**

**పల్లవి**

"వెట్టిమోపువంటి మేను విడనాడి వీ
డిట్టే దాటిపోయె నెటువంటి జాణే

**చరణం:**

కన్నవారి దన్ను బ్రేమ
నన్నవారి దిగనాడి ఉన్నతమైన చోటనుండబోయి
తన్నుదా వేంకటపతి దాసులజేరివాడు
ఎన్నడు దిరిగిరాడే ఎటువంటి జాణే." (*సంపుటం1.173:.*)

ఈ కీర్తనలో గోపికల విరహాన్ని అత్యంత సహజంగా వర్ణించారు. గోపికలు ఒకరితో ఒకరు సంభాషించుకున్నట్లు ఉంది. తమను అల్లరి పెట్టాడని యశోదకు ఫిర్యాదులు చేసిన గోపికలు కృష్ణుని వదిలి ఒక్క క్షణం కూడా ఉండలేనంత భక్తికి చేరుకున్నారు. ప్రతి క్షణం కృష్ణుడికోసం ఎదురు చూసి, పరితపించారు. ఆయనకోసం వనాల్లో వెదికారు. ఆ

సందర్భాలను అన్నమయ్య పై కీర్తనలో అద్భుతమైన సంభాషణలతో విశ్లేషించారు. కృష్ణుని బాల్య చేష్టలను పోతన భాగవతంలోని దశమ స్కంధంలో పద్య రూపంలో వివరించారు. ఆ కవి మార్గాన్ని అనుసరించి అన్నమయ్య సంకీర్తనల ద్వారా ఆ సన్నివేశాలన్నింటినీ కళ్ళకు కట్టారు.

ఈ కింది కీర్తనలో కృష్ణ లీలల్ని తెలియజేశారు.

**ముఖారి రాగం**

**పల్లవి**

"అరిది సేతలే చేసి తల్లాడ విల్లాడ
సరిలేక ఉండితివి జలరాశికాడ

**చరణం:**

పొలియబీర్చితివొకతి బురిటిమంచముకాడ
నలచితివొకని గగనంబుకాడ
బలిమిదన్నితివొకని బండిపోతులకాడ
దులిమితివి ఏడుగుర దోలి మందకాడ." (*సంపుటం1.294:196.*)

ఈ కీర్తనలో బాలకృష్ణుని లీలల్ని అన్నమయ్య గానం చేశారు. 'పురిటిమంచంకాడ పూతనను, ఆకాశంలో తృణావర్తుణ్ణి, బండి దగ్గర శకటాసురుణ్ణి చంపావు. ఆలమందల దగ్గర ఏడుగురు రాక్షసులను సంహరించావు. తాటిమాకుల దగ్గర ఒక రాక్షసుణ్ణి కొట్టి చంపావు. పెయ్యదూడల దగ్గర ఒకణ్ణి, బృందావనం దగ్గర ఇంకొక రాక్షసుణ్ణి చంపావు. కాళియుని మదాన్ని అణిచావు. యమలార్జునులు అనే ఋషులకు శాపవిమోచనం కలిగించావు' అంటూ కృష్ణుడు చేసిన రాక్షస సంహారాన్ని అన్నమయ్య ఈ సంకీర్తనలో పేర్కొన్నారు.

**భైరవి రాగం**

**పల్లవి**

"వీడివో ఇదె వింతదొంగ
వేడిపాలు వెన్న వెరజిన దొంగ

**చరణం:**

వెలయనీట జొప్పు వేసేటి దొంగ

తలగాననీక దాగు దొంగ

తలకక నేల దవ్వేటి దొంగ

తెలిసి సందెకాడ దిరిగేటి దొంగ." (*సంపుటం1.322:215*)

కృష్ణుని అన్నమయ్య ఏవిధంగా భావించారో? ఈ కీర్తనను చదివితే మనకు గోచరమవుతుంది. 'మాపటివేళ పాలు, వెన్నకోసం మాటువేసి, గోపికల ఇళ్ళలో దొంగతనం చేసే కృష్ణుడు ఆవుల దగ్గరకు దూడల్ని తోలి, తల్లి బిడ్డల మధ్య సంబంధాన్ని తెలియజేశాడు. ప్రసాదాలు ఎంగిలి చేసి, వారి నైవేద్యాలు గ్రహించాడు. బలిని పాతాళానికి తొక్కిన ఆయన తల్లి ప్రేమ బంధనానికి కట్టుబడ్డాడు. గోపికలకు బిడియం పోగొట్టిన ముని ఇప్పుడు తిరుమలలో కొలువై, భక్తుల పాలిటి కొంగుబంగారమై ఉన్నా'డని అన్నమయ్య స్వామి ఘనతల్ని ఈ సంభాషణలో తెలియజేశారు. ఆ వింతలన్నీ తమ కళ్ళారా చూసినప్పటికీ గోపాలకులు ఆయనను అర్థం చేసుకోలేక, కృష్ణమాయలో ఉండిపోయారని కింది కీర్తనలో తెలియజేశారు.

**లలిత రాగం**

**పల్లవి**

"ఏల మోసపోయిరొకో ఎంచి యాకాలపువారు

బాలకృష్ణుని బంట్లై బ్రదుకవద్దా!

**చరణం:**

పశులగాచేవాని బ్రహ్మ నుతించెనంటేను

దెసల దేవుడేయని తెలియవద్దా!

శిశువు గోవర్ధనాద్రి చేతబట్టి ఎత్తెనంటే

కొసరీతని పాదాలే కొలువవద్దా"! (*సంపుటం1.503:337.*)

ఈ కీర్తనలో కృష్ణ మాయకు అన్నమయ్య ఆశ్చర్యచకితుడయ్యారు. ఎలా మోసపోయారో! అని ఆ కాలంవారిపై జాలిపడ్డారు. బాల్యంలో పశువులు కాసిన కృష్ణుని బ్రహ్మ కీర్తించాడు. గోవర్ధనగిరిని గోటితో ఎత్తిపట్టుకున్నాడు. అర్జునుడికి తన విశ్వరూపం చూపించాడు. శిశుపాలుణ్ణి చక్రంతో చంపాడు. దేవతలందరిలో అగ్రపూజను స్వీకరించాడు. అయినప్పటికీ ఆ కాలంలోని మనుషులు కృష్ణమాయలో మోసపోయారని అన్నమయ్య ఆశ్చర్యాన్ని ప్రకటించారు. ఈ కీర్తనలో ఇతర దేవతా నింద కనిపిస్తుంది. "అందె

శ్రీవేంకటేశుడట్టె దృష్ట దైవమంటే విందుల బరులసేవ విడువవద్దా?” అని మానవాళిని ఈ సంభాషణలో ప్రశ్నించారు.

కృష్ణ తత్త్వాన్ని తెలుసుకున్న మునులు, ఋషులు ఆయనను కీర్తించారు.

**భైరవి రాగం, రచ్చతాళం**

**పల్లవి**

“పట్టవసముగాని బాలుడా పెను
బట్టపు బలువుడ బాలుడా

**చరణం:**

ఇరుగడ బ్రహ్మయు నీశ్వరుడును నిన్ను
వరుస నుతింప జఠరమున
అరుదుగనుండి ప్రియంబున వెడలిన
పరమమూర్తివా బాలుడా.” (*సంపుటం1.58:39.*)

ఈ సంకీర్తనలో కృష్ణుని అర్థం చేసుకోవడం సాధ్యమవుతుందా? అని అన్నమయ్య మనల్ని ప్రశ్నించారు. ‘యశోదమ్మ రోటికి కట్టినప్పుడు తన రూపాన్ని విస్తరించి, కన్న ప్రేమకు, భక్తికి పట్టుబడ్డాడు. కంసునినుండి తప్పించుకొని నిద్రనుంచి మేల్కొనే సమయానికి వ్రేపల్లెలో ఉన్నాడు. బ్రహ్మ, ఈశ్వరులు అతనిని నుతిస్తూ ఉండగా ఈ లోకంలో అందరిపట్ల విధేయత చూపిస్తూ, భయంకొద్దీ వారికి లోబడుతున్నట్లు నటిస్తున్నా’డని కృష్ణ మాయను అన్నమయ్య ఈ కీర్తనలో తెలియజేశారు.

**మలహరి రాగం**

**పల్లవి**

“పాలదొంగ వద్ద వచ్చి పాడేరు తమ
పాలిటి దైవమని బ్రహ్మాదులు

**చరణం:**

రోలగట్టించుక పెద్ద మ్రోలలుగా వాపోవు
బాలుని ముందర వచ్చి పాడేరు
ఆలకించి వినుమని యంబరభాగమునందు
నాలుగు దిక్కులనుండి నారదాదులు.” (*సంపుటం1.311:208.*)

పాలను దొంగిలే కృష్ణుని దగ్గరకు వచ్చి, బ్రహ్మాది దేవతలు నుతించారని అన్నమయ్య తెలియజేశారు. 'రోటికి కట్టబడి, పెద్దగా వాంకెర్లు కొడుతూ, ఏడ్చే పిల్లవాడి దగ్గర నారదాది మునులు మా మొర్ర ఆలకించమని పాడేవారు. నోటినిండా జొల్లు కార్చుకుంటూ, దుమ్ము కొట్టుకుపోయిన శరీరంతో ఉన్న పిల్లవాడి దగ్గర శేషాదులు వేదాలు చదివేవారు. మూలల్లో దాక్కొని, దోబూచులాడే బాలుడి దగ్గర సనకాదులు వేంకటేశ్వరుడు ఇతడేనని పాడా'రని అన్నమయ్య అపూర్వమైన కృష్ణ తత్త్వాన్ని ఈ సంభాషణల్లో తెలియజేశారు.

ఈ విధంగా కృష్ణుని చేష్టలను అన్నమయ్య తెలియజేశారు. ఈ సంభాషణల్లో అనేక రూపాల్లో ఉంటూ, తన జీవితమే ఒక తత్త్వ పాఠంగా చెప్పిన శ్రీకృష్ణుని మాయలను సంభాషణాత్మకంగా సంకీర్తన చేశారు.

## 3.8. సంసార సంకీర్తనల్లో సంభాషణలు

ఈ సంకీర్తనల్లో సంసారంపై తనదైన శైలిలో సంభాషించారు. కొన్ని సందర్భాల్లో సంసారాన్ని మెచ్చుకోగా, మరికొన్ని సందర్భాల్లో నిరసించారు. ఇంకొన్ని సందర్భాల్లో మానవాళికి దాని అవసరాన్ని తెలియజేశారు. ఏదేమైనా భగవంతుని ధ్యానించేందుకు సంసారం అడ్డుపడకుండా చూసుకోవాలని సంభాషించారు. ఇదంతా ఆ స్వామి లీలగా అన్నమయ్య భావించారు.

**లలిత రాగం**

**పల్లవి**

"మంచిదివో సంసారము మదమత్సరములు మానిన
కంచును బెంచును నొకసారిగా దాచూచినను

**చరణం:**

ఆపదలకు సంపదలకు నభిమానింపక యుండిన
పాపము బుణ్యము సంకల్పములని తెలిసినను
కోపము శాంతము తమతమ గుణములుగా భావించిన
తాపము చైత్యములకు దా దడబడకుండినను." (*సంపుటం1.45:29.*)

ఈ సంకీర్తనలో సంసారం మంచిదేనని అన్నమయ్య అభిప్రాయపడ్డారు. అందుకు ఆయన కొన్ని నియమాలను ప్రస్తావించారు. ఆపదలు, సంపదలకు చలించకపోవడం, పాపం, పుణ్యం స్వామి సంకల్పం అని తెలుసుకోవడం, కోపం, శాంతాలను గుణాలుగా భావించి, తాపానికి తడబడకుండటం, మనసావాచా స్వామికి దాసులై ఉండడం మొదలైన నియమాలను పేర్కొన్నారు.

**ముఖారి రాగం**

**పల్లవి**

"చలపాది రోగమీ సంసారము నేడు
బలువైన మందు విష్ణుభక్తి జీవులకు

**చరణం:**

కీడవుట మదినెరింగియు మోహమెడలదిది
పాడైన విధికృతము బలవంతము
ఈడనే ఇది మాన్ప హితవైన వజ్రాంగి
జోడువో హరిదలంచుట జీవులకును." (*సంపుటం1.132:90.*)

ఈ కీర్తనలో సంసారం మాత్సర్యంతో కూడుకుందని అన్నమయ్య తెలిపారు. 'కీడు జరుగుతుందని తెలిసి కూడా మోహాన్ని విడిచిపెట్టదు. మానవాళిని విధికి బలిచేయడంలో వజ్ర సంకల్పం కలిగి ఉంటుంది. శృంగారసుఖం హేయమైందని తెలిసికూడా బలవంతంగా మానవాళిని అందులో తోస్తుంది. ఇలా అనేక పాపాలు మనచే చేయిస్తుంది. అందుకే ఆ హరిని, సంసారపు మాయలోనుంచి విడిపించే మాధవుని తలచుకోవాలి. అప్పుడు స్వామి మనల్ని ఈ మాయనుంచి, రొంపిలోనుంచి రక్షిస్తాడు. అది తెలియక ఎక్కడెక్కడో తిరిగి, అనేకమైన ఆపదలను కొనితెచ్చుకుంటున్నావ'ని, అరిషడ్వర్గాలు, పంచేంద్రియాలు నీలోని కర్మకి అధిపతులని నీవు తెలుసుకోలేకపోతున్నావని "మేనిలోని ఏగురునార్గురును మిత్రులనుచు నమ్మేవు ఆనందంబుననా కర్మమునకు అధిపతులని తెలియగలేవు" (*సంపుటం1.184:123.*) అని తన ఆత్మకు, తద్వారా మనకు ప్రబోధం చేశారు. 'మాత్సర్యపు సంసారమనే రోగం నుండి విష్ణువు అనే మందు మనల్ని బ్రతికిస్తుం'దని ఈ సంభాషణలో అన్నమయ్య చెప్పారు.

### భైరవి రాగం

**పల్లవి**

"సడిబెట్టె గటకటా సంసారము చూడ
జడధి లోపలి ఈత సంసారము

**చరణం:**

చలువ లోపలి వేడి సంసారము చూడ
జలపూత బంగారు సంసారము
ఇలలోన దిరువేంకటేశ నీ దాసులకు
చలువలకు గడుజలువ సంసారము." (*సంపుటం1.1998:132.*)

ఈ కీర్తనలో అన్నమయ్య సంసారపు వేషాలను, దాని పోకడలను తెలియజేశారు. చూడడానికి వెలుగిచ్చే దీపంలా కనబడుతుంది. కానీ అది ఒత్తి తీసిన దీపం. పెద్ద తెగులు. మనతో మనం చేసుకొనే యుద్ధం. ఒకరితో ఒకరికి ముడివేసే సంధితాడే కానీ అంతా కంతలు, అతుకులమయం. చూడడానికి చంద్రుడంత చల్లగా ఉంటుంది కానీ అందులో ప్రవేశిస్తేగాని బాధలేవో తెలియవు. పాలరాతిలో వేడి. బంగారు నీటితో పూసిన పూత అని అన్నమయ్య సంసారాన్ని తీవ్రంగా నిరసించారు. కానీ స్వామి దాసులకు మాత్రం 'చలువలకు కదు చలువ' అన్నారు. ఈ కింది సంకీర్తనలో సంసారాన్ని మరింతగా నిరసించారు.

### శ్రీరాగం

**పల్లవి**

"ఇదివో సంసారమెంత సుఖమో కాని
తుదలేని దుఃఖమను తొడవుగడియించే

**చరణం:**

పంచేంద్రియంబులను పాతకులు దనుదెచ్చి
కొంచపు సుఖంబునకు గూర్పగాను
మించి కామంబనెడి మేటి తనయుండు జని
యించి దురిత ధనమెల్ల గడియించే." (*సంపుటం1.308:206.*)

పంచేంద్రియాలనే పాపాత్ములు క్షణిక సుఖం కోసం ఉబలాటపెట్టగా, కామమనే కొడుకు జన్మతోనే పాపపు ధనాన్ని సంపాదించిపెట్టాడు. ప్రాయమనే మహాపాపి

మాయాసుఖాలకు మరిపిన ఫలితంగా మోహం అనే కుమారుడు నరకాన్ని సంపాదించిపెట్టాడు. కానీ స్వామి దయవల్ల మనస్సులో విరక్తి అనే కూతురు మోక్షసంపదల్ని సాధించిపెట్టింది. అని అన్నమయ్య పాప మోహాలను కుమారులుగా, వైరాగ్యాన్ని కూతురుగా భావించారు. ఈ కీర్తనలో సంసారంవల్ల కలిగే దుష్పరిణామాలను తెలియజేశారు. బుద్ధికి వేరుపురుగులా మోహవికారం కలుగుతుంది. సమయం మించిపోయాక లింగం మీది ఎలుకలాగా ఆత్మ పరితాపం చెందుతుంది. కానీ స్వామి కృప ఉన్నవారికి ఈ సంసారపు వాసనలు అంటవని మానవాళికి అన్నమయ్య అభయమిచ్చారు. ఈ సంకీర్తనలో కొడుకుల్ని పాపానికి, కూతురిని మోక్షానికి సంకేతంగా చూపించారు. అంటే ఈయన ఆడ, మగ పిల్లలమధ్య తల్లిదండ్రులు తారతమ్యం చూపడాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. కొడుకు పున్నామ నరకంనుండి తప్పిస్తాడనే వాదనను పూర్తిగా గర్హించారు. ఆ బాధ్యతను కూతురు కూడా నిర్వహించగలదని అన్నమయ్య ఈ సంభాషణలో సమాజానికి అవగతం చేశారు.

ఈ కింది సంకీర్తనలో సంసారంవల్ల కలిగే ఫలితాన్ని సంభాషించారు.

**మలహరి రాగం**

**పల్లవి**

"ఎన్నడు పక్వముగాదిదే ఇంద్రియ భోగంబులచే
సన్నము దొడ్డును దోచీ సంసారఫలంబు

**చరణం:**

వినుకలి చదువుల చదలో వేమరు
మాగగబెట్టిన ఘన కర్మపుటొగరుడుగదు
కమ్మర పులిదాయై మనుమని శ్రీవేంకటేశుకు మహినాచార్యుడు
కానుక చనువున నియ్యగ వెలసెను సంసారఫలంబు."
(*సంపుటం1.482:323.*)

ఈ నూరేళ్ళదేహంలోని చివరి రోజుల్లో లేతకాయలా భగవంతునిపై ధ్యానం మీద మనస్సు మరలుతుంది. కానీ సత్తువ (బలం) ఉన్నంతకాలం సంసారావస్థల్లో దేహం చిక్కుబడుతుంది. ఈ సంసారఫలితంగా పుత్రులు, పౌత్రులు అనేవిత్తనాలు మొలకెత్తుతాయి. అవి పూలు, పిందెలుగా రూపాంతరం చెందుతాయి. ఫలితంగా దేహి దుఃఖం అనే పంట కోస్తాడు. ఎన్ని శాస్త్రాలు విన్నా, ఎన్ని చదువులు చదివినా మనస్సు అనే ఆకు మీది నూగులో

(the hair on a leaf) మాగబెట్టిన ఘనకర్మమనే వగరు ఇనుమంత గట్టిగా కావడంవల్ల ఉడకదు. కాబట్టి ఆ స్వామికి మన జీవితాన్ని కానుక చేయడంవల్ల సంసారి అయినప్పటికీ మనిషి మంచి ఫలితాన్ని పొందుతాడని అన్నమయ్య గూఢార్థాన్ని ఈ సంభాషణలో నిక్షిప్తం చేశారు. ఇవన్నీ నాకు సహజమేనని కింది సంకీర్తనలో అన్నమయ్య ఆ స్వామితో చెప్పుకున్నారు.

**గుజ్జరి రాగం**

**పల్లవి**

"సంసారినైన నాకు సహజమే
కంసారి నేనిందుకెల్లా గాదని వగవను

**చరణం:**

మాయకు లోనైన నాకు మత్తుడనై ఇన్నాళ్ళు
చాయకు రానిదెల్లా సహజమే
ఇయ్యెడ శ్రీవేంకటేశ ఏలితివి నన్ను నీవు
మోయరాని నేను నీకు మోపని వీగేను." (*సంపుటం1.491:329.*)

'ఈ సంసార కర్మలు, సుఖదుఃఖాలను అనుభవించడం సహజం. కానీ వాటిని పరాభవించడానికి నాకు నీ శరణు ఉంది. పుట్టిన నేను కర్మ పొంగులో కట్టుబడడం సహజం. కానీ దానినుండి విడిపించి నాకు మోక్షాన్ని ఇస్తావు. ఈ మాయలో పడి ఇన్నాళ్ళు నీ నామ స్మరణం గుర్తుకు రాకపోవడం కూడా సహజం. కానీ నీవే నన్ను ఏలుతున్నావు. కనుక నేను నీకు ఎన్నటికీ భారం కా'నని అన్నమయ్య స్వామిపై తన ఆత్మ విశ్వాసాన్ని ప్రకటించారు.

ఈ కింది కీర్తనలో సంసారంనుండి రక్షించేది స్వామేనని మానవాళికి ఉద్బోధ చేశారు.

**సాళంగ రాగం**

**పల్లవి**

"ఉన్న విచారములేల ఓహో సంసారులాలా
ఇన్నిటికితడే రక్ష ఇదే మీకు మనరో

**చరణం:**

తక్కక బ్రహ్మల గన్నతండ్రి గొలిచి మీరు

ఎక్కువ సంతతిగల్గి ఈడేరరో
అక్కున లక్ష్మీనారాయణుల దలచి మీరు
చొక్కి మీమీ దంపతులు సుఖముననుండరో
**చరణం:**
తల్లిదండ్రినీతడే తగజుట్టమీతడే
ఎల్లగా బుట్టించి పెంచే ఏలికీతడే
చల్లగా శ్రీవేంకటేశుశరణంటిమిదే మేము
కొల్లగా మీరెల్లా మమ్ము గురిగా వర్ధిల్లరో." (*సంపుటం1.441:295.*)

'బ్రహ్మలను కన్న తండ్రిని కొలిచి, ఎక్కువ సంతానం పొందండి. లక్ష్మీ నారాయణులను ఆశ్రయించి, దంపతులు సుఖంగా ఉండండి. భవరోగాలను బాపేవాణ్ణి సేవించి, వాటినుండి విముక్తి పొందండి. ఆయనే తల్లి, తండ్రి, చుట్టం. పెంచి, పోషించేవాడు.' అంటూ 'స్వామి భక్తులమైన మమ్మల్ని ఆదర్శంగా ఉంచుకొని వర్ధిల్ల'మని అన్నమయ్య నాటి సమాజానికి ఉద్బోధ చేశారు. ఈ సంభాషణలో అన్నమయ్య అధిక సంతానం పొంది, రోగాలనుండి రక్షింపబడేందుకు స్వామిని ఆశ్రయించాలని, అందుకు ఆయనలాంటి విష్ణుభక్తుల్ని ఆదర్శంగా తీసుకోవాలని ప్రజలను కోరుకున్నారు. దంపతులు లక్ష్మీనారాయణులను ఆదర్శంగా గైకొని, ఉత్తమ దాంపత్య జీవితాన్ని గడపాలని ఆశీర్వాదపూర్వకంగా బోధించారు. ఈ విధంగా సంసార కీర్తనల్లో సంభాషణలు సాగాయి. ఇక్కడ సంసారాన్ని అన్నమయ్య ఈసడించుకోలేదు. దానివల్ల కలిగే ఫలితాలను, అది కల్పించే అడ్డంకులను మాత్రమే ఈసడించుకున్నారు.

## 3.10. పూజా సంభాషణలు

ఈ కీర్తనల్లో అన్నమయ్య సంభాషణలు అంతర్గతంగా, బహిర్గతంగా, స్వామితో సాగాయి. పూజా సమయాల్లో స్వామిని నిద్ర లేపడం నుంచి పండుకోబెట్టేంతవరకూ ఆయా సేవల రూపంలో తిరుమలలో నిత్యపూజలు కొనసాగుతున్నాయి. స్వామిని నిద్ర లేపడానికి సుప్రభాతసేవ, ఆరగింపుసేవ, తిరుమాడ వీథుల్లో ఊరేగించేందుకు ఊరేగింపు సేవ, హారతిసేవ, ఊంఝల్ సేవ లేక పవ్వళింపు సేవ, (ఊయలసేవ.) ఇలా అనేకరకాల సేవలు

స్వామికి నిత్యం జరుగుతున్నాయి. ఈ సేవల సమయాల్లో పాడుకొనే సంకీర్తనలు అన్నమయ్య కలంనుంచి జాలువారాయి.

ఈ కింది సంకీర్తనలో స్వామిని నిద్ర లేపడం అనగా సుప్రభాత సేవను మనం గమనించగలం.

**భూపాళ రాగం**

**పల్లవి**

“భోగిశయనమును బుసకొట్టెడిని
యోగనిద్ర పాయను మేల్కొనవే

**చరణం:**

కన్నులుదెరవక కమలబాంధవుడు
వెన్నెలరేణువు వెలయదిదే
అన్నువమలసీ నరుణోదయమిదె
మిన్నక నీవిటు మేలుకొనవే.” (*సంపుటం1.139:94.*)

శయ్య అయిన ఆదిశేషుడు బుసకొడుతూ, మేలుకొలపడానికి ప్రయత్నిస్తున్నాడని అన్నమయ్య స్వామిని నిద్రలేపారు. ‘అనేక కళ్ళు నిన్ను చూసేందుకు ఆతురత పడుతున్నాయి. కమలనాభా తెల్లవారింది. కనుక కన్నులు తెరచి మేలుకో’మని స్వామిని నిద్ర లేపారు. ‘నీవు రాత్రింబవళ్ళకు అతీతుడవు’ అంటూ కింది కీర్తనలో స్వామిపై జాలిపడ్డారు.

**ధన్యాసి రాగం**

**పల్లవి**

“ఉప్పవడము గాకున్నారిందరు
ఎప్పుడు రేయి నీకెప్పుడు పగలు

**చరణం:**

కన్నుల చంద్రుడును కమలమిత్రుడును
ఉన్నతినివి నీకుండగను
వెన్నెల ఎండలు వెలయగ మేల్కొను
ఎన్నడు ఎన్నడు నీకు!” (సంపుటం1.148:101.)

ఈ కీర్తనలో అన్నమయ్య స్వామి మీద జాలి చూపిస్తూ, అందరూ నీ దర్శనార్థం వేచి ఉన్నారు. కనుక నిద్రలోనుంచి మేల్కొమని అచ్చమైన రాయలసీమ మాండలికంలో నిద్ర లేపారు. 'కన్నుల్లో చంద్రుడు, పద్మాలను వికసింపజేసే సూర్యుడు నీలో కొలువై ఉన్నారు. ఎండ, వెన్నెలలు నీకు మిత్రులు. ఏకాంతంలో నీ సతి ముఖారవిందం, కమలాలవంటి కళ్ళు విచ్చుకున్నాయి.' అంటూ స్వామికి తన బాధ్యతను గుర్తు చేస్తూ, శృంగారాన్ని రంగరించి మేల్కొలిపారు.

కింది కీర్తనల్లో ఆరగింపు సేవ పేర్కొనబడింది.

**శ్రీ రాగం**

**పల్లవి**

"ఇందిర వడ్డించనింపుగను
చిందకయిట్లే భుజించవో స్వామి

**చరణం:**

అక్కాశపాశాలు నప్పాలు వడలు
పెక్కైన సైదంపు పేణులును
చక్కెర రాశులు సద్యోఘృతములు
కిక్కిరియనారగించవో స్వామి." (*సంపుటం1.22:15.*)

ఈ కీర్తనలో మిరియాల తాళింపు, బూరెలు, కూరలు, పచ్చళ్ళు, పిండివంటలు, పెరుగులు పాలు, పాశాలు తినమని స్వామిని కోరారు అన్నమయ్య.

**ధన్యాసి రాగం**

**పల్లవి**

"పంకజాక్షులు సొలసిపలికిననగా
నింకా నారగించు మిట్లనే అయ్యా

**చరణం:**

కలవంటకములు పులుగములు దుగ్ధాన్నములు
పలుదెరగులైన అప్పములగములు
నెలకొన్న నేతులును నిరతంపు చక్కెరలు
గిలుకొట్టుచును నారగించవయ్యా." (*సంపుటం1.138:95.*)

ఇంకా ఈ కీర్తనలో దంపుడు పిండివంటలు, మెరుగు పొడిబెల్లం, మీగడపెరుగులు, అనేకవిధాలైన కూరగాయలతో కడుపునిండా తిని, తాంబూళం వేసుకోమని అన్నమయ్య స్వామితో చెప్పారు. ఈ కీర్తనల్లో కడుపు నిండా అనడానికి 'కిక్కిరియ' కిక్కిరిసి అనే అచ్చతెలుగు మాటను వాడారు. పిండివంటలతోబాటు తన మనస్సును కలిపి స్వామికి ఆరగింపు చేశారు.

ఈ కింది కీర్తనలో స్వామికి జరిగే రథోత్సవాన్ని గురించి అన్నమయ్య ప్రజలతో సంభాషించారు.

**శంకరాభరణం**

**పల్లవి**

"అదె వాడె ఇదె వీడె అందునిందు నేగీనీ
వెదకి వెదకి తిరువీథులందు దేవుడు

**చరణం:**

అలసూర్య వీథినేగీ నాదిత్యుని తేరుమీద
కలికి కమలానందకరుడుగాన
తలపోసి అదియును దవ్వు చుట్టరికమని
ఇలదేరి మీదనేగీ నిందిరా విభుడు." (*సంపుటం1.424:284.*)

ఈ కీర్తనలో స్వామికి జరిగే రథోత్సవ ప్రాధాన్యత తెలుపబడింది. 'స్వామి కమలాక్షుడు, కమలనాభుడు కనుక ఆ చుట్టరికానికి కట్టుబడి, సూర్య రథంపై ఊరేగాడు. కువలయ హితుడు, చంద్రుడి బావ కాబట్టి సోమరథంపై ఊరేగాడు. స్వామి శృంగార పురుషుడు కనుక కృష్ణావతారంలో ఉన్నప్పుడు గోపికల మనోరథాలపై ఊరేగాడు. అలాంటివాడు తిరువీథుల్లో నేడు రథారూఢుడై ఊరేగుతున్నా'డని అన్నమయ్య స్వామి ఘనతను తెలియజేశారు. తిరుమలలో సూర్య రథోత్సవం చాలా ప్రసిద్ధి చెందింది. ఈ ఉత్సవంతోబాటు బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగే తొమ్మిది ఉత్సవాలను ఈ కీర్తనలో అన్నమయ్య ప్రస్తావించారు.

ఈ కింది కీర్తనలో పవళింపు సేవ పేర్కొనబడింది.

**ఆహిరి రాగం**

**పల్లవి**

"అలరజంచలమైన ఆత్మలందుండ నీ
అలవాటుసేసెనీ ఉయ్యాలా
పలుమారునుచ్ఛ్వాస పవనమందుండ నీ
భావంబు దెలిపెనీ ఉయ్యాలా

**చరణం:**

ఉదయాస్త శయనంబులొనర గంభములైన
ఉడుమండలము మోచెనుయ్యాలా
అదననాకాశ పదమడ్డదూలంబైన
అఖిలంబునిండెనీ ఉయ్యాలా." (*సంపుటం1.67:45.*)

అంటూ ఆ ఉయ్యాలలోని స్వామి మాహాత్మ్యాన్ని తెలియజేశారు. ఈ విశ్వాన్ని ఉయ్యాలగా చేసి, స్వామి ఊగుతున్నారని ఆయన భావించారు. ఈ విశ్వమంతటికీ ఆధారమై ఉన్న స్వామి పడుకున్న ఉయ్యాలను భామినులు పాలిండ్లు కదిలేట్లుగా ఊపారని కొంత శృంగారాత్మకతను జోడించి, అనేక అంశాలను, విశ్వాంతరాత్మ తత్త్వాన్ని తెలిపారు.

**ముఖారి రాగం**

**పల్లవి**

"జనులు నమరులు జయలిడగా
ఘనుడదె ఉయ్యాల గంభముకాడ

**చరణం:**

వదలక వలసిన వారికి వరములు
ఎదురెదురై తానిచ్చుచును
నిదురలేక పెను నిధి నిధానమై
కదలడదే గరుడ గంభముకాడ." (*సంపుటం1.320:214.*)

ఈ కీర్తనలో వెంకటేశ్వర స్వామి భక్తులకు వరాలిచ్చేందుకు నిద్ర లేకుండా ఉన్నాడని అన్నమయ్య స్వామి దయను కొనియాడారు. 'జనులు, దేవతలు, తనను పూజించేవారికి తానే

ఎదురొచ్చి, వరాలిస్తాడు. ఆయన వరాలనిధి, అందరినీ ప్రేమతో ఆదరించడంవల్ల నిద్ర లేకుండా ఉన్నాడు. నిజానికి ఈ ఊయల సేవలు ఆయనను నిద్ర పుచ్చేందుకు ఏర్పడినవి కావు. ఆయన కృపా కటాక్షాలను జనులు, దేవతలు పొందేందుకు ఏర్పడిన'వని అన్నమయ్య భావించారు.

ఈ కింది కీర్తనలో అన్నమయ్య స్వామికి మంగళహారతి ఇచ్చి, పవళింపు సేవ చేసుకున్నారు.

**లలిత రాగం**

**పల్లవి**

"మంగళము గోవిందునకు జయమంగళము గరుడధ్వజునకును
మంగళము సర్వాత్మునకు ధర్మస్వరూపునకు జయజయ

**చరణం:**

ఆదికిని నాదైన దేవునకచ్యుతున కంభోజునాథున
కాదికూర్మంబైన జగదాధార మూర్తికిని
వేదరక్షకునకును సంతత వేదమార్గ విహారునకును బలి
భేదికిని సామాదిగానప్రియా విహారునకు" (*సంపుటం1.46:30.*)

'గోవిందుడికి, గరుడధ్వజుడికి, సర్వాత్ముడికి, ధర్మస్వరూపుడైన స్వామికి మంగళం. అచ్యుతుడికి, అంభోజనాథుడికి, ఆదికూర్మమైన జగదాధార మూర్తికి, వేదరక్షకుడికి, బలిభేదికి, సంగీతాన్ని విని ఆనందించే స్వామికి మంగళం. హరికి, పరమేశ్వరుడికి, శ్రీధరుడికి, కాలాంతకుడికి, పురుషోత్తముడికి, సురలచే, మునులచే స్తోత్రింపబడే సుర రాక్షస గణాల శ్రేష్ఠుడికి, కాత్యాయని నుతించే కరుణాకరుడైన స్వామికి మంగళం. పంకజాసన వరదుడికి, భవబంధాలు అనే పంకాన్ని పోగొట్టేవాడికి, శివుడికి, శంకరునికి, అన్ని రూపాలలో కొలువైన అంతర్యామికి, వేంకటాచల వల్లభుడికి మంగళం.' అంటూ అన్నమయ్య స్వామిని పరిపరివిధాలుగా స్తుతిస్తూ, మంగళహారతి ఇచ్చారు. ఈ సంకీర్తనలో లక్ష్మీ నారాయణులు, శివ పార్వతులు గోచరిస్తారు. ఆ ఇరువురు దంపతులకు ఏకరూపత కల్పించి, అన్నమయ్య మంగళహారతి ఇచ్చారు.

**రామక్రియ రాగం**

**పల్లవి**

"మరలిమరలి జయమంగళము

సొరిదినిచ్చలును శుభమంగళము

**చరణం:**

కమలారమణికి కమలాక్షునకును

మమతల జయజయ మంగళము

అమరజననికిని అమరవంద్యునకు

సుముహూర్తముతో శుభమంగళము." (*సంపుటం1.448:300.*)

ఈ కీర్తనలో స్వామికి, అమ్మవారికి మంగళహారతి సంయుక్తంగా ఇచ్చారు. 'కమలా రమణికి కమలనాభుడికి, దేవతల జననికి దేవతలచే నుతింపబడే స్వామికి, జలధి కన్యకు, జలధిశాయికి, సిరులకు ఆలవాలమైన లక్ష్మీదేవికి, ఆమె భర్తకు మంగళం' అంటూ అన్నమయ్య మంగళ హారతి ఇచ్చారు. సకల దేవతారూపుడు స్వామేనని అన్నమయ్య సమభావాన్ని ప్రకటించారు.

ఈ విధంగా అన్నమయ్య స్వామిని పరిపరివిధాలుగా సేవించారు. ఈ సేవలన్నీ సంభాషణాత్మకంగా ఉన్నాయి.

## 3.10. ముగింపు

తెలుగు సాహిత్యంలో సంభాషణలు చాలా ముఖ్యభూమిక వహించాయి. ఈ సంభాషణలకు సంకీర్తనా సాహిత్యం ఆలవాలమై నిలిచింది. స్వామికి సామగానం అంటే చాలా ఇష్టం అని వేదాది శాస్త్రాలు చెప్తున్నాయి. ఎవరైతే తనను గురించి పాడతారో! వారిదగ్గరనే, వారి హృదయాల్లో కొలువై, అన్ని కార్యాలు తాను గమనించి చూస్తాడు. కనుక స్వామిపై ఆధారపడాలని అన్నమయ్య తెలియజేశారు. ఈ సంభాషణలు అందరికీ అర్థమయ్యే భాషలో చక్కగా సాగిపోయాయి. అన్నమయ్య భక్తునిగా, యశోదగా, స్నేహితునిగా, సేవకునిగా ఇలా అనేక విధాలుగా తనను తాను మార్చుకొని అత్యంత సహజసిద్ధంగా స్వామితో సంభాషించారు. కనుక ఈ సంకీర్తనలకు విశేషమైన ప్రాచుర్యాన్ని ప్రజలే కల్పించారు. ఈ సంభాషణల్లో వేదాలు, భాగవతాదిపురాణాలు, శాస్త్రాలు, రామాయణ,

భారతేతిహాసాల్లోని వివిధ అంశాలను చాలా తేలికైన మాటల్లో పొందుపరిచారు. అన్నమయ్య సాహిత్యం ప్రజల్ని చేరింది. కనుక అలాంటి సాహిత్యంలో సంభాషణలకు విలక్షణమైన స్థానాన్ని అన్నమయ్య కల్పించారు. సంకీర్తనలు సంగీతాత్మకంగా ఉంటూ, కావల్సినంత విషయజ్ఞానాన్ని అందిస్తున్నాయి. కనుక తెలుగు సాహిత్యంలోనేగాక ప్రపంచ సాహిత్యంలో అన్నమయ్యకు ఆయన సంకీర్తనల్లోని సంభాషణలు విలక్షణమైన స్థానాన్ని తెచ్చిపెట్టాయి.

★★★★★

# అధ్యాయం-4.

# అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో స్వర, లయ, అలంకార పోషణ

## 4.0. పరిచయం

తెలుగు సాహిత్యంలో అన్నమయ్య సంకీర్తనలకు ఉన్న ప్రాధాన్యం, ప్రాచుర్యం అంతా ఇంతా కాదు. సాహిత్యాత్మకంగానే కాకుండా సంగీతాత్మకంగా వాటికి అవే సాటి. కొందరు పండితులు ఈ కీర్తనల్లో సంగీతాంశాలు చాలా తక్కువగా ఉన్నారు. సంగీతాంశాలు అంటే ఏమిటో, ఏయే అంశాలు కలిగి ఉండాలో, ఏయే అంశాలను ప్రధానంగా పరిగణించాలో, ఏయే విషయాలను స్వీకరించాలో వారు వ్యక్తం చేయలేదు. వారనుకున్నట్టుగా సంగీతాంశాలు తక్కిన ప్రక్రియల్లోకంటే తక్కువ ఉన్నాయని అనుకుంటే సరికాదు. ఎందుకంటే వచనం నుండి నేడు పాటగా తన వైభవాన్ని చాటుకుంటోన్న గీతం సంగీతాంశాలు లేకుండా ఉందంటే ఎవరికైనా నమ్మకం కుదరదు. ఇంతకు పూర్వపు పండితులు కృతిని మాత్రమే దృష్టిలో పెట్టుకొని చెప్పారన్నది వారి అభిప్రాయాలను చదివితే బోధపడుతుంది.

అభ్యాసకులకు అనుగుణంగా పురందరదాసు కృతులను తయారు చేశారు. అదే ప్రక్రియ కాలగమనంలో తన విరాట్ స్వరూపాన్ని ప్రదర్శించింది. సాహిత్యం తక్కువ, దాన్ని అనుసరించిన సంగీతాంశాలు ఎక్కువగా ఉంటూ, పాటకు అవి భంగకరంగా ఉన్నాయని త్యాగరాజు లాంటి మహాపండితులే పెదవి విరిచారు. ఆయన కాలంలో ఉన్న ఇలాంటి వివాదాలను నిరసిస్తూ, సాహిత్య, సంగీత మేళనమే కృతిగా పరిగణించవచ్చని తన రచనల్లో చెప్పారు. అంతకుపూర్వమే అన్నమయ్య ఈ విషయంలో శిఖరాయమానమైన స్థానాన్ని ఆక్రమించారు. సంగీత సాహిత్యాలు సరస్వతి రెండు స్తనాలు అనే మాటకు అన్నమయ్య కీర్తనలు నిదర్శనం. అందుకే ఈయన సంకీర్తనలు ప్రజల నోళ్ళలో నాట్యం చేశాయి. ప్రజలే ఈ కీర్తనలకు వాహికలుగా పని చేశారు. కృతులు గాఢమైన స్వరాలతో, అనేక తాళగమనాలతో, ఆవృతాలతో ప్రజలకు దూరంగా జరిగిపోయాయి. ఇలాంటి సందర్భంలో అన్నమయ్య కీర్తనలు ఇంకా ప్రజల ప్రాపకాన్ని పొందుతున్నాయి.

ఈ అధ్యాయంలో అన్నమయ్య కీర్తనల్లో స్వరం, రాగం, తాళం, అలంకారం ఎలా పరిఢవిల్లాయో వివరించాను. భాషాశాస్త్రగతంగా, సంగీతశాస్త్రగతంగా ఈ కీర్తనలు

రాణించిన విధానాన్ని చర్చించాను. సంగీతగతంగా నాదం, స్వరం అంటే ఏంటో సంగీతంలో స్వరం ఎలాంటి భాగాన్ని కలిగి ఉందో శరీరంలోని చక్రాలను సంగీతశాస్త్రం ఎలా ప్రభావితం చేస్తోందో భాషకు, స్వరానికి ఉన్న సంబంధం, అక్షరానుగుణంగా స్వర నిర్మాణం ఎలా జరిగిందో విశ్లేషించాను. స్వరంలో అక్షరం ఎలా ఇమిడిపోయిందోస్ సంగీతశాస్త్రం సాహిత్యంతో, అలంకారాలతో కలిసిపోయిన తీరుతెన్నులను వివరించాను. సంగీతశాస్త్రంలో అత్యంత ముఖ్యమైన నాదం, స్వరం, రాగం, తాళం మొదలైన విశేషాంశాలను గురించి మొదటిగా తెలియజేసి, అన్నమయ్య కీర్తనలకు అవి ఎలా నప్పాయో వివరిస్తాను.

కీర్తన కృతికి పునాది. పూర్వం సంకీర్తన, కృతులను ఒకే విధంగా పండితులు సంభావించారు. అందుకే "కృతులై వేంకటశైల వల్లభ రతి క్రీడా రహస్యంబులై" అన్నారు చినతిరుమలాచార్యులు. సంకీర్తన పురాతనమైన రచన. మతాన్ని వ్యాప్తి చేయడంకోసం మన పూర్వులు చేయూతగా తీసుకున్నారు. వారు భక్తిభావాన్ని వ్యాప్తి చేసేందుకు సంగీతంలో ఏదో ఒక ప్రక్రియను తీసుకొని రచించి, ఆనందభరితంగా పాడారు. కీర్తన సాహిత్యాంతం కాగా కృతి సంగీతాత్మకమైంది. రానురాను వీటి స్వరూపాన్ని మార్చుకున్నాయి. శ్రీ సాంబమూర్తిగారు 15వ శతాబ్దానికి సాహిత్యంలో కీర్తన ప్రాచుర్యం పొందిందని విశ్లేషించారు. సంకీర్తనలోని సాహిత్యం భక్తులు, దేవుడు, పురాణకథలు, మొదలైన వాని గురించి తెలుపుతుంది. సాహిత్యంలో పదాలు ఎక్కువగా ఉంటాయి. ఒకే స్థాయిలో ఉంటాయి. అనుపల్లవి ఉండాలన్న నియమం లేదు. కొన్ని కీర్తనలు పల్లవిలాగానే చరణాలను కలిగి ఉంటాయి. చరణాలన్నీ ఒకే ధాతులో ఉంటాయి. కీర్తన నడక అవసరాన్నిబట్టి చిన్నగా, వేగంగా ఉంటూ, సామాన్య రాగాల్లో కంపోస్ చేస్తారు. అదే ఇప్పుడు కీర్తనలు నిలబడడానికి ఆధారమైంది. ఇవి వినికిడి ద్వారా నేర్చుకోవడానికి సులభంగా ఉంటాయి.

## 4.1. గానం దాని ప్రాధాన్యం

"శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః" (పార్థసారథి, ఎన్. సి.2014:1.) అని మన పూర్వీకులు గానాన్ని ప్రశంసించారు. చంటిబిడ్డకు, ఆవుదూడకు, నాగుపాముకు పాటంటే చాలా ఆనందం. శిశువుని, పశువుని, చివరికి నాగుపాముని కూడా సంగీతం

ఎంతగా ప్రభావితం చేస్తుందో పై వాక్యం చెబుతుంది. అంటే ప్రపంచంలోని ప్రాణకోటి అంతటినీ సంతోషపరచగలిగింది, మోదాన్ని కలిగించగలిగిన శక్తి కలిగింది గానం అని మన పెద్దలు నిశ్చయించారు. గానం శివుడిగా, ప్రాణం మానవుడిగా సంగీతజ్ఞులు భావిస్తున్నారు. అందుకే గాన ప్రాణాల మధ్య విడదీయరాని సంబంధం ఉంది. ఆంగ్లేయులు గానాన్ని ఆనంద స్వరూపంగా భావించారు. వారు గానాన్ని గురించి "The Rhythm of life" ప్రాణంలో లయ నిక్షిప్తమై ఉందని వర్ణించారు. లయ లేని ప్రాణం వ్యర్థమని పై మాటల సారాంశం.

"గీతం వాద్యం తథా నృత్తం త్రయం సంగీతముచ్యతే" (*శ్రీరామమూర్తి, గంధం.2009:4*) అన్నట్లు సంగీతంలో గీతం, వాద్యం, నృత్యం అనే మూడు భాగాలున్నాయి. ఈ మూడింటి చేరికకు సంగీతం అని పేరుంది. మన పూర్వులు తీసిన కూనిరాగాలనుండి జానపదులు పాడుకొనే పాట నుండి నేడు అనేక విధాల వయ్యారాలు పోతూ, శ్రోతల్ని ఆనందపారవశ్యంలో ముంచగలిగే స్థాయికి మించి చేరుకుంది. శ్రీవేంకటముఖి, మూర్తి త్రయం, రామదాసు మొదలైన వాగ్గేయకారులు పాటకు తమ శైలిలో సొబగులద్దారు. వారిలో సంకీర్తనాచార్యుడు, పదకవితా పితామహుడు, పంచాగమ సార్వభౌముడైన అన్నమయ్య ప్రముఖ స్థానాన్ని పొందారు. సంగీతం, భాష విషయాల్లో అన్నమయ్య ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారని ఆ కీర్తనలను అధ్యయనం చేస్తే తెలుస్తుంది. అన్నమయ్య సంకీర్తనలను ఇంకాస్త క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ఆ కీర్తనల్లో ఉన్న సంగీతాంశాలను తెలుసుకోవడం చాలా అవసరం.

అన్నమయ్య రచించిన కీర్తనల్లో స్వర ప్రస్తారం, లయానుగుణమైన నడక, ధ్వని ప్రధానమైన నాదం మొదలైన సంగీతాంశాలు మెండుగా ఉన్నాయి. వాటిని ఒక్కొక్కదాన్ని గురించి విశ్లేషించుకుందాం. స్వర ప్రాధాన్యం తెలుసుకొనే ముందు నాదం అంటే ఏంటో తెలుసుకోవడం చాలా అవసరం. పాటకు ప్రాణమైన నాదాన్ని గురించి మొదటిగా తెలుసుకుందాం.

## 4.2. నాదం

నాదానికి నిఘంటువులు చాలా అర్థాలు చెప్పాయి. వాటిలో ముఖ్యమైనవి ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

*శబ్దరత్నాకరంలో* బహుజనపల్లివారు 'శబ్దం, మ్రోత' అనే అర్థాలనిచ్చారు.

*బ్రౌణ్య తెలుగు ఇంగ్లీషు నిఘంటువులో* 1. Sound; a note, a ringing in the Ears. ధ్వని, మ్రోత అని,

*శంకరనారాయణ తెలుగు ఇంగ్లీషు నిఘంటువులో* 1. Sound; A loud sound such as cry, Roar, or shout, a ringing in the ears. అనే అర్థాన్నిచ్చారు.

దీన్నిబట్టి నాదం అంటే సాధారణార్థంలో ధ్వనిగా పరిగణించవచ్చు. సంగీతశాస్త్రానికి ధ్వని ప్రధానం. ఈ ధ్వనులు రకరకాలుగా వెలువడుతూ, తమ ప్రాధాన్యాన్ని ప్రదర్శిస్తాయి. ఈ నాదంవల్లే శ్రుతి జనించింది. నాదం అంటే కంఠం చేసే సంగీత ధ్వనిగా పరిగణిస్తే, శ్రుతి అంటే పాడే స్థాయిగా చెప్పవచ్చు.

పై నిర్వచనాలు నాదాన్ని ధ్వనిగా మాత్రమే పరిగణించగా శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావుగారు 2010లో వెలువరించిన తన *పారమార్థిక పదకోశం* నిఘంటువులో ఇలా నిర్వచించారు.

1. శరీరంలోని ఆత్మ మనస్సును, మనస్సు వహ్నిని, వహ్ని వాయువును ప్రేరేపించినప్పుడు వాయువు బ్రహ్మగ్రంథియగు మూలాధారం నుంచి ఊర్ధ్వముఖంగా నాభి, హృదయం, కంఠం, శిరస్సు, ముఖంచేరి కలిగించే ధ్వని నాదం.

2. బ్రహ్మ స్వరూపమైనది నాదం. నాభికి పైన హృదయ స్థానం నుంచి బ్రహ్మరంధ్రం వరకూ ధ్వనించే ప్రాణవాయువు. ఆకాశం, వాయువు, అగ్ని అనే మూడు భూతాలనుంచి పుట్టి, నాభికి పైన ధ్వనిస్తూ, ముఖంలో అతిస్పష్టంగా వ్యక్తమయ్యే వాయువు అన్నారు.

సంగీతంవల్ల ఆత్మ మనస్సును, మనస్సు శరీరాన్ని ప్రేరేపించగా, శరీరంలోని అగ్ని వాయువును ప్రేరేపిస్తుంది. తద్వారా మూలాధారమైన బ్రహ్మగ్రంథి నాభిని, హృదయాన్ని, శిరస్సును, ముఖాన్ని ప్రేరేపిస్తుంది. అప్పుడు కలిగే ధ్వని నాదంగా పై నిర్వచనంలో చెప్పబడింది. రెండవ నిర్వచనం శరీరంలోని పంచభూతాలు, షట్చక్రాలను ప్రేరేపించేదిగా తెలియజేశారు.

నేడు నాదం అంటే వాయిద్యాన్ని వాయించేటప్పుడు పుట్టే నాదం కావచ్చు, గమక భేదాల్లో చేసే వివిధ ధ్వని భేదాలు కావచ్చు. ఏదైనా నాదమే అనే సాధారణ అర్థంలో

తీసుకుంటున్నారు. కొన్ని నిఘంటువుల్లో నాదానికి కొట్టబడినది అని అర్థం చెప్తే, మరి కొన్నింటిలో గమక భేదం అని అర్థం చెప్పారు. ఈ నిర్వచనాలు నాదంతోబాటు తాళాన్ని ప్రతిబింబిస్తున్నాయని మనం అర్థం చేసుకోవాలి. అనాహతము అనే మాటకు 1953లో వెలువరించిన *ఆంధ్ర వాచస్పత్యము* నిఘంటువులో కొ్ట్ర శ్యామల కామశాస్త్రిగారు షట్చక్రములు, నాదములు అని అర్థం చెప్పారు.

1966లో వెలువరించిన *ఆంధ్ర శబ్ద రత్నాకరం*లో చెలమచెర్ల రంగాచార్యులు శరీరమందలి షట్చక్రములలో నాల్గవది, హృదయమున సుషుమ్న నడుమనున్న పండ్రెండు దళములు గల పద్మము (తంత్ర) అనే అర్థాలను చెప్పారు. దీన్నిబట్టి సంగీతానికి నాదశాస్త్రం అనే పేరువచ్చిందని తెలుస్తోంది. నాదం లేకుండా సంగీతాన్ని పాడడం అంటే ప్రాణం లేకుండా దేహాన్ని బ్రతికించుకోవడమే. సంగీతానికి మొట్టమొదటిగా ఆధారమైనది నాదం. అంటే సంగీతశాస్త్ర ఉనికి అని అర్థం చెప్పుకోవచ్చు. నాదం శ్రుతికి ఆధారం. శ్రుతి చేసుకొనేందుకు, శ్రుతిబద్ధంగా పాడేందుకు నాదం ఉపకరిస్తుంది. అందుకే

> "గీతం నాదాత్మకం వాద్యం నాదవ్యక్త్యాప్రకాశ్యతే
> తద్ద్వయాను గతం నృత్యం నాదాదీనమతస్త్రయమ్
> నాదేన వ్యజ్యతే వర్ణఃపదం వర్ణాత్పదాత్వచ
> వచసో వ్యవహారోయం నాదాధీనమతో జగత్" (*శ్రీరామమూర్తి, గంధం.2009:9.*)

నాదంతోటి వర్ణం, వర్ణాలవల్ల పదాలు, పదాలచేత వాక్కు, వాక్కు వల్ల ప్రపంచ వ్యవహారం ఏర్పడింది. అలాంటి నాదానికి ప్రపంచం మొత్తం అధీనంలో ఉంటుందని *సంగీత రత్నాకరం*లోని పై శ్లోక భావం. సంగీతశాస్త్రానికి సామవేదం మూలాధారం. గానానికి ప్రాణం నాదం కాబట్టి సంగీతజ్ఞులు నాద శాస్త్రంగా సంగీతశాస్త్రాన్ని సంభావించి, గౌరవిస్తున్నారు. 'గాం' అంటే వాక్కు. వాక్కుని ధరించింది కాబట్టి గాంధర్వం అన్నారు. ఈ గాంధర్వం స్వరం, తాళం, పదం, సాహిత్యాలని ఆశ్రయించి ఉంటుంది. నాదం నుండి స్వరం పుట్టింది. స్వరం సాహిత్యానుగుణంగా ఉంటుంది. సాహిత్యం సంగీతానికి చాలా ముఖ్యం. సంగీతంలో నాద ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని, పండితులు సంగీతశాస్త్రాన్ని నాదశాస్త్రం అన్నారు.

“నాదోత్పత్తి ర్యథా శాస్త్ర మిదానీ మభిధీయతే
స్వరో గీతం చ వాద్యం చ తాళస్చేతి చతుష్టయం

*(శ్రీరామమూర్తి, గంధం.2009:13.)*

స్వరం, గీతం, వాద్యం, తాళాలనే నాలుగువిధాలు. నాదం లేనిదే సంగీతశాస్త్రం సిద్ధించదు. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు నాద స్వరూపులు అని *సంగీత సమయసారము* అనే గ్రంథం తెలియజేస్తోంది. బ్రహ్మగ్రంథి నుండి, అగ్ని నుండి పుట్టిన ప్రాణమే సంగీతం. నకారం ప్రాణం అని, దకారం అగ్ని అని చెప్పబడుతోంది. మతంగముని ఈ నాదాన్ని ‘అతిసూక్ష్మము’, ‘సూక్ష్మము’, ‘పుష్టము’, ‘అపుష్టము’, ‘కృత్రిమము’ అనే అయిదు విధాలుగా విభజించారు. అతిసూక్ష్మనాదం నాభిలోను, హృదయంలో సూక్ష్మనాదం, పుష్ఠనాదము కంఠంలోను, అపుష్టనాదం శిరస్సులోను, కృత్రిమ నాదము ముఖంలోను ప్రతిఫలిస్తాయి. ఈ నాదంలోనుండి బిందు, సమస్త వాఙ్మయం పుట్టింది. ఈ నాదం మంత్రాది స్థానాలచేత ప్రకాశిస్తుందని పండితులు గుర్తించారు. ఈ నాదం మళ్ళీ ‘కాబులము’, ‘బంబళము’, ‘నారాటము’, ‘మిశ్రకము’ అని ధ్వని భేదాన్నిబట్టి, గానాన్నిబట్టి సంగీతజ్ఞులచేత గుర్తింపబడింది. ‘కాబులము’ అత్యంత మాధుర్య ప్రధానమైన ధ్వని. ‘బంబళము’ అత్యంత తిరస్కార ధ్వని. తారాస్థాయికి చెంది, మాధుర్య గుణాన్ని విడిచినదిగా ‘నారాట ధ్వని’ చెప్పబడింది. నారాట, బంబళ ధ్వనుల కలయికవల్ల ‘మిశ్రమ ధ్వని’ ఏర్పడుతుందని పండితులు చెప్పారు. రాగ స్పష్టీకరణ నిబంధంగల అభ్యాసం లేకుండా శరీరంతో స్వరూపత్వం జనించే ధ్వనిని ‘శారీరము’ అన్నారు. మళ్ళీ శారీరమును ‘కడాగము’,’మధురము’, ‘బహుభంగి’ అనే విధాలుగా విభజించారు. మంద్ర, మధ్యమ, తారాస్థాయిల్లో మధురమైనది ‘కడాగమము’ అని, తారాస్థాయిలో రాగాన్ని ప్రకాశింపజేసేది ‘పౌశలముగాను’, మధుర పౌశల శరీర గుణాలు కలిగిన మిశ్రమాన్ని ‘బహుభంగి’గా పేర్కొన్నారు. మళ్ళీ ‘మాధుర్యం’, ‘శ్రావకత్వం’, ‘స్నిగ్ధత్వం’, ‘ఘనత’, ‘ఖేటి’, ‘భేణి’, ‘భగ్నము’లుగా కంఠ దోషాన్నిబట్టి ధ్వనులు విభజించబడ్డాయి. మాధుర్యంతో కూడుకున్నది ‘మధుర ధ్వని.’ స్నిగ్ధధ్వనిలో తారాస్థాయిలో మాధుర్యాన్ని, సరసాన్ని వ్యక్తం చేస్తుంది. ఇలా అన్ని భావాలకు సంబంధించిన నాదధ్వనులు సంగీతశాస్త్రాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

ఆచార్య రవ్వా శ్రీహరిగారు 2002లో వెలువరించిన *సంకేత పదకోశము* 'ఆహతము', 'అనాహతము' అనే అర్థాలను ఇస్తూ, 'ఆహతో నాహతశ్చేతిద్వేదా నాదో నిగద్యతే' అనే శ్లోకాన్ని ఉదహరించారు.

*సంగీత సిద్ధాంత సోపానములు* అనే గ్రంథంలో 'ఆహతము', 'అనహాతము'లకు విస్తృతార్థాన్ని ఇచ్చారు. 'ఆహతము' అంటే "ఇది గానము పుట్టుటకు ఆధారమై, శ్రుతి, స్వర, గ్రామ, మూర్ఛనాదుల ద్వారా ఆహ్లాదమును కలిగించుచున్నది" అని, 'అనాహత నాదం' అంటే "ఇది మునులచే ఆరాధింపబడుచున్నది. గురుముఖముగా ఉపదేశింపబడినదై, యోగుల చేత ఆరాధింపబడుచున్నది." (శాంత, కోవెల.*2000:64*) అని వివరించారు. యోగి పరంపరాగతంగా మనకు సంగీతం లభించిందని పైన పేర్కొన్న విషయాల ద్వారా తేటతెల్లమవుతుంది.

## 4.3. శ్రుతి

సాధారణార్థంలో శ్రుతి అంటే చెవి అని అర్థం. చెవి ద్వారా చేసే పనికి అంటే వినడానికి కూడా నేడు శ్రుతి అర్థాన్ని విస్తరించాం. సంగీతంలో వినడానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. వింటూ, ఆ విన్నదానిపై ధ్యాస నిలపాల్సి ఉంటుంది. సంగీతశాస్త్రంలో శ్రుతి అంటే గాయకులు, వాయిద్య కళాకారులు ఎంచుకొనే స్థాయిగా అర్థం చెప్పవచ్చు. ఉదాహరణకు ఆయా సంగీతజ్ఞులు వేర్వేరు శ్రుతి స్థాయిల్లో పాడుతారు. అందరూ ఒకే శ్రుతిలో అనగా స్థాయిలో పాడలేరు. స్త్రీలు, పురుషులకు వేర్వేరు శ్రుతులు ఉంటాయి. అలాగే స్త్రీలలోగాని, పురుషుల్లోగాని స్థాయీ భేదాలు ఉంటాయి. అందుకే శ్రుతిని ఆంగ్లంలో Pitch scale అంటారు. సాధారణంగా కర్ణాటక సంగీతశాస్త్రంలో స్థాయిలు మూడు నుండి అయిదు లోపు ఉంటాయి. అయితే, మూడు స్థాయిల్లోనే స్వరాల కూర్పు, కీర్తనలు, కృతుల తయారీ జరుగుతుంది. మధ్యమ, మంద్ర, తారా స్థాయిలుగా వాటిని చెప్పవచ్చు. కొందరు గాయకులు అతిమంద్ర, అతితారాస్థాయిల్లో పాడడం సహజం కాబట్టి వాటిని కూడా కలుపుకొని అయిదు స్థాయిలుగా చెప్పుకోవాలి. శ్రుతి అంటే ధ్వని అనే సాధారణార్థం ఉంది. ఈ శ్రుతులు స్వరాలకు ఆధారమైనవి. సంగీతానికి పనికివచ్చే శ్రుతులు 22. వాటికి సిద్ధ, ప్రభావతి, కాంత, సుప్రభ, శిఖ, దీప్తిమతి, ఉగ్ర, హలది, నీవ్రి, ధీర, క్షాంతి, విభూతి, మాలని, చపల

వంటి పేర్లు ఉన్నాయి. ఇవన్నీ పాడే విధానం, రాగ లక్షణం, ఆ రాగంలో వ్యక్తమయ్యే భావాలనుబట్టి ఆ పేర్లతో పిలువబడుతున్నాయని సాధారణంగా మనం అర్థం చేసుకోవచ్చు. పాశ్చాత్య సంగీతంలో 12వ శ్రుతివద్ద సంగీతం ఉచ్ఛ స్థితికి (అష్టమ స్వరానికి) చేరుకోగా భారతీయ సంగీతం 22 శ్రుతులతో తారాస్థాయికి చేరుకుంటుంది. ప్రస్తుతం కర్ణాటక సంగీతంలో ద్వాదశ స్వర స్థానాల ప్రక్రియ అమలవుతోంది. షోడశ స్వర స్థానాలకు కర్ణాటక సంగీతంలో ప్రాముఖ్యత ఉన్నది. శ్రుతి తరువాత సంగీతశాస్త్రంలో స్వరం, రాగాలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. వాటిని గురించి తెలుసుకుందాం.

## 4.4. స్వరం

స్వ=స్వయంగా, ర=రంజించునది కాబట్టి దీనికి స్వరమని పేరు అని సంగీతజ్ఞులు భావిస్తున్నారు. అంటే స్వరం తనకు తానుగా అలరించే గుణం కలిగిందని అర్థం. సంగీతశాస్త్రంలో స్వరానిది అత్యంత ముఖ్యమైన స్థానం. శాస్త్రీయ సంగీతంలోని సప్త స్వరాలు షడ్జమం, రిషభం, గాంధారం, మధ్యమం, పంచమం, దైవతం, నిషాదం. వీటిలో షడ్జమ, పంచమాలకు (సప) తప్ప తక్కిన స్వరాలకు రెండు, (లేక) మూడు స్వరాంతరాలు ఉన్నాయి. వీటన్నింటినీ కలిపితే 16 ప్రధాన స్వరాలవుతాయి. వాటిని గురించి తెలుసుకుందాం.

కర్ణాటక సంగీతంలోని సప్త స్వరాలు ఒక్కొక్కటీ ఒక్కొక్క జంతువు, పక్షి కూతలనుండి పుట్టాయి. రాగాల కూర్పు వాటి స్వరాల పెంపునుబట్టి ఉంటుంది. అయితే, ప్రతి రాగంలోను సప్త స్వరాలు తప్పనిసరిగా ఉండాలన్న నియమం లేదు. సాధారణంగా ఒక రాగానికి అయిదు స్వరాలకు తగ్గకుండా ఉండాలన్న నియమం ఉంది. అయితే, స్వర్గీయ డా. మంగళంపల్లి బాలమురళీ కృష్ణగారు మూడు, నాలుగు స్వరాలను వినియోగించుకొని వివిధ అపూర్వ రాగాలను తయారు చేశారు. ఏది ఏమైనా సప్త స్వరాలకు ఉన్న గొప్పతనం వేరు. ఆ సప్త స్వరాలను కింద పరిశీలిద్దాం.

స-షడ్జమం ఇది నెమలి క్రేంకారం నుండి ఆవిర్భవించింది.

రి-రిషభం ఎద్దు రంకె నుండి ఏర్పడింది.

గ-గాంధారం మేక అరుపు నుండి పుట్టింది.

మ-మధ్యమం క్రౌంచ పక్షి కూతనుండి ఉద్భవించింది.

ప–పంచమం కోయిల కూత నుండి వచ్చింది.

ద–దైవతం గుఱ్ఱం సకిలింత నుండి జనించింది.

ని–నిషాదం ఏనుగు ఘీంకారం నుండి వచ్చింది.

ఈ స్వరాల్లో రిషభం, గాంధారం, మధ్యమం, దైవతం, నిషాదం ఈ అయిదు స్వరాలకు రెండేసి స్వర స్థాన భేదాలున్నాయి. కాబట్టి ఆ స్వరాలకు వికృతి స్వరాలని పేరు. షడ్జమ పంచమాలకు ఆ విధమైన వికృతి భేదం లేదు. కాబట్టి అవి ప్రకృతి స్వరాలు, కృతి స్వరాలు అని పిలువబడుతున్నాయి. వికృతి స్వర భేదాలవల్ల స్వర స్థానాలు 12 అయ్యాయి. కాబట్టి ద్వాదశ స్వర స్థానాలుగా వ్యవహరింపబడుతున్నాయి. ఈ వికృతి స్వరాలు వాటివాటి ఉచ్చ, మంద్ర స్థానాలనుబట్టి ఏర్పడ్డాయి. వికృతి స్వరాలు హిందుస్థానీ సంగీతంలో కూడా ఉన్నాయి. తక్కువ స్వరానికి అనగా వికృతి స్వరాల్లో కింది స్వరానికి కోమల స్వరం అని, పై స్వరానికి తీవ్ర స్వరమని పేరు. పాశ్చాత్య సంగీతంలో కింది స్వరానికి ఫ్లాట్ నోట్ (Flat note) పై స్వరానికి షార్ప్ నోట్ (Sharp note) అని పేర్లున్నాయి.

ప్రస్తుతం లోకంలో వ్యవహరించబడుతున్న స్వరాల్లో రిషభం, గాంధారం, దైవతం, నిషాదంలో మూడు, మధ్యమంలో రెండు, షడ్జమ, పంచమాల్లో ఒకటి మొత్తం 16 స్వర స్థానాలున్నాయి. ద్వాదశ స్వర స్థానాలను పట్టిక రూపంలో ఇస్తున్నాను.

| క్ర. సంఖ్య | సప్త స్వరాల పేర్లు | ద్వాదశ స్వర స్థానాలు | హిందూస్థానీ సంగీతంలోని పేరు | కర్ణాటక సంగీతంలోని పేరు | ఐరోపా సంగీతంలోని పేరు |
|---|---|---|---|---|---|
| 1. | షడ్జమం | (1) | స ... | స | సి (c) |
| 2. | రిషభం | (2)<br>(3) | కోమల్ రి...<br>తీవ్ర రి... | శుద్ధ రిషభం<br>చతుశ్రుతి రిషభం | డి (ఫ్లాట్)<br>డి (షార్ప్) |
| 3. | గాంధారం | (4)<br>(5) | కోమల్ గ...<br>తీవ్ర గ... | సాధారణ గాంధారం<br>అంతర గాంధారం | ఇ (ఫ్లాట్)<br>ఇ (షార్ప్) |
| 4. | మధ్యమం | (6)<br>(7) | కోమల్ మ...<br>తీవ్ర మ... | శుద్ధ మధ్యమం<br>ప్రతి మధ్యమం | యఫ్ (ఫ్లాట్)<br>యఫ్ (షార్ప్) |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 5. | పంచమం | (8) | ప ... | పంచమం | జి |
| 6. | దైవతం | (9)<br>(10) | కోమల్ ధ...<br>తీవ్ర ధ... | శుద్ధ దైవతం<br>చతుశ్రుతి దైవతం | ఏ (ఫ్లాట్)<br>ఏ (షార్ప్) |
| 7 | నిషాదం | (11)<br>(12) | కోమల్ ని...<br>తీవ్ర ని... | కైసికి నిషాదం<br>కాకలి నిషాదం | బి (ఫ్లాట్)<br>బి (షార్ప్) |

(*గానకళా బోధిని పుట:2.*)

ఈ స్వరాలు సంగీతానికి ఆధారం. స్వరాల సహాయంతోనే కీర్తనల, కృతుల కూర్పు జరుగుతుంది. కానీ స్వరాల కూర్పుపై కృతులు ఆధారపడినంతగా సంకీర్తనలు ఆధారపడవని పండితులు తేల్చారు. కృతి అయినా సంకీర్తన అయినా ఆయా వాగ్గేయకారులు భక్తి పారవశ్యంలో ఆశువుగా రచించినవి కాని స్వర కూర్పుతో చేసినవి కావు. ఆ తరువాత వారు కూర్చిన సాహిత్యానికి స్వరకూర్పులు జరగడం సహజం. సప్త స్వరాలు ఆరోహణ పద్ధతిలో పాడడం జరుగుతుంది. అలాగే చక్రాలు కూడా ఆరోహణ పద్ధతిలోనే చెప్పబడ్డాయి. కోమల స్వరాలు ఎడమవైపు ఇడ, పింగళ, సుషుమ్న చక్రాలతో సంధించబడితే, శుద్ధ, తీవ్ర స్వరాలు కుడివైపు చక్రాలతో సంధించబడ్డాయి. అందువల్ల స్వరాలతోబాటు ఆ చక్రాలు కూడా ప్రభావాన్ని చూపుతాయి. ప్రతి రాగం ఆయా చక్రాలను ప్రభావితం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## 4.4.1. ఆరోహణ, అవరోహణ క్రమం

సంగీతంలోని స్వరాల క్రమాన్ని పాటించే పద్ధతిని ఆరోహణ, అవరోహణ క్రమం అంటారు. అభ్యాసకులకు ఈ పద్ధతి బాగా ఉపకరిస్తుంది. దీన్నే మూర్ఛన (స్కేలు) అంటారు.

### 4.4.1.1. ఆరోహణం

ఆరోహణం అంటే ఎక్కిపోవడం అని అర్థం. ఆధార షడ్జమాన్ని ముందు పెట్టి, స్వరాలన్నింటినీ ఒక్కొక్కటిగా పేర్చి, ఉండేకొద్దీ పైపైకి పోవడం అంటే అనుదాత్తం నుండి ఉదాత్తం వైపు పోవడం. ఒక స్వరాన్ని తక్కువ స్థాయీ ధర్మంలో పాడటం మొదలుపెట్టి, హెచ్చు స్థాయీ ధర్మంలో పాడే పద్ధతిని ఆరోహణం అంటారు. సప్త స్వరాలను స తో

మొదలుపెట్టి, ని తో ఆపడం అంటే స రి గ మ ప ద ని గా ఉంటుంది. దీనివల్ల అభ్యాసకుడి శ్రుతి ధర్మం ఉపాధ్యాయుడికి బోధపడుతుంది.

### 4.4.1.2. అవరోహణం

ఆరోహణ క్రమానికి అపసవ్య దిశయే అవరోహణం. ఈ పద్ధతిలో హెచ్చు స్థాయి నుండి తగ్గు స్థాయిలో పాడడం జరుగుతుంది. ని ద ప మ గ రి స అని ఆపుతారు. దీనివల్ల ఉపాధ్యాయుడికి అభ్యాసకుల కంఠం పునాది సామర్థ్యం తెలుస్తుంది. దీన్నే స్థాయి అంటారు. స్థాయిని ఆంగ్లంలో పిచ్ అంటారు. ఈ స్థాయిలు మూడు రకాలు అవి మంద్ర, మధ్యమ, తారా స్థాయిలు.

### 4.4.2. స్థాయిలు

### 4.4.2.1. మంద్ర స్థాయి

ఇది అతి తక్కువ స్థాయిలో ఉంటుంది. దీన్ని సూచించేందుకు స్వరం కింద చుక్క గుర్తును పెడతారు. తక్కువ స్థాయిలో పాడడాన్ని మంద్ర స్థాయి అంటారు. దీనికన్నా తక్కువగా పాడగలిగిన ఆ స్థాయిని అతిమంద్ర స్థాయి అంటారు.

### 4.4.2.2. మధ్యమ స్థాయి

సాధారణ స్థాయిని మధ్యమ స్థాయి అంటారు. సంగీతాభ్యాసకులు స్వరాలను నేర్చుకోవడం ఈ స్థాయి నుండే మొదలుపెడతారు. ఈ స్థాయిని సూచించేందుకు చుక్క గుర్తు ఉపయోగించరు. ఇది అటు తారా స్థాయికి, ఇటు మంద్ర స్థాయికి మధ్యోలో ఉంటుంది.

### 4.4.2.3. తారా స్థాయి

ఈ స్థాయి అధిక పౌనఃపున్యంతో పాడబడుతుంది. స్వరం అతి బిగ్గరగా ఉంటుంది. దీనికి పైన చుక్కను ఉపయోగించడం ద్వారా గుర్తిస్తారు. కొందరు ఇంకా అధిక స్థాయిలో పాడతారు. దాన్ని అతితారాస్థాయి అంటారు. స్వరాలు ఏయే పిచ్‌లో ఉన్నాయో తెలుసుకోవడానికి స్థాయి ఉపకరిస్తుంది. సంకీర్తనలను రాసేటప్పుడు ఈ స్థాయీ భేదాలు గమనించాల్సిన అవసరం ప్రతి వాగ్గేయకారుడిపై ఉంటుంది.

## 4.5. రాగాలు

మానవునిలోని భావాలను ప్రతిబింబించేది రాగం. మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు ఒక రాగం, దుఃఖం, కోపం, బాధ, శృంగారం మొదలైన భావాలు కలిగినప్పుడు ఆ భావనలను అనుసరించి రాగాలు గాయకుడి కంఠం నుండి వాటంతట అవి పొంగి పొర్లుతాయి. రాగాలు స్వరాల పెంపుకు ఉపకరిస్తాయి. పూర్తిగా తయారైన కావ్య బింబానికి ఒక అందమైన ఆకృతిని తేవడాన్ని రాగం అంటారు. ఈ రాగాలు ఆయా సందర్భాన్నిబట్టి ఒక్కో రసాన్ని ప్రభావితం చేస్తాయి. మన పెద్దలు కూడా ఆయా సమయాలను, సందర్భాలను అనుసరించి ప్రత్యేకమైన రాగాలను ఉపయోగించారు. అలాగే వాటికి పూర్వం నుండి అలాగే ముద్ర పడింది. ఉదాహరణకు ముఖారి రాగం కరుణ రసాన్ని, అఠాణా, సారంగ, హుసేనీ రాగాలు వీర రసాన్ని, ఖమాశు రాగం శృంగారాన్ని ప్రతిబింబిస్తాయి. కొన్ని రాగాలు అన్ని వేళలా పాడదగ్గవి. మరికొన్ని ప్రత్యేకించి ఆ సమయానికి మాత్రమే పనికివచ్చేవి. ఉదాహరణకు మోహన, కళ్యాణి రాగాలు అన్ని వేళల పాడదగినవి కాగా భూపాళం ఉదయం వేళలో పాడదగినది. సంగీతశాస్త్రంలో ప్రధానంగా 72 మేళకర్త రాగాలు ఉన్నాయి. ఈ రాగాలకు జనక రాగాలు parental మాతృక రాగాలని, సంపూర్ణ రాగాలనీ మూల (root) రాగాలని, మేళకర్త రాగాలని, ఆధార (fundamental) రాగాలని, ప్రాతిపదిక (primary) రాగాలని పేరు. అదే విధంగా మేళకర్తల నుండి పుట్టిన జన్య రాగాలను వర్జ్య (derivative) రాగాలని, అప్రధాన (secondary) రాగాలని అంటారు. జన్య రాగాల్లో కొన్ని జనక రాగాలకు లేని ప్రాచుర్యాన్ని కలిగి ఉన్నాయి. వాటిని గురించి కూలంకషంగా తెలుసుకుందాం.

### 4.5.1. మేళకర్త రాగాలు (లేక) జనక రాగాలు

సంగీతంలో 72 మేళకర్తరాగాలను జనకరాగాలు అంటారు. ఎందుకంటే వీటినుండి ఇంకొన్ని రాగాలు పుట్టాయి. అలాగే జనకరాగాలనుండి జనించిన రాగాలను జన్య రాగాలు అంటారు. ముఖ్యంగా మేళకర్త రాగాలకు కొన్ని నియమాలు ఉంటేనే అవి జనక రాగాలుగా పిలవబడుతున్నాయి అందుకే వాటికి ఉండాల్సిన నిబంధనలను గురించి మొదటిగా తెలుసుకుందాం.

1. మేళకర్త రాగం సంపూర్ణ రాగమై ఉండాలి. అందులో సప్త స్వరాలు ఉండాలి.

2. అందులోని స్వరాలు ముందు, వెనుకలు కాకుండా ఉండాలి.
3. ఆరోహణంలో స రి గ మ ప ద ని, అవరోహణంలో ని ద ప మ గ రి స స్వరాలు వరుస క్రమంలో ఉండాలి. అందువల్లనే ఇవి సంపూర్ణ రాగాలుగా పిలువబడుతున్నాయి.
4. రాగ వక్రత ఉండరాదు. అంటే స రి మ ప ద ని స లాగా ఉండరాదు. స్వరాలు వరుసలో పేర్చినట్లు ఉండాలి. ఇలాగే ఆరోహణ, అవరోహణ క్రమంలో వరుస తప్పకుండా ఉండాలి.
5. ఆరోహణ అవరోహణ క్రమంలో ఒకే జాతి స్వరాలు ఉండాలి. అంటే ఆరోహణ క్రమంలో శుద్ధ రిషభం, శుద్ధ గాంధారం లాంటి ఒకే జాతి స్వరాలు వచ్చాయనుకుందాం. అదే పద్ధతిని అవరోహణ క్రమంలో కూడా పాటించాలి. జనక రాగాలకు ఇది చాలా ముఖ్యమైన లక్షణం.
6. ఈ రాగాలనుండి ఇంకొన్ని రాగాలు తయారు చేసుకొనేందుకు అవకాశం ఉండాలి. అంటే రాగోద్భవానికి పూర్తిగా సహకరించాలి.

ఈ 72 మేళకర్త రాగాలు రెండు భాగాలుగా విభజింపబడ్డాయి. మొదటి భాగంలోని 36 రాగాలు శుద్ధ మధ్యమ స్వరాన్ని కలిగి ఉండడం వల్ల వీటికి శుద్ధ మధ్యమ రాగాలని, పూర్వ మేళ రాగాలని పేరు. రెండవ భాగంలోని 36 రాగాలకు ప్రతిమధ్యమ స్వరం ఉండడంచేత వీటికి ప్రతిమధ్యమ రాగాలని, ఉత్తర మేళ రాగాలని పేరు. సంగీతశాస్త్రంలో 12 చక్రాలు ఉన్నాయి. వాటిలో ఒక్కొక్క చక్రం ఆరు రాగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నది. ఆ చక్రాల ఆధారంగా మళ్ళీ 36 రాగాలను 6 భాగాలుగా విభజించారు. ఇందులో మొదటి ఆరు చక్రాలుగల 36 రాగాలను మళ్ళీ చక్రానికి ఆరు రాగాల చొప్పున విభాగించి కూర్చారు. మొదటి 36 రాగాల్లోని శుద్ధ మధ్యమానికి తరువాత 36 రాగాల్లోని ప్రతిమధ్యమం అక్క అని సంగీతజ్ఞులు అభిప్రాయపడ్డారు. అంటే మధ్యమమే అక్కా చెల్లెళ్ళుగా మారి, సంగీతశాస్త్రంలో రాగాల వేర్పాటును శాసిస్తున్నది. కాబట్టి ఈ రాగాలను వేరు పరిచేది మధ్యమమే. కనుక మధ్యమాన్ని ఆంగ్లంలో "సగము గావించు గురి" (bisecting line) సమవిభాగ స్థానం అంటారు.

ప్రధాన మేళకర్త రాగాల పేర్లను, వాటినుండి జనించిన రాగాల పేర్లను కింద ఇస్తున్నాను. జన్య రాగాల పేర్లను కుండలీకరణాల (బ్రాకెట్‌ల) మధ్య ఇస్తున్నాను.

1. కనకాంగి, 2. రత్నాంగి, (జన్యరాగం రేవతి) 3. గానమూర్తి, 4. వనస్పతి, 5. మానవతి, 6. తానరూపి, 7. సేనావతి, 8. హనుమతోడి, (హనుమతోడి నుండి జనించిన జన్య రాగాలు అసావేరి, భూపాళం, ధన్యాసి, పున్నాగ వరాళి, శుద్ధ సీమంతినీ) 9. ధేనుక, 10. నాటక ప్రియ, (జన్యరాగం సింధు భైరవి) 11. కోకిల ప్రియ, 12. రూపవతి, 13. గాయక ప్రియ, 14. వకుళాభరణం, (జన్యరాగం వసంత భైరవి) 15. మాయా మాళవ గౌళ రాగం, (రక్తిరాగం) (జన్యరాగాలు భౌళి, జగన్మోహిని, గౌళ, గౌళీపంతు, లలిత, నాదనామక్రియ, రేవగుప్తి, సావేరి, మలహరి రాగాలు) 16. చక్రవాకం, (జన్యరాగాలు బిందుమాలిని, మలయమారుతం, వలాచి) 17. సూర్యకాంతం, 18. హటకాంబరి, 19. ఝంకార ధ్వని, 20. నటభైరవి, (ఆనంద భైరవి, జయంతశ్రీ, హిందోళం) 21. కీరవాణి, (కళ్యాణ వసంతం, సామప్రియ, వసంత మనోహరి) 22. ఖరహర ప్రియ, (జన్య రాగాలు అభేరి, అభోగి, బృందావన, సారంగ, కాపీ, మధ్యమావతి, ముఖారీ, రీతిగౌళ, శ్రీరాగం, ఉదయ రవిచంద్రిక, శివరంజని, శ్రీరంజని.) 23. గౌరీ మనోహరి, 24. వరుణ ప్రియ, 25. మారరంజని, 26. చారుకేశి, 27. సరసాంగి, 28. హరికాంభోజి, (జన్యరాగాలు కాంభోజి, మోహన, అంధోళిక, బహుదారీ, ఖమాచ్, కేదారగౌళ, నాటకురంజి, నవరస కన్నడ, శహానా, శ్రుతి, యదుకుల కాంభోజి, సురటీ.) 28. ధీర శంకరాభరణం, (ఆరభి, అఠాణా, కురింజీ, కేదారం, నాగధ్వని, బిలహరి, హంసధ్వని, దేవగాంధారి, కదన కుతూహలం, బేగడ, నవరోజు, శుద్ధ సావేరి.) 30. నాగానందిని, 31. యాగప్రియ, 32. రాగవర్ధిని, 33. గాంగేయ భూషిణి, 34. వాగధీశ్వరి, 35. శూలిని, 36. చలనాట, (జన్య రాగాలు నాట, గంభీరనాట.) 37. సాలంగం, 38. జలార్ణవం, 39. ఝాలవరాళి, (జన్యరాగం వరాళి.) 40. నవనీతం, 41. పావనీ, 42. రఘుప్రియ, 43. గవాంభోధి, 44. భవప్రియ, 45. శుభ పంతువరాళి, 46. షడ్విత మార్గిణి, 47. సువర్ణాంగి, 48. దివ్యమణి, 49. ధవళాంబరి, 50. నామనారాయణి, 51. కామవర్ధిని, 52. రామ ప్రియ, 53. గమన శ్రమ, (హంసనందిని, పూరి కళ్యాణి) 54. విశ్వంబరి, 55. శ్యామలాంగి, 56. షణ్ముఖ ప్రియ, 57. సింహేంద్ర మధ్యమం, 58. హేమావతి, 59. ధర్మవతి, 60. నీతిమతి, (హంసనాదం) 61. కాంతామణి, 62. రిషభ ప్రియ, 63. లతాంగి, 64. వాచస్పతి, (జన్యరాగాలు భూషావళి, సరస్వతి) 65. మేచకళ్యాణి, (హమీర్ కళ్యాణి, మోహన కళ్యాణి, సారంగ, సునాద వినోదిని, యమన్ కళ్యాణి) 66. చిత్రాంబరి, 67. సుచరిత్ర, 68. జ్యోతి స్వరూపిణి, 69. ధాతువర్ధిని, 70.

నాసికా భూషిణి, 71. కోసలం, 72. రసిక ప్రియ. ఈ రాగాలన్నీ ఆయా చక్రాల్లో వాటి వాటి స్వర స్థానాలను ప్రభావితం చేస్తున్నాయి. ఉదాహరణకు ఒకటవ చక్రంలో శుద్ధ రిషభం, రెండవ చక్రంలో చతుశ్రుతి రిషభం ఇలా ఉంటూ వాటికి అందాన్ని తెస్తున్నాయి. ఆ స్థానాలనుబట్టి ఆ చక్రాల సంఖ్యను, వాటి లక్షణాలను కనుగొనవచ్చు.

ఈ రాగాలన్నింటినీ మానవ శరీరంలోని షట్ చక్రాలను ప్రభావితం చేసేవిధంగా సంగీతజ్ఞులు నిర్మించారు. ఈ మేళకర్త రాగాలను "క, ట, ప, య" ది సూత్రం ద్వారా లెక్కించి, వాటి పేర్లను నిర్ణయించారు. ఈ రాగాలను కింది పద్ధతి ద్వారా లెక్క పెట్టారు.

## 4.5.2. క ట ప యాది సంఖ్య

### 4.5.2.1. కా ది నవ

అనగా క నుండి ఝ వరకూ మొత్తం తొమ్మిది అక్షరాలు. అంటే "క, ఖ, గ, ఘ, ఙ, చ, ఛ, జ, ఝ, ఞ.

### 4.5.2.2. టా ది నవ

అంటే ట నుండి ధ వరకూ తొమ్మిది అక్షరాలు. అనగా "ట, ఠ, డ, ఢ, ణ, త, థ, ద, ధ, న" కానీ సంగీతశాస్త్రంలో కదినవ అంటే క నుండి ఞ వరకూ, టది నవ అంటే ట నుండి న వరకూ లెక్కిస్తున్నారు.

### 4.5.2.3. పాది పంచ

అంటే ప నుండి మ వరకూ అయిదు అక్షరాలు. అనగా "ప, ఫ, బ, భ, మ."

### 4.5.2.4. యాద్యష్ట

య మొదలుకొని హ వరకూ ఎనిమిది అక్షరాలు. "య, ర, ల, వ, శ, ష, స, హ." తొమ్మిది సంఖ్యల తరువాతి పదవ అక్షరాన్ని సున్నా "0" కింద మొత్తం అయిదు విభాగాలుగా విభజించారు. ఈ రాగాలను లెక్కించే పద్ధతిలో మొదటి రెండు అక్షరాల సంఖ్యను తిప్పి రాస్తారు. అంటే మొదటి అక్షర సంఖ్య పదుల స్థానంలోను, రెండవ అక్షర సంఖ్య ఒకట్ల స్థానంలోను ఉంచి గణిస్తారు. ఏదైనా మేళకర్త రాగాన్ని తీసుకొని లెక్కిస్తే మనకు ఇంకా బాగా బోధపడుతుంది.

ఉదాహరణకు మాయామాళవ గౌళ రాగాన్ని తీసుకుంటే మొదటి రెండు అక్షరాలు "మా, యా." ఈ అక్షరాలు పై పట్టికల్లో ఏయే అక్షరాల సంఖ్య కింద రాయబడ్డాయో తెలుసుకోవాలి. మ అక్షరం పాది పంచలో ఐదవది. అలాగే య అక్షరం యాదృష్టలో మొదటిది. కాబట్టి ఈ పద్ధతి ప్రకారం 51 కావాలి. దాన్ని తిప్పి రాస్తే సమాధానం 15 వస్తుంది. కాబట్టి మాయామాళవ గౌళ రాగం 15వ మేళకర్త రాగం. అలాగే ధీర శంకరాభరణంలోని మొదటి రెండు అక్షరాలు "ధీ, ర." అంటే టా ది నవ ప్రకారం ధ తొమ్మిదవ అక్షరం. యాదృష్ట ప్రకారం ర రెండవ అక్షరం. కాబట్టి ఇది 29వ మేళకర్త రాగం. ఈ పద్ధతి ద్వారా ఏ మేళకర్త రాగాన్నైనా కనుగొనవచ్చు.

## 4.5.3. సంయుక్తాక్షరాల మేళకర్త రాగాలు

కొన్ని రాగాల యొక్క మొదటి అక్షరాలు సంయుక్తాక్షరాలై ఉంటాయి. అలాంటప్పుడు ఆ రాగాల మొదటి అక్షరాన్ని, సంయుక్తాక్షరంలోని రెండవ అక్షరాన్ని తీసుకొని, తిప్పి లెక్కించాలి. ఉదాహరణకు రత్నాంగి రాగంలో మొదటి అక్షరం ర ను, తరువాతి సంయుక్తాక్షరంలోని రెండవ అక్షరం న ను తీసుకొని, తిప్పి లెక్కిస్తే కటపయాది సూత్రం ద్వారా రెండవ మేళకర్త రాగం అవుతుంది. కొన్ని రాగాలు మేళకర్త లక్షణాలకు కట్టుబడవు. ఆ సంయుక్తాక్షరంలోని ఒకటవ అక్షరాన్నే లెక్కిస్తారు. ఉదాహరణకు చక్రవాకం రాగంలోని మొదటి అక్షరం చ ను, క్ర లోని క ను తీసుకొని 16వ మేళకర్త రాగంగా లెక్కించారు. ఈ రాగంతోబాటు దివ్యమణి, (ది, వ-48) సింహేంద్ర మధ్యమం, (సి, మ్-57) చిత్రాంబరి (చి, త-66) రాగాలకు కటపయాది సూత్రం వర్తించదు. పైన చెప్పుకున్న కటపయాది సూత్రం జన్య రాగాలకు కూడా వర్తించదు. మేళకర్త రాగాలనుండి పుట్టిన రాగాలను జన్య రాగాలు, లేక పుట్టక రాగాలంటారు. హిందుస్థానీలో పుత్ర రాగాలని, పుత్రికా రాగాలని అంటారు. వీటిలో ఉపాంగ రాగాలు, భాషాంగ రాగాలు, వర్జ్య రాగాలు, వక్ర రాగాలు, నిషాదాంత్య రాగాలు, దైవతాంత్య రాగాలు, పంచమాంత్య రాగాలుగా విభజించవచ్చు.

పైన చెప్పిన వాటిలోని కొన్ని రాగాల్లో అన్నమయ్య సంకీర్తనలను చేశారు. ఆ సంకీర్తనల్లో అన్నమయ్య ఉపయోగించిన రాగాలు కొన్ని నేడు ఉపయోగంలో లేవు. కొన్ని స్వల్పంగా వాడుతున్నారు. కొన్ని విరివిగా ఉపయోగిస్తున్నారు. ఈ రాగాలను కింద ఇస్తున్నాను.

## 4.5.4. అన్నమయ్య సంకీర్తనల్లో ఉపయోగిస్తున్న రాగాలు

అన్నమయ్య సంపుటాల్లో ఉపయోగించిన రాగాలను, నేటి కాలంలో గాయకులు పాడేందుకు ఉపయోగిస్తున్న రాగాలను కింద ఇస్తున్నాను.

1. సామంతం, 2. దేశాక్షి, 3. పాడి, 4. గుండక్రియ, 5. శుద్ధ వసంతం, 6. భౌళి, 7. మాళవిశ్రీ, 8. మాళవి, 9. మాళవిగౌళ, 10. ధన్యాసి, 11. ధీర శంకరాభరణం, 12. కన్నడగౌళ, 13. వరాళి, 14. కాంబోధి, 15. శ్రీరాగం, 16. ముఖారి, 17. ఆహిరి, 18. గౌళ, 19. నాద రామక్రియ, 20. భూపాళం, 21. లలిత, 22. భైరవి, 23. నాట, 24. ఛాయనాట, 25. సాలంగం, 26. దేవగాంధారి, 27. రామక్రియ, 28. దేశాలం, 29. గుజ్జరి, 30. సామంతృనటతాళం, 31. కేదారగౌళ,32. నారని, 33. కాంభోజి, 34. మలహరి, 35. కురవంజి అటతాళం. ఇవి మొదటి సంపుటానికి చెందిన రాగాలు.

రెండవ సంపుటంలోని రాగాలను మొదటి సంపుటిలో ఉన్న రాగాలను మినహాయించి మిగిలిన రాగాలను ఇక్కడ ఇస్తున్నాను.

1. సాలంగనాట, 2. ప్రతాపనాట, 3. రామప్రియ, 4. కానడగౌళ, 5. బేసాల రాగం, 6. ధన్యాసి,7. భౌళిరామక్రియ, 8. హిందోళ వసంతం, 9. మంగళకౌశికి రాగం, 10. సౌరాష్ట్ర రాగం, 11. దేవగుప్తిరాగం, 12. తెలుగు కాంబోధి రాగం.

ఇలా మొత్తం 47 రాగాల్లో ఒకటి, రెండు సంపుటాలకు సంబంధించిన సంకీర్తనలు మనం చూడవచ్చు. ఈ రాగాల్లో దేశాల, దేవగుప్తి, గుండక్రియ, బేసాల రాగాలు మనకు నేడు లభించడంలేదు. అన్నమయ్య కాలంలోని రామక్రియ రాగం ఇప్పుడు లేదు కానీ నామ క్రియ రాగం, రామ ప్రియ రాగం ఉన్నాయి. ఆహిరి రాగం భైరవి మొదలైన రాగాలతో కలిసి మిశ్రమ రాగంగా, కొన్ని సందర్భాల్లో స్వతంత్ర రాగంగా సంకీర్తనాది ప్రక్రియల్లో స్వల్పంగా ప్రయోగించబడుతోంది. ఆ కాలంలో అన్నమయ్య ఉపయోగించిన నారని, సౌరాష్ట్ర రాగాలు కర్ణాటక, హిందుస్థానీ సంగీతాల్లో నేటికీ నిలిచి ఉన్నాయి. తెలుగు కాంభోజి, హిందోళ వసంతం లాంటి మిశ్రమ రాగాలు, సామంతృనటతాళం కురవంజి అటతాళం లాంటి రాగ,తాళ మిశ్రమాలు ఈ సంకీర్తనల్లో ఉన్నాయి.

అయితే, నేటి సంగీతజ్ఞులు, తిరుమల తిరుపతి దేవస్థానముల ఆస్థాన గాయకులు నేటి కాలానికి తగినట్లుగా సంకీర్తనలను సంస్కరించి, రాగాలను తీర్చి, భావానుగుణంగా పాడేందుకు ప్రయత్నిస్తున్నారు. శ్రీ పినాకపాణి లాంటి ఉద్దండులు సైతం రాగమార్పులను కోరుకోవడానికి కారణం అన్నమయ్య ఉపయోగించిన కొన్ని అపూర్వ రాగాల లక్షణాలు తెలియకపోవడమే అని నిస్సందేహంగా చెప్పవచ్చు. కాలానికి అనుగుణంగా అన్నమయ్య కీర్తనలు తన స్వరూపాన్ని మార్చుకుంటూ, ప్రజల్లోకి చొచ్చుకుపోతున్నట్లుగానే రాగాలను కూడా మార్చుకొని, నేటి రూపును సంతరించుకుంటున్నందుకు, అలా జీవ లక్షణాలను కలిగి ఉన్నందుకు ఎంతో సంతోషించాలి. అన్నమయ్య సంకీర్తనల్లో ఉపయోగించిన రాగాలను, నేడు గాయకులు సంకీర్తనలను పాడేందుకు వినియోగిస్తున్న రాగాలకు సంబంధించిన విశేషాంశాలను కింద ఇస్తున్నాను.

సామంతం, శుద్ధ వసంతం, భౌళి, మాళవిశ్రీ, మాళవి, మాళవిగౌళ, **ధన్యాసి**, ధీర శంకరాభరణం, కన్నడగౌళ, వరాళి, కాంబోధి, శ్రీరాగం, ముఖారి, ఆహిరి, గౌళ, లలిత, భైరవి, నాట, ఛాయనాట, భూపాళం, సాలంగం, సాలంగనాట, దేవగాంధారి, కేదారం, కేదారగౌళ, మలహరి, నారని, కాంభోజి, సాలంగనాట, ప్రతాపనాట, రామప్రియ, కానడగౌళ, హిందోళ వసంతం, మంగళకౌశికి, సౌరాష్ట్ర, దేవగుప్తి, కాంభోజి, తెలుగు కాంభోది రాగాలు లభిస్తున్నాయి. ఇవి కాకుండా మోహన, మధ్యమావతి, హంసధ్వని మొదలైన జన్య రాగాలను కూడా ఉపయోగిస్తున్నారు. వాటిని గురించి తెలుసుకుందాం.

## 4.5.5. ఉపాంగ రాగాలు

ధన్యాసి జనతోడి అనే ఐదవ మేళకర్త రాగ జన్యం. శుద్ధ రిషభం, సాధారణ గాంధారం, శుద్ధ మధ్యమం, శుద్ధ దైవతం, కైశికి నిషాద స్వరాలను కలిగి ఉన్నది.

శుద్ధ సావేరి 29వ మేళకర్త రాగమైన శంకరాభరణం యొక్క జన్యం. చతుశ్రుతి రిషభం, అంతర గాంధారం, శుద్ధ మధ్యమం, చతుశ్రుతి దైవతం, కాకలి నిషాద స్వరాలను కలిగి ఉంది.

సావేరి 15వ మేళకర్త రాగమైన మాయా మాళవగౌళ రాగ జన్యం. శుద్ధ రిషభం, అంతర గాంధారం, శుద్ధ మధ్యమం, శుద్ధ దైవతం, కాకలి నిషాదం ఇందులోని స్వరాలు.

మలహరి రాగం కూడా మాయా మాళవగౌళ జన్యరాగమే. ఈ రాగాలన్నీ ఉపాంగ రాగాలు. తన మేళకర్త రాగం ఏయే వికృతి స్వరాలను కలిగి ఉంటుందో, అవే స్వరాలను కలిగి ఉండే రాగాలను ఉపాంగ రాగాలంటారు.

## 4.5.6. భాషాంగ రాగాలు

మేళకర్త రాగంలోని స్వరాలతోబాటు ఒకటి, రెండు వేరే స్వరాలను కలిగిన రాగాలను భాషాంగ రాగాలంటారు. అన్నమయ్య సంకీర్తనల్లోని భాషాంగరాగాలను గురించి తెలుసుకుందాం.

కాంభోజి రాగం 28వ మేళకర్త రాగమైన హరికాంబోజి రాగ జన్యం. చతుశ్రుతి రిషభం, అంతరగాంధారం, శుద్ధ మధ్యమం, చతుశ్రుతి దైవతం, కైశికి నిషాదంతోబాటు అన్య స్వరమైన కాకలి నిషాదం కూడా కలిగి ఉంది. కాకలి నిషాదం “సా ని పద సా” అనే ప్రయోగంలో వాడబడుతోంది.

భైరవి రాగం 20వ మేళకర్త రాగమైన నటభైరవి జన్యం. చతుశ్రుతి రిషభం, సాధారణ గాంధారం, శుద్ధ మధ్యమం, శుద్ధ దైవతం, కైశికి నిషాద స్వరాలతోబాటు అన్య స్వరమైన చతుశ్రుతి దైవతాన్ని కలిగి ఉంది. ఈ స్వరం ఆరోహణలో “ప ద ని సా” అనే ప్రయోగంలో వాడుతున్నారు.

సారంగ రాగం 65వ మేళకర్తైన మేచకళ్యాణి రాగ జన్యం. చతుశ్రుతి రిషభం, అంతరగాంధారం, ప్రతిమధ్యమం, చతుశ్రుతి దైవతం, కాకలి నిషాదాలతోబాటు అన్య స్వరమైన శుద్ధ మధ్యమ స్వరాన్ని కలిగి ఉంది. ఈ స్వరం “ప మ రి గ మ రీ సా” అనే ప్రయోగంలో ఉంది.

ఆనంద భైరవి రాగం నటభైరవి రాగ జన్యం. చతుశ్రుతి రిషభం, సాధారణ గాంధారం, శుద్ధ మధ్యమం, శుద్ధ దైవతం, కైశికి నిషాద స్వరాలతోబాటు అన్య స్వరాలైన అంతరగాంధారం, కాకలి  నిషాదాలను కూడా కలిగి ఉంది. అంతరగాంధారం “మ గ సామ

పా మమా" అనే సంచారంలోను, కాకలి నిషాదం "స ని నీ స రీ స సా" అనే తారా స్థాయి సంచారంలోను, "స నీ నీ స రీ స సా" అనే మంద్ర స్థాయి సంచారంలో వాడబడుతోంది.

ముఖారి రాగం 22వ మేళకర్తైన ఖరహర ప్రియ రాగ జన్యం. చతుశ్రుతి రిషభం, సాధారణ గాంధారం, శుద్ధ మధ్యమం, చతుశ్రుతి దైవతం, కైశికి నిషాదాలతోబాటు శుద్ధ దైవతం అనే అన్య స్వరాన్ని కలిగి ఉంది. "స ని ద ప" అనే అవరోహణ సంచార ప్రయోగంలో నిలిచి ఉంది.

## 4.5.7. వర్జ్య రాగాలు

ఒక రాగంలో ఆరోహణంలో గాని అవరోహణంలో గాని లేక ఆరోహణ అవరోహణాల్లో గాని ఒకటి లేక రెండు స్వరాలను విసర్జిస్తే ఆ రాగాన్ని వర్జ్య రాగం అంటారు. సాధారణంగా వర్జ్య రాగంలో అయిదు స్వరాలు ఉంటాయి. పూర్వం సామవేదంలో సర్వాంతరం అనే రాగానికి నాలుగు స్వరాలు ఉన్నట్లు ఆధారాలున్నాయి. ఇటీవల కాలంలో స్వర్గీయ డా. మంగళంపల్లి బాలమురళీ కృష్ణగారు మూడు, నాలుగు స్వరాలతో రాగాన్ని సృష్టించారు.

## 4.5.8. షాడవ రాగాలు

ఆరోహణ అవరోహణాల్లో ఒక స్వరాన్ని విసర్జిస్తే దాన్ని షాడవ రాగం లేక ఆరు స్వరాల రాగం అంటారు. ఇలాంటి రాగాలు ఆరు ఉన్నాయి.

హిందోళ వసంతం రాగంవక్ర రాగం. ఆరోహణం "స గ మ ప ద ని ద సా" అవరోహణంలో "స ని ద ప మ గ ద మ గ సా" ఈ రాగం నటభైరవి అనే 20వ మేళకర్త జన్యం. ఈ రాగంలో ఆరోహణ అవరోహణాల్లో రిషభం వర్జ్యం.

శుద్ధ సీమంతిని ఆరోహణం "స రి గ మ ప ద సా" అవరోహణం "స ద ప మ గ రి సా" ఇది హనుమతోడి అనే 8వ మేళకర్త జన్యం. ఇందులో నిషాదం నిషేధించబడింది.

## 4.5.9. ఔడవ రాగాలు

ఒక రాగంలో ఆరోహణ అవరోహణాల్లో అయిదు స్వరాలు ఉంటే దాన్ని ఔడవ రాగం అంటారు.

మోహన రాగంలో ఆరోహణంలో "స రి గ ప ద సా" అవరోహణంలో "స ద ప గ రి సా" ఈ రాగంలో మధ్యమం, నిషాదం నిషేధం. ఈ రాగం 28వ మేళకర్తైన హరికాంభోజి జన్యం.

మధ్యమావతి ఆరోహణం "స రి మ ప ని సా" అవరోహణం "స ని ప మ రి సా" ఈ రాగం 22వ మేళకర్తైన ఖరహరప్రియ రాగ జన్యం. ఇది గాంధార, దైవత వర్జ రాగం.

హంసధ్వని ఆరోహణం "స రి గ ప ని సా" అవరోహణం "స ని ప గ రి సా" ఇది 29వ మేళకర్తైన ధీర శంకరాభరణ జన్యం. ఇది మధ్యమ, దైవత వర్జ రాగం.

భూపాళంఆరోహణం "స రి గ ప ద సా" అవరోహణం "స ద ప గ రి సా" ఇది హనుమతోడి జన్యం. మధ్యమ, నిషాద వర్జ రాగం.

శుద్ధ సావేరి ఆరోహణం "స రి మ ప ద సా" అవరోహణం "స ద ప మ రి సా" ఇది ధీరశంకరాభరణ జన్యం

గంభీరనాట ఆరోహణం "స గ మ ప ని సా" అవరోహణం "స ని ప మ గ సా" ఇది 53వ మేళకర్తైన గమన శ్రమ రాగ జన్యం.

కొన్ని జన్య రాగాలు సంపూర్ణంగా ఉంటాయి. అంటే అన్ని స్వరాలు ఉంటాయి. కానీ అలాంటి రాగాలు భాషాంగరాగాలుగానో, వక్ర రాగాలుగానో ఉండి, మేళకర్త, జన్య రాగాల మధ్య భేదాన్ని తెలియజేస్తుంటాయి.

ఆనంద భైరవి ఆరోహణం "స గ రి గ మ ప ద ప ని సా" అవరోహణం "స ని ద ప మ గ రి సా" ఇది నటభైరవి అనే 20వ మేళకర్త జన్యం.

ఆహిరి ఆరోహణం "స రి స గ మ ప ద ని సా" అవరోహణం "స ని దా ప మ గ రి సా" ఇది హనుమతోడి జన్యం.

భైరవి ఆరోహణం "స రి గ మ ప ద ని సా" అవరోహణం "స ని ద ప మ గ రి సా" ఈ భాషాంగరాగం నటభైరవి జన్యం.

గౌళీపంతు ఆరోహణం "స రి గ రి మ ప ద ప ని సా" అవరోహణం "స ని ద ప మ గ రి సా"

ఆరోహణం "స రి మ ప ని సా" అవరోహణం "స ని ద ప మ ద మ గ రి సా" ఇది మాయామాళవ గౌళ జన్యం. ఈ రాగాన్ని పాడేందుకు కొందరు ఒకటవ ఆరోహణ అవరోహణాలను, మరికొందరు రెండవ ఆరోహణ అవరోహణ క్రమపద్ధతిని పాటిస్తారు.

పై విశ్లేషణనుబట్టి రాగాలు సంపూర్ణ సంపూర్ణ రాగాలు, సంపూర్ణ షాడవ రాగాలు, సంపూర్ణ రాగాలు, షాడవ సంపూర్ణ రాగాలు, షాడవ షాడవ రాగాలు, షాడవ ఔడవ రాగాలు, ఔడవ సంపూర్ణ రాగాలు, ఔడవ షాడవ రాగాలు, ఔడవ ఔడవ రాగాలుగా విభజించవచ్చు.

### 4.5.10. సంపూర్ణ షాడవ రాగాలు

సంపూర్ణ షాడవ రాగాల ఆరోహణంలో అన్ని స్వరాలుండి, అవరోహణంలో ఆరు స్వరాలు ఉంటాయి. ఈ వర్గంలో అన్నమయ్య ఒక్క భైరవ రాగాన్ని ఉపయోగించారు

భైరవ రాగం ఆరోహణం "స రి గ మ ప ద ని సా" అవరోహణం "స ద ప మ గ రి సా" ఇది 17వ మేళకర్తైన సూర్యకాంత రాగ జన్యం.

### 4.5.11. సంపూర్ణ ఔడవ రాగాలు

సంపూర్ణ ఔడవ రాగాల్లో ఆరోహణలో అన్ని స్వరాలుంటూ, అవరోహణలో అయిదు స్వరాలు ఉంటాయి. ఈ వర్గంలో అన్నమయ్య ఉపయోగించిన నాట రాగమే దర్శనమిస్తోంది.

నాట రాగంలో ఆరోహణం "స రి గ మ ప ద ని స. లేక స రి గ మ ప ద ని ప ని సా" అవరోహణం "స ని ప మ రి సా." ఈ రాగం 36వ మేళకర్తైన చలనాట జన్యం.

### 4.5.12. షాడవ ఔడవ రాగాలు

ఆరోహణంలో షాడవం, (ఆరు స్వరాలు) అవరోహణంలో ఔడవం (అయిదు స్వరాలు) కలిగిన రాగాలను షాడవ ఔడవ రాగాలంటారు. అన్నమయ్య ఈ వర్గంలోని రాగాలను తన సంకీర్తనల్లో వాడినట్లుగా ఆధారాలు నాకు దొరకలేదు.

### 4.5.13. షాడవ సంపూర్ణ రాగాలు

ఆరోహణంలో షాడవం, అవరోహణంలో సంపూర్ణ లక్షణాలు కలిగిన రాగాలను షాడవ సంపూర్ణ రాగాలంటారు.

శుద్ధ దేశీ రాగంలో ఆరోహణం "స రి మ ప ద ని సా." అవరోహణం "స ని ద ప మ గ రి సా." ఈ రాగం నటభైరవి అనే 20వ మేళకర్త రాగ జన్యం.

కాంభోజి రాగంలో ఆరోహణం "స రి గ మ ప ద సా." అవరోహణం "స ని ద ప మ గ రి సా." ఇది హరికాంభోజి అనే 20వ మేళకర్త జన్యం.

ముఖారి రాగంలో ఆరోహణం "స రి మ ప ద ని ద సా." అవరోహణం "స ని ద ప మ గ రి సా." ఇది 22వ మేళకర్తైన ఖరహరప్రియ జన్యం.

## 4.5.14. ఔడవ సంపూర్ణ రాగాలు

ఆరోహణంలో ఔడవం, అవరోహణంలో సంపూర్ణ లక్షణాలు కలిగిన రాగాలను ఔడవ సంపూర్ణ రాగాలంటారు.

సావేరి రాగంలో ఆరోహణం "స రి మ ప ద సా." అవరోహణం "స ని ద ప మ గ రి సా." ఇది 15వ మేళకర్తైన మాయామాళవ గౌళ జన్యం.

ధన్యాసి రాగంలో ఆరోహణం "స గా మ ప ని సా." అవరోహణం "స ని ద ప మ గ రి సా." ఇది 8వ మేళకర్తైన హనుమతోడి జన్యం.

అభేరి రాగంలో ఆరోహణం "స గ మ ప ని సా." అవరోహణం "స ని ద ప మ గ రి సా." ఇది నటభైరవి అనే 20వ మేళకర్త జన్యం.

అసావేరి రాగంలో ఆరోహణం "స రి మ ప ద సా." అవరోహణం "స ని స ప ద మ ప రి గా రి సా." ఇది హనుమతోడి జన్యం.

దేశాక్షి రాగంలో ఆరోహణం "స రి గ ప ద సా." అవరోహణం "స ని ద ప మ గ రి సా." ఇది 29వ మేళకర్తైన ధీర శంకరాభరణ జన్యం.

దేవగాంధారి రాగంలో ఆరోహణం "స రి మ ప ద సా." అవరోహణం "స ని ద ప మ గ రి సా." ఇది ధీర శంకరాభరణ జన్యం.

కేదారగౌళ రాగం ఆరోహణంలో "స రి మ ప ని సా", అవరోహణంలో "స ని ద ప మ గ రి సా." అనే స్వరాలను కలిగి ఉంది. ఇది 28వ మేళకర్తైన హరికాంభోజి జన్యం.

శ్రీరాగం ఆరోహణంలో "స రి మ ప ని సా", అవరోహణంలో "స ని ప ద ని ప మ రి గా రి సా" స్వరాలను కలిగింది. ఇది 22వ మేళకర్తైన ఖఱహరప్రియ జన్యం.

## 4.5.15. ఔడవ షాడవ రాగాలు

ఆరోహణంలో ఔడవం, అవరోహణంలో షాడవం కలిగిన రాగాలను ఔడవ షాడవ రాగాలంటారు.

భౌళి రాగం ఆరోహణంలో "స రి గ ప ద సా." అవరోహణంలో "స ని ద ప మ గ రి సా" స్వరాలుంటాయి. ఇది మాయామాళవ గౌళ జన్యం.

మలహరి రాగంలో ఆరోహణం "స రి మ ప ద సా", అవరోహణం "స ద ప మ గ రి సా." స్వరాలుంటాయి. ఇది కూడా మాయామాళవ గౌళ జన్యం.

## 4.5.16. వక్ర రాగాలు

స్వరాలు క్రమంగా లేకుండా, ఆరోహణ అవరోహణాల్లో ఎగుడు దిగుడుగా ఉంటూ, ఒక క్రమ పద్ధతిని అనుసరించని రాగాలను వక్ర రాగాలు అంటారు. ఈ స్వరాక్షరాలను గమనించినట్లైతే ఒంపు తిరిగినట్లు ఉంటాయి. అంటే ఈ రాగంలోని స్వరాలు ఆరోహణావరోహణాల్లో నిచ్చెన మెట్లు ఎక్కినట్లు, దిగినట్లు తమ అంతస్తునుబట్టి కాకుండా పైకెక్కి, కిందికి దిగి, మళ్ళీ ఆరోహించడం, లేక అవరోహించడం వక్ర రాగాల ప్రత్యేక లక్షణం. ఇవి ఆరోహణంలో వక్రంగా ఉండే రాగాలు, అవరోహణంలో వక్రత కలిగినవి, ఆరోహణ అవరోహణాల్లో వక్రత కలిగినవి అనే మూడు రకాలుగా ఉన్నాయి. భైరవి, ఆనంద భైరవి, ముఖారి మొదలైనవి ఆరోహణ తెగకు చెందినవి. అసావేరి, సారంగ, శ్రీరాగం, హిందుస్థానీ కాపీ రాగాలు అవరోహణ వక్రతను పాటిస్తున్నాయి. ఆరోహణ అవరోహణ పద్ధతుల్ని పాటించే కొన్ని రాగాలను గమనిద్దాం.

ఛాయనాట ఆరోహణ అవరోహణాల్లో "స రి గ మ ప మ ప సా, స ని ద ని ప మ రి సా"

హిందోళ వసంతంరాగం ఆరోహణ అవరోహణాల్లో "స గ మ ప ద ని ద సా, స ని ద ప మ గ ద మ గ సా." ఇది నటభైరవి జన్యం.

రీతిగౌళ రాగ ఆరోహణ అవరోహణాల్లో "స గ రి గ మ ని ద మ ప ని సా, స ని ద మ గ మ ప మ రి సా." ఇది కూడా నటభైరవి జన్యమే.

కానడ రాగం ఆరోహణం "స రి గ మ ప మ దా ని సా" అవరోహణం "స ని ప మ గ మ రి సా." ఇది 22వ మేళకర్తైన ఖరహరప్రియ జన్యం.

పైన చెప్పిన రాగాలు ఆరోహణ అవరోహణల్లో వక్రత కలిగినవి.

కొన్ని రాగాలు మంద్ర స్థాయిలో మొదలై, నిషాదాంత్యంతో ఆగిపోయి, తారాస్థాయిని చేరుకోవు. వాటిని నిషాదాంత్య రాగాలు అంటారు. అలాగే కొన్ని దైవతాంత్య రాగాలుగా,

కొన్ని పంచమాంత్య రాగాలుగా చెలామణి అవుతున్నాయి. ఈ రాగాల్లో కొన్ని రాగాలను అన్నమయ్య ఉపయోగించడం మనం గమనించాల్సిన అంశం. కొన్ని రాగాలు మరుగున పడ్డాయి.

## 4.6. తాళం

సంగీతశాస్త్రంలో తాళం ముఖ్యమైన భూమిక పోషిస్తోంది. తాళం అంటే నడక అని అర్థం చెప్పుకోవచ్చు. అంటే పాటకు రాగం ఎంత ప్రధానమో, తాళం అంటే లయ కూడా అంతే ప్రధానం. లయ అంటే రిథం అని ఆంగ్లంలో అంటున్నాం. పాటకు అందాన్ని, సొబగును చేకూర్చడంలో తాళం తన వంతు పాత్రను పోషిస్తుంది. పాడడానికి రాగం ఎంత అవసరమో తాళం అంతే అవసరం. ఈ మధ్యకాలంలో మాటలే పాటలుగా రాస్తున్నారు. కేవలం వారు పాడుతున్నారో, మాట్లాడుతున్నారో అర్థం కాకపోయినప్పటికీ అవి కూడా లయబద్ధంగానే జరుగుతున్నాయి. రాగం అంటే పాటకు నాయకుడనుకుంటే తాళం అంటే పాటను నడిపించే రథసారథి. కాబట్టి తాళం అంటే పాటకు నడక అని అర్థం చెప్పుకోవచ్చు. అందుకే శ్రుతి లయలు పాటకు తల్లిదండ్రులని సంగీతజ్ఞులు భావిస్తున్నారు.

సంగీతానికి తాళం సూర్యునికి వెలుతురు, బంగారానికి పసిమివంటిదని *సంగీతము తాళ లక్షణము* గ్రంథ కర్త శ్రీ వింజమూరి నరసింహాచార్యులు పేర్కొన్నారు. మోక్షానికి నడిపించేందుకు భక్తి ఎంత ప్రాధాన్యమో, ఆ భక్తికి గానం కూడా అంతే అవసరం. ఆ గానం తాళబద్ధంగా ఉండాలని ఆయన చెప్పారు.

> "గీతం వాద్యంచ నృత్యంచ తాళహీనం నరాజతే
> లోకేనదేచ వచసాం పాదయోర్గతి రుత్తమా
> తాళేనైవ వినాతేన స్ఖలనంతేషు దృశ్యతే
> తౌర్యత్రికం తాళహీనం చాలయో త్పురుషాధమః
> సపాపీ నరకం ఘోరమాశు గచ్ఛతి సాన్వయః"
>
> *(వరాహ నరసింహాచార్యులు, వింజమూరి.1984:2.)*

సంగీతంలో మరీ ముఖ్యంగా గీత, వాద్య, నృత్యాలను సంగమించడంలో తాళానిది ప్రత్యేకమైన భూమిక. ఈ తాళం పాపాత్ముణ్ణి పుణ్యలోకాలకు చేర్చేందుకు గానం ద్వారా సహాయపడుతుందని పండితులు పేర్కొన్నారు.

### 4.6.1. తాళం పుట్టుక

పూర్వం వాల్మీకి నోటినుండి తాళగతంగా రామాయణ శ్లోకం వెలువడిందని పండితులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆ తరువాత వచ్చిన పద్య సాహిత్యం నుండి అనేక విధాలుగా సాహిత్యం తాళబద్ధంగా నడిచింది. ఛందస్సులో ఎలాగైతే గురు లఘువులు, ప్లుతాల ఆధారంగా అక్షరాలను లెక్కిస్తామో అదే విధంగా సంగీతంలో రాగాక్షరాలను హ్రస్వ దీర్ఘ కాలాలనుబట్టి తాళగతంగా లెక్కిస్తాం. గ్రహించడానికి వీలయ్యే కాలపరిమితిని మాత్ర అంటారు. ఈ మాత్రనే గ్రీకులు (Cirunosprotos) అన్నారు.

"ఏకమాత్రా లఘురుత్తో ద్విమాత్రా గురురుచ్చతే
త్రిమాత్రాస్తు ప్లుతోజ్ఞెయ స్తదర్థో ధృతముచ్చతే
ధృతార్థస్తు అనుధృతాస్యాత్ ప్రమాణం కధితం బుధైః"

(*వరాహ నరసింహాచార్యులు, వింజమూరి.1984:9.*)

పూర్వం శివుడికి నాట్యం చేయాలనిపించిందట. అప్పుడు రంగస్థలంకోసం సరైన స్థలాన్ని వెదుకుతుంటే ఆయన వాహనమైన నంది తన వీపును రంగస్థలంగా చేసి, శివుడు నాట్యమాడేందుకు వీలు కల్పించాడట. ఆ సందర్భంలో శివుడు ఒక క్రమపద్ధతిలో తాండవమాడాడట. ఆ విధంగా తాళం ఈశ్వరుని తాండవం నుండి జనించిందని పురాణాలు చెప్తున్నాయి.

"తాళ స్తల ప్రతిష్ఠాయా
మితిధాతోపయోగతః
గీతం నృత్తం తథా వాద్యం యతస్తాళే ప్రతిష్టితం"

(*వరాహ నరసింహాచార్యులు, వింజమూరి.1984:11.*)

"తకారం శంకరంప్రోక్తో ళకారశ్శ క్తిరుచ్చతే
శివశక్తీ సమయోగ తాళనామాభిదియ్యతే"

(*వరాహ నరసింహాచార్యులు, వింజమూరి.1984:11.*)

తాళం అనే పదాన్ని మన ప్రాచీనవేత్తలు తా = తాండవం, ళా= లాస్యం అని అన్నారు. తకారం శంకర బీజాక్షరం కాగా ళకారం శక్తి భీజాక్షరం. సంగీతం ప్రాణాగ్ని సంయోగంవల్ల కలిగిందని పండితులు చెప్పారు. ఈ తత్త్వాన్ని కార్య కారణ తత్త్వం అన్నారు. ఈ తత్త్వాన్ని ధ్వని ఏర్పడడానికి స్పందనలు కలిగించేందుకు ఉపకరించే వస్తువులకు ఆవశ్యకాలు అని ప్రాకృతికవేత్తలు అన్నారు. స్పందన కలిగించేందుకు అవసరమైన సంఘర్షణను అగ్నిగా, దానివల్ల ఉత్పన్నమయ్యే శక్తిని ప్రాణంగా సంభావించారు. తాళం ఏర్పడడానికి ఈ రెండూ కావాలి. కాబట్టి ఆది దేవతలైన పార్వతీ పరమేశ్వరుల సంయోగంవల్ల తాళం పుట్టిందని భావిస్తున్నారు.

> "సృష్ట్యాది లయ పర్యంతం వర్తమాన త్స్వగింద్రియః
> తాళో నిత్యేవినాశాదిప్రత్యయః స్ఫూర్తిగోచరః"
>
> (వరాహ నరసింహాచార్యులు, వింజమూరి.1984:12.)

రెండక్షరాల కలయికవల్ల పుట్టే సశబ్దాలు, నిశ్శబ్దాలు మనం వినకపోయినప్పటికీ తాళ గతంగానే జరుగుతూ ఉంటాయని మనం అర్థం చేసుకోవాలి. అందుకే పాశ్చాత్యులు ఇలా అన్నారు.

> "What thought Solemn silence all
> Move round the dark terrestrial ball
> What thought nor real voice nor sound
> A midst Their radiant orbs be found?
> In reasons ear they all rejoice,
> And utter forth a glorious voice."
>
> *(వరాహ నరసింహాచార్యులు, వింజమూరి.1984:13.)*

*అని పేర్కొన్నారు.*

> "సంయోగేచ వియోగేచ తలయోరుభయ్యోర్యధా
> వర్తతేవ్యాప్తి మాన్కాల స్సతాళఃపరికీర్తితః"
>
> (వరాహ నరసింహాచార్యులు, వింజమూరి.1984:13.)

తాళం అనేది సంయోగ వియోగాలవల్ల, భావస్ఫోరకంగా పుడుతుందని పై శ్లోక భావం. కానీ తాళం కాలానికి ప్రాణమే కానీ ప్రత్యేకమైంది కాదని కొందరి భావం.

తాళం అంటే ఒక కొలతబద్ద అని, కొలమానం అని *గానకళా బోధిని* అనే గ్రంథంలో పార్థసారథిగారు చెప్పారు. ఆయన "తాళము అనగా సంగీతమును కొలుచు కొలతబద్ద. ఒక వస్త్రమును అర్ధ గజము, పావు గజము, రెండు, మూడు గజములు మొదలగు కొలతలతో ఎటుల మనము కొలతబద్దతో కొలుచుచున్నారమో, అటులనే సంగీతమును కూడా చాల విధములైన తాళములచే వాని వానిని వేరువేరుగా కొలుచుచున్నారము." (పార్థసారథి, ఎన్. సి.2014:66.) అని చెప్పారు. దీన్నిబట్టి తాళ ప్రాధాన్యాన్ని మనం గ్రహించవచ్చు. కర్ణాటక సంగీతంలో తాళాలు 7, 35, 108 రకాలుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం 35 తాళాల్లో పాడడం సాధారణంగా జరుగుతోంది. ఈ 35 తాళాలకు సప్త తాళాలు మూలం.

## 4.6.2. సప్త తాళాలు

సంగీతశాస్త్రంలో సప్త స్వరాల్లాగా సప్త తాళాలు కూడా ప్రసిద్ధి పొందాయి. అవి ధ్రువతాళం, మఠ్య తాళం, రూపక తాళం, త్రిపుట తాళం, ఝంపె తాళం, అట తాళం, ఏక తాళం అనే ఏడు విధాలుగా విభజించారు.

"ధృవో మఠ్యో రూపకశ్చ ఝంపా త్రిపుట ఏవచ
అటతాళైకతాళశ్చ సప్త తాళాః ప్రకీర్తితః"

(వరాహ నరసింహాచార్యులు, వింజమూరి.1984:61)

ఈ శ్లోకం సంగీతశాస్త్రంలో వ్యవహారంలో ఉన్న ఏడు తాళాలను గురించి మనకు తెలుపుతోంది. ఈ తాళాలు సప్త నక్షత్రాల రంగుల నుండి, వారంలోని సప్త దినాల నుండి, ఆకాశంలోని ఇంద్రధనస్సులోని ఏడు రంగులనుండి పుట్టినట్లుగా పూర్వులు రాసిన శ్లోకాలవల్ల తెలుస్తోంది. తాళాలను సప్త వర్ణాలతో పోల్చారు. ఆ సప్త వర్ణాలు ఎప్పటికప్పుడు తమ ఉనికిని మార్చుకుంటూ, కొన్ని సమయాల్లో ఆయా రంగులుగా మారుతున్నట్లే తాళాలు కూడా భావాన్నిబట్టి తమ ఉనికిని ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ఉంటాయి. రాగాల్లాగే తాళాలు కూడా నవరసాలను, మనలోని భావాలను ప్రతిబింబిస్తాయి. కాబట్టి తాళాలు వాటిని ప్రభావితం చేస్తున్నాయి. ఉద్రేకంగా ఉన్నప్పుడు ఒకవిధంగా, శాంతంగా ఉన్నప్పుడు మరో విధంగా, నిర్వికారంగా ఉన్నప్పుడు ఇంకొక విధంగా మానవుడు ఉంటాడు. అలా ఉన్నప్పుడు ఒక్కొక్క భావాన్ని వ్యక్తం చేస్తాడు. ఆ భావాలను పాటల రూపంలో మార్చినట్లైతే అవి కూడా ఆ భావాలను ప్రతిబింబిస్తాయి. ఉదాహరణకు అన్నమయ్య యౌవనంలో

ఉన్నప్పుడు 'వెర్రివాడు వెర్రివాడు' విష్ణుని దాస్యంలో జీవించలేనివాడు వెర్రివాడు అంటారు. ప్రౌఢదశలో 'బ్రహ్మమొక్కటే' అని సర్వమానవ సమానత్వాన్ని చాటారు. మోక్ష ప్రాప్తికి దగ్గరయ్యే సమయంలో 'నానాటి బతుకు నాటకము' అంటూ ఈ లోక మాయలనుండి విముక్తుడు కావాలని మానవాళికి ప్రబోధించారు. ఈ భావాలన్నీ తాళాలు రాగాలతో కలిసి ప్రతిబింబిస్తున్నాయి.

## 4.6.3. షడంగాలు

తాళంలో ముఖ్యంగా ఆరు అంగాలు ఉన్నాయి. వాటిని షడంగాలు అంటారు. అవి లఘువు, ధ్రుతం, అనుధ్రుతం, గురువు, ప్లుతం, కాకపాదం అనే ఆరు అంగాలుగా సంగీత పండితులు విభజించారు. ఈ ఆరు అంగాల్లో లఘువు, ధ్రుతం, అనుధ్రుతం అనే మూడు అంగాలు మాత్రం ప్రస్తుత సప్త తాళాల్లో ఉపయోగిస్తున్నారు. ధ్రుతం, అనుధ్రుతాల అక్షరకాలాన్ని పూర్వులు నిర్ణయించారు.

## 4.6.4. కాలం

ఒక తాళంలో సంగీతాక్షరాల వేగాన్ని తెలిపేది కాలం. ఒక అక్షరాన్ని పలికే కాలపరిమితిని అక్షరకాలం అంటారు. ఈ అక్షరకాలం ఒక అక్షరం మాత్రమే అయితే, దాన్ని అనుధ్రుతం అంటారు. రెండు అక్షరాల కాలపరిమితిని ధ్రుతం అంటారు. అంటే ధ్రుతం రెండక్షరాలు, అనుధ్రుతం ఒక అక్షర కాలపరిమితి అన్నమాట. ధ్రుతం పూర్ణం (సున్నా) గాను, అనుధ్రుతం అర్థ చంద్రాకృతిగా (7) సంకేతాలుగా నిర్ణయించబడ్డాయి. తాళం వేసేటప్పుడు ధ్రుతం అంటే చేతితో ఒక దెబ్బవేసి, ఒక విసురును విసురుతారు. అనుధ్రుతం అంటే చేతితో ఒక దెబ్బగా లెక్కిస్తారు. చేతి విసరును విసర్జితం అని అంటారు.

లఘువును ఒక చిన్న నిలువుగీతతో సంకేతన ముందు చూపుతారు. ఈ లఘువులో రెండు భాగాలున్నవి. 1. చేతితో దెబ్బ వేయడం, 2 వేళ్ళను లెక్క పెట్టడం. దెబ్బ వేసిన తరువాత చేతిని వెల్లికల తిప్పడాన్ని గురువు అంటారు.

### 4.6.4.1. త్రికాలాలు

ప్రథమ కాలం: క్రియకు ఒక హ్రస్వాక్షరం, ఒక స్వరం అంటిపెట్టుకుంటే దాన్ని ప్రథమ కాలం అంటారు. ఇది గీతాలవరకు మాత్రమే పని చేస్తుంది.

ద్వితీయ కాలం: ప్రథమ కాలానికి రెట్టింపు నడిచే కాలాన్ని ద్వితీయ కాలం అంటారు. ఇందులో ఒక క్రియకు రెండు హ్రస్వాక్షరాలు ఉంటాయి. ఇది కూడా గీతాల వరకే వర్తిస్తుంది.

తృతీయ కాలం: ద్వితీయ కాలానికి రెట్టింపే ఈ తృతీయ కాలం. అంటే ఒక క్రియకు నాలుగు హ్రస్వాక్షరాలు నడిచే ప్రక్రియను తృతీయ కాలం అంటారు.

ఆవర్తం: ఒక తాళంలోని క్రియలను ఒకసారి సంపూర్ణంగా ముగించడాన్ని అంటే తాళం ఒకసారి సంపూర్తి చేయడాన్ని ఆవర్తం అంటారు. ఈ ఆవర్తం ఆయా తాళాల్లో ఆయా క్రియలనుబట్టి అక్షరాల సంఖ్యను కలిగి ఉంటుంది.

## 4.6.5. ధాతు మాతు ప్రక్రియ

సంగీతంలోని స్వర విభాగాన్ని ధాతువు అంటారు. సంగీతంలోని సాహిత్య విభాగాన్ని మాతువు అంటారు. అందుకే సంగీత శాస్త్రాన్నీ ధాతు మాతు ప్రక్రియగా, ధాతు మాతు లక్షణ సమన్వితంగా పండితులు వ్యవహరిస్తున్నారు.

**తాళాంగం:** ఒక తాళంలో తాళ అక్షర కాల సంఖ్యను తెలిపే సంఖ్యా విశేషమే తాళాంగం.

## 4.6.6. తాళం వేసే పద్ధతి

సాధారణంగా తాళాన్ని కూర్చొని వేయాలి. కుడి చేతితో కుడి తొడపైన కుడి అరచేత్తో తాళం వేయాలి. అరచేతి దెబ్బ పడ్డ వెంటనే చేతి చిటికెన వేలు నుండి బొటనవేలి వైపు వేళ్ళను ఒక క్రమ పద్ధతిలో ఒక్కొక్క వేలుగా లెక్కవేయాలి. ఆరు, ఏడు, తొమ్మిది లాంటి అయిదు కంటే ఎక్కువ సంఖ్యలో వేళ్ళను లెక్కించాల్సి వచ్చినప్పుడు మళ్ళీ చిటికెనవేలు నుంచి, బొటన వేలు వైపుకు క్రమంగా లెక్కించాలి. వీటినే లఘు ధ్రుతాల పద్ధతి అంటారు.

## 4.6.7. తాళ జాతులు

సప్త తాళాలు అయిదు జాతులుగా విభజించబడ్డాయి. అవి

త్రిశ్రజాతి (మూడు అక్షరాల కాలం గలది) చతురస్రజాతి (నాలుగు అక్షరాల కాలం గలది) ఖండజాతి (అయిదు అక్షరాల కాలం గలది) మిశ్రజాతి (3+4 = 7 అక్షరాలు)

సంకీర్ణజాతి (చతురస్ర+ఖండ 4+5 = 9, లేక మిశ్ర + చతురస్ర = 7+4 = 11 అక్షరాలు) కాలం గల తాళాలుగా విభజించారు. కాబట్టి ధ్రువ మఠ్యాది సప్త తాళాల్లో ఒక్కొక్క జాతిలో అయిదు జాతుల చొప్పున 7x5 = 35 తాళాలుగా విభజించారు. ఈ పద్ధతినే ప్రస్తుతం సంగీతోపాధ్యాయులు అభ్యాసకులకు నేర్పేందుకు ఉపయోగిస్తున్నారు.

లఘువు యొక్క అక్షర విలువ ఆయా లఘువుల జాతులపై ఆధారపడుతుంది. లఘువు అనే అంగానికి అయిదు జాతులున్నాయి. అవి

1. త్రిశ్ర, 2. చతురస్ర, 3. ఖండ, 4. మిశ్ర, 5 సంకీర్ణ జాతులుగా విడగొట్టారు. ఇవి సప్త తాళాల్లోని అయిదు జాతులు. ఇదే విధానం లఘువుకు కూడా వర్తిస్తుంది. కాబట్టి మూడు అక్షరాల లఘువును త్రిశ్ర లఘువు అని, నాలుగు అక్షరాల లఘువును చతురస్ర లఘువుగా, అయిదు అక్షరాల లఘువును ఖండ లఘువుగా, ఏడు అక్షరాల లఘువును మిశ్ర లఘువుగా, తొమ్మిది అక్షరాల లఘువును సంకీర్ణ లఘువుగా వ్యవహరిస్తున్నారు.

పైన చెప్పిన ఏడు తాళాల్లో లఘువు ముఖ్యమైన అంగం. ధ్రుతం ఏకతాళంలో లేదు. అనుధ్రుతం ఝంపె తాళంలో తప్పా మిగిలిన తాళాల్లో లేదు. మిగిలిన మూడు అంగాలు అంటే గురువు, ప్లుతం, కాకపాదం 108 తాళాల్లో కనబడతాయి. ఈ 108 తాళాల్లో కొన్ని ప్రత్యేకించి నాట్యానికి ఉపకరిస్తున్నాయి.

## 4.6.8. తాళ విభజన

లఘువుకి అయిదు జాతులు ఉన్నాయని మనం ముందే తెలుసుకున్నాం. ఆ లఘువు జాతినిబట్టి తాళాలు కూడా విభజించారని తెలుసుకోవచ్చు. ఉదాహరణకు ధ్రువతాళంలో త్రిశ్ర, చతురస్ర, ఖండ, మిశ్ర, సంకీర్ణజాతి ధ్రువతాళాలుగా విభజించవచ్చు. అంతేగాని ఒక తాళంలో రెండు జాతులు ఉండడానికి వీలు లేదు. అంటే ఇందాక మనం అనుకున్నట్లుగా ధ్రువతాళంలో ఒక లఘువు త్రిశ్రగా, ఇంకొకటి చతురస్రగా ఉండేందుకు వీల్లేదు. అంటే లఘువులోని జాతులనుబట్టి తాళ జాతులు విభజించబడ్డాయి. ఒక్కొక్క తాళానికి అయిదు జాతుల చొప్పున 35 తాళాలు ఏర్పడ్డాయి. ఈ 35 తాళాలను దృష్టిలో ఉంచుకొని, వాటికి అలంకారాలు రాశారు. అందుకే వాటిని సప్త తాళ అలంకారాలు అంటారు. ఈ 35 తాళాల్లో ఒకే అక్షర విలువ కలిగిన తాళాలు ఉంటాయి. ఆ సందర్భంలో ఒకే జాతి తాళం మళ్ళీ మళ్ళీ ఉపయోగించబడిందని అనుకోవడానికి వీలు లేదు. అక్షరాల విలువ ఒక్కటే అయినప్పటికి

ఆయా తాళాల ఘాతాలనుబట్టి ఆ తాళ విలువలు మారుతూ ఉంటాయి. ఉదాహరణకు చతురస్రజాతి ధ్రువతాళం 40 అక్షరాల విలువ కలిగి ఉంటుంది. అలాగే ఖండజాతి అటతాళం కూడా 40 అక్షరాల విలువ కలిగి ఉంటుంది. కానీ ధ్రువతాళం ఒక లఘువు, ఒక ధ్రుతం, రెండు లఘువులు కలిగి ఉంటుంది. అలాగే ఖండజాతి అటతాళంలో రెండు లఘువులు, రెండు ధ్రుతాలు ఉంటాయి. కాబట్టి అక్షర విలువ ఒక్కటే అయినప్పటికీ క్రియలవల్ల ఈ భేదం కనబడుతుంది. సాధారణంగా తాళాలు కొన్ని ప్రత్యేక జాతులను కలిగి ఉన్నాయి.

ధ్రువ తాళం చతురస్రజాతిని కలిగి ఉండడంవల్ల దీన్ని చతురస్రజాతి ధ్రువ తాళం అని, మఠ్య తాళం చతురస్రజాతిని కలిగి ఉండడంవల్ల చతురస్రజాతి మఠ్య తాళం అని, రూపక తాళం కూడా చతురస్రజాతిని కలిగి ఉండడంవల్ల చతురస్రజాతి రూపక తాళం అని, ఝంపె తాళం మిశ్రజాతిని కలిగి ఉంది కాబట్టి దీన్ని మిశ్రజాతి ఝంపె తాళం అని, త్రిపుటతాళం త్రిశ్రజాతిని కలిగి ఉండడంవల్ల త్రిశ్రజాతి త్రిపుట తాళం అని, అటతాళం ఖండజాతిని కలిగి ఉంది కాబట్టి ఖండజాతి అటతాళం అని, ఏకతాళం చతురస్రజాతిని కలిగి ఉంది కాబట్టి చతురస్రజాతి ఏకతాళం అని పిలుస్తున్నారు.

పై తాళాల్లో ఏదైనా ఒక తాళాన్ని చెప్పినచో దాని జాతి కూడా గోచరమవుతుంది. అలా కాకుండా ఆయా తాళాల్లో వేరే జాతులను ఉపయోగిస్తున్నప్పుడు వాటి జాతుల పేర్లను తప్పనిసరిగా రాయాలి. ఉదాహరణకు ధ్రువ తాళాన్ని చతురస్రజాతి ధ్రువతాళంగా మాత్రమే పరిగణిస్తారు. కొన్ని సందర్భాల్లో దాన్ని త్రిశ్రజాతిలో ఉపయోగిస్తున్నప్పుడు అత్యవసరంగా త్రిశ్రజాతి ధ్రువతాళం అని రాయాల్సి ఉంటుంది. మిగిలిన తాళాల్లోని భేదాలను చూపించే సందర్భంలో ఇలాగే రాయాలి. సప్త తాళాల జాతులను సులభంగా గుర్తించేందుకు ఈ కింది శ్లోకం ఉపకరిస్తుంది.

"చతురస్రో ధ్రువో మఠ్యో రూపకస్యేక తాళక
త్రిశ్ర త్రిపుటకశ్చైవ మిశ్ర ఝంపేన జాతయః
ఖండజాతట తాళస్య చతుర్వర్ణ విధీయతేః

సప్త తాళ లఘుర్జాతి లక్షణం శ్రుణుశంకరీః" (పార్థసారథి, ఎన్. సి.2014:70.)

ఈ లక్షణాలను పై శ్లోకం ప్రతిబింబిస్తుంది. ఈ లక్షణాలవల్ల తాళ జాతిలోని అక్షరాలను లెక్కించవచ్చు.

## 4.6.8.1. చాపు తాళం

ఈ తాళం పల్లెల్లో జానపద పాటల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అన్నమయ్య సంకీర్తనల్లో ఈ చాపు తాళ ప్రాధాన్యత మనం గమనించవచ్చు. చాపు తాళం రెండు ఘాతలతో అంటే ఒక దెబ్బ, విసరుతో చూపుతారు. ఈ చాపు తాళాన్ని 1. మిశ్రచాపు, 2. ఖండచాపు, 3. త్రిశ్ర చాపు తాళాలుగా చూపుతున్నారు.

మిశ్ర చాపు తాళపు అక్షర విలువ మొదటి ఘాతకు మూడు, రెండవ ఘాతకు నాలుగు 3+4 = 7. అక్షరాలు.

ఖండచాపుకు మొదటి ఘాతానికి రెండు, రెండవ ఘాతానికి మూడు 2+3 = 5. అక్షరాలు.

త్రిశ్ర చాపుకు మొదటి దెబ్బకు ఒకటి, రెండవ దెబ్బకు రెండు 1+2 = 3. అక్షరాలుగా లెక్కించబడింది.

ఈ చాపు తాళాన్ని చాపు అని రాస్తే దాన్ని మిశ్రచాపుగా గుర్తించాలి. వేరే పద్ధతుల్లో దీన్ని ఉపయోగించేటప్పుడు అంటే ఖండ, త్రిశ్ర జాతుల్లో ఉపయోగించేటప్పుడు తప్పనిసరిగా ఆ పేరు రాయాలి.

## 4.6.8.2. దేశాది తాళం

ఇది ఒక విసర్జితాన్ని, మూడు ఘాతలను కలిగి ఉన్నది. ఇందులో తాళ నడక నెమ్మదిగా ఉంటుంది. విసర్జితంలో ముప్పాతిక అంటే 1/3 అక్షర కాలం విశ్రాంతి అనంతరం పాట ప్రారంభిస్తారు.

### 4.6.8.3. మధ్యాది తాళం

ఇది కూడా దేశాది తాళం లాగా ఒక విసర్జితం, రెండు దెబ్బలను కలిగి ఉంటుంది. కానీ దీని నడక కొంచం వేగంగా ఉంటుంది. విసర్జితంలో అర అక్షరకాలపు విశ్రాంతి అయిన తరువాత పాట ప్రారంభిస్తారు.

### 4.6.9. తాళదశ ప్రాణాలు

తాళాన్ని గురించి అవగతం కావాలంటే తాళదశ ప్రాణాలను గురించి కచ్చితంగా తెలుసుకోవాలి. అప్పుడే మనకు తాళంపై ఒక అవగాహన ఉన్నట్టు లెక్క. సంస్కృత పండితులు తాళదశ ప్రాణాలపై పరిజ్ఞానం ఉన్నవాడు ప్రశంసింపబడతాడని, లేకపోతే అబాసుపాలు కావాల్సివస్తుందని కింది శ్లోకంలో ఇలా తెలియజేశారు.

"దశప్రాణ పరిజ్ఞాన ప్రవిణస్తార తాళకః
నృత్యాదిషు ప్రశస్తస్యా దితరస్తు మృతోపమః!"

(*వరాహ నరసింహాచార్యులు, వింజమూరి.1984:16.*)

ఎవరికైతే తాళదశ ప్రాణాల్లో సంపూర్ణమైన పరిజ్ఞానం ఉంటుందో? వారు నృత్యం, వాద్యం, గీతాల్లో అద్భుతమైన ప్రతిభతో ప్రశంసించబడతారు. తాళదశ ప్రాణాల్లో పరిజ్ఞానం లేనివాడు వాటిలో అసమర్థుడు అని శ్లోక భావం.

ఈ ప్రపంచంలోని జీవరాశికి ప్రాణమే ఆధారం. అవి ప్రాణం లేకుండా బ్రతకడం అసాధ్యం. అలాగే తాళానికి కూడా పది రకాల ప్రాణాలు ఉన్నాయి. వాటినే తాళదశ ప్రాణాలు అంటారు. అవి ; కాల, మార్గ, క్రియ, అంగ, గ్రహ, జాతి, కళ, లయ, యతి, ప్రస్తారకాలుగా విభజించారు. వీటిని గుర్తు పెట్టుకొనేందుకు కింది శ్లోకం ఉపకరిస్తుంది.

"కాలో మార్గః క్రియాంగాని గ్రహేజాతిః కళాలయః
యతిః ప్రస్తారకశ్చేతి తాళప్రాణ దశస్మృతాః" (వరాహ నరసింహాచార్యులు, వింజమూరి.1984:16.)

వీటిలో కాల, మార్గ, క్రియ, అంగ గ్రహ అనే అయిదింటిని మహా ప్రాణాలంటారు. తక్కిన జాతి, కళ, లయ, యతి, ప్రస్తారకాలు ఉపప్రాణాలుగా పరిగణిస్తున్నారు. వీటిలో ఒక్కొక్క ప్రాణాన్ని గురించి కింద వివరిస్తున్నాను.

## 4.6.9.1. కాల ప్రాణం

సంగీత వేగాన్ని తెలిపేది కాలం. దీనివల్ల తాళ విలువ తెలుస్తోంది. తాళానికి కాలగమనం చాలా ముఖ్యమైంది. పాశ్చాత్యులు గడియారాన్ని తాళంలోని కాలగమనాన్నిబట్టి నిర్మించారని చెప్పవచ్చు. ఎలాగంటే గడియారంలోని టిక్ టిక్ శబ్దాలు తాళగతంగా కాలగమనంలో చేయడమే ఇందుకు ప్రత్యక్ష్య ఉదాహరణ. కాల ప్రాణం తాళదశ ప్రాణాల్లో మొదటిది. ఇది అక్షరాల భేదంవల్ల నిర్మించబడింది. అతిశీఘ్రం, శ్రీసమం, విళంబం, అతివిళంబాల ఆధారంగా లఘు, గురు, ప్లుతాలను నిర్మించారు. ఈ ప్రాణంవల్ల తాళాల్లోని అంగాల విలువ తెలుస్తోంది. వంద తామర రేకుల్ని ఒకదానితో ఒకటి పేర్చి, ఆ రేకుల దొంతరను ఒక సూదితో పొడిస్తే ఒక రేకు తెగడానికి పట్టే కాలాన్ని క్షణం అంటారు.

> "ఉపర్యు పరి వినన్యస్య పద్మపత్ర శతం సకృత్
> సకాలః సూచిసంభేదాన్తక్షణస్య కలంప్రతి"

(*వరాహ నరసింహాచార్యులు, వింజమూరి.1984:18.*)

> "లవః క్షణైరష్టభిస్స్యాత్కాష్టా చాష్టలవాత్మికా
> అష్ట కాష్ట నిమేషః స్యా న్ని షైరష్టభిః కళా"

(*వరాహ నరసింహాచార్యులు, వింజమూరి.1984:18.*)

> "కళాభ్యాంచ చతుర్భాగా చతుర్భాగ మనుదృతం
> అనుదృతాభ్యాం బిందుశ్చ బిందుభ్యాంతు లఘుర్భవేత్
> లఘుద్వంద్వం గురుశ్చైవ త్రిలఘుః ప్లుతముచ్యతే"

(*వరాహ నరసింహాచార్యులు, వింజమూరి.1984:18.*)

కొన్ని క్షణాలను ఒక లవంగా, కొన్ని లవాలు ఒక కాష్టంగా, 8 కాష్టాలను ఒక నిమిషంగా, 8 నిమిషాలు ఒక కళగా, 2 కళలు ఒక చతుర్భాగంగా, రెండు చతుర్భాగాలు ఒక అనుద్రుతంగా, నాలుగు కళలుగా, రెండు అనుధ్రుతాలు ఒక ధ్రుతంగా, (0) రెండు ధ్రుతాలు ఒక లఘువుగా, (1) రెండు లఘువులు ఒక గురువుగా, (8) మూడు లఘువులు

ఒక ప్లుతంగా, (1) నాలుగు లఘువులు ఒక కాకపాదంగా నిర్ణయించారు. అనుద్రుతం, ద్రుతం, లఘువు, గురువు, ప్లుతం, కాకపాదం అనే షడంగాలు మాత్రం ఇప్పటి తాళాల్లో వాడుతున్నారు. 35 తాళాల్లో మొదటి మూడు అంగాలు మాత్రమే వాడుతున్నారు. కొందరు పండితులు ఏడవ అంగమైన చతుర్భాగం అనే అంగాన్ని కూడా వాడుతున్నారు. వారి పాండితీ ప్రకర్షను ప్రదర్శించేందుకే వాడుతున్నారని ఇంకొందరు సంగీతజ్ఞులు వారిని విమర్శిస్తున్నారు.

## 4.6.9.2. మార్గ ప్రాణం

ఒక అక్షరం నుండి మరొక అక్షరం వరకూ ఇలా వీటి మధ్య జరిగే పదాలు లేక అంగాల మధ్య జరిగే దీర్ఘాన్ని మార్గం అంటారు. ఈ మార్గాలు నాలుగు విధాలుగా కోహలుడు అనే పండితుడు తాళ లక్షణము అనే గ్రంథంలో చెప్పారు.

"మార్గాః స్యు స్తత్ర చత్వారో ధ్రువశ్చిత్రశ్చవార్తికః
దక్షిణేశ్చితి తత్ర స్యాత్ ధ్రువకే మాత్రికాకలా
శేషేషు ద్వే చతుస్రో ష్టాక్ర మాన్మాత్రాః కళాభవేత్"

(వరాహ నరసింహాచార్యులు, వింజమూరి.1984:19.)

అని పేర్కొన్నారు.

శారదా మతాన్ని నారద మతం అంటారు. ఈ శారద మతం ప్రకారం ఇందులో ఆరు రకాల ప్రాణాలున్నాయి. అందువల్ల షణ్మార్గం అని పేరు వచ్చింది.

### 4.6.9.2.1. షణ్మార్గాలు

1. దక్షిణ: ఒక అక్షర కాలానికి 8 మాత్రల కాలాలు.
2. వార్తికం: ఒక అక్షర కాలానికి 8 మాత్రల కాలాలు.
3. చిత్ర: ఒక అక్షర కాలానికి రెండు మాత్రల కాలాలు.
4. చిత్రతర: ఒక అక్షర కాలానికి ఒక మాత్ర కాలం. ఒక వేలు ఎంచేందుకు 4 అక్షర కాలాలు ఉంటాయి. ఈ మూడు మార్గాలు వాడుకలో ఉన్నాయి. పల్లవి పాడేటప్పుడు కొందరు విద్వాంసులు తక్కిన మార్గాలను కూడా పాడి, వారి పాండిత్యాన్ని వెల్లడించుకుంటారు.

5. చిత్రతమ: ఒక అక్షరకాలానికి 1/2 మాత్రల కాలాలు. ఒక వేలు ఎంచడానికి రెండు అక్షరాల కాలం ఇందులో ఉంటాయి.
6. అతిచిత్రతమ: ఒక అక్షర కాలానికి 1/4 మాత్రల కాలాలు. మాత్ర అంటే 4 అక్షరాలు. అతిచిత్రతమలో ఒక వేలు ఎంచుతారు. సార్ఙ్గదేవుడు చిత్రతర మార్గాన్ని ఉత్తమమైందిగా, మార్గాలన్నింటికీ ధ్రువంగా చెప్పారు.

వీటిలో మొదటి మూడు పల్లవిలోనూ, అనంతర మూడు సంగీత రచనల్లోనూ పాడుతున్నారు. మాత్ర అంటే నాలుగు హ్రస్వ అక్షరాలు. ఇందులో అతిచిత్రతమ, చిత్రతమ, చిత్రతర మార్గాలు నేటికీ అమల్లో ఉన్నాయి. ఈ మార్గాలు స్వరావళి, జంట, అలంకారాలు, గీత, వర్ణ, పద, తిల్లానా, రాగమాలిక, కృతి, జావళి, కీర్తనలలో ఉపయోగిస్తున్నారు.

జైన మతాన్ని అనుసరించి దక్షిణం, వార్గీకం, చిత్రం, చిత్రతరం, చిత్రతమం, అతిచిత్రతమం, చతుర్భాగం, శ్రీ, ధ్రుతి, అనుధ్రుతి, ఘర్షణం, అనుఘర్షణం, స్వరం అనే 12 మార్గాలున్నాయి. అతిచిత్రతమం అంటే అనుధ్రుతం లేక ఒక అక్షర కాలంగా చెప్పారు.

నారద మతాన్ని అనుసరిస్తున్న చాలామంది పండితులు దక్షిణం మొదలుకొని అతిచిత్రతమం వరకూ గ్రహించదగినవని తమ గ్రంథాల్లో చెప్పారు. అనుధ్రుతం ధ్రుత, లఘువుల మధ్య విరామంగా ఎంచబడడంవల్ల ఇది ప్రత్యేక అంగంగా ఉండదని కొందరు పండితుల అభిమతం. కానీ అనుధ్రుతం అతిచిత్రతమ మార్గంలో వాడబడుతోంది. కాబట్టి నారద మతాన్ని అనుసరించి ఇప్పుడు షణ్మార్గాలు అమలవుతున్నాయి. నేడు పండితులందరూ నారద మతంలో చెప్పబడిన షణ్మార్గ పద్ధతినే అనుసరిస్తున్నారు.

### 4.6.9.3. క్రియా ప్రాణం

ఒక పనిని తెలియజేసే దాన్ని క్రియ అంటారు. ఈ ప్రపంచం మొత్తం క్రియాజనితమై ఉంటుంది. సాహిత్యంతోబాటు తక్కిన శాస్త్రాల్లో కూడా క్రియ అంటే పని అని అర్థం. అలాగే సంగీతశాస్త్రంలో కూడా క్రియ అంటే పని అనే అర్థంలోనే వాడుతున్నారు. పాడడం క్రియ, తాళం వేయడం కూడా క్రియే. ఒక తాళాన్ని వేసేటప్పుడు దానికి కేటాయించబడిన సంజ్ఞల

ఆధారంగా ఆ తాళంలో ఘాతలు, ధ్రుతం, అనుధ్రుతం మొదలైన తాళగమనాల్లో వేళ్ళను ఎంచడాన్ని, దెబ్బ వేయడాన్ని క్రియ అంటారు. ఈ క్రియా ప్రాణాలు మార్గ క్రియలు, దేశ్య క్రియలు అనే రెండు విభాగాలుగా విభజించబడ్డాయి. మార్గ క్రియలు మళ్ళీ సశబ్ద మార్గ క్రియలు, నిశ్శబ్ద మార్గ క్రియలుగా విభజించబడ్డాయి.

## 4.6.9.3.1. సశబ్ద మార్గ క్రియలు

1. ధ్రువం: శబ్దం అయ్యేట్లుగా చిటికె వేయడం, ఎడమచేతిపై శబ్దం వచ్చేట్లు కొట్టడం.
2. శయ్యం: శబ్దం అయ్యే విధంగా కుడి హస్తంలో ఎడమ చేతితో దెబ్బ వేయడం.
3. తాళం: శబ్దం అయ్యే విధంగా ఎడమ చేతిలో కుడి చేతితో ఘాత వేయడం.
4. సన్నిపాతం: అభిముఖంగా రెండు చేతులను నిలిపి, సమానంగా ఘాతం వేయడం. ఈ నాలుగు మార్గ క్రియలను సశబ్ద మార్గ క్రియలు అంటారు. ఇవి చచ్చత్పుటాది తాళాల్లో ఉన్నాయి.

"ఆవాప స్తత్ర హసస్తస్యోక్తాన స్యోంగులికుంచనమ్
నిష్క్రమో థస్తలస్య స్యాదంగులీనాం ప్రసారణమ్
క్షేపో దక్షిణపార్శ్వ స్యోక్తానస్య ప్రసృతాఽగులేః
విక్షేపో థ స్తలస్యాస్య ప్రవేశోంగులి కుంచనమ్
ధ్రువో హ స్తస్య పాతః స్యోచ్ఛోటికా శబ్దపూర్వకః
శమ్యా దక్షిణహ స్తస్య తాలో వామకరస్యతు"

(వరాహ నరసింహాచార్యులు, వింజమూరి.1984:22.)

## 4.6.9.3.2. నిశ్శబ్ద క్రియలు

శబ్దం లేకుండా తమ పని తాము చేసుకుపోయే క్రియలను నిశ్శబ్ద క్రియలు అంటారు. అంటే శబ్దరహితంగా కుడిచేతి వేళ్ళను ఎంచడం, కిందికి దించడం, విసరడం, చుట్టడం. ఇవి నాలుగు విధాలు.

1. ఆవాపం: హస్తాన్ని వెల్లికిలుగా ఎత్తి, చూపుడు వేలుతో సహా నాలుగు వేళ్ళను ముడవడం.
2. నిష్క్రమం: ఇంతకు ముందు ఆవాపంలో ముడిచిన వేళ్ళను విప్పడం.
3. విక్షేపం: ఆ హస్తాన్ని కుడివైపుకి విదిలించడం.

4. ప్రవేశం: ఆ హస్తాన్ని అప్రదక్షిణంగా కిందికి రానివ్వడం.

## 4.6.9.3.3. దేశ్య క్రియలు

ఈ దేశ్య క్రియల్లో ఎనిమిది విభాగాలున్నాయి. అవి

1. ధ్రుతం: శబ్దంతో కూడిన కుడి హస్తపు ఘాతను ధ్రుతం అంటారు. ఇది ఒక్కటే సశబ్ద క్రియ. మిగిలినవన్నీ నిశ్శబ్ద క్రియలు.

2. సర్పిణి: పతాక హస్తం ఎడమ వైపుకు చేయి చాచడం.

3. కృష్య: అలా చాచిన చేతిని ఎడమవైపు నుండి కుడివైపుకు రానివ్వడం.

4. పద్మిని: అరచేతిని అధోముఖంగా అంటే క్రింది ముఖంగా కిందుగా చాచడం.

5. విసర్జితం: చేతిని వెలుపలగా చాచడం.

6. విక్షిప్త: అలా చాచిన చేతి వేళ్ళను ముడిచి తన పక్కకు తీయడం.

7. పతాకం: హస్తాన్ని పతాక స్థానంలో ఉంచి, చేతిని మీదకు ఎత్తడం.

8. పతిత: అలా ఎత్తిన చేతిని కిందికి దించడం.

ఈ విధంగా తాళాన్ని వేయాల్సి ఉంటుంది.

## 4.6.9.4. అంగ ప్రాణం

శరీరంలో కన్ను, ముక్కు, లాంటి అవయవాలు ఉన్నట్లే తాళంలో ముఖ్యమైన అంగాలు ఉన్నాయి. వాటిని షడంగాలని, షోడశాంగాలని పిలుస్తున్నారు. తాళ అక్షర కాల సంఖ్యను తెలుసుకొనేందుకు ఉపయోగించే సంజ్ఞా గుర్తుల విశేషాన్ని అంగం అంటారు. వాటి పేర్లు ఏవనగా

అనుధ్రుతం, ధ్రుతం, ధ్రుతవిరామం, లఘువు, లఘువిరామం, లఘుధ్రుతం, లఘుధ్రుత విరామం, గురువు, గురువిరామం, గురు ధ్రుతం, గురుధ్రుత విరామం, ప్లుతం, ప్లుత విరామం, ప్లుత ధ్రుతం, ప్లుత ధ్రుత విరామం, కాకపాదం అనేవి షోడశాంగాలు. ఇవి తాళ గమనానికి చాలా ముఖ్యమైనవి. వీటిలో కొన్ని మరుగునపడ్డాయి. కొన్ని నేటికీ వాడబడుతున్నాయి. ఇప్పుడు షడంగాలు మాత్రమే అమల్లో ఉన్నాయి. వాటిని గురించి తెలుసుకుందాం.

లఘువు: ఘాతం తరువాత వేళ్ళను లెక్కించడాన్ని లఘువు అంటారు. తాళగతిలో లఘువు చాలా ముఖ్య భూమిక పోషిస్తుంది. దీన్ని గురించి తాళజాతుల ప్రస్తావనలో చర్చించాను.

గురువు: ఘాతం తరువాత ముడిచిన వేళ్ళతో ఉన్న అరచేతిని గుండ్రంగా తిప్పి, సశబ్ద నిశ్శబ్ద క్రియలను సృష్టించడాన్ని గురువు అంటారు.

ధ్రుతం: ఘాతం తరువాత అరచేతిని వెల్లికల తిప్పడాన్ని ధ్రుతం అంటారు. ఈ చేతినే రెండు సార్లు బోర్లించి దెబ్బ వేస్తే అది అనుధ్రుతంతోబాటు ధ్రుతంగా భావిస్తారు. అంటే రెండు అవ్యవధాన ఘాతాల్లో మొదటగా వేసిన ఘాతాన్ని అనుధ్రుతంగా భావించాలి. అట తాళంలో మనం ఈ తేడాను గమనించవచ్చు.

కాకపాదం: దీన్ని ఒక ఘాతం, పథకం, కృష్య సర్పిణిలతో క్రియ చేస్తారు. దీన్ని + తో చూపించాలి. కాకపాదంలో నాలుగు క్రియలు అంటే 16 అక్షరాలు ఉంటాయి.
వీరికి అధిదేవతలుగా ధ్రుతానికి ఈశ్వరుడు, లఘువుకు పార్వతి, గురువుకు వీళ్ళిద్దరూ, ప్లుతానికి త్రిమూర్తులు చెప్పబడుతున్నారు.

## 4.6.9.5. గ్రహ ప్రాణం

తాళంలో ఆవర్తాన్ని ప్రారంభించే ప్రాంతానికి గ్రహం (ఆవు) అని పేరు. దీన్ని తమిళంలో ఎడుప్పు అని, తెలుగులో ఎత్తుట అంటారు. సంగీతంలో తాళం నడిచే విధానమే గ్రహం. అనగా నృత్య, వాద్య, గీతాలు తాళం ప్రకారం నడిచే నడకను గ్రహం అంటారు. అంటే తాళం యొక్క ఆవర్తంలో పాటను ప్రారంభించే స్థలం అన్నమాట. పాటైనా కావచ్చు, పాటలోని ఇతర అంగమైనా కావచ్చు తాళావర్తంలో ప్రారంభించే స్థానాన్ని గ్రహం అని అంటారు. ఈ గ్రహాలు సమగ్రహం, విషమగ్రహం అనే రెండు విధాలుగా విలసిల్లుతున్నాయి. సమగ్రహం అంటే పాటను, తాళాన్ని ఒకే సమయంలో వ్యవధానం లేకుండా ప్రారంభించడం. అన్నమాచార్య సంకీర్తనల్లో "ఇటుగరుడని", "భూమిలోనచొచ్చి", "ఈ పాదమే కదా" లాంటి సంకీర్తనలు ఇలాగే ప్రారంభమవుతున్నాయి.

విషమగ్రహం అంటే పాటైనా, తాళం అయినా ఒకటి తరువాత ఇంకొకటి ప్రారంభమవడం. అంటే తాళం, పాట ఒకేసారి కాకుండా కొంత వ్యవధానంతో

ప్రారంభించడం. "ఇతని ప్రసాదమే", "అంతయు నీవే", "నేల మిన్ను ఒక్కటైన", "సకల జీవులకెల్ల" మొదలైన సంకీర్తనలు ఇలాగే మొదలవుతున్నాయి. ఈ విషమగ్రహం అతీతగ్రహం, అనాహత గ్రహం అనే రెండు విధాలుగా భాసిస్తోంది. తాళం ప్రారంభమైన తరువాత కొంత విశ్రాంతి అంటే 1/3 అక్షరమో, 3/4 అక్షరాలో అయిన తరువాత పాటను ప్రారంభించడాన్ని అనాహత గ్రహం అంటారు. అలా కాకుండా పాటను తాళంతోబాటు అంటే తాళంకంటే మొదట అనగా తాళంయొక్క కడపటి విసర్జితంలో పాటను ప్రారంభించినచో, రెండవ తాళ ఆవర్తానికి మొదటే పాట ప్రారంభించడం అవుతుంది. ఈ గ్రహం సాహిత్యంలో ప్రాసను కూర్చేందుకు ఎక్కువగా ఉపయోగపడుతోంది. సమగ్రహం, అనాహతగ్రహం, అతీతగ్రహం అనే ఈ మూడింటికి గ్రహత్రయం అనే పేరు ఉంది. ఒక చెలికాడు మరొక స్నేహితుడితో సరిగా, ముందు, వెనకలుగా తన ఇష్టం వచ్చినట్లు పోవడాన్ని గ్రహం అనుకుంటే, సమగ్రహంలో వార్తిక మార్గాన్ని, అతీత గ్రహంలో చిత్ర మార్గాన్ని, అనాహతగ్రహంలో దక్షిణ మార్గాన్ని అనుసరిస్తాడని శ్రీ జోదా సుబ్రహ్మణ్య శాస్త్రిగారు చెప్పారు.

## 4.6.9.6. జాతి ప్రాణం

జాతి అంటే లఘువులనుబట్టి జాతి నిర్ణయం జరుగుతుంది. ఇంతవరకూ మనం చర్చించినట్లుగా చచ్చత్పుటాది తాళాంగాల్లాగా ఉండకుండా కొంచం భేదంచూపేట్లుగా ఉండే తాళాలు సాహిత్యంలో ఉన్నాయి. ఇవి ఎక్కువ పల్లె పదాల్లో అమలవుతున్నాయి. వీటిని పల్లెల్లోని జాతులను అనుసరించి చేశారని కొన్ని గ్రంథాలు చెప్తున్నాయి. అందుకే జాతులు కూడా తాళాలకు ప్రాణాలని కొందరు పండితులు భావిస్తున్నారు. త్రిశ్ర, చతురస్ర, ఖండ, మిశ్ర, సంకీర్ణ జాతులను కొన్ని గ్రంథాల్లో పేర్కొన్నారు. ఈ పంచ లఘువులే కాకుండా కొన్ని గ్రంథాల్లో ఇంకొక పంచ లఘువులను చెప్పారు. దివ్య, (6) సింహ, (8) లఘువు, (10) వాద్య (12) కర్ణాటక (16) అక్షరాలను కలిగి ఉంటాయని పండితులు చెప్పారు.

### 4.6.9.6.1. చతురస్రజాతి ప్రాముఖ్యం

ఉన్న అయిదు జాతుల్లో చతురస్రం చాలా ముఖ్యమైందని పండితులు చెప్పారు. ఇది కామధేనువు స్వరూపం. దీనిలోనే పద, కీర్తన, కృతులు విశేషంగా చెప్పబడ్డాయని వారు

చెప్పారు. చతురస్ర లఘువుకు బ్రహ్మజాతి లఘువు అని పేరుంది. దీన్నే భార్యా భర్తల జాతి అంటారు. 18వ శతాబ్దానికి పూర్వపు జాతులుగా, 18వ శతాబ్దపు అనంతర జాతులుగా కొందరు పండితులు విభజించారు.

అలాగే త్రిశ్రజాతికి క్షత్రీయజాతి అని, మిశ్రజాతి లఘువును వైశ్యజాతి అని, ఖండజాతిని శూద్రజాతి అని, సంకీర్ణజాతి లఘువును అదే పేరుతో రాశారు. ఈ విభజన సమాజంలోని మనుషులనుబట్టి జరిగిందని తెలుస్తోంది. కొన్ని సంస్కృత గ్రంథాల్లో చతురస్ర లఘువును మనుష్య లఘువుగా, త్రిశ్రను స్వర లఘువుగా, మిశ్రను హంసగా, ఖండను దేశ్య లఘువుగా, సంకీర్ణ లఘువును చిత్ర లఘువుగా రాశారు. ఈ విభజన వల్ల సమాజంలోని మనుషులు సంగీతానికి, సాహిత్యానికి, చిత్రలేఖనానికి, జానపదానికి, ప్రాధాన్యం ఇచ్చారని తెలుస్తోంది. ఈ విభజనలో తాళాన్ని హంసనడకలా అందంగా కూర్చాలని వారు చెప్పకనే చెప్పారు. కొన్ని గ్రంథాల్లో చతురస్ర, త్రిశ్ర జాతులనుండి తక్కిన తాళాలు ఉద్భవించాయని, వీటి అక్షర భేదంవల్ల ఈ విధానం తెలుస్తోందని పేర్కొన్నారు. చతుర్లఘోచ్చారణతో పాడబడేది చతురస్ర లఘువని, అలాగే గురు ప్లుతాలతో కూడిన తాళాన్ని చతురస్రజాతి అని, త్రిలఘోచ్చారణతో కూడినది త్రిశ్ర లఘువని, అలాగే గురు ప్లుతాలతో కూడిన తాళాన్ని త్రిశ్రజాతి తాళమని అంటారు. అలాగే ఖండ, మిశ్ర సంకీర్ణ జాతుల లఘువులను, తాళాలను లెక్కిస్తారు. తాళ జాతులను ఇలా చెప్తారు.

తక్క తాధిమి ధిమితక తధోం–చతురశ్ర జాతి.

తధి కిడత తక్క థోం—త్రిశ్ర.

తొంగిట తకిటతోం తోంగిడ తకత తదొం—ఖండ.

తాధి తక్కిడ గిడతక ధికిడ కిడతక తధాం తకదొం–మిశ్ర.

తత్రికిత్రికిత్రిత్తరికి తకతరికిట తరికతైరిడిగిడతకదోం–సంకీర్ణ. ఇలా తాళాల్లో తిల్లానాలు వస్తాయి.

## 4.6.9.7. కళ ప్రాణం

తాళంలో సశబ్ద క్రియలు, నిశ్శబ్ద క్రియలు చూపేటప్పుడు ఈ కళ వ్యవహారంలో ఉందని పూర్వపు వాగ్గేయకారుల అభిప్రాయం. ఇది మార్గ తాళాల్లో ఉంటుంది. *సంగీత*

*రత్నాకర* కర్త నిశ్శబ్ద క్రియను కళ అన్నారు. *అభినవ తాళమంజరి* అనే గ్రంథంలో లఘ్వాది అంగాల్లో ధ్రువ మొదలైన ఏయే క్రియలు వస్తాయో? ఎంచి, వాటి వివరాలన్నీ చెప్పబడ్డాయి. ఈ పాఠ భేదాలవల్ల భిన్నమైన అభిప్రాయాలు ఉంటాయనడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. కానీ పూర్వపు గ్రంథాల్లో కళ మార్గ తాళాల్లోనే చెప్పబడింది. అప్పుడు కూడా నిశ్శబ్ద క్రియా మూలకమైన గురువులు కలిగినప్పుడు ద్వికళ, చతుష్కళ లాంటి భేదాలతో చూపించారు.

లఘువు లాగానే కళ విలువ కూడా ఆయా గతిభేదాలనుబట్టి మారుతూ ఉంటుంది. ఒక అక్షర కాలంలోని చిన్న చిన్న భాగాలను కళ అంటారు. ఇవి సాధారణంగా ఏకకళ, ద్వికళ, చతుష్కళ అనే మూడు విధాలుగా చెప్పవచ్చు. తాళంలో ఒకటి, లేక రెండు, లేక నాలుగు అక్షరాల గతిభేదాలనుబట్టి ఈ విధంగా చెప్పవచ్చు. కొన్ని గ్రంథాల్లో త్రికళ అనేదాన్ని చేర్చి, నాలుగు కళలుగా రాశారు. చచ్చత్పుట, చాచత్పుట, షట్పితా పుత్రిక, సంపద్వేష్ణ ఉదట్టం అనే అయిదు తాళాలను కళలుగా కొన్ని గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఇందువల్ల మార్గ తాళాల్లోని జాతి భేదాలననుసరించి పాదాలు మారుతూ ఉంటాయని గ్రహించాలి. పాద భేదాలననుసరించి గురువులు ఉంటాయి కాబట్టి మారుతూ అభివృద్ధి పొందేది వర్ధమాన కళ. అలాగే క్షీణించే కళ నష్ట కళ. ఈ కళలన్నీ తాళాల్లో చెప్పబడ్డాయి. తాళంలోని అక్షరాలను అనుసరించి గురువు, లఘువు మొదలైన అంగాలను కనుగోవచ్చునని సంగీత పండితులు చెప్తున్నారు.

ఉదాహరణకు చచ్చత్పుటి అనగా తాళంలోని మొదటి రెండు అక్షరాలను గురువుగా, తరువాతది లఘువు, విసర్గయుతమైన ప్లుతం అని ఎంచుతారు. త్రికళ అయిన చతురస్రజాతి తాళానికి, చతుష్కళైన చతురస్రజాతి తాళానికి భేదం లేకపోవడంవల్ల త్రికళను కళగా ఎంచడంలేదు. ఇది ఏకకళ. ఇనుమడించే గురువులు కలిగిన ద్విచతుష్కళలు అవుతాయి. అంటే ఒక్కో పాదంలో రెండు గురువులు ఉంటే దాన్ని ద్వికళగా, నాలుగు పాదాలుంటే చతుష్కళగా సంభావిస్తున్నారు. ఈ పారిభాషిక మాత్రలు రెండు కలిగిన గురువులో 82 గురు అక్షరాలు ఉంటాయి. ఈ తాళాన్ని ఏకకళ కలిగిన తాళంగా ఎంచాలి. కానీ ఇది ద్విగుణైత కళ. ఇలా 128 స్వాభావిక గురువులు కలిగేంతవరకూ లెక్కించవచ్చు.

చాచత్పుటం: ఇది త్రిశ్రజాతి తాళం. ఇందులో వరుసగా గురువు, లఘువు, గురువులనే అంగాలుంటాయి. ఇది ఏకకళ. ఇనుమడించే గురువులు కలిగిన ద్వి, చతుష్కళలు అవుతాయి.

షట్పితా పుత్రిక: ఇది త్రిశ్రజాతి తాళం. దీనిలో వరుసగా ప్లుతం, లఘువు, రెండు గురువులు, లఘువు, ప్లుతాలు ఇలా ఆరు మాత్ర గణాలు వస్తాయి. కాబట్టి ఇది ఆరు పాదాలను కలిగి ఉంటుంది.

ఉదట్టం: ఇది త్రిశ్రజాతి తాళమే. ఇందులో గురువులు వరుసగా వస్తాయి. ఇది ఏకకళ ఇనుమడించిన గురువులను కలిగి ఉంటుంది. ద్వి, చతుష్కళలు ఇందులో ఉంటాయి.

సంపద్వేష్ణం: ఇందులో ఒక ప్లుతం, మూడు గురువులు వరుసగా వస్తాయి. దీనిలో షట్పితా పుత్రిక లాగా ఆరు పాదాలు ఉంటాయి. ఇలా ఏకకళలో ఆరు గురువులు, ద్వికళలో 12 గురువులు, చతుష్కళలో 24 గురువులు ఉంటాయి.

పై అయిదు తాళాలు చాలా ముఖ్యమైనవని మన పూర్వికులు ఈ తాళాలను శివుడి పంచ ముఖాలనుండి పుట్టాయని చెప్పారు. చచ్చత్పుటం శివుడి ముఖంలోనుండి, చాచత్పుటం వామదేవుడి ముఖంలోనుండి, షట్పితా పుత్రిక అఘోరా ముఖంలోనుండి, ఉదట్టం సత్పురుషుడినుండి, సంపద్వేష్టికం లేక సంపద్వేష్ణం ఈశాననం నుండి పుట్టిందని చెప్పారు. తాళంలోని క్రియలను గురించి తెలుసుకొనే ముందు తాళాంగాల్లో ఇవి ఎలా ఆరోపింపబడుతున్నాయో? తెలుసుకోవాలి.

ప్లుతంలో మూడు, గురువులో రెండు, లఘువులో ఒకటి, ధ్రుతం, అనుధ్రుతాల్లో అర్థ, పాతిక అంటే 1బై4 క్రియలు ఉంటాయి. ఈ విషయాలు తాళ లక్షణం అనే గ్రంథంలో తెలియజేయబడ్డాయి. ఇవన్నీ దేశీ క్రియలు కావడంవల్ల దేశీ తాళాల్లో ఈ అంగాలు తప్పనిసరిగా ఉంటాయి. కానీ మార్గ తాళాల్లో మార్గ క్రియలే ఉంటాయని భరతుని నాట్యశాస్త్రం, సంగీత రత్నాకరము మొదలైన గ్రంథాల్లో చెప్పారు.

## 4.6.9.8. లయ ప్రాణం

తాళంలోని క్రియలు ముగిసిన తరువాత మళ్ళీ క్రియలు ప్రవర్తిల్లడానికి పట్టే విశ్రాంతిని (rest) లయ అంటారు. అనగా తాళంలోని నడకయొక్క కాలం. ఈ లయ విలంబిత లయ, మధ్యలయ, ధ్రుతలయ అనే మూడు విధాలుగా చెప్పబడుతోంది.

"ధ్రుతో మధ్యో విళంబశ్చ ధ్రుతః శీఘ్రతమో మతః
ద్విగుణ ద్విగుణౌజ్ఞేయా తస్మాన్మధ్య విళంబితౌ"
(వరాహ నరసింహాచార్యులు, వింజమూరి.1984:43.)

చాలా నెమ్మదిగా నడిచే లయను విలంబిత లయ అంటారు. మధ్యలయ విలంబితం కంటే కొంచం తీవ్రంగా నడుస్తుంది. ఇంకా వేగంగా నడిచే లయ ధ్రుత లయ. ఇవికాక ఇంకొన్ని లయలు వీటితో చేర్చారు. మార్గ కళలో కళా భేదాన్ని అనుసరించి లయా భేదాలు కలుగుతున్నాయి. దక్షిణ మార్గంలో విలంబిత లయ, చిత్ర మార్గంలో ధ్రుత లయ, వార్తిక మార్గంలో మధ్యలయ ప్రవర్తిల్లుతాయని కోహలుడు *తాళ లక్షణము* అనే గ్రంథంలో చెప్పారు. బేసి సంఖ్య అక్షరాలు ఉండడంవల్ల ధ్రుత లయ లేదు. చతురాది సరిసంఖ్యగల జాతుల్లో పైకి లయ ఉంటుంది.

## 4.6.9.9. యతి ప్రాణం

ఒక తాళంలోని అంగాల వ్యత్యాసమైన చేరికకు యతి ప్రాణం అని పేరు ఉంది. సార్ఙ్గ దేవుడు యతులను మూడు అన్నారు. కానీ ప్రస్తుతం ఆరు యతులను వాడుతున్నారు.

తాళంలో యతి ప్రవర్తిల్లడానికి గల నియమాన్ని యతి అంటారు. కానీ తాళాల్లోని అంగాలు యతులుగా పరిగణింపబడవని ఇటీవల పండితులు యతుల అర్థాన్ని నిర్ణయించారు. యతుల సంఖ్యలో పండితుల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నాయి. ప్రాచీన పండితులు యతులను మూడు విధాలుగా చెప్పారు. యతి లయను ప్రవర్తిల్లజేస్తుంది కాబట్టి సమయతి, శ్రోతోవహయతి, గోపుచ్ఛయతి అనే మూడు విధాలుగా విభాగించారు. కానీ నేటి పండితులు యతులను ఆరు విధాలుగా చెప్పారు. అవి సమయతి, శ్రోతోవహ యతి, గోపుచ్ఛ యతి, ఢమరుయతి, మృదంగ యతి, విషమ యతి.

ధ్రుతలయ చిత్ర మార్గంలో నడిస్తే అది సమయతి అనబడుతుంది. ఇందులో అంగాల విలువ ఒకే విధంగా ఉంటుంది కాబట్టి వేదయతి అంటారు. చీమలబారులాగా ఉంటుంది కాబట్టి దీన్ని పిపీలిక యతి అని కూడా అంటారు.

దక్షిణ మార్గంలో విలంబిత లయ అయినప్పుడు గోపుచ్ఛయతి అవుతుంది. గోవు తోక మొదట్లో లావుగా, రానురాను సన్నగా ఉన్నట్లుగానే అంగాల విలువ మొదటిలో ఎక్కువగా ఉంటూ రానురాను అతి తక్కువ విలువగా ఉంటుంది. కాబట్టి దీన్ని గోపుచ్ఛ యతి అంటారు.

వార్తిక మార్గంలో మధ్యలయ అయినప్పుడు శ్రోతోవహ యతి వస్తుంది. మొదట నదిలా సన్నంగా ఉంటూ, రానురాను చివరన విస్తరించే యతి శ్రోతోవహ యతి.

మొదట సన్నంగా, చివరలో రెండువైపులా విస్తరించి ఢమరు ఆకారాన్ని పోలిన యతి ఢమరుయతి. దీన్ని వేగమధ్యం అనే పేరుతో వాడుతున్నారు.

మొదట లావుగా, చివరన ఇరువైపులా సన్నంగా ఉండి, మృదంగ ఆకారాన్ని పోలిన యతిని మృదంగ యతి లేక అవమధ్య యతి అంటారు.

ఒక రకంగా కాకుండా ఇష్టం వచ్చినట్లుగా అంగాలను కలిగి ఉండే యతిని విషమయతి అంటారు. ఇవి కాకుండా ఖడ్గయతి, చక్రయతి, సోగయతి, పదయతి మొదలైన యతులు అనేకాలు ఉన్నాయి. కానీ చాలామంది సంగీతజ్ఞులు సమయతి గోపుచ్ఛయతి, శ్రోతోవహ యతులను మాత్రమే ఆదరిస్తున్నారు.

## 4.6.9.10. ప్రస్తార ప్రాణం

కావ్యంలో గణాలను ప్రస్తారించి అనేక వృత్తాలు, జాతులను చెప్పినట్లు అనుధ్రుతాది అంగాలను ప్రస్తారించి అనేక తాళాలను చెప్పవచ్చు. కుడి నుండి ఎడమకు అనగా అధిక అంగాలనుండి అల్ప అంగాలకు ప్రస్తారించడం ఆచారమైంది. అందుచేత మొదటిలో స్థూలాంగాన్ని, చివరలో అల్పాంగాన్ని ఎంచి, ప్రస్తారించడం సాధారణంగా జరుగుతుంది.

స్వరాలు కలపడం, తీసివేయడం ఎలా ప్రస్తారిస్తున్నామో? (చేస్తున్నామో), అలాగే అంగాలను, అక్షర కాలవిలువలను కలిపి, తీసివేసి, ప్రస్తారించడం జరుగుతుంది. స్వర ప్రస్తారంలా ప్రస్తార ప్రాణం కూడా అపరిమితమే. అంగాలను వాటి అంతర్గత అంగాలతో

ప్రస్తారించి, తాళ భేదాలను కల్పించడాన్ని ప్రస్తారం అంటారు. ప్రస్తారం అంటే విస్తరింపజేయడం అని అర్థం. ఈ తాళ ప్రస్తారం 14 భేదాలను కలిగింది. నష్టం, ఉద్దిష్టం, పాతాళం, మహాపాతాళం, అనుద్రుతమేరువు, ద్రుతమేరువు, ద్రుతశేఖరమేరువు, లఘుమేరువు, గురుమేరువు, ప్లుతమేరువు, కాకపాదమేరువు, సంయోగమేరువు, ఖండప్రస్తారం, యతి ప్రస్తారం. ఇవి ప్రస్తుతం వాడుకలో లేవు. షోడశాంగ ప్రస్తారం అంటే అనుద్రుతం నుండి కాకపాదం వరకూ 16 అంగాలు. తాళ ప్రస్తారాన్ని కనిపెట్టి రాసిన లక్షణకారుడు శ్యామశాస్త్రి ఒక్కడే.

ఈ ప్రస్తారాలను అనుసరించి సంగీతంలో 108 తాళాలను చెప్పారు. శార్ఙ్గ దేవుడు మొదలైన పండితులు వారివారి అభిమతాలచొప్పున వెలయించారు. ఆంజనేయ మతంలో మధుతాళం, సుధాకర తాళం, మకర తాళం, ఘనతాళం, శరభ తాళం, నారాయణప్రియ తాళం, రాజకీర్తి తాళం అనే వాటిని చెప్పారు. ఇలా వారి వారి మతాలననుసరించి ప్రాచీన గ్రంథకర్తలు తాళవిభజన చేశారు. ప్రాచీనులు అంగీకరించిన తాళాలను గురించి విశ్లేషించడం ప్రస్తుతానికి అప్రస్తుతం. అందుకని ఈ తాళాల పేర్లను మాత్రం కింద ఇస్తున్నాను.

చచ్చత్పుట, చాచత్పుట, సంపద్వేష్టి, షట్పితా పుత్రిక, ఉద్ఘట, ఆది, దర్పణ, చర్చరీ, సింహలీలా, కందర్ప, సింహవిక్రమ, శ్రీరంగ, రతిలీల, ప్రత్యంగ, గజలీల, త్రిభిన్న, వీరవిక్రమ, హంసలీల, వర్ణభిన్న, రంగిద్యోత, రాజచూడామణి, రాజ, సింహవిక్రీడిత, వనమాలి, చతురస్ర, త్రిప్రవర్ల, మిశ్ర, రంగప్రదీప, హంసనాద, సింహనాద, మల్లికామోద, శరభలీల, రంగాభరణ, తురంగలీల, సింహనందన, జయశ్రీ, విజయానంద, ప్రతి, ద్వితీయ, మకరంద, కీర్తి, విజయ, జయమంగళ, మంత్య, రాజవిద్యాధర, జయ, కుడుక్క, నిసారక, క్రీడ, త్రిభంగి, కోకిలప్రియ, బిందుమాలి, సమ, నందన, ఉద్దీక్షణ, మట్టిక, టెంకి, వర్ణిమంతిక, అభినందన, అంతర క్రీడ, మల్ల, దీపక, అనంగ, హేమానంది, ముకుంద, పూర్ణ కంకాల, ఖండకంకాల, సమకంకాల, విషమ కంకాల, చతుస్రాల, అభంగ, రాయభంగాల, లఘుశేఖర, సమశేఖర, గరప, చతుర్ముఖ, ఝంపె, ప్రతిమంత, జార, వసంత, రతి, లలిత, కంజయతి, నారాయణ, మదన, పార్వతీలోచన, శ్రీనందన, లీల, నిలోక, లలితప్రియ,

జనతక, లక్ష్మిక, రాగ నారని, ఉత్సవ తాళాలు మొత్తం 108 తాళాలను *సంగీత మకరందము* మొదలైన ప్రాచీన గ్రంథాల్లో చూడవచ్చు. ఆచార్య ఎన్. సి. పార్థసారథి "అరుణగిరినాథర్ అను అరవ వాగ్గేయకారుడు తన భక్తి గీతములగు *తిరుప్పుగళ్* అను వానిని ఈ 108 తాళములలో కూర్చియున్నాడు" (పార్థసారథి, ఎన్. సి.2014:68.) అని చెప్పారు. కానీ నేడు ధ్రువ, మత్యాది సప్త తాళాలతో కూడి, త్రిశ్ర చతురస్రాది పంచ జాతులతో మొత్తం 35 తాళాలు విలసిల్లుతున్నాయి. అన్నమాచార్య కీర్తనలు కూడా నేడు ఈ తాళాల్లోనే నిబంధింపబడ్డాయి.

## 4.6.10. సప్త తాళాలను వేసే పద్ధతి

ధ్రువ, మత్య, రూపక, త్రిపుట, ఝంపె, అట, ఏకతాళాలను సప్త తాళాలు అంటారని ముందే తెలుసుకున్నాం. నేటి కాలంలో అవి అమలవుతున్నాయని కూడా తెలుసుకున్నాం. ఇక్కడ ఒక్కొక్క తాళాన్ని, ఆ తాళం వేసే పద్ధతిని గురించి ప్రస్తావిస్తున్నాను.

1. ధ్రువతాళం: ఇది చతురస్రజాతి ధ్రువతాళంగా గుర్తించాలి. ఇందులో ఒక లఘువు, ఒక ధ్రుతం, రెండు లఘువులు అవ్యవధానంగా వస్తాయి. అంటే ఒక ధ్రుతం, మూడు లఘువుల తాళమిది. ఇందులో 4+2+4+4 = 14 అక్షరాలుంటాయి.

2. మత్య తాళం: ఇది చతురస్రజాతి మత్య తాళం. ఇందులో ఒక లఘువు, ఒక ధ్రుతం, ఒక లఘువు ఉంటాయి. ఇందులో 3+4+3 = 10 అక్షరాలు ఉంటాయి.

3. రూపకతాళం: ఇది త్రిశ్రజాతి రూపకతాళం. ఇందులో ఒక ధ్రుతం, ఒక లఘువు ఉంటుంది. అంటే 2+4 = 6 అక్షరాలను కలిగి ఉంటుంది. అన్ని తాళాలు లఘువుతో ప్రారంభించబడితే రూపకతాళం అందుకు భిన్నంగా ధ్రుతం నుండి మొదలవుతుంది.

4. త్రిపుట తాళం: ఇది త్రిశ్రజాతి త్రిపుట తాళం. లఘువులో మూడు అక్షరాలుంటాయి. ఇందులో ఒక లఘువు, రెండు ధ్రుతాలు వెంటవెంటనే వస్తాయి. ఈ తాళంలో 3+2+2 = ఏడు అక్షరాలు ఉంటాయి. ఘాతం తరువాత చిటికెన వేలు, ఆ తరువాతి వేలు దాకా ఒక లఘువుగా లెక్కించడం ఈ తాళ ప్రత్యేకత.

5. ఝంపె తాళం: ఇది చతురస్రజాతి ఝంపె తాళం. ఈ తాళంలో రెండు లఘువులు, రెండు ధ్రుతాలు అవ్యవధానంగా వస్తాయి. ఇందులో 5+5+2+2 = 14 అక్షరాలు ఉంటాయి. ఈ తాళాన్ని ఘాతం తరువాత చిటికెన వేలు నుండి ఉంగరపు వేలు వరకూ

లెక్కించి, ఒక లఘువును పూర్తి చేస్తారు. అలాగే రెండవ లఘువు అనంతరం రెండు ద్రుతాలు రావడం దీని ప్రత్యేకత. సంగీతంలో "ఝంపె చంపె" అని సంగీతజ్ఞులు ఈ తాళాన్ని లెక్కించడంలోని చిక్కును తెలియజేశారు.

6. అటతాళం: ఇది చతురస్రజాతి అటతాళం. ఈ తాళంలో ఒక లఘువు, ఒక అనుద్రుతం, ఒక ద్రుతం అంగాలుగా ప్రవర్తిల్లుతున్నాయి. ఇందులో 7+1+2 = 10 అక్షరాలుంటాయి. ఈ తాళంలో అనుద్రుతం ఉండడం ఒక ప్రత్యేకత. లఘువు ఏడు అక్షరాలను కలిగి ఉండడం మరొక ప్రత్యేకత. ఈ అక్షరాలను ఘాతం మొదలుకొని మళ్ళీ చిటికెన వేలు దాకా లెక్కించి, లఘువును పూర్తి చేస్తారు. అలాగే అనుద్రుతం అనంతరం ద్రుతం వస్తుంది.

7. ఏకతాళం: ఈ తాళంలో లఘువు మాత్రమే ఉంటుంది. ఇది చతురస్రజాతి ఏకతాళం. గురువు లేకపోవడం, ఆది తాళాన్ని పోలి ఉండడం దీని ప్రత్యేకత. ఈ తాళాలు నేడు అమల్లో ఉన్నాయి. ఈ తాళాల్లోనే అన్నమయ్య కీర్తనలు నిబంధింపబడ్డాయి. ఈ విధంగా తాళాలను నిబంధించిన విధానాన్ని తెలుసుకోగలం.

## 4.7. అన్నమయ్య సంకీర్తనల్లో అలంకారాలు

అన్నమయ్య తన సంకీర్తనల్లో అలంకారాలను పోషించిన తీరు అమోఘం. భాష సరళంగా ఉంటూ, అనేకమైన అలంకారాలు ఆయా సందర్భాల్లో పోషింపబడ్డాయి. ఆ అలంకారాలను గురించి కింద ప్రస్తావిస్తున్నాను.

'సౌందర్యమలంకారః' అలంకారం అంటే సౌందర్యం అని అర్థం చెప్పుకోవచ్చు. ఈ సూత్రాన్ని వామనుడు *కావ్యాలంకార సూత్రము* అనే గ్రంథంలో చెప్పారు. కావ్యానికి అలంకారాలు అందాన్ని ఇస్తాయి. కావ్యంలో దోషాలు లేకుండా చూసుకోవడంవల్ల అందం వస్తుందని సంస్కృత పండితులు చెప్పారు. అందుకు గుణాలు, రీతులు, పాకాలు ఉపకరిస్తాయి. ఈ అలంకార శాస్త్రజ్ఞులు లక్షణం కంటే లక్ష్యం ముందు ఆవిర్భవించిందని అభిప్రాయపడ్డారు. అంటే వ్యాకరణం కంటే భాష ముందు పుట్టిందని వీరి అభిప్రాయం. ఎందుకంటే భాష ఉంటే దానికి అనుగుణంగా వ్యాకరణం ఉద్భవిస్తుంది. అదే విషయాన్ని అన్నమయ్య బలవత్తమంగా నమ్మారు గనుకనే కఠినతర పదజాలం, ఛందో గణ నియమాలతో పరిఢవిల్లిన పద్య సాహిత్యానికి ఏమాత్రం తగ్గకుండా సరళ రీతిలో సంకీర్తనా సాహిత్యాన్ని సృష్టించారు. కొత్త కొత్త పదాలు కల్పించారు. ఉన్న మాండలిక భాషను

సాహిత్యీకరించారు. ఈ కీర్తనల్లో అలంకార పోషణకు కొదవ లేకుండా చూసుకున్నారు. ఉపమ, ఉత్ప్రేక్షాది అలంకారాలు అన్నమయ్య సాహిత్యానికి శోభను కలిగించాయి.

"శబ్దార్థౌ సహితౌ కావ్యం" (సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం.2013:114) అని బామహుడు అర్థం చెప్పారు. ఈ నిర్వచనం సంకీర్తనలకు ఇట్టే సరిపోతుంది. కావ్యాల్లో సౌందర్యం ఉండాలి. సౌందర్యం ఉండాలంటే అలంకారాదులు ప్రవేశపెట్టాలి. మాటలు తూచి తూచి వాడాలి. అర్థాల్లో ఔచిత్యం ఉండాలి. ప్రపంచంలోని ఏ వస్తువునైనా కావ్య వస్తువుగా ఎంచుకోవచ్చు అని పుల్లెల శ్రీరామచంద్రుడు *కావ్యాలంకార శాస్త్రము, ఆధునిక సాహిత్యము* అనే గ్రంథంలో చెప్పారు. తీపి, పులుపు, మొదలైన రుచులను ఎవరికి వారే ఆస్వాదించి తెలుసుకోవాలి. అంతేగాని ఒకరిభావం ఉన్నట్లుగా వేరొకరి భావం ఉండదు. అలాగే ఒక కావ్యాన్ని ఒకరు చదివినపుడు కలిగిన భావం వేరొకరు చదువుతున్నప్పుడు కలగడం అసంభవం. చెరుకురసం మధురంగా ఉంటుంది. పాలు మధురంగానే ఉంటాయి. బెల్లం కూడా మధురమే. కాని వాటి మాధుర్యాలు వేరు. అందులోని తేడాలను సరస్వతి కూడా చెప్పలేదని దండి అభిప్రాయపడ్డారు.

"ఇక్షు క్షీరాగుణాధీనాం మాధుర్యస్యానరం మహత్
తథాపి నతథాఖ్యాతుం సరస్వత్యాపి శఖ్యతే"

(శ్రీరామచంద్రుడు, పుల్లెల.1999:7.)

అలాగే అన్నమయ్య కీర్తనలను పాడి, ఆస్వాదించేవారికి ఆ మాధుర్యం బోధపడుతుంది. క్షణక్షణం ఆ కీర్తనలు మనలో నూతనోత్సాహాన్ని నింపుతాయి. ఒక కావ్యానికి మళ్ళీ మళ్ళీ చదివించే లక్షణాన్ని మాఘుడు "క్షణే క్షణే యున్నవతావుపైతి తదేవ రూపం రమణీయతాయాః" (*శిశుపాల వధ.4.7.*) క్షణక్షణానికి కొత్తగా కనిపించేది కావ్యం అన్నారు. ఇది ప్రకృతిని ఉద్దేశించి చెప్పింది అయినప్పటికీ సంగీతాది లలిత కళలకు కూడా ఈ సూత్రం చాలా బాగా వర్తిస్తుంది. ఇలా కావ్యానికి లేక సంకీర్తనలకి నవనవత్వాన్ని కల్పించేది ఏది అని ప్రశ్నించుకుంటే కొందరు రీతి అని, కొందరు అలంకార ప్రయోగం అని, కొందరు ధ్వని అని, కొందరు వక్రోక్తి అని, రసం అని, ఔచిత్యం అని వారి వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. నిజానికి అవన్నీ కావ్యానికి పరిపోషకాలే.

సంకీర్తనా రచనలో అన్నమయ్య రోజు రోజుకీ పరిణతిని సాధించినట్లు ఆయన కీర్తనలను చదువుతుంటే మనకు బోధపడుతుంది. అన్నమయ్య తన సంకీర్తనల్లో అలంకారాలకు పెద్ద పీట వేశారు. సాధారణంగా అన్నమయ్య సంకీర్తనల్లో ఉపమ, ఛేకానుప్రాసం, వృత్యానుప్రాసం, అతిశయోక్తి, స్వభావోక్తి మొదలైన అలంకారాలను గమనించవచ్చు. ఈ అలంకారాలు అన్నమయ్య సంకీర్తనలకు పరిపుష్టిని చేకూర్చాయి. వాస్తవంగా ఈ అంశం మీద ఇంకొక పరిశోధన గ్రంథాన్ని వెలువరించవచ్చు.

## 4.7.1. ఉపమాలంకారం

ఇది అర్థాలంకారాల్లో ముఖ్యమైనది. ఈ అలంకారంలో ఉపమేయం ఉపమానంతో ఆపాదింపబడి, సమాన ధర్మాన్ని చూపిస్తుంది. అంటే ఉపమేయం ఉపమానం, ఉపమావాచకం, సమాన ధర్మం అనేవి మనం గుర్తించాల్సిన అంశాలు. 'ఉపమా కాళిదాసస్య' అంటే కాళిదాసు ఇష్టపడే అలంకారం ఉపమ అని సంస్కృత పండితులు పేర్కొన్నారు. ఈ ఉపమాలంకారం అన్నమయ్య సంకీర్తనల్లో విరివిగా కనిపిస్తుంది. ఈ అలంకారం మళ్ళీ లుప్తోపమ, పూర్ణోపమ అనే రెండు విధాలుగా ప్రవర్తిల్లుతుంది. ఉపమాన, ఉపమేయాల్లో ఏదో ఒకటి లోపించిన అలంకారాన్ని లుప్తోపమాలంకారం అంటారు. ఏ వస్తువు కూడా లోపించకుండా సంపూర్ణమైన అలంకారంగా ప్రవర్తిల్లే దాన్ని పూర్ణోపమాలంకారం అంటారు. ఉపమాలంకారం ప్రవర్తిల్లిన అన్నమయ్య సంకీర్తనలను కింద ఇస్తున్నాను.

**లలిత రాగం**

**పల్లవి**

"శరణంటిమాతని సంబంధమున జేసి
మరిగించి మమునేలి మన్నించవే

**చరణం:**

నారదాది సనకసనందనాదులవలె
పేరుపడి నినుబాడి బెద్దలై ఉండునట్టి
ఆ రీతిం దాళ్ళపాకన్నమాచార్యుల
చేరి ఏలినయట్టి శ్రీ వేంకట నిలయా." (*సంపుటం2.17.*)

ఈ కీర్తన అన్నమయ్య తదనంతరం తిరుమలయ్య రాసినట్లు తెలుస్తోంది. ఈ కీర్తనలో 'నిన్ను పాడి, మెప్పించి, నీ కృపకు పాత్రుడైన అన్నమాచార్యులను కరుణించి బ్రోచినట్లుగా మమ్మల్ని కూడా కాపాడ'మని ప్రార్థించడం కనిపిస్తుంది. ఈ కీర్తనలో ఉపమాలంకారం చెప్పబడింది. మొదటి, రెండు, మూడు చరణాల్లో ఆయన ఏం చేశారో? చెప్పబడింది. రెండవ చరణంలో రీతి అనే పదం ఉపమాలంకారాన్ని ప్రతిబింబిస్తుంది. సామగానాది సంగీతశాస్త్రాల్లో వేద పురాణాది శాస్త్ర రహస్యాలను నోరారా పాడి నిన్ను కీర్తించిన అన్నమాచార్యులను నీవు కరుణించిన రీతిగామమ్మల్ని కూడా కాపాడమని తిరుమలాచార్యులు కోరుకున్నారు.

## 4.7.2. వ్యాజ స్తుతి, వ్యాజనిందాలంకారం

అన్నమయ్య చేసిన నిందలు తెలుగు సాహిత్యంలోనే ప్రాధాన్యత సంతరించుకున్నాయి. స్వామిని నిందాత్మకంగా స్తుతించడంలో అన్నమయ్యది అందెవేసిన చేయి. దీనికి కారణం స్వామిని అత్యంత సన్నిహితంగా భావించి కీర్తనలు రాయడమే. అన్నమయ్య నిందల్లో చమత్కారం చోటు చేసుకోవడం ఒక విశేషం. అలాంటి సంకీర్తనలను కింద ఇస్తున్నాను.

**దేశాక్షి రాగం**

**పల్లవి**

"వేసరితిమెట్ల నీ వెంట దిరిగి
గాసివెట్టక మమ్ము గావరాదా

**చరణం:**

కట్టితివి కర్మముల కడదాకా నాపదల
బెట్టితివి దుఃఖముల బెనచి పెనచి
పట్టితివి చలము మము పాయనని యాస నీ
విట్టైన గొంత సుఖమియ్యరాదా" (*సంపుటం1.231:154.*)

ఈ కీర్తనలో అడగడంలో ప్రత్యేకతను అన్నమయ్య చూపించారు.

'కోరికలు తెగనియ్యకుండా గృహస్థాశ్రమంలోకి తోశావు. కర్మాలతో కట్టావు. ఆపదలకు లోను చేశావు. దుఃఖంలో ఉన్నా ఆశల్లో పడవేసి సుఖం లేకుండా చేశావు. చేసింది

చాలు. నీ వెంట తిరిగి తిరిగి వేసారిపోయాం.' అని స్వామిని నిందించారు. ఇలా అన్న ఆయనే చివరిలో "తెరగొసంగియును శ్రీ తిరువేంకటేశ్వరుని నెరిగియును నెరగలేమింక నేతెరువో!" అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఈ కీర్తనలో వ్యాజనింద ప్రస్ఫుటమైంది.

**మాళవి రాగం**

**పల్లవి**

"అది నాయపరాధ మిది నాయపరాధ
మదియు నిదియు నాయపరాధము

**చరణం:**

ఈడెరగక వేంకటేశుడ నిను గొనియాడుట యది నా యపరాధము
యేడ జూచిన ఎదురనుండగ నిన్నున్నాడ నీడ వెదకుట
యపరాధము." (*సంపుటం1.271:181.*)

ఈ కీర్తనలో స్వామిని నిందిస్తూనే తెలుసుకోలేని తన అజ్ఞానాన్ని నిందించుకోడం ఒక విశేషం. జీవాత్మలో నిన్ను ఆలోచించుకోడం, నిన్ను సేవించకపోవడం, నన్ను తెలుసుకోకుండా నిన్ను కొనియాడడం నా అపరాధాలేనని అన్నమయ్య ఏకకాలంలో స్వయంనింద, స్వామినింద ఒకేసారి చేశారు. కాబట్టి ఈ కీర్తనలో వ్యాజనింద ప్రస్ఫుటమైంది. "తలపు కామాతురత్వము మీద" అనే సంకీర్తనలో "వేలసంఖ్యల సతుల వేడుకిల రమియింప బాలుపడెగాన రూపములు పెక్కాయ" (*సంపుటం1.107:72.*) అంటారు. ఆయన దశావతారాలెత్తింది సతులతో రమియించడానికి కాదని అంతరార్థంలో చెప్పేందుకు అన్నమయ్య బహిరర్థంలో చేసిన స్తుత్యాత్మకమైన నిందలను గమనించవచ్చు. ఇదే కీర్తనలో అనేక విధాలైన భోగాలను అనుభవిస్తున్నాడు గనుకనే ఆయన ముఖం కూడా మారుముఖమైంది. "పొలయలుక కూటముల భోగి దానటుగాన మలసియక్కొకవేళ మారుమొగమాయ" అన్నారు. అందరూ ఎంతో ఇష్టంగా దర్శించుకొనే ఆ స్వామి దివ్య మంగళ విగ్రహమే కాకుండా గోళ్ళతో కూడిన ఉగ్రనరసింహావతారంలో కూడా సాక్షాత్కరించడం కేవలం ఆయనకే చెల్లిందని అన్నమయ్య స్వామిని స్తుతి నింద చేశారు. అలాగే వివిధ అవతారాల్లో స్వామి పడిన కష్టాలను వ్యంగ్యంగా అన్నమయ్య విశ్లేషించారు. వాటన్నింటినీ నేను ఇక్కడ చర్చించడంలేదు. ఇవే కాకుండా అధ్యాయం–3 అన్నమయ్య

సంభాషణల్లో చర్చించిన నిందాత్మక సంకీర్తనలన్నీ వ్యాజనిందాలంకారాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

## 4.7.3. వృత్యానుప్రాసం

ఒక వర్ణం ఒక వాక్యంలో, లేదా పాదంలో అనేక పర్యాయాలు రావడమే వృత్యానుప్రాసం. వృత్తి అంటే రావడం అని, ఆవృతం అంటే మళ్ళీ మళ్ళీ రావడం అని అర్థాలు ఉన్నాయి. అన్నమయ్య తన సంకీర్తనల్లో ఈ వృత్యానుప్రాస అలంకారాన్ని విరివిగా ప్రయోగించారు. మచ్చుకు ఒక కీర్తనను కింద పరిశీలిస్తున్నాను.

**సాలంగనాట రాగం**

**పల్లవి**

"జయజయ నృసింహా సర్వేశా
భయహర వీరా ప్రహ్లాద వరదా

**చరణం:**

నిహిర శశినయన మృగనరవేశా
బహిరంతస్థల పరిపూర్ణా
అహినాయక సింహాసన రాజిత
బహుళ గుణగణా ప్రహ్లాద వరదా. (*సంపుటం2.286:193.*)

ఈ కీర్తనలోని పల్లవిలో యకారం, రకారం వచ్చాయి. చరణంలో హకారం, రకారం, శకారం పలుమార్లు ఆవృతి చెంది వృత్యాను ప్రాసాన్ని ప్రతిబింబించాయి.

## 4.7.4. ఛేకానుప్రాసం

ఛేకులు అంటే పండితులు అని అర్థం. అనగా పండితులైనవారు ఉపయోగించే ఛేకం అంటే 'జంట' అని అర్థం. పదాల జంట అర్థ భేదంతో పక్క పక్కనే రావడం ఛేకానుప్రాసం. అలంకారం కావడంవల్ల దీనికి ఛేకానుప్రాసాలంకారం అని పేరు వచ్చింది. అన్నమయ్య సంస్కృత కీర్తనల్లో ఈ అలంకారాన్ని విరివిగా వాడారు. ఒక వాక్యంలో పదాలజంట మళ్ళీ మళ్ళీ రావడాన్ని ఛేకానుప్రాసం అంటారు. చూడచూడ మాణిక్యాలు అనే కీర్తనలో కంటి కంటి వాడే వాడే, "కంటి కంటి వాడె వాడే ఘనమైన ముత్యాల." (*సంపుటం2.134:92.*)

మొక్కు మొక్కు అనే పదాలజంట వెంటవెంటనే ప్రయోగించారు అన్నమయ్య. ఈ కింది కీర్తనలో ఇంకా స్పష్టతనిచ్చే ప్రయత్నం చేస్తాను.

**ధన్యాసి రాగం**

**పల్లవి**

“నంద నందన వేణు నాద వినోదా

ముకుంద కుంద దంతహాస గోవర్ధన ధర

**చరణం:**

రామరామ గోవింద రవిచంద్ర లోచనా

కామ కామ కలుష వికార విదూర

ధామ ధామ విభవ ప్రతాప రూప దనుజ వి

ధూమ ధామకరణా చతుర భవభంజన. (*సంపుటం1.315:208.*)

ఈ కీర్తనలో నందనందన, ముకుంద కుంద లాంటి పదాల జంటలతో అర్థ భేదంతో ప్రయోగించి, ధ్వని పుట్టించి, అన్నమయ్య స్వామిని ఛేకానుప్రాసాలంకారంలో స్తుతించారు.

**శ్రీరాగం**

**పల్లవి**

“నిత్యానంద ధరణీధర ధరారమణ

కాత్యాయనీ స్తోత్ర కామ కమలాక్ష

**చరణం:**

అరవిందనాభా జగదాధార భవదూర

పురుషోత్తమా నమో భువనేశా

కరుణాసముద్ర రాక్షసలోక సంహార

కరణా కమలాధీశ కరిరాజ వరదా. (*సంపుటం1.25:17.*)

ఈ కీర్తనలోని పల్లవిలో రవర్ణం, ధవర్ణం ఆవృతం కాగా, చరణంలో ద, ధ, రవర్ణాలు ఆవృతం అయ్యాయి. ఇది సంస్కృత భూయిష్ఠమైన రచన. అయినప్పటికీ ఇందులో ప్రయోగించబడిన వివిధ అలంకారాలవల్ల గానమాధుర్యం చేకూరింది. ఈ కీర్తనలోని పల్లవిలో ధరణీధర, ధరారమణ అని, చరణంలో ధర ధరా, పరిపూర్ణ పూర్ణానంద, పరమ పరమాత్మ అని ఛేకానుప్రాసం ప్రవర్తిల్లింది.

## 4.7.5. అంత్యానుప్రాసం

ఒక పద్యంలో, లేక ఒక సంకీర్తనలోని పాదం చివర ఒకే పదంతోగాని, లేక పదాల జంటతోగాని ముగియడాన్ని అంత్యానుప్రాసం అంటారు. ఈ విధానం సంగీతశాస్త్రంలోని కృతి, కీర్తన, సంకీర్తనాది ప్రక్రియల్లో చాలా విరివిగా కనిపిస్తుంది. అలాంటి కీర్తనను కింద ఇస్తున్నాను.

**దేశాల రాగం**

**పల్లవి**

"తిరుమలగిరి రాయా దేవరాహుత్తరాయ
సురతవిన్నాణరాయ సుగుణ కోనేటి రాయ

**చరణం:**

సిరుల సింగార రాయ చెలువపు తిమ్మరాయ
సరుస వైభవరాయ సకల వినోద రాయ
వరవసంతముల రాయ వనితల విటరాయ
గురుతైన దేవరాయ కొండలకోనేటిరాయ." (*సంపుటం2.451:309.*)

ఈ కీర్తనలో రాయ అనే పదం అంత్యంగా వచ్చింది కావున ఇది అంత్యానుప్రాసం. అలాగే 'అదివో చూడరో' అనే కీర్తనలో మొదటి చరణంలో 'తేజము' అనే పదం, రెండవ చరణంలో 'సాకారము', మూడవ చరణంలో 'ఫలమును' అనే పదాలు అంత్య ప్రాసగా వచ్చాయి. 'అనురేణు' అనే కీర్తనలో 'రూపము' అనే పదం అంత్య ప్రాసం. 'భూమిలోన జొచ్చి' అనే కీర్తనలో ప్రతి రెండవ పాదాంత్యంలో 'నేను' అనే పదంతో అంత్య ప్రాసను ప్రయోగించారు అన్నమయ్య. అలాగే అంత్య ప్రాసానికి 'జో అచ్యుతానంద' అనే కీర్తనలోని పల్లవి, 'అలరచంచలమైన', 'బ్రహ్మ కడిగిన పాదము', 'చాలదా బ్రహ్మమీతి సంకీర్తనం' లాంటి కీర్తనలను మంచి ఉదాహరణగా చెప్పవచ్చు.

## 4.7.6. భ్రాంతి, సందేహాలంకారాలు

ఒక వస్తువుని చూసి, వేరే వస్తువుగా భ్రమపడడమే భ్రాంతిమదలంకారం. ఈ అలంకారం కొంచెం సందేహాలంకారానికి దగ్గరగా ఉంటుంది. అదో ఇదో అనే మీమాంసయే సందేహం. ఈ రెండు అలంకారాలను కింది కీర్తనలో అన్నమయ్య పోషించారు.

భౌళి రాగం

**పల్లవి**

“జగన్మోహనాకార చతురుడవు పురుషోత్తముడవు

వెగటు నా సోదంబు ఇది నీ వెలితో! నా వెలితో!

**చరణం:**

ఎన్ని మారులు సేవించినా కన్నులు తనియవు

విన్న నీ కథామృతమున వీనులు తనియవు

సన్నిధిని మిమ్ము నుతియించి సరుస జిహ్వయు తనియదు

విన్న కన్నది కాదు ఇది నా వెలితో! నీ వెలితో!. (*సంపుటం2.367:252.*)

ఈ కీర్తనలో అన్నమయ్య స్వామిని ‘ఎన్ని సార్లు పూజించినా, చూసినా కళ్ళు అలసిపోవడంలేదు. నీ కథను విన్న చెవులు విసుగు చెందడంలేదు. నీ సన్నిధిలో కీర్తించే నాలుక, నీ ప్రసాదాన్ని స్వీకరించే చేతులు, శరీరం, నీ బాటలో నడిచే కాళ్ళు ఇవేవీ అలసట చెందడంలేదు, విశ్రాంతి కోరుకోడంలేదు. ఇంకా ఏదో కావాలనిపిస్తుంది. ఇది నీ మహత్తో! దాన్ని గ్రహించలేని నా అజ్ఞానమో! తెలియడంలేద’ని అన్నమయ్య చెప్పారు. సందేహాన్ని ప్రదర్శించడానికి అన్నమయ్య వాడిన పదం ‘వెలితి.’ ఈ పదం సందేహాలంకారాన్ని ప్రతిబింబిస్తుంది. అలాగే ‘తనియడం’ అనే పదం అసంతృప్తిని సూచిస్తుంది. ఇలా ఈ అలంకారాన్ని విశిష్టంగా అన్నమయ్య ప్రయోగించారు. అన్నమయ్య వెలయించిన సందేహాలు భ్రాంతి పడ్డట్లుగా కూడా ఈ కీర్తనలో మనం చూడగలం. భ్రాంతిమదలంకారం, సందేహాలంకారాలు ఈ కీర్తనలో పోషించారాయన.

## 4.7.7. రూపకాలంకారం

ఈ అలంకారాన్ని ఉపయోగించి ఆయా సందర్భాల విశిష్టతను అన్నమయ్య తెలియజేశారు. ఉపమాన, ఉపమేయాలకు భేదం లేకుండా అభేదం చెప్పబడితే రూపకాలంకారం అంటారు. ఒక సందర్భాన్ని దాని పోకుండా సహజంగా వర్ణిస్తూ, దాని కీర్తిని పెంచే విధంగా చెప్పడాన్ని రూపకం అంటారు. రూపక సమాస భేదాలన్నీ రూపకాలంకారాలే. ఈ అలంకారంలో ఆ సందర్భం, లేక నామ ఘనతను వివరించి చెప్పడమే కాకుండా దాన్ని వేరే అంశంతో పోల్చినప్పటికీ ఆ భావం చెడకుండా ఉండడం ఒక విశేషం. అలాంటి కీర్తనలను కింద వివరిస్తున్నాను.

## వరాళి రాగం

**పల్లవి**

"అదివో నిత్య శూరులు అచ్యుత నీ దాసులు
ఎదురు లేనివారు ఏకాంగ వీరులు

**చరణం:**

రచ్చల సంసారమనే రణరంగములోన
తెచ్చి కామ క్రోధాల తలలుగొట్టి
అచ్చపు తిరుమంత్రపు టారుపు బొబ్బలతోడ
ఎచ్చలనే తిరిగేరు ఏకాంగవీరులు. (*సంపుటం2.24:17.*)

ఈ కీర్తనలో అచ్యుతుని దాసులైన ఏకాంగవీరుల గుణగణాలను వివరించారు అన్నమయ్య. 'సంసారం అనే రచ్చలతో కూడిన రణరంగంలో తిరుమంత్రాలనే పదునైన కత్తులతో కామక్రోధాల తలలు తెగనరికారు. పుట్టుక, చావు అనే దొంగల నడుముల్ని తెగవేసి, ధర్మాన్ని రక్షిస్తున్నారు. దేహంలోని అహంకారాది గుణాలను వేంకటేశ్వరుని సహాయంతో గెలుస్తున్నారు. కనుక వీరికి ఎదురు లే'దని అన్నమయ్య చెప్పారు. ఈ కీర్తనలో సంసారమనే రణరంగం, తిరుమంత్రం అనే ఆరుపుబొబ్బలు, పుట్టుగులనే మృచ్చులు, దేహములనే ఊళ్ళు, అహంకారమనే చెలువు అనే వాక్యాలు వాటి తీవ్రతను తెలియజేస్తున్నాయి. కనుక రూపకాలంకారం ఇక్కడ ప్రవర్తిల్లింది. ఈ కీర్తన అన్నమాచార్యులవారిది కాదని పెదతిరుమలాచార్యులదో! చినతిరుమలాచార్యులదో! కావచ్చునని గౌరిపెద్ది రామసుబ్బ శర్మగారు రెండవ సంపుట అవతారికలో అభిప్రాయపడ్డారు.

## కాంబోధి రాగం

**పల్లవి**

"సంతలే సొచ్చితిగాని సరకు గాననైతి
ఎంతట శ్రీహరినీవే ఎటు దయజూడవే

**చరణం:**

కాంత చనుగొండలు కడకునెక్కితిం గాని
ఎంతి నా మోక్షపు మెట్లు ఎక్కలేనైతి

అంతట జవ్వనమనే అడవి చొచ్చితి గాని
సంతత హరిభక్తినే సంజీవి గాననైతి
**చరణం:**
తెగి సంసార జలధిం దిరుగులాడితిగాని
ఆగడై వైరాగ్య రత్నమది నేనైతి
పొగరు జన్మాలనే రణభూములు చొచ్చితి గాని
పగటుం గామాదుల పగ సాధించనైతి
చరణం:
తనువనియడి కల్పతరువు మిక్కిలింగాని
కొన విజ్ఞాన ఫలము గోయలేనైతి
ఘనుడ శ్రీవేంకటేశ కిమ్మర నీ కృపచేతం
దవిని ఏ విధులనుం దట్టువడనైతి.” (*సంపుటం2.26:19.*)

ఈ కీర్తనలో చన్నులనే కొండలు, జవ్వనమనే అడవి, హరిభక్తి అనే సంజీవని, సంసారమనే జలధి, జన్మాలు అనే రణభూములు, తనువనే కల్పతరువు, విజ్ఞానమనే ఫలం మొదలైన చోట్ల ఉపమాన ఉపమేయాలకు అభేదం చెప్పబడింది కాబట్టి ఇక్కడ రూపకాలంకారం ప్రవర్తిల్లింది.

## 4.7.8. శ్లేషాలంకారం

అన్నమయ్య సంకీర్తనల్లో శ్లేష సాధించబడిన కీర్తనలను కింద ఇస్తున్నాను.

**మాళవి రాగం**

**పల్లవి**
“శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ
శ్రీమన్నారాయణ నీ శ్రీపాదమే శరణు
**చరణం:**
కమలాసతీముఖ కమల కమలహిత
కమల ప్రియా కమలేక్షణా
కమలాసనహిత గరుడ గమన శ్రీ

కమలనాభ నీ పదకమలమే శరణు

**చరణం:**

పరమయోగిజన భాగధేయ శ్రీ

పరమపూరుషా పరాత్పరా

పరమాత్మా పరమాణురూప శ్రీ

తిరువేంకటగిరి దేవ శరణు. (*సంపుటం1.157:105.*)

ఈ కీర్తనలోని మొదటి చరణంలో కమల అనే పదం విస్తృతంగా ఆవృతమైంది. మొదటి కమలానికి లక్ష్మీదేవి ముఖ కమలమని చెప్పారు. స్వామి సూర్యుడని చెప్పేందుకు కమలహిత, కమల ప్రియ అని చెప్పబడింది. కమలం లాంటి కన్నులు గల స్వామిని కమలేక్షణ అన్నారు. హృదయ కమలాలపై ఆసీనుడని చెప్పేందుకు కమలాసనహిత అనే మాట వేశారు అన్నమయ్య. స్వామి కమలనాభుడు గనుక ఆఆయన పదకమలాలను శరణు వేడారు. ఈ చరణంలో కమలం అనే మాటకు అనేక అర్థాలతో శ్లేష కూర్చబడింది. అలాగే రెండవ చరణంలో పరమ అనే పదాన్ని ప్రయోగించి పరమయోగిజన, పరమపూరుష, పరమాత్మ, పరమాణురూప అంటూ శ్లేషను విజయవంతంగా ప్రయోగించారు.

## 4.7.9. అతిశయోక్తి అలంకారం

ఉక్తి అంటే మాట అని అర్థం చెప్పుకోవచ్చు. ఆ ఉక్తి అతిశయంగా ఉండడం అంటే ఒక విషయాన్ని దానికంటే ఎక్కువ చేసి చెప్పడాన్ని అతిశయోక్తి అంటారు. చెప్పిన మాట చాలా గొప్పగా ఉండడమే అతిశయోక్తి. అన్నమయ్య యుద్ధ సందర్భంలోను, స్వామి హనుమంతుడు తదితర భక్తుల ప్రతాపాన్ని తెలియజేసే సందర్భంలోను ఈ అలంకారాన్ని ఎక్కువగా ఉపయోగించారు. అలాంటి కీర్తనను కింద ఇస్తున్నాను.

**సాలంగనాట రాగం**

**పల్లవి**

“నీయంతటివారెవ్వరు నీకు ఎదురేది యెందు

చాయల నీ సుద్ది విని శరణంబునంటి నేను

**చరణం:**

కావలెనంటే దొర్లి కంభము చించుకవెళ్ళి

కైవసమై ప్రహ్లాదు గానవా నీవు

తేవలెనంటే బ్రహ్మదేవునికి వేదములు

సోవల సముద్రమున దెచ్చితి తేవా నీవు." (*సంపుటం2.46:32.*)

ఈ కీర్తనలో అన్నమయ్య స్వామిని శరణు వేడడానికి తగిన కారణాలను లోకానికి చాటినట్లుగా ఉంది. స్వామి గుణగణాలను ఈ కీర్తనలో అతిశయోక్తిలో తెలిపారు. ప్రహ్లాదుడు కోరిన వెంటనే స్తంభాన్ని చీల్చుకొని వెళ్ళి మరీ దర్శనమిచ్చాడు. బ్రహ్మదేవుడికి సముద్ర గర్భంలో దాచిపెట్టిన వేదాలు తెచ్చి ఇచ్చాడు. గోవర్ధన గిరిని ఎత్తి గోపాలకులను రక్షించాడు. భూమిని చాపలా చుట్టి మరీ రాక్షసులను మట్టుబెట్టాడు. ఆయుధం పట్టకుండానే పాండవుల్ని గెలిపించాడు. ఇలా స్వామి రక్షించాలనుకుంటే ఏదైనా సాధ్యమేనని అన్నమయ్య తెలిపారు. ఇవన్నీ అద్భుతాలే. కోరిన వెంటనే జరిగాయని అందుకే స్వామిని శరణు వేడుకోవాలని అన్నమయ్య అతిశయోక్తి అలంకారంలో స్వామి అవతారాల్లో చేసిన మహిమలను, చూపిన అద్భుతాలను ఈ కీర్తనలో తెలియజేశారు. "విరిగిరి దానవీరులదే" అనే కీర్తనలో నరసింహుడు ప్రహ్లాదుణ్ణి ఊరడించిన విధానం అతిశయోక్త్యలంకారంలో తెలుపబడింది. "హరీ నీ ప్రతాపమునకడ్డమేది" అనే సంకీర్తనలో, "నీవు నీళ్ళ నమిలితే నిండెను వేదములు ఆవల తలెత్తితేనె ఇంద్ర పదవులు మించే" (*సంపుటం2.152:105.*) నీళ్ళు నమిలితేనే వేదాలు పూర్తి అయ్యాయని, తలెత్తి చూస్తే ఇంద్రునికన్నా పైపైకి పెరిగాడని, నవ్వితేనే రాక్షసులు నాశనమయ్యారని, మూతి విరిస్తే మూడులోకాలు మునిగిపోయాయని గోటితో మీటితేనే నదులు తయారయ్యాయని వివిధ అవతారాల్లో స్వామి చేసిన మహత్కార్యాలను అన్నమయ్య తెలిపారు. ఈ విషయాలన్నీ చెప్పిన సందర్భంలో అతిశయోక్తి అలంకారం ప్రవర్తిల్లింది.

### 4.7.10. స్వభావోక్తి అలంకారం

అన్నమయ్య స్వభావోక్తిని చాలా కీర్తనల్లో పోషించారు. ఉన్న విషయాన్ని అత్యంత సహజంగా చెప్పడమే స్వభావోక్తి. సహజ వాగ్గేయకారుడైన అన్నమయ్య చాలా కీర్తనల్లో సహజసిద్ధంగా వర్ణించి చెప్పారు. అలాంటి కీర్తనను కింద ఇస్తున్నాను.

**ఆహిరి రాగం**

**పల్లవి**

"అంటబారి పట్టుకోరే అమ్మలాలా ఇదె

వెంటబారనీదు నన్ను వెడమాయ తురుము

**చరణం:**

కాగెడు పెరుగు చాడె కవ్వముతోఁబొడిచి
లేగలదోలుకొని అలిగిపోయీనీ
రాగతనమున వాడె రాతిరినారగించడు
ఆగి నన్ను గూడడిగెనయ్యో యిందాకను." (*సంపుటం2.122:84.*)

ఈ కీర్తనలో తల్లి మనస్సును అత్యంత స్వభావసిద్ధంగా చెప్పారు. యశోద గోపికలతో కృష్ణుణ్ణి వెంటబడి పట్టుకోమని వాపోయిన విధానం ఈ కీర్తనలో కనబడుతుంది. యశోద కవ్వంతో కృష్ణుణ్ణి కొట్టింది. అందుకని కృష్ణుడు లేగల్ని తోలుకొని దొరకకుండా పోయాడు. ఇలా ప్రతి సారి చేస్తాడు. ఇలా రాత్రికి గాని తినని కృష్ణుడు ఆకలికి తట్టుకోలేక ఇందాక తనను కూడు అడిగాడని తల్లడిల్లింది. ఇంకొక గోపిక పెరుగు, ఊరగాయలు కోరిన విధంగా తిని, చట్టి పారవేశాడని చెప్పింది. ఈ కలియుగంలో వేంకటేశ్వర స్వామి రూపంలో భక్తులందరూ సమర్పించే ప్రసాదాలను తింటున్నాడని అన్నమయ్య ఈ కీర్తనలో ముక్తాయింపునిచ్చారు. ఇలా అత్యంత సహజంగా ఉన్న విషయాలను విశ్లేషించారు కాబట్టి ఇది స్వభావోక్తి అలంకారం అని చెప్పవచ్చు.

'తోరణములే దోవెల్లా' అనే కీర్తనలో తిరుమల ప్రకృతిని స్వభావసిద్ధంగా వర్ణించారు. అక్కడ చెట్లను గూర్చి "వింజామరలును విసనకర్రలును గొంజెగొడుగులే కొండెల్లా అంజనగిరిరాయడు వేంకటపతి సంజీవని పరుషలకొదవగను." (*సంపుటం1.120:83.*) ఆ వేంకటేశ్వరుని కృపచేత తిరుమలంతా ప్రాకృతిక శోభతో, అనేక విలువైన వనమూలికలతో అలరారుతోందని అన్నమయ్య స్వభావసిద్ధంగా వర్ణించారు. ఆ వర్ణనల్లోని సహజత్వం తిరుమలలోని వాతావరణంలో నేటికీ ప్రతిబింబిస్తోంది.

ఇలా అన్నమయ్య కీర్తనల్లో అలంకారాలు పోషింపబడ్డాయి. పద్య కవులకు ఏమాత్రం తీసిపోని విధంగా ఇంకా చెప్పాలంటే కాసింత ఎక్కువ మొత్తంలోనే ఉన్నాయి. అన్నమయ్య కీర్తనల్లో కొన్నింటిని మాత్రమే నేను ఇక్కడ ప్రస్తావించాను. నిజానికి ఈ కీర్తనల్లో అలంకారాలు కోకొల్లలుగా ఉన్నప్పటికీ నేను కొన్నింటిని మాత్రమే పేర్కొన్నాను.

★★★★★

# అధ్యాయం - 5

# అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో వాక్య విన్యాసం

## 5.0. పరిచయం

అన్నమాచార్యుల సంకీర్తనలు వ్యావహారిక సరళ గ్రాంథిక మిశ్రమ భాషలో రాయబడ్డాయి. ఆ సంకీర్తనల్లో చక్కని పదాల కూర్పు, కొత్త పద సృష్టి, తెలుగు నుడికార వ్యాప్తి, అన్యదేశ్య ప్రయోగం ఎక్కువగా కనబడుతున్నాయి. తెలుగు సాహిత్యంలోని మాధుర్యాన్ని అర్థంచేసుకోవడానికి అన్నమయ్య సృష్టించిన కీర్తనలు బాగా సహకరిస్తాయి. తెలుగు భాష చారిత్రక వికాసాన్ని చెప్పటానికి అవసరమైన సమాచారం మనకు అన్నమయ్య కీర్తనల్లో లభిస్తుంది. అన్నమాచార్యుల సంకీర్తనల అధ్యయనానికి ఒక జీవితకాలం సరిపోదు. వాడుక తెలుగును గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే 15వ శతాబ్దానికి చెందిన సాహిత్యాన్ని, ముఖ్యంగా తాళ్ళపాక కవుల సాహిత్య సృష్టిని అధ్యయనం చేస్తే చాలని పండితులు అభిప్రాయపడుతున్నారు. అందులోనుంచి అన్నమాచార్యులు రచించిన '***అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు***' ప్రథమ, ద్వితీయ సంపుటాలను గ్రహించి, వాక్య నిర్మాణ రీతులను అధ్యయనం చేసే ప్రయత్నం ఈ అధ్యాయంలో చేయడం జరిగింది.

## 5.1. అన్నమయ్య భాష

అన్నమాచార్యులు వాడిన భాషపై పండితులు పలు అభిప్రాయాలను వ్యక్తపరిచారు. కొందరు పండితులు కావ్యభాషగా నిర్ణయించగా, మరికొందరు వ్యావహారిక భాష అన్నారు. కొందరు జానపద భాష అని సంభావించారు. గౌరిపెద్ది రామసుబ్బశర్మ ఒకటవ సంపుటానికి రాసిన ముందుమాటలో తాళ్ళపాక కవులు, ముఖ్యంగా అన్నమాచార్యుల వాఙ్మయంలో ఉపయోగించబడిన భాషను గురించి "ఈ తాళ్ళపాక కవుల పదవాఙ్మయమును రేకుల పాతమొక్కటే మూల ప్రకృతి. ఈ వాఙ్మయమంతయూ గ్రాంథిక వ్యావహారిక భాషలలో సంకీర్ణము. వారి కాలమునాడు మాండలికముగ, వ్యావహారికముగనున్న పదరాశినంతటినీ జంకూగొంకూ లేక వాడినారు. మనమీ వాఙ్మయమును పరిష్కరింపవలసివచ్చినప్పుడు చాల వింతవింత సమస్యలు ఎదురగుచుండును. సంధులు, సమాసములు, కారకములు ఇత్యాదులతోకూడ వీరి వ్యావహారికదృష్టి పట్టువిడువలేదు. వీరి వాఙ్మయసాగరమున

కొంతకాలము మునిగి తేలిన వ్యుత్పన్నునికిగాని దీని లోతు తెలియుట కష్టము. మామూలు వాఙ్మయముతో చూచిన దృష్టితోకాక దీనిని విశేష దృష్టితో గమనింపవలసిన అవసరమెంతైనగలదు.” (*సంపుటం1.1998:17-18*) అన్నారు. అన్నమాచార్యులు రాసింది వ్యావహారిక భాషేనని, కానీ ఇందులో సంధి సమాసాది వ్యాకరణ చర్చలకు తావు ఉందని చెప్పారు.

ఇలా ఉండగా రామసుబ్బశర్మ రెండవ సంపుటానికి రాసిన ముందుమాటలో అన్నమయ్య అరసున్నలు, శకటరేఫలు, ఛందస్సు ఉపయోగించిన కారణంగా ఆయన వాడినది కావ్య భాషేనని ఉద్ఘాటించారు. రామసుబ్బశర్మ పుట్టపర్తి నారాయణాచార్యులతో జరిపిన సంభాషణను రెండవ సంపుట అవతారికలో “డా. సరస్వతీపుత్ర శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులవారు ‘వ్యావహారిక భాషను యథేచ్ఛగా వాడిన అన్నమాచార్యుల కృతుల్లో వ్యాకరణచర్చ ఏలబ్బా’ అన్నారు. ‘కానీ ఆ కృతులలోని అరసున్నలు, శకటరేఫలు, స్థానకృతములు, స్థానపతితములు, అస్థానపతితములు, దండిగనుండుటచే, ఆ భాషను శిష్ట వ్యావహారికముగనూ, అశిష్ట వ్యావహారికముగను, గ్రాంథిక సన్నిహితమైనదానిని విమర్శించక యెట్లుండేది స్వామీ?’ అన్నాను. ‘సరే... నీ ఇష్టం’ అన్నారు.” (*సంపుటం2. 1998:56-57.*) అని వివరించారు.

వాస్తవానికి అన్నమయ్య కావ్యభాషలో జన వ్యవహార భాషను చొప్పించి, కీర్తన చేశారు. తద్వారా వ్యావహారిక భాషకు కావ్యగౌరవం కల్పించారు. ఆ కాలానికి అరసున్న, శకటరేఫలు రాయడం అమల్లో ఉంది. శకటరేఫ అరసున్నల వాడకం దాదాపు 16వ శతాబ్దం వరకూ నిలిచి ఉందని పండితులు అభిప్రాయపడుతున్నారు. అనంతరకాలంలోని కవులు, వాగ్గేయకారులు తమ రచనల్లో అరసున్నలు, శకటరేఫలను విరివిగా వాడారు. సంగీతశాస్త్రంలోని కీర్తనలు దేశీ ఛందస్సులో ఉండడమనేది సాధారణ విషయం. అన్నమయ్య వాడుక భాషకు కవితా సొబగులద్ది సంకీర్తన చేశారు కాబట్టి ఆయన ఉపయోగించిన పదజాలం, పలుకుబళ్ళు, కొత్త పద సృష్టి పల్లకీలు ఎక్కలేదు. ప్రజలే సంకీర్తనల వ్యాప్తికి పూనుకున్నారు. అన్నమయ్య వాడినది ఆ నాటి వ్యావహారిక భాష, ఈ నాటి మౌఖికభాష. కనుకనే అన్నమయ్యకు ముందు వచ్చిన వాగ్గేయకారులకు, అనంతరం వచ్చిన

వాగ్గేయకారులకు లేని ప్రాశస్త్యం, దక్కని గౌరవం ఈ నాటికీ అన్నమయ్యకు దక్కుతోంది. దానికి కారణం ఆయన వాడిన భాషే. ఈ కీర్తనలను రచించింది అన్నమయ్యేనని చాలామంది ప్రజలకు తెలియదు. కానీ ఆయన కీర్తనలను స్మరించనివారు, అన్నమయ్య సంకీర్తనలను నాట్యమాడించని నాలుక లేదని నేటి పండితులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

## 5.2. విన్యాసం – అర్థవివరణ

సాధారణంగా విన్యాసం అంటే ప్రదర్శన అనే అర్థం వాడుకలో ఉంది. విన్యాసం అనే మాటకు పత్రికా భాషలోనైతే సైనికులు తమ ఆయుధాల శక్తి సామర్థ్యాలను, క్రీడాకారులు తమ ఆటతీరును ప్రదర్శించడం. కావ్యభాషలోనైతే రచనా విన్యాసం, రసాయన శాస్త్రం లాంటి ఇతర శాస్త్రాల్లోనైతే మూలకాల అమరిక అని ఇలా విన్యాసానికి అనేక అర్థాలు ప్రవర్తిల్లుతున్నాయి. వాటిలో ముఖ్యమైన అర్థాలను కింద ఇస్తున్నాను.

1. శంకరనారాయణ ***తెలుగు ఇంగ్లీషు నిఘంటువు***లో 'Placing, putting, position, posture, depositing, arrangement, (in music) making variations in a tune.' అనే అర్థాలున్నాయి.

2. ఆచార్య జి. ఎన్. రెడ్డిగారు ***పర్యాయపద నిఘంటువు***లో 'వస్తువులను ఒక క్రమముననుసరించి అమర్చుట (Arrangement)' అన్నారు.

3. ***ఆంధ్ర తమిళ కన్నడ త్రిభాషా నిఘంటువు*** 'చక్కని ప్రదర్శన' అనే అర్థంచెప్పింది.

పై నిఘంటువుల్లో చెప్పిన అర్థాలనుబట్టి విన్యాసం అంటే 'ఒక క్రమపద్ధతిలో జరిగే చక్కని ప్రదర్శన' (లేక) 'ప్రస్తారం' అనే అర్థంచెప్పుకోవచ్చు. ప్రస్తారం అంటే గణాల, ధ్వనుల, అక్షరాల, స్వరాక్షరాల లెక్క. సంగీతశాస్త్రానికి ఈ అర్థం అత్యంత విలువను చేకూరుస్తుంది. స్వర, రాగ, లయలు ఒక క్రమపద్ధతిని అనుసరించి ప్రస్తారించడాన్ని విన్యాసంగా సంభావించాలి.

సాధారణంగా సాహిత్య భాషలో ఆయా ప్రక్రియలను ఆధారం చేసుకొని వాక్యాలు నిర్మించబడతాయి. ఒక సంకీర్తనలో వాక్యం సంపూర్తి చెందేందుకు క్రియలు అటూ, ఇటూ మారతాయి. పద్యాది ప్రక్రియల్లోలాగానే సంకీర్తనాది ప్రక్రియల్లో కూడా రాగాలకు, తాళాలకు, భావాలకు, ఛందస్సుకు, ప్రాసలకు అనుకూలంగా వాటివాటి సౌలభ్యం దృష్ట్యా

క్రియలు తమ స్థానాలను మార్చుకుంటాయి. అయినప్పటికీ భావం చెడదు. అందుకే సంకీర్తన, కృత్యాది ప్రక్రియల్లో లయవిన్యాసం, స్వరవిన్యాసం, రాగవిన్యాసం అనే మాటలు ఎక్కువగా వినిపిస్తూ ఉంటాయి. వాటికి వాక్యం ఆధారభూతం. అందుకు ***అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు ప్రథమ, ద్వితీయ సంపుటాల***ను ఆలంబనగా గ్రహించాను. అందుకని ఈ అధ్యాయానికి '***అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో వాక్య విన్యాసం***' అని పేరు పెట్టడం జరిగింది. ఈ అధ్యాయాన్ని భాషాశాస్త్ర దృష్టితోనే రాయడం జరిగింది.

## 5.3. వాక్య నిర్వచనం

'యోగ్యత, ఆకాంక్షలు కలిగి, ఆసత్తితో కూడిన పద సముదాయాన్ని వాక్యం అంటారు.' దీనినే ప్రౌఢ వ్యాకర్త "వాక్యమునాఁ యోగ్యతాకాంక్ష సహితంబగు నర్థముగల యాసత్తి యుక్త పదసముదాయంబు" (*సీతారామచార్యులు, బహుజనపల్లి. 2011:161.*) అని నిర్వచించారు.

యోగ్యత అంటే వాక్యంలోని పదాలు వాటి అర్థాల పరస్పర సంబంధంలో బాధ కలగకుండా ఉండడం. ఆకాంక్ష అంటే ఒక వాక్యంలో పద అర్థాన్ని గ్రహించిన వెంటనే తక్కిన పదాల అర్థాలను తెలుసుకోవాలనే కోరిక. ఆసత్తి అంటే వాక్యంలోని పదాలమధ్య ఉండే అవ్యవధానత. (వేరొకటి లేకుండడం)

వాక్యాన్ని పాశ్చాత్యులు ఇలా నిర్వచించారు.

"A Sentence is a grammatical form which is not in construction with any other grammatical form; a constitute which is not a constituent. " (*Hocket. 1970:1999*) (*పవన్ కుమార్, పమ్మి.2003:239*)

'స్వరూపాన్నిబట్టి వాక్యం ఇతర విభాగాలకి చెందని ఒక ప్రత్యేక వ్యాకరణ వర్గానికి చెందింది. ఇది ఇతర వ్యాకరణ వర్గాలకు అంగంకాని అంగి'

"The largest linguistic unit which is held together by rigid grammatical rules is the sentence. More particularly, A sentence does not have to be something which somebody might reasonably

say, and not everything that we might reasonably say is a sentence' (*Trask, 1999:273, 74*) (*పవన్ కుమార్, పమ్మి.2003:239.*)

వ్యాకరణ సూత్రాలలో ఏర్పడే రూపాలు కలిసి నిర్మితమయ్యే గరిష్ఠ భాషాంశం వాక్యం. స్పష్టంగా/పూర్తిగా/ఇదమిత్థంగా ఇది అని నిర్వచించలేని భాషాంశం వాక్యం. ఒక ప్రత్యేక రూపం లేనిదే వాక్యం. ఆంగ్ల పండితులు 'రెండు పూర్ణ విరామాల మధ్య ఉన్న దాన్ని వాక్యం' అని చెప్పారు.

సాధారణంగా వాక్య విన్యాసంలో అసమాపక క్రియలతో కూడిన ఉపవాక్యాలు ప్రధాన వాక్యాలను అంటిపెట్టుకొని ఉంటాయి. ఈ వాక్యాలు సమాపక క్రియలతో సంపూర్ణమవుతాయి. కానీ అన్నమయ్య సంకీర్తనలు అసమాపక క్రియలతో కూడా సంపూర్తి చెందుతున్నాయి. అంటే ప్రధానవాక్యాలకు ముందున్న ఉపవాక్యాలు ఈయన సంకీర్తనల్లో చివరన కూడా సంపూర్తి వాక్యాలుగా వస్తున్నాయి. ఆ సందర్భంలో అపసవ్య దిశలో (వ్యతిరేక దిశలో) వాక్యాలు ప్రవర్తిల్లుతున్నాయి. చాలా కీర్తనల్లో ఈ విధానాన్ని అన్నమాచార్యులు అవలంబించారు. ఆ కీర్తనలను ఈ అధ్యాయంలో అధ్యయనం చేయడం జరిగింది.

## 5.4. వాక్య భేదాలు

వాక్యాలను ఏ భాషలోనైనా సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలుగా విభజించవచ్చు. ఆచార్య చేకూరి రామారావు ఇలా అన్నారు. "ఒక వాక్యంలో నిర్దిష్ట స్థానంలో ఇంకొక వాక్యాన్ని చేరిస్తే సంశ్లిష్ట వాక్యం ఏర్పడుతుంది. ఒక వాక్యంతో ఇంకొక వాక్యాన్ని చేరిస్తే సంయుక్త వాక్యం ఏర్పడుతుంది. ఒక వాక్యంతో ఇంకొక వాక్యాన్ని చేర్చినప్పుడు కొన్ని మార్పులు జరుగుతై. ఈ మార్పుల అనంతరమే సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలు ప్రయోగార్హాలు అవుతై. ఈ దృష్టితో చూసినప్పుడు సంశ్లిష్ట, సంయుక్త వాక్యాల్లో సామాన్య వాక్య లక్షణాలుండటం ఆశ్చర్యం కాదు." (*రామారావు, చేకూరి.2018:1*)

ఈ అధ్యాయంలో వాక్యాలను స్వరూప విభాగంలో సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలుగానూ, స్వభావ విభాగంలో ప్రశ్నార్థక, ఆశ్చర్యార్థక, ఉభయ సంప్రార్థనార్థక, సందేహార్థక, సంబోధనార్థక, నిర్ధారక, సామర్థ్యార్థక, అనుమత్యార్థక వాక్యాలుగా విభజించి

అనుశీలించడం జరిగింది. సామాన్య వాక్యాలకు, నిశ్చయార్థక వాక్యాలకు ఉన్న సామ్యంవల్ల సామాన్య వాక్య విభాగంలోనే నిశ్చయార్థక వాక్యాలను గురించి చర్చించడం జరిగింది. అలాగే భావార్థక వాక్యాలు అనుకృతి వాక్య విభాగంలో చర్చించబడ్డాయి.

## 5.4.1. స్వరూప విభాగం

ఈ విభాగంలో సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను గురించి చర్చించడం జరిగింది.

## 5.4.1.1. సామాన్య వాక్యం (Simple sentence)

సామాన్య వాక్యంలో ఒక ఆఖ్యాతం (predicate) ఉంటుంది. ఒక సమాపక క్రియ ఉంటుంది. సామాన్య వాక్యంలో అసమాపక క్రియ ఉండదు. సామాన్య వాక్యాల్లోని భేదాలను చర్చిస్తూ రామారావుగారు "సామాన్య వాక్యాల్లో అతిసామాన్యమైనదాన్ని నిశ్చయార్థకం అంటారు. సామాన్య వాక్యాన్ని కొన్ని మార్పులు చెయ్యటం ద్వారా (ఆగమాదేశ వ్యత్యయాదికార్యాలు) వ్యతిరేక, ప్రశ్న మొదలైన వాక్య భేదాల్ని సాధించవచ్చు. ఇవికాక విధి, సంప్రార్థనాద్యర్థక వాక్యాలు కూడా ఉన్నై. ఒక వాక్యానికి కిల, సంబుద్ధ్యర్థక ప్రత్యయం చేర్చటంవల్ల సామాన్య వాక్యంలో మరికొన్ని అర్థభేదాలేర్పడతై. క్రియారహిత వాక్యాల్లో కొన్ని సహజంగా క్రియలేని వాక్యాలు, మరికొన్ని క్రియ లోపించిన వాక్యాలు ఉంటై. సహజంగా క్రియ లేని వాక్యాల్లో రెండు నామబంధాలుంటై. అందులో ఒకటి ఉద్దేశ్యం. ఇంకోటి విధేయం. ఉద్దేశ్య విధేయనామాలు రెండూ ఏకవస్తు బోధకాలు. ఉద్దేశ్య నామాలు ఏ నామాలైనా కావచ్చు. స్త్రీ సర్వనామాలు కూడా కావచ్చు. విధేయ నామాలు, సిద్ధ నామాలు, విశేషాలనుంచి సాధించిన నామాలు ఉంటై. విధేయ నామాలు ఉద్దేశ్య నామాల్ని గురించి సాధారణంగా ఏదో ఒక విశేషాన్ని బోధిస్తే, ఉద్దేశ్య, విధేయ నామాలు రెండూ విశేషణపదపూర్వకమై ఉండవచ్చు. ఈ విశేషణాలలో వాటిల్లో భేదాల్నిబట్టి వాటి క్రమం ఉంటుంది. ఇట్లాంటి వాటిని సమానాధికరణ వాక్యాలని గాని, సమీకరణ వాక్యాలని (Equational clauses) గాని అంటారు." (*రామారావు, చేకూరి.2018:1*) అని వివరించారు.

అన్నమయ్య సంకీర్తనల్లోని సామాన్య వాక్యాలను కింది విధంగా గమనించవచ్చు.

"చేతనఁ బెట్టు పుణ్యాలు చేరువనే కలుగు" (*సంపుటం2.57:39*)

"ఉదుటున ప్రహ్లాదు నూరడించె నదె" (*సంపుటం2.91:61*)

"తనరిన శ్రీవేంకటపతి దైవబలము నాకు" (*సంపుటం2.109:73*)

"జనులకెప్పుడు నాత్మ సౌఖ్యంబులేదు" (*సంపుటం1.303:202*)

"కొద్దితోడఁ గాలమేమి గురియై నిలువదు" (*సంపుటం2.271:181*)

"సతినమ్మికొన హరిశ్చంద్రుజేసె" (*సంపుటం1.134:92*)

"నెలకొని సేసే బత్తి నీటిపై వ్రాత" (*సంపుటం2.268:179*)

"సకల తత్త్వ సంశయఖండనమిది" (*సంపుటం1.349:233*)

"ఇనమండలమున జనగేటి హితవైభవుడీతడు మునువుట్టిన దేవతలకు మూలభూతి ఈతడు" (*సంపుటం1.351:235*)

అన్నమయ్య సంకీర్తనల్లో దాదాపుగా అన్ని కీర్తనల్లోను ముందున్న వాక్యాన్ని ఆధారం చేసుకొని తరువాత వచ్చే వాక్యం ప్రవర్తిల్లడం జరిగింది. కొన్ని సందర్భాల్లో వాక్య విభాగాలను విభజించడం కూడా కష్టమే. అంతగా వాక్యాలు ఒకదానితో ఒకటి అనుసంధించారాయన. వాక్యాల్లోని క్రియలు సంకీర్తన తీరునుబట్టి అటూ, ఇటూ మారి, సంకీర్తనకు పరిపుష్టిని చేకూర్చాయి. సంకీర్తనాది ప్రక్రియల్లో వాక్యాల మార్పువల్ల అర్థంచెడలేదు.

## 5.4.1.1.1. నిశ్చయార్థక వాక్యాలు

స్థిరమైన నిర్ణయాన్ని తెలియపరచడం నిశ్చయార్థక వాక్యంలో కనిపిస్తుంది. సామాన్య వాక్యాలకు, నిశ్చయార్థక వాక్యాలకు దగ్గర సంబంధం ఉండడంవల్ల ఈ వాక్యాలను ఇక్కడే చర్చించడం జరిగింది. దాదాపు చాలా సంకీర్తనల్లో అన్నమయ్య తన నిర్ణయాన్ని ప్రకటించారు. అలాగే ఇతరులు తప్పక చేయాల్సిన పనుల్ని చెప్పారు. కీర్తన చివరలో, కొన్ని సందర్భాల్లో మధ్యలో, మొదటిలో ఇలా సందర్భాన్ని అనుసరించి ఈ నిశ్చయార్థక వాక్యరూపాలు ఉన్నాయి. వాటిని కింద ఇస్తున్నాను.

"అచ్యుత నామము అనంతనామము." (*సంపుటం1.8:6*)

"వననిధి గురిసిన వానలివి." (*సంపుటం1.24:16*)

"పాప పుణ్యముల రూపము దేహమిది." (*సంపుటం1.28:19*)

"పుడమీధరుడు మాకు భువనౌషధము." (*సంపుటం1.461:309*)

"సకలజీవులకెల్ల సంజీవి ఈ మందు" (*సంపుటం1.468:314*)

"నుదుట వ్రాసిన వ్రాలు నూరేండ్ల పత్రము" (*సంపుటం1.469:314*)

"పరమపురుష నీవు పట్టినదే ధర్మము
అరసి నీవు చెల్లించినదే సత్యము" (*సంపుటం2.316*)

"యిందరికి నీవే దిక్కు" (*సంపుటం2.306:205*)

"పరమశాంతునకుఁ బాపము రాదు
విరతిగలవానికి వెరపు లేదు
గురుసేవారతునకుఁ గోపము రాదు
ధర సత్యవిదునకుఁ దప్పు లేదు" (*సంపుటం2.307:205*)

"సెలవి నవ్వులవాఁడు చేకత్తిగోళ్లవాఁడు" (*సంపుటం2.508:343*)

"సరిలేని జీవులకు జన్మబాధ" (*సంపుటం1.240:160*)

"హితవు చేకొననొల్లరిందరు" (*సంపుటం1.154:105*)

## 5.4.1.2. సంశ్లిష్ట వాక్యం

ప్రధాన వాక్యానికి కొన్ని ఉపవాక్యాలు చేరడంవల్ల సంశ్లిష్ట వాక్యాలు ఏర్పడతాయి. సంశ్లిష్ట వాక్యాల్లో ప్రధాన వాక్యం క్రియాసహితమై ఉంటుంది. దానికి ముందు ఒకటికన్నా ఎక్కువ (ఎన్నైనా) ఉపవాక్యాలను ఉంచవచ్చు. అవి క్రియారహిత వాక్యాలై ఉంటాయి. ఆచార్య చేకూరి రామారావుగారు ఇలా అన్నారు. "ఒక ప్రధాన వాక్యానికి కొన్ని ఉపవాక్యాలు చేరడంవల్ల సంశ్లిష్ట వాక్యాలు ఏర్పడుతై. సంశ్లిష్ట వాక్యాల్లో ప్రధాన వాక్యం క్రియాసహితమైతే ఒకటికన్న ఎక్కువ క్రియలను గుర్తుపట్టవచ్చు. ఉపవాక్యాల్లో క్రియ సాధారణంగా అసమాపక క్రియ అయి ఉంటుంది. మరికొన్నిటిలో క్రియ భావార్థక నామంగా గాని, క్రియాజన్య విశేషణంగా గాని ఉంటుంది. ఈ చెప్పిన క్రియారూపాల్లో పురుషబోధ ఉండదు. అసమాపక క్రియల్లో అయినా, వ్యాపారం జరిగే తీరును గురించే ఉంటుంది. కాలబోధ ఉంటుంది. కాలబోధ ప్రధాన క్రియను అనుసరించి ఉంటుంది. క్రియాజన్య విశేషణంలో కాలబోధ ఉంటుంది. క్రియలన్నింటికీ వ్యతిరేక రూపాలు కూడా ఉంటై." (*రామారావు, చేకూరి.2018:24*)

ఈ విభాగంలో క్త్వార్థక, వ్యతిరేక క్త్వార్థక, శత్రర్థక, అన్నంత, చేదర్థక, అప్యర్థక సంశ్లిష్ట వాక్యాలను అధ్యయనం చేయడం జరిగింది.

### 5.4.1.2.1. క్త్వార్థక ప్రయుక్త సంశ్లిష్ట వాక్యాలు

క్త్వార్థకం అంటే భూతకాలిక అసమాపక క్రియ. ఇది వాక్యంలో ప్రధాన క్రియకు ముందు ఉండి, ప్రధాన క్రియా వ్యాపారానికి ముందు జరిగిన క్రియా వ్యాపారాలను తెలుపుతుంది. "ఆధునిక తెలుగులో హేతు, రీత్యర్థాల్లోనూ, కాలబోధక సామాన్యవాక్యానికి ఉపవాక్యంగా, జడవాచక కర్తృపదాల్లో పరిణామ సూచకంగా, కాలబోధంగా క్త్వార్థకం ప్రయుక్తమవుతుంద"ని చేకూరి రామారావుగారు (*రామారావు, చేకూరి.2018:24*) చెప్పారు.

అన్నమయ్య కీర్తనల్లో ఉన్న క్త్వార్థక ప్రయుక్త సంశ్లిష్ట వాక్యాలు కింద చూపబడ్డాయి.

"నీనామమునొడిగి నీదాసుడననుకొందు
దీనికే వహించుకోని దిద్దుకో నన్నునూ" (*సంపుటం2.2:2*)

"గక్కునఁ బెరిగివచ్చీ కాలము మీఁదమీఁద
వొక్కనాఁటి కొక్కనాఁటి కొత్తుకొత్తుక
నిక్కి తుమ్మెదలవంటి నెరులెల్లాఁ దెల్లనాయ" (*సంపుటం2.4:3*)

"ఆడితిఁబో బహురూపాలన్నియోనులఁ బుట్టి
తోడనె బ్రహ్మాదులనే దొరలెదుటా
అన్నికర్మములుఁ జేసి ఆటలో బ్రాహ్మణుఁడనైతిఁ" (*సంపుటం2.6:5*)

"వలచి పై కొనఁగరాదు వలదని తొలఁగరాదు" (*సంపుటం1.1:1*)

"పదిలమైన మోహపాశంబులుదెచ్చి,
మెదలకుండగ నాకు మెడజుట్టి,
యెదిరివారు నవ్వ నింటింట దిరిగించి,
తుదలేని యాసల దుఃఖాతురునిజేసె" (*సంపుటం1.309:26*)

"కోపగించి చంకబిడ్డఁ గోరీ తల్లి డించితేను" (*సంపుటం2.400:270*)

"ముంచిముంచి యాకాశముననే యణఁగును" (*సంపుటం2.402:271*)

"ఆదిమూర్తి నీశరణుచొచ్చి నిను నారాధించనివాని బదుకు" (*సంపుటం2.320:214*)

"భూమిమీఁద దేహమిచ్చి పుట్టించినట్టివాఁడు" (*సంపుటం2.479: 323*)

### 5.4.1.2. 2. వ్యతిరేక క్త్వార్థకం ప్రయుక్తమైన సంశ్లిష్ట వాక్యాలు

భూతకాలిక అసమాపక క్రియలకు 'అక', 'అకుండా' ప్రత్యయాలు చేరడం ద్వారా వ్యతిరేక క్త్వార్థక క్రియా ప్రయుక్త వాక్యాలను సాధించవచ్చు. వాక్య రూపాల్లో 'అక', 'అకుండా' ప్రత్యయాలు చేరిన వాక్యాలు వ్యతిరేక వాక్యాలుగా పరిగణించబడుతున్నాయి. అన్నమయ్య సంకీర్తనల్లో ఈ ప్రత్యయాలు కలిగిన ప్రయోగాలు చాలా ఉన్నాయి.

"నిను నెఱఁగకుండేటి నీచగుణము నాది
నను నెడయకుండే గుణము నీది" (సంపుటం2.53:36)
"నేరరాదు విజ్ఞానము నీ వియ్యక లేదు" (*సంపుటం2.54:36*)
"తలఁపులు గడుగక వొడలటు తాఁ గడిగిన నేమి
వెలుపలి కాంక్షలు వుడుగక విధులుడిగిన నేమి" (*సంపుటం2.55:37*)
"నీవారగించవయ్య చవు లౌఁగాములెంచక" (*సంపుటం2.60:41*)
"మానక యెవ్వతెనైన మచ్చికఁ దగిలి నాతో
నానిపట్టి సరివేసే వద్దిరా నీవూ" (*సంపుటం1.360:241*)
"ఉల్లములో నుండి దేహ మొగి రక్షించేహరి
నొల్లకున్న తన్నుఁ దా నొల్లకుండుట" (*సంపుటం1.398:267*)
"దారి దప్పకుండ నేడుదాళ్లు దెగనేసె" (*సంపుటం2.107:72*)
"వెలుపల మరవక లోపల లేదు" (*సంపుటం2.137:92*)
"అని శంబు నవి చెప్పినట్లఁ జేయకయున్న
ఘనుఁడ నీయాజ్ఞ నేఁ గడచుటే కాదా" (*సంపుటం2.62:42*)
"మహి నీలీల లెంచక మహిమలు దెలియక
బహుగతి జగత్తు స్వభావమందురు" (*సంపుటం2.190:129*)
"కోరిన కోర్కులు కోయని కట్లు
తీరవు నీవవి తెంచక" (*సంపుటం1.384:255*)
"ఇతరులఁ గొలిచిన యెడయక యనాథ
పతితిరువేంకటపతి చేకొనుఁగాక" (*సంపుటం1.36:24*)
"తిరువేంకటపతి దెలియకుండిన నంతా విరసాలే విరసాలే విరసాలే సుండీ"
(*సంపుటం1.219:146*)

ఇలా అన్నమయ్య సంకీర్తనల్లో వ్యతిరేక క్త్వార్థక క్రియతో కూడిన సంశ్లిష్ట వాక్యాలు ప్రవర్తిల్లాయి.

### 5.4.1.2.3. శత్రర్థకప్రయుక్త సంశ్లిష్ట వాక్యాలు

క్త్వార్థక క్రియకున్న విశేష ప్రయోజనాలు శత్రర్థక క్రియకు లేవు. ఏకకర్తృకంగా ఏకకాలంలో జరిగే వ్యాపారాలు బోధించడం శత్రర్థక క్రియలో ప్రధాన ప్రయోజనం అని చేకూరి రామారావుగారు చెప్పారు. శత్రర్థక క్రియ ప్రధాన క్రియకు రీతిబోధక విశేషణంగా కనిపిస్తుంది. నేటికాలంలో 'తూ' ప్రత్యయం వాడుతున్నారు. కాని కావ్యభాషలో చున్, చు ప్రత్యయాలు వాడారు. అన్నమయ్య సంకీర్తనల్లోని వాక్యాల్లో 'చు, చున్' ప్రత్యయాలు ఉన్నాయి. వాటిని కింద అధ్యయనం చేయడం జరిగింది.

"పశులగాచుచు గొల్ల పడుచుల యమునలో
ఇసుకచల్లిన చేతులివియెపో" (*సంపుటం1.166:112*)

"కొండతెరువుకేగి కొంచపు సుఖముల
బండై తిరుగుచు బడలేవు." (*సంపుటం1.90:60*)

"నిరతంపు నేరాలు నెరపుచూ ఇరవైన
మాయపుటెద్దుల బురిగొన్న తిరువేంకటగిరి దేవుడు." (*సంపుటం1.111:76*)

"కవకవనగియుచు గారీనీ." (*సంపుటం1.124:85*)

"పరమాత్మ నోరబాడుచును ఇరుదరులు గూడగదోసి దంచీమాయా."
(*సంపుటం1.130:89*)

"వెలయ నీసొమ్మనుచు విడిపించుకొనవే." (*సంపుటం2.5:4*)

"అనుచు నిద్దరునాడే రమదలవలెనే" (*సంపుటం2.14:10*)

"నెట్టనఁ బారుచునుండు నీరూఁ గాదీమనసు" (*సంపుటం2.21:15*)

"చిప్పిలుచు వెన్నెలలై చిందఁగాను" (*సంపుటం2.50:34*)

"నీదాసుఁడ ననుచు నీమరఁగు చొచ్చుకొంటే" (*సంపుటం2.52:35*)

"చొక్కుచు శ్రీపాదతీర్థ సోమపానమున నించి" (*సంపుటం2.148:99*)

"నవ్వుచు లంకానగరపు దనుజుల
కొవ్వణచిన కపికుంజరుడు" (*సంపుటం1.279:186*)

"పెక్కులిన్నియుఁ గలవు పెరుగుచుండు" (*సంపుటం2.149:100*)

### 5.4.1.2.4. అన్నంత క్రియలు ప్రయుక్తమైన సంశ్లిష్ట వాక్యాలు

ఆధునిక తెలుగులో హేత్వర్థంలో 'పట్టి,బట్టి' క్రియలను ఉపయోగించి ఈ వాక్యాలను ఉపయోగిస్తున్నారు. అన్నమాచార్యుల సంకీర్తనల్లో ధాతువుల మీద 'అన్'తో కూడిన క్రియలు ఉన్నాయి. ఏదైనా ప్రత్యేక కారణంవల్ల మాత్రమే ఇలా జరిగిందనే భావాన్ని ఈ వాక్యాలు వ్యక్తీకరిస్తాయి. అన్నమయ్య సంకీర్తనల్లో 'నా?', 'వల్ల', 'కాన', 'గనుక' లాంటి ప్రత్యయాలు ఈ రూపాలను ప్రతిబింబిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రత్యయం వాక్యంలో అంతర్గతంగా నిలిచి ఉంటుంది. అందువల్ల వాక్యార్థానికి బాధ కలుగకుండడం ఈ సంకీర్తనల్లోని ప్రత్యేకత. ఈ క్రియా రూపాలు నేటికీ మన వాడుక భాషలో నిలిచి ఉన్నాయి. వాటిని కింద పొందుపరుస్తున్నాను.

"సహించిననవి సౌఖ్యములే" (*సంపుటం1.7:5*)

"అవిమేలివి మేలననేల" (*సంపుటం1.9:6*)

"అని మాది సిరులనలరెదు శేషుడా" (*సంపుటం1.11:7*)

"అరయనాపన్నునికి అభయమీవలెగాక" (*సంపుటం1.18:12*)

"కిక్కిరియనారగించవో స్వామి" (*సంపుటం1.22:15*)

"ముంగిటనల్లదివో మూలనున్న ధనము" (*సంపుటం1.23:15*)

"అనఘుని గరుణింపనరుదు గాదు" (*సంపుటం1.27:18*)

"అలరనన్నియుజేసి అజుని పట్టానకు నిలుచున్నాడదివో నీ బంటు" (*సంపుటం1.69:47*)

"మనసుననీతని మరచుటకేపో పనివడి ఇప్పటి ప్రౌఢల చదువు" (*సంపుటం1.91:63*)

"అఖిలాండములు సృజియింపనధిపతియాయెను" (*సంపుటం1.100:69*)

"పోలినిరువురు సతులనాలింగనముసేయ లోలుడటుగాన నాలుగు చేతులాయ" (*సంపుటం1.105:72*)

"యడపదడపనిట్ల నీకు నేమిసేతువయ్యా" (*సంపుటం1.125:85*)

"కొండలను నెలకొన్న కోనేటిపతివనగనుండవలసెను నీకు నోపలేనక" (*సంపుటం1.200:133*)

"కోమలి జంపిన కొరతవల్లనొక్క కోమలినెదబెట్టుకొని ఉండవలసె" (*సంపుటం1.277:185*)

## 5.4.1.2.5. చేదర్థకం ప్రయుక్తమైన సంశ్లిష్ట వాక్యాలు

'చేత్' అంటే కారణం అని అర్థం. ధాతువుకు 'తే', 'ఇతే' ప్రత్యయాలు చేర్చడంవల్ల చేదర్థక రూపం ఏర్పడుతుంది. ఈ రూపం కారణాన్ని గురించి తెలుపుతుంది. అకపోతే ప్రత్యయం వ్యతిరేక చేదర్థక క్రియను సూచిస్తుంది.

అన్నమాచార్యుల సంకీర్తనల్లో ఇలాంటి క్రియా వాక్యాలు కలిగిన కీర్తనలను కింద ఇస్తున్నాను.

"పరమాధికారియైతేఁ బాపము లేదు" (*సంపుటం2.29:20*)
"చిరపుణ్యులైతే మీ సేవలు సేతురు గాక" (*సంపుటం2.54:36*)
"మహిలోని జననాలు మరణాలు మాయమైతే
విహితాచారాలు సేయ విధే లేదు" (*సంపుటం2.120:81*)
"పుట్టిననాఁడై తేను పొడగానరాదు మేను" (*సంపుటం2.421:284*)
"లోకుల చీరలీకుండే లోభమే ప్రియమైతే
యీకడ లోభము నాలో హెచ్చినదిదే
మాకులు మద్దులు దొబ్బేమదమే ప్రియమైతే
చేకొను మదము నాలో సేనాసేన" (*సంపుటం2.448:302*)

## 5.4.1.2.6. అప్యర్థక ప్రయుక్త వాక్యాలు

ఒక క్రియా వ్యాపారం జరిగినా ఫలితాలు వ్యతిరేకంగా రావడాన్ని అప్యర్థక క్రియల్లో చెప్తారు. అందుకు ధాతువుకు 'ఇనా' ప్రత్యయాన్ని చేరుస్తారు. అన్నమయ్య ఇలాంటి క్రియా వాక్యాలు కలిగిన కీర్తనల్లో 'ఇనా' ప్రత్యయంతోబాటు 'కల్లా ' ప్రత్యయాలను అక్కడక్కడా ఉపయోగించారు.

"ఘోరమైన దేహపు దుర్గుణమేమిగలిగిన
ఆరసిఁ బ్రకృతిఁబోయి అడుగవయ్యా
నేరని నాజన్మముతో నేరుపేమి గల్లా నన్ను

ధారుణిఁ బుట్టించిన విధాత నడుగవయ్యా” (*సంపుటం2.28:19*)
“యీవల వాన గురిసి యేరెంతబంటి వారినా
కావరపు జీవునకు గతుగతుకే” (*సంపుటం2.33:23*)
“తెలిసినా జ్ఞానము యీదేవుని మహిమవలె
తెలిసినా వేదాలు సందేహమే కాక” (*సంపుటం2.204:138*)
“ఏదిచూచినా నీవే యిన్నియును మరి నీవే” (*సంపుటం1.61:40*)

## 5.4.1.3. సంయుక్త వాక్యం (Compound Sentence)

కొన్ని సమాన ప్రతిపత్తి ఉన్న వాక్యాలు కలిసిపోయి, ఒక వాక్యంగా ఏర్పడితే అది సంయుక్త వాక్యం అవుతుంది. వాక్య సంయోగాన్ని చూపించడానికి ఆంగ్లంలో And, Or, But లాంటి శబ్దాలను, హిందీ భాషలో ఔర్, యా, మగర్ వంటి శబ్దాలను ప్రయోగిస్తారు. వీటిని సముచ్చయాలు (Conjunctions, Linked words, Bridge Words) అంటారు. ఈ శబ్దాలు వాక్య సంయోగాన్ని మాత్రమే కాకుండా పద, పదబంధ సంయోగాన్ని కూడా సూచిస్తాయి. తెలుగులో అన్ని చోట్ల ఇలాంటి శబ్ద ప్రయోగం లేదు. తెలుగులో సంయుక్త, అసంయుక్త వాక్యాలమధ్య భేదం స్వల్పంగా ఉంటుంది.

సంకలన అర్థంలో క్త్వార్థక వాక్యాలే సంయుక్త వాక్య ప్రయోజనంలో ప్రవర్తిస్తే రెండు వాక్యాలను ఒకదాని తరవాత ఒకటి ప్రయోగించేపుడు (సంయుక్త వాక్యంలో కనిష్ఠంగా రెండు, గరిష్ఠంగా ఎన్నైనా) సమాపక క్రియలు ఉండాలి. కాబట్టి సంయుక్త వాక్యం కింద తెలిపిన విధంగా కూడా ఏర్పడే వీలుంది.

సంయుక్త వాక్యం కనిష్ఠంగా రెండు (గరిష్ఠంగా ఎన్నైనా) సామాన్యవాక్యాల కలయికవల్లగానీ) కనిష్ఠంగా రెండు (గరిష్ఠంగా ఎన్నైనా) సంశ్లిష్ట వాక్యాలతో కూడిగానీ, సామాన్య, సంశ్లిష్ట వాక్యాలు కలిసిగానీ సంయుక్త వాక్యాలు ఏర్పడవచ్చు. (*రామారావు, చేకూరి.2018:83*-91)

అన్నమయ్య సంకీర్తనల్లో సంయుక్త వాక్యాలు ఉన్నాయి. వాటిని కింద పొందుపరుస్తున్నాను.
“తెలియదగినదిది తెలియరానిదిది తెలిసినాను మది దెలియదిది” (*సంపుటం1.253:169*)
“ఆదియును నంత్యంబు నంతయును నీవే” (*సంపుటం1.232:157*)

"దేవునికీ దేవికినీ తెప్పల కోనేటమ్మా
వేవేల మొక్కులూ లోకపావని నీకమ్మా" (*సంపుటం2.419:287*)
"నళినాసనుడెరుగు నారదుడెరుగు కొలది శివుడెరుగు గుహుడెరుగు
ఇలగపిలుడెరుగు ఇంతా మనువెరుగు తలప విష్ణుడే పరతత్త్వమని."
(*సంపుటం1.253:169*)
"మగుట వర్ధనులు మండలీశ్వరులు జగదేకపతులు జతురులును
తగువేంకటపతి దరిశింపగ బహు వగలసంపదల వత్తురు గదలి" (*సంపుటం1.346:231*)
ఈ కింది కీర్తనలో అనేక సంయుక్త వాక్యాలను మనం గమనించగలం.

1: "తగ నూటయిరువై యెనిమిది తిరుపతుల గల
స్థానికులును చక్రవర్తి పీఠకములును
అగణితంబైన దేశాంత్రుల మఠంబులును
నధికమై చెలువొందఁగాను"

2: "మిగుల నున్నతములగు మేడలును మాడుగులు
మితిలేని దివ్య తపసులున్న గృహములును
వొగి నొరగుఁ బెరుమాళ్ళ వునికి పట్టయివెలయు
దిగువ తిరుపతి గడవఁగాను"

3: "కదిసి సురవరలు కిన్నరులు కింపురుషులును
గరుడ గంధర్వ యక్షులును విద్యాధరులు
విదితమై విహరించు విశ్రాంతదేశముల
వేడుకలు దైవారగాను"

4: "బుగులుకొను పరిమళంబుల పూవుఁదోఁటలును
పొందైన నానావిధంబుల వనంబులును
నిగిడి కిక్కిరిసి పండిన మహావృక్షముల–
నీడలను నిలిచి నిలిచి
గగనంబు దాఁకి శృంగార రసభరితమై –
కనకమయమైన గోపురములనుఁ జెలువొంది
జగతీధరుని దివ్యసంపదలు గల నగరు

సరుగననుఁ గానరాఁగాను"

పై వాక్యంలో అనేక సంయుక్త వాక్యాలున్నయి. అన్నమయ్య సంకీర్తనల్లోకెల్లా పైన చెప్పిన కీర్తన చాలా పెద్దది. అందుకే అనేక సంయుక్త వాక్యాలు పై కీర్తనలో ఉన్నాయి. ఇలా అన్నమాచార్యులు సంయుక్త వాక్య నిర్మాణం చేశారు.

## 5.4.2. స్వభావ విభాగం

ఈ విభాగంలో ప్రశ్నార్థక, ఆశ్చర్యార్థక, ఉభయ సంప్రార్థన, సందేహార్థక, నిశ్చయార్థక, సంబోధనార్థక, అనుమత్యర్థక, ఆశీరర్థక, అనుకృతి వాక్యాలు ఉదాహరణ పూర్వకంగా చర్చించబడ్డాయి.

### 5.4.2.1. ప్రశ్నార్థక వాక్యాలు

ప్రశ్నార్థక వాక్యం విషయాపేక్షక, విషయ నిర్ధారక భేదాలతో రెండురకాలుగా ప్రవర్తిల్లుతుంది.

#### 5.4.2.1.1. విషయాపేక్షక ప్రశ్నలు

విషయాపేక్షక ప్రశ్నలు నూతన విషయాలను అపేక్షిస్తాయి. అలాంటివాటిని గురించి డా. పమ్మి పవన్ కుమార్ ఇలా అన్నారు. "ఆధునిక తెలుగులో ఇలాంటి వాక్యాల్లో సాధారణంగా ఎవరు? ఎప్పుడు? ఎక్కడ? ఎలా? ఏ విధంగా? ఏంటి? మొదలైన సర్వనామ రూపాలు వాడుకలో ఉన్నాయి. కావ్యభాషలో ఎవ్వఁడు/ఎవ్వాడు, ఎవ్వని/ఎవ్వాని, ఎవ్వనిన్/ ఎవ్వానిన్, ఎవ్వతె, ఎద్ది/ఏది/ఎయ్యది. ఎవ్వరు/ఎవ్వారు, ఎవ్వరి/ఎవ్వారి మొదలైన రూపాల్లో కనిపిస్తాయి." *(పవన్ కుమార్, పమ్మి.2003:246)*

నేను సేకరించిన అన్నమయ్య సంకీర్తనల్లో ఎయ్యది, ఎద్ది, ఎవ్వతె రూపాలు కాకుండా తక్కినవన్నీ ఉన్నాయి. ఎవరున్నారు? అనే ప్రశ్నకు వేరీ? అనే రూపం 'ఏరి' కి వకారం చేరి ఏర్పడిన రూపం కనిపిస్తుంది. ఎక్కడకు బదులు ఏడ? రూపం కనిపిస్తుంది. నేడు జానపదోచ్చారణలో, కొన్ని జానపద ప్రక్రియల్లో 'ఏడ' రూపం నిలిచి ఉంది. 'వేరి' రూపం నేటి భాషలో వాడుకలో లేదు. రాయలసీమలో నేటికీ 'ఏల' రూపం నిలిచి ఉంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో నేడు 'ఏటి', 'ఏటికి' రూపాలు నిలిచి ఉన్నాయి. ఈ రూపాలు ప్రవర్తిల్లిన వాక్యాలను కింద ఇస్తున్నాను.

“వేదంబెవ్వని వెదికెడినీ?” (*సంపుటం1.5:4*

“కడలేని భవసాగరము సొచ్చిన తన్ను వెడలించు వారలు వేరీ?” (*సంపుటం1.128:88*)

“పొనిఁగితేఁ బాపమేది పుణ్యమేది కర్మమందు” (*సంపుటం2.19:13*)

“ఏనిన్ను దూరకనెవ్వరిదూరుదు” (*సంపుటం1.35:23*)

“ఏడఁసుజ్ఞానమేడ తెలివి నాకు” (*సంపుటం1.48:31*)

“ఏటివిజ్ఞానమేటిచదువు” (*సంపుటం1.78:53*)

“ఎన్నికనామములిటు నీవై యుండగ యిన్ని నామములవారిది ఎవ్వరు” (*సంపుటం1.94:64*)

“ఏకమగు పుణ్యంబులేడగలవిందరికి” (*సంపుటం1.95:65*)

“ఏటికి దలకెదరిందరును” (*సంపుటం1.103:69*)

“ఏది తుద దీనికేది మొదలు” (*సంపుటం1.104:70*)

“జాగుల ప్రపంచమందును సతమైనా నేమి” (*సంపుటం2.55:37*)

“పురుషోత్తమ ఖ్యాతి బొదలి యమృతము పంప
తరుణివై ఉండనిటు దైన్యమేలా?” (*సంపుటం1.140:96*)

“ఎన్ని పదవులబొందడీజీవుడు” (*సంపుటం1.98:67*)

“ఎంతచేసిన తనకేది తుద” (*సంపుటం1.99:67*)

“యేమేమి చదువవలె నెందరి నడుగవలె
ఆముక నిన్నుఁ దెలిసే యందుకొరకు” (*సంపుటం2.311:208*)

“కౌరవులఁ బాండవుల కలహము వెట్టనేల?
నేరచి సారథ్యము నెఱపనేలా?
కోరి భూభార మణఁచేకొరకైతే నీచే చక్ర
మూరకే వేసితే దుష్టు లొక్కమాటే తెగరా” (*సంపుటం2.315:211*)

“పట్టితివి చలము మము పాయనని యాస నీ
విట్టైన గొంత సుఖమియ్యరాదా” (*సంపుటం1.231:154*)

## 5.4.2.1.2. విషయ నిర్ధారక ప్రశ్నలు

వాక్యానికి ప్రశ్నార్థక పదకల్పకావ్యయాలైన 'ఎ, ఏ' లు చేరి విషయ నిర్ధారక ప్రశ్నలు ఏర్పడతాయి. ఈ ప్రశ్నలకు ఔను, కాదు అనే సమాధానాలు వస్తాయి. సాధారణంగా ఇలాంటి వాక్యాలు క్రియారహితాలై ఉంటాయి. అన్నమాచార్యుల సంకీర్తనల్లోని ఇలాంటి వాటిని కింద ఇస్తున్నాను.

"కానిలేని బంట్లఁ దేరకాండ్లు వెట్టిగొనఁగ
దానికి నీ కూరకుండ ధర్మమా సర్వేశ్వరా" (*సంపుటం2.36:25*)
"వొడలు మోచిన దేహి వోమకుండవచ్చునా" (*సంపుటం2.123:83*)
"వదరేవు హరిభక్తి వనిత తెలియరు నే
నిదురవచ్చినవారు నీవు నాకెదురా" (*సంపుటం1.109:73*)
"మనసు చంచలబుద్ధి మానీనా" (*సంపుటం1.198:132*)
"వాలిన కాలుని వసమైనప్పుడు దాలువెండగా దలచీనా" (*సంపుటం1.305:204*)
"చేతిపదార్థము గోరిన చేతికి లోనౌనా" (*సంపుటం1.306:204*)
"కరుణానిధి పుణ్యకథలువినిన చెవుల కడల
సుద్దులు విన సమ్మతించునా" (*సంపుటం2.313:209*)
"కనుఁగొన వసమా నీఘనరూపము" (*సంపుటం2.184:125*)
"వెదక నావసమా వేగుదాఁకా నిన్ను నేను
కదిసి నీమూరితి కాన వసమా" (సంపుటం2.38:26)

## 5.4.2.2. ఆశ్చర్యార్థక వాక్యాలు

ఆశ్చర్యభావాన్ని వ్యక్తంచేసే వాక్యాలను ఆశ్చర్యార్థక వాక్యాలంటారు. సాధారణంగా ఔర!, ఔరౌర!, భళిరేవంటి శబ్దాలు ఈ వాక్యాలలో ఉంటాయి. అన్నమాచార్యులు తన సంకీర్తనల్లో అద్భుత భావాలు నిక్షిప్తం చేశారు. ఇవి విషయగర్భితాలు. ఇవి వాక్యంలో అంతర్గతంగా ఉన్నాయి. ఈ సంకీర్తనల్లో ప్రశ్నతో కూడిన ఆశ్చర్య భావాలు వ్యక్తమవుతున్నాయి. వాటిని కింద ఇస్తున్నాను.

"ఆటవారిగూడితౌరా"! (*సంపుటం1.163:110*)
"ఇంతసేసెవో దైవమింతలోననే అయ్యో

సంతపాక లంజ దెచ్చి సన్యాసి జేసె" (*సంపుటం1.282:188*)

"ఒక్కఁడ నే జీవుఁడను వోహో హరీ" (*సంపుటం2.150*)

"తాపలేక మేడలెక్కదలచేము ఏపులేని చిత్తముతో ఈహీహీ నేము" (*సంపుటం1.94:64*)

పైన చెప్పిన ప్రయోగాలే కాకుండా ఆశ్చర్యార్థక భావాలతో కూడిన ప్రశ్నలుగల వాక్యాలు అన్నమయ్య సంకీర్తనల్లో ఉన్నాయి. వాటిని కింద పొందుపరుస్తున్నాను.

"అనయము దిరువేంకటపతి యాత్మ దలచి సుఖింపుచు ఘనమగు పరమానందము కలుగుటలెన్నడొకో" (*సంపుటం1.136:93*)

"ఎందరొకో శ్రీవేంకటేశ యిపు డెక్కువ నీశరణము చొచ్చి
యిందును నందును సుఖులై లోకుల నిందరిఁ జూచుచు నవ్వేడివారు" (*సంపుటం2.136:93*

"అటు దేవతల కెల్ల నమృతమిచ్చిన నీవు
యిటు వెన్నదొంగిలుట కేమందును" (*సంపుటం2.31:21*)

"బంటులైనవారికిఁ బరతంత్రుఁడవై యీ
వెంటవెంట దిరిగేవు వెఱ్ఱివా నీవు
అంటే ననరాదు రెండుఅడుకులకే చొచ్చేవు
వింటే మాకు నవ్వువచ్చీ వెఱ్ఱివా నీవు" (*సంపుటం2.32:22*)

పై కీర్తనల్లో కొన్ని ప్రశ్నార్థకాలుగా ప్రవర్తిల్లినప్పటికీ ఆ సంకీర్తనలు వ్యక్తీకరించిన భావాలను పరిగణనలోకి తీసుకొని, ఆశ్చర్యార్థక వాక్యాలుగా ఇవ్వడం జరిగింది.

అన్నమాచార్యుల సంకీర్తనల్లో ఒకే కీర్తనలో ప్రశ్నార్థక, ఆశ్చర్య భావాలు నిక్షిప్తమై ఉండడం ఒక విశేషం. అలాంటి కీర్తనను కింద ఇస్తున్నాను.

**మాళవి రాగం**

**పల్లవి:**

"అరుదరుదు నీమహిమతిమానుషముచూడ
పురుషోత్తమను దివ్యపుర జగన్నాథా

**చరణం:**

పసులఁగాచేదేడ బ్రహ్మ నుతియించుటేడ

సిసువౌటేద నాలుగుచేతలేద

కొసరివేలనే యేద కొండగొడగెత్తుటేద

వసమా నిన్నుఁబొగడ వరజగన్నాథా

**చరణం:**

జనవేషమేద పారిజాతము దెచ్చినదేద

తనివెన్న ముచ్చిమేద దైవికమేద

పని బండిబోయిఁడేద బాణుని నరకుటేద

వినఁగత నీమహిమ విష్ణుజగన్నాథా

**చరణం:**

కమ్మి రోలఁగట్టుటేద గరుడవాహనమేద

దొమ్మి భద్రసుభద్రుల తోఁబుట్టువేద

చిమ్ముల నిలగిరిని శ్రీవేంకటాద్రిమీఁద

నుమ్మడి నిరవుకొంటివో జగన్నాథా" (*సంపుటం2.429:289*)

ఇలా ఒకే కీర్తనలో ఆశ్చర్య, ప్రశ్నార్థక వాక్యాలు ప్రవర్తిల్లాయి. ఇలాంటి కీర్తనలు ప్రథమ, ద్వితీయ సంపుటాల్లో చాలా ఉన్నాయి.

## 5.4.2.3. ఉభయ సంప్రార్థనార్థకాలు ప్రయుక్తమైన వాక్యాలు

ఉభయ సంప్రాథనార్థక వాక్యాల్లో కర్త స్థానంలో 'మనం' వస్తుంది. అన్నమయ్య సమాజానికి బోధ చేసిన సంకీర్తనల్లో ఇలాంటి రూపాలు కనిపిస్తాయి. ఇవి కొన్ని సందర్భాల్లో విధ్యర్థకాల రూపంలో ఉంటూనే, ఉభయ సంప్రార్థనలుగా ప్రవర్తిల్లుతాయి. 'మనము' క్రియా రూపంతోబాటు 'మాకు', 'మేము' లాంటి రూపాలు ఈ సంకీర్తనల్లో ఉన్నాయి. వాటిని కింద ఇస్తున్నాను.

"వెదకి వినరో శ్రీవేంకటేశు దాసులాల

బ్రదుకుఁ ద్రోవ మనకు పాటించి చేకొనరో" (*సంపుటం2.183:125*)

"అండనే మొక్కెము నీకు నాదినారసింహా" (*సంపుటం2.245:166*)

"తీపనుచు చేదు దెగదిని

వెనుకబడరాని యాపదలచేత బొరలాడేముగాన" (*సంపుటం1.39:26*)

"ఊరులేని పొలమేర ఒడలు మోసుకొని నేము
తేరదేహమెక్కుకొని తిరిగేము" (*సంపుటం1.73:50*)
"ఎవ్వారు వేల్పులో ఎరుగము సురలెవ్వరో మేమెరుగము" (*సంపుటం1.84:58*)
"తానెకాకెవ్వరు మాకు దాతయు దైవము
తనలోనబెట్టుకొని మాకు లోనైనవాడు" (*సంపుటం1.192:128*)
"కాలకూట విషమైన గక్కున మింగిన నాటి
నీలవర్ణుడే మా నిజదైవము" (*సంపుటం1.214:143*)
"యిరవు మనపంట లివి యెందు వోయుదమో" (*సంపుటం2.407:274*)
"సతతము మాకు నిట్టే సంపద లొసఁగఁడా" (*సంపుటం2.119:80)*
"యింతట శ్రీవేంకటేశుఁడు దలంచి యీ జన్మంబున మము నేలె" (*సంపుటం2.128:86*)
"చేకొని శ్రీవేంకటేశ చెప్పఁగానే వారిచేత
నీకథలు విని విని నే మీదేరితిమి" (*సంపుటం2.161:108*)
"ఆడెడి బాలుల హరి అంగిలి చూపుమని
తోడనే వాండ్లనోర దుమ్ములు చల్లి
యీడ మాతోఁ జెప్పగాను యిందరముఁ గూడిపోయి
చూడఁబోతే పంచదారై చోద్యమాయెనమ్మా" (*సంపుటం2.167:112*)
"సోదించి కొలిచితి సుముఖుఁడై మమ్మేలె
యేదెస మాపాల నితఁడే కలఁడు" (*సంపుటం2.502:343*)
"ఇట్టె మమ్ము రక్షించుట యేమిదొడ్డ నీకు నేఁడు" (*సంపుటం2.503:340*)
"మన్నించిన నీమన్ననే మహిమలో మాబ్రదుకెల్ల
వున్నతి మీదాసిననే దొక్కటే మావ్రతము" (*సంపుటం2.512:346*)

## 5.4.2.4. సందేహార్థక వాక్యాలు

'ఒ', 'ఓ', 'ఒకో' అనే సందేహార్థక పదకల్పకావ్యయాలు చేరిన వాక్యాలు సందేహార్థక వాక్యాలుగా ప్రవర్తిస్తాయి. అన్నమయ్య సంకీర్తనల్లో వీటన్నింటితోబాటు 'కాబోలును' అనే

రూపం కూడా కనిపిస్తుంది. అలాగే సందేహ వ్యక్తీకరణ భావాధారితంగా జరిగింది. అలాంటి సంకీర్తనలను కింద ఇస్తున్నాను.

"కుటిల దానవుల కోటానుగోట్ల ఎటుల ద్రుంచెనో ఈతడు" (*సంపుటం1.127:87*)

"యే వేళ గుణమో యెడతెగని కర్మాలు
రావిమాని జిగురై పూరక యంటీని" (*సంపుటం2.105:71*)

"ఆది నంత మెట్టుండునో అరయరాదు" (*సంపుటం2.197:135*)

"ఇతడు సేసిన సేతలెన్నిలే విలమీద ఇతడు జగదేక గర్వితుడౌనో కాడో" (*సంపుటం1.126:86*)

"పనిపూని జలధిలో వండవెట్టిరి నిన్ను వెనకెవ్వరో మొదలి వేలుపనక" (*సంపుటం1.200:133*)

"సతులై సుతులై చలమై కులమై పతివైతివి వో బంధమా
రతిపెరరేపుల రంతుల యేపుల గతిమాలితివిక గావగదో" (*సంపుటం1.238:159*)

"నీవే బలవంతుఁడవో నీకంటేఁ గర్మము బలువో" (*సంపుటం2.175:120*)

"మమత మేలో నిర్మమత మేలో
దీని క్రమము నక్రమము నే గాననేమిసేతు" (*సంపుటం1.310:207*)

"అచ్చపువేడుక వేంకటాద్రీశుడీ రేయి
నెచ్చెలికి విచ్చినట్టి నేరుపుగాబోలును" (*సంపుటం1.359:240*)

## 5.4.2.5. సంబోధనార్థక వాక్యాలు

సంబోధనలో 'ఓ' అనే శబ్దం వస్తుందని బాలవ్యాకర్త "ఓ యామంత్రణంబు నందగు" (*రామకృష్ణారావు, వంతరాం. 2014:72*) అని తత్సమ పరిచ్ఛేదం 14వ సూత్రంలో సూత్రీకరించారు. ఇది సంబోధ్య వాచకానికి ముందే ప్రయోగించబడుతుంది.

పై సూత్రం పేరుకు ముందు దూరంగా ఉన్నవారిని బిగ్గరగా కేకపెట్టి పిలిచేందుకు నేడు వాడుతున్నారు. సమీపంలో ఉన్నవారిని పిలవడానికి 'ఓ' శబ్దం ఎక్కువసార్లు ఉపయోగించకుండా పిలిచే పద్ధతి నేటికాలంలో ఉంది. కావ్యభాషలో మరీ ముఖ్యంగా పద్య రచనల్లో పిలుపుకు 'ఓ' శబ్దాన్ని వాడారు. లౌడ్ స్పీకర్‌లు రాకమునుపు నాటక ప్రదర్శనల్లో వేదికలమీద అందరికీ వినిపించేవిధంగా సంభాషణల్లో, పద్యాలను పాడే సందర్భంలో 'ఓ'

శబ్దాన్ని నటులు విరివిగా వాడారు. అన్నమాచార్యుల తదనంతరం త్యాగరాజు, రామదాసు మొదలైన వాగ్గేయకారులు తమ కృతుల్లో అధికంగా వాడారు. అన్నమయ్య తన సంకీర్తనల్లో నేటి కాలంలో అమలవుతున్న విధానాన్ని వాడుకున్నారు. అంటే పూర్వపు జనవ్యవహారంలో సమీపంలో ఉన్నవారిని పిలిచేందుకు 'ఓ' శబ్దాన్ని అంతగా వాడలేదని మనకు సూచనప్రాయంగా అర్థమవుతుంది. వేంకటేశ్వరుని నామ ముద్ర సంకీర్తన చివర కనిపిస్తుంది. కనుక ఎక్కువగా 'వేంకటేశుడా', అనే రూపం కనిపిస్తుంది. ఆయా దేవతల మాహాత్మ్యాలను వివరిస్తూ చేసిన సంకీర్తనల్లో ఆ నామాలతోబాటు వేంకటేశ్వర నామాన్ని సమీకరించి, సంబోధించడం జరిగింది. అన్నమయ్య సంకీర్తనల్లోని అలాంటి సంబోధనలను కింద ఇస్తున్నాను.

"నిత్తెపు శ్రీవేంకటేశ నీశరణాగతులము" (*సంపుటం2.137:93*)
"జరసి లక్ష్మీశ నీ శరణమే దిక్కు" (*సంపుటం2.143:98*)
"జగన్మోహనాకార చతురుడవు పురుషోత్తముడవు" (*సంపుటం2.367:252*)
"జయజయ నృసింహా సర్వేశా" (*సంపుటం2.286:193*)
"శ్రీపతి నీయాజ్ఞ సేసెద మిదివో" (*సంపుటం2.144:99*)
"లావణ్యశృంగారరాయ లక్ష్మీనాథ"! (*సంపుటం2.146:100*)
"కారణ ప్రకట వేంకటనారసింహా" (*సంపుటం1.284:188*)
"ఎలమి శ్రీవేంకటేశా యెవ్వరి నేమనవచ్చు" (*సంపుటం2.308:206*
"జనకుఁడ అన్నమాచార్యుఁడ విచ్చేయవే" (*సంపుటం2.148:101*)

## 5.4.2.6. ప్రేరణార్థక వాక్యాలు

ఈ వాక్యాల్లో పని చేసేది ఒకరు, ఆ పనిని చేయించేది ఇంకొకరై ఉంటారు. ఈ వాక్యాల్లో 'చేత', 'ఇంచు' ప్రత్యయాలు ఉంటాయి. "సకర్మక వాక్యంలో ఉన్న కర్త పదానికి ప్రేరణలో చేత అనే వర్ణకం చేరుతుంది." అని చేకూరి రామారావు (*రామారావు, చేకూరి.2018:11*) చెప్పారు. అన్నమయ్య సంకీర్తనల్లో 'చేత', 'ఇంచు' ప్రత్యయాలు ఉన్నాయి. ఇక్కడ ప్రేరేపితుడు అన్నమాచార్యులు, ప్రేరకుడు, ఆసరా అయినవాడు స్వామి. ఇలా ఉన్న వాక్యాలుగల కీర్తనలను కింద ఇస్తున్నాను.

"తెలిసి వేంకటగిరి దేవుని దలపించు తలపైన దనకు ముందరనబ్బదు" (*సంపుటం1.124:85*)

"వేంకటేశు నామమే విడిపించగతిగాక
మంకుబుద్ధి పొరలిన మరిలేదు తెరగు" (*సంపుటం1.158:107*)

"ఇదియొకటి హరినామమింతైన చాలదా
చెదరకీ జన్మముల చెరలు విడిపించ" (*సంపుటం1.52:33*)

"పూజింపించుకొనేవాఁడు భువనరక్షకుఁడట" (*సంపుటం2.72:49*)

## 5.4.2.7. సామర్థ్యార్థక వాక్యాలు

సమర్థతను తెలియజేసే వాక్యాలను సామర్థ్యార్థకాలని అంటారు. ఈ వాక్యాలు చేయగలిగిన, శక్తిమంతమైన పనులను తెలుపుతాయి. తద్ధర్మార్థక క్రియల్లో ఉంటాయి. అన్నమాచార్యులు స్వామి, ఇతరదేవతలు, భక్తుల సామర్థ్యాలను తన కీర్తనల్లో తెలిపారు. అలాంటివాటిని కింద ఇస్తున్నాను.

"ఏరీతి నెవ్వరు నిన్ను నెట్టు భావించినాను
వారివారి పాలికి వరదుఁడవౌదువు" (*సంపుటం2.169:116*)

"మునులఋషులకు నభయమొసఁగిన మూలమూరితి రాముఁడు" (*సంపుటం2.174:119*)

"వివరించి సీతకు విశ్వరూపము చూపుతా
ధ్రువమండలము మోచె దొడ్డ హనుమంతుఁడు" (*సంపుటం2.205:139*)

"సహజివలె నుండేమీ సాధింపలేఁడు" (*సంపుటం2.209:142*)

"అంజనాసుతుఁ డితఁడా అక్షమర్దనుఁ డితఁడా
సంజీవనికొండ దెచ్చె సారె నితఁడా" (*సంపుటం2.220:149*)

"తలకక గగనము తన్నిన పాదము" (*సంపుటం1.191:128*)

"ఖరదూషణాదుల కడిఖండలుగ నేసె
సరుసఁ గుంభకర్ణునిఁ జావనేసెను" (*సంపుటం2.107:72*)

"సిరులుమించిన యట్టిజీవులలో ప్రాణమా
గరిమ వేదములలోఁ గల యర్థమా

పరమపదమునందుఁ బాదుకొన్న బ్రహ్మమా
చరాచరములలో సర్వాధారమా" (*సంపుటం2.329*)
"తాపసోత్తముల చింతా సౌధములలోన
దీపించు సుజ్ఞాన దీపమితడు" (*సంపుటం1.169:114*)

## 5.4.2.8. అనుమత్యర్థక వాక్యాలు

ఒకరు వేరొకరికి పని చేయడానికి, లేక ఆ కార్యం తలపెట్టడానికి అవకాశం కల్పించడాన్ని అనుమతి అంటారు. ఇలాంటి వాక్యాలు అన్నమయ్య కీర్తనల్లో ఉన్నాయి. ఈ కీర్తనల్లో స్వామి అనుమతితో భక్తులు చేసిన పనులు ప్రధానం. అలాంటి కీర్తనలను కింద ఇస్తున్నాను.

"క్షమియించుకొనవే సర్వాపరాధములు
క్రమ మెఱఁగ కేమేమి గావించితినో" (*సంపుటం2.312:209*)
"నినుఁ గొల్చితిఁ గావవే నీరజాక్షుఁడా" (*సంపుటం2.111:75*)

## 5.4.2.9. విధ్యర్థక వాక్యాలు

విధ్యర్థక బోధక వాక్యాల్లో కర్త మధ్యమపురుష సర్వనామమై ఉంటుంది. "విధ్యర్థ బోధక క్రియలలో కర్త ఎప్పుడూ మధ్యమపురుష సర్వనామమే." (*రామారావు, చేకూరి.2018:10*) ఈ సర్వనామం ఏకవచనరూపంలో ఉన్నప్పుడు క్రియ ధాతు రూపంలో ఉంటుంది. ఈ ధాతువులు ఆదేశరూపాలైతే ఆ రూపాలు ప్రయుక్తమవుతాయని చేకూరి రామారావుగారు చెప్పారు. అన్నమయ్య స్వామిని తన సమీపస్థుడిగా భావించడంవల్ల 'ఇలా చేయడం నీ విధి' అని స్వామికి నివేదించుకున్నారు. అలాగే ప్రజలు చేయాల్సిన పనులను తన కీర్తనల్లో తెలియపరిచారు. అలాంటి కీర్తనలను కింద ఇస్తున్నాను.

"అన్నువ మలసీ నరుణోదయమిదె మిన్నక నీవిటు మేలుకొనవే" (*సంపుటం1.139:95*)
"విఱిగి పారెడియట్టి వీరిడి యో రిపులాల
తఱి శరణు చొరరో దండాలు వెట్టరో" (*సంపుటం2.242:164*)
"కొనరో కొనరో మీరు కూరిమి మందు" (*సంపుటం1.237:159*)

“ముచ్చట గోవిందుని ముద్రాధారణకు

అచ్చమయిన ప్రమాణ మందే తెలియరో” (సంపుటం2.485:326)

## 5.4.2.10. ఆశీరర్థక వాక్యాలు

ఈ విభాగంలోని కీర్తనలు స్వామి ఆశీర్వాదాలు కలగాలనే భావంతో ముగుస్తాయి. ఆ భావాలను ‘గాత’, ‘గాక’ కాన, గావుత ప్రత్యయాలు ప్రతిబింబిస్తాయి. అన్నమాచార్యుల సంకీర్తనల్లో ‘గాక’ ప్రత్యయం ప్రవర్తిల్లింది. అలాగే భావగర్భితంగా కొన్ని కీర్తనలు ఆశీరర్థకాలుగా ప్రవర్తిల్లుతున్నాయి. అలాంటి వాటిని కింద ఇస్తున్నాను.

“ముంచి శ్రీవేంకటేశుఁడు మొలఁగట్టిన కఠారు

అంచెల మాకెల్ల రక్షై అమరుఁ గాక” (*సంపుటం2.101:68*)

“కూరిమి మారుతి వేంకటగిరి గురు శ్రీపాదములు చేరినవారికి భవములు చెందవెపుడునటుగాన” (*సంపుటం1.194:130*)

“శ్రీరమణీశుడు శ్రీవేంకటేశుని కోరికదలచి నుతి కొల్లగొనుటగాక” (*సంపుటం1.201:134*)

“అగ్గలపు దురితాలు హరియే మానుపుగాక” (*సంపుటం1.210:140*)

“పొదిలి శాస్త్రార్థంబు పొదగన్న ఫలము మతి దలకకిటు వేంకటేశు దాసుడౌటగాక” (*సంపుటం1.236:158*)

“హరిదాసులగువారి నాదరింతువుగాక అంత నొప్పింతువా కర్మమా” (*సంపుటం1.284:190*)

## 5.4.2.11. అనుకరణ వాక్యాలు

ఈ విభాగంలో ప్రత్యక్ష్య అనుకరణ, పరోక్ష అనుకరణ, భావార్థక వాక్యాలను చర్చించడం జరిగింది. “ఒకసారి ప్రయోగించబడిన భాషాంశాలు మరోసారి ప్రయోగించబడటం అనుకృతి. ఒక వక్త శ్రోతతో అన్నదాన్ని ఇంకో వక్త ఇంకో శ్రోతకు నివేదించవచ్చు. మొదటి శ్రోత, రెండో వక్త ఒకటి కావచ్చు. మొదటి వక్తృశ్రోతలే రెండోసారి కూడా వక్తృశ్రోతలు కావచ్చు. వ్యత్యయం కూడా కావచ్చు. ఒక వక్త తాను అన్నదాన్నే తనకు

తానే వక్తగాను, శ్రోతగాను వ్యవహరించి అనుకరించవచ్చు." (*రామారావు, చేకూరి.2018:64.*)

అనుకృత వాక్యాలలో 'అను' ధాతురూపం ప్రయుక్తమవుతుంది. నామ్నీకృత వాక్యాలలో కూడా 'అను' ప్రయుక్తమౌతుంది. కానీ, దీనికంటే అనుకృతికి పరిధి ఎక్కువ. అనుకృతాంశం భాషాంశాలలోని వర్ణం, శబ్దం, పదం, వాక్యం మొదలైనవాటిలో ఏదైనా కావచ్చు. అనంత వాక్య సమూహం కూడా కావచ్చు. ఏ భాషకు చెందిన అంశాన్నైనా ఇంకో భాషలో అనుకరించవచ్చు. ఇది శబ్ద ప్రధానమైంది.

అనుకృతి మళ్ళీ ప్రత్యక్షానుకృతి, పరోక్షానుకృతి అనే రెండు విధాలుగా విభజించబడింది.

## 5.4.2.11.1. ప్రత్యక్ష అనుకరణం

ఉన్నది ఉన్నట్టుగా అనుకరించడాన్ని ప్రత్యక్ష్య అనుకరణం అంటారు. ఇది శబ్ద ప్రధానమైనది. అన్నమయ్య సంకీర్తనల్లో 'అంటి', 'అని ', 'అంచు', 'అనుచు' లాంటి రూపాలు లభిస్తున్నాయి. వాటిని కింద ఇస్తున్నాను.

"ఘనపాపిగనక నీ కరుణగోరి నీవనవరతము
నాయాతుమ విహరించుమంటిగాక" (*సంపుటం1.36:24*)

"శరణంటిమాతని సంబంధమునజేసి" (*సంపుటం2.23:17*

"తేమల పండించేటి దేవుడ నేను
అని ఆనతిచ్చె కృష్ణుడర్జునునితో" (*సంపుటం2.430:295*)

"అనుచు లోకములెల్ల నదే జయపెట్టేరు
నినుఁ గొల్చితిఁ గావవే నీరజాక్షుఁడా" (*సంపుటం2.110:75*)

"అనుచు దేవ గంధర్వాదులు పలికేరు
కనకకశిపు నీవు ఖండించేలను" (*సంపుటం2.150:103*)

"కానిమ్మని నాకు ఈ పున్నెముగట్టితివింతే అయ్యా" (*సంపుటం2.331:226*)

"శరణంటెఁ గాచుట ధర విభీషణునందుఁ గంటిమి" (*సంపుటం2.321:215*)

## 5.4.2.11.2. పరోక్షానుకరణ వాక్యాలు

అనుకృతాంశంలోని శబ్దాలను యథాతథంగా కాకుండా విషయాన్ని మాత్రమే అనుకరించటం పరోక్షానుకృతి. ఇది అర్థ ప్రధానం. ఇలాంటి వాక్యాలను కింద ఇస్తున్నాను.

"ఆతుమ సకలవ్యాపకమని తలపోసిన పిమ్మట
జాతియు గులాభిమానము జర్చింపనెరాదు
భూతవికారములన్నియు బురుషోత్తముడనినప్పుడు
పాతకముల బుణ్యంబుల పని తనకేలేదు" (*సంపుటం1.47:30*)

"ఆలకించి వినుమని అంబరభాగమునందు
నాలుగు దిక్కులనుండి నారదాదులు" (*సంపుటం1.314:208*)

"తిరువేంకటాచలాధిపుని గొలువుమని వెరవు చెప్పెడివారు వేరీ" (*సంపుటం1.128:88*)

"కడుజంచలములు కడునధ్రువములు కడునల్పములని కాదందురు" (*సంపుటం1.152:104*)

## 5.4.2.11.3. భావార్థక వాక్యాలు

ఈ వాక్యాలు 'అట' అనే క్రియలతో అంతమవుతాయి. ఒక వక్త తనతో వేరొకరు చెప్పిన వాక్యాన్ని ఇంకొకరితో చెప్పే సందర్భంలో ఈ అటమంత క్రియలు ప్రయోగించబడతాయి. ఈ ప్రయోగాలను గురించి ఆచార్య చేకూరి రామారావుగారు ఇలా అన్నారు.

"అట ప్రయోగించిన వాక్యాలను అనుకరణ వాక్యాలుగానే నిరూపించవచ్చు. వక్త ప్రయోగించిన వాక్య విశేష విషయం తాను స్వయంగా చెప్తున్న విషయం కాదని, ఇంకొకరు చెప్పిన విషయాన్ని తాను చెప్తున్నట్టుగా గ్రహించవలసి ఉంటుందని వక్త ఉద్దేశించినప్పుడు అట ప్రయోగం జరుగుతుంది. అట శబ్ద ప్రయోగంలో వ్యవహర్తలమధ్య కొన్ని భేదాలు కన్పిస్తున్నవి. గ్రామీణ వ్యవహారంలో అంట అనే రూపం ఎక్కువగా కన్పిస్తుంది. పట్టణాల్లో కొందరి భాషలో అట, మరికొందరి భాషలో ట అనే రూపాలున్నాయి." (*రామారావు, చేకూరి.2018:20*).

ఇలాంటి ప్రయోగాలు అన్నమయ్య సంకీర్తనల్లో ఉన్నాయి. వాటిని కింద పొందుపరుస్తున్నాను.

"మాటలాడ నేరుతునంటా మరి నేనహంకరింతును" (*సంపుటం2.304:203*)

"యెన్నో శిరసులట యెన్నో పాదములట
యెన్నరాని చేతులట యిట్టి నీమూర్తి" (*సంపుటం2.330:221*)

"కొడుకునున్నతమతి గోరి చంపెదువాడు కడబాతకుడుగాక ఘనుడట" (*సంపుటం1.235:158*)

"దైవకృతంబట చేతట తన కర్మాధీనంబట" (*సంపుటం1.79:54*)

## 5.4.2.12. కర్మణ్యర్థక వాక్యం (Passive Voice)

సకర్మక వాక్యాల్లో కర్త ప్రాధాన్యాన్ని తగ్గించడానికి భాషలు అనుసరించే ఒక పద్ధతి కర్మణి ప్రయోగం. "తెలుగులో కర్మణి వాక్యాలకు వ్యవహారంలో ప్రయోగం తక్కువ. కర్మణి వాక్యాలలో కర్తరి వాక్యాలలోని కర్త, కర్మపదాలు వ్యత్యస్తమవుతై." (*రామారావు, చేకూరి.2018:13-15*) తెలుగులో అన్నంత క్రియకు 'ఎవడు' చేరి అవి కర్మణ్యర్థాలుగా ప్రవర్తిస్తాయి. సంభాషణ శైలిలో ఈ వాక్యాలు అరుదు. రాజకీయ నాయకుల ప్రసంగాల్లో తరచూ కర్మణ్యార్థ ప్రయోగాలను ఉపయోగించడం సర్వసాధారణం. సామాన్య ప్రజల సంభాషణల్లో కర్మణ్యర్థాలు నొక్కి, వేలెత్తిచూపే సందర్భంలో, ఇంకా ఇతర సందర్భాల్లో కొంతవరకూ వాడబడుతున్నాయి. అన్నమాచార్యుల సంకీర్తనల్లో ఉన్న అలాంటి ప్రయోగాలను కింద ఇస్తున్నాను.

"జాతిగా గర్మపు సంకెళ్ళబడి
కాలచేత భేదైతివే చిలుకా" (*సంపుటం1.50:32*)

"గడ్డబడి ఈతకాండ్లౌటగాని
ఒడ్డునడుమ నీదనోపరెవ్వరును" (*సంపుటం1.230:155*)

"వివిధ నిర్బంధముల వెడలద్రోయక నన్ను
భవసాగరములబడ బడజేతురా" (*సంపుటం1.243:163*)

"మోహంబుచే వెనుక ముందెరుగలేక తమ
దేహసుఖములు మరిగి తిరిగేరుగాక" (*సంపుటం1.248:166*)

"తిరువేంకటాచలాధిపు కృపచేగాని

మనుచేతి పెనుదెవులు మానకపోయె" (*సంపుటం1.273:183*)

"పాపకర్మములు జంపగ శక్తిలేదుగన కోపబుద్ధులచేత కొరమాలవలసె" (*సంపుటం1.221:147*)

ఇలా అన్నమయ్య సహజ వ్యావహారిక శైలిలో, వాడుకభాషలో సంకీర్తన రచన చేశారు. అందుకే ఆయన చేసిన వాక్య నిర్మాణం ఏ కాలానికైనా సరిపోతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

★★★★★

# ౬. ముగింపు

అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు ప్రథమ, ద్వితీయ సంపుటాలలోని కీర్తనల పరంగా జరిగిన '**అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు : సాహిత్య వైచిత్రి**' అనే ఈ పరిశోధనలోని ప్రధాన అంశాల క్రోడీకరణ ఈ విభాగంలో ఉంది.

## 6.1. పరిశోధనలో గమనించిన అంశాల వివరాలు

### మొదటి అధ్యాయం: అన్నమయ్య జీవితం, రచనలు – ఇతర వాగ్గేయకారులు:

ఈ అధ్యాయంలో అన్నమయ్య జీవిత విశేషాలు, రచనలు చేసిన సందర్భాలు, అన్నమయ్యను అనుసరించిన సంగీతకారుల జీవితాలు, వారి రచనల గురించి పేర్కోవడం జరిగింది. వచన రచనగా ప్రారంభమైన గేయ ప్రక్రియ నేడు పాటగా వృద్ధి చెందడానికి దోహదపడిన పరిస్థితులను విశ్లేషించాను.

తెలుగులో పద సాహిత్యం పద్య సాహిత్యం కంటే ముందు పుట్టింది. నన్నయ్య నుండి దక్షిణాంధ్ర యుగంవరకూ పద్య సాహిత్యం గౌరవాదరాలు పొందింది. పద సాహిత్యం జన వ్యవహారంలో ఉన్నప్పటికీ రాజుల, కవుల గౌరవాన్ని పొందలేదని అందుకు తగిన కారణాలను వివరించాను. అలాగే తిరుమల గోవింద నామ స్మరణలు అంతగా విస్తరించడానికి అన్నమయ్య సంకీర్తనలు దోహదం చేసిన తీరును వివరించాను. అన్నమయ్య జీవితాన్ని గురించి చిన్నన్న చెప్పిన "వనజాక్ష నేడు మావంటి వారలకు" అనే ద్విపదను ఉదహరించాను.

అన్నమయ్య వంశీయులు అనే ఉపవిభాగంలో శైవులుగా ఉన్న అన్నమయ్య వంశీయులు తాళ్ళపాకకు రావడానికి, వైష్ణవులుగా మారడానికి గల కారణాలను వివరించాను. అన్నమయ్య జననం అనే ఉపవిభాగంలో అన్నమయ్య జనన విషయంలో గల చారిత్రక ఆధారాలు, పండితులు వెలిబుచ్చిన అభిప్రాయభేదాలను వివరించాను. అన్నమయ్య బాల్యం అనే అంశంలో చిన్నప్పటినుండి అన్నమయ్య జ్ఞానంలో, దైవభక్తిలో ఎదిగిన విధానాన్ని, తల్లిదండ్రులు అన్నమయ్యను పెంచిన తీరును వివరించాను. అన్నమయ్య విద్యాభ్యాసం అనే ఉపవిభాగంలో ఆయన చదువు సాగిన తీరును వివరించాను.

అన్నమయ్య తిరుమలకు వెళ్ళటం అనే ఉపవిభాగంలో అన్నమయ్య తిరుమలకు వెళ్ళడానికి దోహదపడిన కారణాలనూ, ఆయన చూసిన ప్రదేశాలనూ, అలమేలుమంగమ్మ దర్శనానికి పడ్డ బీజాలనూ వివరించాను. అమ్మవారి దర్శనం, అన్నమయ్య తిరుమలను దర్శించిన విధానం, ఘనవిష్ణువుచే పంచ సంస్కారాలు పొందిన విధం, అన్నమయ్య వైవాహిక జీవితం, అహోబిలంలో విశిష్టాద్వైతాన్ని అభ్యసించడం ద్వారా సంకీర్తనల రచనలో అన్నమయ్య మెరుగుపడిన విధానం, అన్నమయ్య నరసింగరాయల స్నేహం, అన్నమయ్య చెరసాలపాలు కావడం, అన్నమయ్య రచనలు, బిరుదులు, చూపిన మహిమలు, దర్శించిన క్షేత్రాలు మొదలైన అంశాల ద్వారా అన్నమయ్య జీవితంలో జరిగిన ముఖ్యమైన సంఘటనలను విశ్లేషించాను.

ఇతర వాగ్గేయకారులు అనే ఉపవిభాగంలో జయదేవుడు, కృష్ణమాచార్యుడు అన్నమయ్యకు మార్గదర్శకులైన విధానం, అన్నమయ్య పురందరదాసుల సమాగమం, క్షేత్రయ్య, శ్యామశాస్త్రి, రామదాసు, త్యాగరాజు, ముత్తుస్వామి, సారంగపాణి మొదలైన వాగ్గేయకారులు రచించిన కీర్తన, పదం, కృతులకు అన్నమయ్య ఎలా మార్గదర్శకుడయ్యారో వివరించాను.

సంకీర్తనల వెలికితీతలో, పరిష్కరణలో ప్రభాకరశాస్త్రి కృషి, అన్నమయ్య సంకీర్తనల ప్రచారంలో తిరుమల తిరుపతి దేవస్థానముల వారి కృషిని ఆధారగతంగా ఈ అధ్యాయంలో వివరించాను.

## రెండవ అధ్యాయం: అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలలో కవితా సౌందర్యం

అన్నమయ్య సంకీర్తనలు నేటికీ నిలిచి ఉండడానికి కారణాలనూ, భాషనూ, ఇంకా అనేక అంశాలను *సంకీర్తనా లక్షణసారము* అనే గ్రంథంలోని పద్యాల ఆధారంగా ఈ అధ్యాయంలో వివరించాను.

అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లోని అంశాలను... సంసారంపై నిరసన, పూజలు, ఉత్సవ విశేషాలు, పారమార్థిక అంశాలుగా వింగడించుకొని, కీర్తనల ఆధారంగా

విశ్లేషించాను. అన్నమయ్య బోధలు అనే ఉపవిభాగాన్ని సామాజిక బోధ, తత్త్వబోధ, స్వకీయ బోధ, వేడుకోలు, లోకానుభవాలు, దేవునితో వాదులాట – నిరసనలు, పాప పుణ్యాల విశ్లేషణ, అలకలు, రాజులపై నిరసన అనే అంశాలుగా వర్గీకరించుకొని, సంకీర్తనల్లోని అంశాల ఆధారంగా విశ్లేషించాను.

అన్నమయ్య పాత్ర చిత్రణ అనే ఉపవిభాగంలో వేంకటేశ్వరుడు, రాముడు, హనుమంతుడు, నరసింహుడు మొదలైన పాత్రలను అన్నమయ్య తన సంకీర్తనల్లో తీర్చిన విధాన్ని వివరించాను. అన్నమయ్య వర్ణనలు అనే ఉపవిభాగంలో తిరుపతి, తిరుమల పరిసరాల వర్ణనలు, ప్రాకృతిక వర్ణనలు, యుద్ధ వర్ణనలను సంకీర్తనా బద్ధంగా వివరించాను.

అన్నమయ్య శైలి అనే ఉపవిభాగంలో అన్నమయ్య కొన్ని సందర్భాల్లో సరళంగానూ, కొన్ని సమయాల్లో కష్టతరంగానూ సంకీర్తనా రచనలో పాటించిన శైలిని పేర్కొంటూ, అందుకు తగిన కారణాలను విశ్లేషించాను. ప్రబంధ శైలి, ప్రబంధ కవులకు మార్గదర్శకుడు అనే ఉపవిభాగంలో అన్నమయ్య అనుసరించిన శైలి ప్రబంధకవులకు అనుసరణీయమైన విధానాన్ని చెప్పాను.

## మూడవ అధ్యాయం: అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో సంభాషణలు

ఈ అధ్యాయంలో కవులు, వాగ్గేయకారులు దేవునితో మాట్లాడడాన్ని సంభాషణగా భావించిన విధానాన్ని వివరించాను. అలాగే ఒకరితో ఒకరు, వారిలో వారు, దేవునికి ఆయా పవిత్ర స్థలాల్లో చేసే విన్నపాలను కూడా సంభాషణగా గ్రహించి విశ్లేషించాను.

అన్నమయ్య సంభాషణలను స్వామితో సంభాషణ, అంతస్సంభాషణ, పూజా సంబంధిత సంభాషణలు, బహిస్సంభాషణలు, యశోద గోపికలు ఇతరుల సంభాషణలు, జీవాత్మ పరమాత్మ సంబంధం, నిజమైన వైష్ణవుడు, సంసారసంబంధ సంభాషణలుగా వింగడించి, విశ్లేషించాను.

స్వామితో సంభాషణలను మళ్ళీ అంతర్యామి, పశ్చాత్తాపం, నిందాత్మకం (స్వయం నింద, దైవ నింద), సేవా సంబంధ సంభాషణలు, స్వామి శౌర్య ప్రతాపాలు, అవతారాలు అనే ఉపవిభాగాలుగా వింగడించుకొని, సంకీర్తనల్లో అన్నమయ్య చెప్పిన విశేషాంశాల ఆధారంగా చర్చించాను. ఈ సంభాషణల్లో స్వామితో తన కష్టాలను అన్నమయ్య చెప్పుకున్న తీరును వివరించాను.

బహిస్సంభాషణలు అనే ఉపవిభాగాన్ని మళ్ళీ తత్త్వ సంభాషణలు, పాప పుణ్యాల విశ్లేషణ, పాద స్మరణ, రాజులు, అధికారులపై నిరసన, స్త్రీలపై నిరసన, ఉపదేశాత్మక సంభాషణలు, నామ సంకీర్తనౌచిత్యం, తిరుమల వర్ణనలు అనే ఉపవిభాగాలుగా చర్చించాను. ఈ సంభాషణల్లో అన్నమయ్య సమాజంతో మాట్లాడిన తీరును, తత్త్వగతంగా ఉన్న అన్నమయ్య బోధలను, భగవంతునిపట్ల మనుషుల ప్రవర్తనలను అన్నమయ్య విశ్లేషించిన విధాన్ని చర్చించాను. అంతస్సంభాషణల్లో తనకు తాను బోధ చేసుకోవడం, నిందించుకోవడం, తనపై తానే విసుగు చెందడం లాంటి అంశాలను సంకీర్తనల ఆధారంగా వర్ణించాను.

అసలైన వైష్ణవుడు అనే ఉపవిభాగంలో వైష్ణవులు ఉండాల్సిన తీరును, పాటించాల్సిన పద్ధతులను, విష్ణువును ప్రకటించాల్సిన ఆవశ్యకతను అన్నమయ్య ప్రస్తావించిన రీతిని వివరించాను. జీవాత్మ, పరమాత్మ సంబంధం అనే ఉపవిభాగంలో దేవుడు, జీవుల మధ్య తారతమ్యాలు, భేదాలు, జీవుడు దేవునిలో ఐక్యమై ఉండే తీరును సంకీర్తనలను ఆధారం చేసుకొని వివరించాను.

సంసార సంకీర్తనల్లో సంభాషణలు అనే ఉపవిభాగంలో సంసారంవల్ల కలిగే లాభనష్టాలు, భగవంతునిలో ఉండాల్సిన విధానం, సంసార జీవితాన్ని నెట్టుకు రావాల్సిన పద్ధతులను అన్నమయ్య చెప్పిన విధాన్ని విశ్లేషించాను.

పూజా సంభాషణలు అనే ఉపవిభాగంలో స్వామికి తిరుమలలో ప్రతి రోజూ జరుగుతున్న సుప్రభాత సేవలు, ఆరగింపు సేవలు, ఊరేగింపు సేవలు, ఊయల సేవలు,

మంగళహారతులు మొదలైన సేవలను సంకీర్తనాబద్ధం చేసి, స్వామికి జీవత్వాన్ని కల్పించిన విధాన్ని వివరించాను.

**నాలుగవ అధ్యాయం: అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో స్వర, లయ, అలంకార పోషణ**

ఈ అధ్యాయంలో సాహిత్యంతోబాటు సంగీత పరంగా అన్నమయ్య సంకీర్తనలు రాణిస్తున్న విధానాన్ని చర్చించడం జరిగింది. అలాగే కీర్తన, పదం, సంకీర్తన, కృతి మొదలైన అంశాలను వివరించడం జరిగింది.

గానం దాని ప్రాధాన్యం అనే ఉపవిభాగంలో 'శిశుర్వేత్తి పశుర్వేత్తి' అని మన పూర్వికులు పాటకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని ప్రస్తావించాను. అలాగే గీతం, వాద్యం అనేవి తాళాన్ని ఆధారం చేసుకొని ప్రవర్తిల్లుతున్నాయని పేర్కోడం జరిగింది. జానపదుల కూనిరాగాలనుండి నేడు పాట వృద్ధి చెందిన విధానాన్ని చర్చించడం జరిగింది.

అన్నమయ్య సంకీర్తనల్లో సంగీతాంశాలైన స్వర ప్రస్తారం, లయానుగుణమైన నడక, నాదం మొదలైన అంశాల చర్చను చేశాను.

నాదం అనే ఉపవిభాగంలో ఆయా నిఘంటువులు చెప్పిన అర్థాలను ప్రస్తావించడం జరిగింది. *శబ్ద రత్నాకరంలో* 'శబ్దం', 'మ్రోత', బ్రౌణ్య తెలుగు నిఘంటువులో Sound; a note, a ringing in the Ears అని అర్థాలు చెప్పగా కొన్ని నాదానికి కొట్టబడినదని, మరికొన్ని ఆహతం, అనాహతం అని సంగీతపరంగా అర్థాన్ని చెప్పాయి. 1966లో వెలువరించిన ఆంధ్ర శబ్ద రత్నాకరంలో చెలమచెర్ల రంగాచార్యులు 'శరీరమందలి షట్చక్రములలో నాల్గవది, హృదయమున సుషుమ్న నడుమనున్న పండ్రెండు దళములు గల పద్మము' (తంత్ర) అనే అర్థాలను చెప్పారు. వాటన్నింటినీ పేర్కొంటూ, *సంగీత సమయసారము*, *గానకళాబోధిని* లాంటి గ్రంథాలు చెప్పిన నిర్వచనాలతో పై అర్థాలను సరిపోల్చడం జరిగింది.

శ్రుతి అనే ఉపవిభాగంలో శ్రుతి అంటే చెవి అనే సాధారణ అర్థంతోబాటు స్థాయిలకు శ్రుతి ఆధారమైన తీరు, 'సిద్ధ', 'ప్రభావతి', 'కాంత, 'సుప్రభ', 'శిఖ', 'దీప్తిమతి', 'ఉగ్ర', 'హలది', 'నీవ్రి', 'ధీర', 'క్షాంతి', 'విభూతి' మొదలైన శ్రుతులను పేర్కోడం జరిగింది.

స్వరం అనే ఉపవిభాగంలో షడ్జమం, రిషభం, గాంధారం, మధ్యమం, పంచమం, దైవతం, నిషాదం అనే సప్త స్వరాల పుట్టుక, ఆధార జంతువులు, స్వర స్థానాలు, ప్రకృతి వికృతి స్వరాలు, ద్వాదశ స్వర స్థానాలు, కోమల తీవ్ర స్వరాల మధ్య భేదం మొదలైన అంశాలను పట్టిక రూపంలో వివరించడం జరిగింది. అలాగే ఆరోహణ, అవరోహణ క్రమాన్ని పేర్కోడం జరిగింది.

స్థాయిలు అనే అంశంలో మంద్ర, మధ్యమ, తారా స్థాయిలను చర్చించడం జరిగింది. ఈ స్థాయిలవల్ల గానానికి అందం చేకూరుతుందని చెప్పడం జరిగింది.

రాగాలు అనే ఉపవిభాగంలో రాగాలు సమయాన్ని, సందర్భాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి? మానవునిలోని రసాలను ఏ విధంగా ఉత్పన్నం చేస్తాయి? అనే విషయాలను చర్చించడం జరిగింది. జన్య జనక రాగాలు, మేళకర్త, అప్రధాన రాగాలను గురించి చెప్తూ, కొన్ని అప్రధాన రాగాలు నేడు మేళకర్త రాగాలకంటే విరివిగా వాడబడుతున్న విధానాన్ని చర్చించడం జరిగింది. సంపూర్ణ వర్జ్య రాగాల మధ్య భేదాలను వివరించడం జరిగింది.

మేళకర్త రాగాలు అనే ఉపవిభాగంలో మేళకర్త రాగాల లక్షణాలను పేర్కొనడం జరిగింది. ఈ 72 రాగాల్లో మొదటి 36 రాగాలు శుద్ధ మధ్యమాన్ని, తక్కిన రాగాలు ప్రతిమధ్యమాన్ని కలిగి ఉన్నాయి. కాబట్టి మధ్యమాన్ని 'Bisecting line' అన్నారు. ఈ రాగాలు 12 చక్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. మధ్యమం అక్కా చెల్లెళ్ళుగా మారి ఈ మార్పుకు కారణమైంది. వాటితోబాటు ఈ మేళకర్త రాగాల పేర్లు, వాటినుండి జనించిన రాగాల పేర్లు ఇవ్వడం జరిగింది.

కటపయాది సంఖ్య అనే ఉపవిభాగంలో కటపయాది సూత్రంలోని కదినవ, టదినవ, పాదిపంచ, యాద్యష్ట అనే ఉపసూత్రాల ద్వారా రాగాలను లెక్కించే విధానం, ఈ సూత్రాలకు లొంగని రత్నాంగి మొదలైన రాగాలను ఇవ్వడం జరిగింది.

అన్నమయ్య సంకీర్తనల్లోని రాగాలు అనే ఉపవిభాగంలో అన్నమయ్య ఉపయోగించిన శంకరాభరణం, దేశాక్షి, గుండక్రియ, రామక్రియ మొదలైన 47 రాగాల పేర్లను పేర్కోవడం జరిగింది. కాల క్రమంలో అన్నమయ్య సంకీర్తనలు రాగాలను మార్చుకొని, నేటి కాలానికి అనుగుణంగా తమను తాము తీర్చుకుంటున్న తీరును, నేడు పాడేందుకు గాయకులు ఉపయోగిస్తున్న రాగ లక్షణాలను తెలపడం జరిగింది. అలాగే సంపూర్ణ సంపూర్ణ, షాడవ సంపూర్ణ, సంపూర్ణ ఔడవ, ఔడవ సంపూర్ణ, షాడవ ఔడవ, ఔడవ షాడవ రాగాల లక్షణాలను చర్చించడం జరిగింది.

తాళం అనే ఉపవిభాగంలో శ్రుతి లయలు పాటకు తల్లిదండ్రులుగా ప్రవర్తిల్లుతున్నాయి అనేందుకు గల కారణాలను వివరించాను. 'సంగీతానికి తాళం, సూర్యునికి వెలుతురు, బంగారానికి పసిమి వంటిది' అన్న వింజమూరి నరసింహాచార్యుల మాటను ప్రస్తావించాను.

తాళం పుట్టుక అనే అంశంలో ఛందస్సులోని గురు, లఘు, ప్లుతాక్షరాల్లాగా తాళంలోని గురు లఘు ద్రుతాలు మొదలైన హ్రస్వ దీర్ఘాక్షరాల ద్వారా లెక్కించడాన్ని వివరించాను. గ్రహించడానికి వీలయ్యే కాల పరిమితిని మాత్ర అంటారు. తకారం శంకర భీజాక్షరం, ళకారం శక్తి భీజాక్షరంగానూ, అగ్ని, ప్రాణాల మిశ్రమంగానూ మన పూర్వులు తాళానికి ఇచ్చిన ప్రాధాన్యతను పేర్కొనడం జరిగింది.

సప్త తాళాలు అనే ఉపవిభాగంలో "ధ్రువ మఠ్య రూపకస్య ఝంపా త్రిపుట ఏవచ" అనే శ్లోకాన్ని ఉదహరిస్తూ, సప్త తాళాలు ఏడు రోజులు, సప్త నక్షత్రాలు, సప్త వర్ణాలుగా సంభావించేందుకు కారణాలను పేర్కొన్నాను. ఆ తాళాలు మనలోని భావాలను ప్రభావితం చేస్తున్న విధాన్ని చర్చించాను. షడంగాలు అనే ఉపవిభాగంలో లఘువు, ద్రుతం, అనుద్రుతం, గురువు, ప్లుతం, కాకపాదం అనే ఆరు అంగాల ప్రాధాన్యతను వివరించడం జరిగింది.

కాలం అనే ఉపవిభాగంలో ఒక అక్షర కాలాన్ని అనుద్రుతమని, రెండక్షరాల కాలాన్ని ద్రుతమని అంటారు. వీటి మధ్య గల కాలభేదాలను వివరించడం జరిగింది. తాళం వేసేటప్పుడు గురు, లఘువుల పద్ధతిని పాటించే విధాన్ని చర్చించడం జరిగింది. త్రికాలాలు అనే ఉపవిభాగంలో కాలం వేగాన్నిబట్టి స్వరాలు అంటిపెట్టుకొనే విధాన్ని, ఆవర్తాన్ని వివరించాను.

తాళం వేసే పద్ధతి అనే ఉపవిభాగంలో కుడి తొడపై కుడిచేత్తో దెబ్బ తరువాత చిటికెన వేలు నుండి స్వరాక్షరాలను ఎలా లెక్క పెట్టాలో తెలియజేయబడింది. తాళజాతులు అనే ఉపవిభాగంలో త్రిస్ర, చతురస్ర, ఖండ, మిశ్ర, సంకీర్ణ జాతుల భేదాలను, లఘు జాతి భేదాలను వివరించడం జరిగింది. ద్రుతం ఏకతాళంలో లేదు. అనుద్రుతం ఝంపెలో తప్ప మిగిలిన తాళాల్లో లేదు. తక్కిన గురు, ప్లుత, కాకపాదాలు 108 తాళాల్లో కనబడతాయి.

తాళ విభజన అనే ఉపవిభాగంలో సప్త తాళాల్లో ఒక్కొక్కటి అయిదు జాతులుగా విభజించబడిన విధాన్ని, లఘువునుబట్టి తాళ ప్రక్రియలు మారే పద్ధతిని, తాళంలోని అక్షరాల సంఖ్యనుబట్టి, ఘాతాలనుబట్టి తాళం ప్రవర్తిల్లే రీతిని చర్చించాను. అలాగే తాళ నామాన్నిబట్టి దాని జాతి గోచరమవుతుందని వివరించడం జరిగింది.

చాపు తాళం అనే ఉపవిభాగంలో దెబ్బ, ఘాతతో చాపును లెక్కిస్తారని తెలిపాను. చాపును త్రిస్ర, ఖండ, మిశ్రగా వర్గీకరించబడిందని, చాపును మిశ్రచాపుగా గుర్తించాలని, దీన్ని జానపదులు ఎక్కువగా ఉపయోగిస్తున్నారని అందుకు గల కారణాలను వివరించాను. దేశాది తాళం రెండు ఘాతలు, ఒక విసర్జితం కలిగి ఉంది. ముప్పాతిక కాలం అనంతరం పాటను ప్రారంభిస్తారని తెలిపాను. మధ్యాది తాళం రెండు ఘాతలు, ఒక విసర్జితాన్ని కలిగి దేశాదికంటే వేగంగా ఉంటూ, అర కాలం తరువాత పాట ప్రారంభమవుతుందని తెలిపాను.

తాళదశ ప్రాణాలు అనే ఉపవిభాగంలో కాల, మార్గ, క్రియ, అంగ, గ్రహ, జాతి, కళ, లయ, యతి, ప్రస్తారకాలుగా వర్గీకరించుకొని ఒక్కొక్కదాన్ని గురించి విస్తరించి చెప్పడం జరిగింది.

వీటిలో కాల, మార్గ, క్రియ, అంగ, గ్రహ అనే అయిదింటిని మహా ప్రాణాలంటారు. తక్కిన జాతి, కళ, లయ, యతి, ప్రస్తారకాలు ఉపప్రాణాలుగా పరిగణిస్తున్నారు. మార్గ ప్రాణాన్ని మళ్ళీ దక్షిణ (8) వార్తికం (8) చిత్ర(2) చిత్రతర (1) చిత్రతమ (1 / 2) అతిచిత్రతమ (1 / 4) మార్గాలుగా విభజించి విశ్లేషించడం జరిగింది.

క్రియా ప్రాణాన్ని సశబ్ద, నిశ్శబ్ద మార్గ క్రియలుగానూ, దేశీ క్రియలుగానూ వివరించడం జరిగింది. అంగ ప్రాణంలో అనుద్రుతం, ద్రుతం, ద్రుతవిరామం, లఘువు, లఘువిరామం, లఘుద్రుతం, లఘుద్రుత విరామం, గురువు, గురువిరామం, గురుద్రుతం, గురుద్రుత విరామం, ప్లుతం, ప్లుత విరామం, ప్లుత ద్రుతం, ప్లుత ద్రుత విరామం, కాకపాదం అనేవి షోడశాంగాల్లో నేడు అమల్లో ఉన్న షడంగాలను గురించి వివరించడం జరిగింది. సమ గ్రహం, విషమ గ్రహం ప్రవర్తిల్లే తీరును చర్చించాను.

జాతి ప్రాణంలో పంచజాతులే కాకుండా దివ్య, సింహ, లఘువు, వాద్య కర్ణాటక అక్షరాలను కలిగి ఉన్న లఘువులను ప్రస్తావించడం జరిగింది. అలాగే చతురస్ర జాతి ప్రాముఖ్యాన్ని, మనుషులనుబట్టి జాతుల విభజన జరిగిందని వివరించాను.

కళా ప్రాణంలో ఏకకళ, ద్వికళ, త్రికళ, చతుష్కళ, చచ్చత్పుట, చాచత్పుట, షట్పితా పుత్రిక, సంపద్వేష్ణ, ఉదట్టం అనే కళలను, వర్ధమానకళ, నష్టకళలను పేర్కొనడం జరిగింది. లయ ప్రాణంలో విలంబిత, మధ్య, ద్రుత లయలను పేర్కోడం జరిగింది. యతి ప్రాణంలో సమయతి, స్రోతోవహ యతి, గోపుచ్ఛ యతి, ఢమరుయతి, మృదంగ యతి, విషమ యతులను చర్చించాను. అలాగే యతులకు మార్గాలకు ఉన్న సంబంధాన్ని తెలపడం జరిగింది.

ప్రస్తార ప్రాణం అనే ఉపవిభాగంలో ప్రస్తారం అంటే విస్తరింపజేయడం అనే అర్థాన్ని పేర్కొంటూ, నష్టం, ఉద్దిష్టం, పాతాళం, మహాపాతాళం, అనుద్రుతమెరువు, ద్రుతమెరువు, ద్రుతశేఖరమెరువు, లఘుమెరువు, గురుమెరువు, ప్లుతమెరువు, కాకపాదమెరువు,

సంయోగమెరువు, ఖండప్రస్తారం, యతి ప్రస్తారాలతోబాటు వాటిని అంటిపెట్టుకున్న 108 తాళాల పేర్లను రాయడం జరిగింది.

అన్నమయ్య సంకీర్తనల్లో అలంకారాలు అనే ఉపవిభాగంలో సంకీర్తనల్లో అలంకార పోషణ జరిగిన విధాన్ని తెలిపాను. వివిధ కావ్య నిర్వచనాలతో అన్నమయ్య సంకీర్తనలను సరిపోల్చి, పద్య కావ్యానికి ఎంతమాత్రం తక్కువ కాదని పేర్కోడం జరిగింది.

ఉపమ, వ్యాజస్తుతి, వ్యాజనింద,వృత్యానుప్రాసం, ఛేకానుప్రాసం, అంత్యానుప్రాసం, సందేహ, భ్రాంతిమదలంకారాలు, రూపకం, శ్లేష, అతిశయోక్తి, స్వభావోక్తి అలంకారాలను ఈ ఉపవిభాగంలో చర్చించాను.

## అయిదవ అధ్యాయం: అన్నమయ్య సంకీర్తనల్లో వాక్య విన్యాసం

ఈ అధ్యాయంలో అన్నమయ్య వాడిన భాష ఆ నాటి వ్యావహారికమని గౌరిపెద్ది రామసుబ్బ శర్మ లాంటి పండితులు చేసిన చర్చను పేర్కోవడం జరిగింది. విన్యాసం, అర్థ వివరణ అనే ఉపవిభాగంలో విన్యాసం అనే మాటకు వివిధ శాస్త్రాలు, నిఘంటువులు ఇచ్చిన అర్థాలను గ్రహించి, చక్కని అమరిక, ప్రస్తారం అనే అర్థాన్ని చెప్పడం జరిగింది.

వాక్య నిర్వచనం అనే ఉపవిభాగంలో యోగ్యత, ఆకాంక్షలు కలిగి ఆసత్తితో కూడిన పద సముదాయాన్ని వాక్యం అని చెప్పబడింది. అలాగే పాశ్చాత్యుల నిర్వచనాలను పేర్కొన్నాను. వాక్య భేదాలు అనే ఉపవిభాగంలో స్వరూప విభాగంలో సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలుగా, స్వభావ విభాగంలో ప్రశ్నార్థక, ఆశ్చర్యార్థక, ఉభయ సంప్రార్థనార్థక, సందేహార్థక, సంబోధనార్థక, నిర్ధారక, సామర్థ్యార్థక, అనుమత్యార్థక వాక్యాలుగా విభజించి అనుశీలించడం జరిగింది. సామాన్య వాక్య విభాగంలోనే నిశ్చయార్థక వాక్యాలను చర్చించాను. సంశ్లిష్ట వాక్యం అనే విభాగంలో క్త్వార్థక, వ్యతిరేక క్త్వార్థక, శత్రర్థక, అన్నంత, చేదర్థక, అప్యర్థక సంశ్లిష్ట వాక్యాలను అధ్యయనం చేయడం జరిగింది.

అనుకరణ వాక్యాల్లో ప్రత్యక్ష్య, పరోక్షానుకరణ వాక్యాలను, భావార్థక వాక్యాలను చర్చించాను. ప్రశ్నార్థక వాక్యాల్లో విషయ నిర్ధారణ, విషయ విశ్లేషణ వాక్యాలను చర్చించాను.

కర్మణ్యర్థక వాక్యాలను అన్నమయ్య ఎలా ఉపయోగించుకున్నారో? అవి నేటి కాలానికి ఎలా ఉపయోగపడుతున్నాయో వివరించాను.

## 6.2. పరిశోధన ఫలితాలు:

### మొదటి అధ్యాయం: అన్నమయ్య జీవితం, రచనలు – ఇతర వాగ్గేయకారులు

1. 12వ శతాబ్దంలో *సింహగిరి నరహరి వచనాలను* రాసిన కృష్ణమాచార్యులు తెలుగులో మొదటి పదకర్తగా పేరొందారు. ఇంచుమించు రెండు శతాబ్దాల తరువాత తెలుగులో పదసాహిత్యంలో విస్తృతమైన మార్పు వచ్చింది. దానికి కారణం పదసాహిత్య పితామహులు అన్నమాచార్యులు. (చూ.1.)

2. అన్నమయ్య తల్లిదండ్రులకు ఆ వేంకటేశ్వరునిపై భక్తి ప్రపత్తులు ఉండడంచేత అన్నమయ్య కూడా వారినే అనుసరించారు. (చూ.4.)

3. ఎవరి జీవితంలోనైనా విద్య నేర్పిన గురువు చాలా బలీయమైన పాత్ర పోషిస్తారు. అన్నమయ్యకు సమస్తవిద్యలు ఆ వేంకటేశ్వరుని దయవల్ల అబ్బాయని చెప్పడం చిన్నన్న ఉద్దేశం. (చూ.4.)

4. ఘనవిష్ణువు అన్నమయ్యకు వేద శాస్త్రానుసారంగా విష్ణు దీక్షను, పంచ సంస్కారాలను ఇచ్చారు. సకలజీవుల్లో స్వామినే చూడాలని, 'సర్వం విష్ణుమయం' అనే సూక్తిలోని అంతరార్థాన్ని అన్నమయ్యకు బోధించారు. (చూ.9.)

5. అహోబలంలో శఠగోపయతి సమక్షంలో రామానుజులవారి విశిష్టాద్వైత సిద్ధాంత గ్రంథాలను, *నాలాయిర* ప్రబంధాన్ని, అనేక శాస్త్ర రహస్యాలను, లక్ష్మీదేవి తత్త్వాన్ని తెలుసుకున్నారు. (చూ.10.)

6. నరసింగరాయల రాజ్యాన్ని వీడినప్పటినుండి అన్నమాచార్యులు తన సంకీర్తనల ద్వారా వైష్ణవాన్ని, రామానుజుల తత్త్వాన్ని ప్రచారం చేశారు. (చూ.12.)

7. జయదేవుడు అన్నమయ్యకు రచనలో మార్గదర్శకుడు. తన *గీతగోవిందం* అనే కావ్యంలో సంగీత, సాహిత్యాలను నాట్యానికి అనుగుణంగా రచించిన వాగ్గేయకారుడు. (చూ.18.)

8. కీర్తనలను రచించకుండా ఒక లయతో కూడుకున్న వచనాలను రాసి ప్రఖ్యాతి పొందిన వాడు కృష్ణమాచార్యుడు. (చూ.20.)

9. సంగీత త్రిమూర్తులు తిరువారూర్ పరిసర ప్రాంతాలలో పుట్టడం ఒక విశేషమైతే వారి జననాలను గురించి వారి తల్లిదండ్రులకు ముందుగానే తెలియడం మరింత విశేషం. (చూ.27.)

## రెండవ అధ్యాయం: అన్నమయ్య సంకీర్తనలలో కవితా సౌందర్యం

10. మొట్టమొదటిగా రాజాశ్రయాన్ని పొందినవారు, దాన్ని తిరస్కరించినవాడు కూడా అన్నమాచార్యులే. ఆయన ప్రబంధ కవులకు మార్గదర్శి. (చూ.40.)

11. ఏ దేవుణ్ణి స్తుతించినా ఆయన దృష్టిలో వేంకటేశ్వరుడే సాక్షాత్కరించేవారు. కాబట్టి అన్నమయ్య కీర్తనల్లో దేవుళ్ళ మధ్య అభేదం మనకు కనిపిస్తుంది. ఆ కీర్తనల్లో తాత్త్వికత, పారమార్థికత, భక్తి తత్పరత తొణికిసలాడతాయి. (చూ.43.)

12. అన్నమయ్య కీర్తనలు వైష్ణవానికి ప్రచారంగా భావించినప్పటికీ ఇతర ఆచారాల దూషణ మనకు అంతగా కనబడదు. ఆ సంకీర్తనలకు అన్నమయ్య ఉపయోగించిన సంగీతం మరింత శోభను కలిగించింది. చెప్పదలచుకున్న భావాలు గాఢంగా, సుస్పష్టంగా చెప్పారు. (చూ.44.)

13. అన్నమయ్య ఆధ్యాత్మికవాది అయినా కుటుంబానికి, ప్రజలకు దూరంగా ఉండలేదు. ఆయన నెరపిన గృహస్థాశ్రమం చెప్పుకోదగ్గది. (చూ.44.)

14. అన్నమయ్యకు సంసారం ఆ భగవన్నామ స్మరణకు అడ్డురాలేదు. కానీ సంకీర్తనల్లో మాత్రం సంసారం భగవంతుని స్మరణకు అడ్డుగా పేర్కొన్నారు. ఇలా సంసారంపై తన నిరసనను తెలియజేసిన అన్నమయ్య ఇద్దరు భార్యలతో సంసారసాగరాన్ని బాగానే ఈదుకురాగలిగారు. (చూ.49.)

15. అన్నమయ్య తన సంకీర్తనల్లో సమాజానికి ప్రాధాన్యం ఇచ్చారు. అన్ని మతగ్రంథాలు 'నీ పొరుగువారి పట్ల ప్రేమభావాన్ని కలిగి ఉండాల'ని బోధిస్తున్నాయి. అన్నమయ్య కాలం నాటి సమాజంలో అనేక భేదాలున్నాయని కొన్ని కీర్తనలవల్ల మనకు తెలుస్తోంది. (చూ.58.)

16. ఎక్కడో మారుమూలల్లోని తెలుగుపదాలను వెలికితీసి, కొన్ని సంస్కృత పదాలకు కొత్త పదబంధాలను సృష్టించి అన్నమయ్య ప్రదర్శించిన పదాడంబరత అంతా ఇంతా కాదు. అందుకే పండితులు ఆయనను తిక్కనతో పోల్చారు. (చూ.124.)

**మూడవ అధ్యాయం: అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో సంభాషణలు:**

17. సంకీర్తనలను జాగ్రత్తగా పరిశీలిస్తే, అన్నమయ్య స్వామితో, సమాజంతో, చెట్టుతో, పుట్టతో, లోకంలోని ప్రాణులతో.. అందరితోనూ సంభాషించారు. ఆ కోణంలో చూస్తే ప్రపంచ భాషల్లోని సాహిత్యమంతా సంభాషణమయమే! (చూ.132.)

18. అన్నమయ్య తన సంకీర్తనల్లో గౌతమబుద్ధుని కూడా దశావతారాల్లో ఒకడిగా భావించి, మతసామరస్యాన్ని తెలియజేశారు. (చూ.165.)

19. అన్నమయ్య కూడా ఆయా సందర్భాల్లో తనను తాను తప్పు పట్టుకున్నారు. స్వామిని తన పొరపాట్లు దిద్దమని వేడుకున్నారు. ఆయన సంకీర్తనాచార్యుడు గనుక ఆ అనుభవాలన్నింటినీ సంకీర్తనామయం చేశారు. (చూ.198.)

20. అద్దంలో మన ప్రతిబింబం మనకు సహజంగానే కనిపిస్తుంది. అలానే తోస్తుంది. అన్నమయ్య భగవంతుణ్ణి అద్దంలా భావించి, తనలోనే చూసుకున్నారు. అంచేతనే ఆయనలోనుంచి ఉత్తమ సాహిత్యకారుడు బయటకి వచ్చారు. (చూ.208.)

21. మొదట్లో వీరావేశాన్ని చూపిన అన్నమయ్య రానురాను తన భక్త్యావేశాన్ని, శాంతికాముకత్వాన్ని ప్రదర్శించారు. (చూ.218.)

22. ప్రతి జీవుడిలో ఆత్మ ఉంటుంది. అది పరమాత్మకు ప్రతిరూపం. మనిషిలోని తప్పొప్పులను విశ్లేషిస్తుంది. కానీ మనిషిలోని అహం అనే చీకటి దాని వెలుగును కమ్ముతుంది. అంచేత దాని ప్రతిపాదనలను, గద్దింపులను మనిషి గమనించలేడు. (చూ.218.)

23. సంకీర్తనలు సంగీతాత్మకంగా ఉంటూ, కావల్సినంత విషయజ్ఞానాన్ని అందిస్తున్నాయి. కనుక తెలుగు సాహిత్యంలోనేగాక ప్రపంచ సాహిత్యంలో అన్నమయ్యకు ఆయన సంకీర్తనల్లోని సంభాషణలు విలక్షణమైన స్థానాన్ని తెచ్చిపెట్టాయి. (చూ.229-239.)

**నాలుగవ అధ్యాయం: అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలలో స్వర, లయ, అలంకార పోషణ**

24. కీర్తన కృతికి పునాది. పూర్వం సంకీర్తన, కృతులను ఒకే విధంగా పండితులు సంభావించారు. అందుకే "కృతులై వేంకటశైల వల్లభ రతి క్రీడా రహస్యంబులై" అన్నారు తిరుమలాచార్యులు. (చూ.241.)

25. కీర్తన నడక అవసరాన్నిబట్టి చిన్నగా, వేగంగా ఉంటూ, సామాన్య రాగాల్లో కంపోస్ చేస్తారు. అదే ఇప్పుడు కీర్తనలు నిలబడడానికి ఆధారమైంది. (చూ.241-242.)

26. ఆంగ్లేయులు గానాన్ని గురించి "The Rhythm of life" ప్రాణంలో లయ నిక్షిప్తమై ఉందని వర్ణించారు. లయ లేని ప్రాణం వ్యర్థమని పై మాటల సారాంశం. (చూ.242.)

27. నాదం లేకుండా సంగీతాన్ని పాడడం అంటే ప్రాణం లేకుండా దేహాన్ని బ్రతికించుకోవడమే. సంగీతానికి మొట్టమొదటిగా ఆధారమైనది నాదం. (చూ.244.)

28 'గాం' అంటే వాక్కు. వాక్కుని ధరించింది కాబట్టి గాంధర్వం అన్నారు. ఈ గాంధర్వం స్వరం, తాళం, పదం, సాహిత్యాలని ఆశ్రయించి ఉంటుంది. (చూ.245.)

29. సంగీత శాస్త్రంలో శ్రుతి అంటే గాయకులు, వాయిద్య కళాకారులు ఎంచుకొనే స్థాయిగా అర్థం చెప్పవచ్చు. (చూ.247.)

30. పాశ్చాత్య సంగీతంలో 12వ శ్రుతివద్ద సంగీతం ఉచ్ఛ స్థితికి (అష్టమ స్వరానికి) చేరుకోగా భారతీయ సంగీతం 22 శృతులతో తారా స్థాయికి చేరుకుంటుంది. ప్రస్తుతం కర్ణాటక సంగీతంలో ద్వాదశ స్వర స్థానాల ప్రక్రియ అమలవుతోంది. షోడశ స్వర స్థానాలకూ కర్ణాటక సంగీతంలో ప్రాముఖ్యత ఉన్నది. (చూ.248.)

31 రిషభం, గాంధారం, మధ్యమం, దైవతం, నిషాదం ఈ అయిదు స్వరాలకు రెండేసి స్వర స్థాన భేదాలున్నాయి. కాబట్టి ఆ స్వరాలకు వికృతి స్వరాలని పేరు. షడ్జమ పంచమాలకు ఆ విధమైన వికృతి భేదం లేదు. కాబట్టి అవి ప్రకృతి స్వరాలు, కృతి స్వరాలు అని పిలువబడుతున్నాయి. (చూ.248.)

32. రాగం అంటే పాటకు నాయకుడనుకుంటే తాళం అంటే పాటను నడిపించే రథసారథి. కాబట్టి తాళం అంటే పాటకు నడక అని అర్థం చెప్పుకోవచ్చు. అందుకే శ్రుతి లయలు పాటకు తల్లిదండ్రులని సంగీతజ్ఞులు భావిస్తున్నారు. (చూ.265.)

33. ఛందస్సులో ఎలాగైతే గురు లఘువులు, ప్లుతాల ఆధారంగా అక్షరాలను లెక్కిస్తామో అదే విధంగా సంగీతంలో రాగాక్షరాలను హ్రస్వ దీర్ఘ కాలాలనుబట్టి తాళగతంగా లెక్కిస్తాం. (చూ.266.)

34. కర్ణాటక సంగీతంలో తాళాలు 7, 35, 108 రకాలుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం 35 తాళాల్లో పాడడం సాధారణంగా జరుగుతోంది. (చూ.269.)

35. సప్త వర్ణాలు ఎప్పటికప్పుడు తమ ఉనికిని మార్చుకుంటూ, కొన్ని సమయాల్లో ఆయా రంగులుగా మారుతున్నట్లే తాళాలు కూడా భావాన్నిబట్టి తమ ఉనికిని ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ఉంటాయి. (చూ.269.)

36. సంగీతశాస్త్రాన్నీ ధాతు మాతు ప్రక్రియగా, ధాతు మాతు లక్షణ సమన్వితంగా పండితులు వ్యవహరిస్తున్నారు. (చూ.271.)

**అయిదవ అధ్యాయం: అన్నమయ్య సంకీర్తనల్లో వాక్య విన్యాసం**

37. ఒక సంకీర్తనలో వాక్యం సంపూర్తి చెందేందుకు క్రియలు అటూ, ఇటూ మారతాయి. (చూ.309.)

38. అన్నమయ్య సంకీర్తనల్లో ముందు ఉన్న వాక్యాన్ని ఆధారం చేసుకొని తరువాత వాక్యం ప్రవర్తిల్లడం జరిగింది. కొన్ని సందర్భాల్లో వాక్యాలను విభజించలేనంత కష్టంగా నిబంధించారు. (చూ.312.)

39. ఆధునిక తెలుగులో హేత్వర్థంలో 'పట్టి', 'బట్టి' క్రియలను ఉపయోగించి అన్నంత వాక్యాలను ఉపయోగిస్తున్నాం. 'నా?, వల్ల, కాన, గనుక' లాంటి ప్రత్యయాలు ఈ రూపాలను ప్రతిబింబిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రత్యయం అంతర్గతంగా ఉన్నప్పటికీ ఆ వాక్యాలకు బాధ కలగకుండటం వీటి ప్రత్యేకత. "అవిమేలివి మేలననేల" (చూ.318.)

40. అప్యర్థక వాక్యాల్లో 'ఇనా' ప్రత్యయంతోబాటు 'కల్లా' ప్రత్యయాన్ని అక్కడక్కడా ఉపయోగించారు. "నేరని నాజన్మముతో నేరుపేమి గల్లా నన్ను ధారుణిఁ బుట్టించిన విధాత నడుగవయ్యా" (చూ.320.)

41. విషయాపేక్షక ప్రశ్నలు కలిగిన వాక్యాల్లో ఎవరున్నారు? అనే ప్రశ్నకు వేరీ? 'ఏరి' కి వకారం చేరి ఏర్పడిన రూపం కనిపిస్తుంది. ఎక్కడకు బదులు ఏడ?, ఎందుకు బదులు ఏల? రూపాలు కనిపిస్తున్నాయి. "కడలేని భవసాగరము సొచ్చిన తన్ను వెడలించు వారలు వేరీ?" (చూ.323.)

42. తెలుగులో అన్నంత క్రియలకు 'ఎవడు' చేరి కర్మణ్యర్థాలుగా ప్రవర్తిస్తాయి. రాజకీయ నాయకుల ప్రసంగాల్లో తరచూ కర్మణ్యార్థ ప్రయోగాలను ఉపయోగించడం సర్వసాధారణం. సామాన్య ప్రజల సంభాషణల్లో కర్మణ్యర్థాలు నొక్కి, వేలెత్తిచూపే సందర్భంలో వాడబడుతున్నాయి."పాపకర్మములు జంపగ శక్తిలేదుగన కోపబుద్ధులచేత కొరమాలవలసె" (చూ.336.)

★★★★★

# 7. ఉపయుక్త గ్రంథసూచి


1. అనంతకృష్ణ శర్మ, రాళ్ళపల్లి. 2017. *రాళ్ళపల్లి సాహిత్య, సంగీత వ్యాసాలు*. హైదరాబాదు: ఎమెస్కో బుక్ హౌస్.
2. అనంతరామశాస్త్రి, నేతి. 2001. *ఆధునిక తెలుగు భాషా శాస్త్ర విజ్ఞానం*. హైదరాబాదు: ఒరియంట్ లాజ్మన్ లిమిటెడ్.
3. అన్నమయ్య, తాళ్ళపాక. 1998. *అధ్యాత్మ సంకీర్తనలు*. (సంపుటం 1&2) తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణలు.
4. అబితుకుచలాంబ, వారణాసి. 2006. *తెలుగు వాగ్గేయకారుల కీర్తనలు*. విజయవాడ: ముద్రా బుక్స్.
5. ఆనందమూర్తి, వేటూరి. 1974. *తాళ్ళపాక కవుల కృతులు – వివిధ సాహితీ ప్రక్రియలు*. హైదరాబాదు: మురళీ పవర్ ప్రెస్.
6. ఆనందమూర్తి, వేటూరి. 1976. *తాళ్ళపాక కవుల పదకవితలు – భాషా ప్రయోగ విశేషాలు*. హైదరాబాదు: శ్రీ భారతీ ఎంటర్ ప్రైజెస్.
7. ఆనందమూర్తి, వేటూరి. 1986. *వైష్ణవాంధ్ర వాఙ్మయము*. హైదరాబాదు: (ఉస్మానియా విశ్వవిద్యాలయానికి పిహెచ్. డి. పట్టంకోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథం.)
8. ఉషారాణి, గుమ్మనూరు. 2007. *అన్నమయ్య సంకీర్తనల్లో స్త్రీ*. తిరుపతి: ( ఎంఫిల్ పట్టంకోసంశ్రీ వేంకటేశ్వరా విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసం)
9. కుసుమారెడ్డి, కె. 2007. *అన్నమాచార్యులు, భారతీయ వాగ్గేయకారులు – తులనాత్మక పరిశీలన*. హైదరాబాదు. శ్రీ ఉదయా ప్రింటర్స్.
10. కృష్ణమూర్తి, ఇరివెంటి. 1987. *కవిసమయములు*. హైదరాబాదు: చార్మినార్ ఆర్ట్ ప్రింటర్స్.
11. కృష్ణమూర్తి, భద్రిరాజు. 2010. *తెలుగు భాషా చరిత్ర*. హైదరాబాదు: శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంవారి ప్రచురణలు.
12. కృష్ణమూర్తి, భద్రిరాజు. 2014. *భాష, సమాజం, సంస్కృతి*. హైదరాబాదు: నీల్ కమల్ పబ్లికేషన్స్.
13. కృష్ణమూర్తి, సాళ్వ. 2007. *గీతగోవిందం*. కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం.

14. కృష్ణవేణి, వి. 2014. *అన్నమయ్య సంకీర్తనలు – తెలుగు సాహిత్య వైభవం.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములవారి ప్రచురణలు.
15. కోదండరామయ్య, తల్లావజ్ఝల. 2013. *ఆంధ్ర పదకర్తలు.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములవారి ప్రచురణలు.
16. గంగప్ప, ఎస్. 1994. *పదసాహిత్య పరిమళం.* గుంటూరు: శశి ప్రచురణలు.
17. గోపాలకృష్ణ, అబ్బూరి. 2013. *శ్రీ అన్నమాచార్యులు యక్షగాన సంప్రదాయం.* హైదరాబాదు: గాయత్రీ గ్రాఫిక్ పాయింట్.
18. చంద్రశేఖరరెడ్డి, మండ్యం. 2010. *అన్నమయ్య భాషా పరిశీలన.* తిరుపతి: అజయ్ సుస్మితా ప్రచురణలు.
19. చినతిరుమలయ్య, తాళ్ళపాక. 2016. *సంకీర్తనా లక్షణ సారం.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణలు.
20. జయప్రకాష్, ఎస్. 2003. *పరిశోధన విధానం.* హైదరాబాదు: శ్రీ కళాంజలీ గ్రాఫిక్స్ హైదరాబాదు.
21. నరసింహారెడ్డి, పాపిరెడ్డి. 2012. *అన్నమయ్య సంకీర్తనల్లో ఉపమ.* హైదరాబాదు: తెలుగు అకాడమీ ప్రచురణ.
22. నాగభూషణం, నోరి. 2006. *సంగీత సంప్రదాయ ప్రదర్శిని.* (1 నుండి నాలుగు సంపుటాలు) హైదరాబాదు. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంవారి ప్రచురణలు.
23. నాగేశ్వరనాయుడు, గుంటి. 2004. *అన్నమాచార్య సంకీర్తనా స్వర మాధురి.* తిరుపతి: (తిరుమల తిరుపతి దేవస్థానములవారి ప్రచురణలు)
24. నారాయణాచార్యులు, పుట్టపర్తి. 1975. *వాగ్గేయకారులు పదకృతి సాహిత్యం.* హైదరాబాదు: నాట్యకళాపరిషత్తు.
25. నృసింహ, సంకుసాల. 1916. *కవికర్ణ రసాయనము.* చెన్నపురి: వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్.
26. పళని, వి. 2017. *అన్నమయ్య అమృత ధారలు.* కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయంవారి ప్రచురణలు.

27. పవన్ కుమార్, పమ్మి. 2003. *కట్టా వరదరాజు ద్విపద రామాయణం – భాషా పరిశీలన.* హైదరాబాదు: (పిహెచ్. డి. పట్టంకోసం హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం)

28. పార్థసారథి, ఎన్. సి., ద్వారకా పార్థసారథి, ఎన్. సి. 2014. గానకళా బోధిని. చెన్నై: బాలసరస్వతీ బుక్ డిపో.

29 పినాకపాణి, శ్రీపాద. 1995. *సంగీత సౌరభము.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములవారి ప్రచురణలు.

30. పినాకపాణి, శ్రీపాద. 2014. *మనోధర్మ సంగీతం.* హైదరాబాదు: శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంవారి ప్రచురణలు.

31. పురుషోత్తం, బొడ్డుపల్లి. 1982. *భాషా శాస్త్ర పరిచయం.* నరసరావుపేట: నాగలక్ష్మి గ్రంథాలయం.

32. ప్రభాకరశాస్త్రి, వేటూరి. 2008. *అన్నమయ్య చరిత్ర పీఠిక.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణలు.

33. ప్రసాద్, పి. ఎల్. ఎన్. 2007. *తాళ్ళపాక అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో రసవృత్తి, వాక్యలయ.* హైదరాబాదు: (ఎంఫిల్ పట్టంకోసం కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసం.)

34. ఫిలిప్ బ్రౌన్, ఛార్లెస్. 2012. *బ్రౌణ్య – తెలుగు – ఇంగ్లీష్ నిఘంటువు.* విజయవాడ: శ్రీ వేంకటేశ్వర బుక్ డిపో.

35. భద్రకాళీ, మల్లంపల్లి. 2004. *సంస్కృత సాహిత్యంలోని సంకీర్తనలు, శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల సంస్కృత పరిశీలన.* తిరుపతి: శ్రీహరి పబ్లికేషన్స్.

36. భావనారాయణరావు, ద్వారం. 2004. *సంగీత సమయసారము.* కొవ్వూరు: శ్రీ లక్ష్మీగణపతి బైండింగ్ వర్క్స్.

37. రంగనాథాచార్యులు, కె. కె. 1982. ఆధునిక *తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు.* హైదరాబాదు: పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్.

38. రంగాచార్యులు, చలమచర్ల. 1944. *అలంకార వసంతము.* హైదరాబాదు: ప్రేమసాగర ముద్రణాలయం.

39. రవిచంద్రబాబు, శాఖమూరి. 1992. *అన్నమయ్య సంకీర్తనలు: బాలసాహిత్యం.* తిరుపతి: (శ్రీ వేంకటేశ్వరా విశ్వవిద్యాలయానికి పిహెచ్. డి. పట్టంకోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథం)
40. రామకృష్ణారావు, అడపా. 2014. *అన్నమాచార్యులు.* హైదరాబాదు: నవోదయా బుక్ హౌస్.
41. రామకృష్ణారావు, వంతారాం. 2005. *బాలవ్యాకరణ ఘంటాపథం.* హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
42. రామచంద్ర, కె. 1956. *త్యాగరాజ కీర్తనా హారము.* చెన్నపురి: వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్.
43. రామలింగారెడ్డి, కట్టమంచి. 1973. *కవిత్వ తత్త్వ విచారము.* విశాకపట్టణం: ఆంధ్ర విశ్వకళా పరిషత్తు.
44. రామారావు, చేకూరి. 2018. *తెలుగు వాక్యం.* హైదరాబాదు. నిర్మలా గ్రాఫిక్స్.
45. రావు, కె. వి. 2014. *సంగీత ప్రపంచం.* హైదరాబాదు: శ్రీ ఉదయా ప్రింటర్స్.
46. రెడ్డి, జి. ఎన్. 1990. *తెలుగు పర్యాయపద నిఘంటువు.* హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
47. లక్ష్మణయ్య, సముద్రాల. 2008. *అన్నమయ్య సంకీర్తనామృతము* (ప్రథమ, ద్వితీయ భాగాలు) తిరుపతి:తిరుమల తిరుపతి దేవస్థానములవారి ప్రచురణలు.
48. లక్ష్మీకాంతం, పింగళి. 2015. *సాహిత్య శిల్ప సమీక్ష.* హైదరాబాదు: నవచేతనా పబ్లిషింగ్ హౌస్.
49. లత, ఎన్. సి. 2000. *అన్నమాచార్య సంకీర్తనలు: ఆలయ స్ఫూర్తి.*హైదరాబాదు: యాదూ గ్రాఫిక్స్.
50. లలితా, అన్నప్పారావు. 2017. *సంగీత శాస్త్ర మంజరి.* హైదరాబాదు: శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంవారి ప్రచురణములు.
51. లీలావతమ్మ, పొన్నా. 1984. *అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో స్త్రీ ధర్మాలు.* తిరుపతి: పొన్నా పబ్లికేషన్స్.

52. లీలావతమ్మ, పొన్నా. 1986. *అన్నమయ్య సంకీర్తనల్లోని జానపదగేయ ఫణితులు.* తిరుపతి: (శ్రీ వేంకటేశ్వరా విశ్వవిద్యాలయానికి పిహెచ్. డి. పట్టంకోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథం)
53. లీలావతమ్మ, పొన్నా. 1993. *పదకవితా వైజయంతి.* తిరుపతి: పొన్నా పబ్లికేషన్స్.
54. వరాహ నరసింహాచార్యులు, వింజమూరి. 1984. *సంగీతము, తాళలక్షణము.* కాకినాడ: కాకినాడ ముద్రణా శాల.
55. విద్యావతి, ఎ. 1979. *తాళ్ళపాక కవుల సాహిత్య సేవ.* మచిలీపట్నం: విజయా ప్రెస్.
56. వేంకటేశ్వరరావు, పొత్తూరి. 2010. *పారిమార్థిక పదకోశం.* హైదరాబాదు: ఎమెస్కో పబ్లికేషన్,.
57. వేంకటేశ్వర్లు, బూసురపల్లి. 2016. *ప్రముఖ వాగ్గేయకారులు.* గుంటూరు: అమరావతీ పబ్లికేషన్స్.
58. శంకరనారాయణ, పి. 2010. *శంకరనారాయణ ఇంగ్లీష్ – ఇంగ్లీష్ – తెలుగు నిఘంటువు.* విజయవాడ: శ్రీ వేంకటేశ్వర బుక్ డిపో.
59. శాంత, కోవెల. 2000. *సంగీత సిద్ధాంత సోపానములు.* హైదరాబాదు: సాయిరామ్ ప్రాసెస్.
60. శారదా పూర్ణ, శొంఠి. 1998. *తాళ్ళపాక అన్నమాచార్యుని సంగీత నృత్య కళాభిజ్ఞత.* హైదరాబాదు: కళాజ్యోతి ప్రెసెస్ లిమిటెడ్.
61. శేషాద్రి, కోమాండూరి. 2006. *తెలుగు వాగ్గేయకారులు - అన్నమయ్య విలక్షణ వ్యక్తిత్వం.* విజయవాడ: ముద్రాబుక్స్.
62. శోభాదేవి, ఆర్. 2011. *అన్నమయ్య జీవితం, సాహిత్య ప్రస్థానం.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణలు.
63. శోభాదేవి, ఆర్. 2011. *అన్నమయ్య భక్తి సామ్రాజ్యం.* హైదరాబాదు: వాసవీ గ్రాఫిక్స్.
64. శోభాదేవి, ఆర్. 2012. *అన్నమయ్య సంకీర్తనా సౌరభం.* తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణలు.
65. శ్యామల కామశాస్త్రి, కొట్రా. 1956. *ఆంధ్ర వాచస్పత్యము.* కాకినాడ: కొట్రా శ్యామల కామశాస్త్రి అండ్ సన్స్.

66. శ్రీరంగాచారి, అంగలూరి. 1995. *శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుని శృంగార సంకీర్తనలు – మధురభక్తి*. హైదరాబాదు. శ్రీ రాజేశ్వరి ప్రింటర్స్ అండ్ స్టేషనరీ కాచీగూడ.
67. శ్రీరంగాచార్య, మరింగంటి. 1985. *అలంకార మకరందం*. హైదరాబాదు: మాష్టర్ ఆర్ట్ ప్రింటర్స్.
68. శ్రీరంగాచార్యులు, నేరెళ్ళ. 1992. *శ్రీ సంకీర్తన సుధార్ణవము*. గుంటూరు: సరస్వతీ ప్రింటింగ్ ప్రెస్.
69. శ్రీరామచంద్రుడు, పుల్లెల. 1999. *అలంకార శాస్త్రం – ఆధునిక సాహిత్యం*. హైదరాబాదు: సంస్కృత భాషా ప్రచార సమితి వారి ప్రచురణలు.
70. శ్రీరామమూర్తి, గంధం. 2009. *సంగీత రత్నాకరము*. హైదరాబాదు: శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంవారి ప్రచురణలు.
71. శ్రీహరి, మల్లెల. 1983. *తాళ్ళపాక అన్నమయ్య బాలకృష్ణ సంకీర్తనలు – ఒక పరిశీలన*. తిరుపతి: (ఎంఫిల్ పట్టంకోసం సమర్పించిన సిద్ధాంత వ్యాసం)
72. శ్రీహరి, రవ్వా. 2004. *సంకేత పదకోశం*. హైదరాబాదు: పతంజలి పబ్లికేషన్స్.
73. శ్రీహరి, రవ్వా. 2006. *అన్నమయ్య భాషా వైభవం*. హైదరాబాదు: వరరుచీ పబ్లికేషన్స్.
74. శ్రీహరి, రవ్వా. 2014. *అన్నమయ్య అచ్చతెలుగు*. హైదరాబాదు: వరరుచీ పబ్లికేషన్స్.
75. శ్రీహరి, రవ్వా. 2014. *అన్నమయ్య నవ్వులు*. హైదరాబాదు: వరరుచీ పబ్లికేషన్స్.
76. శ్రీహరి, రవ్వా. 2014. *అన్నమయ్య సుభాషితాలు*. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములవారి ప్రచురణలు.
77. శ్రీహరి, రవ్వా. 2014. *అన్నమయ్య సూక్తి వైభవం*. హైదరాబాదు: వరరుచీ పబ్లికేషన్స్.
78. శ్రీహరి, రవ్వా. 2014. *అన్నమయ్య పదకోశం*. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములవారి ప్రచురణలు.
79. సంగమేశం, ముట్నూరి. 1981. *అన్నమయ్య సాహితీ కౌముది*. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణలు.

80. సంగమేశం, ముట్నూరి. 1983. *అన్నమయ్య*. హైదరాబాదు: యువభారతి పబ్లికేషన్స్.

81. *సంభాషణా వికిపీడియా*

82. సదాశివశంకరశాస్త్రి, భాగవతుల. 2018. *సమగ్రాంధ్ర సాహిత్యం*. హైదరాబాదు: తెలుగు అకాడమీ ప్రచురణలు.

83. సరస్వతి, గోటేటి. 2003. *వాగ్గేయకారుల ఉపనిషద్వాణి*. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణలు.

84. సాంబశివరావు, గుమ్మా. 1990. *అన్నమాచార్య సంకీర్తనలలోని వర్ణనలు*. గుంటూరు: (నాగార్జునా విశ్వవిద్యాలయానికి పిహెచ్. డి. పట్టంకోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథం.)

85. సీతా మహాలక్ష్మి, ఎల్. వి. ఎస్. ఎస్. 1993. *అన్నమయ్య సంకీర్తనల్లో సంవాద గేయాలు – ఒక పరిశీలన*. హైదరాబాదు: (శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి ఎం. ఫిల్. కోసం సమర్పించిన పరిశోధన గ్రంథం.)

86. సీతారామాచార్యులు, బహుజనపల్లి. 2011. *ప్రౌఢ వ్యాకరణ ఘంటాపథము*. హైదరాబాదు: విశాలాంధ్రా పబ్లిషింగ్ హౌస్.

87. సీతారామాచార్యులు, బహుజనపల్లి. 2012. *శబ్దరత్నాకరం*. విజయవాడ: శ్రీ వేంకటేశ్వర బుక్ డిపో.

88. సుందరం, ఆర్. వి. ఎస్. 2009. *పరిశోధనా పద్ధతులు*. కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయంవారి ప్రచురణలు.

89. సుగుణ, ఎన్. 1986. *అన్నమాచార్య సంకీర్తనలు – స్త్రీ సంబంధి పాటలు*. హైదరాబాదు: (ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఎంఫిల్ పట్టంకోసం సమర్పించిన సిద్ధాంత వ్యాసం.)

90. సుబ్బారావు, టి. వి. 1952. *రాగ తాళ చింతామణి*. మద్రాసు: గవర్నమెంట్ ఓరియంటల్ మనూ స్క్రిప్ట్.

91. సుబ్రహ్మణ్యం, పి. ఎస్. 1997. *ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు*. హైదరాబాదు: శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంవారి ప్రచురణలు.

92. సుభాషిణి, ఎర్రదొడ్డి. 2011. *అన్నమాచార్య సంకీర్తనలు వ్యాజస్తుతి, వ్యాజనింద అలంకార పరిచయం*. హైదరాబాదు: శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంవారి ప్రచురణలు.

93. సూర్యకుమారి, అడివి. 2001. *అన్నమయ్య – జయదేవుల మధురభక్తి తులనాత్మక అధ్యయనం*. హైదరాబాదు: (శ్రీ పొట్టి శ్రీరాముల విశ్వవిద్యాలయానికి పిహెచ్. డి. పట్టంకోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథం.)

94. సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం. 2013. *కావ్యాలంకార సంగ్రహం*. హైదరాబాదు: ఎమెస్కో బుక్ హౌస్.

95. సూర్యమోహన్, పరకాల. 1997. *జర్నలిస్టుల పదకోశం*. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

★★★★★